
సత్యజీవనము



అఖిల

అఖిల భారత పత్రిక

జనవరి 2001



నీ జీవితం సుఖంగా, సార్థకంగా ఉండాలంటే చిత్త శుద్ధి, వినమ్రత, గట్టి పట్టుదల, యోగంలో ముందుకు పోవాలనే తపన చాలా ముఖ్యమైన విషయాలు. అన్నింటికీమించి, పురోగతికి పరిమితులు లేవనే గట్టి విశ్వాసం తప్పనిసరి. పురోగతే యౌవనం. నూరేళ్ళు వయస్సు వచ్చినా కూడా యౌవనంగా జీవించవచ్చు!

*

నీకన్నా మహోన్నతమైన, సువిశాలమైన దాని కోసం నీ జీవితాన్ని అంకితం చేసుకుంటే, గడిచిపోతున్న సంవత్సరాలు భారం అనిపించవు.

*

నీ లక్ష్య సాధనలో శరీరం విఫలం కాకూడదని నీవు అభిలషిస్తే, అనవసరమైన ఆవేదనతో నీ శక్తిని వృథా చేసుకోకూడదు. నీవు ఏ పని చేసినా సరే, దానిని ప్రశాంతమైన సుస్థిరమైన చిత్తంతో చెయ్యి. శాంతి, నైశ్చల్యములలోనే మహత్తర శక్తి ఉంది!

శ్రీమాత



మనిషి ఏ క్షణంలో అడుగు ముందుకు వేయకుండా ఆగిపోతాడో అప్పుడు పతనమవుతాడు. ఏ క్షణంలో సంతృప్తి చెంది, ఆకాంక్షించడం మానుకుంటాడో, అప్పుడే మరణించడం మొదలుపెడతాడు! జీవితమంటే ఊరికే కాలక్షేపం చెయ్యటం కాదు. జీవితమంటే కదలిక, ప్రయత్నం, పురోగమనం, పర్వతాన్ని అధిరోహించడం, వినూత్న దర్శనాలవైపు ఆరోహణ, భవిష్యత్ సిద్ధుల వైపు ప్రస్థానం. విశ్రాంతి కావాలనే నెపంతో నిర్వ్యాపారంగా కూర్చొని ఉండటం చాలా ప్రమాదం! కర్మాచరణలోనే, ప్రయత్నంలోనే, ముందుకు పురోగమించడంలోనే నీకు విశ్రాంతి లభిస్తుంది. భగవంతుని కృపాకటాక్షాలలో సంపూర్ణ విశ్వాసం ఉంచడం లోనే నిజమైన విశ్రాంతి పొందాలి. కోరికలు లేకపోవడంలోనే విశ్రాంతి పొందాలి. అహంకారంపై విజయం పొందడంలోనే విశ్రాంతి పొందాలి.

చైతన్యం విస్తరించడంలోనే, చైతన్యం విశ్వీకరణంలోనే నిజమైన విశ్రాంతి లభిస్తుంది. ఈ ప్రపంచమంత విశాలంగా నువ్వు ఎదుగుతే, నీకు నిరంతరం విశ్రాంతి లభిస్తుంది. ఎంతటి కఠినమైన కర్మాచరణలోనైనా సరే, యుద్ధరంగం నడిబొడ్డులోనైనా సరే నీవు చేసే ప్రగాఢ ప్రయత్నంలోనే శాశ్వతత్వపు, అనంతత్వపు స్థిరత్వాన్ని నీవు పొందగలవు.

శ్రీమాత

రెండు భావాలు ... బహుళవ్యాప్తిని చెందాయి, ముఖ్యంగా పాశ్చాత్య ప్రపంచంలో. ఒకటి – జీవిత ప్రధాన లక్ష్యం సుఖము. రెండవది – ప్రతి మనిషీ కొన్ని ప్రత్యేక లక్షణాలతో జన్మిస్తాడు. దానిని మార్చడం అసంభవం.

మొదటి భావం ఒక ప్రగాఢమైన సత్యం యొక్క వికృతరూపం. సృష్టి యావత్తూ సచ్చిదానందంపై ఆధారపడి ఉంటుంది. ఈ ఆనందమే లేకపోతే జీవితమే లేదు. ఈ ఆనందం దైవత్వపు లక్షణం. దాని తత్త్వం. అందువల్ల పరిస్థితులపై ఆధారపడదు. మామూలుగా ఈ ఆనందాన్ని బాహ్యపరిస్థితులపై ఆధారపడే లౌకిక సుఖాలతో పోల్చకూడదు! ఆనందంగా బ్రతకడానికి అందరికీ హక్కు ఉంది అన్న వాదన ఎవరి జీవితం వారే జీవించాలన్న న్యాయానికి దారి తీస్తుంది. ఈ మనోవైఖరి అస్పష్టమైన, దుందుడుకు అహంకారంతో కలిసి, అన్ని రకాల సంఘర్షణలు, ఆవేదనలు, నైరాశ్యం, అధైర్యం వైపు, తరుచుగా మహోపద్రవానికికూడా దారి తీస్తుంది....


ఇక రెండవ భావం – అవచేతనపై దాదాపు సంపూర్ణ ఆధిపత్యం సాధిస్తేనే గాని, అచేతన నుండి వచ్చిన పోకడల పట్ల కఠినమైన క్రమశిక్షణ, సంయమనం ఉంటేనే గాని, మానవ లక్షణంలో మౌలికమైన మార్పు రాదన్న సిద్ధాంతం ద్వారా ఏర్పడుతుంది. మామూలు మానవ స్వభావాలలో ఈ అచేతన, సంస్కారాల ద్వారా (atavism) ఒక వ్యక్తి జన్మించిన పరిసరాల ద్వారా అభివ్యక్తమవుతుంది.... అయినప్పటికి ఈ మార్పును (fundamental change of character) సిద్ధింపచేసుకోవడం సాధ్యమే. విస్పష్ట దృక్పథం గల క్రమశిక్షణ, సంయమనం ద్వారా, పట్టుదల ద్వారా మానవ లక్షణాల పరివర్తనను నిజానికి సాధించడం జరిగింది. ఎప్పటికప్పుడు జరిగే వైఫల్యాలు కూడా నిరాశపరచలేని మొండి పట్టుదల చాలా అవసరం.

పరివర్తన చెందించ వలసిన మానవ తత్త్వం పట్ల సర్వ సమగ్రమైన, విశ్లేషణాత్మకమైన పరిశీలన అనివార్యమైన ప్రారంభదశ.

శ్రీమాత

క్షుద్రత్వాన్ని, సంకుచితత్వాన్ని, అల్పత్వాన్ని నీలోంచి బహిష్కరించు. అతివిశాలమైన దిఙ్మండలాలకన్నా వైభవంగా, అత్యున్నత హిమశిఖరంకన్నా ఠీవిగా ఫరిఢవిల్లు. అత్యంత ప్రగాఢమైన మహాసాగరాలకన్నా గంభీరంగా జీవించు.

శ్రీఅరవిందులు



నీకు నా ప్రేమ, కరుణ, ఆశీస్సులు.

కాని అవి నీకు అనుభూతిలోకి రావాలంటే, నీవు సంయమనంతో ఉండాలి. శ్రద్ధ, ఏకాగ్రత ఉండి తీరాలి. అన్నింటినీ మించి నీ కోరికలకు, సరదాలకు స్వస్తి చెప్పాలి. అవి చెప్పినట్లు వినకూడదు.

మనిషికి జీవితంలో కోరికల పుట్టతో క్రమశిక్షణ లేని నిరర్థకమైన జీవితం కావాలో లేక ఆకాంక్ష జ్వాలలో అధిరోహిస్తూ, నిమ్న ప్రకృతిపై ఆధిపత్యం వహించే క్రాంతిజీవితం కావాలో – ఈ రెండింటిలో ఒక దానిని నిర్ణయించుకుని తీరాలి.


*

సుఖం కోసం జీవించ వద్దు. భగవంతునికి సేవ చేయడానికే జీవించు. అప్పుడు నీకు లభించే ఆనందం నీవు ఊహించినదాని కన్నా వెయ్యిరెట్లు ఎక్కువగా ఉంటుంది

*


భగవత్ కారుణ్యము, మానుషీ చాపల్యము – ఈ రెండింటి మధ్య తీసుకోవలసిన నిర్ణయం నీ జీవితంలో ప్రతిక్షణం ఎదురవుతూనే ఉంటుంది.

శ్రీమాత



అత్యున్నతమైన నిగూఢ రహస్యాన్ని అభివ్యక్తం చేస్తూ భగవద్గీతలోని ఆఖరి మహోత్కృష్ట ప్రవచనం రెండు సంక్షిప్త, ప్రత్యక్ష తేలిక శ్లోకాలలో చెప్పబడింది. ఎటువంటి తదుపరి వ్యాఖ్యానం లేకుండా, విపులీకరణం లేకుండా మనస్సులోకి అవి చొచ్చుకొనిపోయి, ఆత్మ అనుభవక్రమంలో వాటి అర్థం, పరమార్థాల పూర్ణత్వాన్ని అవే సమావిష్కృతం చేసేటట్లు వాటిని వదిలి వేయడం జరిగింది.... ఇదిగో రహస్యాలలో కెల్ల ఉత్తమ రహస్యం, ఈశ్వరుని మహోన్నతమైన అత్యంత ప్రత్యక్ష సందేశం.... ఇదిగో – "నా యందు మనస్సుగల వాడవు కమ్ము. నా ప్రేమికునిగా, నా ఆరాధకునిగా ఉండు. సర్వస్వం నా కోసం త్యాగం చెయ్యి. నాకు శిరస్సు వంచి మ్రొక్కు.... నీవు నా వద్దకు వస్తావు. ఇది నా ప్రతిజ్ఞ, నీకు నా వాగ్దానం. ఎందుకంటే నీవు నాకు ప్రియమైన వాడివి. సర్వధర్మాలను పరిత్యజించు. నన్ను మాత్రమే శరణు వేడుకో. సర్వపాపాలు, అశుభాల నుండి నిన్ను నేను విముక్తుణ్ణి చేస్తాను. విచారించకు".

శ్రీఅరవిందులు



తానెటువంటి వాడైనప్పటికీ, అతనిలో ఎంతటి అజ్ఞానం, అపోహలు, అహంకారం, నిరసనలు, తిరుగుబాటులు ఉన్నప్పటికీ, ప్రతి వ్యక్తినీ అతి దగ్గర మార్గాల ద్వారా తన దివ్య లక్ష్యం వైపు నడిపే పరాత్పరుని పరమాద్భుతమైన కరుణను ఎప్పుడూ విస్మరించరాదు. అదే మనం చూపే కృతజ్ఞత.

సర్వ అహంకారాన్ని, అస్పష్టతను ద్రవీభూతం చేసే విధంగా మన హృదయాలలో నిత్యం పవిత్ర కృతజ్ఞతా జ్వాల నును వెచ్చగా, తీయగా, జాజ్వలమానంగా ప్రజ్వరిల్లాలి. సాధకుణ్ణి అతని లక్ష్యం వైపు నడిపే పరాత్పరుని కారుణ్యం కోసం వెలిగే కృతజ్ఞతా జ్వాల అది. అతను మరింతగా కృతజ్ఞత చూపి, భగవంతుని కారుణ్య ప్రభావాన్ని గుర్తించి, అందుకు కృతజ్ఞతలు తెలుపుకొన్నప్పుడు, లక్ష్యానికి మార్గం మరింత చేరువ అవుతుంది.

*

కృతజ్ఞత: మూసుకున్న ద్వారాలను తెరచి మమ్మల్ని పరిరక్షించే కారుణ్యాన్ని లోలోపలికి, చొచ్చుకొని పోయేటట్లు నీవు చేయగలవు.

శ్రీమాత



నూతన సంవత్సర శుభాకాంక్షలు

నూతన సంవత్సరం వెలుగు, ఆనందం, ప్రేమ సంభరితంగా ఆయురారోగ్యాలతో, శుభప్రదంగా, ప్రయోజనాత్మకంగా సాగాలని ఆశీర్వదిస్తూ —

శ్రీమాత

*

"భగవంతుని కరుణ ఎప్పటికీ విఫలం కాదు" అనే విశ్వాసాన్ని మన హృదయాలలో నిరంతరం నిలుపుకోవాలి.

ఆశీస్సులు

శ్రీమాత

అనువాదం. కె. యజ్ఞన్న

Publishers: Sri Aurobindo Society, Pondicherry - 605001, Editor: R.L.N. Sastry
Printers Sri Aurobindo Ashram Press, Pondicherry - 605001.
Registered with the Department of Posts, No: TN/PMG(NR)-39/2000
Licensed to post at the concessional rate of postage
at Sri Aurobindo Ashram P.O. on 2nd, 3rd and 4th of every month.

సమత

సాధనకు ఆధారము

అఖిల

అఖిల భారత పత్రిక

ఫిబ్రవరి, మార్చి 2001

ఇతర వ్యాసాలు

డిప్రెషన్ అంటే ఏమిటో నాకు బాగా తెలుసు. ఎందుకంటే దానితో నేను కూడ చాలా అవస్థ పడ్డాను. డిప్రెషన్ బాధితులకి నేనిచ్చే సలహా ఇదే – హుషారుగా, సంతోషంగా ఉండండి.

హుషారుగ, సంతోషంగా ఉండి "రోమ్ నగరము ఒక్క రోజులో కట్టలేదు కదా" అనే సంగతి మరచిపోకూడదు. ఇంకా డిప్రెషన్ పోకుండ ఉంటే చీకటి మాయమైపోయి మళ్ళీ సూర్యోదయమవుతుంది గదా – ఆ పక్షుల కిలకిలరావాలలో మళ్ళీ అంతా సర్దుకుంటుంది.

నిన్ను చూస్తే వైరాగ్యాన్ని పుణికి పుచ్చుకున్నట్టున్నావు. నేనైతే వైరాగ్యాన్ని దగ్గరికి చేరనీయలేదు. అయినా కొంతవరకూ తప్పలేదు. సమత వచ్చినప్పుడు గానీ దానిని వదిలించుకోలేక పోయాను. కాని సమత అంత తేలికగా దొరకదు. వైరాగ్యము తేలికగానే వస్తుంది కానీ ఆ శోకదేవత మనకెందుకు బాబూ!

శ్రీఅరవిందులు

శ్రీఅరవిందుల రచనలు చదివే విధానం

శ్రీఅరవిందుల రచనలు* చదివేవారికి నేనిచ్చే సలహా యిది. మనస్సును సాధ్యమైనంత ప్రశాంతపరచుకొని, ఒక్కొక్కసారి కొంచెం కొంచెం మాత్రమే చదవండి. దానిని వెంటనే అర్థం చేసుకోవాలని ఆరాటపడి తలలు బ్రద్దలు చేసుకోవద్దు. మనస్సును అలజడులకు, ఆలోచనలకు దూరంగా ఉంచండి. తరువాత అటుల నిశ్శబ్దపరచిన మనస్సులోనికి ఆ రచనలలో నిక్షిప్తమైన మహత్తును తిన్నగా, నిరాటంకముగా ప్రవేశించనివ్వాలి; చొరబడి చోటు చేసుకోనివ్వాలి. అలా నిశ్శబ్దంగా ప్రశాంతంగా వున్న మనస్సులోనికి ప్రవేశించిన ఆ శక్తి నిలదొక్కుకొని తన దీప్తిని తాను వికసింపజేసి బుద్ధిని ఉజ్వలాయమానం చేయటానికి తన పని తాను చేసుకొనిపోతుంది. అంతేకాదు. అవసరమైతే, చదివిన అంశాలను అర్థం చేసుకొనడానికి అవసరమైన కొత్త జీవకణాలను కూడా మెదడులో సృష్టిస్తుంది. అందుకని కొన్ని నెలల తరువాత అదివరకు చదివిన అంశాలను మళ్ళీ చదివినట్లైతే, అందులో వెలువరించిన భావాలు మునుపటికంటే బాగా ప్రస్ఫుటమవుతాయి. ఆ భావాలతో సాన్నిహిత్యం, మచ్చిక విస్తృతమవుతుంది. కొన్ని సందర్భాలలో, ఎంతో ఆశ్చర్యకరంగా అవి ఇంతకు పూర్వమే పరిచయమున్న విషయాలుకూడా ద్యోతక మవుతవి!

ప్రతిరోజూ ఓ నిర్ణీత సమయంలో, క్రమం తప్పకుండా, కొంచెం కొంచెం చదువుట మంచిది. ఎందుకంటే నిత్యానుష్ఠానం వలన మెదడు యొక్క గ్రహణశీలత పెరుగుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: అన్నవరపు ఆదిశేషయ్య

---

* శ్రీఅరవిందుల అభిభాషణలు ఉత్తుత్తి మాటల మూటలు కావు. అవి అక్షయతూణీరాలు. నమ్మకుంటే చాలు ఆ అమ్ములు పరిశ్రమ లేకుండా ప్రశాంతమందిరానికి చేరుస్తాయి. విడువక వెన్నంటి నడవటమే మన విధి.

విభాగం I:

ఆత్మనిగ్రహము – చిన్న కథలు

గుఱ్ఱము, పులి, రెండూ అడవి జంతువులే. కాని గుఱ్ఱాన్ని మచ్చిక చేసుకొని పెంపుడు జంతువుగా ఉపయోగకరంగా మలచుకొన వచ్చును. పులిని ఎవరూ సవారీగా ఉపయోగించరు – ఎందు చేత? పులిలోని దుష్ట క్రూర, కపట లక్షణాలు మార్పు చెందవు. ఆ దుష్టమృగం వలన హానియే తప్ప మంచిని ఆశించలేము. అందుచేత దానిని నాశనము చేయవలెను.

కాని గుఱ్ఱము అలా కాదు. మొదట బెరుకుతనం చేత బెట్టుచేసి తప్పించుకొన చూచును. కాని నేర్పుతో ఓర్పుతో, మచ్చిక చేసుకొనవచ్చును. క్రమస్య చెప్పినట్లు చేయును. వినును. మనను ప్రేమించును కూడా. చివరకు కళ్ళెము వేయునపుడు తనంత తానే నోటిని చాచి యిచ్చును!

మానవులలో కూడా, ఎదురు తిరిగే పొగరు, తప్పించుకొని మొండిగా నిలబడే కోరికలు, ప్రేరణలు ఉన్నవి. కాని ఇవి క్రమేపి గుఱ్ఱము వలెనే, లొంగి పోగలవు. పులిలాగ మార్పునకు ఇచ్ఛ గించని స్వభావము మానవునిలో లేదు. కనుక వివేకియైన మాన వుడు తన దుష్టత్వమును, బెరుకుతనమును తనంత తానే మార్చు కొనవలెను. దానినే ఆత్మనిగ్రహము – సంయమనము అంటాము.

*

ఖలీఫా హుస్సేన్, ప్రవక్త మహమ్మద్ మనుమడు. అందమైన రాజభవనము, మెండుగా ధనసంపద, అధికార వైభవము గలవు. అతనిని కించపరిచిన వారు ధనవంతుని ఆగ్రహమునకు గురియై శిక్షింపబడుదురు. సందేహము లేదు.

ఒకనాడు హుస్సేన్ విందారగించు చుండగా, బానిస ఒకడు, మరుగుచున్న నీటి కడవను ప్రక్క నుండి మోసుకొని పోవుచుండెను. పొరపాటున బాన తొణికి కొంత నీరు హుస్సేన్‌పై పడినది. అతడు బాధతోను క్రోధముతోను పెద్దగా అరచెను.

బానిస మహాజ్ఞాని, వివేకి, ఖురాన్ చదివినవాడు, సమయ స్ఫూర్తి గలవాడు అగుటచే వెంటనే ఖలీఫా పాదముల చెంత మోకరిల్లి ఖురాన్ లోని సూక్తులను ఈ విధముగా చదివెను.
"కోపమును నిగ్రహించుకొన గలవారికి స్వర్గము లభించును."
ఆ సూక్తికి స్పందించిన హుస్సేన్, "నేను కోపించలేదు" అనెను.
"మరియు మానవునకు క్షమించగలవారికి కూడా" అని ఆ సూక్తిని పూర్తిగా చదువుటకు బానిస తలపెట్టెను.
"నిన్ను క్షమించితిని" అని హుస్సేన్ అనినాడు.
"ఎందుచేతనంటే కరుణించే వారిని అల్లా ప్రేమించును" అని బానిస పూర్తి చేసెను.

హుస్సేన్ ఆగ్రహము మాయమైనది. అతడు ప్రశాంతుడయ్యెను. బానిసను లేవనెత్తి వానికి కొంత ధనమిచ్చి బానిసత్వము నుండి విముక్తుని చేసెను. కోపమును నిగ్రహించుట వలన కలిగిన ప్రశాంతతను హుస్సేన్ గ్రహించెను.

అతడు గొప్ప వంశమునకు చెందినవాడు. స్వాభావికముగా వానిలో దుష్టత్వము క్రూరత్వము లేవు. తొందరపాటు తనము ఉండెను. దానిని అతడు నిగ్రహించ గలిగెను.

*

కనుక నీ తల్లిదండ్రులు కాని, ఉపాధ్యాయులుకాని నిన్ను నిగ్రహించుకొనమని హెచ్చరించిన ఎడల నీవు మొండివాడివని కాని, మూర్ఖుడవని కాని వారి ఉద్దేశ్యము కాదు. నీవు సంస్కారివి కనుక నీలో నిగ్రహించుకొనే మంచిశక్తి ఉన్నది అని. దానిని ఉద్దీపింప చేసుకోమని కోరడమే. అది ఒక సలహా మాత్రమే.

"నీకు రాజభవనము కావలెనా, పూరి గుడిసె కావలెనా?" అని అడిగిన "రాజభవనము కావలె" నని కోరెదవు కదా! అది సహజమే.

మహమ్మద్ ప్రవక్త స్వర్గమును దర్శించెను. అచ్చట ఆకాశములో వ్రేలాడుచున్నట్లుగా కన్పడు దివ్యహర్మ్యములను, ఉద్యానవనములను చూచి, మహమ్మద్ ఇట్లు ప్రశ్నించెను.

"గేబ్రియల్ మహాశయా, ఈ భవనములు ఎవరి కొరకు?"

దానికి గేబ్రియల్ "కోపమును నిగ్రహించుకొని, తప్పు లను క్షమించుట ఎరిగిన వారికి" అని చెప్పెను.

నిజముగ ద్వేషభావము లేశమైన లేని ప్రశాంత మనస్కుల మనసే మందిరము. పగతో కకావికలైన మనస్సు భవంతి కానే రదు. మన మనసే, మనము నివసించే భవనము (గృహాము). దానిని పరిశుద్ధముగా, ఆనందముగా, ప్రశాంతముగా, ఆహ్లాద వాతావరణముగా నెలకొల్ప వచ్చును. లేదా, దారుణమైన, భయం కరమైన చీకట్లో పడి దుఃఖభాజనముగా, ఆర్తనాదములతో బాధ పడవచ్చును.

*

ఉత్తర ఫ్రాన్స్‌లో నేనెరిగిన బాలుడు ఒకడు ఉండెడివాడు. అతడు ముక్కుకు సూటిగా ప్రవర్తించే వాడు. అయినా, తొందరపాటు తనము, ప్రతీకారము తీర్చుకొనే గుణము కూడా అతనిలో నుండెను.

ఒకనాడు అతనిని నేను ఇట్లడిగితిని. "నీవు బలమైన శరీ రముగల వాడివి. ధైర్యవంతుడివి కూడా. నిన్ను ఎవ్వరైనా కించ పరిచితే, వారిపై చెయ్యి చేసుకొని పగతీర్చుట కష్టమా? లేక బల మును ప్రయోగించకుండా నిగ్రహించుకొని క్షమించుట కష్టమా?"

ఆ బాలుడు "ప్రతీకారము తీర్చుకొనకుండ క్షమించుటయే కష్టము" అనెను.

"అయిన నీ వంటి ధైర్యవంతుడు, సులభమైనది చేయునా, కష్టమయినది చేయునా?" అని అడిగితిని.

"ధైర్యవంతుడు ఎల్లప్పుడూ కష్టమైన దానినే సాధించ వలెను." అని బాలుడు బదులు చెప్పెను.

"అట్లయిన, నీకు అవకాశము చిక్కినపుడు, కష్టమైన దానినే సాధించుటకు యత్నింపుము" అని అంటిని.

కొంతకాలము తరువాత ఒకనాడు ఆ బాలుడు, వినయ ముగా, నిగర్వముతో నా యొద్దకు తాను గ్రహించిన విషయ మును ఇట్లు చెప్పెను.

"నా సహచరుడైన, ఒక బాలకుడు, ఆవేశముతో, ఆగ్రహముతో నన్ను నిందించుచూ కొట్టెను. పూర్వపు నా ప్రవర్తన ఎరిగన వాడు కనుక, నా దెబ్బ నుండి రక్షించుకొనుటకు సమాయత్తము అయినాడు. మీ సలహాను పాటించుటకు నా పిడికిలిని నా జేబులోనే బంధించి, కోపమును నిగ్రహించుకొంటిని. కాని అది నేనూహించినంత దానికన్నా చాలా కష్టమైనదని గ్రహించితిని. తక్షణము నా కోపము మాయమై, ప్రశాంతత ఆవహించినది. నేను శాంతముతో స్నేహహస్తము నందించితిని. నా మిత్రుడు అవాక్కయినాడు. విస్మయముతో నా వంకే చూచుచూ, ఇది కలయా నిజమా అన్నట్లు చేష్టలుడిగి, తెలివితెచ్చుకొని తన చేతిని నా చేతితో కలపి ఆనందించుచూ, "నీవు నన్ను ఏమి చేయదలిచిననూ, నీకు ఎప్పటికీ స్నేహితుడనే, మిత్రుడనే – నా ఆవేశము, కోపము నశించినవి" అని స్నేహభావముతో కరచాలనము చేసెను."

నా సలహాను పాటించిన ఆ బాలుడు, పైన పేర్కొనిన కలీఫా హుస్సేను వలెనే కోపమును నిగ్రహించుకొని, క్షమించ గలిగి, ప్రశాంతుడయ్యెను. ఒక్క కోపమే కాదు – ఇంకా నిగ్రహించుకొన వలసిన వ్యసనములు మానవునిలో చాలా యున్నవి.

*

అరబ్బీ కవి 'ఆల్ కోసాయ్' ఎడారిప్రాంత నివాసి. అతనికి ఒక నాడు మంచి నాబా (వెదురు వంటిది) పొద కనబడినది. దాని కొమ్మతో మంచి విల్లు, బాణములు తయారు చేసుకొని, చీకటి పడగానే అడవి గాడిదలను వేటాడుటకు బయల్వెడలెను. కొలది సమయములోనే గాడిదమంద సమీపమునకు వచ్చుచున్న డెక్కల ధ్వని వినపడెను. కారుచీకటిలో గాడిదల వేట సవ్వడిని బట్టి, బలమైన బాణపు దెబ్బ కొట్టెను. అది గాడిద కడుపును చీల్చుకొని, వెనుకనున్న రాతికి తగిలి క్రిందపడినది. బాణము రాతికి తగిలిన ధ్వని మాత్రమే వినిన ఆల్ కొసాయ్, గురి తప్పినదనుకొని, మరియొక బాణమును సంధించి బలముగా విడచెను. అది కూడ మొదటి బాణము వలెనే గాడిద కడుపు చీల్చి వెనుక

నున్న రాతికి తగిలినది. రాతి ధ్వని మాత్రమే వినిన వేటగాడు, మూడవ బాణము వదిలెను. మరి అదే వరస – నాల్గు, ఐదు బాణములను వదలి, గురి తప్పెనని నిస్పృహాతో విల్లును విరిచి, తెల్లవారు వరకు చీకాకుపడుచూ, ప్రశాంతతకు, నిద్రకు దూర మయ్యెను. తెల్లవారునప్పటి దృశ్యము; ఐదు గాడిదలు కడుపు చీలి చచ్చిపడి యున్నవి.

ఆల్ కొసాయ్, ఒకింత ఓర్పు వహించి యున్న, విల్లొ దక్కెడిది, తెల్లవార్లూ మంచి నిద్ర, ప్రశాంతత అనుభవించి ఉండెడి వాడు.

*

వ్యక్తిత్వమును, స్వశక్తిని, చొరవను నాశనము చేసే కఠినమైన క్రమశిక్షణము మేము గౌరవింతుమని భావింపరాదు. గుఱ్ఱము నోటికి కళ్ళెము వేయుట, దాని దవడలను చీల్చుటకు కానీ, దంతములను విరుగ గొట్టుటకు కాని కాదు. అవసరమును బట్టి, కళ్ళెమును బిగింతుమే కాని, దాని గమ్యమును నిరోధించుటకు కాదు. వ్యక్తుల శక్తియుక్తుల పరిపూర్ణ సాధనకు కఠిన శిక్షణ అవసరము.

దురదృష్టవశాత్తు అందరు మానవులు సమాన వివేక లక్ష ణములు కలవారు కారు. పిరికివారే ఎక్కువ. గొఱ్ఱెల వలె కుక్క అరుపునకే భయపడి పారిపోవువారు ఎంతమందో! వారిలో చొరవ, ధైర్యము ఎక్కడివి? మందత్వము (బానిసత్వము) మూర్తీ భవించిన మానవులు ఎన్ని బాధల నైనా భరింపజూతురే కాని, ఎదిరించి నిరోధించ జాలరు. అయితే సహనము మితిమీరి పరా భవముగా పరిణమించగూడదు

మితిమీరిన సహనశీలి ఆబు ఓట్మన్ – ఆల్ – హిరీ – ఒకనాడు అతడు అతని మిత్రునిచే విందునకు ఆహ్వానింపబడి నాడు. వేళకు అతిథి గృహాము చేరినాడు. అతిథి ఆబూను "అయ్యా క్షమించండి. ఈ దినమున మీకు ఆతిథ్యము నీయ జాలను. దయచేసి మీ గృహామునకు మరలిపొండు. అల్లా మిమ్మ

కరుణించు గాక" అని స్వగృహమునకు పంపెను. కోపము గాని, విసుగు గాని లేక ఆబూ తన గృహమునకు మరలిపోయెను.

కాని, గృహప్రాంగణము చేరక ముందే, ఆ అతిథి మరల ఆబూను విందునకు ఆహ్వానించెను.

ఆబూ మరల వాని గృహమునకు వానితోనే వెడలెను. కాని మొదట ఏది చెప్పెనో అదే విధముగా, ఆబూను స్వగృహ మునకు మరలించెను. ఇదే విధముగా మూడవసారి, నాల్గవసారి జరిగినది. ఆబూ ఏమాత్రము విసుగు చెందలేదు. ఐదవసారి కూడ అతిథి ఆబూను ఆహ్వానించి తన గృహములోనికి తీసు కొనిపోయి తన ఇతర మిత్రుల ఎదుట "ఆబూ! నేను ఈ విధ ముగా తమ మంచితనమును పరీక్షింప వలెనని చేసితిని. తమ ఓర్పు సహనములను మెచ్చుకొనుచున్నాను" అని అతనిని పొగ డెను. అందుకు ఆబూ ".మహాశయా! నన్ను పొగడవలదు. కుక్క లకు కూడ అభ్యాసము చేత ఈ సద్గుణము ఏర్పడగలదు. యజ మాని పిలచినపుడు వచ్చుట పొమ్మని నప్పుడు పోవుట వాటికి అలవాటే" అనెను.

ఆబూ ఓట్మన్ కుక్క కాదు – మానవుడు. తనంతట తానే ఈ విధముగా, ఇతరుల ఎదుట తన వ్యక్తిత్వమును కించ పరచుకొనుట తగదు. తనకు కాని ఇతరులకు కాని మంచిని చేకూర్చని ఓర్పు నగుబాటు.

ఇట్టి బలహీనతను, మానవుడు, నియంత్రించుకొన వలెను. తన బలహీనతలను కూడా నియంత్రించుకొన లేనివాడు, ఇతరు లచే ఎల్లప్పుడూ నియంత్రింప బడుచునే యుండును.

*

ఒక యువ బ్రహ్మచారి, తెలివైనవాడు, సమర్థుడు – బహుళ విద్యలందు ఆరితేరి మంచి కీర్తిని సంపాదించి అందరి చేత తన కన్న సమర్థుడు లేడని పించుకొన వలెనని, చాల దేశములను తిరిగి, చాల విద్యలందు ఆరితేరెను.

ఒక దేశములో విలువిద్యను అభ్యసించెను.

మరియొక దేశములో నౌకానిర్మాణము, నౌకాయానము నేర్చుకొనెను. ఇంకనూ మరియొక దేశములో గృహనిర్మాణ విధానము, మెలకువలను గ్రహించెను. ఈ విధముగా పదునారు దేశములను తిరిగి, అనేక విద్యల నభ్యసించి స్వగ్రామము చేరెను.

"ఈ ప్రపంచములో నన్ను మించిన సమర్థుడు, ఎవ్వడూ, ఉండబోడని" ప్రగల్భములు పలికెను.

ఇది గమనించిన బుద్ధ భగవానుడు, వానికి సరియైన జ్ఞానమును బోధింప నెంచి, భిక్షాపాత్రను చేతబూని, ఒక యాచకుని వలె అతనిని సమీపించెను.

"నీవెవరవు?" అని బ్రహ్మచారి ప్రశ్నించెను.

"నా శరీరమును, నా అదుపులో నుంచుకొన శక్తి గలవాడను" అని బుద్ధదేవుడు జవాబు చెప్పెను.

"దాని అర్థమును వివరముగా తెల్పుము" అని బ్రహ్మచారి అడిగెను.

"విలుకాడు, బాణములను మాత్రమే ప్రయోగించగలడు. నావికుడు నౌకను మాత్రమే నియంత్రించగలడు. గృహనిర్మాత నిర్మాణమును మాత్రమే నిర్దేశించగలడు. కాని వివేకియైన వాడు తనను తాను నిగ్రహించు కొనగలడు" అని బుద్ధదేవుడు వివరించెను.

"ఏ విధముగా?" అని బ్రహ్మచారి ప్రశ్న

"తనను ఎవ్వరైనా పొగడిన ఎడల ఆనందించడు; నిందించిన దుఃఖించడు. రెండింటి యందు సమదృష్టితో నుండును. (దూషణ భూషణములు అతని నిశ్చలతను భంగపరచ జాలవు) శాస్త్ర ప్రవచనములను పాటిస్తూ ప్రశాంతతతో జీవించును" అని బుద్ధదేవుడు ప్రవచించెను

మంచి మనస్కులైన బాలబాలికలు, తమను తాము నిగ్రహించుకొనుటకు ప్రయత్నించ వలెను. దీనికి మంచి దీక్ష, స్థిర చిత్తము అవసరము. అభ్యాస సమయములో కఠినమైన శిక్షణకు వెరువ కూడదు.

శక్తివంతమైన యవనాశ్వము, మంచిశిక్షణతో బాగుగా ఉపయోగ పడగలడు. కాని కొయ్యు గుఱ్ఱము చలనము లేనిదానికి కళ్ళెము వేసి ప్రయోజనమేమి? సరదాకు తప్ప.

మూలం: శ్రీమాత

అనువాదము: రంగనాధ ఆత్రేయ

మనఃక్లేశములు, సమత్వ సాధనకు ఉత్తమ అవకాశములుగా భావించ వలెను.

*


నాకు సంభవించే విషయములు, మిక్కిలి బాధాకరములుగా భావింపబడేవి కూడా, నన్ను లవలేశము కలవరపెట్టవు. నా శాంతి నిశ్చలతలకు భంగము కలిగించవు. కాని అది అచేతన కాదు. సంపూర్ణ సమభావన, అనంతస్ఫూర్తి. ఈ భావనలో నిశ్చిత జ్ఞానము – చేయతగినది, చెప్పతగినది, వ్రాయతగినది – ఒక్క మాటలో – చేయవలసినది అంతా ఇమిడి ఉంటుంది.

శ్రీమాత

"సంపూర్ణంగా విముక్తుడవు కమ్ము"

"సంపూర్ణంగా విముక్తుడవు కమ్ము" అనే దాన్ని ఎట్లా అర్థం చేసుకుంటున్నారో ఎవరయినా నాకు చెప్తే బాగుండు! ఇది ఎందుకు చాలా ముఖ్యమైన ప్రశ్నో చెప్తాను.

"స్వాతంత్ర్యం" (liberty) మరియు "విచ్చలవిడి స్వేచ్ఛ" (licence) చాలామంది ఈ రెండు పదాలతో తికమక పడుతుంటారు. మామూలుగా విముక్తుడవు కావడమంటే ఏమిటి? ఎవరి జోక్యం లేకుండా తన కిష్టమొచ్చిన ఏ పిచ్చి పనయినా సరే చేసే సావకాశం తమకున్నదనా? కాదు. నేను "సంపూర్ణంగా విముక్తుడవు కమ్ము" అంటాను. ఈ పదాలను సరిగా అర్థం చేసుకోకపోతే యిది చాలా ప్రమాదకరమయిన సలహా, దేని నుంచి విముక్తి?



... all that I receive, even the things that are considered most painful, leave me absolutely calm and indifferent – 'indifferent', not an inactive indifference : without any painful reaction of any kind, absolutely neutral (gesture turned towards the Eternal), *with perfect equality. But in this equality there is a precise knowledge of what is to be done, of what is to be said, of what is to be written, of what is to be decided, in short, everything that action entails.*

The Mother

– బంధనాల నుంచి విముక్తి. ఖచ్చితంగా అదే! అన్ని కళల్లో నిష్ణాతుడయిన ఒక యువకుడికి సమాధానమిస్తున్న బుద్ధుని కథ యిదిగో. "నేను ఆత్మ సంయనం అనే కళలో నిష్ణాతుడ్ని. ఇతరులు నన్ను అభినందించినా సరే, పొగడినా సరే పొంగిపోను; నిందించినా క్రుంగిపోను. నాకు రెండూ ఒకటే. నిర్లిప్తత, ప్రశాంతత సమానంగా కలుగుతాయి".

మీరు నిందాస్తుతులకు ఎంతవరకు అతీతులుగా వున్నారో మీకు మీరు ప్రశ్నించుకొనే ప్రయత్నం చేయండి. ఇతరులు చెప్పింది నీకు అప్రధాన్యంగా కన్పించినంతమాత్రాన యితరుల కన్నా గొప్ప వాడివని భావించనక్కర్లేదు. అది కానేకాదు. కాని అజ్ఞానం యొక్క సాధారణ పరిస్థితి గురించి నీ అజ్ఞానస్థితితో సహా నీకు తెలుసును. ఇతరులు ఏదయినా మంచిదని విశ్వసిస్తే "అది అనుకున్నంత మంచిది కాదని" నీకు తెలుసు. అలాగే వారు దేన్నయినా చెడ్డదని నమ్మితే "అది అనుకున్నంత చెడ్డది కాదని" నీవు చెప్పగలగాలి. ప్రతిదీ కలగాపులగమై ఉంటుంది. అంతిమంగా ఎవరూ ఎవరినీ నిర్ధారించలేరు. కాబట్టి నీవు నిందాస్తుతుల పట్ల పూర్తిగా ఉదాసీనంగా ఉండు.

అదే విముక్తుడవు అవడానికి ఉత్తమమయిన మార్గం. నువ్వు దైవానికి సర్వశ్య శరణాగతి కావాలి. అప్పుడే సంపూర్ణ విముక్తుడవు కాగలవు.

నిజంగా విముక్తుడవు కావడానికి ఒక్కటంటే ఒక్కటే మార్గం! ఎటువంటి అరమరికలు లేకుండా దైవానికి పూర్తిగా శరణాగతుడవై ఉండడం – అప్పుడు నిన్ను బంధించేదంతా, నిన్ను కట్టిపడేసేదంతా, నీకు కదలికలు లేకుండా చేసేదంతా – సహజంగా నిన్ను విడిచి దూరంగా పోయి ఏమాత్రం ప్రాధాన్యత లేకుండా వుంటుంది. బంధాల నుండి విముక్తి అనగా అది ఎవరయినా వచ్చి నిందిస్తే "నన్ను ఏ అధికారంతో యితను నిందిస్తున్నాడు, యితనికి పరమాత్మ అభీష్టం తెలుసా?" అని అనుకోవచ్చు. అలాగే నిన్ను ఎవరయినా అభినందించినప్పుడు కూడా! ఇతరులనుండి నీకు లభించే ప్రయోజనాలను పొందవద్దని చెప్పే

సలహాకాదిది. పసివాడు కూడా నీకు పాఠం చెప్పగలడని నేను నా జీవితమంతా నేర్చుకున్నాను. అతను నీకన్నా తక్కువ అజ్ఞాని అని కాదు. కాని నువ్వేమిటో ఆ రూపాన్ని ప్రతిబింబించే దర్పణమే ఆ పసివాడు. నీ గురించి సత్యముకాని దాన్ని అతడు నీకు చెప్పవచ్చుకాని, నీకు తెలియనిదాన్నికూడా నీకు చూప వచ్చు. కనుక అవాంఛిత ప్రతిఘటన లేకుండా నీవు పాఠాన్ని గ్రహిస్తే, నీవు చాలా భారీ ప్రయోజనం పొందగలవు.

ప్రతివాళ్లు నిరంతరం ఏదో ఒకటి నేర్చుకోవచ్చుని, నా జీవితంలో ప్రతినిముసమూ తెలుసుకున్నాను. కాని నేను ఎవరి అభిప్రాయంతోను కట్టుబడివున్నట్లు ఎప్పుడూ భావించలేదు. ఎందు కంటె ఈ ప్రపంచంలో కొద్దిగానయినా తెలిసింది సత్యం అనేది ఒకటుందని నాకు తెలుసు. అదే పరమసత్యం. ఇది తెలిస్తే సంపూర్ణంగా విముక్తుడవైనట్లే. నేను మీకు కావాలని కోరుకుం డేది ఆ విముక్తే. సర్వబంధాలనుండి, సమస్త అజ్ఞానాలనుండి, సకల ప్రతిఘటనలనుండి, భగవంతునికి సర్వశ్యశరణాగతి వినా, మిగిలిన అన్నిటినుండి విముక్తి. ప్రపంచంపట్ల మనకున్న బాధ్య తలనుండి యిదే బయటపడే మార్గం – ఒక్క పరమాత్మే అన్ని టికీ బాధ్యతవహించేది.

మూలం: శ్రీమాత

అనువాదం: కోట శంకర శర్మ

> *సమత లోతైనప్పుడు గంభీరమైన ఒక శాంతి ఆవహిస్తుంది. తత్ఫలితంగా దివ్యప్రేమ వికసించి అనంత పరివ్యాప్తమై సృష్టినంతా ఆక్రమిస్తుంది.*
>
> *శ్రీమాత*

శారీరక సమతౌల్యము

శారీరక దారుఢ్యం, మంచి సౌష్ఠవం కలిగి యుండి, చిన్నపిల్లల కుండే అనవసర విషయానికే తత్తరపడే స్థితి లేకుండా యుండి, హాయిగా నిద్రించి, బాగా భుజించే వానిదే మంచి ఆరోగ్యం. సంపూర్ణ ప్రశాంతత కలిగివుండి, ఒడిదుడుకులు లేకుండా వుండి అత్యంత నిశ్చలత వున్నప్పుడు ఏ వ్యక్తికైనా గట్టి పునాది (basis) ఏర్పడుతుంది. దైవమునుండి ప్రసారితమయ్యే శక్తులను పొందగలుగుతాడు.

మీలో ఎవరైనా దైవికమైన, ఆనందదాయకమైన ఆత్మ సంబంధిత శక్తులను పొంది వుంటే, మంచి ఆరోగ్యం వుంటే కాని, ఆయా శక్తులను యిముడ్చుకొని, కాపాడుకోలేరని అను భవం ద్వారా తెలుసుకొని వుంటారు. అటువంటి వ్యక్తి దుఃఖిం చడం, రోదించడం మొదలు పెడ్తాడు. తను పొందిన శక్తులను వుపయోగించడానికి వ్యాకులత చెందుతాడు. అతను తప్పక నవ్వాలి. మాట్లాడాలి, ఆంగికాభినయం చెయ్యాలి – లేని యెడల ఆ శక్తులను అతడు వుంచుకోలేడు. పైగా ఊపిరాడనంత బాధ పడతాడు. కాబట్టి తనకు లభ్యమైన శక్తులను ఉపయోగించుకుం డేందుకు బదులు నవ్వడం వలన, ఏడ్వడం వలన, కదలికలు వలన వృధా పరుస్తాడు.

ఒడిదుడుకులు లేకుండా వుండటానికి, తాను పొందిన శక్తులను యిముడ్చుకోవడానికి, ఆ వ్యక్తి సంపూర్ణ ప్రశాంతం గానూ, స్థిర నిశ్చలంగానూ వుండాలి. ధృఢమైన పునాది, మంచి ఆరోగ్యం తప్పక కలిగి వుండాలి. తప్పని సరిగా అతను చాలా గట్టి బలమైన పునాది కలిగి వుండాలి. ఇది చాలా ముఖ్యం.

ప్రశ్న: బాహ్యామయిన సమతకు, ఆత్మసంబంధిత సమతకు తేడా ఏమిటి?

సమాధానం: ఆత్మసంబంధమయిన సమత మనోసంబంధమయిన విషయం. అన్ని సంఘటనలను మంచివిగాని చెడువిగాని, దుఃఖిం

చకుండా, నిరుత్సాహపడకుండా, కలత చెందకుండా భరించే శక్తి అది. ఏది జరిగినా నువ్వు స్థిమితంగా శాంతంగా ఉంటావు.

రెండోది శారీరక సమత. అది మనో సంబంధమయినది కాదు. భౌతికమైనది. శారీరకంగా సౌష్ఠవంగా ఉండటానికి, యిబ్బంది పడకుండా శక్తులను పొందటానికి అవసరమైనది. ఈ పథంలో అభివృద్ధి చెందాలనుకుంటే యీ రెండూ అవసరమే.

మూలం: శ్రీమాత

అనువాదం: కోట శంకర శర్మ

అతిమానసానికి అర్హత

పూర్ణసమతా భావము సాధకునిలో ఏర్పడనిదే అతిమానస (supramental) ప్రసారం సాధ్యపడదు. ఈ విషయాన్ని 1956 వ సంవత్సరం నుండి కొన్ని సంవత్సరాలుగా నేను గమనిస్తున్నాను. సాధకునిలో సమత్వానికి ఏమాత్రం వ్యతిరేకత కనిపించినా, అహంకారము అడ్డు తగిలినా, దేహాత్మ భావానికి ప్రాధాన్యత నిచ్చినా, ఆ ప్రసారం జరుగదు. పరమాత్మతో ఆధ్యాత్మిక తాదాత్మ్యం పొంది పూర్ణసమత్వం సాధించినప్పుడు మాత్రమే అతిమానసం భూలోక చైతన్యం లోనికి ప్రవేశించ గలుగుతుంది. సంపూర్ణ సమతా సాధనతో సర్వం బ్రహ్మమయంగా భాసిస్తుంది. ఈ సమభావన కొని తెచ్చుకొన్నదిగా కాక, బాహ్యావత్తిడి వలననో లేక తెలివితేటలతో చేసిన ప్రయత్నం వలననో గాక, స్వతః సిద్ధంగా అప్రయత్నంగా సిద్ధించాలి. అతిమానసం మనకు లభించింది అనేందుకు తార్కాణాలు:

1) సర్వకాల సర్వావస్థలయందు నెలకొన్న అద్వితీయ సమభావన.
2) సంశయానికి తావులేని జ్ఞానఘనము.

ఇతరులతో వ్యవహరించే తీరులోను, ప్రతి పనిలోను, సంఘటనలోను, మనకు తారసపడిన ప్రతి వ్యక్తితోను, భౌతికంగా, మానసికంగా జరిగే సకల సంఘటనలను, వాటి స్వభావం, ప్రభావం ఎలా వున్నా, అప్రయత్నంగా, నిర్విరామంగా ఈ సమభావం వెల్లి విరియాలి. సకల జీవరాసులతో తాదాత్మ్యం నిర్విరామంగా కొనసాగాలి. అదే పూర్ణసమత్వమని అనిపించుకొంటుంది.

మూలం: శ్రీమాత
అనువాదం: చదలవాడ వెంకట శేషయ్య

సమతను సంపాదించే మార్గము

నీ వెంత నిశ్చలంగా ఉంటే అంత శక్తి సంపన్నుడవుతావు. ఆధ్యాత్మిక శక్తికి మూలాధారం నిశ్చలత్వమే. దేన్నీ కూడా నీ సమతను చెడగొట్ట నీయవద్దు. అట్లా చేసి ఉన్నప్పుడు నీ పైకి ఏమి వచ్చినా ప్రతిఘటించ గలవు. ఇంకా వివేచనా జ్ఞానం కలవాడివైతే చెడు సూచనలు వస్తూండటం ముందుగానే గమనించి అక్కడికక్కడే తేలికగా వాటిని త్రోసి పారేయగలవు. ఒక్కొక్కసారి అవి నీ దృష్టికి రాకుండానే నీలో చేరి తిష్ఠ వేసికొని కూర్చుంటాయి. అప్పుడిక వాటిని వెళ్ళగొట్టడం చాల కష్టమవుతుంది. అటువంటిది జరిగినప్పుడు నీవు స్థిరంగా ఆసీనుడవై గాఢమైన ప్రశాంతిని నీలోకి ఆహ్వానించుకోవాలి. హృదయాంతరాళంలో నిశ్చలతను పొందాలి. గట్టిగా నిలదొక్కుకుని దృఢమైన విశ్వాసంతో గజేంద్రుని మాదిరిగా వేడుకోవాలి. నీ ఆకాంక్ష స్వచ్ఛంగా, నిలకడగా ఉంటే కావలసిన సహాయం వచ్చి తీరుతుంది.

ప్రతికూల శక్తులు నిన్ను ఎదిరిస్తూనే ఉంటాయి. అవి నీ మార్గానికి అడ్డుతగిలే పరీక్షలనుకుని ధైర్యంగా వాటిని అధిగమించు. ఈ సంఘర్షణ కష్టసాధ్యమే అయినప్పటికీ దాని నుంచి

బయట పడగలిగితే కొంత విజయం సాధించినట్లే. ఒక అడుగు ముందుకు సాగినట్లే. ఇంకా చెప్పాలంటే ఈ ప్రతికూలశక్తుల ఉనికి ఒక ప్రయోజనం కూడా ఉంది. అవి ఈ ఆకాంక్షను సుస్పష్టంగా చేసి ఈ తీర్మానములను దృఢతరంగా చేస్తాయి.

నిజం చెప్పాలంటే అవి ఉండటానికి అవకాశం నీవే కల్పిస్తున్నావు. నీలోని ఒక భాగం దానికి ఆహ్వానం పలుకుతూంటే అవి జోక్యం కల్పించుకోవడం న్యాయమే కదా!

ఏది ఏమైనప్పటికీ ప్రతికూలశక్తులు తలపడినప్పుడు వాటిని బయటనుంచి వస్తున్నట్లు భావించటమే సరైన వైఖరి. – "ఇవి నావి కాదు. వాటికీ నాకూ ఏమీ సంబంధం లేదు" అనుకోవాలి. అన్ని అధఃప్రవృత్తులను, కోరికలను, మనసులో కలిగే అన్ని సందేహాలను, సంశయాలను కూడా ఈ విధంగానే పరిహరించాలి. అవి నీవే ననుకుంటే వాటిని ప్రతిఘటించటం మరీ కష్టమవుతుంది. అలా అనుకుంటే అత్యంత కష్టసాధ్యమైన నీ స్వభావంతోనే భేటీపడుతున్న భావం నీకు కలుగుతుంది. "ఆహా, అది నేను కాదు, దానితో నాకేమీ సంబంధం లే"దను కోగలిగితే వాటికి బలహీన పరచడం చాలా తేలిక.

*

నీ వుండే మానసిక ప్రపంచమంతా చాలా పరిమితమైంది. అది నీకు తెలియక పోవచ్చు. ఆ హద్దులలో పరిమితమై ఉండిపోయిన నీ మనస్సును ఏదో ఒక శక్తి వచ్చి హద్దులను బద్దలుకొట్టి విడుదల చేయాలి. అంటే ఉదాహారణకు నీకు నీవుగా ఏదో కొన్ని నియమాలను, సూత్రాలను పెట్టుకొని వాటికి కట్టుబడి ఉంటావు. నీ సిద్ధాంతాలు నీకు చాలా ముఖ్యం. వాటిలో నుంచి బయట పడడం నీ కిష్టముండదు. అవి నీతిసూత్రాలు కావచ్చు, మతశాసనాలు కావచ్చు; "తల్లిదండ్రులను గౌరవించు"; "జీవహింస చేయరాదు" లాంటివి. ఈ విధంగా ప్రతివారూ ఏదో ఒకదానికి కట్టుబడి ఉంటారు. అంతేకాక ఇతరుల మాదిరిగా తాము ఏదో ఒక దురభిమానానికి లోనై బాధపడటం లేదని, ఇతరులు ఆ విధమైన భావనతో ఉంటే అది తప్పనీ అనుకుంటారు. తమ భావాలు

మాత్రం శతవిధాలా సత్యమైనవనీ అవి ఇతరుల నమ్మకాల వంటివి కాదులే అని అనుకుంటారు. ఏదో ఒక నియమం పెట్టుకొని దానికి అతుక్కుపోయి ఉండటమంటే నీలో ఎక్కడో అంధత్వం మరుగై ఉందనటానికి నిదర్శనమన్న మాట.

*

తిండిపోతుతనం – తిండి మీద తృష్ణను జయించాలంటే అన్నింటా సమతాదృష్టిని అలవరచుకోవాలి. అప్పుడు ఆహార మంటే తటస్థ వైఖరి ఏర్పడుతుంది. ఒకదాని మీద అమిత ఇష్టం కానీ, అసలు ఇష్టం లేకపోవటం గానీ ఉండదు. వేళకు దొరికితే తింటావు, లేకపోతే దాన్ని గురించిన చింతనే ఉండదు. అన్ని టినీ మించి తిండి ధ్యాస పూర్తిగా పోతుంది. అలాగని పూర్తిగా వ్యతిరేక ధోరణి కూడా ఉండకూడదు. ఆహారానికి బదులుగా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడంలో నిమగ్నులయే సన్యా సులు, తిండి ధ్యాసతో వెంపర్లాడే వారితో సమానమే. ఎందువల్ల నంటే ఇద్దరూ తిండి గురించి ఆలోచిస్తున్నట్లే కదా! ఆహార విష యంలో ఉదాసీనత అలవరచుకోవడం సరైన పద్ధతి. నీ చైత న్యంలో నుంచి ఆహారమనే భావాన్ని తొలగించేసెయ్యి. దానికి ఏ విధమైన ప్రాధాన్యాన్ని ఇవ్వకు.

నీలోని చైత్యపురుషుని స్పర్శ నీకు లభించినప్పుడు ఇది చాలా సులభమవుతుంది. ఇది కలిగిన వెంటనే ఇవన్నీ ఎంత అనావశ్యకమో, దైవం అన్నిటి కంటే ఎంత ముఖ్యమో నీకు అవగతమవుతుంది.

*

ఆత్మ సమానత్వం ఒక మార్గం. అదే అనుసరణీయమైన గమ్యం కూడా అనుకోవచ్చు. కానీ అది చరమ లక్ష్యం కాదు.

జరిగేది ప్రతిదీ దైవసంకల్పమే అని చెప్పేవారూ ఉంటారు. జీవితాన్ని పూర్తిగా అదే దృష్టితో అర్థం చేసుకునే వారూ ఉంటారు; "ప్రపంచమంతా, ఎట్లా ఉన్నదట్లా, జరిగే ప్రతిదీ దైవ సంకల్పానికి వ్యక్తీకరణ. అందువల్ల దైవానుబంధం కావాలను కుంటే జరుగుతున్న దాన్నంతటినీ ఏ మాత్రం సంకోచించ

కుండా, చిత్తభ్రమణానికీ, రాగ వికారాదులకీ లోనుగాకుండా శిరోధార్యంగా స్వీకరించడమే విజ్ఞత" అని వారంటూరు. ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తే ఆత్మసమానత్వం సాధించడానికి తోడ్పడుతుంది. దీనికి వ్యతిరేకంగా ఉండే అభిప్రాయాన్ని గూడా సేకరించి ఆ రెండింటినీ అర్థం చేసుకొని సమన్వయం చేసుకోకుండా దీన్ని మాత్రమే అనుసరిస్తే జీవితమంతా వృధాగా కూర్చొని గడిపేయడమే అవుతుంది – ప్రపంచ పురోగతికి నీ ప్రయత్నమేమీ ఉండదు.

మూలం: శ్రీమాత

స్వేచ్ఛానువాదం: ఎ. ప్రభావతి, ఎ.వి.ఆర్ శాస్త్రి

ప్రశాంత, నిశ్శబ్ద నీరవతలో నిత్యుడైన పరమాత్మ అభివ్యక్తుడవుతాడు. దేన్నీ వచ్చి నిన్ను కలతపెట్ట నీయకు – భగవంతుడు నీలో అభివ్యక్తమవుతాడు. ఏది వచ్చినప్పటికీ పరిపూర్ణ సమతాదృష్టితో చూడు; అనంతుడు ప్రత్యక్షమవుతాడు. సంపూర్ణ ప్రశాంతత, నిశ్చలత, సమత అంతా నీవే ప్రభూ. ఇదంతా నీవే కాబట్టి ఈ పరిశుద్ధ, నిశ్శబ్ద నీరవ వాతావరణంలో ఏ చిన్న ప్రకంపనమైనా నీ ఆవిష్కారానికి అవరోధమే స్వామీ. ఆతృత లేదు. ఆ వేగం లేదు. అస్థిమితం లేదు. ఉన్నదంతా నీవే. నీవు తప్ప ఇంకేమీ లేదు ఏ విధమైన విశ్లేషణమూ, వస్తు వివేచనమూ అక్కర్లేకుండా అంతా నీవే, నిస్సందేహంగా నీవే ప్రభూ! ఇక అంతా పవిత్ర ప్రశాంతతే. అంతా మహత్తర నిశ్శబ్దతే.

శ్రీమాత

విభాగం II:

సమత అనగా ఏమి? – I

మానవులకు తమ పరిసరాలను గురించిన జ్ఞానము దేహమనో ప్రాణికములనే ముసుగుల ద్వారా కలుగుతుంది. సత్యము ఏకమే అయినప్పటికి మనుషుల దృష్టిలో అది అనేకమౌతుంది. ఈ ముసుగులను ఛేదించి సత్యమును దర్శించుటయే యోగము. కాని ఆ తెరలు అంత తేలికగా తొలగిపోవు. అందుకే సమత అవసరము. సమత అనగా మనుషులను, సంఘటనలను వ్యక్తిత్వదృష్టితో కాకుండా విశాలనేత్రములతో, తత్త్వదృష్టితో గమనించుట, తదనుగుణంగా స్పందించుట, అంతరంగికలో సుప్రతిష్ఠితమై ప్రశాంతంగా, ఉదాసీనంగా మాట్లాడుట, ప్రవర్తించుట మొ॥.
– సంపాదకుడు

సమత అనగా సర్వకాల సర్వావస్థల యందు ప్రశాంతంగా అచంచలంగా ఉండుట.

*

నీకు ఏమి జరిగినప్పటికి నిన్నెవరేమన్నప్పటికి, ఎవరేం చేసినప్పటికి ఏమాత్రం చలించకుండా ఉదాసీనంగా ఉండాలి. నీ మనస్సు చెదరకూడదు. ప్రాణికం స్పందించకూడదు. నువ్వు ఆవేశంతో గంతులు వేయరాదు. అన్ని సన్నివేశములను వ్యక్తిగత భావముతో గాని రాగద్వేషాలతోగాని నిమిత్తము లేని యథార్థ దృష్టితో చూడాలి. అన్ని సంఘటనలను వెనుకనుండి నడిపిస్తున్న శక్తులను అర్థం చేసుకుండేందుకు ప్రయత్నించాలి. అలా ఎందుకు జరుగుతుందో, వాటి నుండి మనము ఎటువంటి పాఠాలు నేర్చుకోవాలో, నీ ప్రకృతిలోని ఏ దోషము వలన అలా జరుగుతుందో వాటి వలన నీ వేమి లాభమును పొందగలవో తెలుసుకోవాలి. ప్రాణికస్పందనలు – అనగా కోపతాపాలు, బాహ్యప్రేరణలకు లోనగుట, నీలోని ఆవేశములను రెచ్చగొట్టి సౌమ్యంగా ఉన్న ప్రాణాన్ని రౌద్రము గావించుట ఇవన్నీ అనభి

లాషనీయములు. *క్షణికావేశాలకు లోనై నీచంగా ఎప్పుడూ మాట్లాడ కూడదు, ప్రవర్తించనూ కూడదు.* నీ అంతరంగికంలో సుప్రతిష్ఠితుడవై తదనుగుణంగా ప్రవర్తించాలి. కాని సమతలో ఇంతటి మహోన్నత స్థాయిని అందుకొనుట అంత తేలిక కాదు. నీ అంతరంగిక భావనలోను బాహ్యప్రవర్తనలోను నిరంతరం దీనినే లక్షించాలి.

సమత అనగా అందరు మనుషులను ఒకే విధంగా సమాదరించుట. వారి వ్యక్తిత్వాన్ని, చేష్టలను వారిని ప్రేరేపించే శక్తులను ఒకే విధంగా గౌరవించుట. అప్పుడే కదా నీ మనస్సు లోని వ్యక్తిగతదృష్టి, పక్షపాతబుద్ధి తొలగిపోయి కనువిప్పు కలిగి తద్గత సత్యమును చూడగలుగుతావు. ఒక సంగతి మట్టుకు నువ్వు మరచిపోకూడదు. *నీ వ్యక్తిగత దృష్టి (మానవులకు సహజము) చాలా చెడ్డది. మనుషులను తప్పుదారి పట్టిస్తుంది.* ఇతరులు చేసే పనులను, వాటి వెనుకగల కారణాలను తన రంగుటద్దాలతో చూపి ఘర్షణకు దారి తీస్తుంది. అప్పుడు భేదాభిప్రాయాలు కలుగుతాయి. సదసత్యాల విచక్షణ లోపిస్తుంది. గోరంతలు కొండంతలవుతాయి. మానవజీవితంలో జరిగే దుస్సంఘటన లన్నింటికి ఇదే కారణం. అయితే మానవుల మధ్య వ్యక్తిగత సంబంధములు, ప్రేమాభిమానములు సాధారణ జీవితానికి తప్పనిసరే అనిపిస్తుంది. మనుషులపట్ల, సంఘటనలపట్ల విశాలమైన సమతాభావముండాలి. *సాధన చేసే వాళ్ళు ప్రాకృతిక భావాలకు అతీతంగా ఉండి ప్రశాంత మనస్కులై ముందుకు పురోగమించాలి.*

*

యౌగికసమత అనగా ఆత్మ యొక్క సమరసత్వము. అభివ్యక్తిలో తరతమ భేదాలు ఉన్నప్పటికి సర్వత్రా దేవుని ఏకత్వాన్ని దర్శించుట.

*

సమత అనగా చేతన యొక్క ఒకానొక ఉచ్చదశ. దేవుడు అనంతుడు. పరమ నిశ్చలుడు. ఆ ఉచ్చదశలో అట్టి ప్రశాంతత,

నిశ్చలత్వము, అనంతత్వము నీ సర్వేంద్రియాలలోను వ్యాపించి ఉంటుంది. ఆ విధమైన స్థితి సాధకునిలో సుప్రతిష్ఠితమైనప్పుడే అతడు దివ్యకర్మలను చేయుటకు యోగ్యుడు కాగలడు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

సమత అనగా ఏమి? – II

దైవమును మాత్రమే మనమారాధింతుము. మనలోని దైవమే ఇతరులలో కూడా ఉన్నది. ఆత్మ ఏకము, రూపము లనేకము. అందుకని మనము రాగద్వేషాలను, మిత్ర శత్రుభావములను ఉపేక్షించి, మూలదైవస్వరూపమును మాత్రమే దర్శించ వలెను. సృష్టిలోని ప్రతి యొక్క వస్తువు ఒక ప్రత్యేక కార్యమునకై నియమించబడినది. తదనుగుణమైన రూపమును దాల్చి తదనుగుణంగా ప్రవర్తిస్తుంది. ఒక వస్తువు అందంగాను మరొకటి వికారంగాను ఉండవచ్చును. మనకు సుఖదాయకములు కాని, దుఃఖభాజకములు కాని కావచ్చును. కాని అంతా దైవసృష్టియే. అన్ని వస్తువులపట్ల, సందర్భములపట్ల సమదృష్టిని వహించి వాటి నిజతత్వమును, అవి నిర్వహిస్తున్న పాత్రను గుర్తించ వలెను.

– సంపాదకుడు

మనము యోగములో పరాకాష్ఠను అందుకోవాల్నంటే మన మనస్సులోను, ఆత్మలోను మొక్కవోని సమత్వభావము రాణించ వలెను. ఈ సమతయందు మనము సుప్రతిష్ఠితులము గావలెను. ఏలయన, సకల కర్మలను ప్రభువగు నీశ్వరుని యారాధనకు మనలోను, సకల వస్తువులలోను, సకల సంఘటనలలోను ఆయ నను విస్పష్టముగా గుర్తించి సమ్మోదముతో గ్రహింపనేర్చుట అత్యంతావశ్యకము. సమత ఈ ఆరాధనాప్రవృత్తికి చిహ్నము.

సమతారూపమైన ఈ ఆత్మభూమియందే నిక్కమైన బలిసమర్పణము, ఆరాధనము జరుపుటకు వీలగును.

సర్వజీవులలోను దైవమును వీక్షింపవలెను.

ప్రభువు సకల ప్రాణుల యందును సముడై యున్నాడు మనకు ఇతరులకు, జ్ఞానులకు అజ్ఞానులకు, మిత్రునికి శత్రువునకు, మానవునికి జంతువుకు, పుణ్యాత్మునికి పాపాత్మునికి నడుమ ఎట్టి ముఖ్యవిభేదములను మనము చేయరాదు. ఎవరినీ మనము ద్వేషించగూడదు. నిరసించగూడదు. ఎవరియెడలను విముఖులము కాగూడదు. ఏలయన, అందరిలోను మారువేషమున తన యిచ్ఛానుసారముగా అభివ్యక్తమైయున్న అద్వయుడగు నా పరమేశ్వరునే మనము దర్శించవలెను ఒకరి యందాయన కొంచెముగా అభివ్యక్తము గావచ్చును. వేరొకరియందు అంతకంటె హెచ్చుగా అభివ్యక్తము గావచ్చును. తదితరులయందు మరుగుపడి పూర్తిగా వికృతరూపమున గనుపడవచ్చును ఇదంతయు ఆయన ఇచ్ఛననుసరించియు, వారియందే రూపము తాను గైకొని, ఏ కర్మలు వారి ప్రకృతి ననుసరించి తానొర్చుట ఉత్తమమో అద్దానిని గురించిన జ్ఞానము ననుసరించియు జరుగుచుండును.

ఆత్మ ఏకము రూపములు అనేకము

సకలము మన ఆత్మయే ఒకే ఆత్మ అనేక రూపముల గైకొన్నది ద్వేషము, అసహ్యము, నిరసనము వైముఖ్యము, బంధనము, ఆసక్తి, అభీష్టము, – ఇవన్నియు ఒక దశలో సహజములు, ఆవశ్యకములు, అనివార్యములే. మనలో ప్రకృతి ఏమి నిర్వహింపదలచుకొన్నదో అద్దానికవి సహాయభూతములగును. కాని కర్మయోగికి మాత్రము అవి అవిద్యాసంబంధమైన అవశేషములు, అవరోధములు, గతివిశేషములే యగును. సాధనలో అతడు ముందుకు పోయిన కొలది అవి యతని ప్రకృతినుండి క్రమముగా రాలిపోవును. శైశవావస్థ

లోని ఆత్మకు వికాసప్రక్రియయందవి ఆవశ్యకములే కాని, దివ్య సంస్కృతి నలవరించుకొను సందర్భములో పరిణాతాత్మనుండి యవి రాలిపోవలసియేయుండును

భగవత్ప్రకృతియొక్క మహోన్నతస్థాయిని మనము అందుకోవలసియున్నది. ఆ స్థాయియందు, వజ్రకఠినమైన – వినాశాత్మకముగూడనగు, – తీవ్రత మనలో ఉండిన ఉండవచ్చునుగాని ద్వేషమనునది యుండరాదు. దివ్యత్వలక్షణోపేతమైన వక్రోక్తి యుండదగునేగాని నిరసనభావ ముండరాదు. విస్పష్టదర్శనముతో కూడినదై, ప్రశాంతము, ప్రబలమునగు నిరాకరణమున కచట తావుండునేగాని, అసహ్యాభావముతో కూడిన తిరస్కారమునకు గాదు. మనము వినాశమొందిపవలసినదాని విషయములలోగూడ అసహ్యించుకొనుట మనకు తగదు. ఆ వినాశకృత్యములో నిత్యుడగు పరమేశ్వరుని ప్రచ్ఛన్నమైన తాత్కాలికచేష్టనే మనము అసందిగ్ధముగా గుర్తింపగలిగి యుండవలెను.

సమస్త వస్తుజాలంలోను దైవాన్ని దర్శించాలి

సకల వస్తువులను ఒకే ఆత్మయొక్క అభివ్యక్తి విశేషములే కావున, విరూపులయెడ సురూపులయెడ, వికలాంగులయెడ సౌష్టవధాత్రులయెడ, ఘనులయెడ నీచులయెడ, ప్రీతికరమైనవానియెడ, అప్రీతికరమైనవానియెడ, – అంతటనూ ఆత్మయందు సమతతోనే మనము ప్రవర్తింపవలెను. ఇచ్చటకూడ ద్వేషము, నిరసనము, విముఖత్వము అనునవి ఉండవు. సకల వస్తువులను, వాటి నిజస్వభావమున, వాటి యథానిర్దిష్టస్థానమున తిలకింపగల సమదృష్టిమాత్రమే యుండును. ఏలయన, సకల వస్తువులను ఈశ్వర సంబంధమైన ఒకానొక సత్యమును ఒకానొక శక్తివిశేషమును, గర్భితలక్ష్యమును, అభివ్యక్తమొనర్చుటయో లేక మరుగుపరచుటయో వికాసము నొందించుటయో లేక వికృతపరచుటయో చేయుచున్నవని మనమపుడు తెలిసికొనగలుగుదుము. అవి ఈ పనులను తమ ప్రకృతియొక్క వికాసక్రమములో సద్యఃస్థితిగతుల మేరకు సాధ్యపడిన

రీతిని తమకు నిర్దిష్టమైన సన్నివేశములందు, ఇప్పటి వస్తుసముదాయ సమష్టికినీ, కడకు సాధించవలసిన సంసిద్ధికినీ అవసరమైన విధముగా, యథాశక్తితోడను, తప్పనిసరియగు లోపముల తోడను నిర్వర్తించుట జరుగుచున్నది.

మారువేషముల మరుగున ఉన్న సత్యము మనకు కావాలి

ఏ సత్యమును అవి యీ రీతిగా అభివ్యక్తమొనర్చుటయు లేక మరుగుపరచుటయు, వికాసము నొందించుటయు లేక వికృతపరచుటయు సంభవించుచున్నదో అద్దానిని మనము, — ఈ తాత్కాలికాభివృద్ధి మరుగున ఉన్నదానిని, — అన్వేషించి కనుగొనవలసియున్నది. అట్లొనర్చినప్పుడు, బాహ్యారూపములకు భ్రాంతులముగాక, అభివ్యక్తియందు కాననగు లోపములచేతను వికారములచేతను విక్షిప్తములుగాక, ఈ మాయముసుగుల వెనుక సదా, అమలిన స్వచ్ఛ సుందర పూర్ణస్వరూపుడై తేజరిల్లు పరమేశ్వరుని మన మారాధింప సమర్థుల మగుదుము. సకలమూ మారవలసియుండునను మాట నిజమే. విరూపమునుగాక దివ్య సౌందర్యమునే మన మామోదింపవలసియున్నది. ఆ పరిపూర్ణతతో మన మాగిపోక పూర్ణత్వసిద్ధికొరకే పాటుపడవలసియున్నది. కాని, ఏ పని మనము చేసిననూ అయ్యది ఆధ్యాత్మికమైన అవగాహనతో, జ్ఞానదృష్టితో చేయుట అత్యంతావశ్యకము. ఆ యీ వస్తుజాతమును సంబంధించిన మానవధర్మప్రమాణములుగాక, దివ్యశ్రేయము, దివ్యసౌందర్యము, దివ్యసంసిద్ధి, దివ్యానందము మాత్రమే మన కనుసరణీయములు గావలెను. మనము సమతానిష్ఠులము గానిచో, అవిద్యయే మనలనింకనూ వెంటాడుచున్నదనుట కది గురుతు. సమత లేనిచో మనము దేనినీ సరిగ్గా అవగాహన చేసికొనజాలము. సమతలేని మన ప్రయత్నములు పూర్వపు దోషస్థితిని నిర్మూలించి క్రొత్త దోషస్థితిని కల్పించుకొనుటే యగును. ఏలయున, దివ్యప్రమాణములకు బదులుగా,

… మానవ బుద్ధియొక్కయు, కామాత్మయొక్కయు ప్రమాణము … మున మనుసరించెడి పరిస్థితి యిది.

అభివ్యక్తి యందు వైవిధ్యము కలదు

సమత యనిన నొక క్రొత్త అజ్ఞానమును, గ్రుడ్డితనమును కల్పించు కొనుట గాదు. దృష్టి కొకవిధమైన …దరంగు వెలుగు సంతరించుకొని సకల వర్ణచ్ఛాయలను …పివేయుటయునూ గాదు. భేదజ్ఞాన మచటకూడ కలదు. అభివ్యక్తియందలి వైవిధ్య మచటసైతము గుర్తించబడుచునే యుండును. ఈ వైవిధ్యమును మనము కడుచక్కగా గ్రహింప నేర్తుము గూడ. ఖండదృష్టితో తప్పుదారిని ప్రవర్తించు రాగము ద్వేషము, పురస్కారము తిరస్కారము, సామరస్యము వైమనస్యము, సుముఖత్వము విముఖత్వము మొదలైనవానిచే కంటికి మబ్బు ఆవరించినప్పటికంటె ఎంతో సక్రమమైన పద్ధతిలో ఈ వైవిధ్యగ్రహణశక్తి మనలో పెంపొందును. కాని యీ వైవిధ్యము … వెనుక, దాని యంతరమున నివసించి యున్న పరిపూర్ణుని, అద్వయుని మనము నిత్యమూ దర్శించుచునేయుందుము. ప్రతి అభివ్యక్తి విశేషమునకు ఏ వివేకవంతమైన ప్రయోజనము కలదో, ఏ …వసరమును పురస్కరించుకొని ఆ అభివ్యక్తి జరుగుచున్నదో … పూర్వకముగ మనకు తెలియునగుచునే యుండును. …వేళ అది అట్లు స్ఫురించక మరుగుననే యుండు పక్షములో అద్వయునినిగురించిన దృఢవిశ్వాసమైననూ మనలో పెంపొంది యుండును. మన మానవ ప్రమాణముల ననుసరించి చూచినచో ఆ అభివ్యక్తి సమగ్రము సామరస్యపూర్వకము, లేక అసమగ్రము అపక్వము, లేక అనృతము అశివము, — ఇట్లీవిధముగా గన్పట్టినను గన్పట్టవచ్చునుగాక!

సమస్తమైన సంఘటనలు గూడా దైవాభివ్యక్తిలే

ఇదేరీతిని జయాపజయములు, మానవమానములు, కీర్త్యపకీర్తులు, సౌభాగ్య

దౌర్భాగ్యములు మొదలు సుఖదుఖఃకర సంఘటన లన్నిటియెడ లను గూడ ఆత్మయందు మనస్సునందు ఒకే సమభావమును మనయందు నెలకొనియుండును. ఏలయన, సకల కర్మలకు, కర్మఫలములకు ప్రభువైన ఆ పరమేశ్వరుని సంకల్పమునే అన్ని సంఘటనలలోనూ మనము దర్శించుచుందుము. క్రమవికాస పూర్వకమైన పరమేశ్వరాభివ్యక్తి యందలి ఒక విన్యాసవిశేష ముగామాత్రమే ప్రతిసంఘటనయు మనకు పొడగట్టును. చూడ నేర్చినచో చూపుగలవారికి ఆ పరమేశ్వరుడే, వివిధశక్తుల క్రీడ యందును, వాటి ఫలితములయందును, అట్లే వివిధవస్తువుల యందును, ప్రాణులయందును తనను దా నభివ్యక్తము గావించు కొనుచుండును

ఒక దివ్యసాఫల్యసిద్ధి దెసకే సకల వస్తుజాతము ప్రయా ణించుచున్నది. ప్రతి అనుభవము, – సుఖము దుఃఖము, తృప్తి, అతృప్తి, – అన్నియు ఈ జగదుద్యమము నిర్వహణమునం దావశ్యకములైన గతివిశేషములే. వాటిని అవగాహన మొనర్చు కొని బలపరచుటయే మనము చేయవలసిన పని. తిరుగుబాటు చేయుట, తెగనాడుట, గోలయొనర్చుట, – ఇవి మన అసంస్కృత, అజ్ఞానప్రవృత్తుల లక్షణము. తిరుగుబాటనుదానికి జగల్లీలలో తదితరములన్నిటికివలెనే ఉపయోగములును కలవు. తగిన సమ యము, సన్నివేశము ఏర్పడినప్పుడు, ఈశ్వర నిర్దిష్టమైన పురో గతికి తిరుగుబాటు ఆవశ్యకము, సహాయకము, విధాయకము గూడ నగుచున్నది. కాని, అజ్ఞానపూర్వకమైన తిరుగుబాటు ఆత్మయొక్క శైశవదశకు, అపరిక్వమైన కౌమారదశకు సంబం ధించినది. పరిపక్వస్థితికి వచ్చిన ఆత్మ దేనినీ తెగనాడక, అవ గాహనమొనర్చుకొని స్వాయత్తము గావించుకొనుటకు ప్రయ త్నించును. గోల యొనర్చుటకు బదులు స్వీకరించి పరిస్థితిని మెరుగుపరచుటకు, నిర్దుష్టము గావించుటకు పాటుపడును. ఆంతరంగికముగ తిరుగుబాటొనర్చుటకు మారు విధేయమగుచు, పరివర్తన పూర్వక సాఫల్య సిద్ధికి కృషిసల్పును.

ఆత్మ పరిపక్వతా లక్షణములు

కావున పరమేశ్వర హస్తములనుండి సకల వస్తువులను సమభావమున స్వీకరించుటకు మనము సంసిద్ధులమై యుందుము. అంతిమ దివ్యవిజయముసిద్ధించు ఘడియ వచ్చునప్పుడంతయూ జయమువలె అపజయమును గూడ నొక మజిలీగా పరిగణించి గ్రహింపనేర్తుము. దైవ నిర్ణయానుసారముగా ఎంతటి తీవ్ర దుఃఖములు, బాధలు, సంకటములు సంప్రాప్తమైనను, మన ఆత్మలయందు, మనస్సులయందు, దేహములయందు ఏమాత్రమూ చలింపక నిలువబడుదుము. అట్లే ఎంతటి ప్రబల సుఖ సంతోష సమయములలోనైననూ ఉబ్బితబ్బిబ్బుకాకుండ మెలగనేర్తుము. సమున్నతస్థాయిని యీ రీతిగా మనము చిక్కబట్టుకొని మన ప్రాణకోశములో సకలవస్తువులనూ సమానమైన స్థిరభావమున స్వీకరింపగలుగుదుము. పిమ్మట ఇంతకంటెగూడ ఉదాత్తస్థితి నందుకొని సమర్థులమై, పరమము, విశ్వజనీనమునైన దివ్యానందలోకానికి సైతము ప్రవేశము గావింతుము.

మూలము: శ్రీఅరవిందులు
అనువాదము: కమలాకర వేంకటరావు

సమత అనగా ఏమి? – III

ఏ పని చేయకుండా, మౌనముద్రాంకితుడై, నిరాసక్తంగా, ఏమి పట్టించుకోకుండా చేతులు కట్టుకొని కూర్చోవటం సమత అనిపించుకోదు. మీకు జరిగే వ్యవహారములన్నిటిని నిస్పృహా పూర్ణమైన వ్యక్తిగతదృష్టితో కాకుండా, ఏమాత్రం చలించని విశ్వ జనీనదృష్టితో చూడాలి. సర్వాన్ని సాక్షిదృష్టితో గమనించాలి. లోకంలో జరిగే ప్రతి చిన్న సంఘటన వెనక అచంచలమైన ప్రశాంతత, విశాలదృష్టి, సర్వమును భరించగల సామర్థ్యము,

పరమానందములు ఉన్నవని గ్రహించాలి. మనస్సు యొక్క పాక్షికదృష్టి నుండి విముక్తమై రసానుభూతిని పొందాలి.

— సంపాదకుడు

మనిషి తన ఇష్టాయిష్టాలను బట్టి బాహ్యావ్యవహారములకు స్పందిస్తాడు. కాని జీవితం ఇంతటి తోటే సరికాదని యోగం మనకు చెపుతుంది ప్రపంచంతో సంబంధాన్ని ఇంతకంటె మేలుగా తీర్చి దిద్దవచ్చు. అనగా కదలకుండా మెదలకుండా అహింసావ్రతాన్ని ఆచరించి కూర్చోటం కాదు. జీవితాన్ని ఆధ్యాత్మిక దృష్టితో దర్శించి తదనుగుణంగా ప్రవర్తించినప్పుడు ఈ జీవితము, ఈ శరీరము కూడా దైవానికి చక్కటి ఉపకరణములు కాగలవు. మానవజీవితాన్ని దివ్యజీవనంగా మలచేమంత్రము ఇదే ఈ మర్మము నెరిగినపుడు ఆత్మయే జీవితమును నిర్దేశించగలదు. జీవితం ఈ విధంగా పూర్తిగా వశమైనప్పుడు మానవప్రకృతి దివ్యప్రకృతిగా మారుతుంది.

*

సమత అనగా సహనం మాత్రమేకాదు. అయితే మనిషిలో సమత సుస్థిరంగా పాదుకొనినప్పుడు ఆతనికి అపరిమితమైన ఓరిమి సహనము కలుగవచ్చును.

*

అపజయాన్ని జడునివలె ఆమోదించడం సమతలో భాగం కాదు. ఉదాహరణకు, సాధనయందు ఒక ప్రయత్నం తాత్కాలికంగా విఫలమయినా కూడ సమతను నిలుపుకోవాలేగాని, వ్యధకు, నిరాశకు లోను కాగూడదు. దైవేచ్ఛ అనుకొని అపజయాన్ని ఆమోదించ గూడదు ఆమోదించి ప్రయత్నానికి స్వస్తి చెప్ప గూడదు. అంతకంటె నీవు అపజయానికి హేతువును, అర్థమును కనుగొని, విశ్వాసంతో విజయం దిశగా పురోగమించాలి. అనారోగ్యంతో గూడ అలాగే వ్యవహరించాలి. — భయముతో అశాంతితో చలించిపోరాదు; అనారోగ్యం భగవదేచ్ఛయే అని భావించ రాదు కింతు అది శరీరం యొక్క ఒక దోషమని తలంచి ప్రాణిక

దోషాలను గాని, మానసిక భ్రమలనుగాని వదిలించుకోడానికి ఎలా ప్రయత్నించుతావో, అలాగే రోగాన్ని సైతం వదిలించుకోడానికి ఉద్యమించాలి.

*

సమత అనగా అహంకార రాహిత్యము గాదు. కోరికల రాహిత్యము. వ్యామోహము లేకుండుట. మనిషి తత్త్వాన్ని బట్టి అహంకారము మాయమైనా పోవచ్చును. లేక తెర వెనక్కుపోయి దాగియుండవచ్చును – స్థూలంగానే సూక్ష్మంగానో

*

మానసికమైన ఔదాసీన్యాధికము గాదిచట గావలసినది. ప్రాణమయ ప్రకృతికి స్తబ్ధత్వమును గూర్చుటయుగాదు. ఏ కదలికయూలేక జడమై పడియుండగోరు అన్నమయచేతనా పరిస్థితియంతకంటెనూ గాదు. ఇవియే ఉత్కృష్టమైన ఆధ్యాత్మికస్థితి లక్షణములుగా నొక్కక్కప్పుడు భ్రమించుటయూ కలదు కాని, ఇచట గావలసినవి ఇవి కావు, ప్రకృతికి ఆవలనున్న సాక్షిచైతన్యపు సుస్థిర సువిశాల సర్వాత్మభావస్థితి కావలసియున్నది ఏలయన, ఈ ప్రకృతిస్థమైయున్న సమస్తమూ వివిధశక్తుల వ్యత్యస్త వ్యవస్థతో కలగాపులగమై కన్పట్టుచున్నది దీని కవతల దీని కాధారభూతముగా, ఒకానొక శాంతి గలదు, విశాలత కలదు. అది జడత్వరహితము. అందు సర్వశక్తులూ గర్భితములై యుండును. విశ్వ వ్యాపారమునంతనూ ధరించుటకు సమర్థమైన అచలాయతనమది

*

మనిషి దేనియందు సర్వాన్ని – శత్రువులను, మిత్రులను సైతం – సమంగా చూస్తాడో అలాగే మనుషులుచేసే దానికి, స్వయంగా జరిగే సంఘటనలకు చలించడో, అట్టి పరిపూర్ణ సమతావస్థను స్థాపించుకోవడం సాధ్యమే. కాగా ప్రశ్న ఏమిటంటే, మననుంచి అపేక్షించబడేది ఈమాత్రమేనా? ఈ మాత్రమే అయితే, అపుడు ప్రతివిషయం పట్ల ఒక నిష్క్రియ ఉదాసీనతయే సరిపోతుంది. కాని పరిపూర్ణ, ఆత్యంతిక (absolute) సమతను ఒత్తిచెప్పే గీత ఇంకా

ఎంతో ముందుకు పోతుంది – "సమరము సల్పు, శత్రువును సంహరించు, విజయం సాధించు" అని ఉద్బోధించుతోంది. ఎవ్విధ మైన కర్మను కోరకపోతే, అనృతానికి ప్రతిపక్షమైన సత్యంవైపు వహించనవసరం లేకపోతే, స్వీయ సాధనకోసం మాత్రమే సత్యాన్ని పాటించితే, సార్వత్రిక సత్యం జయించాలనే సంకల్పం శూన్యమయితే, అపుడిక ఉదాసీనతా రూపమైన సమత సరి పోతుంది. కాని ఇక్కడ చేయవలసిన కర్మ ఒకటి ఉంది. స్థాపించ వలసిన ఒక పరమసత్యముంది. అయితే ఈ సత్యస్థాపనకు విరు ద్ధంగా దృశ్య వస్తువులను, వ్యక్తులను, క్రియలను తమ సాధనా లుగా ఉపయోగించుకోగల భయంకరమైన అదృశ్యశక్తులు మోహ రించి ఉన్నాయి. ఎవ్వరైనా సత్యోపాసకులైన శిష్య బృందంలో ఉంటే, అతడు సత్యపక్షం వహించి, దానిపై దాడి చేసి, దాని గొంతు నులిమి చంపజూచే శక్తులకు ఎదురుగా నడుంకట్టి నిలబడాలి. *అర్జునుడు ఏ పక్షమూ వహించ గోరలేదు. తనను చంపవచ్చిన వారిపై సైతం బాణంవేయడానికి నిరాకరించాడు.* ఇట్టి స్థితిలో సమతను అంత గట్టిగా ఒత్తిచెప్పిన శ్రీకృష్ణుడే "అతని వైఖరిని ఖండించి, అంత గట్టిగాను శత్రువుపై విజృం భించాలని పట్టుబట్టాడు" – సమత నవలంబించు, సత్యాన్ని స్పష్టంగా చూస్తూ, సమరం సల్పు" అని ఉత్సాహపరిచాడు.

కావున సత్యపక్షపాతం, అనగా సత్యంయొక్క పక్షం వహించడం, దాడిచేసే అనృతానికి (falsehood) లవలేశం కూడ ఇవ్వ నిరాకరించడం, వెనుకాడని సత్యానురక్తితో, శత్రువులను, ఆక్రమణదారులపై విజృంభించడం – ఇవి సమతతో అసంగతం కావు. మనం విసర్జించవలసింది స్వకీయ, అహంకారిక వికారం మాత్రమే, నిరాకరించవలసింది ద్వేషం, మత్సరం మాత్రమే. సత్యనిబద్ధత, ఆక్రమణపరులతోను, అహితులతోను రాజీపడ నిరాకరించడం, అలాగే వాళ్ళ భావాలు మరియు కోరికలపట్ల మోజుపడి, "ఇంతకూ వాళ్ళు మననుంచి ఏమి అపేక్షించుతున్నారో, దానితో రాజీపడవచ్చు" నని చెప్పకపోవడం వారిని మన సహ చరులుగాను, స్వకీయులుగాను అంగీకరించకపోవడం – ఈ విష

యాలకు ఎంతో ప్రాముఖ్యముంది ఈ అహిత శక్తులదాడి కర్మపైన, కర్మకర్తలపైన, వీరి నాయకులపైన ఒక భౌతిక ఉపద్రవమే అయితే, ఎవరైనా దానిని ఇట్టే చూడగలరు. పోతే ఈ దాడి ఒక సూక్ష్మ ప్రకారానికి చెందినది కాగా, దానిని స్పష్టంగా చూడలేనపుడు, ఒక ఉదాసీనత సముచిత వైఖరి అవుతుందా? కాదు. ఏలన సత్యోపాసకులు చేయవలసింది ఒక అంతర్ముఖ మరియు బహిర్ముఖయుద్ధం, ఉదాసీనత, లేక రాజీ, లేక నిష్క్రియతచేత సైతం శత్రుశక్తులకు దారి ఇచ్చి, సత్యాన్ని, దాని సంతానాన్ని మట్టుబెట్ట అవకాశం కల్పించినట్లు అవుతుంది. దీనినంతనూ ఈ దృక్కోణం నుంచి చూచినపుడు, ఆంతర ఆధ్యాత్మిక సమత సముచితమయితే సత్యమందు సక్రియ భక్తి, దృఢంగా సత్యపక్షమవలంబించడం అంతగాను సముచితమని, ఇవి రెండూ అసంగతం కాజాలవని నీవు చూడగలుగుతావు.

పైన దీనినొక సామాన్య సమస్యగానే నేను చర్చించాను, ఏ ప్రత్యేక సందర్భాలు లేక స్వకీయ (personal) సమస్యల లోనికి నేను దిగలేదు సమతతో గూడిన ఈ సక్రియతకు దాని సముచిత ప్రకాశమందు, సముచిత సంబంధములందు చూడాలి

*

హృదయదాస్యం నుంచి, మనోదాస్యం నుంచి విముక్తి: కర్మ, అకర్మల గురించి చెప్పినసంగతి, మరొక ద్వంద్వానికి సైతం సరిపోతుంది. ఆ ద్వంద్వం ఏమంటే, భావప్రధానమైన మన మనస్సులో ఒకవైపు తటస్థభావం, స్థిరభావం ఉండవచ్చు, మరో వైపు సక్రియ ప్రేమభావం, ఆనందభావం ఉండవచ్చు. కానీ, మనకు ఆధారభూమి కావలసింది, సమత్వంగాని, తాటస్థ్యం కాదు. సమత్వంతో నిండిన తితిక్ష (endurance సహింపు, ఓర్పు) పక్షపాతం లేని తాటస్థ్యం, హర్షం, లేక శోకం కలిగినప్పుడు, వాటిపట్ల హర్షం, లేక శోకరూపంలో ఏవిధమైన ప్రతిక్రియ చేయకుండా శాంత సమర్పణం – ఇవన్నీ సమత్వానికి మొదటి సోపానాలు, అభావాత్మకాలైన ఆధారాలు. సమతాభావం ప్రేమ, ఆనందాల రూపం ధరించనంతవరకూ, ఇది (సమత్వం) పరి

పూర్ణం కాజాలదు. ఇంద్రియాశ్రిత మానసం అన్నిటిలో సర్వ సుందరానికి సంబంధించి సమానరసం పొందాలి. హృదయం అన్నిటికోసం, సమప్రేమను, అనుభూతిని పొందాలి. చైత్య (సూక్ష్మ) ప్రాణం సర్వత్ర ఈ రస, ప్రేమానందాన్ని ఆస్వాదించాలి. కానీ ఇది ముక్తి ద్వారా మాత్రమే లభించే భావాత్మక పరిపూర్ణత. జ్ఞానమార్గంలో మన మొదటి లక్ష్యం వస్తుతః ముక్తిని సాధించటం. అది కామనామయమైన మనస్సునుంచి మనను నిస్సంగంగా ఉంచుకోవటంవల్ల, దాని వాసనల్ని (సంస్కారాల్ని) పరిత్యాగం చేయటంవల్ల మాత్రమే లభిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: సిహెచ్. నాగేశ్వరరావు (యోగంపై లేఖలు); కమలాకర వేంకటరావు (యోగసమన్వయం); జనస్వామి సుబ్రహ్మణ్యశాస్త్రి (యోగసమన్వయం)

సమత – సాధనకు మూలాధారం

నీకు సమత ఎక్కణ్ణుంచి వస్తుంది? – పైనుంచి. మానవాతీతమైన ఉన్నత చైతన్యము నీలోకి దిగివచ్చినప్పుడు నీ చేతన గూడా ప్రశాంతమై చెక్కుచెదరని సమతాభావముతో విరాజిల్లుతుంది. నీలో వేరుభావము పోయి సర్వాత్మనా భావము భాసిస్తుంది. ఇక నీ దృష్టే వేరు. నీలో శ్రీమాత సాన్నిధ్య సంభరితమైన మహాచైతన్యము వృద్ధిపొందుతుంది. ఇక నీ సాధన ఎట్టి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా నడిచిపోతుంది. నీలో కొన్ని అవసరమైన మార్పులు సంభవిస్తాయి. వ్యక్తుల ప్రవర్తన, సంఘటనల ఆంతర్యము నీకు స్పష్టంగా అవగాహనమవుతాయి.

– సంపాదకుడు

పరిస్థితులు వికటించవచ్చు. మనుషులు అసహ్యంగా ప్రవర్తించవచ్చు. కాని నువ్వు మట్టుకు ఏ మాత్రం స్పందించకుండా దర్జాగా వుండాలి. *సమత వల్ల సాధనకు గట్టి పునాది ఏర్పడుతుంది. నీ సమతను పరీక్షించేందుకే సంకటాలు వస్తూవుంటాయి.* ఎందుకంటే పరిస్థితులు అనుకూలించినప్పుడు, మనుషులు సౌమ్యంగా ప్రవర్తించినప్పుడు నువ్వు శాంతంగానే వుంటావు. పరిస్థితులు ఎదురు తిరిగినప్పుడు ప్రశాంతత చెదిరిపోకుండా ఎంత మాత్రం నిలబడగలవో అనేదే ప్రశ్న. నిలబడగలిస్తే మంచిదే. లేని యెడల నీ స్థాయిని పెంచుకోవాలన మాట.

*

ఆధ్యాత్మిక చేతన అనగా బాహ్యప్రేరణలకు అతీతంగా ఉండుట. సమతయే ఆ చేతనకు మూలాధారం. మాటలలో గాని, చేతలలో గాని ప్రాణికపు వేధింపులకు లొంగిపోయినప్పుడు నీ చేతన చెదిరిపోయిందన మాట.

*

సమత్వము కేవలం మానసికంగా వుంటే చాలదు. *ప్రాణిక భౌతికము నందెల్లెడల వ్యాపించాలి. పైనుంచి ఆధ్యాత్మిక శక్తి, ఆనందము సాధకునిలోకి దిగివస్తాయి.* కాని వాటిని గ్రహించేందుకు, తట్టుకుండేందుకు, నిలబెట్టుకుండేందుకు అత్యుత్తమ స్థాయిలో సమత స్థిరపడాలి.

*

ఈ సమత ఎక్కడి నుంచి వస్తుంది? పై స్తరముల నుండి చేతనాప్రవాహం సాధకునిలోకి దిగినప్పుడు వస్తుంది. ఒక వేళ సమత లోపించినట్లయితే అధోస్తరముల నుండి క్షుద్రతరంగాలు నీ మీదికి దండెత్తివచ్చి నీ ప్రశాంతతను భంగపరుస్తాయి!

*

నీకు కలిగిన అనుభూతి చాలా విలువైనది. ఎటుపక్క చూసినా సమతయే రాణించే ఈ చేతన సమకూరినట్లయితే అది యోగచైతన్యానికి — శ్రీమాత సాన్నిధ్యముతో నిండివున్న చైతన్యానికి గట్టి పునాది అవుతుంది. దానిని స్థిరపరచుకున్నట్లయితే ఇక

సాధనను గురించి ఎట్టి సమస్య వుండదు. మానవప్రకృతి క్రమేపి అభివృద్ధి చెంది ఎట్టి అవరోధము లేకుండా దివ్య మార్గంలో పురోగమిస్తుంది. ఆ నూతన చేతనా వెలుగులో మనుషుల ప్రవర్తనా, స్వభావము, పరిస్థితులకు గల కారణాలు చక్కగా అవగాహన అవుతాయి. ఇక కర్మాచరణకు ఎట్టి అడ్డంకు వుండదు.

*

సమత, ఏకత యోగచైతన్యము యొక్క రెండు గంభీరావస్థలు. ఒకటి అత్యంత వైశాల్యము గలది. రెండవది ఆకాశాన్నంటునది.

The highest strove to neighbour eternity,
The largest widened into the infinite.

ఆత్మయందూ, బుద్ధియందూ, హృదయమునందూ పూర్ణ సమత్వమును సంపాదించి, సకల భూతములతోడనూ ఏకత్వము భజించెడి, – సకల భూతములలోనూ తన్ను దా నభివ్యక్త మొనర్చుకొనుచున్న పరతత్త్వముతో ఏకత్వమును భజించెడి, – నిజస్వరూపమును గాంచగలుగుదుము. ఇట్టీ సమత్వమునూ ఏక త్వమునూ పునాదులుగా చేసికొనగలిగినప్పుడే, మనము దివ్య రూపులమూ, దివ్యచేతనులమూ, దివ్యకర్ములమూ కానేర్తుము. సకలముతో ఏకత్వము పొందనంతవరకూ ఆధ్యాత్మికముగా మనకు దివ్యత్వము లేదు. సకల వస్తువులయెడలనూ సమత్వము కుదరనంతవరకూ మన దృష్టీ, మన జ్ఞానమూ దివ్యములు కానే రవు. ఇతరుల యెడ మనము దివ్యభావమున వర్తింపనేరము.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: ఆర్.ఎల్.ఎల్. శాస్త్రి; కె. వేంకటరావు
(యోగసమన్వయము)

సమత ఆవశ్యకత

మానవప్రకృతిని దివ్యప్రకృతిగా పరిణమింప జేయుటయే యోగము. మన ప్రతియొక కదలిక, దృక్కోణము మారుటకు స్థాపితమైన శాంతి సమతలు అత్యావసరములు. అవి లేనిచో మనము దివ్యకర్మలను చేయజాలము. లౌకిక కార్యములను కూడ సక్రమంగా నిర్వహింపజాలము. సాధకుడు దైవేచ్ఛ నెరిగి దానిని పరిపాలించుటకు ప్రయత్నిస్తాడు. తన అల్పప్రకృతి నుండి పెరిగి విశ్వవ్యాప్తమైనప్పుడు దేవుని హస్తములో ఒక చక్కని ఉపకరణమై దైవకార్యమును నిర్వహించగలుగుతాడు.

— సంపాదకుడు

ఆధ్యాత్మిక శిఖరాల నధిరోహించాల్నంటే మొదట నీ ప్రకృతంతా సమతా పరివ్యాప్తమై వుండాలి. నీలో ఎటు చూసినా సమత్వమే రాణిస్తూ ఉండాలి. అపరాప్రకృతి నుండి దివ్యప్రకృతిగా పరిణమించుటయే యోగము.

సక్రమ పద్ధతిలో సాధన చేస్తూ బాహ్యాచేతనావస్థను అధిగమిస్తూ స్వర్గసామ్రాజ్యాన్ని కైవసం చేసుకోవచ్చు. దివ్యత్వాన్ని సాధించడమే సాధన పరమలక్ష్యం.

అపరిపక్వ మనోస్థితి నుండి విముక్తమై ఆత్మశాంతిని పొందాలంటే అన్నిట, అంతట సమభావంతో జీవించడమే ఏకైక మార్గం. సర్వసాధారణ కర్మలను నిత్యజీవితంలో ఆత్మప్రేరణకు అనుగుణంగా ఆచరిస్తే అవి విశ్వపురుషునికి ప్రీతిపాత్రములవుతాయి.

సమత్వబుద్ధితోనే సత్కర్మలు జరుగుతుంటాయి. సృష్టి, స్థితి, లయాదులన్నీ దివ్యలీలలే. అవన్నీ పరిపూర్ణ సమభావనతో జరుగేవే! అంతేగాని ఏ ఒక్కదాని పట్ల పక్షపాతం, ద్వేషం, విసుగువంటి వాటివల్ల జరిగేవి కావని మనమంతా గ్రహించాలి.

సృష్టిలోని చిన్న, పెద్ద జీవకోటి అంతా ఒక క్రమపద్ధతిలో ప్రవర్తిల్లుతుంటుంది. ఆయా జీవరాసుల యోగ్యత, ప్రకృతి

అవసరాలకు అనుగుణంగా జరుగుతున్నది ఈ "దివ్యరచనా విలాసం" ఒక ఉత్కృష్ట ప్రయోజనంకోసం జరిగే జీవపరిణామం (పెరుగుదల) అనేకానేక పురోగమన, తిరోగమనలు దాటుకుంటూ ఒక పరమోత్కృష్టస్థితికి "ఆత్మ" క్రమేణా ఉద్ధరింపబడుతుంటుంది. ఇది అతిసహజంగా జరుగుతుంది.

కాని ఆత్మోద్ధరణ స్వయంకృషితోనూ సుసాధ్యమే. అయితే సాధకుడు అహంకారం వదలి దైవలక్షణాలను పెంపొందించుకోవలసి ఉంటుంది పరమాత్మకు ప్రీతిపాత్రంగా తన స్వభావాన్ని సంస్కరించుకొని పరమాత్మ చేతిపరికరంగా సాధకుడు మారవలసి ఉంటుంది అంటే సాధకుడు నిమిత్తమాత్రంగానే దైనందిన జీవితంలో వ్యవహరిస్తుంటాడన్నమాట. క్రమంగా దైవ కటాక్షం ప్రసరించటం ద్వారా సాధకునికి సమత్వభావం ఏర్పడుతుంది.

'పూర్ణయోగ' సాధకునికి 'సమత్వభావం' అత్యంత ఆవశ్యకము. తన ప్రమేయం లేకుండా దైవశక్తి అతడి కార్యకలాపాలను సునాయాసంగా సాగిస్తుండటం అనుభవంలో అర్థం చేసుకుంటాడు. దేవుని పరికరాలుగా భావించుకుంటూ "సర్వత్ర సమబుద్ధయః" అన్నట్లు విశ్వైకభావనతో అట్టివారు జీవిస్తుంటారు. అంతట నిండియున్నది భగవత్‌శక్తి అని వారు గ్రహిస్తారు. కాల నియమాన్ని గమనిస్తూ వాస్తవికదృష్టి కలిగి దైవకృపకు సదా పాత్రులుగా ఉండాలి.

అవ్యక్తిత్వ (impersonal) భావనయే దీనికి పునాది. ఒక విశ్వప్రణాళికకు అనుగుణంగా పరిణామ ప్రక్రియ నిరంతరం సాగుతుంటుంది. మొదట అది అసందర్భంగా కష్టతరంగా కనిపించినా క్రమంగా పురోగతి చెందుతూ నిగూఢ నిజాన్ని వెల్లడిస్తుంది.

పూర్ణసాధకుని ఆత్మ ఈ పరిణామాన్ని త్వరత్వరగా సాగేలా చూడాలి. ఇందుకు దైవనిర్దేశితమైన ప్రకృతిశక్తులు వాని యందు తమ ఆత్మదర్శనాన్ని చేస్తూండాలి. అన్ని మానవకార్య

కలాపాల్లో ఈ సమభావన కలిగినప్పుడే సాధకుడు పూర్ణత్వం పొందినట్లు.

మూలం. శ్రీఅరవిందులు

అనువాదం పొక్కులూరి భగవద్గీతా సుబ్బారావు

ప్రాణశక్తిలో (VITAL) సమత

అంతరాత్మ – బాహ్యాప్రకృతుల సమస్థితే యోగపరిపూర్ణత. ఈ రెంటిలో వ్యత్యాసాల వల్లనే అనేక సమస్యలు వస్తుంటాయి. సర్వసమానత్వభావన ముక్తికి సోపానం. విశ్వాత్మతాభావనతో కోర్కెలకు కళ్ళాలు వేసి ఉద్రేకాలనే సుడిగుండంలో చిక్కుకున్న ఆత్మను బాహ్యాప్రకృతితో సంలీనం చేస్తే జీవితానికి అర్థం పర మార్థం ఏర్పడతాయి కోరిక బంధాల వలన కలుగుతుంది. అందువల్ల ప్రాణశక్తి కలుషితమవుతుంది స్వేచ్ఛగల ప్రాణశక్తి అంటే శీతోష్ణ సుఖదుఃఖాలను, అయిష్ట, అసంబద్ధ పరిస్థితులను నిశ్చలబుద్ధితో స్వీకరించి విశాలభావాలుగా మలుచుకోవడమే. అదే గొప్ప అనుభవం దివ్యానుభూతి. మనకు తారసపడే స్థితు లన్నీ ఏదో మనకు తెలియని కారణాలవల్ల కలుగుతవి. కనుక వాటిని ఏవగింపు లేకుండా స్వీకరిస్తూ పోతూంటే ప్రాణశక్తి పరిశుద్ధమవుతుంది. సన్యాసి లేదా యోగి తన కోర్కెలను ఒక దివ్యప్రణాళిక వైపు మళ్ళిస్తున్నట్లు అర్థం చేసుకోవాలిగాని వాటిని అణచి వేస్తున్నట్లు కాదు కావలసిందల్లా కోర్కెలను నిర్మూలించడం కాదు, వాటిని ఆత్మోన్ముఖం చేయడం. ఆత్మా నందం కేవలం స్వీయానుభవం. యోగసాధనతో అట్లు సాధిం చిన దివ్యానుభూతి బాహ్యా దేహసంబంధ అనుభూతుల కంటె మించినది శాశ్వతమైనది. నిరపాయకరము. బాహ్యాప్రపంచము నందు పొందే అనుభవాలు క్షణికములు. అహంకార ప్రేరిత ములు. అవన్నియు 'పరిగ్రహము' వల్ల ఏర్పడతాయి. "త్యక్తేన భుంజీథాః" అన్న శాస్త్రప్రమాణం కోర్కెలను, బాహ్యావస్తువుల

యందు వ్యామోహమును వదిలించుకొని, అహంకారమును త్యజించినట్లయితే ఆత్మకు పరమాత్మానుభవం విశ్వశ్రేయము కలుగతవి.

మూలం. శ్రీఅరవిందులు

అనువాదం పొక్కులూరి భాగవతుల సుబ్బారావు

హృదయంలో సమత్వం

బుద్ధికంటె లోతైనది హృదయం. ఆవేశాలకు ఆవేదనలకు నిలయము. గాఢానుభూతులకు ఆలవాలము. సాధకుని జీవితంలో సమతానిష్టమైన మనస్సు ఎంత ముఖ్యమో సమతాప్రతిష్ఠితమైన హృదయము గూడ అంతే ముఖ్యము. ఇంకా ఎక్కువ ముఖ్యమే. అందుకని సాధకుడు నిరంతరం ఆటుపోటులకు తల్లడిల్లి పోయే ఈ హృదయాన్ని మచ్చిక చేసుకొని తన వైపుకు తిప్పుకుంటే మంచిది. అప్పుడది సాధనకు మహాశక్తివంతమైన ఒక చక్కటి ఆయుధము కాగలదు. – అనువాదకుడు

> *ఆవేశము హృదయము యొక్క మూలప్రకృతి కాదు*

పెనుతుపాను వంటి ఉద్రేకాల దాడులకు లోనై హృదయం వేదన జెందుతుంది. అందుకని హృదయంలో కూడ సమత నెలకొనాల్సిందే. శోకము, క్రోధము, జుగుప్స, భయము, ప్రియాప్రియములు, సుఖదుఃఖములు సమహృదయమును అంటవు. అప్పుడు హృదయేంద్రియము ఉదాసీనమై, విశాలమై, పక్షపాత రహితమై దివ్యకాంతులతో వెలిగిపోతుంది మనిషి యొక్క ఉద్రేకాలు, ఆవేదనలు అతని మూలప్రకృతికి చెందినవి కావు. కేవలం అతని ప్రస్తుతావస్థకు చెందిన వికారములు మాత్రమే. అతని మనస్సు, ప్రాణికము బాహ్యప్రపంచముతో నెరపెడు సంబంధములు మాత్రమే. మనలోని అహంకారదృష్టియే వీనికి కారణము – విశాలవిశ్వము

నుండి మనని వేరుపరచి మనకో చిన్న ఇంటిని ఏర్పరుస్తుంది. మళ్ళీ దైవంతో – మనలోని దైవంతోను, విశ్వంలోని దైవంతోను – ఐక్యమైనప్పుడు *ఈ పరిస్థితి వెనుతిరుగుతుంది. దివ్యతత్త్వములైన శాంతి శక్త్యానందానుభూతులలో మన వేర్పాటు భావము కరిగిపోతుంది.*

చైత్యపురుషుని పాత్ర

మన అగాధములలో వెలుగుతున్న చైత్యపురుషుడే మనకీ ఆనందమును ఇస్తాడు. బాహ్యస్పర్శలను అన్నింటినీ ఆనందముగా పరిణమింప జేస్తాడు. మన పై పొరల్లో చెలరేగే ఆవేశాల నుండి మనను దూరము చేసి మన విరాట్స్వరూపమునకు ద్వారములు తెరుస్తాడు. అట్టి దివ్యస్ఫూర్తి కలిగినప్పుడు మన ఆవేశములు కూడ దివ్యస్పందనములుగానే పరిణమిస్తాయి. హృదయము విముక్తమై, స్వేచ్ఛగా ప్రవర్తించి దివ్యానుభూతులను కలిగిస్తుంది.

ప్రపంచాన్ని ప్రేమతో దర్శించుట

అయితే ఇది భావోద్రేకాలను చంపివేసే సన్యాసం గాదు. ఆత్మాభివ్యక్తిని అణచివేసే జడత్వం అంతకన్నా కాదు భావోన్నతిజెంది దివ్యపరిణామము జెందుటయే ఈ యోగపు లక్ష్యము. బాహ్యజీవితములో సంభవించే భావోద్రేకాలన్నీ తర్వాత దివ్యజీవనంలో వాటి నిజరూపములను పొంది దివ్యములుగా స్ఫురిస్తాయి. ఉదాహరణకు ప్రేమ వున్నది. అది సర్వవ్యాప్తమై తన యథార్థ రూపమును పొందుతుంది. దేవుని యందు ప్రేమగా పరిణమిస్తుంది.

ప్రపంచంలోని వస్తువులన్నీ నీ రూపములే అనియు – దైవము యొక్క ప్రతిరూపములు – ఆయన వివిధ శక్తులే అనియు అనుభూతమౌతుంది. స్వార్థమైన అహంకారాత్మకమైన చిట్టిపొట్టి సుఖదుఃఖాలను ఆశించక, కోపతాపాలు, అసూయలు, అల్పసంతోషాల బదులు ప్రేమ యొక్క విరాడ్రూపము ఆవిష్కార

మౌతుంది. ఆ విశాల ప్రేమలో దుఃఖానికి తావులేదు గాని సానుభూతి వుంటుంది. ఆ సానుభూతియే ఇతరులకు అవసరమైనప్పుడు సహాయపడి వారిని దుఃఖము నుండి విముక్తి చేయగలదు. ముక్తజీవికి కోపము, విరోధము అసంభవములు. కాని అవసరమైనప్పుడు రౌద్రరూపము దాల్చి కర్తవ్యపాలనము జేయగలడు. శత్రుసంహారము గావించి బాధానివారణము కావించగలడు. కష్టముల బారినుండి రక్షించగలడు. నాశనము చేసినను సానుభూతి చూపించి అది కూడ తను సృష్టించిన వస్తువే అని మరువడు. మనలో కలిగే పరివర్తనము ఈ విధంగా వుంటుంది. మనలోని ఆవేశ పరాయణత్వమంతయు బంధనాల నుండి విముక్తమై స్వేచ్ఛగా భాసిస్తుంది. సమత సంపూర్ణంగా నెలకొనినప్పుడే ఈ విధమైన మహాపరివర్తనము సాధ్యమవుతుంది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి; ఆర్. లక్ష్మీప్రసాదమ్మ

క్రియాశీలమైన సమత్వం

ఆధ్యాత్మిక జ్ఞానం సిద్ధాంతరూపంలో ఉంటే ఏం లాభం? అది క్రియాశీలం కావాలి. అయితే ప్రస్తుతం మానవుని వ్యావహారిక జీవితమంతా మనోప్రాణిక దైహికములచే పరిపాలింపబడుతోంది. ఈ పరిస్థితిని మార్చే ప్రయత్నమే యోగము. పూర్ణయోగి విషయంలో ఇది తప్పనిసరి. దీనికి సాధకుడు ఏం చెయ్యాలి? ద్వంద్వములను ద్వంద్వదృష్టితో గాక సమదృష్టితో చూసి సమాదరించాలి. ఆతని మనస్సులో దివ్యజ్ఞానమే భాసిస్తుంది. మానవేచ్ఛ దైవేచ్ఛగా పరిణమిస్తుంది. ఆతని తత్త్వమంతా దైవశక్తి ప్రేరితమై దైవకార్య నిర్వహణమునకు ఒక చక్కటి ఉపకరణంగా తయారౌతుంది. — సంపాదకుడు

మానవుని జీవితం ద్వంద్వాలకు ఆలవాలం

మన సంపూర్ణ క్రియాశీల వ్యక్తిత్వం – విషమ ప్రేరణల ప్రభావంలో చేష్టావంతమౌతున్నది. ఈ ప్రేరణలు మనలోని అజ్ఞాన క్షుద్రతలనుండి వ్యక్తమౌతున్నవి. వాటిని మనం పూర్తిగా అంగీకరించటమో – సాక్షికంగా నియంత్రించటమో – నిత్యమూ మార్పుపొందే తర్కయుక్తుల కనుగుణంగా – నైతిక సౌందర్య సూత్రానుగుణంగా మలుచుకోవటమో చేస్తున్నాం. మంచిచెడులకు, లాభనష్టాలకు, క్రమాక్రమాలకు నడుమనున్న ఘర్షణలకు లోబడిన ప్రయత్నాలూ – తర్కాతర్కాలు – నీతీ అవినీతులూ – గౌరవాగౌరవాలూ – అంగీకారాలు – అనంగీకారాలు – స్వకీయధర్మాలు – అసహ్యాలూ, దుఃఖమూ, అపకీర్తి – నైతికపతనం – వీటి సమాహారమే ఈ ద్వంద్వాత్మక ఘర్షణ జీవితం. ప్రస్తుతం ఇవి ఆధ్యాత్మికాభివృద్ధుల కవసరమన్న మాట నిజమే. అయితే పూర్ణసమగ్రతను కాంక్షించే యోగి వీటినుండి విముక్తుడౌతున్నాడు. వాటిని సమతాదర్శనంతో గ్రహిస్తూ క్రియావంతమైన తపస్సుతో – ఆధ్యాత్మిక శక్తితో, నిష్పాక్షిక విశ్వకర్మానుష్ఠానంతో – తన శక్తి సంకల్పాలను – పరిశుద్ధం చేసుకొంటూ – వాటిని దివ్యప్రశాంత దైవ కర్మానుష్ఠానాని కనుగుణ సాధనాలుగా మలుచుకోగలడు. ఈ క్రియాశీల సమత్వం వల్ల సాధారణ మానసిక ప్రమాణాల నుల్లంఘిస్తాడు. అతని సంకల్ప నేత్రం ఊర్ధ్వ దివ్యచేతనామూర్తిని దర్శించాలి. అప్పుడతని పవిత్ర చైతన్యం దివ్యజ్ఞాన ప్రబోధితమైన దివ్యసంకల్పశక్తికి యంత్రమౌతుంది. ఎంతవర కతనిలో అహంకార ప్రేరణలు భౌతిక – ప్రాణిక ప్రేరణలు సమూలంగా నశించవో అంతవరకు అతని నుండి దివ్యకర్మానుష్ఠానం జరుగదు.

మానవుడు దివ్యచైతన్యానికి ఉపకరణం కావాలి

కనుక సంకల్పంలో సంపూర్ణ సమత్వ మావిష్కృతం కావాలి. అప్పుడ

తని కర్మలకు అహంకృతి అడ్డురాదు కర్మల్లో అపవిత్రత ఆపాదితం కాదు ఈ సమత్వం క్షుద్రప్రేరణలకు స్పందించదు. మానసాతీత దివ్యకాంతి దర్శన ప్రేరణతో తపిస్తుంది. అతని నిర్ణయం వ్యక్తిగతం కాదు – అంటే అతని బుద్ధితో సాధించినది కాదు. కారణం అతని నిరీక్షణ అంతా పరతత్త్వ దర్శన సంబంధమైన ప్రేరణలకు – ఆత్మవికసనానికీ ఎదురు చూస్తుంది అందులోనే జీవిస్తుంది కనుక. అది అతిమానసిక చైతన్య ముఖంగా (Supramental being) ఎదుగుతున్న కొలదీ ఆత్మ బృహత్ స్థితికి విస్తృతమైన కొలదీ అతని క్రియాశీల స్వభావం పరిణతి చెందుతుంది. అతని ప్రాణికస్పందనలన్నీ దివ్యమౌతాయి. ఈ ప్రయాణంలో ఎన్ని ఆటంకాలు – ఎన్ని పతనాలు – ఎన్ని పాపాలు – దోషాలు – సాధనలను మలుచుకోవటంలో ఎంత అపరిపూర్ణత! కానీ అతని జీవాత్మ మాత్రం కృశించదు. నశించదు. వీటిని చూచి అసహ్యించుకోదు. బాధపడదు. ఎందుకంటే అంతశ్చైతన్యాధీనం కావడంవల్ల మనోతీతకాంతిబద్ధం కావటంవల్ల పరిపూర్ణ ప్రశాంతి వైపునకు దృఢనిశ్చయంతో ప్రయాణిస్తూనే వుంటుంది. సమగ్ర పరిణామం వచ్చేంతవరకూ అభ్యాస ప్రయత్నాలు విశ్లథాలు కావు. ఈ నిశ్చయానికి మూల స్తంభం గీతాస్వామి వాక్కు

"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః".

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం· తుమ్మపూడి కోటీశ్వరరావు

సర్వప్రకృతి గమనమూ అతని అనుభవంలో అగాధ ప్రశాంత సముద్రం పైన పొంగే – కృంగే కెరటం మాత్రమే. దేనికీ చలించదు. అతనికంతా ఒక ఆనందం, విశాల విశ్వ సమత్వం – అప్రమేయ పరమేశ్వర స్థితి

– శ్రీఅరవిందులు

మానసిక సమత్వము

ఈ దిక్కుమాలిన మనస్సు మనని ఓ మూల కట్టేసి పడే స్తుంది. ఎందుకంటె దానిది హ్రస్వదృష్టి, పాక్షికజ్ఞానము, భేద ప్రతిష్ఠితము. నిజానికి సత్యాసత్యాల, వెలుగునీడల ద్వంద్వ త్వము భ్రమయేగాని యథార్థము కాదు. జీవితంలో మనం మోసపోయాము అని అనుకుండేందుకు అదే కారణం. సమతా ద్వారమున మనమా భ్రమ నుండి బయటపడవచ్చు. అప్పుడు చీకటి కూడ వెలుగుయొక్క ఆచ్ఛాదమే అనియు, అజ్ఞానమనగా నాలుగుగోడల మధ్య బంధింపబడిన జ్ఞానమే అనియు, అస త్యము గూడ సత్యముయొక్క ఒకానొక విన్యాసమే అనియు స్పష్టమవుతుంది. అయితే మనస్సుయొక్క ఆలోచనా శక్తిని చంపేసి దానిని శిథిలపరచకూడదు. దాని స్వరూపము మట్టుకు పూర్తిగా మారిపోవాలి. అప్పుడు దాని అంతస్తు పెరుగుతుంది. అది దివ్యచైతన్యాన్ని గ్రహించ గలుగుతుంది. — సంపాదకుడు

మనస్సే ద్వంద్వాలకు మూలం

ప్రకృతిలో ఈ మానసిక సమత్వం చాలా ప్రధానమైనది. ఎందుకంటె అది సాధనముల సమగ్రతకు ఆధారం కనుక; మన నిర్ణయా లకు – నిశ్చయాలకు, – సిద్ధాంతాలకు, భావ నలకు – మొదలైన ఈ భౌద్ధిక (బుద్ధికి సంబంధించిన) ప్రాధా న్యాల కన్నిటికీ – వాటి యందు మనకున్న అనురక్తికీ గాను గెద్దు మనోజీవితానికీ మరీ మాట్లాడితే మన ప్రజ్ఞావంతమైన సత్యమనస్సు యొక్క పరిమితులకూ కూడా – అదే మూలం. ఐనా అది నిష్పాక్షికమైన సమదర్శనానికి, జ్ఞానాజ్ఞానాలకు, సత్యా సత్యాలకు, బద్ధమై అంగీకరిస్తునే ఒక సత్యజ్యోతి కున్ముఖంగా సాగిపోతుంది. ఈ సమబుద్ధికి మన బౌద్ధిక పక్షపాతం, కొంచెమో గొప్ప తర్కం, దర్శనం తోడ్పడుతాయి. అది అజ్ఞాన పంజ రంలో బంధింపబడిన జ్ఞానావిష్కృతికీ అసత్యంలో అణగారే సత్యావిష్కారానికీ ఆధారమౌతుంది. మన సాధారణ మనస్సేమో

దాగిన జ్ఞాన సత్యాలను దర్శించలేదు – ఆలోచనాశక్తికల బుద్ధి మాత్రమే ఆ పని చేయగలదు.

మనస్సు దివ్యకాంతులతో జ్యోతిర్మయం కావాలి

మరొక ప్రక్క అది (సమ బుద్ధి) తనకు తెలిసిన దాని తోనే సంతృప్తిపడదు. దానికి కాంతిమార్గాలలో ప్రయాణించే స్వాతంత్ర్యమున్నది. ఐనా సత్యాన్ని క్రూరంగా, నిరంకుశంగా ప్రస్తుత సూత్రాలకు లగించదు. ఆలో చనాత్మక మనస్సమత అవశ్య మాచరించదగ్గది. ఎందుకంటే దీని లక్ష్యం ఉన్నతకాంతి. అది ఆధ్యాత్మికదర్శన సంబంధ మైనది. ఈ సమత సుసూక్ష్మమూ, కఠినమూ, కనుకనే మానవ మనస్సునకు దూరమైపోతుంది. దాని శిఖరాదిరోహణం చేయా లంటే ఊర్ధ్వముఖీన ప్రయాణం చేసే మనస్సుపై అతిమానస జ్యోతిఃకిరణ ప్రసారణ (supramental light) జరగాలి. దీని కవ సరమైనది మేధాశక్తిలో సమతాదృక్పథం చెట్టు కట్టాలి. ఇది ఆ కిరణపుంజం మనస్సులోకి ప్రవేశించి తనపని తాను చేసుకోవ టానికి ముందే కావలసిన పదార్థం. ఇది కూడా అన్వేషణలకూ, మేధాశక్తి యొక్క విశ్వసంబంధ ప్రయోజనాలకూ – అడ్డుగోడ కారాదు. దాని యందాసక్తి వుండాలి. ఆత్మనాశనానికి దారితీసే సందేహాలతో నిండినది కారాదు. అనంతనిశ్శబ్దంలో ఆలోచనలను లీనం చేయటమూ కాదు – ఆలోచనల నరికట్టటం అభ్యాసంలో భాగమైనా, మనస్సు పాక్షికంగా వ్యవహరిస్తుంది కనుక దాని పరిధి నుండి – స్వేచ్ఛ ననుగ్రహించే ధ్యేయమందు ఏకాగ్రత ఉంటే అప్పుడు మనస్సు తదతీత కాంతికీ, జ్ఞానరాశికీ, కాలు వలు త్రవ్వుతుంది – జాలుతీస్తుంది. కనుక మనఃపదార్థం సర్వో త్కృష్టం కావాలి. లేకపోతే మన మనస్సుల్లో పరంజ్యోతి పాదు కొని దివ్యచైతన్యకర్మల కధీనం కాలేదు. అనంతనిశ్శబ్దం, పర బ్రహ్మసత్యం. దాని నుండి బహిర్గమించిన శబ్దమూ సత్యమే. ఈ శబ్దమే చేతన ప్రకృతిలో రూపధారణ చేసేది.

కానీ చివరకీ ప్రకృతి సమత్వమంతా అనంత తాత్త్విక సమత్వం సంపూర్ణ చైతన్య పురుషుని ఆవహించి అనంత విశ్వంలో దివ్యకాంతి, శక్తి, ఆనందాలు నిండి మానవునిలో అవతరించడం కోసమే.

•

మానవతత్త్వము పరా చైతన్యానికి వశమైపోవాలి

ఈ సమత్వం శాశ్వత సచ్చిదానంద సమత్వం. అమేయ పురుషుని సమత్వం. అది స్వయం సత్తాకం. నిత్యతత్త్వ సమత్వం. అది మనోహృదయాలను, సంకల్పాలను, జీవితాన్ని, భౌతికవ్యక్తినీ తన పరిధి లోనికి గుంజుకొంటుంది లేదా ఆవరిస్తుంది. అది వాచామ గోచరమైన తాత్త్విక చైతన్యంలోని సమత్వం. దానిలోనే ఆనందవాహిని దబకలాడుతుంది. ఆ కెరటాలే దివ్యజ్ఞాన స్వరూపాలు. ఆ సమత్వం దివ్య తపస్సంబంధమైనది. ఇది ప్రకృతిలో చైతన్యవంతమైన కర్మలను ప్రబోధించే దివ్యసంకల్పం. ఆ సమత్వం దివ్యానంద సంబంధమైనది. ఆ దివ్యానందం విశ్వక్రీడలో సౌందర్యలహరి, దివ్యప్రేమ, అనంతతత్త్వంలోని ఆదర్శవంతమైన ప్రశాంతత మన చేతనలోని విస్తృతాకాశ పథం. కానీ ఆ నిత్యతత్త్వంలోని ఆదర్శవంతమైన సమగ్ర కర్మ విశ్వసంబంధాలను ప్రకృతిలో స్థాపిస్తుంది. అదే మనలో తన శక్తిని వరదగా పొంగిస్తుంది. వర్షంగా కురిపిస్తుంది. సమన్వయ యోగమార్గంలో సమత్వమంటే ఇదే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు.

గీత ఇంకా ముందుకు దూకి సమత్వమంటే యోగమే నంటుంది. "సమత్వం యోగ ఉచ్యతే" అంటే సమత్వమంటే బ్రహ్మం సాయుజ్యం – బ్రహ్మంగా పరిణమించటం. ఆ మహాచైతన్యంలో – సముద్రంలో నదిలాగా కలిసిపోవటం.

శ్రీఅరవిందులు

విభాగం III:

సమతను సాధించుట ఎలా?

బహ్వాంశముల సంపుటి అయిన మానవునిలో సర్వసమగ్రంగా సమతను చేకూర్చటం శ్రమతో కూడిన పని. ఈ కార్యము సాధించుటకు దైవమే సమర్థుడు. అందుకని నిన్ను ఆయనకు సర్వాంగీణంగా సమర్పించుకొనుటయే మేలైన మార్గము. ఈ సమర్పణను మొదట హృదయమందిరంలో కావించాలి. ఫలితం కోసం ఓపిక పట్టాలి. భగవంతుని పూర్తిగా నమ్మాలి. ఆయన మీదనే ఆధారపడాలి. నీ నమ్మకం ఎంత ఎక్కువగావుంటే అంత అద్భుతమైన ఫలితం దక్కుతుంది. సాధన తిన్నగా సాగటం లేదేమో అనే చచ్చు ఆలోచన పనికిరాదు. నిజానికి దైవం నిన్ను పరుగెత్తిస్తున్నప్పటికి నీ కళ్లకి అది నత్తనడక లాగే కనిపించవచ్చును. ఇది మనస్సు యొక్క దృష్టిదోషమే గాని మరేమియు కాదని నిజం తెలుసుకోవాలి. — సంపాదకుడు

సంపూర్ణ సమభావం ఏర్పడడానికి చాలా కాలం పడుతుంది. సమతాభావం లేక సమదృష్టి నెలకొనడం మూడు విషయాల మీద ఆధారపడివుంది. వ్యక్తి పరమాత్మకు తన్నుతాను హృదయ పూర్వకంగా సమర్పించుకోవడం, ఆ శరణాగతికి తోడుగా పర మాత్మ నుండి ప్రసరించే ఆధ్యాత్మిక ప్రశాంతత, మనస్సును ఆవరించివున్న దేహభావనను, రజోగుణాన్ని పట్టుదలతో ప్రయత్న పూర్వకంగా తొలగించుకోవడం — ఇది అత్యంత ఆవశ్యకమై వున్నవి.

*

దైవమే నిన్ను నడిపిస్తున్నదని నమ్ము

మనలోని అజ్ఞానము, మనల్ని అంటిపెట్టుకొనివున్న బలహీన తలు, సాధనలో ఎదురయ్యే ప్రతి కూల పరిస్థితులు — ఎన్ని వున్నా, సాధకుడు, తనను దైవసంకల్ప శక్తి ముందుకు నడిపించి చివరి గమ్యమైన ఆత్మసాక్షాత్కారం

వైపు అడుగులు వేయిస్తుందనే ప్రగాఢ విశ్వాసాన్ని వదిలి పెట్ట రాదు. ఈ అచంచల విశ్వాసం అవరోధాలను అధిగమించే చిత్త స్థైర్యాన్ని మనకు ప్రసాదిస్తుంది. ఈ చిత్తస్థైర్యం వలన మన విశ్వాసం మరింత బలపడి, అవధులులేని లోకోత్తర దివ్యచైతన్య శక్తి అయిన పరమాత్మ సాక్షాత్కారానికి మార్గం సుగమం చేస్తుంది.

ఈ విశ్వాంతరాళంలోని ప్రతికూల శక్తులు సాధనలో తనకు అడ్డు తగులుతున్నా. చలించక సాధకుడు నిశ్శబ్దంగా రహస్యంగా పనిచేస్తున్న లోకోత్తర దివ్యసంకల్పశక్తియైన పర మాత్మ అనుగ్రహానికై నిరీక్షిస్తూ ఆటుపోట్లను తట్టుకుంటూ నిబ్బ రంతో ముందుకు సాగిపోవాలి.

*

సాధనలో ఒడిదుడుకులు ఎందుకు కలుగుతాయి?

సాధనాచరణలో గమ్యంవైపు తిన్నగా వెళ్లటం లేదని, ఒడి దుడుకులు కలుగుతూ తప్పు దారి పట్టి డొంకతిరుగుడుగా నడుస్తున్నట్లు తోస్తుంది. ఎందు కని? మానవజీవితం గాని, విశ్వలీల గాని మానవుని కతీతమైన కొన్ని విశ్వశక్తులచే నడిపించబడును. ఆ మహాశక్తులు అవరో ధములను తొలగించి మార్గమును తయారుచేసే వ్యూహము మన లౌకికబుద్ధికి అర్థంకాని విషయము ఈ ఒడిదొడుకులు నీకు సంకటాలు, ఉపద్రవాలుగా అనిపించవచ్చు. కాని నీవు నీ మనస్సు చెప్పే మాట విని మోసపోకుండా, నీ నిశ్చయాన్నుంచి చెదిరిపోకుండా నీ మంచికే ఇట్లా జరుగుతోంది అని గుర్తించాలి. నీ పురోగమనానికి ఇదంతా ఒక గొప్ప అవకాశంగా ఎరిగి దాని వలన లాభం పొందాలి. మరో విషయం విశ్వశక్తుల కంటె పైన అతిసమర్థవంతమైన మరియొక మహాశక్తి వున్నది నీ సాధనలో జరిగే కొన్ని సంఘటనలు వింతగా అనిపించి నిన్ను కలవర పెట్టవచ్చు. నువ్వప్పుడు ఆ పరమశక్తిని అర్థించి తదాగ మనం కోసం వేచి వుండాలి. మానవ మనస్సు ఎప్పుడూ తన సంకల్పాన్ని వెంటనే నెరవేర్చాలని చూస్తుంది. కాని దాని తెలివి ఎంత? జ్ఞానమెంత? అది స్వల్పము, సంకుచితము. పైన పేర్కొ

నిన పరమశక్తి అటులగాదు. దాని ఎత్తే వేరు. దాని దృష్టి కేవలం వ్యక్తిస్థాయి కాదు దాని వ్యూహము విశ్వకార్యనిర్వహణము. కాబట్టి నీ కర్తవ్యము ఇది. నీ లక్ష్యసాధనను దృష్టిలో పెట్టుకొని నడచుకోవాలిగాని బాహ్యపరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని గాని, ప్రతికూలంగా ఉన్నాయని గాని తలవకూడదు. అవి నీ మూలసూత్రాలు అంతకన్నా కావు.

*

ఏకాత్మతాభావం జ్ఞానానికి మూలం

తన ఆత్మ ఇతర జీవరాసుల లోని ఆత్మలతో ఐక్యతా రాగాన్ని ఆలపించడం – ఆత్మ సాక్షాత్కారం వైపు జీవుడు సాగుతున్నాడనడానికి మొదటి సూచన. ఈ భావన బలపడడానికి ముందు, అందరినీ అర్థం చేసుకొని, సకల మానవులు నా వారే అనే విశాలభావంతో వారిపట్ల సానుభూతిని, సామరస్యాన్ని ప్రేమభావాన్ని ప్రదర్శిస్తూ, వారందరికీ సహాయం చేయాలనే సేవాదృక్పథం పెంపొందుతుంది.

ఈ దృక్పథం మరింత బలపడి అనేకత్వంలో ఏకత్వాన్ని వీక్షించే భావన ఏర్పడుతుంది. ఉన్నది ఏకపదార్థము, ఏక జీవన సూత్రము, ఏక మనస్సు, ఏకాత్మ – ఇదే అనేక రూపాలలో నర్తిస్తోంది అనే జ్ఞానమే నిజమైన జ్ఞానము.

ఈ ఆత్మలన్నీ సచ్చిదానంద స్వరూపాలనే భావన బలపడితే, పూర్ణజ్ఞానం సిద్ధించినట్లే. ఈ సచ్చిదానంద పరబ్రహ్మమే అనేక రూపాలలో నర్తిస్తోంది అన మాట.

ఈ సర్వనామ రూపాలలో స్వస్వరూపాన్ని దర్శించినపుడు పరిమితభావం నుంచి విడుదలై అంతరంగ స్వేచ్ఛ లభించి "అంతటా నేనే వున్నాను నాకు అన్యమైనదేదీ లేదు" అనే సర్వాత్మభావన ప్రబలుతుంది ఆ మధురభావన పరమానందాన్ని, శాంతిని ప్రసాదిస్తుంది.

ఈ జగత్తంతా తానే అయినపుడు భేదభావం నశించి ఏకతాభావం వెల్లివిరిసి నపుడు జగత్తు బ్రహ్మమయంగా శోభిస్తుంది "సర్వం బ్రహ్మమయం" అన్న భావనలో స్వపర భేదం,

జుగుప్స, అసూయ, అయిష్టం, భయం, ద్వేషభావం నశించి సాధకుడు అద్వైత శిఖరాలను అధిరోహిస్తాడు పూర్ణసమతా భావన సాధనతో ఇది సిద్ధిస్తుంది.

*

పురుషసిద్ధి నిరంతరానుభూతి

తరతరాలుగా మనస్సును అంటిపెట్టుకొన్న "నేను దేహాన్ని" అనే భావన సాధకుడిని వీడిపోవాలంటే, సర్వకాల సర్వావస్థల యందు అందరిలో ప్రకాశిస్తున్న విశ్వాత్మకుడనైన పరబ్రహ్మ స్వరూపాన్ని వీక్షించ గలగాలి. "నేను చూచే ప్రతి ఒక్కరిలో నేనే వున్నాను" అనే దృఢవిశ్వాసం బలపడాలి. నేను పరబ్రహ్మ స్వరూపాన్ని అనే భావం మొదట పురుష (దైవ) చైతన్యంలో ఏర్పడి క్రమంగా ప్రకృతి (జీవ) చైతన్యంలోకి ప్రాకుతుంది. దేహభావం ప్రకృతి చైతన్యాన్ని అంటిపెట్టుకొని కొంతకాలం సాగినా అంతరంగంలో వున్న పురుషుడు, ఇదంతా కలకాలంగా వస్తున్న పాత సంస్కారాలకు అలవాటుపడిన ప్రకృతి చేస్తున్న గారడీగా భావించి నిర్లిప్తంగా వుంటాడు. పాతదేహ భావనా సంస్కారాలు పెల్లుబికినప్పుడు కొందరు వేదాంతులు ఇవి మరణంతో సమసిపోయి పరమాత్మలో లీనమైపోతాయని ఊరట చెందుతారు. సాధకుని స్వభావంలో సంపూర్ణ మార్పు రావాలంటే అంతటా పరమపురుషుని వీక్షించే దివ్యభావము, అన్ని అంగాలకు, అన్ని కణాలకు మనస్సు, ప్రాణిక, భౌతిక అవచేతనాదులకు ప్రాకాలి. అప్పుడు ప్రకృతిలోని అహం స్ఫురణ లేక దేహభావం అంచెలంచలుగా నశించి దృఢమైన సమతాభావం నెలకొంటుంది. ఈ సమభావనే బ్రహ్మభావన. ఈ బ్రహ్మభావనలో జీవి జీవయాత్ర సాగిస్తున్నా, తన్ను దివ్యత్వం నుండి వేరుపఱచే దేహభావనకు దూరమై సర్వత్రా ప్రకాశించే దివ్యత్వపు కేంద్రంగా ఉపకరణంగా భాసిస్తాడు. నేను చేసేవాడిననే భావన తొలగి నా ద్వారా విశ్వాత్మకుడైన పరమాత్మ చేయిస్తున్నాడనే భావం కలిగి కర్తృత్వభావన నశిస్తుంది కర్మలకు, కర్మఫలం అంటదు. ఇక్కడ చేసేవాడు తాను కాదు కాబట్టి,

తాను నిమిత్తమాత్రుడు కాబట్టి అతని కర్మలను అహంకారము బంధించదు. అప్పుడు సాధకుడు భగవంతుని దివ్యానందాన్ని ప్రసారం చేసే కేంద్రంగా విరాజిల్లుతాడు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: చదలవాడ వెంకట శేషయ్య; ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి

సమతా సాధన – మూడు స్థాయిలు

సాధనకు సమత అతిముఖ్యమైన విషయము. ఈ సమత పూర్ణ దశకు చేరినప్పుడు సాధన చకచకా సాగిపోగలదు. అందుకనే శ్రమకోర్చి సాధకుడు సమతను సాధించాలి. దీనికి సుదీర్ఘమైన ప్రయత్నము, ఎంతో ఓర్పుతో కూడిన స్వయంశిక్షణ అనివార్యము. కోరికలు చెలరేగుతున్నంతకాలం సమత ఏర్పడదు. ఒక వేళ ఏర్పడినప్పటికి, అది కోరికల వలన విసుగుచెందటం వలనయో లేక వాటిని నిర్మూలించుట వలనయో సంభవిస్తుంది. కాని అట్టి సమత కేవలం అభావంగా, జడముగా ఉంటుందే గాని అది నిజమైన ప్రశాంతతగాని ఏకత్వభావము కానేకాదు. పరిపూర్ణమైన సమత హఠాత్తుగా సంక్రమించునది కాదు. మార్గములో పెక్కు మజిలీలు, స్పష్టమైన దశలు సంభవిస్తాయి.

సహనము

ప్రారంభదశలో ముఖ్యంగా కావలసిన గుణము సహనము. ఎందుకంటే బాహ్యాస్పర్శల వలన కలిగే బాధలను ఓర్పుతో భరించి సమాధానపడాలి. మనలోని ప్రత్యణువు ఇటులనే ప్రవర్తించటం నేర్చుకోవాలి. అనగా కష్టాల నుండి పారిపోవటంగాని, సుఖాలను ఆహ్వానించటంగాని పనికి రావు. అన్ని సన్నివేశములను ఎదుర్కొని, ఓర్చుకొని, ఓరిమితో సహించి అతిక్రమించాలి. కేవలం మనకు కలిగే సంఘటనలను మాత్రమే కాకుండా, పైలోకముల నుంచి క్రిందిలోకముల వరకు

మన సానుభూతి వలన కలిగే స్పర్శల నన్నింటిని అదే విధంగా ఉదాసీనముతో వహించాలి.

మన పరిసరాల నుండి మనకు చాల ఒత్తిడులు – మనుషుల వలన, వస్తువుల వలన, అదృశ్యమైన శక్తుల వలన, దేవతల వలన, దానవుల వలన – కలుగుతూ వుంటాయి. ఇవన్నియు మన అంచంచలమైన ఆత్మసాగరంలో తటస్థించే ఆత్మ యొక్క విభిన్నమైన అనుభూతులుగా పరిణమిస్తాయి. ఇది చాల గుండెనిబ్బరముతో ఎదుర్కొనవలసిన ప్రథమ ఘట్టము. మన ఇంద్రియములు, హృదయము మనస్సులతో నిశ్చలముగా ఓర్చుకొని కష్టసమయములో దైవసహాయమును పొందిన యెడల ఇది సాధ్యమవుతుంది. ఈ ప్రక్రియల ద్వారా దైవము నిన్ను క్రమ క్రమంగా సమతదిశగా నడిపిస్తాడు. అందుకని నీవు ధైర్య స్థైర్యములతో జ్ఞానము కలిగియో లేక బాధలకు ఓర్చుకొనియో ఈ ప్రక్రియను కొనసాగించవలెను.

భక్తితో పరవశమై దేవుని హస్తములతో నీ తత్త్వమును నవనీతమువలె మృదువుగా చేయాలిగాని కఠినమైన తపశ్చర్యలతో శరీరమును శిథిలపరచకూడదు. ఇటుల మలచుకొనిన యెడల భవిష్యత్తులో కలగబోయే గాఢానుభూతులను నీ శరీరం భరించగలుగుతుంది. లోతైన శాంతి, నిజమైన ఆనందము అరుదెంచ గలవు. ఈ దశలో నీ శరీరము ప్రకృతి సిద్ధమైన అర్భకత్వాన్ని విడనాడి, బలమును పుంజుకొని ముందర రానున్న పరీక్షలకు సంసిద్ధమౌతుంది.

తాత్త్విక స్థాయి

ఉన్నతాసనం మీద కూర్చొని దేనివలన చలించకుండా వుండటం ఈ స్థాయి లక్షణము. పొంగిపోవటంగాని, కుంగిపోవటంగాని, సుఖానుభూతుల కోసం అర్రులు చాచటంగాని బాధలను చూసి భయపడటంగాని లేని స్థితి. నువ్వు పై భూమికలలో సుఖాసీనుడవై ఈ క్రింద జరిగే వ్యవహారానికి – మనుషులు, సన్నివేశాలు, శక్తుల విన్యాసాలు, నీ ఆలోచనలు, ఇంద్రియానుభూతులు, చేష్టలు అటులనే

ఇతరులకు వర్తించు ప్రక్రియలు – ఏమాత్రం చలించకుండా గమనిస్తూ వుంటావు. ఇది సమతను విస్తృతము చేసి దాని అంతస్థును పెంచే ప్రక్రియ. నైష్కర్మ్యముగాని సన్యాసముగాని శిథిలావస్థకాని కాదు. విసుగు, ప్రయాస, నిరాసక్తతల వలన కలిగే జుగుప్సాభావమూ కాదు. కోరికలను సంతృప్తిపరచటం వలన మొహం మొత్తటమో లేక కోరికలు తీరకపోవటం వలన నిరాశగా పరిణమించటమూ కాదు. లేదా అహము, నిరాశ, నిస్పృహలు జెంది తన లక్ష్యమును సాధించలేకపోయానే అని విషణ్ణము కాకూడదు.

వెనుకంజ వేయుట

అపరిపక్వమనస్కులే ఈ విధంగా వెనుకాడుతారు. కాని అదీ ఒకందుకు మంచిదే. ఆశాపర్థులను ప్రాణికప్రకృతులను ఉరకలువేసి ముందుకు జొరబడిపోయి ప్రమాదాలకు గురికాకుండా కళ్ళెం వేస్తుంది. అది వారికి లాభమే అవుతుంది. కాని మనకు కావలసింది ఘనతరమైన ఉదాసీనత, ఉన్నతస్థాయి నందుకొని సాధారణమైన లౌకిక స్పర్శల కతీతంగా వుండుట; వ్యవహారములను గమనించి వాటిని ఆమోదించుట లేక తిరస్కరించుట. అయితే ఆమోదించినప్పుడు బంధనముగాని తిరస్కరించినప్పుడు విసర్జనభావముగాని వుండదు.

సాధకుడు ప్రకృతి కార్యకలాపాలకు దూరమై, (వాటికి మూలమైనప్పటికి వాటితో జోక్యములేని) అవ్యక్త పరబ్రహ్మముతో సన్నిహిత సంబంధాలను పొందుతాడు. విశ్వలీలకు వర్తనమునకు అతీతమైన నిత్యసత్యములోని భాగమై ఆ అఖండానుభూతిని కూడా పొందుతాడు. ఇది నిశ్శంసయముగా ఒక మహత్తరమైన దివ్యానుభూతి. ప్రపంచంలోని రమ్యమైన లీలావిశేషముల వలనగాని, పెనుతుఫాను వంటి వైపరీత్యముల వలనగాని ఏమాత్రం చలించకుండా చెదిరిపోని ప్రశాంతస్థితి. సమతాభావము వృద్ధిపొందుతున్న కొద్ది సిద్ధియొక్క స్థాయి కూడ మరింత గాఢంగాను బహుముఖంగాను పరిణమిస్తుంది. పైన చెప్పిన రెండు అంతరపరివర్తనాస్థాయిలలో మనం స్థిరపడిపోకుండా వాటిని

దాటిపోయినప్పుడు మరియొక స్థాయిని – ఒక మహావైభవోపేత మైన దివ్యసమత్వమును పొందెదము. అది మరియొక చేతనా స్థాయి. మరియొక పరిణామఘట్టము. మరోలోకం లోకి ప్రవేశము. ఆ దివ్య ఆర్ద్రత, ఆ ఆనందఘనము, సర్వమును అవగాహన జేసుకొని సర్వమును తనలో ధరించగల ఆత్మస్థాయి. సర్వమును ఆలింగనము జేసికొనగల సంపూర్ణసిద్ధి. ఇది ఒక పరమోచ్ఛమైన దశ. దానిని సంపాందించుకొని నప్పుడు కలిగే పారవశ్యము అత్యద్భుతము అవాఙ్మానసము పరమానందము. భగవంతుని సన్నిధానంలో పరాశక్తి ఒడిలో ఓలలాడుట. పరమానందమును పొందుట. నీకు కలిగిన ప్రతియొక్క అనుభూతి లోను పరా కాష్ఠకు జేరుట. నీ శక్తి అంతా సామర్థ్యముగాను, శాంతి అంతా ఆనందముగాను, అచలత్వమంతా చరాచర జగత్తులోని లీలా విలాసంగాను పరిణమించును. ఈ ఉన్నతోన్నతమైన సిద్ధి కలు గుటకు, పైన సుస్థాపితమై వున్న అచంచలభావము మారాలి. సాధకునికి మొదట్లో ఈశ్వారానుభూతి అచంచల స్థాయిలో కలుగుతుంది. ఆ భావము మరింత ప్రగాఢమైన తన అచంచల భావమునకు భంగము వాటిల్లకుండానే క్రియాశీలభావము కలుగు తుంది. ఇది సర్వసమర్పణభావము యొక్క గంభీరమైన స్థాయి. అనగా ప్రపంచంలోని దుఃఖసంఘటనలను నిస్సహాయముగా చూస్తూ భరించటం కాదు. వాటిలో కూడ ప్రేమ, ఆనందము, పరవశము కలుగుతాయి.

ఇప్పుడు సమర్పణ మరియొక స్థాయికి జేరినది. దైవేచ్ఛను మాత్రమే పొందటం కాకుండా అందులోని దివ్యజ్ఞానము కూడా గుర్తించబడుతుంది. దివ్యప్రేమను పొంది పరవశమగుట ఆ స్థాయి యొక్క లక్షణము. నీవే ఆ పరమాత్మతో సాయుద్యము జెంది ఈశ్వరజ్ఞానము, ప్రేమానుభూతులలో ఓలలాడెదవు.

మహర్షులు దివ్యజ్ఞాన సంపన్నులై శాంతిసమత్వములను పొందెదరు. అయితే ఆ శక్తిలోను, శాంతిలోను నిశ్చలత్వములోను ఒక ఏకతాభావము భాసిస్తుంది. కాని పూర్ణయోగి ఆ స్థాయిని దాటి, ఆ స్థిరత్వము నుండి విముక్తమైన, ఆద్యంతములు లేని

ఒక సర్వగత పరమానుభూతిని అనుభవిస్తాడు. ఈ సిద్ధి కేవలం స్థిరత్వమునకే పరిమితం గాదు. గతిశీలము గూడ. మొత్తం చరాచర సృష్టిలోని సమస్త స్పర్శలను పరమానందమైన సమత్వముతో గ్రహించగలము.

ఆ స్పర్శలు నీకు ఎటువంటి భావమును కలుగ జేయునో తెలుసా? అఖండము, అవ్యాజము అయిన దివ్యప్రేమ, దివ్యానందము, సర్వవస్తువులలోను నిగూఢమై యున్న కేవలానందము. విశ్వగతమైన ఈ పరమానంద ప్రాప్తి ఆత్మయొక్క పరమసిద్ధి. హృదయకవాటములను తెరచి అనంతము, అత్యద్భుతమైన ఆనందానుభూతిని పొందుట[1]

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి;. ఆర్. లక్ష్మీప్రసాదమ్మ

బాహ్యపరిస్థితులకు మానవుని పరిస్పందన

యోగులు హిమాలయ పర్వతాలలో ఏకాంతజీవితం గడుపుతున్నంత వరకు వాళ్ళకే బెడదా ఉండదు. బాహ్యప్రపంచంలోకి అడుగుపెట్టగానే దాని మర్యాదలకు వడ్డింపులకు గురవుతాడు. ఈ మనస్సు ఎంత చెడ్డదో తెలుస్తుంది. నిజానికి బాహ్యా మనస్సు చాలా చిన్నది. అర్భకురాలు. విశ్వస్థాయిలోని గంభీరమైన చేతనా విన్యాసములను అది ఎట్లా ఎదుర్కొనగలదు? దాని వెనుక వున్న ఆత్మయొక్క బలంతో ఎదుర్కొనగలదు. ఆత్మ బలము పూర్తిగా ఆవిష్కారమైనప్పుడు మనస్సు శక్తివంతమై ప్రపంచాన్ని పరిపాలించగలదు. ఈ వివరాలను ఈ శీర్షికలో చదవండి. — సంపాదకుడు

---

[1] కామనను పూర్తిగా నిర్మూలించి సమతయెక్క పరమోచ్చస్థాయికి జేరుకొన వలెనన్న, అహంతను నిర్మూలించే కార్యక్రమాన్ని ముందరే పూర్తి చేయాలి.

బాహ్యప్రపంచంలోని అనేక విషయాలు నీ మీదికి దాడిచేసి నిన్ను కలవరపరుస్తూ ఉంటాయి. నీ బాహ్యామనస్సు వీనిని తట్టుకొనలేదు. ఎందుకని? దాని పరిమాణం చాల చిన్నది కాబట్టి. భూలోకం ఎన్నెన్నో చేతనాశ్రేణులకు, గంభీరమైన శక్తులకు ఆలవాలము. మనస్సు వాటిని నిలదొక్కుకొని తన వ్యక్తిత్వాన్ని ధృవపరచుకొంటోందనటానికి ప్రమాణం అందులో నిగూఢమైన ఆత్మబలమే. అయినా ఆ శక్తిలోని అపారతనూ, జీవిత సమస్యలను ఎదుర్కొనగల బలాన్ని బాహ్యామనస్సు ఇవ్వజాలదు. అలా ఇవ్వగలిగితే వీలయినంత కృషితో అది వెంటనే తన ప్రపంచానికి దీటుగా దానిమీద ఆధిపత్యం సాధించ గలుగుతుంది. కొన్ని ప్రభావాలకు లోనయి సమస్యలను తాత్కాలికంగా లేదా శాశ్వతంగా, కొంతవరకు లేదా సంపూర్ణంగా సమతూచి జీర్ణించుకో గలుగుతుంది. భావప్రేరితాలకు, ఆహ్లాదం, ఆనందం, తృప్తి, ప్రీతి, మోహాము వంటి వాటికి లోనవుతుంది. లేదా అంగీకారము, సమ్మతి, అవగాహన, విజ్ఞానము, ప్రీతి వంటి మానసిక ప్రక్రియలకు లోనవుతుంది. అభీష్టము, ఆకర్షణ, కోరిక, కొనసాగింపు, పదే పదే కథనం చేయటం, పునరావృతం చేసి, వాటిని సాధించి జీవితాన్ని ఆహ్లాదకరం చేయాలని ప్రయత్నిస్తుంది. ఎదురయ్యే ఇతర ప్రభావాలు దానికి లోబడనంత బలంగాను, తృప్తికలిగించ లేనంత బలహీనంగాను ఉంటాయి. వాటిని తనతో సమానం చేసుకోలేక పోతుంది. అవి తనతో పోలనివి. తనతో పొసగనవి. అందువలన విచారము, వేదన, దుఃఖము, అసంతృప్తి, అయిష్టత, అనంగీకారము, తిరస్కారము, తెలుసుకోలేకపోవటం, గ్రహింపలేకపోవటం, అసమ్మతి పొడసూపుతాయి. వీటి బారి నుండి బయటపడేందుకు, అవి పునరావృతం కాకుండా ఉండేందుకు బాహ్యామానసము ప్రయత్నిస్తుంది.

వీటివలన భయము, కోపము, కుంచించుకుపోవటం, భీతి, జుగుప్స, విసుగు, భిడియము ఏర్పడుతాయి. వాటినుండి విముక్తి పొందాలని ఆశించినా వాటిని వదలించుకునే వీలుండదు. వాటితోనే విడరాని బంధం ఏర్పడి, అలా ఎందుకు జరిగిందో ఆ

కారణాలను, వాటి ఫలితాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తుంది. ఈ ప్రభావాలు మన కోరికలతో ముడివడి జీవితంలో ఒక భాగమయ్యాయి. వాటిని సంబాళించలేని అశక్తత మన స్వభావంలోని కొఱతలలో ఒకటి. కొన్ని ప్రభావాలను సాధారణ మనస్సు దూరంగా లేదా తటస్థంగా ఉంచగలుగుతుంది. వీటికి గల సహజప్రతిక్రియ కచ్చితమైన ఆమోదము కాదు; సంతోషానుభవము గానీ, తిరస్కృతిగాని, మథనపడటం కానీ కాదు. వస్తువులు, మనుషులు, సంఘటనలు, భావాలు, చేతలు – మనస్సుకు ఏది తోచినా ఈ మూడు తరహాల ప్రతిక్రియలుంటాయి. సార్వత్రికమే అయినా వీటిలో ఇదమిత్థమన్నది లేదు. అన్నింటికీ ఒకటే పద్ధతి అనే క్రియాశీలక శ్రేణి అంటూ ఏదీ లేదు. వివిధ సమయాల్లో, వివిధ పరిస్థితుల్లో ఒకటే ప్రమాణమంటూ నిర్దిష్టత లేదు. అదే ప్రభావం ఒకసారి కనబడినా అది ఆహ్లాదకరం, నిర్దిష్టము, ప్రతికూలము లేదా వ్యతిరేకార్థము, ఉపేక్ష, తటస్థ ప్రతీకారము కావచ్చు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: డా॥ జె. మంగమ్మ

సమత మరికొన్ని విశేషాలు

యోగానికి సమతకి చాల సన్నిహిత సంబంధమున్నది. సమత స్థిరత్వ చరత్వ స్థాయిలలో భాసించవచ్చును. యోగసిద్ధులన్నీ మొదట బీజప్రాయంగా లోలోపల అంకురించి, మెల్లిమెల్లిగా బాహ్యాములో కూడ వ్యాపించి, పిదప సాధన పరిపక్వమౌతున్న కొద్ది ప్రగాఢమైన విస్తృతి చెంది విరాడ్రూపమును పొందును. సమత కూడ మొదట మనని అపరప్రకృతి నుండి విడిపించి దైవతత్త్వం లోకి ప్రవేశపెడుతుంది. ఆ తరువాత బహిరావణశీలమై జీవితంలోని సకల సన్నివేశములు దైవకార్యములే అని నిరూపించి ఆనందతత్త్వములో ఓలలాడి

స్తుంది. లోన ఏర్పడిన శాంతి క్రమేపి మనస్సును, దాని ఆవే శములను, ప్రాణిక భౌతికములను సహితము ఆక్రమిస్తుంది. మనస్సు యొక్క కామనలు, అహంకారము యొక్క చేష్టలు ఆత్మశాంతిలో కరిగిపోతాయి. మేధాబుద్ధికూడ చిత్తవృత్తులను నిరోధించి సత్యమును గుర్తించటం నేర్చుకుంటుంది. ఇంద్రియ ములు కూడ తమ క్షుద్రవృత్తులు క్షీణించిపోగా పరమశాంతితో శోభాయమానంగా భాసిస్తాయి. అంతరాత్మలోని శాంతి క్రమేపి బాహ్యమానసము లోనికి వ్యాపించగా అది కూడ గంభీరమైన పరమానంద ముద్రను వహిస్తుంది. — సంపాదకుడు

సమత యొక్క రెండు ముఖాలు: స్థిరత్వము, చరత్వము

సమత రెండు స్థాయిలలో రాణించవచ్చును — స్థితి, గతి. అపరా ప్రకృతి నుండి విముక్తమై నిశ్చలము, ప్రశాంతము అయిన దైవ సామ్రాజ్యము లోనికి ప్రవేశించుట ఒకటి. జగత్పరిణామములో కూడ అదే అనుభూతిని పొందుట రెండవది. పరాప్రకృతి యొక్క విరాడ్రూపములో దైవము యొక్క అనంతజ్ఞానము, అనంత క్రియాశీలత, ఆనందము అనుభవములోకి వచ్చును. సమత యొక్క మొదటి స్థాయి నిష్క్రియము, నిషేధాత్మకము. రెండవది సక్రియము — జీవితపు సన్నివేశముల బాహ్యరూపములను చూసి మోసపోక, ఏమాత్రం చలించక, తటస్థమై, ద్వంద్వములు మనను బలవంతంగా దుష్కార్యములలోకి దింపే ప్రయత్నము లకు లొంగిపోకుండా ఉండుట. అప్పుడు ఏ ఒక్క మనిషికి జరిగే సంఘటనలు కేవలం వ్యక్తిగతములు కావనియు, మహాచైతన్యము యొక్క చేష్టలే అనియు గుర్తించి వాటిని మనలోని దివ్యనేత్రంతో దర్శించటం జరుగుతుంది. బాహ్యదృష్టికి ద్వంద్వములుగా గోచర మయ్యే విషయములు కూడ వాటి యథార్థరూపములో కన పడతాయి. మొదటి దశలో బ్రహ్మము యొక్క ప్రశాంత నిశ్చల త్వము మాత్రమే అనుభూతమౌతుంది; అంతటితో ఆగిపోకుండా ఆనందస్థాయిని కూడ అందుకుని అందులో ఓలలాడుతుంది

రెండవస్థాయిలో. *ఈ విధంగా మానవుని నిత్యజీవితంలోని ప్రతియొక్క సన్నివేశము కూడ దివ్యజ్ఞాన శక్త్యానందములతో విరాజిల్లుతుంది.*

నిష్క్రియత్వపు సమత్వము – మూడు వైఖరులు

నిష్క్రియమైన సమత్వమును సాధించటానికి చేయవలసిన కృషి మూడు విభిన్న పద్ధతులు లేక వైఖరులపై ఆధారపడి వుంటుంది. అవే సహనము, ఉదాసీనత, అర్పణ (శరణాగతి). ఈ మూడూ ఒకే గమ్యానికి దారితీస్తాయి.

పరిస్థితులపట్ల ఉదాసీనత

మనలను అన్నివైపులనుండి ముట్టడించ చూచే సర్వసంబంధాలు, తాకిడులూ, ఇంద్రియగోచర ప్రకృతి యొక్క సంవేదనలను భరించగల మనలోని ఆత్మశక్తిపై ఆధారపడి ఉంటాయి. కాని వాటి ఉద్వేగాలకు, సంవేదనలకు, క్రియాశీలతగల బౌద్ధిక ప్రతిచర్యలకు లొంగవు. వీటిపై ఆధిపత్యం వహించాలని కోరే ఆత్మ బలమున్నా, సమానశక్తిని కలిగి ఎదురుదాడి చేయగల ప్రత్యర్థిశక్తిని వీటిపైకి మళ్ళిస్తుంది.

ఆనందదాయకం కాని తాకిడులనుండి తప్పించుకోవటానికి గాని, వాటిని దూరంగా ఉంచి, తనను తాను రక్షించుకోటానికి గాని మార్గాన్ని ఇది అన్వేషించదు సరి కదా, అటువంటి తాకిడులను ముఖాముఖి ఎదుర్కొని, అనుభవపూర్వకంగా పట్టుదలతో, మనోధైర్యంతో వాటిని తట్టుకొని భరించగల సమతౌల్యాన్ని, గంభీరమైన సహనశీలతను నేర్చుకుంటుంది. తత్ఫలితంగా మూడు ప్రయోజనాలు కలుగుతాయి. ముందుగా, పూర్వపు అసహనం అంతా సహనంగా మారుతుంది. బాధలను తట్టుకునే స్థాయి పెరుగుతుంది. ఆత్మకు సహనశీలత పెరగటం వల్ల మనకు తగిలే సమస్యలు, బాధలు దుఃఖాలు, చాలావరకు మనను కలవరపెట్టలేవు.

సాక్షిభావము

అంతేగాదు. చేతనాప్రకృతి ద్విధా విభాజ్యం అవుతుంది. అందులో ఒకటి సాధారణమైన మానసిక భావోద్రేకత్వము. ఇందులో మామూలుగా జరిగే ప్రతిచర్యలు జరుగుతూనే ఉంటాయి. రెండవది ఉన్నత సంకల్పానికి, వివేచనకు సంబంధించినది. ఇది దిగువస్థాయి ఉద్రేకాలకు ప్రభావితంకాదు. వాటిని అంగీకరించదు, ఆమోదించదు, వాటిలో పాల్గొనదు. ఇందువల్ల అధోప్రకృతి తన శక్తిని, ఉధృతిని కోల్పోవటం ప్రారంభిస్తుంది. ఆ ఉన్నత సంకల్ప వివేచనల నుండి లభించే ప్రశాంతతకు లోనై ఉంటుంది. క్రమేణా ఈ ప్రశాంతపూర్వక దృఢత్వము, మానసిక భావోద్రేక, ఇంద్రియ, ప్రాణిక భౌతిక స్థితులను తనవిగా చేసుకుంటుంది. దీనినుంచే

ఇంద్రియానుభూతులు ఆత్మానుభూతులుగా మారును

మూడవశక్తి ఆవిర్భవిస్తుంది. ఇది తన సహనశీలత, యాజమాన్యముల వలననూ, అధోప్రకృతిని వేరు చేసి దూరంగా ఉంచటం వలననూ, సాధారణమైన ప్రతిచర్యలను వదలించు కోవటమేగాక అవసరమైతే, ఇచ్ఛాపూర్వకంగా, మన అనుభవరీతులకు ఆత్మశక్తితో పునరాకృతి కలిగించ గలదిగా ఉంటుంది. ఇది సుఖదాయకమైన మరియు దుఃఖదాయకమైన ప్రతిచర్య లన్నిటికీ వర్తిస్తుంది. ఆత్మ వీటికి లొంగదు. వీటి ప్రభావంలో పడదు. కష్టసుఖములను కలిగించే తాకిడులను ఇది ప్రశాంతంగా భరిస్తుంది. వాటి ప్రేరణలకు లోబడడానికి ఇది తిరస్కరిస్తుంది. అంతేకాక, ఉల్లాసకరమైన సుఖభోగాల వెంట మనస్సు వెంబటి పడటాన్ని నిరోధించి, దాని స్థానే ఆత్మయొక్క ప్రశాంతతను పాదుకొల్పుతుంది.

విజ్ఞానాన్ని, దాని పరిమితులను ప్రశాంతంగా గ్రహించ గలిగే యోచనాత్మక మనసుకు కూడా దీనిని వర్తింప జేయ వచ్చు. ముగ్ధులను చేయగల ఆకర్షణీయ సూచనాత్మక యోచనలకు లొంగిపోవటంకాని, జుగుప్సను కలిగించే, అలవాటులేని అనాసక్త అయిష్ట సూచనాత్మక యోచనలను త్రిప్పికొట్టబడటం

గాని చేయక, పక్షపాతరహిత దృష్టితో, సత్యాన్ని నిరంతరం గమనించే సంకల్పాన్ని సుస్థిరపరచుకుంటుంది.

ఉదాసీన, అనాసక్త వైఖరి (ప్రజ్ఞాన మార్గం)

ఆత్మ యొక్క ఆధిపత్యము

రెండవ మార్గము పక్షపాతరహిత (అనాసక్త) ఉదాసీనత – ఆకర్షణలను, వికర్షణలను ఒకే మారు తిరస్కరించటం! వాటి కోసం తేజోవంతమైన ఉద్రేకరాహిత్యాన్ని, వాటిని నిరోధించగల తిరస్కారభావాన్నీ అభివృద్ధి పరుస్తుంది. సంబంధరాహిత్యపు నిరుపయోగపు అలవాటు ఇది. ఇచ్ఛ అనేది ఎప్పుడూ అవసరమే ఐనా ఈ తత్త్వము ఇచ్ఛపై కంటె విజ్ఞానము పైననే ఎక్కువగా ఆధారపడుతుంది. ఈ వైఖరి భావోద్రేకాలను మనః బాహ్య జనిత భ్రమలుగాను, ఏకసమ ఆత్మ యొక్క నిశ్చల సత్యమునకు అర్హతలేని అల్పప్రేరణలుగాను, ప్రాణిక భావోద్వేగపు అలజడులుగాను భావిస్తుంది. ప్రాజ్ఞుని యొక్క ఉద్వేగ రహిత నిశ్చల పరిశీలనాత్మక ఇచ్ఛ దీన్ని తిరస్కరించాల్సి ఉంటుంది. ఈ వైఖరి మనసు నుండి కోరికను తొలగిస్తుంది. పై ద్వంద్వ విలువలను వస్తుప్రపంచానికి ఆపాదింపజూసే అహాన్ని వదిలించుకుంటుంది. కోరిక స్థానంలో పక్షపాతరహిత, ఉదాసీన ప్రశాంతతనూ, అహం స్థానంలో ఆవేశానికి గాని, ప్రాపంచిక తాకిడులకు గాని గురియై చిక్కులలో పడని విశుద్ధాత్మను ఉంచుతుంది. దీని వల్ల ఉద్వేగపూరిత మనసు శాంతపడటమే గాక ప్రాజ్ఞుడు అజ్ఞానపు ఆలోచనలను తిరస్కరించి, శాశ్వతమైన మార్పుచెందని ఏకైక సత్యం వైపుగా ఎదుగుతాడు. తత్ఫలితంగా, ఈ మార్గంద్వారా శాంతిని చేరుకునే మూడు శక్తులు సిద్ధిస్తాయి.

అంతరంగిక ప్రశాంతత

తొలుతగా తెలిసే విషయం ఏమిటంటే, మనసు జీవితంలోని అల్పమయిన ఆనందాలకు, ఇబ్బందులకు స్వచ్ఛందంగానే బందీయై యున్నదనేది. నిజానికి ఈ సుఖదుఃఖాలు మనసు యొక్క అంత

రంగంపై ఏమాత్రం పట్టుగలవి కావు. క్షణికమైన బాహ్యావిష యాల వలన అలవాటుగా వస్తున్న నిస్సహాయ నిర్ణయాలను ఆత్మ, కావాలనుకుంటే తేలికగా వదులుకోగలదు. రెండవది ఏమనగా, ఇక్కడ కూడ వేరొక విభజనకు అవకాశం ఉన్నది. ఇప్పటికీ పాత అలవాటు ప్రకారం క్రింది స్థాయి లక్షణాలకు లోబడి ఉండే బాహ్యామనసుకూ, ఆత్మయొక్క ప్రశాంతతలో ఉంటూ, దానినుండి దూరంగా ఉండే ఉన్నతస్థాయి హేతు సంక ల్పాలకూ ఒక మానసికమైన విభేదం ఉంది. ఇంకో విధంగా చెప్పాలంటే నిమ్నత్వంలో ఉండే విభాగాల కలకలంలో జోక్యం చేసుకోకుండా, కనీసం వాటిని అంగీకరించకుండా, కేవలము (దూరాన్నుంచి) వాటిని గమనిస్తూ ఉండే ఒక ప్రత్యేక అంత రంగ ప్రశాంతత మనలో వృద్ధి అవుతూ ఉంటుంది.

మొదట్లో ఈ ఉన్నతమైన సంకల్పహేతువులు తరచు మసకబారి యుండటం, ఆక్రమణకు గురి అవటం, నిమ్నాంగాల ప్రేరణకు లోబడటం జరిగినా, క్రమేపి ఈ ప్రశాంతత అనివా ర్యము, శాశ్వతముగా మారి ఎంతటి హింసాయుత తాకిడులకైనా చలించకుండా ఉంటుంది. *(నాదుఃఖేన గురుణాపి విచాలయతే)* అంతరంగంలోని ఈ ప్రశాంతత బాహ్యామనసుకు చెందిన ఇబ్బం దులను శైశవంలోని అల్ప సుఖదుఃఖములవలె భావిస్తూ, వాటితో సంబంధము, జోక్యము చేసికొనక, ఒక ప్రత్యేకమైన ఆధిక్యతను కలిగి యుంటుంది. వాటిని తనవి కానట్లుగానూ, శాశ్వతము కానట్లుగానూ భావిస్తూ ఉంటుంది. చివరకు బాహ్యామనసు కూడా. ఈ ప్రశాంత అనాసక్త నిశ్చలత్వాన్ని క్రమంగా అంగీక రిస్తుంది. ఇంతవరకు అలవాటుగా తాను చేస్తూ వచ్చినట్లు సుఖాలకు ఆకర్షింపబడటం, దుఃఖాలవలన బాధపడటం, లేక వాటికి అసహాజ ప్రాధాన్యత ఇవ్వటం మానివేస్తుంది.

ఆత్మరతి

ఈ విధంగా మూడవశక్తి ఆవిర్భవిస్తుంది. అది విశాల నిశ్చల ప్రశాంతతకు చెందిన ఒక సర్వ వ్యాపక శక్తి; తానుగా విధించుకొన్న స్వీయ హింసాత్మక

విచిత్రతత్త్వము యొక్క ముట్టడి నుండి ఒక పరమానందభరిత విముక్తి; అశాశ్వత విషయజనిత సంఘర్షణ, సంక్షోభాలను తన శాశ్వతత్వముచే తొలగించే గాఢ నిశ్చల విశేష ఆనందపు అనంత శాశ్వత స్పర్శ *"బ్రహ్మ సంస్పర్శం అత్యంత సుఖం అశ్నుతే"*. ఆత్మ ఆత్మానంద స్థాపితమై ఉంటుంది. చైతన్యము, ఏకము అనంతము అయిన ఆత్మానందములో ఉండి, సుఖదుఃఖాల బాహ్యా స్పర్శలకై ఏమాత్రము తహతహలాడదు. తాను విధిగా పాల్గొన వలసిన అవసరం లేని నాటకమును లేక నటనను తిలకించే ప్రేక్షకుని వలె అది ప్రపంచాన్ని వీక్షిస్తుంది.

దైవేచ్ఛకు విధేయమై యుండుట:

భక్తి తత్పరత

హృదయమార్గము మూడవది విధేయత లేక వినయశీలత్వము. ఇది దేవేచ్ఛకు లొంగి యుండి, ఓర్పుతో సహించే క్రైస్తవం లోని "తితీక్ష" గాని, సంఘటనలను విశ్వజనీన సంకల్పము యొక్క కాలానుగుణమైన అభివ్యక్తిగా ఆమోదించే నిరహంకారత్వముగాని, పరమపురుష డైన దేవునికి పూర్తిగా స్వాధీనం అయి వుండటంగాని కావచ్చును. పై మూడు మార్గములలో మొదటిది సంకల్పమార్గము. రెండవది ప్రజ్ఞానమార్గము కాగా ఇది భక్తిసిద్ధాంతముతో అతిసన్నిహిత ముగా కలసియున్న హృదయప్రవృత్తి మార్గము. దీనిని ఆసాం తం సాధిస్తే పై విధంగానే పరిపూర్ణ సమత్వానికి చేరుకుం టాము. ఎందుకంటే అహం యొక్క బంధం వీడిపోయి వ్యక్తిగత అపేక్ష అదృశ్యం అవుతుంది. సంతోషం కలిగించే విషయాలకై

భగవంతునితో ఐక్యము

ఆతృతపడటం, బాధ కలిగించే వాటిని గురించి దుఃఖపడటం అనే లక్షణానికి మనం ఎంత మాత్రము బందీయై యుండ బోము. వాటిని ఆతృతతతో ఆమోదించటంగాని, కలవరపడి తిర స్కరించటం గాని చేయము. మన సత్తకు (ఉనికికి) యజమాని అయిన భగవంతునికి వాటిని నివేదిస్తాము. వాటి వలన మనకు కలిగే వ్యక్తిగత ఫలితాల విషయంలో మన ప్రమేయము క్రమేణా

తగ్గించుకుంటాము. *ఒక్క విషయానికి మాత్రమే ప్రాధాన్యత నిచ్చెదము – భగవంతుని చేరాలి. ఆయన యొక్క విశ్వజనీన అనంత అస్థిత్వంతో భావైక్యానుబంధం పొందాలి. భగవంతునిలో కలసిపోవాలి. ఆయన యొక్క వాహినిగా, పరికరంగా, సేవకునిగా, ప్రియునిగా ఆయన యొక్క అనుబంధంలో ఆనందిస్తూ ఉండాలి. ఇక సుఖదుఃఖాలకు మరే కారణమూ లేదు. అంతా బ్రహ్మమయం!* అయినప్పటికి సాధారణ మనుష్యగతమైన భావావేశాలు కొంతకాలము కొనసాగవచ్చు. క్రమేపి క్షీణించి భక్తితత్పరత వలన కలిగిన పారవశ్యతలో అవి కరిగిపోవును. మనస్సంతయు దివ్యప్రేమానందోన్నతుల చేతను, జ్యోతిప్రకాశముల చేతను ఆక్రమింపబడును. ఇక సాధారణ భావోద్రేకములన్నియు ఆ మహాభావములో నిమజ్జనమైపోవును. అపుడిక దైవసాయుజ్యము యొక్క మహాభావము, తల్లక్షణములైన మహదానందము, భాషతో వర్ణింపనలవికాని ఒకానొక అచలత్వములే (స్థిరత్వము) భాసించును. *మామూలు మానవునికి కలిగే ఇష్టాయిష్టములన్నియు వాటి ఉనికిని కోల్పోవును. మూలరూపములలోనే భాసించును.*

ఈ మూడు మార్గములు వేర్వేరు స్థలములలో మొదలైనప్పటికి ఒకే గమ్యమును చేరును – మనస్సును బాహ్యాస్పర్శలకు అతీతము గావించుట, ఆత్మను వేరుచేసి ప్రకృతి సంచలనములకు దూరము గావించుట.

క్రియాశీల సమత్వము

ఇప్పుడు మనము ఒక సుస్థిరమైన సమతా స్థాయికి జేరుకొంటిమి. ఆచరణలోను, ప్రపంచ లీలలోను కూడ క్రియాశీలము గావించుట సమత యొక్క తదుపరి ఘట్టము. నిజమే కదా మరి. మనకు సిద్ధించిన సమత్వమును ప్రపంచము నుండి దూరంగా నిలబడి గమనిస్తూ ఉండుట మాత్రమే కాదు. *కార్యరంగము లోకి దుమికి ఆత్మయొక్క సుస్థిరత్వముతో దానిని ఆక్రమించి, వశము జేసుకోవాలి. ఇది సాధ్యమే – ఏలన ప్రకృతి యనగా ఆత్మకు*

శత్రువు కాదు. అది కూడ ఆత్మాభివ్యక్తియే. విశ్వాత్మఖేలనమే. దైవము యొక్క క్రీడయే. అటువంటప్పుడు ఈ విషయము మానవ మనస్సుకు ఎందుకు గోచరించదు? జడపదార్థములో అంతర్లీన మైన కారణంగా అది పొందిన అజ్ఞానమే దీనికి కారణము. అట్టి అజ్ఞానమయమైన మనస్సు అసలైన సత్యమును గుర్తించలేదు. దాని క్షుద్రరూపములనే జూచి మోసపోవును. ఎప్పుడైతే మనము దివ్యసిద్ధి పొంది ఆత్మచైతన్య సంపన్నుల మగుదుమో అప్పుడు ప్రపంచ సంఘటనల యొక్క సత్యము అనుభూతమై వాటి నిజ రూపము అవగతమగును. ప్రపంచకార్యములను ఆత్మదృష్టితోను, తల్లక్షణములమైన ప్రశాంత జ్ఞానశక్త్యానందములతోను దర్శించ గలుగుదుము. అపుడిక దివ్యాభివ్యక్తిగతమైన సమస్త కార్యములు – మంచిచెడులు, వెలుగునీడలతో సహా అన్నిటిని దివ్యజ్ఞాన రూపములుగానే దర్శించ వీలగును. పరమాత్మ ప్రపంచమునందు ఎటుల సర్వవ్యాప్తమై వుండునో, అటులనే అదే స్ఫూర్తితో ప్రపంచములోని సర్వసంఘటనలను గమనించదగును. అపుడిక ప్రపంచమును దూరంగా నిలబడి సాక్షి భావముతో చూచుట కాదు. ప్రత్యక్షముగా ప్రతి సందర్భమును, సన్నివేశమును దివ్యచైతన్యముతో నెరపుట; దివ్యస్ఫూర్తితోను – అనంత జ్యోతిశ్శక్త్యానంద ములతోను దర్శించుట.

క్రియాశీల సమతా సాధన

ఐక్యతా జ్ఞానము

జగత్తులోని చరాచర వస్తుజాలము నందెల్లడల దైవమునే చూచుట, దైవము నందే అన్నిటిని దర్శించుట, తానే సత్యము అనే స్ఫూర్తిని పొందుట – ఐక్యతా దర్శనము దీని లక్షణములు. ఇక సర్వ సందర్భములు, సన్నివేశములు, ఘటనలు, సర్వమానవులు, భూతములు ఆత్మయొక్క యవనికలే; ఒకే శక్తి యొక్క విన్యాసములే; ఒకే మూర్తి యొక్క క్రియారూపములే; ఒకే దివ్యచేతన యొక్క కార్యములే. అనగా వీని యందు భిన్నస్వరము లుండవు. ఐక్యతయే భాసించును. మన మీ విషయమును తెలుసుకొనినచో,

మనకీ అభిజ్ఞతి కలిగినచో ఇక మనను ఎవ్వరూ కలవరపరచ లేరు. ఎంతటి ఘోరము సంభవించినను ఒక రోమము కూడ చలించదు.

విశ్వాత్మతో తాదాత్మ్యము

నీవు విశ్వాత్మతో తాదాత్మ్యము పొంద వలెను. సమస్తమైన జీవకోటిని నీ రూప ములుగానే దర్శించి వాటితో భావైక్యతను పొందవలెను. సర్వశక్తులు, సర్వదేవతలు, నీ రూపములే. నీ సంకల్పము వలననే సర్వఘటనలు ఘటిల్లుచున్నవి. అవన్నియు నీ సొంత వ్యవహారములే. నీ అహంకార రూపములు కావు. ఆ పిశాచాన్ని నోరు మూయించి బహిష్కరించినప్పుడే ఇది సాధ్యము. నీవిక ఈ విచ్ఛిన్న శకలమువు కాదు. అఖండమైన విశ్వాత్మవు.

దేవుని కార్యాలయము నీవే!

ఇక 'నేను' అనే ప్రత్యేకభావము లేదు. ఏలన విశ్వకార్య నిర్వహణమునకు నీ విప్పుడొక ముఖ్యమైన కేంద్రము. అంతే కాదు. ఇతర వ్యక్తులందరితోడి, దేవతల తోడి, వస్తువులతోడి – మరి ఇవి అన్నియు పరమ పురుషుడు నిర్వర్తించు కార్యమునకు స్థావరములే కదా – వాటి ద్వారా కూడ దైవకార్యాచరణమునకు స్థావరముగా భాసించెదవు. ఇక నీవు మనుష్యమాత్రుడివి కావు. నీ వ్యక్తిత్వము విశ్వపురుషునితో ఏకము. నీ వ్యక్తిత్వము విశ్వాకృతి జెంది తద్వారా ఆనందమును గ్రోలును. సృష్టిలోని సర్వవస్తువులను ప్రేమతో ఆక్రమించి వాటి ద్వారా భోగించును. ఇక విశ్వజ్ఞాన మొక్కటియే కాదు. విశ్వ ములో దైవము నెరపించు విభిన్న వ్యక్తుల ద్వారా భోగమును పొందెదవు.

దీని మూడు ఫలితములు

ఈ ప్రక్రియ వలన మూడు ప్రయోజనములు లేక సిద్ధులు సమకూరును. నీ యందు హేతు వాదము బదులు ఆధ్యాత్మికవాదము పాదు కొంటుంది. బుద్ధి వ్యాపారములు నిన్నిక కలవరపెట్టవు, వేధింప

జాలవు. నీ ప్రకృతి ఈ వైఖరిని అవలంబించినప్పటికీ నీ పాత బుద్ధులు ఒక్కసారిగా నశించిపోవు. నీ నూతన చైతన్యముతో అవి ఘర్షణ చెందుతూనే ఉంటాయి. ఈ సహజీవనము – ఈ పెనుగు లాట – కొంతకాలము ఇటులనే కొనసాగుతుంది. పిదప నీ ఆధ్యాత్మికబుద్ధి నీ మానసికబుద్ధి నుంచి వేరుపడుతుంది. అనగా మనస్సు దారి మనస్సుది. ఆధ్యాత్మిక చేతన ఆధ్యాత్మికానిది. మనస్సు తన బాధలతోనూ దుఃఖములతోనూ సతమతమవుతూనే ఉంటుంది. కానీ నువ్వు ఒక సంగతి గమనించాలి. ఇది కేవలం వ్యక్తిగత యోగం కాదు. – విశ్వగతము కూడా. అందుకని మనస్సు తన యొక్క బాధలను దుఃఖములను మాత్రమే కాకుండా ఇత రుల సుఖదుఃఖములలో కూడా పాలుపంచుకొంటుంది. సాను భూతి భావముతో గమనించి వాటి ధాటికి గురై తన నెత్తిమీద వేసుకుంటుంది. ఎందుకని అలా జరుగుతుంది? ఈ పరివర్తనను సహించలేని కొన్ని విరోధశక్తులున్నాయి. వాటి రాజ్యమునకు ఎక్కడ ముప్పు వస్తుందో అని మన యోగాన్ని తమ శక్తితో సవాలు చేస్తాయి. చివరకి ఈ అసురశక్తులను ఓడించగల ఆధ్యా త్మిక శక్తి సంక్రమిస్తుంది. ఉన్నతమనస్సు చేతిలో అధోమన స్సుకు పరాజయము తప్పదు. ఆశ్చర్యమేమిటంటే అది కూడా (అధోమనసు) ఆధ్యాత్మిక ప్రకృతిని అవలంబించి, అది కూడా మార్గమును అడ్డగిస్తున్న విరోధశక్తులను బహిష్కారమయేంత వరకు ఎదుర్కొని, యుద్ధము చేసి ఓడించి తన పరివర్తనమునకు తాను కూడ తోడవుతుంది. అపుడిక మనిషి పొందే ప్రయోజ నము వర్ణనాతీతము. ఈ అల్ప వ్యక్తిత్వము విశాలమై అఖండా కారము పొందినట్లు గుర్తుచేసుకుంటుంది. *అఖండశక్తి శాంత్యా నందములు మొదటే నీ సొంతములు కాగా ఈ విరాడ్రూపము ద్వారా మరింత విశేషానుభూతులను పొంది ఓలలాడెదవు.*

నిష్క్రియ సక్రియ మార్గములు రెండూ అవసరమే

మానవుల స్వభావములు వేర్వేరుగా వుంటాయి. అందరికి ఒకే మంత్రము పనిచేయదు. పూర్ణయోగము ఈ విషయమును

గుర్తించి తదనుగుణమైన పద్ధతులను ఉపయోగిస్తుంది. అంతర్యామి చేయు సూచనలను బట్టి నిష్క్రియమైన మార్గముగాని సక్రియమార్గ మును గాని నిర్దేశిస్తుంది. కేవలం నిష్క్రియ పద్ధతుల వలన కలిగే ఆధ్యాత్మిక సిద్ధి వ్యక్తిగతము, పరిమితము మాత్రమేనై మన విశా లమైన గమ్యముతో పొసగదు.

ఓర్పు, సహనములు ఈ సాధన కవసరములే కాని మిగతా ప్రపంచముతో సంబంధము లేని ఏకైక విముక్తితో తృప్తి చెందు నది కాదు. మనకు కావలసినది క్రియాశీలమైన ప్రవృత్తి మార్గము. *దాని ద్వారా నీ ప్రకృతి విశ్వగతమైన అనంతశక్తితో సుసంప న్నమై మహాప్రకృతిగా మారుతుంది.* బాహ్యావిషయములు నిన్నిక కలవరపెట్ట జాలవు. ఒక వేళ పెట్టినా నీవు వాటి నోర్చుకోవల సిన అవసరముండదు. నీకు సంక్రమించిన మహాప్రకృతి అన్ని ఘటనలను మహాప్రసాదంగా స్వీకరించి ఆనందముగా పరిణ మింప జేస్తుంది!

పక్షపాత రహితముగానే ప్రవర్తించాలి గాని దేనినీ పట్టిం చుకోకుండా వుండి నాకెందుకలే అని వూరుకోకూడదు. ప్రపం చంలో జరుగుతున్న సమస్త కార్యములు తనకు కావాలి. ఉన్న తాసనము నుండి వాటిని దర్శించి, వాటి బాహ్యస్వరూపమును చూసి మోసపోక వాటి యందలి ఆధ్యాత్మికామృతమును ఆస్వా దించాలి.

మరొక విషయము. అవసరమైన యెడల కొంతకాలము పరిస్థితులతో రాజీపడి వాటికి లొంగిపోయి వుండవచ్చును. తన స్వీయవ్యక్తిత్వమును దైవానికి పూర్తిగా సమర్పించుకొని తద్వారా ఆనందస్థాయిని పొందవచ్చును. అపుడిక పరిస్థితులకు బానిసగా లొంగిపోయే ప్రశ్నే లేదు. విశ్వముతో ఐక్యతను సాధించినప్పుడు ఆ కష్టాలు రావు కనుక నీవు కష్టాల కోర్చుకోవాలసిన ప్రశ్నే లేదు. ఇక నీ ప్రకృతంతయు దైవాధీనము. దైవకార్యమునకు సాధ నము. నీ విభక్తాత్మ కూడ అఖండ దైవమును వశము జేసుకొని తదనుభూతిని పొందుతుంది.

ఈ యోగము ప్రవృత్తి మార్గమునే పూర్తిగా అవలంబిస్తుంది. కాని కేవలం వ్యక్తిగత సిద్ధితో ఆగిపోదు. ప్రాపంచిక సంఘటనలను జ్ఞాన శక్త్యానందములకు వ్యక్తిగత క్షేత్రముగా మాత్రమే దర్శించుట చాలదు. తన ఒక్కనిలోని దైవముతో మాత్రమే కాక ఇతరులలోని దైవముతో కూడ తాదాత్మ్యము చెంది తద్వారా ప్రపంచమును అనంతముగా దర్శించవలెను. తాను పొందిన సిద్ధి ద్వారా ఇతరులలోని దైవముతో కూడ అనుసంధానించుకొని వారు సిద్ధి దిశలో చేసే ప్రయాణమునకు తన ఆధ్యాత్మిక శక్తితో తోడ్పడవలెను.

ఈ మార్గము ప్రాపంచిక జీవితమును నిరసించునది కాదు. భూలోకమునకు మాత్రమేగాని ద్యులోకమునకు మాత్రమేగాని తన అనుబంధమును పరిమితము జేయదు. ఒక్క అతిలోక విముక్తిని మాత్రమే ఆశించదు. దైవము యొక్క అన్ని తలముల (లోకముల) లోని ఉనికిని సమాదరించవలెను. పరమాత్మను (బ్రహ్మము) మూలరూపములోను, అభివ్యక్త రూపములలోనూ కూడ సమముగా దర్శించవలెను.

మూలము: శ్రీఅరవిందులు

అనువాదము: కె.ఆర్.ఎల్. నరసింహారావు; ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

ఆధ్యాత్మిక సాధనా మార్గము

సాధన ఒక చేదుమందు లాంటిది. రోగాలు నయమయేందుకు చేదుమందు తినాలి. జీవితం బాగుపడాలంటే మానవప్రకృతిలోని అజ్ఞానాన్ని తొలగించాలి. దీనికి యోగం ధన్వంతరి. మనోప్రాణికములు మనిషిని కట్టిపడేస్తాయి. అందుకని వాటి విషయంలో చాల కఠినంగా వుండాలి. వాటి మాట అసలు వినిపించుకోకుండా వుంటే తరువాత అవే నోరు మూసుకుంటాయి. హృదయస్థుడైన ఈశ్వరుడే ఈ పనికి నీకు తగిన శక్తిని సమకూర్చగలడు. కాబట్టి నువ్వు ఆయనకు పూర్తిగా

సమర్పించుకోవాలి. అప్పుడు ఆయనే నీలో చెలరేగే ప్రాణిక స్పందనములను బలహీనపరచి మనోప్రాణికములను శాంతింప జేయగలడు. ఇది కొంతకాలం పట్టవచ్చును కాబట్టి ఎంతో ఓర్పు అవసరము. – సంపాదకుడు

సాధనా చతుష్టయము

తనకు సమత్వం లేక సమతాదృష్టి వుందో లేదో అన్న విషయం సాధకుడు ముందు తెలుసుకోవాలి. సాధన దిశగా తానెంత వరకు పురోగమించాడో, పురోగమించకపోతే లోపమెక్కడ వుందో తెలుసుకోవాలి. ఆ *లోపాన్ని సరిదిద్దుకోడానికి తన సంకల్పశక్తిని నిరంతరం కేంద్రీకరించాలి. తనకది సాధ్యం కాకపోతే, తనలోని లోపాన్ని తొలగించమనీ, దానికి హేతువైన మూలకారణం నుంచి తనని విముక్తుణ్ణి చేయమని పరమపురుషుణ్ణి ప్రార్థించాలి.* సాధకుడు తప్పకుండా కలిగి వుండవలసిన నాలుగు లక్షణాల్లో సమత్వం లేక సమదృష్టి మొదటిది. ఈ మాటను సుస్పష్టమైన ఆచరణీయ మైన అర్థంలో స్వీకరించాలి. *మానసిక, ప్రాణిక, భౌతిక కక్ష్యల్లో ఎటువంటి ఇష్టాయిష్టాలకు తావీయకుండా అంతరంగ బహిరంగాల్లో తనకు లభించిన వాటన్నిటినీ భగవంతుని ప్రసాదంగా స్వీకరించాలి.* రెండవది అవరోధాలు, ఆవేదనలూ ఎన్నడూ కృశించని స్థిరమైన ప్రశాంతత. మూడవది ఎట్టి పరిస్థితుల్లోనూ తరగనిదీ సహజంగా మానవుడికి లభించేదీ అయిన మాటుపడని ఆధ్యాత్మిక శాంతి, సౌఖ్యమూ అనేవి. నాలుగవ లక్షణం తన అస్తిత్వాన్ని ఆవరించి వున్న సుఖానుభూతీ, అలౌకికానందమూ అనేవి[2]

[2] హాస్యమనేది సుఖం యొక్క ఉత్సాహ రూపం. దానిని వ్యతిరేక స్థితులు భౌతిక మానసిక అనుభవాలు చెదరగొట్ట లేవు. అది ఒకానొక అంతర్మానసిక స్థితి. దాని పరిపూర్ణతకూ, సమత్వ సిద్ధికీ భగవంతుని ముద్ర వుంది. బాలుని వలె కనిపిస్తూ శాశ్వతబాలకునిగా, కుమారునిగా ప్రపంచమనే బృందావనంలో (శాశ్వతంగా) క్రీడించే శ్రీకృష్ణుని స్వరూపానికది ప్రతీక.

ముందుకు సాగడమెలా?

సమత్వం కలిగి వుండటమంటే దేనికో ఒక దానికి కట్టుబడి తనను తాను సంకుచితం చేసుకుని ఏదో మానసిక, ప్రాణిక స్వరూపానికి కానీ, దాని ఇష్టానిష్టాలకూ, కామ్యాలకూ లొంగి ప్రవర్తించటం కాకుండా, అనంతంగా, విశ్వజనీనంగా వర్తించటం. మానవుడు ప్రస్తుతం తన సాధారణ స్వభావం మూలంగా తన ఆత్మ ప్రసాదించే స్వేచ్ఛలో కాకుండా, మానసిక, ప్రాణిక భూమికల్లో జీవిస్తున్నాడు గనుక వాటిపట్ల పెంచుకున్న సంగంవల్లా, కోరికల వల్లా ఇష్టానిష్టాల ఊబిలో దిగబడటం అతనికి సామాన్యమైంది. ముందు ఈ యథార్థాన్ని తెలుసుకుని దానిని అంగీకరించటం తప్పనిసరి. లేకపోతే దానిని అధిగమించి, బయటపడటం బహు కష్టమవుతుంది. మనస్సును మనను నడిపించే ప్రధాన సాధనంగా ఎన్నుకున్నంతకాలం దానిని అధిగమించటం అసాధ్యమే అవుతుంది. మన మొట్టమొదటి బాధ్యత వాటిలోని తీవ్రతను తగ్గించి, అది కొండిని ఆడించకుండా చేయగలగటం. అంటే వాటి యొక్క నిరంతరత్వాన్నీ, ప్రభావాన్నీ, మన మీద వాటి పట్టునూ సడలింపజేసి, వాటి అహంభావాన్నీ, మన స్వభావం మీద వాటి తిరుగులేని అధికారాన్నీ తొలగించటం.

మనోప్రాణికాలను సాక్షిగా మాత్రమే చూడాలి

మనం వాటి పట్టు నుంచి బయట పడ్డామనే దానికి తార్కాణం మన ఆత్మలో నెలకొన్న చెక్కుచెదరని ప్రశాంతే. వెనక నుండి ఐచ్ఛికంగా తనను పరిశీలించే పరమపురుషుణ్ణి సాధకుడు గమనించాలి. దాని కంటే మనస్సు నధిగమించి మనసు చేసే ప్రతి చిన్న మోసాన్నీ, దానిలోని ప్రమాదసూచనల్నీ గమనించి, వేదననీ, ఆవేదననీ, తిరుగుబాటునూ, మానసిక వికారాన్నీ వీలైనంత వరకు తిప్పికొట్టాలి. వీటి ప్రారంభం ఎక్కడ అనే విషయాన్ని కూడా శోధించాలి. అవి ఏ లోపాన్ని సూచిస్తున్నాయో తెలుసుకోవాలి. ఆ లోపం అహంకారభావంలో పుట్టినా, ప్రాణికకావనలో గానీ, ఆవేశంలో గానీ, భావం స్థాయిలో గానీ – ఎక్కడ

జనించిందో తెలుసుకోవాలి. అలా తెలుసుకున్న తర్వాత, తన సంకల్పబలంలో వాటి మీద నీళ్ళు చల్లాలి. అంటే తన ఆధ్యాత్మిక బుద్ధిచైతన్యంతో హృదీశుడైన పరమాత్మతో తనకు గల సాన్నిధ్య ప్రభావంతో అణగ దొక్కాలి. అవి ఎంత వుండటం సహజమని అనిపించినా, వాటి కోరికల్లో సంబద్ధతా న్యాయమూ ఉన్నట్లు పైకి కనిపించినా, వాటిని ఎట్టి పరిస్థితుల్లోను అంగీకరించకూడదు.

హృదీశునికి ఆత్మ సమర్పణ చేసుకోవాలి

ఈ ఆర్భాటానికంతా కారణం బాధపడిన ప్రాణశక్తి కారణమైతే, దానితో తన సంబంధం తెంచుకుని తన ఊర్ధ్వబుద్ధితో అనుసంధానం చేసుకుని కామాత్మ యొక్క కోరికల్ని తిరస్కరించాలి. ఈ గందరగోళానికీ ఆర్భాటానికీ ఆవేశమే మూలమయితే దాన్ని కూడా అదే విధంగా దార్లోకి తీసుకుని రావాలి. ఒక వేళ అలా కాక సంకల్పమూ, మేధాశక్తి దోషమైతే దీనిని అణచటం మరింత కష్టతరమవుతుంది. ఎందుకంటే అతని ప్రధాన సహాయమూ, సాధనమూ అయినట్టివి భగవంతుడి సంకల్పం పై తిరుగుబాటు చేసే కుట్రలో భాగస్వాములవ్వటమంటే, అపరార్థంలోని అతని శరీరం చేసిన పూర్వ దుష్కృత్యాల వల్ల అధోగతిలో పడ్డ అతడిని ఉద్ధరించే ప్రయత్నం వమ్ము చేయటమన్న మాట. *అందువలన, మన హృదీశుడైన ఈశ్వరుడికీ, పరాత్పరుడుకీ, ఆత్మసమర్పణ చేయటమనేది మనలోని ప్రధానభావన కావాలి.* ఈ భావనతో నిండిపోయి నర్తించే బుద్ధి, అన్యభావాలకు చోటియ్యకుండా తన ఇష్టానిష్టాలను నిర్ణయాలనూ నిరుత్సాహపరచాలి. ఆ విధంగా తనలోని అహంకారాన్ని, తన ఇచ్ఛను ఎంత తర్క సమ్మతంగా వైయక్తిత సంకల్పం ద్వారా, హృదయం ద్వారా, ప్రాణికకామాత్మ ద్వారా ఏ విధంగా వ్యక్తం చేసినా సరే న్యాయబద్ధమైనది కాదని గ్రహించాలి. ఎందుకంటే దాని ఆవేదన, తిరుగుబాటు, అసహనమూ, వ్యధా ఇవన్నీ

కూడా మన హృదయంలోని భగవంతుణ్ణి ఎదిరించి, ఆయనపై ధ్వజమెత్తడమే గనుక.

ఆత్మసమర్పణ సంపూర్ణం కావాలి

సంపూర్ణ ఆత్మసమర్పణమే సాధకుడి ఏకైక తరణోపాయం. ఇవిగాక పూర్తిగా చిత్తవృత్తుల నిరోధమూ, సర్వకర్మల పట్ల అనాసక్తి వంటి వాటిని కూడా విడిచిపెట్టాలి. సంపూర్ణ ఆత్మసమర్పణం చేతనే పరిపూర్ణప్రశాంతినీ అనంతశాంతినీ పొందగలుగుతాము. అశాంతి మనల్ని వీడిపోకపోతే, పరిపూర్ణత సాధించడానికి ఎంత దీర్ఘకాలం పడుతుందో అన్న విషయం ఆలోచిస్తూ, అసహనమూ, నిరుత్సాహమూ చెందకూడదు. ఇలా ఎందుకు జరుగుతుందంటే మన స్వభావంలో దాని పట్ల స్పందించే లోపమెక్కడో వుందని తెలుసుకోవాలి. మళ్ళీ మళ్ళీ అదే లోపంవల్ల సమస్య తలెత్తిందంటే సాధకుడు తన జాగ్రత్తలో తానుండి ఇంకా ఇంకా వివేకమైన పద్ధతుల ద్వారా నిరంతర క్రియాశీలమైన ఇచ్ఛ ద్వారా ఆ లోపాన్ని పూర్తిగా వదిలించుకోడానికి ప్రయత్నం చేయాలి. అది వదిలించుకోలేనంత తీవ్రస్వరూపం దాలిస్తే, దానికి మార్పు చెందేందుకో అవకాశమివ్వాలి. ఆధ్యాత్మిక లక్షణాలు సాధించిన బుద్ధి యొక్క నిరంతర జాగరూకత వలనా, పట్టుదల వలనా అది మళ్ళీ తిరిగి రాకుండా చేయాలి. ఇలాంటి ప్రయత్నం కొనసాగితే ఆ అవగుణాల తాలుకు తీవ్రత తగ్గిపోతుంది. క్రమంగా అవి బలహీనపడి, బహిరంగంగా కనిపిస్తూ చివరకు మాయమవుతాయి. అప్పుడు పరమప్రశాంతత అనేది మన అస్తిత్వాన్ని నడిపే ధర్మమవుతుంది.

సమతాశాంతులు మన ఆయుధాలు

ఇలా మన మొత్తం అస్తిత్వంలో స్థిరపడిన ప్రశాంతి ఆరోగ్యంలోనూ, అనారోగ్యంలోనూ, సుఖంలోనూ దుఃఖంలోనూ, అతిదారుణ భౌతిక వేదనలోనూ మనకు సంబంధించినదైనా, మన ఆత్మీయులకు సంబంధించినదైనా,

అదృష్టమైనా, దురదృష్టమైనా, సన్మానమైనా, అవమానమైనా, నిందైనా, స్తుతైనా, మనకు జరిగిన న్యాయమైనా, అన్యాయమైనా – సామాన్యంగా మనస్సును కష్టపెట్టి మనమీద చూపిందేమైనా సరే – ఏం జరిగినా మనలో ఏ మార్పూ రాకూడదు. మనమలాగే వుండాలి. అన్నిటిలోనూ ఏకత్వం దర్శించి, ప్రతిదీ భగవంతుని సంకల్పం వలన జరుగుతుందని అర్థం చేసుకోవాలి. అప్పుడు జీవితమొక క్రీడగా మారిపోతుంది. మన శత్రువులైనా – మనల్ని ఎదుర్కొని అడ్డుకునే ప్రత్యర్థులైనా, మన స్నేహితులైనా – మనల్ని ఆదుకుని సహకరించే మిత్రులైనా, ఏ స్వరూపంలోనైనా శక్తులరూపంలో నైనా, సంఘటనల రూపంలోనైనా మన ఎదుట వ్యక్తమయ్యే వేటినైనా సరే, అన్నీ మన కంటే భిన్నం కాని ఆత్మస్వరూపంగా, మనలోని విశ్వాత్మ యొక్క అంశలుగా భావించే దృక్పథాన్ని అలవరచుకోవాలి. అలా అలవరచుకుంటే మన హృదయానికీ, మనస్సుకీ ఎంతో సుఖమూ, సౌఖ్యమూ, హాయి కలుగుతాయి. ఇటువంటి విశ్వజనీన దృష్టి అలవడే లోపలే, అది మనలో స్థిరపడే లోపలే మనకు సమతా, ప్రశాంతీ ప్రతిఫలాలుగా సిద్ధించాలని పట్టుపడితే, అవి సిద్ధింప జేసుకునే శక్తి మనకు లభిస్తుంది. మన అధీనంలోనే వుంటుంది. "స్వల్పం *అపిచధర్మస్య*" ధర్మాన్ని ఎంత స్వల్పంగా ఆచరించినా, అది మనం పరిపూర్ణత దిశగా వేసిన అడుగే అవుతుంది. ప్రథమంగా స్థిరత్వమనేదే మనల్ని విముక్తపథం లోనికి నడిపిస్తుంది. అది మనకు పూర్ణంగా లభిస్తే మనం సాధించబోయే ఆధ్యాత్మిక పురోగతికి అది భగవంతుని ఆభయముద్ర అవుతుంది. ఇదే గనక లేకపోతే మనకు ఆసరాగా స్పష్టమైన, నిర్దుష్టమైన ఏ ఆధారమూ వుండదు. ఇది లేదని మనకు ఒక వేళ తెలిస్తే మనం కామనలోకీ, అజ్ఞానంలోకీ అధోలోకాల్లోకీ జారుకుంటాము.

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

The Divine Worker

I face earth's happenings with an equal soul;
In all are heard Thy steps: Thy unseen feet
Tread Destiny's pathways in my front. Life's whole
Tremendous theorem is Thou complete.

No danger can perturb my spirit's calm:
My acts are Thine; I do Thy works and pass;
Failure is cradled on Thy deathless arm,
Victory is Thy passage mirrored in Fortune's glass.

In this rude combat with the fate of man
Thy smile within my heart makes all my strengh;
Thy Force in me labours at its gradiose plan,
Indifferent to the Time-snake's crawling length.

No power can slay my soul; it lives in Thee.
Thy presence is my immortality.

Sri Aurobindo

ముక్తజీవి

ఉర్వీమీద సంభవించు సంఘటనల నన్నింటిని నే
నరయగలను సమదృష్టితో, అంతర్యామి నరయగలను,
సర్వజనుల నడకలలో నీ పద నూపుర ధ్వానమ్మై వినగ గలను
విధి పథగాముల నడతల నీ యదృశ్యహస్త మరయగలను.
నా అంతఃప్రశాంతతను చెదరకొట్ట దేయాపద,
కర్తవ్యము నిర్వహించి నిష్క్రమింతు నా పథమున,
నీ అమృత కరాగ్రమున ఊయలూగు నపజయములు
అదృష్టమనెడి అద్దంబున నీ కదలికలే జయములు.

విధికిని మనిషికి జరిగెడి భీకర సంగ్రామమందు
నీ హృదిలో కదలాడిన దరహాసమె మా రక్షణ,
మహావ్యూహ నిర్వహణలో మాదు శ్రమయె నీ శిక్షణ.
కాల సర్పదీర్ఘ దంష్ట్రనన్నెప్పుడు డాయలేదు,
ఏ శక్తియు చీల్చలేదు నీ లోపలి నా యాత్మను,
నీ సన్నిధి నా కెప్పుడు అమృతత్త్వమహానుభూతి.

భానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

సమత యొక్క ఫలితము – సిద్ధి

మానవజీవితంలో చీకటివెలుగులు సుఖదుఃఖాలు మామూలే. ఇది మానవనేత్రాలకు కనిపించే విషయం. యోగసాధనలో సమతాభావము ఏర్పడినప్పుడు ఉత్తమజ్ఞానము కలిగి ఈ దృష్టి మారుతుంది. ఆనందమయశక్తి ఆవిష్కారమై ఈ మానవీయ విలువలను యథార్థమైన వెలుగులో చూపిస్తుంది. ఒక కార్యము వలన మానవదృష్టిలో అనుకున్న ప్రయోజనము కలుగవచ్చును. కలుగక పోవచ్చును. కాని యోగదృష్టికి అది ఎప్పుడూ ప్రయోజనకారియే. దాని ద్వారా దైవకార్యము నెరవేరుతుంది. మానవజీవితమంతా పరిణామము జెంది సుఖశాంతులను పొందుతుంది. కేవలం సుఖశాంతులే కాదు సమస్తమైన కార్యములు దైవకార్యములుగానే భాసిస్తాయి – అది మరో చేతనాస్థాయి.

– సంపాదకుడు

సమత వలన జరిగే పరివర్తనము

సమత్వము సుస్థిరమై ఒకానొక స్థాయికి జేరినప్పుడు కర్మల స్వరూపమే మారిపోతుంది. పై నుంచి ఆనందమయశక్తి దిగివచ్చి వ్యవహారములన్నిటిని నిర్వహిస్తుంది. మామూలుగా ప్రతి పనికి గెలుపుగాని, ఓటమిగాని ఉంటుంది.

కాని ఇప్పుడు గెలుపేగాని ఓటమి ఉండదు. ప్రతి ఒక్క సందర్భము, సన్నివేశము దైవనిర్దేశితమై ప్రయోజనవంతమే అవుతుంది. *బాహ్యకర్మ పూర్వం ఎలా వుందో అలాగే వుండి పోవచ్చు. లేదా మారవచ్చును. అదంతా పరమాత్మ ఆదేశం మేరకు జరిగి తీరుతుంది.* ప్రపంచం కోసం చేయవలసిన పని అవసరాన్ని బట్టి వుంటుంది. – కాని మొత్తం అంతర్గత కర్మాచరణ వేరే విధంగా వుంటుంది. జ్ఞానం, కర్మ, సుఖానుభవం, సృష్టి, విస్పష్ట వ్యక్తీకరణలలోని విభిన్న శక్తులకు సంబంధించి పరమాత్మ దివ్య చిచ్ఛక్తి విభిన్న జీవితలక్ష్యాల వైపు తనలో తాను నిర్దేశించుకుంటుంది. కాని దాని స్ఫూర్తి వేరుగా వుంటుంది. అవి పైన మెరిసే తన వెలుగులో దైవం నిర్దేశించిన లక్ష్యాలు, ఫలితాలు, వివిధ కర్మాచరణ రీతులుగా వుంటాయి. విడిగా తన కోసం అహంకారం కోరే విధంగా ఉండవు. ఆత్మ అధినేత సంకల్పానుసారం ఏది లభించినా దానితోనే మనస్సు, హృదయం, ప్రాణికం, శరీరం సైతం సంతృప్తి చెందుతాయి. అతిసూక్ష్మమైన, పూర్ణతమమైన, ఆధ్యాత్మికీకృతమైన తృప్తి, ఆనందం పొందుతాయి. కాని పైన గల భగవత్ జ్ఞానం, భగవత్ సంకల్పం మరింత విస్తృతమైన లక్ష్యాల వైపు పనిచేయడం ప్రారంభిస్తాయి.

ఓటమి లేదు. అంతా దైవకార్యనిమిత్తమే

ఇక్కడ జయాపజయాలు వాటి వర్తమాన అర్థాలను కోల్పోతాయి. అసలు అపజయం అంటూ వుండదు. ఏది సంభవించినా అది విశ్వాంతర లోకాల అధినేత సంకల్పం మాత్రమే. అది చివరి ఫలితం కాదు. ఆయన పథంలో మరో ముందడుగు. అది (ఏ సంఘటన అయిన) ఒక వేళ ప్రతిఘటనగా, ఓటమిగా, తిరస్కారంగా కనిపిస్తే, ఒక్క క్షణం పాటు ఉపకరణ కంటె ఆత్మ ముందున్న లక్ష్యం సంపూర్ణ తిరస్కృతిగా కనిపిస్తే, అది పైకి మాత్రమే అలా కనిపిస్తుంది. కాలక్రమంలో అతని కర్మాచరణ మితవ్యయంలో అది తన సక్రమ స్థానం పొందుతుంది. మరింత పూర్ణమైన అతిమానస దర్శనం వెంటనే

కానీ లేదా ముందుగా కానీ అది అవసరమని గ్రహిస్తుంది. కాలక్రమంలో లభించే ఫలితానికి గల సక్రమ సంబంధం గ్రహిస్తుంది. ఆ ఫలితం దానికి వైరుధ్యంగానో, బహుశా దాని నిర్దిష్ట నిషేధం గానో కనిపించవచ్చును. లేదా ఒకవేళ కాంతి కొరవడినప్పుడు, లక్ష్యానికి సంబంధించి, లేదా కార్యాచరణ తీరుకు సంబంధించి, లేదా ఫలితం యొక్క సోపానాలకు సంబంధించి అపవ్యాఖ్యానం గనుక జరిగితే, దానిని సరిదిద్దుకోడానికి వైఫల్యం సంభవిస్తుంది. నిరుత్సాహం రాకుండా, సంకల్పంలో ఒడిదుడుకులు లేకుండా వైఫల్యాన్ని (అపజయాన్ని) ప్రశాంతంగా స్వీకరించడం జరుగుతుంది. చిట్టచివరికి అసలు వైఫల్యమనేదే లేదని తెలుస్తుంది. అన్ని సంఘటనలు దైవసంకల్పం యొక్క సోపానాలుగా, విస్పష్ట వ్యక్తీకరణలుగా ఆత్మ భావించి, వాటిలో సమానమైన నిష్క్రియాత్మక, క్రియాత్మక (passive and active) ఆనందం అనుభవిస్తుంది. అదృష్ట, దురదృష్టాలు, మంగళం, అమంగళం, ప్రియమైనవి, అప్రియమైన వాటికి సంబంధించి ఒకే పరిణామం సంభవిస్తుంది.

సమతాదృష్టి మనుషులకు కూడా వర్తిస్తుంది

సంఘటనలకు మాదిరిగానే, వ్యక్తులకు సంబంధించి కూడా దృక్పథంలోనూ, వైఖరిలోనూ సమత్వం పరిపూర్ణమైన పరివర్తన తీసుకుని వస్తుంది. సమత్వబుద్ధి, సమత్వస్థితిలోని ఆత్మవల్ల తొలిఫలితంగా అంతకంతకు పెరిగే దాతృత్వం, వ్యక్తులు, దృక్పథాలు, భావాలు, కర్మలకు సంబంధించి అంతర్గత సహనం లభిస్తాయి. దీనికి కారణం – అందరిలోనూ భగవంతుణ్ణి వీక్షించడం, ప్రతివ్యక్తి తన స్వభావం, దాని వర్తమాన వ్యక్తీకరణల ప్రకారం ప్రవర్తించడం (కర్మ చేయడం) క్రియాత్మకమైన సమత్వ ఆనందం ఉన్నప్పుడు, ఇది సానుభూతిమయమైన అవగాహనగా ప్రగాఢమవుతుంది. చివరికి సమత్వ విశ్వజనీన ప్రేమగా రూపొందుతుంది.

బలవంతంగా మానవ అవరోధం పైన గానీ, ఇతర అవరోధం పైన గానీ పనిచేసే, లేదా మానవ అవరోధాన్ని, ఇతర

అవరోధాన్ని విచ్ఛిన్నం చేసే రుద్రశక్తి వెల్లువగా ముంచెత్త వచ్చును. ఎందుకంటే అతనికీ, ప్రపంచ ప్రయోజనానికీ అది అవసరం.

ఆధ్యాత్మిక సంకల్పం నిశ్చయించినట్లు, జీవన అవసరం బట్టి, పై వాటిలో ఏదీ కూడా అంతర్గత వైఖరిలోని విభిన్న వ్యక్తీకరణలను కాని, వివిధ సంబంధాలను కానీ నిరోధించవలసిన అగత్యం లేదు. అదే నిశ్చయం వల్ల అదే అవసరం, ప్రయోజనం సాధించడం కోసం ఇతర భావం, దృక్పథం, కర్మకు వ్యతిరేకంగా ఈ భావం, దృక్పథం, కర్మల గట్టి విస్తృతిని నిరోధించవలసిన అగత్యం లేదు. నిర్దేశిత గమనమార్గంలో అడ్డుగా నిలిచే శక్తులకు వ్యతిరేకంగా కర్మాచరణ, వైరుధ్యం బలీయమైన బాహ్య, అంతర్గత ప్రతిఘటనను నిరోధించ వలసిన అగత్యం లేదు.

> *పరాశక్తి కార్యశీలియై భిన్న రూపములను తాలుస్తుంది.*

పైకి మాత్రం కనిపించే ఈ వ్యక్తీకరణల వల్ల అంతర్నిహిత సమత్వ వైఖరి ఎంతమాత్రం మారదు. తగ్గదు. జ్ఞాన, ఇచ్ఛ, కార్యాచరణ, ప్రేమ "శక్తి" తన పని చేసుకుంటూ పోతూ, తన పనికి అవసరమైన వివిధ రూపాలు ధరిస్తుంటుంది. అదే సమయంలో ఆత్మ, అసలైన అంతరాత్మ యథాతథంగానే వుంటుంది. ఒకరికి అంతా – భగవంతుని ఉనికిలో సమస్త వ్యక్తులతో, శక్తులతో, దశలతో జ్యోతిర్మయమైన ఆధ్యాత్మిక ఏకత్వరూపం దాలుస్తుంది. ***ఇందులో ఒక వ్యక్తి కర్మాచరణ అందరి కార్యాచరణలో విడదీయరాని భాగం అవుతుంది.*** దాని నుండి విడిపోదు. విశ్వజనీన ఏకత్వపు సంక్లిష్ట రీతులలో అందరిలోనూ గల భగవంతునితో సంబంధంగానే ప్రతి వ్యక్తితోనూ గల సంబంధాన్ని పరిపూర్ణంగా భావించడం జరుగుతుంది.

అది ఒక పూర్ణత్వసిద్ధి (plenitude) విభజించే మానసిక హేతువు భాషలో దానిని వర్ణించడం అసంభవం. ఎందుకంటే,

అది తన వైరుధ్యాలన్నింటిని ఉపయోగించుకుంటుంది. అయినా వాటి నుండి తప్పించుకుంటుంది. మన పరిమిత మనస్తత్వ (mental psychology) పరిధిలో దానిని బిగించలేము. అది మరో చైతన్యసీమకు, మన అస్తిత్వపు మరో భూమికకు చెందినది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె. యజ్ఞన్న

కాలపాశ విముక్తులు

ఎల్లరకూ ఒకే ఆత్మగా, సంకుచిత బంధాలనుండి విముక్తమై,
కవోష్ణ సూర్యరశ్మి సీమలా సువిశాలమై,
విస్తార సమత్వపు నిష్పాక్షిక ఆనందంలో
ఈ ఋషులు సమస్త సృష్టి వస్తురాశిలో దాగిన భగవదానందం
కోసం ఊపిరితీస్తూ జీవించారు.
దేవతల ఆగమనానికి సహాయపడుతూ
యువమనస్సులలో అమరభావాలు వెదజల్లుతూ,
మానవజాతి మహాప్రస్థాన గమ్యమైన మహాసత్యాన్ని
ప్రబోధించారు,
కొద్దిమందికి ముక్తిద్వారాలు తెరిచారు.
పోరాటం సాగించే ప్రపంచానికి మహాత్కాంతిని ప్రసాదిస్తూ
నిస్తేజ కాలపాశం నుండి విముక్తమైన ఆత్మలుగా వారు
జీవించారు.
విశ్వమహాశక్తి నిండిన హిరణ్యపాత్రలు, ప్రాణమిత్రులు వారు.
సూర్యదేవుని లాగా సహజ సాధికారతను సమావిష్కరిస్తూ
వారి ప్రవచనం, ప్రవిమల నిశ్శబ్దం దివ్యసహాయమై దీపించాయి.

మూలం: శ్రీఅరవిందులు ("సావిత్రి" మహాకావ్యం నుండి)
అనువాదం:. కె. యజ్ఞన్న

ఆరోగ్యపత్రం

పనిచేసి అలసిపోవుట సహజమే. ఎందుకని అలా జరుగుతుంది? నిజానికి అంతరంగికంలో మనిషి స్థిరంగా అచంచలంగానే వుంటాడు. అదే మన ప్రాతిపదిక. మరి వ్యవహారంలో అది చెదిరిపోతుంది కదా! కాని మరో విషయాన్ని కూడా గమనించాలి. నిశ్చలతయే అతని మూలస్వభావమైనప్పటికి మనిషి కదలకుండా ఎంత సేపు కూర్చోగలడు? అదీ కుదరదు. దీనిని బట్టి నైశ్చల్యమే మన ప్రాతిపదిక అనియు, అది చెదిరిపోకుండా కర్మలు (వృత్తులు) ఆచరించుటయే దైవోద్దేశమనియు స్పష్టంగా తెలియగలదు. దేవుడు క్రీడాపరాయణుడు. ఆయనెప్పుడు బాధ పడడు.

*

తప్పించుకో శక్యం కాని తికమిక, వ్యాకులతలతో పనిచేయటం మనిషి స్వభావం. కాని దైవము అటులగాక స్వేచ్ఛగా అనంతమైన శాంతితో పనిచేస్తాడు. నిమ్నప్రకృతి పట్టు నుంచి బైటపడాల్నంటే మనం కూడా ఆ అనంతమైన ప్రశాంతతలో నిమజ్జనమై దానితో ఏకమై పోవాలి.

శ్రీఅరవిందులు

*

భగవంతుని మీద ధ్యానం నిలిపినప్పుడు కలిగే శాంతి, దివ్యవీక్షణములను గురించి ఎవరికీ తెలియదు.

*

అంతరాలలో నిక్షిప్తంగా ఉన్న ప్రశాంతతను పట్టుకొని దాన్ని శరీరంలోని ప్రత్యణువులోకి వ్యాపింప చేసినప్పుడు నీకు పూర్ణారోగ్యం చేకూరుతుంది.

మూలం: శ్రీమాత
అనువాదం: బి. వరలక్ష్మి



శ్రీఅరవిందులు – మృణాళినీ దేవి

అఖిల

అఖిల భారత పత్రిక

ఏప్రిల్ 2001

శ్రీఅరవిందులు – మృణాళినీ దేవి

ఏప్రిల్ 1901 – ఏప్రిల్ 2001

మృణాళినీ దేవి, శ్రీఅరవిందుల వివాహం నూరేళ్ళ క్రితం ఏప్రిల్ 1901 లో జరిగింది. కాని ఆ తర్వాత కాలంలో వారిరువురు తరచు విడిగానే ఉండేవారు. ఆ రోజుల్లో శ్రీఅరవిందులు రాజకీయ కార్యకలాపాల్లో నిమగ్నమై ఉండేవారు. ఆమెకు వ్రాసిన ఒక ఉత్తరంలో వారిలా వ్రాశారు. "నేను నా దేశాన్ని మాతృమూర్తిగా తలుస్తాను. ఆమెను మాతగా ఆరాధిస్తాను, పూజిస్తాను. ఒక రక్కసి తన తల్లి రొమ్ముపై కూర్చుని రక్తం పీల్చడం మొదలిడితే ఆమె తనయుడేం చెయ్యాలి? కిమ్మనకుండా కూర్చుని విందారగిస్తాడా? భార్యాబిడ్డలతో వినోదిస్తాడా? లేక తల్లికి విముక్తి కలిగించడానికి విజృంభిస్తాడా?" ఆయన 1910 లో పాండిచ్చేరి వచ్చేశారు. మానవాళిని అవిద్య, అచేతనల నుండి పూర్తిగా విముక్తి కలిగించడానికి యోగమార్గాన్ని అనుసరించారు. సం॥ 1918 లో శ్రీఅరవిందులు మృణాళినీ దేవి కిలా వ్రాశారు. "నీ విక్కడికి వచ్చి, నేను చేసే ప్రపంచకార్యంలో సహాయకారిగా ఉండవచ్చు". అయితే ఆమె కలకత్తా వీడి వచ్చేలోగానే, 'ఫ్లూ' బారినపడి, సం॥ 1918 డిసెంబరు 17 వ తేదీన, తన ముప్పది రెండవ ఏట మరణించారు.

శ్రీఅరవిందులు మృణాళినీ దేవికి వ్రాసిన కొన్ని ఉత్తరాలనూ[1], సం॥ 1987 లో ఆమె శతజయంతిని పురస్కరించుకుని ఆశ్రమంలో

---

[1] ఆలిపూర్ బాంబు కేసు విచారణ సందర్భంగా గ్రే స్ట్రీట్ భవనము తనిఖీలో దొరికిన ఈ లేఖలను పోలీసులు ఎత్తుకొనిపోయి, తర్వాత కోర్టులో దాఖలు చేసేరు. ఈ విధంగా అలాంటి ఆంతరంగిక పత్రాలు అకస్మాత్తుగా వెలుగులోకి వచ్చాయి. శ్రీఅరవిందులు ఏవైతే దాపరికంగా ఉంచాలని అభిలషించారో అవి బహిరంగమయినవి. ఈ లేఖల ఆంగ్లమూలములు బెంగాలీ నుండి అనువదించబడ్డాయి.

శ్రీ నిరోద్‌బరన్ గారు చేసిన ప్రసంగాన్ని ఈ సంచికలో సమర్పిస్తున్నాము. ఈ రెండు వ్యాసాలు వారి జీవితాల్లోని కొన్ని విషయములను పాఠకులు అర్థం చేసుకోడానికి దోహదం చేస్తాయని, అసలు శ్రీఅరవిందులు ఎందుకు వివాహం చేసుకున్నారని, చాలా మందిని కలవరపెట్టే చిక్కు ప్రశ్నకు సమాధానం దొరకు వచ్చునని ఆశిస్తున్నాం.

*

ఇతర వ్యాసాలు

1905 ఆగస్టు, 30

ప్రియాతి ప్రియమైన మృణాళినీ,

నీ ఆగస్టు 24 ఉత్తరం అందింది. మీ తల్లిదండ్రులకు మరో విపత్తు సంభవించిందని తెలుసుకుని విచారించాను. వారి కుమారులలో ఎవరు ఈ లోకాన్ని విడిచి వెళ్ళారో నువ్వు వ్రాయ లేదు. విధి విరుచుకు పడినప్పుడు చేయగలిగేది ఏముంటుంది?

సుఖం కోరుకుంటూ ఉంటే కష్టం ఎదురయ్యే ప్రపంచం ఇది. ఆనందాన్ని దుఃఖం సదా ఆవహించుకునే ఉంటుంది. కేవలం సంతానం విషయంలోనే కాదు. లౌకికమైన కోర్కెలన్నింటికి ఇది వర్తిస్తుంది. కష్టసుఖాలన్నిటిని దృఢచిత్తంతో భగవంతుని చరణా లకు సమర్పించుకోవడం ఒకటే దీనికి విరుగుడు.

సరే. నేను నీతో లోగడ చెప్పిన విషయాన్ని ఇప్పుడు ప్రస్తావిస్తున్నాను. అత్యంత అసాధారణ లక్షణం గల ఓ వ్యక్తితో నీ జీవితం ముడివడి ఉందన్న విషయాన్ని ఈ పాటికి అవగాహన చేసుకునే ఉంటావని భావిస్తున్నాను. నా కర్తవ్యము, జీవితాశా యము, ఈ దేశం లోని నేటి ప్రజల వాటి కంటె భిన్నము. ఏ రకంగా చూసినా ప్రతీ విషయంలోనూ సామాన్య ప్రజలకు భిన్న మైన వాడిని నేను.

మామూలు ధోరణికి అతీతంగా ఉండే అసాధారణ దృక్ప థాన్ని, అసాధారణ ధ్యేయాన్ని, అలౌకిక ఆకాంక్షను గురించి లోకులు ఏమనుకుంటారో నీకు తెలిసే ఉంటుంది. వారి దృష్టిలో అది ఒక పిచ్చి. అటువంటి పిచ్చివాడు తన కార్యంలో విజయం సాధిస్తే అప్పుడు ఆయన్ని ఇక పిచ్చివాడు అనరు. మహా మేధావి అంటారు. అయితే అటువంటి పిచ్చివారిలో ఎంతమంది తమ ధ్యేయసాధనలో విజయం సాధిస్తారు? వెయ్యిమందిలో ఏ ఐదా రుగురో ఉంటారు. వారిలో విజయం సాధించేవారు ఏ ఒక్కరో ఉండవచ్చు.

విజయం సంగతి అలా ఉంచితే, అసలు నేను ఇంకా నా కర్మక్షేత్రం లోకి పూర్తిగా ప్రవేశించనే లేదు. నన్ను నువ్వు పిచ్చి వాడిగానే జమకట్టు. పిచ్చివాడి చేతిలో పడ్డం అనేది ఏ మహిళ

కైనా దురదృష్టకరమైన విషయం. మహిళల ఆశయాలు, ఆకాంక్షలు అన్నీ ఈ లోకపు కష్టసుఖాలకు సంబంధించినవే అయి ఉంటాయి. అటువంటప్పుడు పిచ్చివాడు తన భార్యను అయోమయంలో పడే యడం తప్ప ఏ మాత్రం సుఖపెట్ట లేడు.

హిందుమత స్థాపకులకు ఈ విషయం బాగా తెలుసు. వారు అసాధారణ వ్యక్తిత్వాలను, అసామాన్య ధ్యేయాలను అలౌకిక ఆకాంక్షలను అభిమానిస్తారు. వెర్రో, వేదాంతమో ఏదయితేనేం వారు అసామాన్య వ్యక్తిని గౌరవిస్తారు. అయితే మొత్తం మీద ఇది గృహిణికి ఓ ఇబ్బందిగా తయారైంది. దీన్ని పరిష్కరించడం ఎలా? మహర్షులు దీనికి పరిష్కార మార్గం చూపారు.

"భర్తే పరమగురువు అనేది గృహిణికి ఏకైక మంత్రం అని తెలుసుకోండి" అని వారు మహిళలకు ఉపదేశిస్తారు. "ధర్మ పత్ని తన భర్తకు సహధర్మచారిణి. తన భర్త స్వీకరించిన ధర్మం ఏదైనప్పటికి దానికి సహకరించాలి. ప్రోత్సాహం అందిం చాలి. భర్తను దైవంగా భావించాలి. ఆయన సంతోషంలోనే తనూ సంతోషం పొందాలి. ఆయన కష్టాలు తన కష్టాలు కావాలి. కర్మ లను ఎంచుకోవడం పురుషుని వంతు. దానికి సహాయ సహకా రాల్ని అందివ్వడం మహిళల వంతు."

ఇప్పుడు అసలు విషయం ఏమిటంటే –

నువ్వు హిందూసాంప్రదాయాన్ని ఎంచుకుంటావా? లేక నూతన సంస్కృతి, ఆదర్శాలను అనుసరిస్తావా? ఈ పిచ్చివాడితో నీ వివాహం గత జన్మలో నువ్వు చేసుకున్న పాపాల ఫలితమే. కాబట్టి విధివ్రాతతో రాజీపడటమే మంచిది.

లోకులు అనుకున్నట్లుగా నువ్వు కూడా నీ భర్తను పిచ్చి వాడని తీసిపారేస్తావా? పిచ్చివాడు తన పిచ్చిమార్గాలనే అనుస రించవలసి వస్తుంది. వాటి నుండి ఆయన్ని మరల్చలేకపోతున్నా వంటే, నీ ప్రయత్నం కంటె ఆయన నైజం బలమైనదన్న మాట. అటువంటప్పుడు నువ్వు ఏమీ చేయలేక ఓ మూల కూర్చుని విలపిస్తావా? లేక ఓ అంధచక్రవర్తి సతీమణి తన కళ్ళకు గంతలు కట్టుకుని తను కూడా అంధురాలిగా మసిలినట్లు నువ్వు కూడా

నీ భర్తను అనుసరిస్తూ పిచ్చివాడి పిచ్చిభార్య కావడానికి యత్ని స్తావా? నువ్వు బ్రహ్మో విద్యాలయంలో చదువుకున్న దానివి. హిందూ కుటుంబంనుండి వచ్చిన మహిళవు. పూర్వుల హిందూ రక్తం నీ నరనరాల్లో ప్రవహిస్తోంది. దీన్ని బట్టి నువ్వు రెండో మార్గాన్నే ఎంచుకుంటావు. అందులో నాకు ఎటువంటి అను మానం లేదు.

నాకు మూడు వెఱ్ఱిలు ఉన్నాయి.

మొదటిది: ఈ సామర్థ్యము, మేధస్సు, ఉన్నతవిద్య, జ్ఞానం, ఈ సంపదా – ఇవన్నీ భగవంతునివని, వాటిని ఆయన నాకు ప్రసాదించాడని ప్రగాఢంగా విశ్వసిస్తాను. కుటుంబ పోషణకు అవసరమైనంత మేరకు, లేదా కచ్చితంగా తప్పనిసరి అయి నప్పుడు మాత్రమే వాటిని నా సొంతానికి వినియోగించుకునే హక్కు నాకుంది. మిగిలిన వానిని భగవంతునికి తిరిగి ఇచ్చేసె య్యాలి. వినోదానికో, ఆడంబరానికో ఆ మొత్తాన్ని నా కోసం వినియోగించుకుంటే నేను దొంగనే అవుతాను. "పరమాత్ముడు ప్రసాదించిన సంపదను తిరిగి ఆ పరమాత్మునికే ఇవ్వకపోతే, వారు దొంగకిందే లెక్క" అని హిందూశాస్త్రాలు చాటుతున్నాయి.

ఇంతవరకు నేను రెండు అణాలు[2] భగవంతునికి ఇచ్చి మిగిలిన 14 అణాలు నా స్వంత సౌఖ్యానికి వాడుకున్నాను. నా సంపాదన ఇలా ఖర్చు అయింది. ఇప్పటికే నా జీవితంలో సగం భాగం ప్రాపంచిక సుఖాలలో పడి వృధా అయిపోయింది. కడుపు నింపుకోవడం, తన వారి కడుపు నింపడం, వారి అవసరాలు తీర్చడం వంటి వాటిని పశువు సైతం నెరవేరుస్తుంది.

ఇంతవరకు నేను ఓ పశువులాగ, ఓ దొంగలాగ ప్రవర్తిం చానని నేను తెలుసుకున్నాను. దానికి నేను ఇప్పుడు పశ్చా త్తాపం చెందుతున్నాను. ప్రాపంచిక సుఖాల పట్ల వైముఖ్యం కలి గింది. ఇవేవీ ఇక వద్దు. ఈ పాపాల్ని ఇక పూర్తిగా త్యజించాను.

ఇంతకీ, భగవంతునికి తిరిగి ఇవ్వడం అంటే ఏమిటి?

---

[2] ఆ రోజుల్లో 16 అణాలు ఒక రూపాయి



Sri Aurobindo (at Bombay, January 1908)

మంచి కార్యాలకు వినియోగించడం అన్నమాట.

ఉపకో, సరోజినికో సొమ్ము ఇవ్వడం నాకు విచార హేతువు కానేరదు. ఇతరులకు సహకరించడం ఓ పవిత్రమైన విధి. శరణు కోరిన వారికి రక్షణ ఇవ్వడం అంటే మరింత పవిత్ర విద్యుక్తధర్మం. అలా అని స్వంత అన్నదమ్ములకో, అక్కచెల్లెళ్లకో మాత్రమే ఇస్తే సరిపోదు.

ఈ చీకటి యుగంలో దేశం మొత్తం అంతా నా శరణు వేడుతోంది. ఈ దేశంలో 30 కోట్లమంది సోదరసోదరీమణులు ఉన్నారు నాకు. వారిలో చాలామంది ఆకలితో అలమటిస్తూ మరణిస్తున్నారు. ఎక్కువ మంది దుఃఖంతోనూ, కష్టాలతోను సతమతమౌతూ జీవితాలను ఏదో విధంగా నెట్టుకువస్తున్నారు. వారిని కూడా ఆదుకోవాలి.

నువ్వు ఏమంటావు?

నా దగ్గరికి వచ్చి ఈ విధమైన నా ఆదర్శంలో పాలు పంచుకుంటావా? తిండి, బట్టల విషయంలో మనం అతిసామాన్యంగా మసులుకుందాం. వాస్తవంగా అవసరమైన వాటికే వెచ్చిస్తూ మిగిలిన దానిని భగవంతునికి అర్పిద్దాం. ఇలా చేయాలనే నేను నిర్ణయించుకున్నాను. నువ్వు దీనికి అంగీకరించి, త్యాగం చేయడానికి సంసిద్ధత చూపినప్పుడు మాత్రమే నా ధ్యేయం సఫలం కాగలదు.

"నేను ఏమీ అభివృద్ధి సాధించ లేకపోయాను" అని నువ్వు అంటూండే దానివి. అభివృద్ధికి ఇప్పుడు నేను ఓ మార్గం చూపించాను. ఈ మార్గాన్ని అనుసరిస్తావా నువ్వు?

ఇక నా రెండో పిచ్చి: ఈ మధ్యే అది నన్ను పట్టుకుంది. ఏదో విధంగా నేను భగవంతుణ్ణి ప్రత్యక్షంగా చూడాలి. ఈ రోజుల్లో మతం అంటే – సమయం సందర్భం లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు భగవన్నామం స్మరిస్తూ ఉండడం, బహిరంగ ప్రార్థనలు చేయడం, తన ధార్మికత్వాన్ని డంబంగా చాటి చెప్పుకోవడం. ఇవేవీ నాకు వద్దు. భగవంతుడు నిజంగా ఉన్నట్లయితే, ఆయనను తెలుసుకోవడానికి ఏదో మార్గం ఉండే ఉంటుంది. ఆ

మార్గం ఎంత కష్టమైనదైనా సరే, దానిని అనుసరించాలనే నేను నిశ్చయించుకున్నాను.

ఆ మార్గం కోసం వెతుక్కోనక్కర్లేదు. అది ప్రతీవారి శరీరంలోను, ప్రతీవారి మనస్సులోను నిక్షిప్తమై ఉందని హిందూమతం పరిగణిస్తోంది. ఆ మార్గాన్ని అనుసరించడానికి కొన్ని నియమాలు కూడా నిర్దేశింపబడినవి. నేను వాటిని అనుసరించడం ప్రారంభించాను. హిందూమతం చెప్పింది బూటకం కాదని నెల రోజుల్లోనే తెలుసుకో గలిగాను. దాని ఫలితాలను నాలో అనుభూతి చెందుతున్నాను. ఇప్పుడు నిన్ను కూడా ఆ మార్గంలోకి తీసుకురావాలని వాంఛిస్తున్నాను. దీనికి అవసరమైన విజ్ఞానం నీకు లేకపోవడం వల్ల నాతోపాటు నువ్వు ఒక్క అడుగు కూడా వేయలేకపోవచ్చు గాని, నన్ను అనుసరించడానికి మాత్రం నీకు ఏ ఆటంకం ఉండబోదు. ఈ మార్గంలో అందరూ పరిపూర్ణతను సాధించగలరు. అయితే ఈ మార్గంలోకి రావడం అన్నది వారి మనోభీష్టంపై ఆధారపడి ఉంటుంది. బలవంతంగా మాత్రం నిన్ను ఎవరూ ఈ మార్గంలోకి లాగలేరు. ఈ మార్గాన్ని నువ్వు అంగీకరిస్తే దీన్ని గురించి మరింతగా తెలియ జేయగలను.

ఇక నా మూడో పిచ్చి గురించి: ఇతరులు, వారి దేశాన్ని ఓ జడపదార్థంగా మాత్రమే చూడగలరు. పచ్చిక బయళ్ళూ, పొలాలూ, అడవులు, పర్వతాలు, నదులు – వీటినే చూడగలరు. నేను మాత్రం నా దేశాన్ని ఒక మాతృమూర్తిగా దర్శిస్తాను. తల్లిగా కీర్తిస్తాను. అమ్మగా ఆరాధిస్తాను. తన తల్లి గుండె మీద ఓ రాక్షసి కూర్చుని రక్తాన్ని పీల్చడం ప్రారంభిస్తే – తనయుడు ఏం చేస్తాడు?

హాయిగా కూర్చుని ఆహారం ఆరగిస్తాడా?

భార్యాబిడ్డలతో వినోదిస్తాడా?

లేదా తన తల్లికి విముక్తి కలిగించడానికి పౌరుషంతో విజృంభిస్తాడా?

పతనం చెందిన ఈ జాతిని విముక్తి కలిగించే శక్తి నాకు ఉందని తెలుసు. అది ఆయుధశక్తి కాదు. కత్తులతోను తుపాకుల

తోను యుద్ధం చేయడానికి సన్నద్ధం కావడం లేదు. అది మరొక రకమైన విద్య. క్షాత్రతేజంతో సరికాదు. బ్రాహ్మణశక్తి కూడా ఉంది. జ్ఞానం వల్ల ఆవిర్భవించిన శక్తి అది – ఇదంతా నాలో నూతనంగా ఆవిర్భవించిన భావన కాదు. ఈనాటిది కాదు. దాంతో నేను జన్మించాను. అది నా అణువు అణువునా నిక్షిప్తమై ఉంది. మహోత్కృష్టమైన ఈ కర్తవ్యాన్ని పూర్తి చేయడానికే దేవుడు నన్ను ఈ భూమ్మీదకు పంపినాడు. 14 ఏళ్ళకే ఆ బీజం నాలో అంకురించింది. 18 ఏళ్ళు వచ్చేసరికి దృఢంగా వేళ్ళూని అచంచలమైన నిర్ణయంగా బలం పుంజుకుంది.

మా 'ఆంటీ' చెప్పిన మాటలు నమ్మి – కొంతమంది దుష్టులు అమాయకుడైన నీ భర్తను ఈ అపమార్గంలోకి లాగారన్న అభిప్రాయాన్ని ఏర్పరచుకున్నావు. అయితే అమాయకుడైన నీ భర్త వందలాది ప్రజలను, మంచో, చెడో, ఆ మార్గంలోకి లాగాడు. ఇంకా వేలాదిమందిని తీసుకురాగలడు. ఈ కార్యం నా జీవితకాలంలో నెరవేరుతుందని నేను అనుకోను. కాని అది నిశ్చయంగా జరిగి తీరుతుంది.

నువ్వు ఏం చేయదలచుకున్నావని ఈ సందర్భంగా నిన్ను అడుగుతాను. భార్య అంటే తన భర్తకు బలాన్ని ఇచ్చే శక్తి. ఉషాదేవి మాటలు విని తెల్లదొరలనే అనుకరిస్తావా? నిర్లక్ష్య భావంతో నీ భర్త బలాన్ని క్షీణింప జేస్తావా? లేక సహానుభూతి, సహకారాలతో సహధర్మచారిణిగా దాన్ని ద్విగుణీకృతం చేస్తావా?

"నావంటి సామాన్య గృహిణి అటువంటి గొప్ప విషయాలలో ఏం చేయగలదు? నాకు మనోనిబ్బరం లేదు. తెలివితేటలు లేవు. అటువంటి విషయాలను గురించి ఆలోచించడం అంటేనే భయం నాకు" అని అంటావు. దానికి ఓ సులువైన మార్గం ఉంది. భగవంతుణ్ణి శరణు వేడుకో. భగవదనుభూతి మార్గంలో ప్రవేశించు. నీ లోపాలన్నిటిని ఆయన వెంటనే పరిహారిస్తాడు. భగవంతుని శరణుజొచ్చిన వారిని భయం క్రమేపి వీడిపోతుంది. నా మీద పూర్తి విశ్వాసం ఉంచగలిగితే, ఎవరెవరో చెప్పిన మాటలు కాక నా ఒక్కరి మాటే వినగలిగితే, నా స్వీయ బలాన్ని నీకు

ఇవ్వగలను. అలా ఇవ్వడం వల్ల నా బలం పెరుగుతుందే తప్ప ఏమాత్రం క్షీణించదు. భార్యయే భర్త యొక్క 'శక్తి', ఆయన బలము అని అంటాము. అంటే భార్యలో తన ప్రతిభను చూసి, తన ఉన్నత ఆశయాల ప్రతిధ్వనిని విన్నప్పుడు భర్త బలం రెట్టింపు అవుతుంది అనమాట.

"నేను అందమైన దుస్తులు ధరిస్తాను, ఇష్టమైన మృష్టాన్న భోజనం చేస్తాను. నవ్వుతూ, త్రుళ్ళుతూ సౌఖ్యాలలో తేలిపోతాను" అనుకుంటూ ఎప్పటికీ ఇలాగే ఉండిపోతావా? కాని ఈ వైఖరి అభ్యుదయం కానే కాదు.

ప్రస్తుతం మన దేశంలో మహిళల జీవితం సంకుచితమైపోయింది. ప్రయోజన శూన్యంగా మారింది. కాబట్టి వాటి నన్నిటిని వదిలేసెయ్యి. నన్ను అనుసరించు. భగవత్కార్యం నిర్వహించడానికి మనం ఈ లోకానికి వచ్చాం. దానిని ప్రారంభిద్దాం.

నీ నైజంలో ఓ లోపం ఉంది. నువ్వు మరీ అమాయకురాలివి. ఎవరు ఏమి చెప్పినా నమ్మేస్తావు. దాంతో నీకు మనశ్శాంతి ఎప్పుడూ కరువు అవుతూనే ఉంటుంది. నీ తెలివితేటలు ఏ మాత్రం పెరగవు. ఏ పనిమీదా ఏకాగ్రత ఉండదు. దీన్ని సరిదిద్దుకోవాలి. ఒక వ్యక్తి మాటలు మాత్రమే వినాలి. జ్ఞానాన్ని సంతరించుకోవాలి. ఒకే ధ్యేయం ఉండాలి. స్థిరమైన నిర్ణయంతో నీ పనిని సఫలం చేసుకోవాలి. ఇతరులు వేసే నీలాపనిందలను, చేసే హేళనలను పట్టించుకోకుండా నీ కర్తవ్యానికి అంకితమైపోవాలి.

నీలో మరో లోపం కూడా ఉంది. అది పూర్తిగా నీ నైజ లక్షణం కాదు. వర్తమాన కాల ప్రభావం. ప్రస్తుతం బెంగాలీలు సీరియస్ విషయాలను సీరియస్‌గా తీసుకో లేకపోతున్నారు. మతం, ధార్మికత్వం, ఉదాత్త ఆశయాలు, ఉన్నత ధ్యేయాలు, మాతృదేశ విమోచనం – ఇవన్నీ చాలా ముఖ్యమైనవీ, గంభీరమైనవీను. అయితే ఉదాత్తమైన ఈ విషయాలు అన్నీ కొరగానివిగా మారిపోయాయి. ప్రతీ దానిని ప్రజలు తేలికగా నవ్వులా

టగా తీసుకోవాలనుకుంటున్నారు. నీ బ్రహ్మోపాఠశాలల లోని ఈ లోపం నీకూ అబ్బింది. బారీకీ కూడా అబ్బింది.

ఈ జాడ్యం వల్ల మనందరం కొంత మేరకు కళంకితులం అయిపోతున్నాం. దేవఘర్ ప్రజలలో ఇది మరీ ఆశ్చర్యకరమైన స్థాయిలో పెరిగిపోతోంది. ఈ వైఖరిని దృఢమైన చిత్తంతో తొలగించుకోవాలి. దీన్ని నువ్వు సులువుగా చేయగలవు. ఈ చింతన కనుక నువ్వు అలవాటు చేసుకోగలిగితే నీ అసలు స్వరూపం నీలో వికసిస్తుంది. ఇతరులకు మంచి చేస్తూ, స్వార్థత్యాగం చేసే సహజ సిద్ధమైన లక్షణం నీలో వస్తుంది. నీకు లేనిదల్లా ఒకటే. అది మనోబలం. భగవదారాధన ద్వారా అది నీకు సిద్ధిస్తుంది.

నీకు చెప్పదలచుకున్న నా ఆంతర్యం ఇదే! దీనిని ఎవరికీ చెప్పకు. ఈ విషయాలను గురించి నీలో నీవు, శాంతంగా నెమరు వేసుకో. దీన్ని గురించి బాగా ఆలోచించవలసిందే తప్ప భయ పడవలసింది ఏదీ లేదు. ప్రార్థనా రూపంలో నీ మనోభీష్టాన్ని నివేదించుకుంటూ, రోజూ ఓ అరగంటో గంటో దైవధ్యానం ప్రారంభించు. దీని కంటే మరేమీ అవసరం లేదు. మనస్సు క్రమేపీ సమాయత్తం అవుతుంది.

భగవంతుణ్ణి ఇలా ప్రార్థించు

"నా భర్త జీవన మార్గానికి గాని, ఆయన ఆశయాలకు గాని, భగవంతుణ్ణి తెలుసుకునే ఆయన ధ్యేయానికి గాని నేను అవరోధం కాకుండా ఉండాలి. నేను ఆయనకు సదా సహకారిగా, పరికరంగా ఉండాలి" మరి ఇలా చేయగలవా?

ఇట్లు
నీ

మూలం: ఎ.బి.పురాణిగారి 'శ్రీఅరవిందుల జీవితం'
అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు

1907 డిసెంబరు 6

ప్రియమైన మృణాళినీకి,

నీవు వ్రాసిన ఉత్తరం నాకు మొన్ననే అందింది. అదే రోజున శాలువాను పంపించాను. మరి నీకెందుకు అందలేదో తెలియడం లేదు....

ఇచ్చట (కలకత్తాలో) నాకు ఒక క్షణంకూడ తీరిక లేదు. నేను వ్రాతపని చేసే బాధ్యతలో ఉన్నాను. కాంగ్రెసు పనీ నా అధీనంలోనే ఉంది. వందేమాతరం వ్యవహారం నేను పరిష్కరించ వలసి ఉంది. వాటన్నిటిని తట్టుకోడం నాకు కష్టంగా ఉంది. ఇంకా నా స్వంతపని కూడా ఉంది. దానినీ అశ్రద్ధ చేయడానికి వీలులేదు.

నా కోరిక ఒకటి మన్నిస్తావా? ప్రస్తుతం నాకు చాలా ఆందోళనకరమైన సమయం. ఎంతవాడినైన పిచ్చివాడిని చెయ్యగ లిగేటంతటి శక్తులు అన్ని వైపుల నుండి నన్ను తాడిస్తున్నాయి. ఇప్పుడు నీవు కూడా కలత చెందితే, అది నా చింత, వ్యాకు లతలను పెంచుతుంది. అలా కాక నీవు ప్రోత్సాహపరచే ఊర డించే లేఖలు వ్రాస్తే నాకు చాలా ఊరట కలుగుతుంది. అప్పుడు నేను అన్ని బెదురులను, విపత్తులను ఉల్లాసంగా, ధైర్యంగా అధి గమిస్తాను. దేవఘర్‌లో ఒంటరిగా ఉండడము నీకు చాలా కష్టమని నాకు తెలుసు. అయితే నీ మనస్సు నిబ్బరంగా ఉంచు కుని, విశ్వాసం కలిగి ఉంటే దుఃఖములు నిన్నంతగా ముంచి వేయలేవు. నన్ను వివాహం చేసుకున్నావు కనుక నీ కిలాటి దుఃఖము అనివార్యము. అప్పుడప్పుడూ ఇలాంటి వియోగములు తప్పించలేము. ఏమంటే, సామాన్యమైన బెంగాలీవలె నేను కుటుం బము, బంధువుల సౌఖ్యాన్ని జీవితంలో ప్రధానాశయంగా చేసు కోలేను. ఇట్టి పరిస్థితుల్లో నీకు వేరే మార్గం లేదు. నా ఆశయాలే నీ ఆశయాలుగా ఎంచుకుని నాకు నిర్దేశితమైన కార్యములో సఫ లతయే నీ సంతోషంగా భావించుట తప్పని సరి. మరో విషయం. ప్రస్తుతం నీతో ఉన్నవారు చాలామంది మన పెద్దవాళ్లే. పరుషము, పక్షపాతము అయిన మాటలాడినా వారిపై కోపగించరాదు, ఉద్దేశ

పూర్వకంగా నీ మనసు నొప్పించాలని చేశారని తలచవద్దు. కోపంలో అనాలోచితంగా మాటలు వస్తాయి. వాటినే పట్టుకుని ఉండడము మంచిది కాదు. ఉండడానికి నీకింకా బొత్తిగా వీలు కాకపోతే నేను గిరీషబాబుతో మాట్లాడతాను. నేను కాంగ్రెసు పనిమీద ఉన్నపుడు మీ తాతగారు వచ్చి నీతో ఉంటారు.

ఇవాళ నేను మిడ్నాపూరు వెళుతున్నాను. ఇచ్చట కావలసిన ఏర్పాట్లు నేను తిరిగివచ్చాక చేస్తాను. ఆ పిమ్మట సూరతు వెడతాను. బహుశా అది 15, 16 తారీఖుల్లో కావచ్చు. జనవరి రెండో తేదీకి తిరిగి వస్తాను.

ఇట్లు
నీ

మూలం: ఎ.బి.పురాణిగారి 'శ్రీఅరవిందుల జీవితం'
అనువాదం: వై.యస్.వి.యస్.మూర్తి

*

23, స్కాట్స్ లేన్,
కలకత్తా,
1908 ఫిబ్రవరి 17[3]

ప్రియమైన మృణాలినీ,

చాలా కాలంగా నీకు వ్రాయ లేదు. ఇది నాకు నిత్యం ఉండే లోపమే. నీ మంచితనంతో నన్ను క్షమించకపోతే నేనేమి చెయ్యను? ఇది నా స్వభావం – ఒక్క రోజులో పోయేది కాదు.

---

[3] ఈ ఉత్తరం వ్రాతపతిలో 19 ఫిబ్రవరి 1907 అని ఉన్నది. కానీ అది పొరబాటే. 1907 ఫిబ్రవరిలో శ్రీఅరవిందులు దేవఘర్‌లో ఉన్నారు. స్కాట్స్ లేన్ లోని ఇల్లు, 1908 ఫిబ్రవరిలో సూరత్ నుండి శ్రీఅరవిందులు తిరిగి వచ్చేటంత వరకు తీసుకొనబడనట్లు కనిపిస్తోంది. ఆలీపూర్ బాంబు కేసులో ఈ ఉత్తరాన్ని సాక్ష్యాధారంగా చూపించిన సందర్భంలో 1909 లో జడ్జి దానిని గురించి ఇలా అన్నారు "1907 ఫిబ్రవరి తప్పకుండా పొర బాటే .... 1908 బదులు అలా ఉన్నది."

బహుశా ఈ లోపాన్ని సరిదిద్దుకోవడానికి నాకీ జీవితమంతా పట్టవచ్చు.

నేను జనవరి 8 కే రావలసింది. కాని రాలేకపోయాను. ఇది బుద్ధిపూర్వకంగా చేయలేదు. భగవంతుడెక్కడికి తీసుకొని వెడితే నేనక్కడకు వెళ్లాలి. ఈసారి నేను నా స్వంతపని మీద వెళ్ల లేదు. దైవకార్యముపై వెళ్లేను. నా మానసిక స్థితిలో ఒక మార్పు వచ్చింది. అయితే ఆ విషయము నేను ఈ లేఖలో ముచ్చటించ దలచుకోలేదు. నువ్వు ఇచ్చటకు రా. చెప్పవలసినదంతా చెబుతాను. కాని ఇప్పుడు చెప్పాల్సింది ఒకటి మాత్రము ఉంది. అదేమంటే ఇక నుంచి నా ఇచ్ఛకు నేను అధిపతిని కాదు. కీలు బొమ్మలాగ భగవంతుడు నన్నెచ్చటకు పట్టుకొని వెళ్తే అచ్చటకు వెళ్లాలి. ఆయన నన్నెలాగ ఆడిస్తే అలాగ ఆడాలి. ఈ మాటల అర్థం ఇప్పుడే నీవు గ్రహించడం కష్టం. అయినా నీకు తెలియజేయడము నా విధి. లేనిచో నా ప్రవర్తన నీకు విచారాన్ని, దుఃఖాన్ని కలుగజేయవచ్చు. నా పనివత్తిడిలో నిన్ను పట్టించుకోవడము లేదు అనుకుంటావేమో కాని అలా అనుకోకు. ఇప్పటికే నీ ఎడల నేను చాలా అపరాధములు చేసేను. సహజంగా ఇది నిన్ను నిరుత్సాహపరచి ఉంటుంది. అయితే నేనింక ఎంత మాత్రము స్వతంత్రుడను కాను. ఇకపై నేను చేసేదంతా భగవదాదేశము మేరకే గాని, నా అభీష్టం కాదని నీకు తెలియాలి. నీవు ఇక్కడకు వచ్చినపుడు నా మాటలు అవగతమవుతవి. భగవంతుడు తన అనంతమైన ఔదార్యంతో నాకు ప్రసాదించిన వెలుగునే నీకూ చూపగలడని ఆశిస్తున్నాను. కాని అది ఆయన ఇచ్ఛపైనే ఆధారపడి ఉంటుంది. నీవు నా జీవన, ఆదర్శాల భాగస్వామి కావాలనుకుంటే, నీ యావచ్ఛక్తితో ప్రయత్నించాలి. గట్టి పట్టుదల వలన నీకు కూడా ఆయన మార్గాన్ని తెలియజేయగలడు. ఈ లేఖను ఎవరినీ చూడనివ్వకు. ఎందుకంటే నేను చెప్పిందంతా చాలా రహస్యమైనది. నీకు తప్ప మరెవ్వరికీ చెప్పియుండ లేదు. చెప్పడం నిషిద్ధం కూడా. ఇవాళ కింతే సంగతులు.

నీ భర్త

తాజా కలం:

ఇంటి విషయాలను గురించి సరోజినికి వ్రాశాను. ఆ ఉత్తరం చూస్తే వాటిని గురించి నీకు వేరే వ్రాయనవసరం లేదని నీకే తెలుస్తుంది.

మూలం: ఎ.బి.పురాణిగారి 'శ్రీఅరవిందుల జీవితం'
అనువాదం: వై.యస్.వి.యస్.మూర్తి

శ్రీమృణాళినీ దేవి

శతజయంతి ప్రసంగము

నేటి విషయము మిమ్మొక ఆహ్లాదకరమైన ఆశ్చర్యములో ముంచెత్తునని భావించుచున్నాను. మీరు ఆమె పేరు ఏదో విని, మరచిపోయియుందురు. కొందరు పెద్దలు నన్ను "ఆమె గురించి చెప్పుకొనదగినంత ఘనత ఏమైన ఉన్నదా" అని కూడ ప్రశ్నించిరి. సాధారణముగ మనము పురుమని గొప్పతనమునే ప్రశంసించి, వానికి ప్రేరణనిచ్చి ప్రోత్సహించిన సతీమణిని విస్మరింతుము. ఆమె చరిత్రలో కరగిపోవును. అంతేకాదు. శ్రీఅరవిందుల అతిమానసాన్ని గురించి విని దాని మంత్రశక్తికి పరవశులమై, ఆయన అతిమానవుడుగ రూపొందుటకు పూర్వము మనకు వలెనే, ఈ భూమిపై మానవుడుగ పుట్టి మృణాళినీ దేవిని పరిణయమాడినాడనే విషయమును విస్మరింతుము. 1950 వ సంవత్సరము నుండి మనము ఆయన అపారబహుముఖ ప్రజ్ఞావంతమైన శక్తిమత్త్వమును ప్రశంసించుచున్నాము. కాని నేడు కాలగర్భములో కలసిపోయిన మానవసామాన్యమైన ఆయన జీవితమును త్రవ్వి వెలికి తీయుదము. అది అసంఖ్యాకులైన ప్రజలకు ఆశాజనకము, వారు ఆప్యాయతతో అన్వేషించి ఆనందించు విషయము కాగలదు.

అదృష్టవశాత్తూ, ఈ సంవత్సరమే ఆమె శతవార్షిక జయంతి సంవత్సరము. ఆమెను గురించి కొన్ని పత్రములు, ఒక చిన్న పుస్తకము నా చేతి కందినవి. అందలి విషయములు పఠించు చుండ అవి నన్ను కుదిపి అలరించినవి. ఒక ఆధ్యాత్మిక నిధి దొరికినట్లనిపించినది. అందలి విషాదము, కరుణారసము నన్ను గొప్పగా స్పందింపజేసినవి. శ్రీశారదామాతకు ఆమె ఒక దేవతగా గోచరించినది. ఇట్టి ఆమెను గురించి ప్రసంగించుట, ప్రేమ, ఆత్మ నివేదన మొదలగు ఉన్నత భావములచే ప్రేరేపింపబడుటయే. పవిత్ర ప్రేమ, సౌందర్యగర్భిత సమున్నత చైతన్యములోని కుద్ధ రింపబడుటయే. ఆమెయే శ్రీమృణాళినీ దేవి. వంద సంవత్సర ముల క్రితము షిల్లాంగ్ నగరములో జన్మించినది. పేరుకు తగి నట్లు, ప్రకృతిసిద్ధమైన మనోహర వాతావరణములో పెరిగినది. ఒక విరాట్‌పురుషుని వివాహమాడినది. ఆమె పేరువలెనే ఆయన పేరు కూడ తామరపువ్వుకు వాచకము కావటము విశేషము.

ఆమె గౌరవనీయమైన ఒక హైందవ కుటుంబమునకు చెందిన బాలిక. శ్రీఅరవిందులకంటె 14 సంవత్సరములు చిన్నది. తండ్రి పాశ్చాత్యదేశములకు పోయి వచ్చిన బెంగాలీ సమాజము లోని ప్రథమ వర్గమునకు చెందినవాడు. షిల్లాంగ్ వ్యవశాయ శాఖలో, ఉన్నత ప్రభుత్వోద్యోగి. ఆయన శ్రీఅరవిందుల తండ్రి నొకసారి కలియుట సంభవించెను. మృణాళినీ దేవి ఆయన ప్రథమ సంతానము. ఆమె శరీరచ్ఛాయ చక్కని గులాబిరంగును ప్రతిఫ లించు స్వచ్ఛతను కలిగియుండెను. ముఖవర్చస్సు, ఒత్తైన నల్లని ముంగురులచే ఉద్దీపింపబడి యుండెను. అరిచేతులు, అరికాళ్ళు పారాణి పులమబడినట్లు, పసిపిల్ల కాలుసేతులను బోలి ఎఱ్ఱని కాంతులతో మెరయుచుండెను. చిన్నతనములో చెలికత్తెలు ఆమె హస్తములను, వెచ్చని, మెత్తని, పక్షి రెక్కలు దూదిపింజెలని పోల్చుచుండెడివారు. ఆమె నొచ్చుకొని తన బాబాయికి ఫిర్యాదు చేయుచుండెడిది. "నీవు నాకొక మంచి అందమైన చేతులజతను కొని ఇవ్వరాదా?" అని అడుగుచుండెడిది. అంత అమాయకు రాలు! శ్రీఅరవిందుల హస్తములుకూడ హంసతూలికల వలె

మృదువుగ, వెచ్చగ నుండెడివి. విద్యాభ్యాసమునకై మృణాళిని కలకత్తా నగరములోని బ్రహ్మసమాజ బాలికాపాఠశాలలో చేర్చ బడినది. అక్కడ ఆమెకు సుధీరా బోస్ అనే ఆమెతో మైత్రి ఏర్పడినది. జీవితాంతము కొనసాగినది. సుధీరాబోస్ సోదరుడు, శ్రీఅరవిందుల విప్లవసంఘ సభ్యుడై యుండి, పిమ్మట శ్రీరామ కృష్ణ మఠములో జేరి సన్యాసి ఆయెను. మృణాళినీ దేవి తండ్రికి చాలా సన్నిహితుడు శ్రీ గిరీశ్చంద్ర బోస్ కలకత్తాలో నున్న ప్పుడు మృణాళినీ దేవికి పెద్దన్న వలె సంరక్షకుడుగ నుండెను. ఆయన కలకత్తాలోని ఒక గొప్ప ప్రఖ్యాతిగల కళాశాలకు అప్పటి ప్రధానాచార్యుడు. ఆయనయే మృణాళిని శ్రీఅరవిందుల సంబం ధమును సాంప్రదాయపద్ధతిలో కాక ఆధునికరీతిలో కుదిర్చెను.

శ్రీఅరవిందులు భారతదేశము తిరిగివచ్చి, బరోడా మహా రాజువారి ఆస్థానములో ఉద్యోగము స్వీకరించెనను విషయము మనకు తెలిసినదే. అప్పటికి ఏడు సంవత్సరముల ఉద్యోగానం తరము ఆయనకు అక్కడి (ఆ నగరములోని శ్రీ రాజావారి) కళా శాలలో ఉపప్రధానాచార్య పదవి లభించెను. ఆ సమయమునందే ఈ వివాహ నిశ్చయము జరిగెను. ఆయన వయస్సు అప్పటికి ఇరువది తొమ్మిది సంవత్సరములు. హైందవ కుటుంబమునకు చెందిన వధువు, హిందూమత విధానములో వివాహమాడుటకు కావలెనని కలకత్తా పత్రికలో ఆయన ఒక ప్రకటనను చేసెను. ఆయన పేరుప్రఖ్యాతులు కలకత్తాలో అప్పటికే వెల్లివిరియు చుండెను.

శ్రీఅరవిందులు హైందవ బాలికను హిందూధర్మ శాస్త్రాను సారము పరిణయమాడు అభినివేశము మనము గుర్తించవలసిన విషయము. భారతదేశము తిరిగివచ్చిన పిమ్మట శ్రీ బంకిమ్‌చంద్ర సాహిత్యమును చదివి శ్రీఅరవిందులు, బెంగాల్‌లోని భారతనారీ మణుల శీలసంపదలను చక్కగా అవగాహన చేసికొనియుండిరి. అంతవరకు ఆయనకు అట్టి పరిచయమున కవకాశము లేకపో యెను. ఆయన భారతదేశము జేరిన సంవత్సరమునకే, శ్రీబంకిమ్ చంద్‌ను గూర్చి, తన వ్యాసములో ఇట్లు శ్లాఘించెను. "కలకత్తా

విశ్వవిద్యాలయములో ఆధునిక విద్యనభ్యసించిన సంఘసంస్క ర్తలు హైందవ జీవితములోని మహత్త్వమునుగాక అల్పత్వమును, సంకుచిత్వమును, అజ్ఞానమును మాత్రమే దర్శించును. హైందవ నారీమణులలోని పరాధీనతను, దానిని సూచించు అణకువను మాత్రమే చూచును. కానీ బంకిమ్‌చంద్రుడు కవి, ద్రష్ట. అతగాడు అందలి లోతులను సమున్నతత్వమును దర్శించెను. హైందవ జీవితములోని మాధుర్యమును, అందమును, సొగసులను అవలో కించెను. హైందవ నారీమణుల ఔదార్యము, ప్రేమపూర్ణ హృద యవేశాంతర్యములను, స్థిరత్వమును, సౌమ్యత్వమును, ప్రేమమ యత్వము మున్నగు మహిళల అంతరాత్మ గుణములను దర్శించి స్పృశించెను. ఈ భావములే ఆయన గ్రంథముల పుటలలో అగ్ని వలె ప్రజ్వలించుచున్నవి. కళామయుడు, కవిశేఖరుడగు ఆయన స్పర్శచే ఆ గుణములు దివ్యత్వము నందినవి".

శ్రీఅరవిందుల వివాహప్రకటన శ్రీ గిరీశ్ బోస్‌ను ఆకర్షించి నది. అందలి షరతులు మృణాళిని దేవికి చక్కగా సరిపోవునని ఆయన భావించెను. వెంటనే రాయబారములు నలిపి పెండ్లి చూపులు ఏర్పాటు చేసెను. శ్రీఅరవిందులు వధువును చూచు కొనుటకు వచ్చి (అనేకమంది కన్యలు, నిరీక్షించుచున్నను) ప్రథమదర్శనములోనే మృణాళినీ దేవిని అంగీకరించిరి. వారి వివాహము హిందూ ధర్మశాస్త్ర సంప్రదాయము ననుసరించియే జరిగినది. జె.సి. బోస్, లార్డ్ సిన్హా మొదలగు పెద్దలా శుభకార్య మునకు వచ్చి సందర్శించిరి. కాని శ్రీఅరవిందుల మాతాపితృ వర్గము వారెవ్వరును రాలేదు. ఆయన తల్లివైపు బంధువులు బ్రహ్మసమాజమునకు చెందినవారై యుండెను.

శివునికి సతీదేవినిచ్చి వివాహము చేసినట్లు మృణాళినీ దేవిని ఆమె 14 వ ఏట శ్రీఅరవిందులకిచ్చి వివాహము చేసినారు. కాని ఆమెకు దాని అవగాహన లేదు. ఆమె వైవాహిక జీవితము దాదాపు 18 సంవత్సరముల తరబడి ఒంటరిగానే గడపెను. భర్త రాజకీయ ఝంఝామారుతములో నిమగ్నుడై కొంతకాలము మరి కొంతకాలము పరాత్పరుని ధ్యాననిష్ఠలో దక్షిణదేశములోను గడ

పగా ఆమె అతనికి దూరమైనను, అతనినే ధ్యానించుచు ఈశాన్య భారతములో యుండెను. భర్త ఆమెను తన సహజధర్మచారిణిగా గ్రహించినప్పటికీ తనతో సహవాసముగాని, రక్షణనుగాని కల్పించ లేకపోయెను. మృణాళిని, సతి శివునకై తపమాచరించనట్లు, తన పతిదేవునిపై మనస్సు నిలిపి, ఆయన కొరకే తదేక ధ్యానములో నుండెను. భర్త అతిమానసమును భూలోకమునకు తీసికొని వచ్చుటకై ఇచ్చిన పిలుపు నందుకొని ఆ దీక్షలో నుండగా, ఎనిమిది సంవత్సరముల సుదీర్ఘకాలము దుఃఖముతో ఏకాకినియై భర్త ఎప్పుడు రమ్మని పిలుచునా యని నిరీక్షించుచు గడిపెను.

చివరకు ఆ రోజు ఆసన్నమాయెను. భర్త (శివునివలె) కబురు పంపెను. "నా తపస్సు పూర్తియై సిద్ధించినది. రమ్ము, నా బృహత్కార్యక్రమములో పాల్గొనుము". అప్పుడామె అత్యంత ఆనందమయ ఆశలతో నిండినదై పతిదేవుని చేరుటకు సర్వ సన్నాహములు చేయుచుండెను. కాని విధి వక్రించెను. ఆమె జీవనస్రవంతి తెగిపోయెను.

క్లుప్తముగ, ఇదీ శ్రీమతి మృణాళినీ దేవి విషాద గాథ. మన మొకసారి వెనుదిరిగి కనాకష్టమైన ఆమె జీవనయాత్రను పరామర్శించెదము గాక. ఒక విషయము మనము గుర్తుంచుకొనవలెను. శ్రీఅరవిందులు, తన తండ్రివలె గాక, తానొక హైందవ కన్యను, హిందూమత సంప్రదాయములోనే వివాహమాడుటకు కృతనిశ్చయుడాయెను. ఇంగ్లాండు దేశము నుండి తిరిగి వచ్చిన తరువాత శ్రీఅరవిందులు హిందూమతమును, హైందవ సంస్కృతిని క్షుణ్ణముగ అధ్యయనము చేసెను. అందలి అమోఘమైన సత్యములు, ఆయన నిశ్చయమును పురిగొల్పి యుండవచ్చును. ఆ కాలములో బెంగాల్‌లో సంఘసంస్కరణాత్మకమగు బ్రహ్మ సమాజము ప్రబలి యుండెను. విద్యావంతులందరును, దాని పద్ధతులు, విధానములకు ఆకర్షింపబడి, దాని అనుచరులుగ మారుట అప్పటి సమాజమర్యాదగ తయారైనది. శ్రీఅరవిందుల మాతామహుడు దేశాభిమాని అయియుండి, బ్రహ్మసమాజము యొక్క నాయకుడై యున్నప్పటికి శ్రీఅరవిందులకు దాని యెడల ఎక్కువ

ఆసక్తి లేకుండెను. శ్రీఅరవిందుల మాతామహుడు ఋషి రాజ నారాయణ్ బోస్‌గా ప్రఖ్యాతి చెందియుండెను. ఆయనపై శ్రీఅర విందు లొక చక్కని పద్యమును గూడ ఆంగ్లములో రచించిరి.

వివాహానంతరము శ్రీఅరవిందులు, సతీసమేతముగ తన మేనమామగారి నివాస నగరమగు దియోఘర్‌కు వెళ్లిరి. అక్కడ నుండి నైనిటాల్ వెళ్లి, తన సోదరి సరోజినిని కూడ తీసికొని బరోడా చేరిరి. అప్పటిలో బరోడా మహారాజా వారు నైనిటాల్‌లో విశ్రాంతి తీసికొనుచుండిరి. ఆ కాలములో మృణాళినీ దేవి పూర్తిగా ఒక సంవత్సరము శ్రీఅరవిందులతో సహజీవనము సలిపెను. తరువాతి కాలములోని సమాచారము విభిన్న రీతు లలో నుండెను. నిజమెట్లున్నను, ఇదియే ఆమె వైవాహిక జీవితపు వసంతకాలము. ఆ రోజులలో ఆమె అనుభవించిన సుఖము మిగిలిన జీవితములో లేదని నేననుకొనుచున్నాను. అప్పటికామె శ్రీఅరవిందులొక అసాధారణ వ్యక్తియని గ్రహించియుండును. శ్రీఅరవిందులకు కూడ, ఆమె లేత మనోహృదయములను, తానా శించిన ఉన్నతాదర్శములవైపు త్రిప్పుటకు సదవకాశముండి యుండెను. కనీసము, ముందు ముందు మొలకెత్తి పెద్దమొక్కల గుట కనువుగ, ఆమె హృదయములో బీజములు నాటియుండ వచ్చును.

ఒక సంవత్సరము గడచిన పిమ్మట మృణాళినీ దేవి తన తండ్రిగారి ఇంటికి వెళ్లవలసివచ్చి వెళ్లెను. కాని ఎంత ప్రయత్నిం చినను, తొందరగా బరోడా తిరిగి వెళ్లలేకపోయెను. అప్పుడ ప్పుడు వచ్చి పోవుచుండెను. ఆమె తన తల్లిదండ్రులతో షిల్లాంగ్ లోను, శ్రీఅరవిందులు మేనమామ గ్రామమైన దియోఘర్ లోను నివసించుచుండెను. తన బంధువులతో ఆమె సయోధ్యతో జీవించ వలెనని శ్రీఅరవిందులు మిక్కలి ఆశించిరి. ఆయన విప్లవాత్మక మగు రాజకీయ రహస్యకార్యక్రమములకై తిరుగుచు కలకత్తా వెళ్ల నారంభించిరి. కాని అక్కడ మృణాళినిదేవిని కలియుట కవ కాశము లేకపోవుచుండెను. ఆమె షిల్లాంగ్ వెళ్లుటో, తనకు తీరిక లేకపోవుటయో, తటస్థించుచుండెను. శ్రీఅరవిందులకు కలకత్తాలో

స్థిరనివాసము లేకుండెను. అప్పటిలో కలకత్తా నగరము కూడా హింసామయ రాజకీయముల గడబిడలతో ఉడికి పోవుచుండెను. ఆయన బరోడా నుండి ఆమెకు జాబులు వ్రాయుచుండెడి వారు. అందు కొన్ని అదృష్టవశాత్తు భద్రపరచబడినవి. 1905 వ సంవత్సరములో వ్రాసిన లేఖలో తనకు గల మూడు పిచ్చిభావముల గురించియు, తన అంతరంగ పరిణామము గురించియు, ఆమె నిజమైన హైందవ సతీమణిగ ఆచరించవలసిన ధర్మము గురించియు వివరించెను. ఆయన ఇట్లు వ్రాసెను.

"నీ జీవితంతో ముడిపడియున్న మానవుడు ఒక వింత వ్యక్తియని నీకీ పాటికర్థమైయుండును. ప్రతి విషయములోను ప్రస్తుత ప్రాపంచిక రీతులకు వ్యతిరిక్తుడనియు, సామాన్య మానవుడు కాదనియు తెలిసి ఉండాలి.

"హిందూమత ప్రవర్తకులు అసాధారణ మనుష్యులను, అసాధారణ ఉద్యమములను, అసాధారణ ఆదర్శములను గౌరవించి ప్రేమించెడివారు. పూజించెడివారు. వారు పిచ్చివారో, అసామాన్య ప్రజ్ఞ కలవారో అయి ఉందురు. కాని ఈ విషయములన్నియు వివాహమాడిన భార్యకు దుర్భరమైన పరిస్థితులుగ నుండవచ్చును. ఈ క్లిష్టసమస్య నెట్లు పరిష్కరించవలెను? ఋషి పుంగవులీ విధముగ పరిష్కరించిరి. సతీమణుల కిట్లు బోధించిరి, 'మహిళాసమాజమునకు యోగ్యమైన మంత్రము' – భర్తయే పరమ గురువు. భార్య భర్త ధర్మములో పాల్గొని సహధర్మచారిణియై యుండును. అతడు తన ధర్మముగ దేని నాచరించినను, ఆమె సహకరించి, సలహానిచ్చి, ప్రోత్సహించవలెను. పతిని దైవముగ భావింపవలెను. అతని సౌఖ్యమే తన సౌఖ్యముగ తలంచవలెను. అతని దుఃఖము తన దుఃఖముగ ఎంచుకొనవలెను. పురుషుడు కర్తవ్యకర్మ నెన్నుకొనగ, స్త్రీ అతనికి సహాయపడి, ప్రోత్సహించవలెను.

"ఇప్పుడున్న ప్రశ్న: నీవు హైందవమత ధర్మముల నాచరింతువా? లేక నూతనముగ పొడుచుకొని వచ్చుచున్న మత సంస్కార విధానముల ననుసరింతువా? నీవు హైందవ కుటుం

బము లోని బిడ్డవు. నీవు హైందవమత విధానము నాచరింతు వనుటలో నాకెట్టి సందేహమును లేదు.

"నేనొక సామాన్య బాలికను. నాకు మనోధైర్యము లేదు. తెలివి లేదు. అట్టి విషయముల నాలోచించుటకు కూడ భీతి నొందుచున్నాను." అని నీవనవచ్చును. సరే, దాని కొక తేలిక మార్గము కలదు. భగవంతునిపై సంపూర్ణమైన విశ్వాసము నుంచుము. ఆయన నీ లోటుపాట్లు, అవసరము లన్నియు తీర్చును. లేదా నీవు నాపై నమ్మకముంచ గలిగినచో నేను నా శక్తిని నీ కందించగలను. అందువలన నా శక్తి వృద్ధిపొందునే గాని తరిగిపోదు.

"భర్తకు భార్య ఒక శక్తి, ఆమె అతని బలము. దీని అర్థము భర్త భార్యలో తన ప్రతిబింబమునే చూచుచు, తన ఆకాంక్ష ప్రతిధ్వనినే వినుటలో, అతని బలము ద్విగుణీకృత మగును."

18 సంవత్సరముల ప్రాయముగల మృణాళినీ దేవి ముందు, శ్రీఅరవిందులుంచిన ఆదర్శమిది. వర్తమాన కాలములో ఈ ఆదర్శమునందు గొప్ప మార్పు సంభవించినది. ఒక విధముగ, పూర్తిగ తలక్రిందులైనది. మహిళలు పురుషులతో సమాన హక్కులు కోరుచున్నారు. ఇది నేటి యుగధర్మము. శ్రీఅరవిందులు అందరి స్త్రీలను వారి భర్తలను దైవముగ భావిం చమన లేదు. ఆయన పురుషుల క్రౌర్యమునకు స్త్రీలు బలి యగుచున్నారని కూడ వక్కాణించిరి. తను భర్తగ నిర్వ ర్తించవలసిన బాధ్యతలను వహించుటలో విఫలుడైనందుకు క్షమించవలసినదిగ ఆయన తన భార్యను వేడుకొనుట మనము గమనించినాము. 1906 వ సంవత్సరములోని చివరి లేఖలో ఆయన బరోడా శాశ్వతముగ వదిలిపెట్టుచున్నానని వ్రాసెను. కాని తానెక్కడుండునది ఆయనకే తెలియదు. మత్స్యమాంసము లను పూర్తిగ విసర్జించి, ఎక్కువ కాలము యోగసాధనలో గడుపు చుండిరి. అందుకని ఆయనకొక స్థిరనివాసము కావలసి యుండెను. అప్పుడు మృణాళినీ దేవి షిల్లాంగ్‌లో ఉండెను. ఆమెను కలియు

టకు శ్రీఅరవిందులు ప్రయత్నించిరి. కాని కుప్పలకొద్ది పనులు వచ్చి మీద పడుటచే అది సాధ్యము కాలేదు. అనేకులు ఆయ నను కలియుటకు వచ్చుచుండిరి.

శ్రీఅరవిందులు కలకత్తాలో ఉండుట వలన, మృణాళినీ దేవి ఆయనను కలిసికొనవచ్చునని భావించెను. కాని ఆ యాస అడియాస ఆయెను. బరోడాలో నున్నప్పుడు వైవాహిక జీవిత మును గురించి ఆమె తండ్రికి ఉత్తరము వ్రాయగ, ఆయన తన కేమియు తెలియదని సమాధానమిచ్చెను. శ్రీఅరవిందులు బెంగాలు వచ్చిన పిమ్మట కొన్ని సంవత్సరములు అక్కడ తీవ్రమైన గందరగోళ మేర్పడి యుండుటవలన, మృణాళినీ దేవి తన భర్తతో వైవాహిక జీవితము గడిపే అవకాశము మృగ్యమాయెను. ఆ కాలములో ఆమె జీవితము తెంపులేని బాధలకు, ఒత్తిడుల కును లోనాయెను. తన జీవితములో ఎక్కువ కాలము శ్రీఅరవిం దుల మేనమామ ఇంట దియోఘర్‌లోనో, తన తండ్రిగారి యింట షిల్లాంగ్‌లోనో గడుపుచుండెను. 1908 మే నెలలో శ్రీఅరవిందులు నిర్బంధములోనికి తీసుకొనబడిరి. అప్పుడామె ఆయనతో నుండి నది. ఆ భయంకరమైన సంఘటన ఆమె హృదయములో పిడుగు పడినట్లు చెరపరాని ముద్రవేసి నిలిచిపోయినది. పది సంవత్స రముల అనంతరమొక సారి ఆమెకు జబ్బు వచ్చినప్పుడు సంధి ప్రలాపనముగా ప్రస్ఫుటమైనది. "శ్రీఅరవిందుల రాజకీయ జీవిత ములో ఆయనకు ఎంతవరకు మృణా.లిని సహకరించినదో తెలి యదుగాని, నాకు తెలిసినంతవరకు ఆమె ఎన్నడును అడ్డుపడ లేదను విషయము నిజము" అని ఆమె తండ్రి వ్రాసెను. శ్రీఅరవిం దులకు ఆమె యెడల నిర్మలము ప్రశాంతము ఐన ప్రేమయుం డెను. ఆమెకు తన భర్తయెడల, అప్రతిహతము, ప్రగాఢమునైన విధేయత యుండెను. ఇదియే సంక్షిప్తముగ ఆమె కలకత్తాలో గడపిన సుఖమెరుగని జీవితము. టాల్‌స్టాయ్ మహాశయుడు పలి కిన ఈ సూక్తి యందెంత సత్యమిమిడియున్నదో చూడుడు.

"ఒక అసాధారణమైన విశిష్ట మేధావిని (genius) వివాహ మాడుట సుఖదాయకమేమీ కాదు. అది ఒక గొప్ప నది ఒడ్డున

నివసించుట వంటిది. ఆ నది ఎప్పుడు పొంగి గట్లను ముంచె త్తునో తెలియదు."

ఇట్లున్నను ఎడారి నడుమ నుండి ఫలవంతమైన ప్రదేశ ముల (oasis) లాంటి మధురమైన సంఘటనలు లేకపోలేదు. వాటిని గురించి తరువాత చెప్పుకొందము.

చివరకు శ్రీఅరవిందులు 1906 వ సంవత్సరములో కల కత్తా వచ్చి వేసిరి. బరోడాలో ఉపప్రధానాచార్యులుగ నెలకు రు. 600/- లు చొప్పున పుష్కలముగ వచ్చు జీతమును వదలివేసి కలకత్తా జాతీయ కళాశాలలో నెలకు రూ. 150/- లు వేతన ముపై ప్రధానాచార్య పదవిని స్వీకరించిరి. అక్కడ ఒక ఇల్లు అద్దెకు పుచ్చుకొని మృణాళినీ దేవితో కాపురము చేయుచుండిరి. కాని బహువ్యాపకత్వము వలన తన సహవాసమును ఆమె కీయలేకపోయిరి. 1907 వ సంవత్సరములో ఆమె దియోఘర్‌లో ఉండగా శ్రీఅరవిందులు ఈ క్రింది జాబును వ్రాసినారు.

"ఇక్కడ నాకు ఒక్క క్షణము కూడ తీరిక లేదు. నేను "వందేమాతరం" పత్రికను నడుపుచున్నాను. కాంగ్రెస్ (పార్టీ) కార్యక్రమముకూడ నా కప్పగించబడినది. ఈ సమయము చాలా ఆతురతతో కూడినదేగాక మనస్తాపమును కలిగించుచున్నది. నీవు కూడ అశాంతిని కనబఱచుచో నా బాధ వ్యాకులత ఎక్కు వగును. నీవు సానుభూతితో ప్రోత్సాహకరములైన ఉత్తరములు వ్రాయుచో అవి నాకు అమితమైన బలము నిచ్చును. నీవు నన్ను వివాహమాడినందుకు ఈ విధమైన విచారము (ఎడబాటు) నీకు తప్పదు. అప్పుడప్పుడు ఇట్టి ఎడబాట్లు అనివార్యములు. సాధా రణ బెంగాలీ బాబు వలె, కుటుంబ సుఖము, బంధురక్షణ నా జీవిత ప్రధాన లక్ష్యములుగా భావించ లేను." 1907 వ సంవత్స రములో ఆయనను అరెస్టు చేయుట, విడుదల చేయుట జరిగెను. ఆ సమయములో మృణాళినీ దేవి షిల్లాంగ్‌లో తల్లిదండ్రులవద్ద నుండెను. 1908 వ సంవత్సరములో ఆయన కలకత్తా నుండి ఆమె కిట్లు వ్రాసెను.

"నీకు చాలాకాలముగ ఎట్టి జాబులు వ్రాయలేకపోతిని. ఇది నా శాశ్వతమైన అశక్తత. నీవు మంచిదానవై, సౌజన్యముతో క్షమించని యెడల నేనేమి చేయగలను?"

"ఇక నుంచి నా టైము నా చేతుల్లో లేదు. ఒక కీలు బొమ్మవలె భగవంతుడు నన్నెట్లాడించిన అట్లాడవలెను. ఈ మాటలలోని ఆంతర్యమును నీవిప్పుడు గ్రహించలేవు. కాని, నీకు ఈ సమాచారము నందించుట అవసరము. లేనిపక్షమున నా నడవడి నీకు విచారమును విషాదమును కలిగించగలదు. ఇప్పటికే నీ యెడల నేననేక తప్పిదములు చేసియున్నాను. సహజముగ అవి నీకు అసంతృప్తిని దుఃఖమును కలిగించియుండవచ్చును."

దీనిని బట్టి చూస్తే మృణాళినీదేవి జీవితమును గురించి, భూపాల్‌బాబు వ్రాసినది యథార్థమే అనిపించును. నే నిదివరలో చెప్పినట్లు, సర్వమును అంధకారము, నిరామయము కాదు. కొన్ని మెరుపులు కలవు. ఉదాహరణకు శ్రీఅరవిందులు రాజకీయ కార్యకలాపములలో పల్లె ప్రాంతములు ప్రచారముకొరకు తిరిగి కలకత్తా మరలివచ్చినప్పుడు, మలేరియా జ్వరము సోకి బాధ పడుచూ భూపాల్‌బాబు ఇంటిలో ఉండగ మృణాళినిదేవిగూడ అక్కడే ఉండి, ఆయనకు సేవ చేసినది. ఆమె బంధువు, జ్ఞాతి ఈ విషయమును గురించి వ్రాసినదిట్లున్నది.

"వ్యాధిగ్రస్తులైన వారికి సేవచేయుట ఆమెకు ఉగ్గుపాలతో పెట్టిన విద్య. ఆమె హృదయపూర్వకముగ వారి నాదుకొని, సర్వ ఉపచారములు చేసెడిది. ఆమె సేవలను పొందిన వారెవ్వరును, ఆమె ఆదరమును ఆప్యాయతను మరువలేరు.

"జబ్బులో ఉన్న శ్రీఅరవిందులను ఆమె ఎట్లు సేవించినదో నాకు తెలుసు. ఆయన ప్రక్కన కూర్చొని విసనకర్రతో విసరుట, కాళ్ళు పిసుకుట, తల పట్టుట, మర్దన చేయుట మొదలగునవి చేసెడిది. ఆయన తిను ఆహారమును, ఆమెయే స్వయముగ తయారు చేసెడిది. శ్రీఅరవిందులు వ్రాతపనిలో నిమగ్నమైయున్నచో ఆయన పని పూర్తియగు వఱకు వేచియుండెడిది. ఆయన నిత్యకృత్యములు, స్నానాది కార్యములను కూడ చేయుచు,

'టీ' తయారుచేసి యిచ్చుట, భోజనము పెట్టుట చేసెడిది. పై పనులన్నియు వాటివాటి నిర్ణీతకాలములో జరిపెడిది. ఆమె తండ్రి, శ్రీఅరవిందులకు ఇష్టమైన మంచిరకము కాలీఫ్లవర్ తదితరములైన కూరగాయలను ప్రత్యేకముగ మార్కెట్టుకు వెళ్ళి తెచ్చెడి వాడు. ఆమె తల్లి శ్రీఅరవిందులకొరకు ప్రత్యేకముగ కొన్ని వంటకములను జాగ్రత్తగ చేసిపెట్టెడిది. శ్రీఅరవిందులు ఆ పదార్థములన్నిటిని ఎంతో ప్రీతిగా తినుచుండెడివారు; చివరి ముద్దకూడ ఎంతో చక్కని అభిరుచితో ఆస్వాదించుట భూపాల్ బాబుకు అమితానందమును కలిగించెడిది. అట్టివారికి భోజనము పెట్టుట నాకు మిక్కిలి సంతోషదాయకమని ఆయన అనిరి.

శ్రీఅరవిందులు బరోడాలో ఉన్నంత కాలము, పాపం! మంచి వంటకములకు, భోజనమునకు నోచుకొనలేదు. ఆయన ఒకసారి తన మరాఠీ వంటవానికి మాంసము వండుట తప్ప మరేమియు తెలియదని పలికెను. ఇంగ్లాడులోకూడ వంట అంతకంటె బాగుగ ఉండుట కవకాశము లేదు. ఆయన బెంగాల్ వచ్చిన తరువాతనే, మంచి వంటకములతో భోజనము ఆరగించగలిగెను. అది కూడ ప్రత్యేకముగ భూపాల్‌బాబు ఇంటిలో ఉన్నప్పుడే. శ్రీఅరవిందులకు వినోదమునిచ్చి నూతనానుభవమును కలిగించిన విషయము మరొకటి కలదు. భోజనసమయములో, బెంగాలీల అలవాటు ప్రకారము మృణాళినీ దేవి బంధువులు, చిన్నపెద్ద లందరు, ఆయన చుట్టును గుమికూడుచుండెడివారు. వృద్ధులైన ఆడవారు, శ్రీఅరవిందులను తాము తయారుచేసిన వంటకము లన్నిటిని ఎక్కువగ తినవలసినదిగ కోరుచుండిరి. పిల్లలు ఆయనను మాటలతో పొడుచుచు హేళన, ఎగతాళి చేయుచు – (అది వారి హక్కు కదా!) – బెంగాలీభాషలో పరిహాసములు చేయుచుండెడివారు. శ్రీఅరవిందులు వాటిని, ఆ మధురమైన వాగ్వాదములను, చులకనగ, పరాచకములనే భావముతో స్వీకరించినను, బెంగాలీభాష బాగుగ రాని కారణముచేత, పాపం వాటికి తగురీతిని ప్రత్యుత్తరము లివ్వలేకపోవుచుండిరి. మృణాళినీదేవి, మరికొంతమంది ఆయనను ఆదుకుండేవారు.

ఆయన తన మాతృభాషలోని మెలకువలను చక్కగా అర్థము చేసికొనలేకపోవుటను గురించి చింతించుచుండెడివారు.

మరియొక తమాషా విషయాన్ని శ్రీఅరవిందుల మిత్రుడు చారుదత్ వర్ణించెను. అది శ్రీఅరవిందుల స్వభావమును లెస్సగా వ్యక్తము చేయును. ఆయన ఇట్లు వ్రాసెను.

"1907 వ సంవత్సరములో, శ్రీఅరవిందులు నిర్బంధములో నుంచబడి, విడుదల చేయబడినప్పుడు, భూపాల్‌బాబు తన కుమార్తె మృణాళినీ దేవితో కలిసి షిలాంగ్‌నుండి కలకత్తాకు, శ్రీఅరవిందులను కలియుటకు వచ్చెను. అక్కడ కూడ ఒక ఇల్లు అద్దెకు తీసికొనెను. ఒకనాటి సాయంసమయములో వెలింగ్‌డన్ స్క్వేర్‌లో మేమున్న ఇంటికి ఆయన వచ్చెను. అప్పటికి శ్రీఅరవిందులు కాలేజీనుంచి ఇంకను రాలేదు. ఆయన మాతో "నేను శ్రీఅరవిందులను రాత్రి భోజనమునకు మా ఇంటికి ఆహ్వానించుటకు వచ్చితిని. నా కుమార్తె ఆయనను కలిసికొనుటకు వచ్చినది. ఈ రాత్రికి ఆయన మాతో ఉండి రేపటి ఉదయము తిరిగి రాగలరు. దయచేసి ఆయనను పంపండి" అని విన్నవించెను. శ్రీఅరవిందులు 5 గంటలకు ఇంటికి వచ్చిరి. ఏదో అల్లరి జరుగనున్నదని గ్రహించిరి. మేమందరము ముక్తకంఠముతో ఒకే మారుగ మాట్లాడమొదలిడితిమి. శ్రీఅరవిందులు నవ్వుచు, 'ఒకరి తరువాత ఒకరు మాట్లాడరాదా' అని అనిరి. నేనిట్లు సమాధానము చెప్పితిని. "చూడు! ఇలాంటి హుషారైన రోజు ఎప్పుడోగాని రాదు. ఈ రాత్రి శ్రీఅరవిందులు ఆయన సతీమణిని కలియనున్నారు." శ్రీఅరవిందులు ఒక విధమైన గాంభీర్యము వహించినవాని వలె కనిపించి 'ఊ చెప్పు' అనెను. "భూపాల్‌బాబు వచ్చినీవీ రాత్రి వారి యింట్లో ఉండుటకు రమ్మని ఆహ్వానించెను" అని అంటిని. అప్పుడు శ్రీఅరవిందులు 'సరే! తరువాత ఏమిటి?' అని ప్రశ్నించెను. అప్పుడు నా భార్య అందుకొని 'మేము నూతన వస్త్రాదులను ఏరి తయారుచేసి పెట్టాము. సమయానికి సిద్ధముగ నుండవలెను. మేము రెండు పూలమాలలు తయారుచేశాము. ఒకటి మీకు, రెండవది మృణాళినీదీకి' అని పలికెను. శ్రీఅరవిం

దులు ప్రశాంతముగ ఆలకించి, స్నానముచేసి బట్టలు ధరించుటకు వెళ్ళిరి. ఆయన చిరునవ్వు ముఖముతో మిక్కిలి సొగసుగ కనిపించిరి. నా భార్య ముందుకువచ్చి పూలదండలు చేతికిచ్చి, 'ఇది మీకు, అది మృణాళినీదీకి, మరచిపోకండి' అని అన్నది. 'సరే, సరే, నీవు చెప్పిన ప్రకారమే చేస్తానమ్మ' అని శ్రీఅరవిందులు అనిరి. మేము 'రేపు ఉదయముగాని రాకూడదు' అని గట్టిగ చెప్పి నౌకరును గేటుకు తాళము వేయమనికూడా ఆజ్ఞాపించితిమి.

మర్నాడు ఉదయమే ఒక సేవకుడు పైకివచ్చి "అయ్యా! క్రిందికి 'టీ'కి ఎప్పుడు వస్తారో ఘోష్‌గారు అడగమంటున్నారు" అని అనినాడు! 'ఏమిటి? ఆయన ఇంత ప్రొద్దునే వచ్చేశారా?' అని నేనడిగితిని. 'అయ్యా! ఆయన రాత్రే వచ్చారండి' అని సేవకుడు సమాధానము చెప్పెను. మేము క్రిందికి వెళ్లి చూడగ, ఆయన ఒక కుర్చీలో కూర్చొని నవ్వుకొనుచున్నారు. మేము ఆయనను ప్రశ్నల వర్షముతో ముంచెత్తితిమి. కొంతసేపైన తరువాత నెమ్మదిగ ఇట్లు ప్రారంభించారు. 'ఇప్పుడు వినండి. నేను కడుపునిండా మృష్టాన్న భోజనముచేసి, మీరు చెప్పిన ప్రకారము చేశాను' అని అన్నారు. 'అయితే ఎందుకొచ్చేశారు?' దానికాయన ఇలా జవాబిచ్చారు. 'నేను ఆమెకు విషయమంతా వివరించి చెప్పాను. ఆమె అనుజ్ఞ తీసుకొని వచ్చాను'.

ఈ మనోహారమైన సంసారసుఖములకు పూర్తిగా వ్యతిరేకంగా ఘోరమైన సంఘటన కలకత్తాలోని 'గ్రే' వీధిలో, శ్రీఅరవిందులు మృణాళినీ దేవి నివసించుచున్న ఇంటిలో, చివరిరోజు రాత్రి సంభవించినది. మృణాళినీ దేవి ఆ సంఘటనను గురించి, తన సోదరునితో అశ్రుపూర్ణ నేత్రములతో, గద్గద స్వరముతో వివరించెను.

"ఒకనాటి రాత్రి మేము గాఢనిద్రలో నుంటిమి. తెల్లవారు జామున హఠాత్తుగా ఎవరో యింటి తలుపులను గట్టిగా తట్టిరి.

నేను వెంటనే లేచి తలుపు తీసితిని. నా ఎదుట ఒక సార్జెంటును[4] చూచితిని. అతడు నా మీదికొక పిస్తోలును గురిపెట్టి శ్రీఅరవిందు లెక్కడ? చెప్పమని అడిగెను. ఆయన నిద్రపోవుచుండిరి. నాకు మతిపోయి మూగదాని వలె, ఆయన వైపు చూపితిని. ఇల్లంతా పోలీసులతో నిండిపోయినది. నన్ను ప్రక్క గదిలోనికి పొమ్మనిరి. శ్రీఅరవిందులు నేలమీద ఒక కంబళి పరుచుకొని పరుండిరి. పోలీసు లాయనతో అనగా వింటిని. 'నీవేనా ఘోషువి?' ఎంత విద్యావంతుడివి. నేలమీద గోనె పరుచుకొని పరుండి ఎంత నీచపు జీవితమును జీవించుచున్నావు. ఎంత సిగ్గుచేటు, అని. దానికి ఆయన ఇట్లు సమాధానము చెప్పిరి. 'నీకు జుగుప్స కలిగించునది మాకు గౌరవమైనది. హిందువులకు అట్టి జీవితము త్యాగమునకు చిహ్నము, ఆదర్శము'. పోలీసు సార్జెంటు ఆయన వైపు కొరకొర చూచెను. చివరకు ఆ సార్జెంటు నా పెట్టె బ్రద్దలుకొట్టి అందులోని శ్రీఅరవిందులు నాకు వ్రాసిన ఉత్తరములను మంచి ఉబలాటముతో తీసెను.

“నేను దక్షిణేశ్వరములోని కొంత పవిత్రమైన మట్టిని తెచ్చి ఒక పాత్రలో జాగ్రత్తపెట్టితిని. పోలీసులు దానిని చూచి, అమెరికా దేశమును క్రొత్తగా కనుగొనినప్పుడు గంతులు వేసినట్లు, పిచ్చిగా నాట్యము చేసిరి. అంతటి వెర్రి ఆర్భాటమునకు కారణము నాకు తెలియలేదు. అది బాంబులు చేసే మందుగుండు సామానని వారి భ్రమించినట్లు నాకు తరువాత తెలిసింది.

“అటుపిమ్మట జరిగిన కథను, మెత్తని హృదయము సున్నితమైన స్వభావముగల స్త్రీలు వర్ణించలేరు – అంత ఘోరము. సార్జెంటు ఓయి ఘోష్! నా వెంట రా” అనెను. ఆయనను ఒక టికి కూడ పోనీయలేదు. ఆయన ఇట్లు ప్రశ్నించిరి. “నేను ఎక్కడకు రావాలి?” అతడు “లాల్ బజారు”[5] కు అని సమాధానము చెప్పెను. అప్పుడు పోలీసులు ఆయన నడుముచుట్టు ఒక మోకు

4 అతను పోలిసు సూపరిండెంటు

5 అది ఒక పోలీస్ స్టేషన్

(లావైన త్రాడు) కట్టిరి. అది చూచినంతనే, అదుపు తప్పైనా వారి పైబడి ఆయనను విడిపించి లాగుకొని రావలె ననిపించి నది. కాని ఎట్లో నిలద్రొక్కుకుంటిని. భగవంతుని ప్రార్థింప ప్రయత్నించితిని. కాని ఆయన అస్తిత్వములో విశ్వాసము పూర్తిగ నశించియుండి, ప్రార్థన చేయలేకపోతిని. నిజముగ భగ వంతుడనే వాడున్నచో, అట్టి నిర్దోషియైన మహాత్ముని బలి పశువును పట్టి పీడించు రీతిలో, పోలీసులు ప్రవర్తించు టెట్లు సహించగలడు? నా ప్రార్థనలన్నియు వ్యర్థమైపోయెను. పోలీ సులు ఆయనను తమ వాహనములో ఎక్కించుకొని తీసుకొని పోయిరి. తరువాత ఏమి జరిగినదో నాకు తెలియదు (స్పృహ తప్పినది). నాకు తిరిగి స్పృహ వచ్చుసరికి శ్రీఅరవిందుల బంధువు, కె.కె. మిత్రాగారి యింటిలో నున్నట్లు తెలిసినది.

అది లగాయతు మృణాళినీ దేవి జీవితములో కటికచీకటి ప్రవేశించినది అని ఆమె సోదరుడు వ్రాసెను.

“ఆమె విస్మయము చెంది ఒక లక్ష్యములేక ఏమి చేయు టకుగాని ఎక్కడకు వెళ్ళుటకుగాని తోచక పడియుండెను. ఒక రోజున ఈ క్లిష్టపరిస్థితిని గురించి నాతో నిట్లు చెప్పెను. “నేను భగవంతునికూడ పిలువలేకపోతిని. (ప్రార్థించ లేకపోతిని) ఎట్లు పిలవగలను? నాకు నా భర్త తప్ప వేరు దైవము లేదు. ఆయన లోనే భగవంతుడభివ్యక్తమగుట నేను చూడగలిగితిని. ఆయన మాట్లాడుచుండగా, ఎక్కడ నుండియో ఒక అశరీరవాణి ఆయన నోటి ద్వారా పలుకుచున్నట్లనిపించుచుండెడిది. ఆయన నన్ను చూచినప్పుడు లీలామయములైన రెండు నయనములతో స్వచ్ఛం దమైన వెలుగును నా శరీరముపై గ్రుమ్మరించుచున్నట్లనిపించు చుండెడిది. అటువంటి పారలౌకికమూర్తి నా ప్రపంచమునుండి హరించబడినప్పుడు, ఆయనలేని నా జీవితమున కింక మరణమే శరణమని భావించితిని. అయితే మృత్యువు రాలేదు. అప్పుడు

సుధీర[6] వచ్చి నన్ను పెనవేసుకొనెను. అది లగాయతు మృణాళినీ దేవి సుధీరతో కలిసి శ్రీరామకృష్ణాశ్రమమునకు తరుచు వెళ్ళుచుండెడిది".

ఆ కాలములో శ్రీఅరవిందులు అందరి హృదయముల లోను, ఎదురులేని ప్రియతమ నాయకుడుగా విరాజిల్లుచుండెను. ఈ విషయమును గురించి మృణాళినీ దేవి ఈ క్రింది విధముగ వివరించినది.

"మేము శ్రీరామకృష్ణ మిషన్ బాలికా పాఠశాల దర్శించుటకు వెళ్లగా, ఆడపిల్లలందరు నన్ను చూచుటకు వచ్చిరి. ఆ సన్నివేశము నన్నెంత ఇబ్బందిపెట్టిందో నీకు తెలియదు. ఆ పిల్లలు నాకు ప్రణామము లర్పించ మొదలిడిరి. వారు 'శ్రీఅరవిందుల సతీమణి ఆశీస్సులిచ్చుటకు వచ్చినది' అని గుసగుసలాడుకొనుట వినిపించినది. బయటకు వచ్చిన తరువాత సుధీరను 'ఇక్కడికెందుకు తీసికొని వచ్చినావు?' అని తగవులాడితిని. ఆమె నవ్వుతూ 'నువ్వు నివురుగప్పిన నిప్పువు. నిన్ను నీవు ఎలా దాచుకొనగలవు?' అని అన్నది.

మృణాళినీ దేవి మానసికముగ పడుచుండిన సంక్షోభమునకు ఆందోళనచెంది, సుధీర ఆమెను శ్రీరామకృష్ణుల అర్ధాంగి శ్రీశారదామాత వద్దకు తీసికొనివెల్లి సహాయము నడిగినది. శారదామాత ప్రశాంతముగ విని, "బిడ్డా! వ్యాకులపడకు. నీ భర్త భగవంతుని పరిపూర్ణ రక్షణలోనున్నాడు. శ్రీరామకృష్ణప్రభువుల ఆశీస్సులతో నిర్దోషిగ విడుదల చేయబడును. కాని ఆయన సాధారణ సాంసారికజీవి కాడు". అని ధైర్యపఱచెను. మృణాళినీ దేవిని శ్రీరామకృష్ణపరమహంస గ్రంథములు చదువవలసినదనియు, అప్పుడప్పుడు వచ్చి తనను కలియవలసినదనియు సలహోనిచ్చెను.

---

[6] ఆమె చిన్నతనములో చదువకొనురోజుల నుండి జీవితాంతము మృణాళినీ దేవికి స్నేహితురాలై యుండెను.

మృణాళిని దేవి సోదరుని కథనము ప్ర
తండ్రి షిలాంగ్ తీసికొని వెళ్లెను. వారు జైలులోనున్న శ్రీఅరవిందులను చూచుటకు కలకత్తా వచ్చుచుండెడివారు. మృణాళినీ దేవి తొణకక, సర్వదా నిశ్చింతగా ప్రశాంతముగ నుండెడిది.

డాక్టర్ సత్యవ్రత సేన్ తల్లి ఇలాదేవి షిలాంగ్‌లో మృణాళినీ దేవి జీవితమును గురించి జ్ఞాపకమున్న కొన్ని విషయములను గురించి వివరించినది. అప్పటిలో ఇలాదేవి చిన్నపిల్ల (minor) అయి ఉండి, తల్లిదండ్రులతో షిలాంగ్‌లో నివసించుచుండెను. ఆమె యిల్లు, మృణాళినీదేవి తండ్రిగారి యిల్లు ప్రక్క ప్రక్కన ఉండుటచే వారి మధ్య సహవాసము పెరిగి, ఇరువురు స్నేహితులుగ నుండిరి. ఇలాదేవి యిట్లు వ్రాసినది.

"నేను ఆమెను, నా చిన్నవయస్సులో చూచితిని. ఆమెకు "మినూదీ" (Minudi) అను ముద్దుపేరుండెడిది. ఆమెది అతి మధుర స్వభావము. వాత్సల్య ప్రేమలతో పిల్లల హృదయముల నాకట్టుకొనుచుండెడిది. ఒకనాడు ఆమె ఆటలకు ఆలస్యముగ వచ్చినది. నేను ఆమె ఏదని వెదకుచు వెళ్లితిని. స్థానిక న్యాయాధికారి (Magistrate) భార్య ఆమెను ఒక పాట పాడమనుచుండెను. సిగ్గు సంకోచములతో హార్మోనియమ్ ముందు కూర్చుని ఆమె ప్రఖ్యాతిగల ఒక మంచి బెంగాలీ భక్తి కీర్తనను ఆలపించెను. బయటనే నిలబడి నేనా పాటనంతయు వింటిని. ఆమె గొంతు అంత మధురముగ, మనోహరముగ నుండేది. నేనక్కడ నుండి కదలి వెళ్లలేకపోతిని.

"నా వయస్సున్న మృణాళినీ దేవి చిన్న చెల్లెలు చెప్పగా శ్రీఅరవిందులు అరెస్టు చేయబడినట్లు తెలిసినది. ఆ రోజంతా ఆయనను గురించి మాట్లాడుకుంటిమి. మినూదీ సంభాషణలన్నియు విని మిన్నకుండెడిది. ఏ మాత్రము తొణకకుండెడిది. మత్స్యమాంసములను విసర్జించి, అతి సాధారణ ఆహారమునే తింటూ నిరాడంబరముగా నుంటూ ఉండెడిది. వారి ఇంట ఒక అందమైన పూలతోట ఉండేది. ప్రతిరోజు ఉదయము పుష్పములను కోసి పూజగృహములో ప్రవేశించి గంటల తరబడి ఆమె

భగవత్పూజాధ్యానములు చేయుచు గడపుచుండెడిది. ఆ పూజ గృహము కాళీమాత, శ్రీరామకృష్ణ, శ్రీశారదామాతల పటము లతో చక్కగ అలంకరింపబడియుండెను. ఆ బల్ల కిరువైపుల శ్రీఅరవిందులు, శ్రీవివేకానందుల చిన్న పటములుంచబడెను. నేను ఒక రోజున ఆమె పూజాగృహము నుండి బయటకు వెళ్లిన తరువాత లోపలకు వెళ్లి చూచితిని. అక్కడ శ్రీఅరవిందుల పాదపద్మముల వద్ద పుష్పములుండెను. అగరుబత్తి వెలిగించబడి యుండెను.

“అనేకమంది ప్రజలు వచ్చి ఆమె దర్శనము చేసికొని, ప్రణామములర్పించి వెళ్లుచుండెడివారు. వారి రాక ముందుగ తెలిసినప్పుడు ఆమె దొరకకుండ తప్పించుకొనెడిది. కాని కొన్ని సమయములలో దొరికిపోయెడిది. శ్రీఅరవిందులు నిర్దోషిగ విడుదల చేయబడినట్లు తెలియగనే మా స్కూలును వదిలిపెట్టిరి. మేమందరము హృదయపూర్వకముగా మా ప్రేమానందములను తెలుపుకొనుటకు మినూదీ వద్దకు పరుగెత్తితిమి. ఆమె శ్రీఅరవిందులతో ఏదో ఒక రోజున వెళ్లి కలసికొనగలదని ఆశించుచుంటిమి. చివరిరోజు వరకును ఆమె కూడ అట్లే ఎదురుచూచుచుండెను.

తరువాత గాథను మృణాళినీ దేవి చిన్న చెల్లెలు చెప్పినది. “శ్రీఅరవిందులు విడుదల చేయబడినప్పుడు మేమందరము అమితానంద డోలికలలో ఓలలాడితిమి. మేము కలకత్తా వచ్చి ఒక యిల్లు అద్దెకు పుచ్చుకొని అక్కడ ఉంటిమి. మృణాళినీ దేవి శ్రీఅరవిందులతో ఆయన మేనత్తగారి ఇంటిలో నివసించుటకు వెళ్లినది. విడుదల సందర్భముగ మేమొక విందు ఏర్పరిచితిమి. అందరము సంతోషముతో పొంగిపోతిమి. మంచిరోజులాసన్నమైనట్లుండెను. మా అక్క చాలా రోజులు కష్టనిష్ఠురములు, దుఃఖముల కోర్చుకొని తుదకు సుఖశాంతుల ననుభవింపసాగెను. కాని ఒక సంవత్సరము మాత్రమే అట్లు సాగినది.

విడుదలైన పిమ్మట శ్రీఅరవిందులు రెండు పత్రికలు – ఒకటి ‘కర్మయోగిన్’ రెండు ‘ధర్మ’ అను వానిని ప్రారంభించిరి. మృణాళినీ దేవి కొంతకాలమాయనతో నివసించెను. వారిపురును

అప్పుడప్పుడు దియోఘర్‌లో (శ్రీఅరవిందుల) మేనమామగారి యింటికి వెళ్లి కొంతకాలము గడుపుచుండిరి. ఈ సంగతి అప్పు డేనో, శ్రీఅరవిందుల అరెస్టుకు పూర్వమో జరిగియుండును. ఇది కూడ మృణాళినీ దేవి సోదరుడు చెప్పినదే. ఎప్పుడు జరిగినదో అతడు స్పష్టముగ చెప్పలేదు. మృణాళినీ దేవి సరోజినిల మధ్య పొత్తు లేకపోయెను, కలిసికట్టుగ జీవించలేకపోయిరి. చిన్న చిన్న విషయములను గురించి సరోజిని మృణాళినీ దేవితో తగవులాడు చుండెడిది. ఆమె దుష్ప్రవర్తనను మృణాళినీ దేవి శ్రీఅరవిందులకు ఫిర్యాదు చేయుచుండెడిది. కాని ఆయన ప్రతిమారు 'ఓర్చుకో భరించు' అని సలహా నిచ్చుచుండెను. అది ఆమెకు తృప్తినివ్వ లేదు. చివరకు మృణాళినీ దేవి శ్రీఅరవిందులతో నిష్ఠురముగ, కఠినమైన కంఠస్వరముతో పలికినది. "మీరు ఏదో తగిన పని చేయనిచో, నేనీ యింటిలోని పనులేమియు చేయను" అని. ఇక శ్రీఅరవిందులు ఏదో ఒక చర్య తీసికొనక గత్యంతరము లేక పోయెను. ఆయన మృణాళినీ దేవి ముఖములోనికి తీక్షణముగ చూచుచు, ఇట్లు పలికెను. "చూడు! ఇతరుల స్వభావమును నీ వనుకొనినట్లు మార్చగలమా? నిన్నుగాని, సరోజినినిగాని మంద లించినంత మాత్రమున మీరు మీ బలహీనతను వెంటనే వదలి వేయగలరా? అందువలన నీవు కోరే ప్రశాంతత రాకపోగా, వ్యతిరేక భావము వైరము పెరుగును. నీకు నేను ఓపికతో ఓర్చు కొనుమని చెప్పితిని. నేను నీ కిచ్చిన సలహా ప్రకారము నడుచు కొనగలిగినచో కొన్ని రోజులు పోవుసరికి పరిస్థితులన్నియు వాటంతటవే సర్దుకొని ప్రశాంతత స్థిరపడుతుంది." అది మొదలు మృణాళినీ దేవి చెప్పినట్లుగ వారి మధ్య ఎట్టి పొరపొచ్చములు లేకుండెను. వారి సాంసారిక గృహజీవనము అకస్మాత్తుగ వారికి తెలియకుండగనే మంచి మార్గములోనికి మారెను. మృణాళినీ దేవి నిజముగనే శ్రీఅరవిందుల సలహాను నిశ్చయబుద్ధితో అనుస రించెను.

మృణాళినీ దేవి కూడ ధృవపరచిన మరియొక గాథ కలదు. శ్రీఅరవిందులు రెండు పత్రికలను నడిపించిన కాలములో

ఆయనతో కలిసి పనిచేయుచుండిన వ్యక్తుల శీలస్వభావములను పరిశీలించి, మహాభారతములోని పాత్రలలో ఎవరిని పోలియున్నారో కనుగొనుచుండెను. ఒక రోజున శ్రీఅరవిందులు పూర్వ జన్మలో ద్వాపరయుగాంతమున, తాను శ్రీకృష్ణుని మనుమడు అనిరుద్ధుడుగ జన్మించినట్లును, మృణాళినీదేవి అతని భార్య అయిన ఉష (రాక్షసరాజు బాణుని కూమార్తె) అయినట్లుగ చెప్పినట్లు వివరించెను. ఈ కథలో కాల వ్యతిక్రమముండుటచే, యథార్థమని చెప్పుటకు వీలు లేదు. కాని సూక్ష్మలోకములలో అది సాధ్యమే. శ్రీఅరవిందులు బెంగాలీ భాషలో "ఉషాపహరణము" అను ఒక పెద్ద పద్యప్రబంధమును రచించెను. ఈ విషయము పై కథనమునకు కొంత ఆధారము నందించవచ్చును. ఇదే నిజమైనచో, మృణాళినీ దేవి సంబంధము శ్రీఅరవిందులతో కొన్ని జన్మల వెనుకకుపోవును. ఇంతకుమించి ఈ కాలములో మృణాళినీ దేవి జీవితమును గురించి మనకు తెలియదు.

శ్రీఅరవిందులు చంద్రనాగూర్ వెళ్లిన రోజున ఆమె కలకత్తాలో వేరొకచోట నివసించుచుండెను. ఆమెగాని ఆమె బంధువులుగాని శ్రీఅరవిందు లెక్కడున్నది ఎరుగరు. ఆయన పాండిచ్చేరి చేరిన పిమ్మటనే అక్కడున్నట్లు సమాచారము నందుకొనిరి. సహజముగ వారి మానసిక ఆందోళన ఎక్కువాయెను. అప్పుడు మృణాళినీదేవిని ఆమె తండ్రి షిలాంగ్ తీసుకొనిపోయిరి.

ఆమె జీవితములో అతిక్లిష్టమైన అధ్యాయము అప్పుడారంభమైనది – దీర్ఘమైన ఎనిమిది సంవత్సరముల కఠోరమైన తపస్సులో ఆమె జీవించినది. బాహ్యముగ వైవాహిక జీవితమంతరించెనా యనిపించెను. కాని అంతరంగములో ఆ బంధము ఎక్కువ గాఢమైన బలమును పుంజుకొనెను. శ్రీఅరవిందులు ఆమె దగ్గరున్నప్పుడు ఆమె చేయవలసిన విధులను బోధించెను. వాటిని అప్పుడామె చేయలేకపోయెను. ఇప్పుడాయన దూరమై భరింపరాని దుఃఖమును కలుగజేయుచుండ ఆమె వెనుక బోధించిన వానిని ఆచరణలో పెట్టుటకు ప్రయత్నించుచుండెను. ఒక వాస్తవమైన హైందవ సతీమణి భర్త నిరూపించిన ఆధ్యాత్మిక ఆద

ర్యమును స్వీకరించి అనుసరించుటకు ప్రారంభించెను. ఆమె దైవము శ్రీఅరవిందులే. ఆమె జీవన సర్వస్వము ఆయనే. సర్వదా ఆయననే ధ్యానించుచు, ఆయన చైతన్యములో జీవించుచుండెను. దాని వలన ఆమె జీవితములో ఒక గొప్ప మార్పు వచ్చెను. చివరకు తన మరణము ద్వారా ప్రభువుతో ఐక్యమొందెను.

ఆమె షిలాంగ్ జీవితమును గురించి రెండు రకములైన కథలు కలవు. ఒకటి ఆమె చిన్న చెల్లెలు చెప్పినది, రెండవది ఆమె యెడల అపారమైన ఆప్యాయతగల ఆమె సోదరుడు వివరించినది. అవి పరస్పర విరుద్ధములుగాక పూరకములై యున్నవి. వాటిలోని కొంతభాగ మిదివరకే వివరించియుంటిని. ఆమె చెల్లెలు ఇట్లు చెప్పెను.

"ప్రతిరోజు ఉదయము మా అక్క స్నానము చేసి, పెరటిలోనున్న పూలతోటలోని పుష్పములను కోయుచుండెడిది. ఆ తోటలోని వివిధములైన పుష్పరాజములు అనేకములైన రంగులలో ప్రకాశించుచుండ, వాటి మధ్య ఆమె అసమానమైన లావణ్యముతో విరాజిల్లుచుండెడిది. తరువాత ఆమె పూజాగృహములో ప్రవేశించి, గంటల తరబడి ధ్యానములో మునిగి యుండెడిది పిమ్మట యింటి పనులు చక్కబెట్టి మిగిలిన రోజంతా ఆధ్యాత్మిక గ్రంథములను ముఖ్యముగ శ్రీరామకృష్ణులు, శ్రీ వివేకానందస్వామి వారల గ్రంథములను చదువుచుండెడిది. అప్పుడప్పుడు ఆమె తల్లిదండ్రులుగాని, ఇతర స్నేహితురాండ్రుగాని పాడమని కోరితే హార్మోనియము తీసికొని శ్రీ టాగూర్ మొదలగువారి భజనకీర్తనలు పాడుచుండెడిది.

"ఆమె ఎల్లవేళల, సాధారణమైన పరిశుభ్రమైన నిరాడంబరమైన దుస్తులను ధరించి యోగినివలె కనిపించెడిది. ఆహార విషయమున, మత్స్యమాంసములను, మధురములైన పిండివంటలను పూర్తిగా నిషేధించినది ఎప్పుడైనను తల్లిదండ్రులు ప్రాధేయపూర్వకముగ కోరిన ఈ నియమనును సడలించెడిది.

"శ్రీఅరవిందుల నుండి 'శ్రీమతి ఘోష్' అను చిరునామాకు దీర్ఘకాలపు వ్యవధిలో ఉత్తరములు వచ్చుచుండెడివి. అవి

ఆమెను ఉల్లాసముతో ఉత్తేజపరచి కొంతకాలము ఆత్మశాంతిని కలుగ చేయుచుండెడివి. కాని ఏనాడూ తన హృదయమును విప్పి తన తల్లిదండ్రులకు, స్నేహితులగు సుధీరకు తప్ప మరెవ్వరికిని చెప్పుకొనలేదు. ఎవరి సానుభూతినీ అపేక్షించ లేదు. మా సోదరుడు పాండిచేరి వెళ్లి శ్రీఅరవిందులను కలసి ఆయన ప్రగాఢ యోగసాధనలో నిమగ్నుడై యున్నారని మాకు జవాబు వ్రాసెను శ్రీఅరవిందులు, మృణాళినీదేవిని కూడ అదే మార్గమవలంబించ వలసినదిగ కోరినట్లును తెలిపెను. శ్రీఅరవిందులిచ్చిన సూచనల ననుసరించి, ఆమె, ఆయన నిరూపించిన మార్గములో సాధన చేయసాగెను. బెంగాల్‌లోని రాజకీయావేశ వాతావరణము సద్దుమణిగిన తరువాత ఆయన తిరిగి రావచ్చుననే ఆశతో మేము చాలాకాలముంటిమి. కాని మా నిరీక్షణ వ్యర్థమాయెను ఆయన భారతభూమిపై కాలిడినచో, బ్రిటిష్ ప్రభుత్వము తిరిగి ఆయనను నిర్బంధములోనికి తీసుకోగలదనే భీతి మాకుండెను. మా తండ్రిగారు మా అక్క మృణాళినీదేవిని పాండిచేరి తీసికొని వెళ్లుటకు విశ్వప్రయత్నములు చేసిరి. కాని ప్రభుత్వమందుల కనుజ్ఞ ఇవ్వలేదు.

ఇప్పుడు మరొక వృత్తాంతమును గమనింతము. ఆమె సోదరుడిట్లు వ్రాసెను.

"ఎనిమిది సంవత్సరముల నుండి ఆమెకు ఓదార్పు నిచ్చుచు నిలబెట్టినవి శ్రీఅరవిందుల నుండి అడపతడప వచ్చుచుండిన ఉత్తరములే. షిలాంగ్, కొండలతో నిండి ప్రకృతి సౌందర్యమును ప్రదర్శించు ప్రదేశముల కాలవాలమై యుండెను. విరామ సమయములందు మృణాళినీదేవి పూలతోటలో తిరుగాడుచుండును నేనొక రోజున ఆమెనిట్లు ప్రశ్నించితిని. "దీదీ! నీవు అన్నిటికంటె పుష్పముల నెక్కువగ ప్రేమిస్తావు కదూ?" అని. ఆమె "నీకు తెలుసా! నీ గురుదేవులొక చక్కని పుష్పమువంటి వారు. ఆయన సమక్షములో నేను అనేక కుసుమముల గుబాళింపును ఆస్వాదించుచుండెడిదానను. (శ్రీమాత కూడ శ్రీఅరవిందుల దేహమునుండి తామరపూల పరిమళము వచ్చుచుండెడిదని చెప్పి

నది.) ఒకనాటి సాయంకాలము దేవదారు వృక్షముల తోపులో సంచరించుచు, మృణాళినీదేవి ఒక గుట్టకొనపై కూర్చుండెను. అక్కడ నుండి దృష్టి సారిస్తే కొండకోనల వరుస స్పష్టముగ ఒక పెద్ద చిత్రపటమువలె కనిపించుచుండెను. ఆ మనోహరమైన దృశ్యమును తిలకించుచు, ఆమె ధ్యానపరవశురాలాయెను. నేను కూడ ఆ సౌందర్యమును, ఆ రమ్యమైన వాతావరణమును చూచుచు పరవశుడనైతిని. కాని ఆమె ధీర్ఘకాలము ధ్యానములో ఉండిపోవుటచే, నాకు భయము వేసెను. ఆమె కండ్లు తెరచిన తరువాత ఆమెను ఇట్లు ప్రశ్నించితిమి. "దీదీ? మన చుట్టు ప్రకృతి మిక్కిలి సుందరముగ నుండగ నీవు కళ్లుమూసుకొని కాలమంతా చీకటిలో వృధా చేసినావేమి?" అని. ఆమె, తెలివిలేని కుర్ర నాయనా! నీకేమి తెలుసు, ఈ ప్రకృతిలోని అనంత వైభవోపేత మైన సౌందర్యము, దాని పుట్టుక స్థానమగు అంతరాళముల లోనికి పోవుటకీ ధ్యానమెంత సహాకరించినదో? బహుశ నీకు విసుగెత్తినదనుకుంటాను! నీకు తెలుసా? మీ గురుదేవుని హృదయసీమ ఈ బాహ్యాసౌందర్యముకంటె అనేక రెట్లు దివ్య మైన అందాలభరిణె. అదొక స్వర్గసీమ" అని. ఆమె ప్రేమ అందరి యెడల ఎట్లు పొంగిపొరలుచుండెనో ప్రస్తావించితిని. ఆమె కల కత్తాలో ఉన్నంతకాలము శ్రీఅరవిందుల అనుయాయులు, ఆమె ప్రేమ వాత్సల్యముల స్పర్శను లెస్సగ రుచి చూచిరి. సుధీర్ సర్కార్ మారువేషములో తన రహస్య కార్యక్రమములకు బయలు దేరునప్పుడు శ్రీఅరవిందుల దుస్తులతో ఆమె తన్ను ఎట్లు అలం కరించెడిదో కంట తడిపెట్టుకొని చెప్పుచుండెడివాడు.

"ఆమెకు ఆంగ్లభాష యెడల గొప్ప ఆసక్తి ఉండెను. తన ఆంగ్లభాషా జ్ఞానమును అభివృద్ధిపరచుకొనుటకు తపన పడు చుండెడిది. ఈ ఉద్దేశ్యముతో ఆమె నాకు ఆంగ్లభాష నేర్పుట మొదలు పెట్టినది ఆమె మా భాష ఉచ్చారణ సరిచేసి ఇంగ్లీష భాష చదువుట, పైకి స్పష్టముగ పలుకుట చక్కగ నేర్పినది. నేనొక రోజున యిట్లు ప్రశ్నించితిని. "దీదీ! మాకు ఆంగ్లభాష నేర్పుటకు నీవెందుకింత శ్రమపడుచున్నావు? దీనివల్ల నీకు ఏమి

లాభము?" కొంచెము ఇబ్బందిగ ఆమె సమాధానము చెప్పినది. "ఆ గడుసు మాటలటుంచి, అసలు విషయము చెప్పు. నీకు లాభదాయకముగా లేదా? నేను కూడ ప్రయోజనము పొందటం లేదా? మీ గురుదేవుల మాతృభాష ఇంగ్లీషని నీకు తెలియదా? అనినది. నేను అభ్యంతరముపెట్టి "ఏమిటి? ఆయన బెంగాలీ తల్లిదండ్రుల పుత్రుడు కాదా?" అని అడిగితిని. అప్పుడు ఆమె ఆయన జీవిత వృత్తాంతమంతయు నాకు విప్పిచెప్పి యిట్లు అన్నది. "నేను ఆయనతో జీవించాలంటే నాకు మంచి ఆంగ్ల భాషాజ్ఞాన ముండవలెను. ఒరే బాబూ! ఇప్పుడు నీకు అర్థమైందా? మీకు నేర్పి, తద్రీత్యా నేను నేర్చుకొనుటకిది కారణము. అప్పుడప్పుడు నాకు ఆయన దగ్గర నుండి ఉత్తరములు వచ్చుచుండును. ఒకటి అర ఇంగ్లీషులో ఉంటాయి. ఆయన ఉత్తరములలోని పరిపక్వమైన బెంగాలీభాష ముందు, మన భాష పేలవముగ ఉండి జుగుప్స కలిగించును.

"ఆమె ఆశలనన్నిటిని భగ్నమొనరించిన అతిఘోర కాలము 1918 సంవత్సరము రానే వచ్చినది.

అప్పుడు మృణాళినీదేవి కలకత్తా వచ్చినది, బహుశ రాంచినుంచి కావచ్చు. కంటి వైద్యము నిమిత్తము గిరీష్ బోస్ ఇంట మకాం చేసినది. ఇంతకు పూర్వము ఒకప్పుడు, శౌరిన్, నళినికాంత గుప్త మరికొందరు బెంగాల్ వెళ్లదలచిరి. శ్రీఅరవిందులను శౌరిన్ ఇట్లు అడిగెను. "నేను మృణాలినీదేవిని కలుస్తాను. ఆమెకు ఏమి చెప్పమంటారు!" అని. శ్రీఅరవిందులు, "నీవు ఆమెను ఇక్కడకు తీసికొని రాగలిగితే చాలా సంతోషిస్తాను" అని సమాధానము చెప్పిరి. అప్పటి ఆర్థిక పరిస్థితి అతిక్లిష్టమై, జీవితము దుర్భరముగ నుండెను. అయినప్పటికి శ్రీఅరవిందులు, మృణాళినీదేవి తనతో జీవించుటనే కోరెను. ఆ సందర్భములో ఎవరో శ్రీఅరవిందులకు ఆర్థికపరమైన ఇబ్బందులను జ్ఞాపకము చేయగ, ఆయన "ఏముంది! తక్కువ తిందాము." అని పలికిరి.

ఆమె చెల్లెలు చెప్పిన కథ:

"అది 1918 సంవత్సరము, డిసెంబరు నెల ఆమెకు (మృణాళినీ దేవికి) శ్రీఅరవిందులనుండి రమ్మని పిలుపు వచ్చినది."నా సాధన పూర్తియైనది. నేను వాంఛించిన సిద్ధి నందుకొంటిని. లోకసంగ్రహార్థము చేయవలసిన పని చాల ఉన్నది. నీవు ఇప్పుడు వచ్చి, ఈ కార్యక్రమములో నాతో పాటు పాల్గొనవచ్చును." ఈ వార్త మృణాళినీ దేవిని, మమ్మందరను అమితానందభరితులను చేసినది.

"మా తండ్రిగారు ఆమెను పాండిచేరి తీసుకొని వెళ్లుటకు సిద్ధపడెను. ప్రభుత్వము నుండి అనుమతికూడ దొరికెను. అప్పటిలో అక్కడ ప్రజ్వరిల్లియున్న 'ఇన్ఫ్లుయన్జా' వ్యాధి సోకి మృణాళినీ దేవి రోగపీడితురాలాయెను. ఒక వారం రోజులా జబ్బుతో బాధపడి ది 17-12-1918 న 32 వ యేట అసువులు బాసెను. అనేక సంవత్సరములు తనలో అణచిపెట్టుకొనిన మానసిక సంక్షోభము, శ్రీఅరవిందులు అరెస్టు చేయబడినప్పటి భయంకర దృశ్యము ఆమెను పట్టి బాధించిన ఘోరసంకటము, ఆమె సంధిలో నున్నప్పుడు అగ్నిపర్వతము వలె బ్రద్దలై పొంగి పొరలెను.

"ఆమె జీవితములో 32 వ ఏడులో గండమున్నదని ఆమె జాతకమున ముందే సూచింపబడినది. శ్రీఅరవిందులకు ఆ విషయము తెలియును. ఆ సమయము, అనగా ఆమెకు 32 ఏళ్ళు వచ్చినప్పుడు తనకు జ్ఞాపకము చేయవలసినదిగ మమ్ము ఆదేశించెను మేము మరచిపోయినను మా తల్లి మరువలేదు. అప్పుడామె రాంచిలో ఉండెను. మా అక్క జబ్బుగ ఉన్నదని తెలిసి వెంటనే కలకత్తా వచ్చెను. ఆమె చేరిన అర్థగంటలో మృణాళినీ దేవి శరీరమును వదలినది. ఆమె రోగముతో బాధపడుచున్నదని శ్రీఅరవిందులకు మేము తెలియపరచలేదని తెలిసి, మా తల్లి వెంటనే శ్రీఅరవిందులకు తంతి ద్వారా తెలియజేసినది. ఆ తంతిని ఆయనకు చదివి వినిపించిరి. ఆయన 'ఆలస్యమైనది' అని పలికిరి. మా సోదరుడు ఆ సమయములో అక్కడ (పాండిచేరిలో) ఉండి మా అమ్మకు జాబు వ్రాసెను, "రాతిగుండె గల నీ అల్లుని

కండ్లలో ఈ రోజున అశ్రుధారలు చూచితిని. ఒక చేత తంతి పట్టుకొని నేత్రముల వెంట నీరు కారజొచ్చినది" అని. శ్రీఅరవిందులు ఆయనతో ఇట్లు పలికిరి. "అక్కడ ఆమె ప్రాణము పోయినది. ఇక్కడ ఆమె ఆత్మ నన్ను జేరినది." మరియొక విశేషము అచట గోడబల్ల మీద ఉండిన ఆమె ఫోటో క్రిందపడి ముక్కలైనది.

మృణాళిని మరణించిన నాటి సాయంకాలము సుధీర, ఆమె తల్లిని శ్రీశారదామాత వద్దకు తీసికొని వెళ్లెను. అప్పుడామె తీవ్రధ్యానములో నుండెను. కండ్లు తెరచిన తరువాత వీరిని చూచి, "మీరు వచ్చారా? నా ధ్యానములో నా కోడలు మృణాళినీని చూచుచుంటిని. ఆమె దేవత. శాపగ్రస్తయై నీ కుమార్తెగ జన్మించినది. ఆమె కర్మసంస్కారము పూర్తికాగానే ఆమె ఆత్మ తిరిగి వెళ్ళి పోయినది" అని పలికెను. శ్రీశారదామాత మా తల్లి ఆరోగ్యమును గురించి, తరచు అడుగుచుండెడిది.

"చనిపోవుటకు కొద్దిరోజులు ముందు, మృణాళినీ దేవి తన జీవితము అంతరించనున్నదని తెలిసి, తన ఆభరణములలో చాలవరకు అమ్మి సొమ్ముచేసి దానిని దానధర్మములకు వినియోగించవలసినదని చెప్పినది. మిగిలిన నగలను సుధీర వద్ద జాగ్రత్తపరచినది. వాటిని విక్రయించి, ఆ సొమ్మును మూలధనముగ పెట్టి, అందుపై వచ్చు వడ్డీతో శ్రీఅరవిందుల అనుజ్ఞ తీసికొని 'నివేదితా బాలికల పాఠశాల' లో బీద విద్యార్థినులకు ప్రతి సంవత్సరము వేతనముగ నీయమని చెప్పినది తనకు శ్రీఅరవిందుల నుండి వచ్చిన ఉత్తరము లన్నియు ఒక చిన్న పెట్టెలో భద్రపరచినది. ఆ పెట్టెను తన అనంతరము గంగలో పారవేయవలసినదిగ కోరినది ఈ విధముగ మంచివిలువైన లేఖలు శోచనీయముగ నశించినవి.

"మా సోదరి బాహ్యముగ సాధారణ జీవితము గడపినను, ఆమెతో పరిచయమున్న వారందరు ఆమె ఒక అద్భుతమైన వ్యక్తి అనియు, ఆమె చుట్టును ఒక కాంతి వలయముండినదియు అనుభవపూర్వకముగ చెప్పుచుండిరి. ఆమె ఇతరుల దగ్గరనున్న సమ

యములలో కూడ, ఆమె నేత్రములలో నొక సుదూరభావమే గోచరించెడిది. దానిని ఆమె స్నేహితురాలు సుధీరయును, ఆమె తల్లియును తప్ప యితరులెవ్వరును గమనింపజాలకుండిరి.

మృణాళినీదేవి విచిత్రగాథ ఈ విధముగ అంతరించినది. ఆమె తన భర్త శ్రీఅరవిందులచే ఆదేశించబడిన హైందవ సతీ ధర్మమును పూర్తిగ ఆచరించి చూపినది. గీతలోని "మన్మనా భవ, మద్భక్తో, మద్యాజీ..." మనస్సును నాయందు నిలుపుము. నా భక్తుడవు కమ్ము... అను శ్లోకార్థమును ముమ్మూర్తుల తన జీవితములో మూర్తీభవింప జేసుకొనిన విదుషీమణి శ్రీమృణాళిని దేవి. పవిత్రమైన ఏకైక ప్రేమభావముతో, అచంచల ఆత్మపరి త్యాగము చేసికొనిన హైందవ సంప్రదాయములోని మహిమాన్వి తులైన నారీమణుల కీర్తిపతాకను ప్రకటించు చరిత్ర పుటలలో ఆమె జేర్చబడవలసి యున్నది. యుగపురుషుడైన మహాత్మునితో (వైవాహిక రీత్యా) కలసియుండుట వలన ఆమెకు సిద్ధించినదే మియు లేదని ఆమె తండ్రి భూపాల్ బాబు నుడివిన పలుకులతో నేనేకీభవించను.

లౌకిక దృష్టిగల, ఒక ఆధునిక బెంగాలీ రచయిత, కాన్ ఫ్యూషియస్ జీవిత చరిత్రను వ్రాయుచు ఆధ్యాత్మిక జిజ్ఞాసువు లగు మహాత్ములు వివాహము చేసికొనుట యందలి న్యాయ మును గురించి ఒక ప్రశ్న లేవనెత్తెను. అందు శ్రీఅరవిందులు కూడ ఒకరుగ ఉదహరింపబడిరి. ఆ భాగమునెత్తి నేను శ్రీఅర విందులకు ప్రశ్న రూపములో పరిహాసమునకై పంపియుంటిని. ఆయన సమాధానములు కొంచెము చురక వేయునవైనను, చక్కని చమత్కార రూపములో నుండినవి.

నేను: కాన్‌ఫ్యూషియస్ జీవితమును బెంగాలీ భాషలో వ్రాసిన రచయిత యిట్లు పలికెను:

"ధర్మబోధకులగు గురువులు ఎందుకొరకు వివాహము చేసికొందురో మాకర్థము కాదు. బుద్ధుడు వివాహమాడెను. ఆయన భార్య గాథ హృదయవిదారకము.

శ్రీఅర: ఎందుకు? అందులో అంత హృదయమును దహించు నదేమున్నది?

నేను: ఆయన ఇంకా "శ్రీఅరవిందులు ధర్మగురువు కాకపోయి నను, ధర్మము పిచ్చిగల ఆయన కూడ అదే పని చేసెను." మరి అయ్యో?

శ్రీఅర: తనకు తెలియని విషయాలపై, సూక్తులు పలికే గార్ద భములాగ నిర్ణయాలు చేయడముకంటె, ధర్మమను పిచ్చి గలిగి యుండుట మంచిదే.

నేను: బుద్ధుని భార్యను గురించి ఎంత విచారిస్తూ ఉంటామో అలాగే కాన్ఫ్యూషియస్ సతీమణిని గురించి కూడ.

శ్రీఅర: అయ్యో పాపం! ఎంత శోచనీయము!

నేను: వారు ఎందుకు వివాహమాడుతారో తెలియదు! పెండ్లైన వెంటనే మార్పు ఎందుకు వస్తుందో తెలియదు?

శ్రీఅర: అది సహజమే. – మార్పు రాకముందు వివాహమాడ తారు. తరువాత మార్పు వస్తుంది. పెండ్లి గత జీవికి సంబంధించినది. క్రొత్తజీవిది కాదు.

నేను: బుద్ధుడు, శ్రీరామకృష్ణుల భార్యలు వదలివేయబడి నప్పుడు, గర్వపడినారేకాని దుఃఖపడలేదు.

శ్రీఅర: అందులో ఆక్షేపించేందుకేమున్నది?

నేను: ఆధ్యాత్మిక జీవితమునకు, వైవాహిక జీవితము అభ్యం తరమైనచో, పెండ్లిచేసుకొనని యెడల బాగుండెడిది కదా?

శ్రీఅర: ఔను, సందేహము లేదు. కాని వారి పెండ్లి సమయము నకు వారి జీవితచరిత్ర వ్రాసే సర్వజ్ఞులు వారు ధర్మగురు వులు, ధర్మోన్మాదులు అవుతారని చెప్పడానికి అక్కడ ఎవరూ లేరు. కాన్ఫ్యూషియస్ జీవితకథను రచించే వ్యక్తి, ఇంతటి మూర్ఖుడు కాగలిగితే కాన్ఫ్యూషియస్ ఒకటి రెండుమార్లు పొరపాటు చేస్తే పరవాలేదనుకుంటాను.

నేను: నేను చాల సున్నితమయిన విషయమును కదిపాను కాని అదొక సమస్యే గదా.

శ్రీఅర: ఎందుకని సున్నితము? ఎందుకు సమస్య? బుద్ధుడు గాని, కాన్‌ఫ్యూషియస్ గాని, నేను గాని పుట్టుకతోటే ఆధ్యాత్మిక జీవితము సాగిస్తామని, వారికీ నాకూ భవిష్య జ్ఞానము కలదని నీవనుకుంటున్నావా? సాధారణ చైతన్యములో నున్నంతకాలము సాధారణ జీవితమునే జీవించెదము. ఎప్పుడైతే ఉన్నత జ్ఞానము వికసించి నూతన చైతన్యమావిర్భవించునో అప్పుడు సాధారణ జీవితము వదలివేయబడును. ఇందులో అర్థం కానిదేమున్నది?

శ్రీఅరవిందుల వాదము హేతుబద్ధము, న్యాయసమ్మతముగనే యున్నది కాని నా సంకటం వదలలేదు. అది వేరే కారణముపై నాధారపడి యున్నది. శ్రీఅరవిందులు ఆయన వివాహమునకు పూర్వమే దేశస్వాతంత్ర్యమునకై పోరాడుటకు, విప్లవాత్మక కార్యక్రమము నడిపించుటకు కృతనిశ్చయుడై యుండెను. ఆ సందర్భములో ఆయన వివాహ ప్రయత్నమెందుకు చేయవలెను? తన రాజకీయ సమరము బలసంపన్నము శక్తివంతమైన విజాతీయ ప్రభుత్వముతోనని తెలిసి, దాని ఫలితము లెట్లుండునో ఊహించగలిగి కూడ ఒక అమాయిక బాలిక యొక్క జీవనమును తన ప్రమాదభరితమైన విధితో ఎందుకు లంకె వేయవలయును? ఇది నా ప్రశ్న. ఇదే రకమైన సందేహము శ్రీఅరవిందుల మిత్రుడైన చారుదత్తునకు కలిగి, శ్రీఅరవిందులను నిర్భయముగ ప్రశ్నించినట్లు తరువాత తెలిసినది. "నీవు ఒక రోజున రాజకీయవిప్లవ సుడిగుండములో దుముకుదువని తెలుసును కదా. అట్లాంటప్పుడు, నీ వెందుకు వివాహము చేసికొన్నావు?" అని ప్రశ్నించగా, శ్రీఅరవిందులు ఈ విధముగ సమాధానము చెప్పిరి: "చూడు బాబూ! అప్పుడు నా పరిస్థితి చాలా దీనంగా ఉన్నదిలే. నా జీవితమంతా ఒక బడిపంతులుగా గడపవలసినదే గదా. ఇక పెళ్లి చేసుకుంటే నష్టమేమిటి? అని అనుకొన్నాను". శ్రీఅరవిందుల సమాధానము చాలా ఆశ్చర్యము కలిగించినది. ఇది ఆయన స్వభావమునకు విరుద్ధము. ఇది దత్తు కల్పించిన విషయమా? అతనికి అటువంటి అలవాటు కలదు. లేక శ్రీఅరవిందులే ఒక

సత్యమును మరో సత్యముతో కప్పిపుచ్చుటకు అప్పుడప్పుడు ప్రయోగించే యుక్తియా? ఏమైనప్పటికి అది పిల్లలకి చెప్పే కథల్లే ఉన్నదిగాని, యథార్థమైనదిగ గోచరించుట లేదు. ఆయన వివాహము ఏమైనదో మనము గ్రహించాము. అదొక అంతులేని విషాదగాథ అయినప్పటికి, చివరకి ఆధ్యాత్మిక పర్యవసానానికే దారితీసింది. మృణాళినీ దేవి, శ్రీఅరవిందులతో ఆయన భార్యగ, బాధాకరమైన వేలజన్మలనైనను కోరెనేమోగాని, సాంసారిక సుఖములతో నిండిన జీవితమును వాంఛించెడిది కాదని నా నమ్మకము. ఆమె కష్టములకు ఆమె కారణము కాదు. ఏ భారతీయుడైనను, ఆమె కష్టములను పూర్వజన్మ యందలి ప్రారబ్ధములుగ, శ్రీశారదామాతవలె జమకట్టును. కాని నా భావనలో ఆమె ఒకానొక విశ్వకార్యార్థమై వచ్చిన కారణజన్మురాలు. వెనుకటి జన్మలో ఆమె ఉష అయివుండినట్లు మనము విశ్వసించకపోయినను, ఆమె శ్రీఅరవిందుల అర్ధాంగి అగుటయే నా ఊహకు బలము. భారత నారీమణుల జీవిత ధ్యేయము భోగము కాదు, త్యాగము. సీత మొదలగు సతీమణుల పవిత్రమైన చరిత్రలు ఈ విషయమును చాటి చెప్పుచున్నవి. అందువలన, నా అభిప్రాయములో, ఈ ద్రవ్యయుగములో, భారతీయ నారీమణుల ఆదర్శమగు సతీత్వమును నిలబెట్టి స్థాపించుటకు, మృణాళినీ దేవి ఆత్మ ఈ జన్మను బుద్ధిపూర్వకముగ గ్రహించినది. భారతసంప్రదాయములోని ఈ సందేశమును గత వంద సంవత్సరములుగ కాలగర్భములో, పృథ్వీస్మృతి లోతులలో అణగియుండి ఇప్పుడు మేల్కాంచుచున్నది. శ్రీఅరవిందుల జీవితము లోని ప్రథమ దశలో మృణాళినీ దేవి ఒక విస్మరించరాని భాగ ముగ స్థిరపడగలదు.

శ్రీఅరవిందుల విషయములో బాహ్యాముగ నిష్ప్రయోజనముగ కనిపించు వివాహము యొక్క ప్రగాఢమైన రహస్యమును ఛేధించు బీగమొకటి నాకు సంప్రాప్తమైనది. మృణాళినీ దేవి మరణానంతరము శ్రీఅరవిందులు భూపాల్ బాబుకు వ్రాసిన లేఖ ఆ మర్మమును విప్పును. అది యీ క్రింది విధముగ నున్నది:

ప్రియమైన మామగారికి.

మన ఇరువురి జీవితమునకు సంబంధించి ఘటిల్లిన ఘోరవిపత్తును గురించి నేనిదివరలో మీకు వ్రాసియుండ లేదు. సాధారణముగ మాటలు మన ప్రగాఢమైన భావములను ప్రకటించగలిగినవైనను, ఈ సందర్భములో నాలో ఉద్భవించిన భావములను వర్ణించుటకు శక్తి లేనివి, పనికిరానివై యున్నవి. నా హృదయాంతరాళము లోని కేంద్రమును స్పృశించగల ఒకానొక దుఃఖము నాకు కలుగజేయుటలో, ఒక ప్రయోజనము ఉన్నదని భగవంతుడు తలచినాడేమో. మనలోని ప్రతి వారికి ఏది యోగ్యమైనదో నిర్ణయించుట ఆయనకే తెలియును. అనివార్యమగు ఆ ఘటన సంభవించినది. ఆయన దివ్య ఉద్దేశ్యమునకు నేను శిరస్సు వంచి ఆమోదించుచున్నాను. మీరు చెప్పినట్లుగ మన మధ్య భౌతిక సంబంధము విడిపోయినది. కాని నాకు మటుకు ప్రేమబంధము నిలిచియున్నది. ఒకసారి నేనెవరిని ప్రేమించుదునో, వారిని ప్రేమించుట ఎన్నడును మానను. అంతే కాదు, ఆ ప్రేమకు కారణమైన ఆమె నాకు సన్నిహితురాలై యున్నది. అది బాహ్యమైన భౌతిక దృష్టికి కనిపించకపోవచ్చును.

మీ జాబులో వ్రాసిన ఇతర విష.యముల గురించి చెప్పవలసిన దేమియు లేదు. మీరు చేయదలచిన పనులన్నిటిని ఆమోదించుచున్నాను. మృణాళినీ కోరినవన్నియు జరుగవలసినదే. ఇది ఆమె సమ్మతించినదను విషయములో నాకెట్టి సందేహము లేదు. ఆమె బంగారుగాజులు ఆమె తల్లి ఉంచుకొనుటలో నాకెట్టి అభ్యంతరము లేదు. ఆమె పుస్తకములు రెండు మూడు పంపగలిగినచో నేను చాలా సంతోషిస్తాను. ముఖ్యముగ ఆమె పేరు వ్రాయబడి ఉన్న పుస్తకములు. నా వద్ద ఆమె వ్రాసిన ఉత్తరములు, ఒక ఫోటో మాత్రమే ఉన్నవి.

అరవిందో

ఈ ఉత్తరము అనేక ఆశ్చర్యకరములైన విషయములతో నిండియుండి, చాలా మనోహరముగా నున్నది. శ్రీఅరవిందుల

జీవితములో ఇదివరలో తెలియరాని సంగతులు కొన్ని బయట పడి ఆయనను గురించి మనకు గల కొన్ని అభిప్రాయములను తల్లక్రిందులు చేస్తున్నాయి. అందువలన ఇది చాల అమూల్యమైన పత్రము. దీనిలోని అంశములను లోతుగ విశ్లేషించి, నాకు అర్థ మయిన విధముగ మీ ముందుంచెదను. నా వ్యాఖ్య మీకు గొప్ప సందేహమును కలిగించి, అదంతయు నా ఊహాగానమని తోచి, మీకు రుచింపకపోవచ్చును కూడ.

First of all, the letter is written in a very simple style and restrained in tone. It has a classical sublimity and is vibrant with a poignant pathos. People can be easily decei-ved about its inner richness. It is a masterpiece in the genre of letter-writing

శ్రీఅరవిందులు ఈ లేఖలో, తన మామగారిని, "ప్రియమైన మామగారూ" అని ప్రబోధించారు. మొదటి ఆశ్చర్యమేమిటంటే, ప్రాపంచికబంధముల నన్నిటిని త్రెంచుకొని పారలౌకిక దృష్టితో నున్న చైతన్యములో నివసించుచున్న శ్రీఅరవిందులు, ఇతర యోగులవలె గాక, పాతబంధమును స్మరింపజేయు, లౌకిక పద్ధతి ననుసరించిరి. అటుపైన, ఆయన ఆమెతో ఉత్తరప్రత్యుత్తరముల ద్వారా అప్పుడప్పుడు సంబంధము కలిగియున్నట్లు గోచరించు చున్నది. నేను లోగడ వివరించిన వాదములో, యోగిగా మారిన తరువాత పాతబంధములు తెగిపోవునని చెప్పినట్లుగాక, అందుకు భిన్నముగ కనిపించుచున్నది. ఆయన తన భార్యను తన సాధ నలో కలిసి పాల్గొనవలసినదిగ ఆహ్వానించెను. కలకత్తాలో ఉన్న కాలములో, ఆమె ఎడబాటుపోయి, శ్రీరామకృష్ణులు సిద్ధి నందిన తరువాతకూడ భార్య శ్రీశారదామాతతో కలసి ఉన్నట్లు వలె, తామిద్దరు కలిసి సాధన సాగించవలెనని, ఆయన (శ్రీఅర విందులు) ఆశించిరి. ఇదంతయు ఇట్లున్నచో భర్త యోగాభ్యాస మునకు పూనుకొనినచో, వివాహము గతజీవితమునకు సంబం ధించినదేనను వెనుకటి సమాధానము ఎట్లు కుదురును? దాని అర్థము, భార్య భర్తతో జీవించుచున్నపటికి వారి బంధము

శ్రీరామకృష్ణుల విషయములోవలె, ఆధ్యాత్మికపు పునాదిపై సాగుననుగాని, లౌకికవిధానముపై కాదనియా? బాహ్యాముగ గోచ రించు ఈ వైరుధ్యానికి ఇంతకంటె సమంజసము, తృప్తికరమైన పరిష్కారము కనిపించదు. మరియు, శ్రీఅరవిందుల పూర్ణయోగ ములో అన్ని అనుబంధములు నిరసించబడక, ఉన్నత స్థాయి నంది, పవిత్రములగునను సూత్రమునకుకూడ ఈ భావము చక్కగ సమన్వితమగుచున్నది. పిమ్మట వచ్చినదొక అద్భుతమైన (అమో ఘమైన) మాట, "నా హృదయాంతరాళములోని కేంద్రమును స్పృశించగల ఒకానొక దుఃఖము." ఇది లేచి పెల్లుబుకచేసిన మాట, "ఒకానొకప్పుడు నేనెవరిని ప్రేమించితినో, వారిని ప్రేమిం చుట ఎన్నడు మానను." ఇది చివరకు శిఖరాగ్రమునుచేరి అందు కొనిన మాట. "ఆ ప్రేమకు కారణమైన ఆమె" వరకు ఒక పెద్ద కెరటమువలె పోయినది. ఇది అంతయు మమ్ము అగమ్యమగు గందరగోళములో పెట్టి, మృణాళినీ దేవి పట్ల శ్రీఅరవిందులకు గల గాఢమైన ప్రేమను స్పష్టముగ విశదీకరించుచున్నది. మనలో మనమీ విధముగ ప్రశ్నించుకొనవచ్చును. "ఎవరు నిర్యాణసిద్ధిని సాక్షాత్కరించుకొనిరో, ఎవరు వాసుదేవమయ విశ్వానుభూతి ననుభవించిరో, ఎవరు అనేకమైన ఉన్నతలోకానుభూతుల దర్శించి అనుభవించిరో అట్టి మహాత్ములు మానవస్వభావ జనితములైన హృదయావేశములకు నిలువనీడయై, వాటికి ఒక విధముగ వశులై యుండుట కూడ సంభవమా?" ఈ ఉత్తరము శ్రీఅరవిందుల సంతకముతో ఉండని యెడల ఇదంతయు ఒక కట్టు కథయని మేము త్రోసిపుచ్చియుండెడివారము. ఈ ఉత్తరములో ప్రకటింప బడిన భావ యథార్థతను గురించి, వివాదములోకి దిగదలచు కొనలేదు. కాని, అతివినయపూర్వకముగ, నమ్రతతో, శ్రీఅరవిం దులు తెలియరాని మహోన్నతమైన ఒక నిగూఢమూర్తి అనియు ఆయనను గురించి మనకు తెలిసినది ఆవగింజలో అరభాగము కూడ లేదనియు, విన్నవించుకొనుచున్నాను. శ్రీమాత కూడ, తాను శ్రీఅరవిందులతో కలిసి ముప్పది సంవత్సరములు జీవించి నను, ఆయనను అంతుపట్ట లేకపోతినని నిస్సంకోచముగ నుడి

వెను. అంతేకాదు ఆయనకు సేవలు చేయుచుండిన మేము, ఆయ నను ఒక ప్రక్కన నిర్వ్యక్తిక పరాత్పరతత్వములో స్థిరాసీనుడై యుండినను, రెండవప్రక్కను, వ్యక్తిత్వమును వహించి, శరీర త్యాగమునకు ముందు, తనను పరమపరిశుద్ధము పవిత్రమునైన భక్తిప్రపత్తులతో సేవించిన భృత్యుడు చంపక్‌లాల్‌ను ఆప్యాయ ముగా ఆలింగనము చేసికొనుటనుకూడ దర్శించితిమి. మా స్వచక్షువులతో చూచియుండని యెడల, అది నమ్మతగినదిగ ఉండెడిది కాదు. అంతకు పూర్వము మేమనేక ఆశ్చర్యకరమైన రహస్య విషయములను దర్శించితిమి. వాటి ముందు కొన్ని నమ్మరాని అశ్రుబిందువులు రాల్చుట వట్టిపేలవమైన విషయమై యున్నది. నిర్వ్యక్తితత్వము యొక్క అంతర్హృదయములో మూర్తీ భవించిన వ్యక్తిత్వమున్నదనియు, ఎవ్వరైనను అతనిని చేరగలిగి నచో, అతని అనిర్వచనీయమైన ప్రేమామాధుర్యముల ననుభ వించవచ్చుననియు, ఒకానొకచోట శ్రీఅరవిందులు వక్కాణించి యుండిరి. కనుక మనము తొందరపాటుతో మన స్థిరమైన నిర్ణ యములతో భావములతో, శ్రీఅరవిందులు ఇట్టివారు, అట్టివారు అని నిర్ధారించి విలువ కట్టకుందుము గాక. ఆయన రచించిన నాటకములు, కావ్యములు, ప్రబంధములు, మహాకావ్యమగు 'సావిత్రి' మున్నగు గ్రంథములకు కథావస్తువు ప్రేమ, ప్రేమ రసమే అయి ఉన్నది. అందలి మహోన్నతమైన పాత్ర, ప్రేమ భరితమైన సావిత్రి పలికిన మాటలివి:

ప్రేమ భూలోకమును విడువరాదు
ప్రేమయే, స్వర్గభూలోకముల మధ్య తేజోమయ వారధి
ప్రేమ, సుదూర పరాత్పరతత్వమునుండి
ఇక్కడకు వచ్చిన దేవదూత
ప్రేమ నిరపేక్షతత్వముపై నరునకుగల హక్కు.
సావిత్రి ప్రస్తుతించు ప్రేమ సామాన్య మానవ హృదయా వేశము కాదు.

"ప్రేమ స్వర్గము నతిక్రమించవలెను.
అనిర్వచనీయమైన తన రహస్యభావమును కనుగొనవలెను.

తన మానవచేష్టలను, దివ్యకర్మలుగ – మార్చవలెను.
భౌతిక సామ్రాజ్యానందమును కూడ నిలుపుకొనవలెను."
భూ స్వర్గలోకములు ప్రేమలో సమ్మిళితములు కావలెను. అట్టి ప్రేమయే పూర్ణయోగమునందు వివరింపబడిన ప్రేమ.

చివర, నేనిదివరలో ప్రతిపాదించిన సందిగ్ధతను పరిష్కరించుటకు ప్రయత్నించెదను.

"శ్రీఅరవిందులెందుకు వివాహమాడిరి? ఆయన జీవన సిద్ధాంతమును నేనర్థము చేసికొనినంతవరకు, ఆది నుండియు, ఈ ప్రపంచము, ప్రాపంచిక జీవితము ఒక భ్రమగాని, మాయగాని కాదనియు, వాస్తవమైనదే ననియు నిర్ధారించెను. ప్రాపంచిక జీవితమును దూరముచేయు యోగమును అంగీకరించుటకుగాని, ఆచరించుటకుగాని ఆయన నిరాకరించెను. జీవితము యొక్క పూర్ణత్వమును, సమగ్రతను, అనుభవించుటయే ఆయన మతము. కాని అది మనము సామాన్యముగ భావించు జీవితము కాదు., ఆయన నిరూపించిన ప్రకారము రూపుదిద్దుకొనిన జీవనము. వైవాహిక జీవనముద్వారా లభించే ప్రేమానురాగములు గూడ ఈ అవతార పురుషునికి ముఖ్యములే. వివాహసంస్కారమును విసర్జించుటకు వీలులేదు. "ఈ అనుభవముకూడ నాకు కలదు." అని ఆయన మనతో అనగలరు. అందువలన సాంసారిక జీవితములో ప్రవేశించి ప్రేమస్వరూపమును, ముఖ్యముగ ఒక సతీమణి అందించగల ప్రేమను ప్రత్యక్షముగ అనుభవించినారు. తనకై నిర్దేశింపబడిన ప్రమదను (ప్రేయసిని) ప్రథమదర్శనముననే ఎన్నుకొని స్వీకరించిరి. సావిత్రి తన ప్రేమపాత్రుని ఒక అరణ్యములో కలిసికొనగా, శ్రీఅరవిందులు తన ప్రేమమూర్తిని ఒక మహానగరములో, సామాన్యమైన, ఎట్టి నేర్పును ఎరుగని అమాయకమైన, ముక్కు మొగము నెరుగని ఒకానొక బాలికలో దర్శించగలిగిరి. ఆమె తండ్రి ఉద్దేశములో ఆమె ఒక సాధారణ బాలికే అయినను, ఆమె ఆత్మోన్నత్యములో, ఆత్మస్వభావములో సుసంపన్నురాలు.

శ్రీఅరవిందులు చిన్నతనము నుండి, ఆదిలో ఐరోపా దేశ జీవనమున కలవాటుపడిన కుటుంబ వాతావరణములోను తదు

పరి, విదేశములలో జీవించుట వలనను, సమాజములో కలిసి మెలసి ఉండక తనలో తాను జీవించుట కలవాటుపడి ఒక విధ మైన బిడియము కలవాడై, ప్రేమానుభూతులు కరువైపోయెనని తన మిత్రుడు దత్తుకు ఒక లేఖలో వ్రాసెను. ఆ విధముగ అణగి యుండిన ప్రేమ మృణాళినీ దేవి నిష్కల్మషము, మధురమునైన ఆత్మస్పర్శతో ప్రజ్వరిల్లినదని చెప్పవచ్చును.

ముగింపులో వివరించు విషయము మీకు ఆనందమును కలుగజేయవచ్చును. 1930 వ సంవత్సర ప్రాంతములో, భూపాల్ బాబు, ఆయన భార్య ఆశ్రమమునకు వచ్చి దర్శనసమయములో శ్రీమాత, శ్రీఅరవిందులకు ప్రణామము లర్పించుకొనిరి. అల్లు నకు, మామ ప్రణమిల్లెను. శ్రీమాత మృణాళినీ దేవి ఆత్మ తనలో నున్నదని ఆయనకు చెప్పిన వినికిడి. మరియు ఆయన శ్రీమాతను దర్శించి నమస్కరించినప్పుడు, తన కుమార్తెను ఆమెలో దర్శించి సానుభూతి నందెనని ద్యుమన్ వివరించెను.

(ఈ మధ్యకాలములో ఆమె జన్మ గైకొని, బహుశ ఆశ్రమ ములో ఒక సాధికగా ఉన్నదని నా నమ్మకము)

ఆంగ్ల మూలము: నిరోద్ బరన్.
తెలుగు అనువాదం: మా నాన్నగారు శ్రీరాములు.

ఆరోగ్యపత్రం

మహాప్రభూ, ప్రాణవల్లభా! బ్రతుకంటే కేవలం ఈ బొందెను పట్టుకొని వేళ్లాడటం కాదు గదా. ఈ శరీరాన్ని అతి క్రమించి ఆకాశవీధులలో మేము విహరించెదము గాక! ఒక్క శరీరపోషణే తప్ప వేరే ఆలోచన లేని బ్రతుకు ఎంత సిగ్గు చేటు! నిరంతరం ఉదరపోషణ, ఆరోగ్యాన్ని కాపాడుకొనే కార్యక్రమా లతో కాలక్షేపం చేయుటమేనా జీవితమంటే? ఛీ! ఇదెంత దరి ద్రపు బ్రతుకు? ఒక్క క్షణంలో గాలిలో మాయమైపోయే ధూమము. ఎండమావులాంటిది. *నిన్నొక్కసారి స్మరించుకుంటే చాలు ఈ ఎండ మావు కరిగిపోయేందుకు!*

ఈ విధమైన దేహాత్మనా భావంలో చిక్కుకున్న దీనులను రక్షించుము. భోగపరాయణులను కటాక్షింపుము. నీ దగ్గరకు వచ్చే మార్గములో ఇవన్నియు అవరోధాలు. వాటిలో చిక్కుకున్న వారికి అవి ప్రాణసంకటాలు. వాటి నధిగమించిన వారికి తృణప్రాయములు.

అపుడిక జీవితం ఎంత హాయిగా ఉంటుందో చెప్పలేను. మనిషికి నిరంతరం తనను గురించిగాని, తన జీవితాన్ని గురించిన ఆలోచనలు, ఆరోగ్యాన్ని గురించిన బాధ్యతలుగాని, అసంతృప్తి గాని లేకపోవుట, సాధన ఎంతవరకు కొనసాగిందో అనే చింతన – ఇటువంటి బరువు బాధ్యతలు ఏమి లేనప్పుడు ఎంత హాయిగా ఉంటుందో చెప్పలేను. ఆ నిర్లిప్తత, తేలిక భావము ఏమని వర్ణింతును?

నాలో నీవే జీవించు చుంటివి. నీవు మాత్రమే జీవించు చుంటివి. *అందుకని ఇక నాకు నన్ను గురించిన బెడద ఏమాత్రమూ లేదు! ఏం జరగబోతుందో, ఏం జరగబోతోందో అనే బెడద అసలే లేదు.* నీవే లేకపోయినట్లయితే ఈ శరీరము – తద్వారా నిన్ను అభివ్యక్తపరచే ఈ తృణము ఒక్క తృటిలో కరిగిపోతాయి. నీవే లేకపోతే అన్య చరాచర వస్తుజాలముతోడి సంబంధము మృగ్యమైపోతుంది. నీవే లేకపోతే ఈ ఘటాన్ని చైతన్యవంతము చేయు చింతన క్రియారూపము దాల్చదు. అది శిథిలమై, రిక్తమై, అనభివ్యక్తంగా మిగిలిపోతుంది. నీవే లేకపోతే ఈ సృష్టిలోని సమస్త వస్తుజాలమును తట్టి లేపి, వికసింపజేసి, సజీవము గావించి, శక్తివంతము జేసే పరమప్రేమ నిద్రాణమై ఉంటుంది. నీవే లేకపోతే అంతా జడము, మృతము, చేతనారహితము.

మూలం: శ్రీమాత

వందేమాతరం

శ్రీఅరవిందులు తన మాతృభూమిని గాఢంగా ప్రేమించారు. ఈ దేశం గొప్పది కావాలని, ఔన్నత్యం పొందాలని, ప్రపంచంలో తన పవిత్రమైన పాత్రను సమర్థవంతంగా నిర్వహించాలని ఆశించారు. కుటిలత్వముతోను, స్వార్థపరత్వంతోను, మూఢనమ్మకాలతోను తన దేశం అధోగతి పాలైతే ఆయన సహించలేరు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే మనం నడుచుకొనెదము గాక. పరమసత్యమే మన ప్రమాణము. నిరంతరాభివృద్ధి, మానవజాతి పరివర్తనములే మనకు అభిలాషనీయములు.

అజ్ఞానము వలన, మూర్ఖత్వము, అసూయ దుర్బుద్ధి వలన ఈ దేశాన్ని మట్టిపాలు చేసే వారిని మనం లెక్కచేయము. ఎవరైతే ఆత్మసాన్నిధ్యమును పొందియుందురో అట్టి వారు మన కర్తవ్యమును గుర్తించి సహకరింతురు గాక.

*

మాతృదేశాభిమానము మన యోగానికి విరుద్ధము కాదు. దానికి దోహదమే. మాతృదేశం బలంగా ఉండాలనుకోవటం, అభివృద్ధి చెందాలనుకోవటం తన ధర్మాన్ని చక్కగా నిర్వర్తించి తన నైజాన్ని ఆవిష్కరించాలి అని అనుకోవటం న్యాయమైన భావములే. అయితే ఆరంభశూరత్వము పనికిరాదు. తగిన శిక్షణ లేకుండా తొందరపడి రంగంలోకి దుమకరాదు. అందుకని దాని కోసం తగిన సాధన చేయాలి – అనగా ప్రార్థించటం, తపించటం సత్యము యొక్క విజయం కోసం తహతహలాడటం అన మాట. *నీ దినచర్యలను శ్రద్ధగా నిర్వర్తించుకొంటూ ప్రశాంతంగా వేచి ఉండాలి. తొందర పనికిరాదు. సమయమాసన్నమైనప్పుడు నీ కర్తవ్యాన్ని తెలియజేసే సూచనలు వాటంతటవే వస్తాయి.*

*

నీ అహంకార వ్యక్తిత్వాన్ని త్యజించు. సంకుచితత్వాన్ని విడిచిపెట్టు. దైవం మీదనే భారం వేసి ఆయన కృపాకటాక్షాలను

సదా విశ్వసిస్తూ భారతమాత యొక్క సుపుత్రునిగా గర్వంగా నీ కర్తవ్యాన్ని నిర్వహించు. సంతోషంగా తృప్తిగా బ్రతుకు.

మూలం: శ్రీమాత
అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

మీకిది తెలుసా?

నేతాజీ సూబాష్‌చంద్ర బోస్ స్వీయచరిత్రలో నుంచి శ్రీఅరవిందులకు సంబంధించిన కొన్ని విషయాలు:

"నా కాలేజీ రోజుల్లో అరవింద ఘోష్ వంగదేశంలో సాటి లేని నాయకుడిగా వన్నెకెక్కాడు. 1910 నుంచి ఈ రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయినప్పటికి ఆయన కున్నంత పేరు మరెవ్వరికీ లేదు. రాజకీయాల కోసం మంచి పదవిని కూడ పోగొట్టుకున్న త్యాగమూర్తి. ఆనాటి కాంగ్రెస్ నాయకులు బ్రిటిష్ వారి కాలనీగా కొనసాగుతూనే స్వరాజ్యమిస్తే చాలని సిగ్గులేకుండా ప్రతిపాదించేరు. కాని అరవిందులు వామపక్షాన్ని అవలంబించి నిర్భయంగా పూర్ణస్వరాజ్యం కన్నా తక్కువ ఏదీ ఒప్పుకుండేది లేదని ఘంటారావంగా వక్కాణించారు. జైలులో నిర్బంధించినప్పుడు కూడ ఆయన ఏమాత్రం చలించ లేదు. నేను 1913 లో కలకత్తా వచ్చినప్పటికే శ్రీఅరవిందులు ఒక మహానాయకుడిగా పేరు పొందేరు. ఆయన పేరు మిన్ను ముట్టింది. ఆయనను గురించిన ఉదంతాలు ఎన్నో – చాలమట్టుకు నిజమైనవే – అందరూ కథలు కథలుగా చెప్పుకుంటూ వుండే వారు.

"వారి తాత్విక సిద్ధాంతాలు కూడ నాకు నచ్చినయ్యి. శంకరుని మిథ్యావాదము నాకు పక్కలో బల్లెమల్లే ఉండేది. ఎంత ప్రయత్నించినా నా జీవితంలో దానిని ఇముడ్చుకో లేకపోయాను. అలా అని దానిని ఒదిలేసుకుందామంటే మరో సిద్ధాంతమేమి కనపడదు. అప్పుడు శ్రీఅరవిందులు తారసపడ్డారు. ఆయన

ఆత్మకి మనిషికి, సృష్టికి సృష్టికర్తకి సామరస్యాన్ని సాధించేరు. అంతేకాక "యోగసమన్వయము" (Synthesis of Yoga) అనే పేరుతో సత్యాన్ని దర్శించే ఒక రాజమార్గాన్ని కూడ తీర్చిదిద్దారు."


సమాచార పత్రము

21 ఫిబ్రవరి 2001 నాడు శ్రీమాత 123 వ జన్మదినోత్సవము జరుపబడినది. శిష్యుల దర్శనార్థమై శ్రీమాతారవిందుల మందిరములు తెఱచి వుంచబడినది. ప్రాతః కాలమున సమాధి వద్ద, సాయంత్రము క్రీడాంగణములోను ధ్యానము జరిగినది. సాయంత్రము కవాతు ప్రదర్శన, బ్యాండు వాయిద్య సమ్మేళనములతో నివాళులు అర్పింపబడినవి. శ్రీమాత చిత్రముతో కూడిన సందేశము ఆనాడు పంచిపెట్టిరి

Self-surrender to the divine and infinite
Mother, however difficult, remains our only
effective means and our sole abiding refuge

ఎంత కష్టమైనప్పటికి దివ్యము, అనంతము అయిన శ్రీమాతకు ఆత్మ సమర్పణము గావించుకొనుటయే మన ఏకైక మార్గము శరణాగతి .

శ్రీఅరవిందుల అవశేషములు మధ్యప్రదేశ్ భోపాల్‌లో 16 డిసెంబరు 2000 నాడు ప్రతిష్ఠించబడినవి. నైరోబీ (కెన్యా) లో "మృత్యువు" అనే విషయముపై శ్రీఅరవిందుల ప్రవచనములతో గూడిన ఒక గోష్ఠి జరుపబడినది. 30 నవంబరు 2000 నాడు బిజనోర్ (యు.పి) లో "భవిష్య విద్య" అను విషయముపై ఒక గోష్ఠి జరుపబడినది. 300 మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు



అఖిల

అఖిల భారత పత్రిక

మే 2001

ప్రమాదాలు - ప్రళయాలు

ప్రమాదాలు – ప్రళయాలు

(శ్రీమాత ప్రవచనములు)

విభాగము I: ప్రళయాలు

విభాగము II: ప్రమాదాలు



రవీంద్రనాథ్ టాగూరుతో శ్రీమాత
(జపానులో పర్యటిస్తున్న రవీంద్రులు శ్రీమాతను కలిసినప్పటి చిత్రం)

విభాగము I:

ప్రకృతి గ్రుడ్డిదా? దానికి దయాదాక్షిణ్యాలు లేవా?

"ప్రకృతి వైపరీత్యాలు ఎందుకని జరుగుతాయి? వాటిని ఆప లేమా?" అనే విషయమును గురించి విచారించవలసి ఉన్నది. నువ్వు రోడ్డుమీద నడుస్తున్నప్పుడు నీ కాలిక్రింద పడి ఎన్ని పురుగులు చచ్చిపోవటల్లేదు? నువ్వు వాటిని గురించి ఎప్పుడైనా ఆలోచించావా? నువ్వు నీ పని మీద నడిచిపోతున్నావు అంతే. ప్రకృతి కూడ అంతే అనుకో. అది కూడ తన కర్తవ్యాన్ని నిర్వహించుకుంటూ పోతుంది అంతే. అప్పుడు సంభవించే బీభత్సము, జననష్టము – నీకు కీటకాలను గురించిన విషయము ఎలా ముఖ్యము కాదో అదే న్యాయం ప్రకృతికి కూడ వర్తిస్తుంది. నీ చైతన్యము నీకు మాత్రమే సంబంధించినది. ప్రకృతి దృష్టి ఇంతకంటె అతివిశాలమైనది. నీవు నీ చేతనను విశాలపరచుకొన్నట్లయితే ఈ న్యాయము ఏమిటో నీకు కూడ తెలుస్తుంది. – సంపాదకుడు

ప్రకృతి చైతన్యము అతివిశాలము

ప్రకృతి జడము గాదు. ఎద్దుమొద్దు స్వరూపము గాదు. మనిషిలాంటి జీవి కాకపోవచ్చు, కాని అది కూడ ఒక శక్తే. దానికి కూడ తెలివి ఉన్నది. చైతన్యమున్నది. దానికీ ఓ లక్ష్యమంటూ ఉన్నది. ఆ లక్ష్యాన్ని ఎలా సాధించాలో దానికి తెలుసు. అయితే దాని పథకం మనిషికి అర్థం కాదు. అవును మరి, మనిషి కంటె ఎన్నో రెట్లు పెద్దదైన ప్రకృతి చైతన్యము అతనికెట్లా అర్థమవుతుంది? ప్రకృతితో పోలిస్తే అతని చైతన్యమెంత? ప్రకృతి యొక్క విశాలచైతన్యములోని ఒక చిన్న శకలాన్ని మాత్రమే మనిషి చూస్తాడు. అందుకని అది తన సంకుచిత దృష్టికి అర్థమయ్యే విషయము కాదు.

ప్రకృతి మనిషిలాంటి వ్యక్తి కాదు. కానేకాదు. ప్రకృతి అనగా మనలాంటి ఒక అవతారమే అని, కేవలం పరిమాణంలో

పెద్దది అయినా మన మాదిరే ప్రవర్తిస్తుంది అని అనుకోవటం కద్దు. కాని అది నిజం కాదు. అది కూడ ఓ చేతనాభూమిక. దానికి కూడా బుద్ధి ఉన్నది. మనిషి తన ఇంద్రియాల ననుసరించి ప్రవర్తిస్తాడు. ప్రకృతి తన ధర్మాన్ననుసరించి ప్రవర్తిస్తుంది. అందులో ఎటువంటి తికమకగాని, అస్పష్టతగాని ఉండదు. చేతనాత్మకంగా, ప్రయోజనాత్మకంగానే ప్రవర్తిస్తుంది. దానికీ అత్యంత శక్తిసామర్థ్యాలు ఉన్నాయి.

ప్రకృతి క్రూరమైనది కాదు

ప్రకృతి శక్తులు మనుమలనేమాత్రం లెక్కచేయకుండా సర్వనాశనం చేస్తాయని ప్రతీతి. మనిషికీ ప్రకృతికీ హస్తిమశకాంతరమంత వ్యత్యాసమున్నది. అయినప్పటికి మనిషి ప్రకృతి విన్యాసములను గురించి విచారించి వాటి న్యాయాన్యాయాలను అంచనా వేస్తాడు. ఉదా: భూకంపాలను గురించే విచారించెదము. కొన్ని లంకలు సముద్రంలో మునిగిపోతాయి. లక్షలాది ప్రజలు చనిపోతారు. "ఛీ! ఈ ప్రకృతి ఎంత క్రూరమైనది" అని జనం వాపోతారు. మానవుని దృష్టిలో అది ఓ రాక్షసి. కాని ఒక్క నిమిసముండు. అది ఏం చేసింది? కాస్త హడావిడి చేసింది. మరి నువ్వు శరీరవ్యాయామము చేసినప్పుడుగాని, పరిగెత్తినప్పుడుగాని మొహమంతా ఎర్రగా కంది పోయి రొప్పుతూ ఊపిరి తీసుకుంటావు కదా! భూగోళం విషయంలో కూడ అంతే. అది కూడ ఊపిరితీసుకుంటోంది. అయితే దాని ఎత్తు వేరు. అందుకని మానవదృష్టికి అది చాల బ్రహ్మాండంగా కనబడుతుంది. నిజానికి జరిగిందల్లా ఇదీ – భూదేవి ఎక్కడో ఓ మూల కాస్త చిందులు తొక్కింది. అదీ కేవలం ఈ భూలోకంలో మాత్రమే. ఈ విశాల విశ్వంతో పోలిస్తే ఈ భూమి కూడ చాల చిన్నదే. ఆకాశంలో ఓ మూల ఒక చిన్న అణువు అంతే. మనం బ్రహ్మాండం గురించిగాని, లోకాల జననమరణాల గురించిగాని చెప్పుకోవటం లేదు. అవి ఇంకా పెద్దవిషయాలు. ఆ లెక్కలో ఎక్కడో ఓ మూల ఓ గోళం కంపించటం అనేది స్వల్పాతిస్వల్ప విషయము. అది లెక్కలోది కాదు.

ఈ విషయాన్ని గురించి తెలుసుకావాల్నంటే నువ్వు నీ "లక్ష్మణరేఖ"ని దాటి నీ చైతన్యాన్ని విశాలపరచుకోవాలి.

ఒకాయన దీనికో మార్గాన్ని కనిపెట్టాడు. ఆరుబయట వెల్లకిలా పడుకొని ఆకాశంవంక చూస్తూ నక్షత్రాలతో ఏకమైపోయినట్లు ఊహించుకొనేవాడు. అప్పుడు ఆకాశమంత పెద్దగా ఎదిగి ఆ నక్షత్రాలతో సామ్యం చెందినప్పుడు ఇక ఈ భూమి ఎక్కడిది? ఈ ప్రపంచము, అందులోని మనుషులు చీమలు మాత్రమే. కాని అది కూడ సృష్టియొక్క పూర్ణస్వరూపం కాదు. ఎందుకంటే ఈ ఆకాశం, నక్షత్రాలు అన్నీ కలిపినా కూడా విశాల విశ్వంలో ఓ మూలకు కూడ రావు. నువ్వా నక్షత్రాలతో ఏకమైనప్పుడు ఇక ఈ భూమి, సముద్రాలు, హిమాలయా పర్వతాలు – ఇవేమీ లెక్కలోకి రావు. నీ కంటికి కనపడవు.

ఈ రెండూ మంచి పద్ధతులే. వాటిని పోల్చి చూసుకో. నువ్వు రోడ్డు మీద నడుస్తూ ఉంటావనుకో. అక్కడో చీమల బారుంటుంది. చూడకుండా దాని మీద కాలు వేస్తావు. కొన్ని వందల చీమలు నలిగిపోతాయి. కాని నువ్వు దాన్ని గుర్తిస్తావా – గుర్తించవు. అది నీ లెక్కలోకి రాదు. కాని నువ్వే ఒక చీమవైనట్లయితే "వీడి దుంపతెగ వీడొక రాక్షసుడు. చాలా క్రూరమైన వాడు" అని అనుకుంటావు కదూ! అదే విధంగా ఆ చీమలకు నువ్వు ఎలాంటి వాడవో, నీకూ్కడా అలాంటి వాళ్లు ఉంటారనుకో. వాళ్ళు ఓ కాలుమోపగానే కొన్ని వేలమంది మనుషులు చస్తారు. కాని వాళ్ళకీ విషయాన్ని గురించి ఏమాత్రము తెలియదు. వాళ్ళు కావాలని చేయలేదు కదా. వాళ్ల దారిన వాళ్లు పోతున్నారు అంతే.

భయములను, ఆపదలను, విపత్తులను ప్రతిఘటించు కవచ సంరక్షణతో జీవయాత్ర నడుపుటకు రెండే రెండు విషయము లవసరము. – నీకు శ్రీమాతయందు అచంచలమైన విశ్వాసము, ఆమె యనుగ్రహము.

ప్రళయాలు ఎందుకు సంభవిస్తాయి?

ఈ సృష్టిగతిలో దేవుడు తన కార్యక్రమాన్ని నిర్వహించుకుంటూ పోతాడు. తన చేతనా ప్రవాహాన్ని పంపించి సృష్టిని ప్రేరేపిస్తాడు. ప్రతి యొక్క వస్తువు దాని దాని స్వభావము ప్రకారము స్పందిస్తుంది. దైవశక్తికి అనుకూలంగా ప్రవర్తించినట్లయితే మంచి పర్యవసానమే కలుగుతుంది. అటులగాక దానితో సహకరించక, ఆ శక్తిని ఎదిరించనట్లయితే దుష్పరిణామాలు తప్పవు. ఈ విషయం తెలియక దైవము కావాలని నిన్ను కష్ట పెడుతున్నాడు అని అనుకోవటం మూర్ఖత్వము. కష్టాలు మానవులలోని దోషముల వలననే కలుగుతాయి. — సంపాదకుడు

ప్రశ్న: మధుమయీ, దైవాభివ్యక్తి ఎప్పుడూ కూడా ప్రశాంతంగా, సుఖంగా, సంతోషంగా జరుగుతుందేగాని పరిస్థితులను తల్లక్రిందులు చేయదు అని శ్రీఅరవిందుల 'యోగ మూలములు' అనే పుస్తకములో వ్రాశారు.

దైవము నీకు కీడెంచడు

అవును. నీకీ మాత్రము తెలియదా? తెలిసే ఉండాలి. ఎక్కడేం జరిగినా, ఏ విపత్తు సంభవించినా వాటన్నిటికి దేవుడే కారణమని నమ్మేవాళ్ళు కొంతమంది ఉంటారు. మరికొంత మంది వాళ్లని కాస్త దివ్యశక్తి ఆవహించగానే దాన్ని తట్టుకోలేక "బాబోయ్ దేవుడు నన్ను గాబరా పెడుతున్నాడు" అని అనుకుంటారు. కాని అది నిజం కాదు. నీ గాబరాకు కారణం దేవుడు కాదు. నీ లోని లోపాలవలన అలా జరిగి ఉండవచ్చు. లేదా దుష్టశక్తుల ప్రభావము అయినా కావచ్చు. దైవము నిన్నెప్పుడూ ఏడిపించడు. నీలో ఏ దోషమూ లేకపోతే అలా జరగదు. ఒకవేళ జరిగినా దానికి దేవుడు బాధ్యుడు కాడు. ఒకవేళ శ్రీమాత నిన్ను పరీక్షిస్తుందనుకుంటావేమో – అదీ కాదు. బాహ్యాపరిస్థితులే అందుకు కారణము. (మదర్ నవ్వు) నువ్వు ఈ పాపం దైవానికి అంటకట్టాలనుకుంటున్నావు కాదూ? అయ్యో పాపం! నీ పాచిక పారలేదు.

పైనుంచి వచ్చే శక్తిని ఎదిరించినప్పుడే ఇటువంటి గొడవ జరుగుతూ ఉంటుంది. ఏ అవరోధాలు లేకపోతే ఎటువంటి ఆప దలు రావు. కాబట్టి ఈ అవరోధాలే భూకంపాలకి, తుఫానులకి, సముద్రాల రౌద్రానికి, భూభాగాలు మునిగిపోవటానికి, అగ్నిపర్వ తాలు పొంగటానికి ఇత్యాది ఉపద్రవాలన్నిటికి కారణాలు.

*

జడత్వమే ప్రళయాలకు కారణము

సమస్తమైన సృష్టిని – పదార్థాన్ని, వస్తువులను, జీవులను ఒక విధమైన జడత్వము ఆవహించి వుంటుంది. ఈ జడత్వమే దేవుడు పైనుంచి పంపిన శక్తి నెదిరిస్తుంది. అందుకని ఎట్టి విఘ్నములు లేకుండా సాఫీగా జరుగవలసిన కార్యము చెడిపోతుంది. అంతేకదా మరి. అడుగడుగుకి అడ్డుతగుల్తూ ఉంటే పని చెడిపోయి గందరగోళం కాక ఏమౌతుంది? కాని నిజానికి అలా జరగవలసిన అవసరం లేదు. ఈ జడత్వమే, ఈ అవరోధమే దీనికి కారణం. *నిజానికి దైవేచ్ఛ సమర్థవంతమైనదే. తత్సంబంధితమైన అంగముల నన్నింటిని సామరస్యపరచి చక్కదిద్దే శక్తి దాని కున్నది. ప్రతి వస్తువును యథోచితంగా తీర్చిదిద్ది కార్యమును అద్భుతంగా నిర్వహించే శక్తి దాని కున్నది.* నీకే గనక సూక్ష్మదృష్టి వున్నట్లయితే ఆ దైవేచ్ఛ వెలుగును ఎలా వెదజల్లుతూ, కార్యమును ఎంత అద్భుతంగా నిర్వహించగలదో అర్థమౌతుంది. కాని అది క్రిందికి దిగిరాగానే ఈ జడత్వము దానికి ఎదురు తిరుగుతుందే! ఆ శక్తిని నిరోధిస్తుందే! కాబట్టి ఈ గందరగోళానికి బాధ్యతంతా దైవానిదే అనుకోవటం ఎంత మూర్ఖత్వం? ఇక్కడ నెలకొనియున్న జడత్వము, దౌష్ట్యము – ఇవే అందుకు కారణాలు. దేవుడే కావాలని ఈ ప్రళయాలను సృష్టిస్తున్నాడు అనుకోటం చాలా పెద్ద పొరపాటు. ఇలా జరుగుతుందని ఆయనకు తెలియనే తెలియదు. ప్రకృతి యొక్క నిరోధమే దానికి హేతువు.

అప్పుడు ఓ పెద్ద తుఫాను వచ్చింది నీకు జ్ఞాపకమున్నదా? కిటికీలు వేద్దామని నేను శ్రీఅరవిందుల గదిలోకి వెళ్ళాను. తలుపులు తెరువగానే ఎదురుగుండా ఆయన చాలా ప్రశాంతంగా

కూర్చుని ఉన్నారు. బల్ల దగ్గిర వ్రాసుకుంటున్నారు. ఆ గదిలో గాఢమైన ప్రశాంతత నెలకొని ఉన్నది. బైట అంత బీభత్సం జరుగుతున్నప్పటికి లోపలంతా నిశ్శబ్దం. ఆశ్చర్యమేమిటంటే కిటికీ తలుపులన్నీ తెరచే ఉన్నాయి. కాని లోపలికి ఏమాత్రం జల్లు రాలేదు.

యుద్ధాలు అనివార్యమా?

సాధనా మార్గంలో అంతరంగికంగా శత్రువులు ఎదురై నీ పురోగమనాన్ని నిరోధించటం మామూలే. అప్పుడు నీవా శక్తులతో పోరాడవలసి వస్తుంది. మొత్తం భూగోళం విషయంలో కూడ అంతే. ప్రపంచం అభివృద్ధి చెందుతూ ఉంటే దానిని నిరోధించే శక్తులు కొన్ని ఉంటాయి. ప్రకృతి వాటిని ఎదుర్కొని తొలగించవలసి ఉంటుంది. యుద్ధమంటే అదే.

— సంపాదకుడు

ప్రశ్న: మనుషులు వాళ్ళలో వాళ్ళే పోట్లాడుకుంటారు – ఎందుకని?

అలా చేస్తేగాని వారు అభివృద్ధి చెందలేరేమో? అభివృద్ధి అనేది సవ్యంగా సరళరేఖలో జరుగక పోవచ్చు. యోగం చేసే వారికి ఈ విషయం బాగా తెలుసు. సాధనా మార్గంలో నిన్ను ముందరకు పోనివ్వకుండా ఎదిరించే శక్తులు నీ అంతఃశత్రువులే. మనిషి విషయంలోనే ఇంతమంది శత్రువులను జయించాల్సి వస్తే, భూలోకం యావత్తూ పరిణమించాల్నంటే దానిని నిరోధించే శక్తులు ఏ ఎత్తులో ఉంటాయో ఊహించుకో. శత్రువు నీ దారి కడ్డుగా నిల్చుని ఉంటాడు. అతన్ని తొలగించాల్నంటే నీవు యుద్ధం చేయాల్సి ఉంటుంది. ఓ మూల ఎక్కడో ముక్కు మూసుకొని జపం చేయుటం వల్ల ప్రపంచ పరిణామం జరిగిపోతుందనుకోవటం మూర్ఖత్వం.

ప్రశ్న: భూలోక పరిణామానికి యుద్ధాలు అనివార్యమా?

యుద్ధాలవలన ప్రయోజనములు

మానవ చరిత్రలో ఒక దశలో యుద్ధాలు అనివార్యమే. మానవుని పూర్వ దశలో ఆదిమజాతుల జీవితమంతా పరస్పరకలహాల తోటే సరిపోయేది. నేటి కాలం వరకు కూడ మానవ చరిత్రలో ముఖ్యమైన ఘట్టాలు యుద్ధాలే గదా. మానవజీవితమంటే బ్రతుకు కోసం కీచులాట – నువ్వా నేనా అనే అహంకారాల ఎత్తుగడలు. ఈ విధమైన పరిస్థితులుంటే యుద్ధాలెందుకు రావు? తప్పకుండా వస్తాయి. మానవులు శాంతి కోసం ఎంత పాటుబడ్డా యుద్ధాలు రావనే నమ్మకం మట్టుకు లేదు. నేటి ప్రపంచంలో చాలాచోట్ల బహిరంగంగా గాని, రహస్యంగా గాని యుద్ధ సన్నాహాలు జరుగుతూ ఉండటం మనం చూస్తూనే ఉన్నాము. అయితే భూలోకంలో జరిగే ఈ సంఘటనలన్నీ అభివృద్ధికే దారి తీస్తాయి అనే విషయాన్ని మనం గుర్తించాలి. ఉదా: యుద్ధాల వలన మనుష్యుల్లో ధైర్యస్థైర్యాలు పెరుగుతాయి. భయం పోతుంది. కొన్ని పాతసంస్కారాలు వాటి కాలం తీరిపోయినా కూడ వదిలిపోకుండా మనని అంటిపెట్టుకునే ఉంటాయి. యుద్ధాల వలన అటువంటివన్నీ నశించిపోయి మళ్ళీ కొత్త అలవాట్లు, నాగరికత, సంస్కారాలు వచ్చేందుకు అవకాశం ఏర్పడుతుంది. అలనాడు కురుక్షేత్రంలోసంభవించినట్లు దుర్మార్గులు, క్రూరమైన రాజులు పోయి, మళ్లీ న్యాయం, ధర్మం, వెల్లివిరియుట కూడ యుద్ధాల వలన కలిగే ముఖ్యమైన ప్రయోజనము. మనుష్యులు తామసిక గుణం వదిలిపోయి అప్రమత్తంగా ఉంటారు. వారిలో నిక్షిప్తంగా వున్న ధైర్యసాహసాలు బహిర్గతమౌతాయి. ఆ తరువాత యుద్ధం వలన జరిగిన భీభత్సాలను చూసైనా కాస్త బుద్ధి తెచ్చుకొని, ఇంతటి హింసాకాండ, సర్వనాశనం లేకుండా అభివృద్ధి సాధించేందు కోసం అన్వేషించవచ్చు. భూలోక పరిణామానికి అనవసరమైనదంతా మాయమైపోవటం పరిణామ ధర్మం.

ప్రశ్న: "కాలదోషం పట్టినా కూడా మాయమైపోకుండా మొండిగా మిగిలిపోయే పాతకాలపు శిథిలాలను వదిలించేందుకే యుద్ధాలు వస్తాయి" అని మీరు వ్రాసిరి కదా. మరి ఇప్పుడు అతిమానస

శక్తి (Supermind) భూమ్మీదికి దిగివచ్చింది కనుక ఇక మీదట యుద్ధాలు లేకుండానే ప్రపంచం అభివృద్ధి చెందుతుందా?

అందుకు వివిధ దేశాలవారు ఆ నూతనశక్తులను బహుముఖంగా గ్రహించగలగాలి. వారు వెంటనే ప్రభావితులైతే వారి ఆలోచనా సరళిలో మార్పు రావచ్చు. యుద్ధాలు తప్పిపోనూ వచ్చు. తాత్కా లికంగా ఇలా జరిగినప్పటికి ఇక ముందర యుద్ధాలు రావనే నమ్మకం లేదు. చేతన దిగజారిపోయినప్పుడు యుద్ధాలు ఎప్పు డెప్పుడు విరుచుకుపడతాయో అనే భయం తప్పదు.

కాని అంతిమ నిర్ణయం భగవంతునిదే. ఆయనను నీ వైపు పెట్టుకొని నీ సర్వశక్తిసామర్థ్యాలను ఉపయోగించి పరిగెత్తు కుంటూ ముందుకు సాగిపోవాలి. దేవుని మీదనే భారం వేసి నిర్భయంగా భవిష్యత్తులోకి పురోగమించాలి.

లయము చెందుట

నశించునది బాహ్యారూపమే

కొన్ని వస్తువులు నశించి పోతాయంటారు. దీని అర్థమేమిటో నీ అజ్ఞానంలోంచి బయట పడితేగాని తెలియదు. లయమయ్యేది రూపమే గాని అంతః స్వరూపము గాదు. నిజానికి సృష్టింపబడిన ప్రతి వస్తువు కాలక్రమేణా నశించిపోవటం తథ్యం. ఆఖరికి అసుర శక్తులు (adverse forces) కూడ, పరిణతి చెంది దివ్యరూపము లను పొందనైనా పొందుతాయి, లేదా నశించిపోతాయి అనే సాంప్రదాయం చాలా దేశాలలో ఉన్నది. *అయితే నశించి పోవ టమంటే ఏమిటి? రూపం మాత్రమే నశించిపోతుంది. దానిని సృష్టించిన 'తత్త్వము' ఎక్కడికి పోతుంది?* సృష్టికి ఆదియైన తత్త్వము లయమైపోవటం అసంభవము. అదే కదా అసలు తొలి వస్తువు. మూలతత్త్వము తనకు తానే రూపాన్ని ధరించాలని కోరుకున్నది. విషయగతమై విశ్వమైనది. అటువంటి మూల

'తత్త్వము' ఎలా నశించిపోతుంది. అనంతమైన ఆ సర్వేశ్వరుడు ఏ విధమైన పరిమితులుగాని, ఆద్యంతములుగాని లేనివాడు. ఎక్కడ చూసినా తనే. తను తప్ప అన్యమంటూ లేదు. అందుకని 'తత్' (అది) నశించిపోయే ప్రసక్తే లేదు.

కాని ప్రపంచము పరిణామశీలి కదా. పరిణామక్రమంలో *మరో మెట్టు ఎక్కినప్పుడు మన కిప్పుడున్న ఈ మాయాజాల మంతా – ఈ అసత్యలోకమంతా కరిగిపోతుంది. అంతేగాని నశించిపోదు.* నశిస్తే ఎక్కడికి పోతుంది? ఒక్క విషయాన్ని మట్టుకు మనం గుర్తుపెట్టుకోవాలి. నశించేది బాహ్యరూపం మాత్రమే. అది ఓ మధ్యంతర చేతనాస్థాయి అయినా కావచ్చు; లేక భౌతికరూపమైనా కావచ్చు. కాని రూపరహితమైన మూల పదార్థము అవినాశి.

విభాగము II:

అప్రమత్తంగా ఉండాలి

ప్రమాదమనగా తలవని తలంపుగా మనకు సంభవించే దుర్ఘటన. నేటి యాంత్రిక జీవితంలో గండాలు తప్పవు. కాని వాటి నుంచి తప్పించుకుండే ఉపాయమొకటున్నది. అది నీ చేతనకు సంబంధించినది. ఆత్మచైతన్యము నీలో ధగధగా వెలిగిపోతూ ఉంటే ఎంతటి ఘోరమైన ప్రమాదం సంభవించినా నీకేం కాదు. ఆరోగ్యం విషయంలో కూడ అంతే. నీవు రోగాల వాతావరణంలోకి ప్రవేశించినా కూడా, చేతనాపరంగా నీవు నిష్ఠాగరిష్ఠుడవై ఉన్నట్లయితే నీలోకి ఏ జబ్బూ ప్రవేశించలేదు.

– సంపాదకుడు

చైతన్యాన్ని పదునుగా ఉంచుకోవాలి

కాలుజారి పడిపోయినా కూడ ప్రమాదాన్ని తప్పించుకోవచ్చు. జారిన తరువాత, నేలమీద పడిపోవుటకు ముందర ఒక్క క్షణం వ్యవధి ఉంటుంది. అప్పుడు నీకా అవకాశం

దొరుకుతుంది. *ఆ క్షణంలో నువ్వు కనుక గట్టిగా సంకల్పించి నట్లయితే ఏదో ఓ చిన్న దెబ్బతో ప్రమాదాన్ని తప్పించుకోవచ్చు. అలా కాకపోయిన యెడల తీవ్రమైన గాయాలు తప్పవు. నీ చేతనా నేత్రము తెరచి ఉంచుకోవటం చాల ముఖ్యం. చైత్య పురుష సంపర్కము నిరంతరంగా సజీవమై ఉండాలి.* అంతే గాని ప్రమాదము సంఘటిల్లినపుడు దాని కోసం తడుముకోటం తగదు. కాలుజారిన తరువాత, కిందపడిపోక ముందర – అప్ప టికే చైత్యపురుషానుభూతి గంభీరంగా ఉన్నట్లయితే ఇక నీకే ప్రమాదమూ వాటిల్లదు. ఏమాత్రం హాని జరుగదు. కానీ నీ మనస్సు దాని అలవాటు ప్రకారము "అయ్యో పడిపోయానే, ఏం దారి" అని అనుకుంటే ఇక ఇంతే సంగతులు. ఎందుకంటే ఒక్క క్షణమే – నిమిషం కూడ కాదు. ఒక్క క్షణం వ్యవధి ఉంటుంది అంతే. *ఆ క్షణంలోనే నీ ప్రార్థన మెరుపులా మెరవాలి. దీన్నిబట్టి ఓ విషయం స్పష్టంగా తెలుస్తోంది కదూ. నువ్వు చాలా మెలకు వగా ఉండాలి.* ఎందుకంటే నీకో క్షణం మాత్రమే వ్యవధి ఉంటుంది. ఆ క్షణం లోనే నువ్వు ఆ ప్రమాదాన్ని సీరియస్ కాకుండా తప్పించుకోగలవు.

అదే విధంగా జబ్బులను నీలోకి ప్రవేశించకుండా అక్క డికక్కడే నిలివివేయవచ్చు. ఇటువంటి సందర్భాలలో నీకీ అవ కాశం ఎప్పుడూ ఉంటుంది. ఒక్క క్షణం వ్యవధి ఉంటుంది. ఆ క్షణం గడిచిపోయిందా – ఇక నువ్వేం చేయలేవు. ఆ ప్రమాదాన్ని అనుభవించాల్సిందే.

ప్రశ్న: ఆ ప్రక్రియను తరువాత సావకాశంగా చేసేందుకు వీలు లేదా?

వీల్లేదు. ఆ క్షణం గడిచిపోతే తరువాత మరో క్షణం వస్తుంది కదా. అప్పటికే అంతా అయిపోయింది! *అప్పటికే నీవు నేలమీద పడి పోయావు. గాయపడ్డావు కూడ. అయినప్పటికి ఇంకా పరిస్థి తిని బాగుచేసేందుకు నీకు మరో అవకాశమున్నది.* నువ్వు పరి

స్థితిని మార్చి మెరుగుపరచగలవు. లేకపోతే ఇంకా కనా కష్టం అయిపోతుంది.

తీవ్రతను తగ్గించవచ్చు

సరే, అయిపోయిందేదో అయిపోయింది. నువ్వు నేలమీద పడ్డావు. దెబ్బ తగిలింది. *కాని అంతటితో ఇంకా అంతా మించిపోలేదులే. పరిస్థితిని బాగు చేసేందుకు ఇంకా ఛాన్స్ ఉన్నది.* పడిపోవటం వలన తీవ్రమైన గాయాలైనా తగలవచ్చు, లేదా కొద్దిపాటి దెబ్బలతో తప్పిపోవచ్చు. నీకు తెలుసునో లేదో కొంతమంది మనుషుల సంగతి – వాళ్ళబ్రతుకెప్పుడూ దినదిన గండమే. ఎప్పుడూ ప్రమాదాల్లో ఇరుక్కుంటూనే ఉంటారు. ప్రమాదానికి ఏమాత్రం అవకాశమున్నా వారు దానికి తప్పకుండా గురి అవుతారు. కొద్దిలో తేలిపోయేది కాదు. ఎప్పుడూ సీరియస్ ఏక్సిడెంటే. “అయ్యో పాపం వాడు ఎంత దురదృష్టవంతుడు” అని అందరూ అనుకోవచ్చుకాని అసలు విషయం అది కాదు. అతని చేతనా పరిస్థితే అసలైన కారణము.

ఇంకా కావాల్నంటే ఇటువంటి ఉదాహరణలు బోలెడన్ని నేనివ్వగలను. అటువంటి వాళ్ళు ఎంతోమందిని గురించి నాకు తెలుసు. కాని వాళ్ళను గురించి చెప్పటం నాకిష్టం లేదు. ఇక్కడ ఇటువంటి సంఘటనలు ఎన్నో నేను రోజూ చూస్తూనే ఉంటాను. మృత్యువుకోరల్లో పడి తప్పించుకున్న వాళ్లు కొందరయితే, మరి కొంతమందికి చిన్నపొరపాటు జరిగినా అది శ్రుతిమించి ప్రాణసంకటమే అవుతుంది.

కాని ఇది బుద్ధితో ఆలోచించి సాధించే విషయం కాదు. వారు సదా ఆలోచనాపరులే కావచ్చును. కాని ఇక్కడ ఆలోచనది కాదు పెత్తనం – చేతన – పైన చెప్పిన వాటిల్లో రెండవది. సరిగ్గా ఆ క్షణంలో వాళ్లు సవ్యంగా పరిస్పందించాలి అంతే. ఇటువంటి ఆశ్చర్యకరమైన సంఘటనలెన్నో నాకు తెలుసు.

చేతనా స్థాయే ముఖ్యమే

ఇది మనుషుల చేతనాస్థాయిమీద ఆధారపడి ఉంటుంది. కొంతమంది చేతన చాల జాగృతమై ఉంటుంది. వాళ్ళు సదా అప్ర

మత్తంగానే ఉంటారు. *ఒక్క క్షణంకూడ ఏమరుపాటు లేకుండా ఉంటారు. అవసరమైనప్పుడు తక్షణమే సహాయాన్ని అర్థిస్తారు లేదా దివ్యశక్తిని ఎలుగెత్తి పిలుస్తారు. సరైన క్షణంలో క్రియా శీలురై ప్రమాదంనుంచి తప్పించుకుంటారు.* వాళ్ళకేం కాదు. ఎంత ఉదృతమైన ఆపద సంభవించినప్పటికి వాళ్లు మట్టుకు చెక్కుచెదరకుండా బైటపడగలరు. మరి కొంతమంది ఘనులుం టారు. ఏమాత్రం హెచ్చు తగ్గు అయినప్పటికి వారి విషయంలో అది తీవ్రమైన ప్రమాదంగానే పరిణమిస్తుంది. గాయాలే తగల వచ్చు, లేదా ఎముకలుకూడా విరగవచ్చు. ఒక విధమైన భయం, వణుకు, ఆందోళన వాళ్ల మొహంలో సదా తాండవిస్తూనే ఉంటాయి. నిజానికి అంత పెద్ద ప్రమాదమేమీ జరుగక పోవచ్చు. కాని వారి విషయంలో మట్టుకు ఆ మాత్రం కూడ తీవ్రపరిణామాలకే దారితీస్తుంది. ఓ చిన్నబెణుకుతో పోయే దానికి ఎముకలే విరుగుతాయి. దీనికి కారణమే లేదు. వారికి ఎముకలు విరిగేందుకు కారణమే లేదు.

మరి కొంతమంది కథ వేరే విధంగా ఉంటుంది. వాళ్లు ఒక పెద్ద నిచ్చెన ఎక్కుతారు. నిచ్చెన విరగటంవల్ల క్రింద పడి పోతారు. కాని వాళ్లకేం కాదు. దుమ్ము దులుపుకొని లేచిపో తారు. అంతే. ఇంత పెద్ద ప్రమాదంలోంచి వాళ్లు ఎలా బయట పడగలిగారు? ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం. కాని వాళ్ల విషయంలో ఇది మామూలే. ఎంత ఎత్తుమీద నుంచి పడిపో యినాకూడా వాళ్లు నేలమీద వెల్లకిలా పడివుంటారు అంతే. వాళ్లకేం కాదు. నేను చెప్పినదంతా అక్షరాలా నిజం. కావాల్నంటే వాళ్ళ పేర్లుకూడ చెప్పగలను.

నిరంతర జాగృతి

ఇది దేనిమీద ఆధారపడి ఉంటుంది? పైన చెప్పిన వాటిలో రెండో విధానం. అది మనసుతో చేసే ప్రక్రియ కాదు. మనిషియొక్క ఏటిట్యూడ్ (attitude) మీద ఆధారపడి ఉంటుంది. *చేతనా పరిస్పందనమీద ఆధారపడి ఉంటుంది. నిన్ను చాలా బాగా రక్షించగలిగేది అదొక్కటే.* అది (చేతన) ఎప్పుడూ నిద్ర

పోదు. అచేతనలోకి క్రుంగిపోదు. ప్రమాదం ముందరే చెప్పిరాదు కదా – ఫలానా టైముకు జాగ్రత్తగా ఉందాములే అని అనుకుం డేందుకు వీలులేదు. *నిరంతరం మేలుకొని ఉండవలసిందే.*

ఇంకా ఆశ్చర్యకరమైన విషయం మరొకటి నాకు తెలుసు. ఒక వ్యక్తి ఎప్పుడో చనిపోవలసింది. కాని చావలేదు. కారణం ఇది – అతని చేతన వెంటనే తగిన చర్య తీసుకుంది. అతను విషం తీసుకున్నాడు. ఒక బిళ్ళ బదులు 12 మందుబిళ్ళలు మింగేడు. అది విషం. అతని గుండె ఆగిపోవలసిందే. ఇది చాలా ఏళ్ళ క్రిందట జరిగిన సంఘటన. కాని అతను ఇంకా బతికే ఉన్నాడు. అతను తగిన విధంగా స్పందించాడు. అంతే.

ఇటువంటివన్నీ చెప్పుకుంటూపోతే వాటిని మీరు మిర కిల్స్ అంటారు. కాని అవి మిరకిల్స్ కావు. జాగృతమైన చైత న్యానికి సంబంధించినవి. అంతే!

దైవానుగ్రహం రక్షిస్తుంది

"దైవానుగ్రహం (Mother's grace) నిరంతరం నిన్నంటిపెట్టు కొని ఉండి నిన్నెంత అద్భుతంగా రక్షిస్తుందో చెప్పలేను. ఘోరప్రమాదాలనుండి రక్షించబడ్డట్లుగా నాకు చాలామంది ఉత్తరాలు వ్రాస్తూ ఉంటారు. కాని ఏ ఆపదా లేకుండా ఒక ప్రయాణంకాని, మరి ఏ ఇతర కార్యంకాని నిర్విఘ్నంగా కొన సాగినప్పుడు దైవానుగ్రహం లేదనా నీ ఉద్దేశ్యం? నిజానికి దైవము నిన్ను మరింత ఎక్కువగా సంరక్షిస్తూ ఉండటం వల్లనే కదా అంతా సవ్యంగా జరిగింది. కాని ఆ విషయాన్ని ఎవరూ గుర్తించనే గుర్తించరు! ధన్యవాదాలు తెలుపుకుంటూ ఉత్తరాలూ వ్రాయరు" అంటారు శ్రీమాత.

– సంపాదకుడు

ప్రశ్న: మొన్న క్రేన్ (బరువులు ఎత్తే యంత్రము) కూలిపోయినప్పుడు మేమెలా రక్షింపబడ్డాము?*

నీకు తెలిసే ఉంటుందను కుంటాను.

ప్రశ్న: ఏదో చూచాయగా మాత్రమే తెలుసు

Very partially, vaguely, a sort of impression "like that" an impression, almost an attitude, but not knowledge. How that works, one would not be able to say!

ప్రశ్న: అనుగ్రహం వెల్లివిరిసింది.

సరే బాగానే ఉంది. కాని దాని తంతు ఏమిటి? దాని సంవిధాన మేమిటి? అసలా ప్రమాదం ఎలా తప్పిపోయిందో నువ్వు వివరంగా చెప్పినట్లయితే అందరూ తెలుసుకుంటారు. ఎవరిలోనో ఒకరిలో చేతన చాలా మెలకువగా ఉందన్న మాట. అంత గట్టి విశ్వాసము ఎవరికున్నదో – మనస్సు యొక్క ప్రమేయము లేకుండానే అప్రయత్నంగానే అది కార్యరూపం దాల్చింది.

దైవానుగ్రహం సదా నిన్ను రక్షిస్తూనే ఉంటుంది.

పూర్తినమ్మకానికి – అపనమ్మకానికి, దైవానుగ్రహం కలిగేందుకు – అది లోపించేందుకు మధ్యన ఎన్నో స్థాయిలుంటాయి. ఎంతోమంది ఎలా రక్షింపబడ్డారో వివరిస్తూ ధన్యవాదాలు తెలుపుకుంటూ నాకు ఉత్తరాలు వ్రాస్తూ ఉంటారు. కాని అసలు ఎట్టి ప్రమాదమూ సంభవించకుండా, చిన్న చికాకు కూడా పడకుండా అంతా సవ్యంగా గడిచిపోయినట్లు ధన్యవాదాలు తెలుపుతూ

---

* ఆశ్రమంలో కొంతమంది కుర్రవాళ్లు ఓ పెద్ద చెట్టుకాండమును 'క్రేన్' సహాయంతో లారీలోకి ఎక్కించబోయారు. ఆ యంత్రం కాస్తా విరిగిపోయి దాని ముక్కలు చెల్లాచెదరైనాయి. అదృష్టవశాత్తూ ఎవరికి తగలలేదు. ఆ చెట్టు కాండముకూడ దొర్లటం వలన లారీ బోల్తా పడింది. కొంతమంది పిల్లలు దాని కిందపడి చనిపోయేవాళ్ళు కూడ. కాని అలాంటిదేమీ జరుగలేదు. ఆ లారీని ఎవరూ ఆపకుండానే రాయిగాని మరే ఇతర వస్తువు అడ్డుపడకపోయినప్పటికి దానంతట అదే ఆగిపోయింది.



శ్రీమాత, శ్రీఅరవిందుల దర్శనం
24 ఏప్రిల్ 1950

ఎవరూ వ్రాయరు. అటువంటి ఉత్తరాలు చాలా అరుదుగా వస్తాయి. ఈ సందర్భంలో ఒక విషయాన్ని నీవు గుర్తించాలి. ఒక ప్రమాదం జరిగిందంటే ఎక్కడో ఒక చోట దోషమున్నదన్నమాట. ఏదో గందరగోళం వలననే అలా జరుగుతుంది. ఒక జనసమూహామున్న చోట ప్రతి ఒక్కరి చేతనా ముఖ్యమైనదే. వారి వారి చేతనా లక్ష ణాలని బట్టి ఏడుపుగొట్టువాళ్లు, సచేతనాపరులు – మెజారిటీని బట్టి కార్యం జరుగుతుంది. ఈ విషయాన్ని గురించి నేను వ్రాసేనో లేదోగాని మీకిప్పుడు చెపుతా వినండి. *నిరంతరం దైవానుగ్రహం వారి నంటిపెట్టుకొని అనుక్షణం కాపాడుతూ ఉన్నదన్న విషయం ఎవరూ గుర్తించరు.* ఏదో ముంచుకు వస్తేనేగాని వారికి ఈ సంగతి తెలియదు. అంటే ఏదో ఓ ప్రమాదం జరిగి, బ్రతికి బయటపడాలి. అప్పుడుగాని వారిని దైవము రక్షిస్తున్నట్లు గుర్తిం చలేరు. ప్రమాదం జరిగేవరకు వచ్చి ఆగిపోవాలన్న మాట. కాని *ఓ ప్రయాణమో లేక మరేమైనా కార్యమో నిరంతరాయంగా సాఫీగా గడిచిపోయినప్పుడు దైవానుగ్రహం మరింత ఎక్కువగా ఉన్నదన్న సంగతిని ఎవ్వరు గుర్తించరు.* అంటే ఏమాత్రం హెచ్చు తగ్గులుగాని అరమరికలుగాని లేకుండా అంతా పొందికగా సామరస్యంగా ఉందన్న మాట. అది యాదృచ్ఛికం కాదని, దైవ సంరక్షణమే దానికి కారణమని వారు గుర్తించరు. తీవ్రంగా జబ్బు చేసి కోలుకున్నప్పుడు మనుషులు కృతజ్ఞతామయమైపోతారు. కాని ఏ జబ్బూ లేకుండా పూర్ణారోగ్యంగా ఉన్నప్పుడు ఇంకా ఎక్కువ కృతజ్ఞత చూపించాలని ఎవరికి గుర్తుంటుంది? నిజానికి ఇది ఇంకా గొప్ప మిరకిల్ గదా!

*

అజ్ఞానాంధకారపీడితమైన ఈ ప్రపంచాన్ని రక్షించేందుకు భగ వంతుడు ఆయన కృపను ఎంత అధికంగా సారిస్తున్నాడో ఎవరికైనా తెలుసా? సృష్ట్యాదినుండి ఆయన అనుగ్రహం ఎంతో తీవ్రంగా, పట్టువిడువకుండా, నిరంతరాయంగా పనిచేసింది కనుకనే అది నేటి కాలానికి ఈ మాత్రం స్థాయికి చేరుకుంది. ఈ ప్రపంచం అధఃపాతళావస్థనుండి కోలుకొని ఈ మాత్రం మను

గడ సాధించేందుకు, సత్యం, శివం, సుందరం వంటి దివ్యలక్ష ణాలను అభిలషించేంత స్థాయికి చేరుకుండేందుకు దైవము ఎన్ని వేల సంవత్సరాలు శ్రమించాల్సి వచ్చిందో ఎవరికి తెలుసు?

భయము – ప్రమాదాలు

కొంతమంది భయస్తులుంటారు. ఎప్పుడూ దుఃఖ పర్యవసానా లనే ఊహించుకుంటూ ఉంటారు. అట్టి భావాలు వారి శరీ రాల్లోకి ప్రవేశించి వారి జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. ఆరో గ్యాన్ని దెబ్బతీస్తాయి. ఎక్కడ ఏ ప్రమాదం సంభవించినా అందులో వారు ఇరుక్కుంటారు. ఎక్కడ ఏ వ్యాధి ప్రబలినా అది వారికి తప్పకుండా సోకుతుంది. మరి కొంతమంది సచేత నాపరులుంటారు. ఎప్పుడూ ఆడుతూ పాడుతూ కులాసాగా ఉంటారు. బాహ్యాపరిస్థితులు విషమించినప్పటికి వారికేం కాదు. ఏ దుర్ఘటనా వారి జోలికి పోదు. — సంపాదకుడు

కొంతమందికి ఎప్పుడూ గండాలే

కొంతమంది ఏడుపుగొట్టులు ఉంటారు. ఎప్పుడూ కీడే ఎంచుతారు. వారి బ్రతుకు ఎప్పుడూ బండలవుతూనే ఉంటుంది. జీవితంపట్ల సంతోషం లేదు. ఉత్సాహం లేదు. మంచి జరుగు తుందనే నమ్మకం లేదు. ఈ చెడుతలపులన్నీ వారి శరీరంలోకి ప్రవేశించకేమవుతాయి మరి? ఎక్కడ ఏ ప్రమాదం సంభవిస్తున్నా అది తప్పకుండా వాళ్ళకే జరుగుతుంది. పరిస్థితులు ఏమాత్రం విషమించినా ఆ చెడుపరిణామాలు తప్పకుండా వారికే జరుగు తాయి. వారికి ప్రమాదమైనా వాటిల్లుతుంది – లేక వ్యాధిగ్రస్తు లైనా అవుతారు.

నువ్వు జాగ్రత్తగా పరిశీలించినట్లయితే ఎక్కడ ఎప్పుడు ఏ ప్రమాదమైనా కూడ ఆ మనుషులే అక్కడ తప్పకుండా ఉంటారు. మిగతా మనుషులు ఎంతమంది ఉండరు? వాళ్ళకీ

అటువంటి పరిస్థితులు కలుగుతూనే ఉంటాయి. కాని వాళ్ళ
కాదు. నువ్వు మనుషులను కనుక పరిశీలించినట్లయితే మొద
శ్రేణికి చెందినవారు ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటారని గుర్తిస్తా
ఎప్పుడేమవుతుందో అని భయపడుతూనే ఉంటారు. అనుకు
ట్లుగానే దుర్ఘటన అయి తీరుతుంది.

రోగాల విషయంలో కూడ అంతే

అలాంటివాళ్లు ఎప్పుడూ భయం భయ
గానే ఉంటారు. దేన్ని గురించి అయ
భయపడుతున్నారో అది జరిగి తీరు
తుంది అయస్కాంతము వలె ప్రమ
దాలను వారి వైపుకు ఆకర్షించుకుంటారు. రోగాల విషయం
కూడ అంతే *కొంతమంది* ***24*** *గంటలు రోగులమధ్య, అం
వ్యాధులున్న చోట మెసిలినప్పటికి వాళ్ళకే జబ్బురాదు.* వ
కొంతమంది రోగితో ఒకసారి మాట్లాడితే చాలు, వెంటనే వ
పోతారు! దీని అర్థమేమిటి? మనిషి ఆంతరంగిక పరిస్థితే బావ
జీవితంలో కూడ ప్రతిబింబిస్తుందన్న మాట.

ప్రశ్న పిల్లల విషయంలో కూడ అంతేనా?

ఏమో చెప్పలేను. ఏ జబ్బులు రాకుండా ప్రమాదాలు సంభవిం
కుండా ఉన్న పిల్లలు మంచిపిల్లలని, ఎప్పుడూ జబ్బులు చేస
ప్రమాదాలలో చిక్కుకుంటున్న వాళ్ళు చెడ్డవాళ్ళని అనటం స
కాదు. ఇది మానవుల అభిప్రాయమే కావచ్చు. కాని ప్రకృతి
ఈ మంచిచెడ్డల ప్రసక్తే లేదు ఏదైనా భేదమున్నట్లయితే అ
విధంగా ఉంటుంది ప్రయోజనకారి – వినాశకారి లేక ప్రగ
శీలము పతనశీలము అనవచ్చు. మరో విషయము. కొంతమం
ఎప్పుడూ నవ్వుతూ సరదాగా సంతోషంగా వెలుగును వెద
ల్లుతూ ఉంటారు. మరి కొంతమంది దీనికి పూర్తిగా వ్యతిరేక
వారు ఏడుపుకొట్లు. బ్రతుకు ఎందుకు వచ్చిందిరా భగవంతుడ
అంటూ ఎప్పుడూ అసంతృప్తిగా, నీళ్ళు కారుస్తూనే ఉంటార
దుఃఖానికి గురి అవుతానే ఉంటారు.

ప్రకృతితో సొత్తుగా ఉండాలి

కొంతమంది, ఆధ్యాత్మిక జీవితమంటే ఏమిటో తెలిసినా తెలియకపోయినా, ఎప్పుడూ హుషారుగా వెలుగును వెద జల్లుతూనే ఉంటారు. వారు సద్భావనా సంపన్నులు. ఏది జరిగినా సమతౌల్యాన్ని కోల్పోరు. తిరుగులేని విశ్వాసము, జీవితము పట్ల సంతోషము వారి సొత్తు ఉత్సాహంగా జీవిత మాధుర్యాన్నంతా వారే చవి చూస్తున్నారా అన్నట్లు ప్రకృతితో సొత్తుగా ఉంటారు. వారిని ప్రమాదాలు అంటవు. రోగాలు వారి జోలికి వెళ్లవు. నేటి ప్రపంచావకాశాలను చక్కగా వినియోగించుకుంటూ దినదిన ప్రవర్ధమానమవుతూ ఉంటారు.

*

మానవస్వభావము విచిత్రమైనది. మనుషులు ఎప్పుడూ చెడుని గురించే ఊహించుకుంటూ దురదృష్టాన్నే ఆహ్వానిస్తారు గాని భావనా శక్తివలన మంచిని పెంచేవాళ్ల సంఖ్య చాలా తక్కువ. శ్రేయస్సును గురించి ఊహించుకుంటూ సమతౌల్యాన్ని, సామరస్యాన్ని పోషిస్తే మంచిదా, లేకపోతే ఎప్పుడు ఏం జరుగుతుందో బాబోయ్ అని కీడును ఎంచటం మంచిదా? అలా చేస్తే వారు వారి సమతౌల్యాన్ని పోగొట్టుకొంటారు. దానికి తోడు భయంకూడ జోడైందంటే ఆపదలను వారి వైపుకు ఆకర్షించుకుంటారు గూడా.

రక్షణ కవచము

మనుషులకి వారి స్థూలశరీరాన్ని గురించి మాత్రమే తెలుసు. దానిని పరివేష్టించి ఉండే ప్రాణికశరీరాన్ని గురించి తెలియదు. మనకు గలిగే ఆపదలు, రుగ్మతలు మొ॥ అన్నీ కూడ ఈ ప్రాణికశరీరం ద్వారా మనలోకి ప్రవేశిస్తాయి. కాబట్టి మనం దాన్ని జాగ్రత్తగా కాపాడుకున్నట్లయితే మనకే ఆపదా రాదు. దానిని ఎలా కాపాడాలనేదే సమస్య ఈ పొరలో ఎక్కడా

రంధ్రము ఏర్పడకూడదు. మానసికంగా నువ్వు దృఢంగా ఉన్నట్లయితే ఈ పొర నిక్షేపంగా ఉంటుంది. కోపతాపాలు, ఆవేశము, అసంతృప్తి, ఆతురత, షాక్ మొ॥ పనికిరావు. అంటే బాహ్యాపరిస్థితులకు తల్లడిల్లిపోకుండా ఆంతరంగికంగా దిట్టంగా ఉన్నట్లయితే నీకే ఆపదా రాదు. నీ చేతనను దిగజార్చుకో కుండా ఉన్నత చేతనలో సుఖాసీనుడవై ఉండాలి. అప్పుడు నీ లోపలినుంచి ఒక విధమైన నైశ్చల్యము, ప్రశాంతత్వము బహి ర్గతమై నీ చుట్టూ ఒక కవచంగా ఏర్పడి నిన్ను రక్షిస్తాయి. బైట ఎంతటి భయాందోళనలు, రోగప్రకంపనములు కలిగినా కూడా అవి నిన్నే మాత్రము అంటవు. ఈ సంగతి తెలియక అందరు జీవితాన్ని గ్రుడ్డిగా గడిపేస్తూ ఉంటారు. — సంపాదకుడు

రక్షణ కవచము

మనని సర్వదా రక్షించి కాపాడేది మనని పరివేష్టించి ఉన్న ప్రాణికదేహమే. ఇది ఒక పల్చనిపొరవలె సూక్ష్మభౌతికదేహానికీ (subtle body) శరీరానికీ మధ్యన ఆక్రమించి అంటువ్యాధులనుంచీ, అలసటనుంచీ, నిస్త్రాణమునుంచీ, ఇంకా ఆకస్మికసంఘటనలనుంచీ మనని కాపాడుతుంది. అందువల్ల ఈ సున్నితదేహాన్ని కాపాడుకోవాల్సిన అవసరము ఎంతైనా ఉంది. భారమైన భావోద్వేగము, బడలిక, అసంతృప్తి, ఆకస్మిక అదురుపాటు మొదలైన వాటిల్లో ఏ కాస్త కలిగినా ఈ ఆచ్ఛాదితపొరలో ఛిద్రత ఏర్పడుతుంది. అందులోంచి అన్నీ ప్రవేశించే దారి ఏర్పడుతుంది. ఈనాటి వైద్యశాస్త్రము కూడా ఇదే చెపుతుంది. పరిపూర్ణమైన ప్రాణికసమత ఏర్పడి ఉంటే ఏ రకమైన అనారోగ్యం నీ దగ్గరకు రాదు. మంచి రోగనిరోధకశక్తి ఉంటుంది. అంటే నీలో ఈ విధమైన సమతాస్థితి, సామరస్యం ఉన్నప్పుడు అది నీ ఆచ్ఛాదితపొరను చక్కగా ఉంచి తద్వారా నిన్ను అపాయాలనుంచి రక్షిస్తుంది. కొంతమంది అతిసాధారణ జీవితము గడుపుతూ ఉన్నప్పటికీ ఏ విధంగా భుజించాలో, ఏ విధంగా నిద్రించాలో స్వతహాగానే తెలుసుకొని వారి రక్షక కోశాన్ని మంచిస్థితిలో ఉంచుకుంటారు. ఈ విధంగా పకడ్బం

రంగా ఉంటే ఎటువంటి ప్రమాదాలనైనా చెక్కుచెదరకుండా దాట గలుగుతారు. ఇటువంటి సమర్థతను ఎవ్వరైనా సాధించవచ్చు. తమ ఆచ్ఛాదితపొరలోని లోటును గుర్తించి దానిపై కొంచెముసేపు ఏకాగ్రత నిలిపిగానీ, పై శక్తిని ఆహ్వానించుకొనిగానీ, అంతరం గంలో ప్రశాంతత నిలుపుకొనిగానీ దాన్ని బాగు చేసుకోవచ్చు, బాధా నివారణ చేసుకోవచ్చు. ఆ విధంగా అవాంఛనీయ పరిస్థి తిని తప్పించవచ్చు.

*

ప్రశ్న: ప్రమాదాలు జరగటానికి కారణాలేమిటి? సమత లోపించడమేనా?

నిగూఢ కారణాలు

బయటకు కనిపించే కారణాలు అనే కము ఉండవచ్చు. కానీ వాటిని మించిన నిగూఢకారణము వేరే ఉంటుంది. ఆచ్ఛా దితపొర సురక్షితంగా ఉంటే ఎటువంటి ప్రమాదాలనైనా తప్పిం చుకోవచ్చని లోగడే చెప్పుకున్నాము గదా! ఒకవేళ ప్రమాదం జరిగినా కూడా దుష్ఫలితాలుండవు. ఈ ఆచ్ఛాదితపొరలో చిరుగు గానీ, ఛిద్రముగానీ ఏర్పడితే అవి ఏర్పడిన పద్ధతి, దాని స్వభా వము, స్థానము మొ॥ వాటిని బట్టి దాని నిరోధకశక్తి తగ్గు తుంది. అప్పుడు ప్రమాదం సంభవిస్తే అది దానికి అనుగుణం గానే ఉంటుంది. నిజానికి ప్రతివారికీ ఒక విషయము అను భవములోకి వచ్చే ఉంటుంది. తమలో ఏదో చికాకు పడటం, చేతన దిగజారిపోయి స్వాధీనం లేక ఏమరుపాటుగా ఉన్న భావన, ఏదో సంకటంగా ఉన్న భావన కలిగినప్పుడు ప్రమాదాలు సంభవించటం గమనించే ఉంటారు. అంటే వాళ్ళు ఏమి చేస్తు న్నదీ వారికే తెలియకుండానూ, అస్వాధీనంగానూ ఉన్న స్థితి వారు అనుభవిస్తారు. ఆ విధంగా గాకుండా పూర్తి చైతన్యవం తంగా, పూర్తి ఎరుకతో ఉంటే ప్రమాదాలు జరగవు. అలా ఉన్నప్పుడు ఒక్క ఊపుతో, సూక్ష్మమైన ప్రక్రియతో దాన్ని తప్పిం చుకోగలరు. అట్లాకాక పై లోకాల్లోకి వెళ్లి అక్కడే ఉండిపో యినా ఇబ్బందే. ఒక వ్యక్తి ఒక సమస్య పరిష్కారముకోసము

మానసికంగా కృషి చేస్తూ, ఏకాగ్రచిత్తంతో మిగతా విషయాల పట్టించుకోకుండా ఉన్నాడనుకోండి. రోడ్డు మీద వెడుతూ కూడ ఆ విధంగానే ఉంటే ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు చురుగ్గా తప్పించుకోలేడు. అపాయం జరుగుతుంది. ఆటలలోనూ, సాము హిక క్రీడలలోనూ అదే జరుగుతుంది. పరిశీలిస్తే నీవు తేలిగ్గా తెలుసుకుంటావు. పని మీద దృష్టి లేకపోవడం, పరధ్యానం ఉన్నట్లుండి దేనిమీదకో మనస్సు వెళ్ళడం మొదలైన కారణాల వల్ల వారేం చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితి కలిగి ప్రమా దాలు సంభవిస్తాయి. ఇవన్నీ చైతన్యంలో ఎక్కడో రెపరెపలాడు తూండడం వల్లనే జరుగుతాయి.

పరధ్యానం పనికిరాదు

ఇలా చైతన్యం బలహీనంగా ఉండటానికి కారణం కూడా ఒకటి ఉంటుందని నేనెప్పుడూ చెపుతూనే ఉంటాను. అది విశ్రాంతిలేకనూ, నిద్ర తక్కువవటం కావచ్చు. శ్రమ కలిగే పనుల్లో ఎక్కువ నిమగ్నులు కావడమైనా కావచ్చు. ఇటువంటి వాటికి అతీతంగా ఉండకపోతే ఆచ్ఛాదితపొరలో చిన్న ఛిద్రం కలిగి, దాని పనిని సరిగ్గా నెరవేర్చలేదు. అప్పుడటువైపుగా పోతున్న ఏ శక్తి అయినా ప్రమాదాన్ని కలిగించగలదు. ఏతా వాతా చెప్పేదేమంటే ప్రమాదాలు జరగడానికి కారణం ఒళ్ళెరగ కుండా పరధ్యానంగా ఉండడం, చైతన్యాన్ని సడలగొట్టుకోవ డమూ, సాధారణంగా ప్రతివారి అనుభవంలోకి వచ్చే ఉంటుంది. ఏదో ఒక అసౌకర్యం కలుగుతున్నట్లు, కావాలనుకున్నది చెయ్యి జారి పోతున్నట్లు, స్థిరంలేక నీరుగారి పోతున్నట్లు అనిపిస్తూం టుంది. ప్రమాదాలు జరిగేది ఇటువంటప్పుడే కాబట్టి చాలా జాగ్ర త్తగా ఉండాలి. అలాగని అటువంటప్పుడు ఏమీ చేయకుండా కదలకుండా కూర్చోమని చెప్పడం లేదు. కానీ *అప్రమత్తంగా ఉండి శ్రద్ధగా గమనిస్తూ పరాకు లేకుండా, చేతనాస్థాయి దిగి పోకుండా జాగ్రత్తగా ఉండమని మాత్రము హెచ్చరిస్తున్నాను.*

*

రక్షక పర్యావరణము

బాహ్యావాతావరణ ప్రభావం నిన్నంటకుండా చేసుకునే మార్గం ఒకటుంది. ఒక విధమైన రక్షక పర్యావరణాన్ని నీ చుట్టూ ఏర్పాటు చేసుకోవచ్చు. *ఒక నిశ్శబ్దనీరవ ప్రకంపనాన్ని చుట్టూరా ఆవరించేటట్లు చేసుకోగలిగితే అది నిన్ను రక్షించగలదు.* అయితే బయట ఉండే అనేకమైన ప్రకంపనాలకి ప్రతివారూ ప్రతిస్పందిస్తూనే ఉంటారు. అవి లోనికి ప్రవేశిస్తూనే ఉంటాయి. అలా ప్రవేశించడం నీవు గమనించాలి. *అవి లోనికి ప్రవేశించడానికి వీల్లేనటువంటి నిశ్శబ్దతరంగాలు నీలోనుంచి వెలువడి నీ చుట్టూ దడిగట్టేస్తే నీవు స్వేచ్ఛగా ఎక్కడ తిరిగినా పర్వాలేదు. ఏవీ కూడా ఆ దడిని ఛేదించి నీలో ప్రవేశించలేవు.*

బయట పర్యావరణంలో తిరుగుతున్న ఈ ప్రకంపనాలను నీవు స్వయంగా చూడగలిగితే నేను చెప్పింది నీకు బాగా అర్థమవుతుంది. నీవేదైనా ఆటలో పాల్గొంటున్నప్పుడు అనేకమైన ప్రకంపనాలు అక్కడ కేంద్రీకృతమవుతూంటాయి. ఒక సామూహిక పర్యావరణం ఏర్పడుతుంది. అందరూ చూస్తూనే ఉంటారు. నీవు బంతి ఆట ఆడుతూంటావు. చూసేవారికి తెలుస్తూనే ఉంటుంది. నీ చుట్టూరా పొగవంటిదేదో వ్యాపిస్తున్నట్లు. ఎండ వేడి మిక్కుటముగా ఉన్నప్పుడు దూరానికి తెరలు తెరలుగా ఆవిరివంటిదేదో లేస్తున్నట్లుగానే ఇదీ కనిపిస్తుంది. అలా ప్రకంపనాలు అంతకంతకు ఎక్కువవుతూ ఉన్నట్లుండి అక్కడున్న సామరస్యము భంగమైపోతుంది. ఎవరో ఒకరు క్రింద పడటమో, కాలు విరగటమో, బంతి వచ్చి మొహానికి తగలడమో జరుగుతుంది. ఇలా జరగబోతున్నట్లు ముందరగా గ్రహించవచ్చు. కానీ అది అందరికీ చేతకాదు.

యథేచ్ఛగా సంచరించగలవు

ఈ విధమైన ప్రమాదపరిస్థితులలోనే కాకపోయినా మీ అందరి చుట్టూ మీకక్కరలేని వాటిని నిరోధించే ఆచ్ఛాదితపొర ఏదో విధంగా ఉండే ఉంటుంది. దానివల్ల నీ గ్రహణశక్తి ఉద్దేశపూర్వకంగానూ, చైతన్య

వంతంగానూ అవుతుంది. *ఈ విధంగా నీలో నుండి వచ్చి నీ చుట్టూ అలముకొని ఉండే అతినిశ్చల ప్రశాంతవాతావరణంతో అపాయం లేకుండా జీవితంలో అన్ని సమయాల్లోనూ యథేచ్ఛగా సంచరించగలవు.*

అది లేనప్పుడు ఆహ్వానం కోసం వెంపర్లాడుతున్న కోపం, భయం, రోగం మెదలైన వాటిని నీలోకి తెచ్చుకుంటావు. ఒకసారి వాటికి చోటివ్వగానే అటువంటివే చాలా కంపనాలను నీవు ఆహ్వానించినట్లవుతుంది.

మానవులు ఎంత చైతన్యరహితంగా, అయోమయంగా జీవితం గడుపుతూంటారో చూస్తే ఆశ్చర్యంగా ఉంటుంది. వాళ్ళకి జీవించడమే తెలియదు. లక్షమందిలో ఒక్కరికి కూడా సరిగ్గా తెలియదు. ఏమీ తెలియకుండానే ఎలాగో కుంటినడకన జీవితం గడుపుతారు. ఇక వారికి కలిగే దుర్గతులు తలుచుకోలేము.

సక్రమంగా జీవితం గడపడం అందరూ తెలుసుకోవాలి. పిల్లలకు ప్రప్రథమంగా నేర్పవలసిన పాఠమిదే. జీవితాన్ని చక్కగా గడపటం ఎలా?

*

అంతరంగిక ధ్యానము

నీవు బాస్కెట్‌బాల్ ఆడుతున్నావనుకో. ఆడేటప్పుడు నీవు ఎన్నో విధాల అంగ విన్యాసములు చేస్తూంటావు. *అయినప్పటికీ అంతరంగంలో ధ్యానవైఖరి, భగవంతునిపై ధ్యాస విస్మరించరాదు.* అలా ఉండగలిగినప్పుడు నీవు చేసే అన్ని పనులలోనూ మార్పు వస్తుంది. నీవు బాగా చేయగలగటమే కాక, అనుకోని బలంతో చక్కగా చేస్తావు. చేసేటప్పుడు నీ చైతన్యాన్ని ఊర్ధ్వ స్థాయిలో ఉంచుకోవడంవల్ల నీకేమీ హాని జరగదు. అది ఎంత బలవత్తరంగా ఉంటుందంటే ఏమైనా ప్రమాదం సంభవించినా కూడా నీకే విపత్తు జరగదు. అదే శిఖరస్థాయి. దానికోసమే ఆకాంక్షించాలి.

అనువాదం: ఎ. ప్రభావతి; ఎ.వి.ఆర్. శాస్త్రి

ప్రమాదాలను గురించిన హెచ్చరికలు

మానవచైతన్యము శరీరానికి మాత్రమే పరిమితం కాదు. దాని కతీతమై దూరప్రాంతాలకు కూడ వ్యాపించగలదు. నీ దగ్గరకు వచ్చే వస్తువులను, నిన్ను కలుసుకుండేందుకు వచ్చే మనుషులను నిన్ను సమీపించక ముందరే అంత దూరంలో వుండగానే కనిపెట్టగలదు. వ్యాపక చేతన కలవారికి ఇది నిరంతరానుభూతి. 'అక్కడ పాము న్నది సుమా' అని నిన్ను ముందరే హెచ్చరించగలదు. అయితే ఇది భవిష్యజ్ఞానం కాదు. ఇంద్రియాల పరిధిలోకి రాకముందరే నీ చేతన అక్కడికి వెళ్లి చూస్తుంది, అంతే. మనుషులు కాకుండా కొన్ని అశరీర జీవులు (beings, entities) వుంటాయి. అవి నిన్ను రాబోవు ప్రమాదాలను గురించి హెచ్చరించగలవు. లేదా నీ అవచేతన (subconscient) ఆ ప్రమాదాన్ని ముందరే సూక్ష్మలోకంలో చూసి నిన్ను హెచ్చరించవచ్చు. మనిషి చుట్టూ సూక్ష్మశరీరపు పొర ఒకటి ఉంటుంది. నువ్వు నడుస్తున్నప్పుడు ఏమైనా అడ్డువస్తే సూక్ష్మశరీరం దానిని ముందరే స్పృశించి నీకు దెబ్బతగలకుండా నిన్ను వెనక్కి నెట్టివేయవచ్చు. నిన్ను ప్రమాదాలనుంచి రక్షించవచ్చు. దీని వలన జీవితం కేవలం నీ శరీరానికే పరిమితం కాదని తెలుస్తోంది.

— సంపాదకుడు

ప్రశ్న: జరగబోయే సంఘటనలను మీరు ముందరే సూక్ష్మరూపంలో చూసినప్పుడు వాటిని మీరు ఆపగలరా లేక అప్పటికే సమయం మించిపోతుందా?

ఇటువంటి విచిత్రమైన సంఘటన నొకదానిని గురించి చెపుతా విను.

కలలు నిజమవునా

ఇది చాలా కాలం కిందటి సంగతి. అప్పుడు నువ్వు ఇంకా చిన్నపిల్లవి. ఫ్రెంచి వార్తా పత్రిక *Le Matin* లో ప్రతి రోజూ ఒక కార్టూన్ ప్రచురితమయ్యేది. ఆ కార్టూన్‌లో ఓ పిల్లవాడు ఏదో

ఒక దానిని వ్రేలెత్తి చూపుతూ ఉంటాడు. ఓ పెద్దమనిషి ప్రయాణం చేస్తూ దార్లో ఒక హోటలులో బస చేసాడు. ఊరు పేరు గుర్తు లేదు. తెల్లవారు ఝూమున అతనికి ఒక కల వస్తుంది. ఆ కలలో ఆ కార్టూను కుర్రవాడు అగుపిస్తాడు. తన శవవాహి కను వ్రేలెత్తి చూపుతున్నట్లుగా కనిపిస్తాడు. అందులోకి ప్రవేశిం చమని ఆహ్వానిస్తాడు. తెల్లవారుతుంది. అతగాడు నిద్రలేచి కాల కృత్యాలు పూర్తి కావించుకొని మేడ దిగేందుకు సిద్ధమౌతాడు. తన గదిలోనుంచి బైటకు వచ్చేసరికి ఆ కార్టూను బాలుడు ఎప్పుడూ ధరించే డ్రెస్సులో కనబడి లిఫ్ట్ ఎక్కమంటాడు. అంతే. అది చూచి ఆ పెద్దమనిషి ఒక్కసారి అదిరిపోతాడు. లిఫ్ట్ ద్వారా దిగటానికి నిరాకరిస్తాడు. అంతలోనే ఆ లిఫ్ట్ క్రిందికి ధడేలు మని పడిపోయి ముక్క చెక్కలుగా పగిలిపోతుంది. అందులో నున్న వారందరూ చనిపోతారు.

ఈ సంఘటన సంభవించినప్పటి నుంచి తనకు కలలలో నమ్మకం కలిగిందని ఆ పెద్దమనిషి నాకు చెప్పాడు.

అంటే అది కేవలం స్వప్నమే కాదు. స్వప్నమువంటి భవిష్యదర్శనము, ఓ రకమైన ముందుచూపు. ఆ కార్టూన్ బాలుడు ఆ పెద్దమనిషికి చూపుతున్నది లిఫ్ట్ రూపంలోని తన శవపేటి కనే. అందుకని అతను లిఫ్ట్‌లో ప్రవేశించేందుకు నిరాకరించి క్రిందికి నడిచి దిగిపోవటానికే నిర్ణయించుకున్నాడు. అంతే! ఆ లిఫ్ట్ కూలిపోయింది. అంత ఎత్తునుంచి క్రిందపడి నుజ్జు నుజ్జు అయిపోయింది.

ఇక్కడ ఒక విషయాన్ని గుర్తించాల్సి వుంది. మన చర్మ చక్షువులకి అగుపడనిది, మనకు తెలియనిది అయిన ఒక "అస్తిత్వం" మనలను విపత్తులనుంచి కాపాడేందుకు ముందు గానే హెచ్చరిస్తూంటుంది.

సూక్ష్మదేవతల హెచ్చరికలు

ఈ కథనంలోని కార్టూను పిల్లవాడు ప్రమా దాన్ని వారించే ఒకానొక సూక్ష్మరూపి, ఓ చేతనామూర్తి. అది అతని సుప్తచైతన్యమని (his own subconscient) అనుకోలేము. తన సూక్ష్మచైతన్యమే

భవిష్యత్తులో సంభవింపబోయే విఘాతాన్ని ముందర చూసి వుండవచ్చు కూడాను. అయితే అతనికి ఆ కార్టూను పిల్లవాని రూపంలో ఎందుకు కనబడింది? ఏమో మరి! తెలియదు. సూక్ష్మ భౌతికంలో (subtle physical) ఆ సంఘటన అప్పటికే రూపు దాల్చి ఉండాలి. భౌతికస్థాయిలో సంభవం కాబోయే సంఘటన ముందరే అక్కడ ఉన్నది. ఇంద్రియాతీత అంతశ్చేతనలో ఆ ఘటన అప్పటికే ఉంది. ఇదే మనకి భౌతికంగా అగుపించే ప్రమాదాల సిద్ధాంతం!

ముందుచూపు

సూక్ష్మస్థాయిలో సుప్తంగా ఉన్న విషయము బహిర్గత మవటానికి కొంత సమయం పడుతుంది. అది కొన్ని గంటలు కావచ్చు. నిముషాలు కావచ్చు. క్షణాలు కావచ్చు. సంఘటలని బట్టి ఈ తేడా ఉంటుంది. నాకు మాత్రం అనుక్షణం జరుగబోయే విషయాలను గురించి తెలుస్తూనే ఉంటుంది. సాధారణమైన సంఘటనలను గురించి పట్టించుకోవటంలో ప్రయోజనం లేదు. ఏది ఏమైనప్పటికి ఆ ఎరుక మాత్రం ఉంటుంది. నీ చైతన్యం విశాలమవుతున్నకొద్దీ నీ ముందుచూపు పెరుగుతూ ఉంటుంది. ఉదాహరణకి – ఒకానొక వ్యక్తి రాబోతున్నాడనో లేక మరెవరో నీకోసం ఏదో తెస్తున్నారనో అనే స్పృహ కలుగుతుంది. నీ చైతన్యం విశాలం కావటం వల్ల, జరగబోయే సన్నివేశాలు నీకు ముందరే తెలుస్తాయి.

అయితే వీటిని మనం premonitions అనం. ఎందుకంటే వాటి అస్తిత్వం ముందే ఉన్నది కాబట్టి. అయితే ఇంద్రియ జ్ఞానం కలిగేందుకు మట్టుకు కొంత సమయం పడుతుంది; మధ్యన ఒక గోడగాని, తలుపుగాని ఉండటంవలన మనకది కనబడదు అంతే.

సూక్ష్మనేత్రాలు ముందరే చూచుట

నాకు ఇలాంటి అనుభవాలు చాలా కలిగినయి. ఒకసారి ఓ కొండమీద సన్నటి కాలిబాట మీద నడుస్తున్నాను. ఒకవైపున లోయ, మరోవైపు కొండ. నడిచేందుకు ఒక్కరికి మాత్రమే చోటు. నా వెనుక ముగ్గురు పిల్లలు, చివరగా మరో

వ్యక్తి ఉన్నారు. ఆ దారి ఒక చోట మలుపు తిరిగింది. అవతల ఏముందో కనబడదు. చాలా ప్రమాదభరితమైనది. కాలుజారి తప్పటడుగు వేస్తే లోయలోనికి పడిపోయే ప్రమాదం. అడుగులు నిదానంగా జాగ్రత్తగానే వేస్తూ నెమ్మదిగా నడుస్తున్నాను. అంతలోనే ఆకస్మికంగా ఆ రాయిమీద ఒక పాముని చూశాను. నిజానికి చూచినది చర్మచక్షువులతో కాదు, మరో నేత్రాలతో. నెమ్మదిగా ఒకే అడుగు వేశాను. ఆవలవైపున పాము ఉంది. నాకు అప్పుడు భయముగాని ఆందోళనగాని కలుగలేదు – ముందే అక్కడ పాము ఉన్నట్లు గ్రహించాను కనుక, అందుకు తగినట్లుగానే ముందు జాగ్రత్తలో ఉన్నాను. అందుచేతనే పిల్లలను ఏమాత్రం భయపెట్టకుండా, నెమ్మదిగా – "ఆగండి, జాగ్రత్త, కదలకండి" అని హెచ్చరిక చేయగలిగాను. అక్కడ ఏమాత్రం తడబడినా ఏం జరిగేదో! ఏం ప్రమాదం ముంచుకొచ్చేదో! అదొక విషసర్పం, నెమ్మదిగా తన కన్నంలోకి జారుకుంది. ఈ సంఘటన ఫ్రాన్స్‌లో జరిగింది. అక్కడ అప్పుడు ఏ ప్రమాదమూ జరుగకపోవటానికి కారణము – ఏమాత్రమూ అలజడిగాని, ఆందోళనగాని లేకుండా వ్యవహరించగలిగి నందువలననే!

ఇలాంటి విషసర్పాలు ఎదురుపడిన సంఘటనలు నాకు నాలుగుసార్లు కలిగినయి.

ముందరే హెచ్చరిక

అదో చీకటిరాత్రి. ఇక్కడికి 'అరియన్ కుప్పం' అనే దగ్గరి గ్రామం. నది సముద్రంలో కలిసే సంగమ ప్రదేశం అది. అలా రోడ్డు మీదుగా నడుచుకుంటూ వెడుతున్నాం. చీకటి చిక్కపడుతోంది. అడుగు నేలమీద మోపటానికి పాదం పైకి ఎత్తాను. ఇంతలో "జాగ్రత్త" అనే మాట నాకు స్పష్టంగా వినపడింది! నిజానికి ఎవ్వరూ మాట్లాడలేదు. చూస్తిని కదా! నా పాదం ఒక పెద్ద నల్లనాగు పాముపై పడవలసినది. అప్పుడు ఆ నల్లత్రాచు పడగ పైకెత్తి నీటిమీద దర్జాగా పాక్కుంటూ వెళ్లిపోయింది. ఏమి అందమది! అక్కడ ఆ సమయంలో ఏమాత్రం పొరపాటు జరిగినా నాకు తగిన శాస్తి అయేది!

ఇలాంటి అనుభవాలు చెప్పుకుంటూ పోతూంటే ఎన్నెన్నో! వందలు, వేలు! చివరి నిమిషంలో, ఆఖరిక్షణంలో ఎవరో హెచ్చరించినట్లు అనిపించేది. ఎన్నో పరిస్థితులలో ఇలా జరిగింది.

సూక్ష్మకోశం రక్షిస్తుంది

ఒకసారి పారిస్ నగరంలో జరిగిన సంఘటన ఇది. నా మనస్సుని అంతరంగ దివ్య చేతనతో అనుసంధానం కావించుకోవాలనే దృఢసంకల్పంతో, ఆ దిశలో సాధన చేసుకుంటూ ఉండే రోజులు. పురో సంకల్పంకాని, వ్యాపకంకాని లేదు. అప్పుడు నా నివాసం లక్సెంబర్గ ఉద్యానవనాల దరి. ప్రతి సాయంత్రము వాహ్యాళిగా నడిచిపోతూ ఉండేదాన్ని. చిత్తమెప్పుడూ ధ్యానంలో లీనమై ఉండేది. అలాటి పరిస్థితిలో, ఓమారు నేను Boulevard Saint Michel ని దాటుతున్నాను. నేనప్పుడున్న మానసిక పరిస్థితిలో ఆ రద్దీలో కాలినడకని వెళ్లటమే తెలివితక్కువ. అయినా అలా నడుచుకుంటూ వెడుతూ ఉన్నాను. అంతే! అకస్మాత్తుగా ఎవరో గట్టిగా కొట్టినట్లు అయింది. నన్నేదో బలంగా కొట్టినట్లు అయింది. నాకు తెలియకుండానే ఒక్క గంతు వెనక్కి వేశాను. వెంటనే ఒక ట్రాము వేగంగా నా ముందునుంచి దూసుకొని వెళ్లిపోయింది. నేను వెనక్కి గంతువేయటం, ట్రాము దూసుకొనిపోవటం రెండూ ఒకే క్షణంలో సంభవించినయి.ఆహా! అప్పుడు ఆ ట్రాము డ్రైవరు నన్ను ఎటువంటి తిట్లు తిట్టాడో!

చెప్పాలంటే ఇలాటి సంఘటనలు చాలా ఉన్నాయి, జ్ఞాపకం వస్తే చెప్పగలను.

సూక్ష్మరూపులు, అమూర్త జీవులు

ఈ రక్షణ ఎటుప్రక్కనుంచి అయినా రావచ్చు. సాధారణంగా ఒక సూక్ష్మరూపియో (entity)[1] లేక ఒక రకమైన

---

[1] 1951 ఏప్రిల్, 2 న శ్రీమాత తమ ప్రసంగంలో ఉటంకించిన విషయము. మన చుట్టూ కొన్ని అదృశ్యశక్తులు (little entities or some kind of beings) ఉంటాయి. మనకివి ఉపకారాలు చేస్తూంటాయి. అలాగని అవి ఎప్పుడూ ఉండవు. వాటికి ఇష్టమైనప్పుడే అప్పుడప్పుడు వస్తూంటాయి. శ్రీఅరవిందులకు వంటచేసే రోజులు నాకు జ్ఞాపకమున్నాయి. అప్పట్లో

అమూర్తజీవియో (being) నన్ను హెచ్చరించేవారు. ఒక్కొక్కసారి ఒక పొర (aura) నన్ను – పరివేష్టించి ఉన్న సూక్ష్మరూపమే నన్ను రక్షించేది.మానవజీవితం కేవలం దేహానికే పరిమితమనుకుంటున్నారేమో. అదేం కాదు. ఈ విషయాలు కేవలం ప్రమాదాలనుండి కాపాడేందుకే కాకుండా మామూలు జీవితంలోని నిత్యకృత్యాలకు కూడా చాలా ఉపయోగకరము. జ్ఞానేంద్రియాల ద్వారా కూడా మనకు చాలా విషయాలు తెలియగలవు. మన శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి. జీవితపు పరిధి పెరుగుతుంది. సుసంపన్నమవుతుంది. నాకు గూఢవిద్య నేర్పిన గురువు “అయ్యో! నిత్యజీవితంలో పనికివచ్చే జ్ఞానాన్ని ఎలా ఉపయోగించుకోవాలో మనుమలకు తెలియదే” అని ఎగతాళి చేసేవాడు. నిజమే మరి. ఈ జ్ఞానంకోసం నువ్వు ఎక్కడికో పరిగెత్తక్కర్లేదు. నీ పంచేంద్రియాలను విస్తృతపరచటం ద్వారా మామూలుగా తెలియని విషయాలను ఎన్నో నువ్వు తెలుసుకోగలవు. ఇది కేవలం మేధకే పరిమితం కాదు. మీనమేషాలు లెక్కపెట్టడానికి మాత్రమే కాదు. ప్రాణికానికి – ఇంకా చెప్పాలంటే నీ శరీరానికి కూడా వర్తిస్తుంది[2].

అనువాదం: కర్రా వెంకటేశ్వరులు

నేను అనేక పనులు ఒకే సమయంలో చేస్తూ ఉండేదాన్ని. సాధారణంగా పొయ్యిమీద పాలు పెట్టి పనిమీదో, ఎవరితోనో మాట్లాడేందుకో వెళ్లేదాన్ని. పొయ్యిమీద పెట్టిన పాల సంగతే మర్చిపోయేదాన్ని. అలా మరిచిపోయినప్పుడల్లా ఒక చిన్నచేయి నా చీరకొంగు (అప్పట్లో చీర కట్టేదానిని) పట్టుకొని లాగేది. అప్పుడు పరుగెత్తే దానిని. అప్పటికి సరిగ్గా పాలు పొంగుకు వచ్చేవి. ఇది ఒకసారి కాదు. పలుమార్లు జరిగింది. కచ్చితంగా, స్పష్టంగా ఓ చిన్నారి చెయ్యి పట్టుకుని లాగేది.

[2]ఒక సాధకుని ప్రశ్న: మరి దీనిని సాధించేదెలా? సమాధానం కోసం - Collected Works of the Mother vol. 10, pp. 133-135). చూడండి

అపాయాలను అడ్డుకోగలమా?

భూలోకానికి పైన ఇతరలోకాలు లేక స్తరాలు ఉన్నాయి. అవి ఊర్ధ్వలోకాలు – యోగదృష్టికి మాత్రమే గోచరములు. భూమ్మీద జరిగే సంఘటనలన్నీ పై లోకాలలో సూక్ష్మరూపంలో ఉంటాయి. అపాయాల విషయంలో కూడ అంతే. యోగులు ఈ విషయాన్ని ముందరే చూసినట్లయితే వాటిని ఆపివేయవచ్చును కదా అని మనకు అనిపంచవచ్చు. కాని ఇది కేవలం మానవదృష్టే గాని ఈశ్వరదర్శనం కాదు. నువ్వు పైనుంచి భవిష్యదర్శనము చేసినప్పుడు ఇతర అవకాశాలను కూడ చూడగలుగుతావు. కొన్ని అపాయాలను ఆపితే లాభమే. మరికొన్ని జరిగితీరవలసిందే. వాటి ద్వారా నీకు అంతరంగిక ప్రయోజనాలు కలుగుతాయి. లోక విశ్వశ్రేయస్సు దృష్ట్యా అవి అభిలాషనీయములు.

– సంపాదకుడు

ప్రశ్న: ఏదైనా అపాయం జరగబోతోందని మీరు ముందరే కనుక్కొన్నట్లయితే దాన్ని ఆపివేయగలరా?

సంఘటనల పూర్వరూపాలు

అది సందర్భాన్నిబట్టి ఉంటుంది. ఒక్కొక్కప్పుడు ఆపగలం. ఆ సంఘటనను ఏ లోకం (స్తరము) లో అయితే చూస్తామో ఆ లోకమునుబట్టి ఉంటుంది. ఆ సంఘటనల పూర్వరూపాలు పై లోకాల్లో ఉంటాయి. అప్పుడు వాటిని ఆపేందుకు వీలు కావచ్చు. మరికొన్ని లోకాల్నుంచి చూసినప్పుడు భవిష్యజ్ఞానం కలిగినప్పటికీ ఏమియు చేయుటకు వీలుపడదు. జాగ్రత్త సుమా. అని హెచ్చరించేందుకు మాత్రమే వీలవుతుంది. "ఇదుగో ఇదీ నీవు నేర్చుకోవలసిన పాఠం", అని ముందరే నీకు హెచ్చరిక కలుగుతుంది గనుక దానిని ఎదుర్కొనేందుకు అంతరంగికంగా నీవు తయారుగా ఉండగలవు. నువ్వా ఘటనను మార్చలేవుగాని దానిని ధైర్యంగా ఎదుర్కోగలవు. 'ఇలా ఎందుకు జరిగింది?' అని తిట్టుకుండే బదులు దానిని నీ ఆధ్యాత్మికసాధనలోని ఒక

ఘట్టముగా పరిగణించాలి. ఈ విధంగా కనుక స్పందించినట్లయితే అది నీకు లాభదాయకమే అవుతుంది.

సహాయానికి అవకాశాలు

సహాయకార్యక్రమాలు నువ్వు ఏ స్తరముల నుండి అయితే చూస్తావో ఆ స్తరములను బట్టి ఉంటుంది. *నిద్రలో వచ్చే కలలమీద, అనుభూతులమీద కూడ నీకు పట్టు ఉండాలి.* అప్పుడు నీకు వచ్చిన హెచ్చరికలు తగిన జాగ్రత్త తీసుకునేందుకు వచ్చినవో లేక జరుగబోయే సంఘటనలను ఎదు ర్కొనేందుకు నీవు సన్నద్ధమయ్యేందుకు వచ్చినవో తెలుస్తుంది. అవి నీకు పాఠాలన్న మాట. ప్రతిసారి ఒకే పాఠం కాకపోవచ్చు. ఆ సంఘటనల వలన ఆంతరంగికంగా మంచిపాఠాలను నేర్చు కొని నీవు పురోగమించవచ్చు. మంచిఫలితాలను పొందవచ్చు. నీవు చూసే ఈ భవిష్యదర్శనాలన్ని కూడ నీ సాధనలో చాలా ముఖ్యమైన అంశములు. కాబట్టి నీవు దేనినీ చులకన పరచ రాదు. ఒక్కొక్కటి ఒక్కొక్క రకమైన పాఠాన్ని నేర్పగలవు. అటు వంటివి కొన్ని వందల రకాల దర్శనాలు (visions) కలలు ఉన్నాయి.

అందరికి ఒకే మంత్రం పనికిరాదు

ఎవరికైనా జబ్బుచేసినప్పుడుగాని, ప్రమాదం సంభవించినప్పుడుగాని నేను స్వయంగా నా సూక్ష్మదృష్టితో చూసైనా తెలుసుకుంటాను. లేక నాకెవరి ద్వారా అయినా ఆ వార్త అందుతుంది. అన్నీ ఒకే కోవకు చెందినవి కావు. ఒక్కొక్కటి ఓ ప్రత్యేకమైన వ్యవహా రము. ఒక్కొక్కసారి నాకు ముందరే తెలుస్తుంది. అప్పుడు నేను కలగజేసుకొని ఆ ఘటనను ఆపగలుగుతాను. ఒక మనిషికి జబ్బు రాకుండా ఆపివేయవచ్చు. మరియొకరి విషయంలో నాకు ముందరే తెలిసినప్పటికి నేనేమి చేయకూడదు. ఆ జీవికి దేహాన్ని ఒదిలిపెట్టే సమయము ఆసన్నమైనదన్నమాట. అంతిమయాత్రకు అవసరమైన సందర్భములను కల్పించి సాధ్యమైనంత మంచి పరి

స్థితులను సమకూర్చాలి. నష్టాన్ని తగ్గించి లాభాల్ని ఎక్కువ జేయాలి. అంతే.

సంఘటనలను మార్చుట

ఏ ఒక్క వ్యక్తికిగాని, లోకానికిగాని కాక మొత్తం విశ్వానికి సంబంధించిన విషయాలు మరికొన్ని వుంటాయి. అప్పటికే సుస్థిరంగా నిశ్చయింపబడిన వాటిని మార్చ పనిలేదు. మరికొన్ని ఇంకా పరిణామదశలో ఉంటాయి. ఇంకా అంతిమరూపాన్ని పొందలేదు. అటువంటప్పుడు నువ్వు నిర్మలమైన మనస్సుతో గమనిస్తూండాలి అంతే. ఏమాత్రము పక్షపాతంగాని, ఆవేశంగాని పనికిరావు. నీ చేతన మహోన్నత స్థాయిలోనే ఉండాలి. తటస్థం పనికి రాదు. అద్దంలో ఉన్నదున్నట్లుగా నీ మనస్సులో ప్రతిఫలింప జేసినట్లయితే ఏం జరుగుతున్నదో కరెక్టుగా తెలుస్తుంది. అప్పటికే నిశ్చయింపబడిన విషయాలైతే పూర్తిగా చెయ్యి దాటిపోయినాయి. వాటిని నీవు మార్చలేవు. ఇంకా సందిగ్ధావస్థలో ఉన్నవాటిని మార్చగలవు.

నిజానికి ప్రతి సంఘటన వేరు. దేనికదే ప్రత్యేకమైనది. కొన్నిటిని పూర్తిగా మార్చివేయగలము. తారుమారుగా ఉన్న వాటిని సరిజేయగలము. మరికొన్నిటిని అంతపూర్తిగా కాకపోయినా కొద్ది మార్పులు చేసి మంచిఫలితాలను కలిగించగలం. మరికొన్ని సంఘటనలు అప్పటికే పూర్తిగా నిశ్చయింపబడి ఉంటాయి. వాటిని తప్పించేందుకు వీలులేదు. నువ్వు ఎంత ప్రయత్నించినా, తలబద్దలు కొట్టుకున్నా లాభం లేదు. ఎట్టి ప్రయోజనము ఉండదు. ఏ ఘటన ఎటువంటిదో అనే విచక్షణా జ్ఞానాన్ని నువ్వు సంపాదించాలి. ఆ సంఘటన ఏ కోవకు చెందినదో కనుక్కోగలగాలి. ఒక్కొక్క కోవకు చెందిన కొన్ని వందల దృష్టాంతాలు నాకు తెలుసు.

పైనుండి శక్తి వచ్చుట

ఓ సంఘటన (యుద్ధం మొ॥) ఈ విధంగా జరుగుతుంది అని పూర్తిగా స్థిరపడినట్లు, నిశ్చయింపబడినట్లు కనపడవచ్చు. కాని ఓ దివ్యసంకల్పము త్రోసుకొని వస్తుంది. ఓ

జ్వాల పైకెగతన్నుతుంది. ఉన్నతలోకములోని ఇచ్ఛాసంపన్న మైన ఓ ఆకాంక్షతో నీవట్టి సంఘటనను మార్చివేయుగలవు. జరగవలసినది జరిగి తీరుతుంది. కాని కొన్ని నూతనాంశాలు రావటం వలన దాని స్వరూపం మారిపోతుంది. భూలోకంలో తరచు ఇలా జరుగుతూనే ఉంటుంది. కొన్ని పరిస్థితుల ప్రాబల్యం వలన యుద్ధమే జరుగవలసియున్నచో అది జరిగి తీరుతుంది. అటువంటప్పుడు ధానికి విరుగుడుగా మరొక శక్తిని రప్పించి ఆ యుద్ధస్వరూపాన్నే మార్చవచ్చు. దానిని తప్పించలేవుగాని మంచి పర్యవసానాలను కలగజేయువచ్చు. ఇటువంటి విషయాలెన్నో నాకు తెలుసు.

పాపాలు ప్రమాదాలకు కారణాలా?

కొన్ని శక్తుల మధ్య ఘర్షణ

ప్రమాదాలకు కారణాలు చాలా ఉంటాయి. నిజానికి వివిధ ప్రకృతిశక్తుల మధ్య ఘర్షణ – అభ్యుదయశక్తులకు వినాశకారులకు జరిగే పోరాటం వలనే ప్రమాదాలు సంభవిస్తాయి. ముఖ్యంగా శాశ్వతపరిణామాలకు దారితీసే ఘోరప్రళయాలు దుష్టశక్తుల (forces of disintegration and disorganisation) ఆధిక్యతవలననే జరుగుతాయి. "నువ్వు పూర్వజన్మలో పాపాలు చేసేవు కనుక ఇప్పుడు దానికి శాస్తి అనుభవించాల్సిందే అందుకే నీకీ ఏక్సిడెంట్ జరిగింది" అనే తప్పుడు వాదనలు కొన్ని మతాల వారు (ఉదా: థియాసఫిస్టులు) చేస్తూంటారు. కాని అది కర్మ సిద్ధాంతాన్ని, మానవుని పరిమితమేధతో అపార్థం చేసుకోవటమే అవుతుంది. నిజం కాదు. కానే కాదు. ఈ కార్యకారణ సంబంధము మానవుల ఉద్దేశమే కాని ప్రకృతిశాసనం కాని, దైవ నిర్దేశితం కాని కాదు.

*

ఇది పారిస్‌లో జరిగిన ఒక సంఘటనను స్ఫురణకు దెచ్చుచున్నది. అది "దానవిపణి" అని పేరుగలిగిన బజారు. ఈ బజారునకు వివిధ వ్యాపారులు వచ్చి అన్నిరకముల వస్తువుల క్రయవిక్రయములలో పాల్గొందురు. వస్తువిక్రయమున వచ్చిన ద్రవ్యము దానధర్మములకు వినియోగింతురు. (అది ముఖ్యముగా మేలు చేయుటకంటే వినోదమునకు వినియోగపడును. అయినా దాన కర్మముల మేలు చేకూరును) ఉన్నతసమాజములోని సొగసంతా, నాగరికతంతా, అక్కడ చేరును. ఆ బజారు మహాసుందరముగా ఏర్పాటు చేయబడినది. అయితే దృఢముగా నిర్మింపబడలేదు. ఎందుకనగా, అది మూడు లేక నాలుగు దినముల వ్యవహారము గనుక. రంగురంగుల టార్పాలిన్ పైకప్పుతో అది అమర్చబడినది. విద్యుచ్ఛక్తి దీపములు వెలిగించబడినవి. పని చాలా సున్నితముగా జేయబడినది. నాలుగుదినముల ముచ్చటేగదా యని వారి భావము. విద్యుచ్ఛక్తి ప్రమాదము (short circuit) సంభవించి, మంటలులేచి, సర్వమును దహింపజొచ్చినవి. పైకప్పు మంటలలో తగులుకొని మనుష్యులపై కూలి పడిపోయినది. నేనిదివరకే చెప్పినట్లు, సమాజములోని సంస్కార ప్రియులందరు అక్కడున్నారు. వారికది మానవతా దృక్పథముతో చూచినచో గొప్ప విపత్తు. ద్వారముచెంత నున్నవారు తప్పించుకొనుటకు బ్రయత్నించిరి. అది నిజమైన సంకులసమరము. ఈ నాగరకులందరు సామాన్యముగా సత్ప్రవర్తన గలవారే అయినప్పటికి అప్పుడు వీధిలోని రౌడీలవలె బోట్లాడసాగిరి. ఒక గొప్ప గౌరవనీయుడు, రాజమర్యాదగలవాడు, కీర్తిగలవాడు, కవి, నాగరికుడు అక్కడుండుట తటస్థించినది. అతడు తన వెండిబెత్తముతో, మహిళల తలపై బాదుచు ముందుకు సాగిపోవ బ్రయత్నించుచుండెను. అది చాలా వినోదకరమైన దృశ్యము. తరువాత ఏడ్పులు, రోదనలు, శవజాగరణలు, అంత్యకర్మలు జరిగినవి. అంత్యకర్మల శ్మశాన వాటికలో ఒక పెద్దమనిషి ఉపన్యాసము గావించెను. అతడు "మీకు తగినట్లు జరిగినది. దేవుని శాసనము ననుసరించి మీరు

బ్రతుకలేదు. మిమ్ము దహించుటద్వారా దేవుడు శిక్షించి నాడు" అని చెప్పెను.

ఎక్కడెక్కడ ప్రమాదము జరుగునో అక్కడక్కడ యిది జరుగును. అనేకులు ఎదురుతిరిగి, "ఈ దేవుడు మాకక్కర లేదు" అనిరి. ఈ భావాలు సామాన్యమానవ లక్షణమునకు చక్కని ఉదాహరణలు.

మానవులను పాపులను చేయుట క్రైస్తవమత సంప్రదాయము. దైవమును గుఱించిన మన అభిప్రాయమును అది భగ్న పరచును. పాపులుగా పుట్టిన దురదృష్టము కారణమున వారిని శిక్షించు దేవుడు ఉదారు డెట్లగును.

అనువాదము: కొంతభాగం - పాలా వెంకటసుబ్బయ్య (శ్రీమాత ప్రశ్నోత్తరములు 1950-51)

మూఢనమ్మకాలు – ప్రమాదాలు

ప్రశ్న: మూఢనమ్మకాలు మనోనిర్మితములా?

> *మనస్సు యొక్క నిర్మాణ చాతుర్యము*

కావు. అవి మానసిక రూపకల్పనలు. సాధారణంగా ఒక అనుభవంద్వారా ఒక మూఢ నమ్మకము ఏర్పడుతుంది. ఉదాహరణకు, యూరపు దేశంలో "నిచ్చెన క్రిందుగా నడవకూడదు. అది దురదృష్టానికి హేతువవుతుంది" అని చెపుతారు. నిజానికి ఎవరో ఒకరు నిచ్చెన క్రిందుగా నడుస్తుండగా అది జారి అతని మీద పడివుండవచ్చు. ఆ విధంగా ప్రారంభమై అది అనేకసార్లు సంభవించి ఒక నమ్మకంగా ఏర్పడవచ్చు. ఎందువల్లనంటే, నిచ్చెన సరిగ్గా పెట్టకుండా దానికింద నడిచినప్పుడు అది ఏ క్షణంలోనైనా పడవచ్చు. అదే దురదృష్టం. ఈ రకమైన మూఢనమ్మకాలు అనేకం. స్థానికమైన ఈ మూఢ నమ్మకాలు దేశానుగుణంగా ఏర్పడుతాయి. అంతేకాకుండా వివిధ

దేశాలలోని మూఢనమ్మకాలు పరస్పర వ్యతిరేకంగా కూడా కన బడుతాయి. కొన్ని దేశాలలో నల్లపిల్లిని చూస్తే విపత్తు వస్తుందం టారు. మరికొన్ని దేశాలలో అది అదృష్టహేతువంటారు. నీవు రెండింటినీ సమన్వయించి చూసి, ఏమీ జరగదనే నిశ్చయా నికి వస్తావు. అన్ని మూఢనమ్మకాలు ఒకానొక అనుభవంవల్ల స్థానికంగా, అప్పుడప్పుడు ప్రత్యేకమైనవిగా ఏర్పడి మానసిక నియ మాలుగా తయారౌతాయి. అవి మానసిక రూపకల్పనలే కాని నియ మాలు కావు.

ఇది కాక, మతనిబంధనలనేవి ఉంటాయి. ఇవన్నీ పారి శుధ్య సూత్రాల ననువర్తించికాని, వైద్యరీత్యాగాని, ఏర్పడి మత నిబంధనలుగా మారుతాయి. జనులు వాటిని పాటించేటట్లు చేయాలంటే అది ఒకటే మార్గము. "నీవు ఈ విధంగా చేయాలి. ఆ విధంగా చేయాలి" అని భగవంతుడు చెప్పినట్లుగా చెప్పాలి. లేకపోతే చాలామందికి నచ్చదు. దానిని పాటించరు. కాని ఈ విధంగా చెపితే, భగవంతుడు ఆగ్రహించడంవల్ల ఏదో చెడు జరుగుతుందనే భయం వారిలో ఏర్పడుతుంది. ఇది కూడా ఒక మూఢనమ్మకమే.

అనువాదం: ఎ. వెంకటరామ శాస్త్రి; ఎ. ప్రభావతి (శ్రీమాత ప్రశ్నోత్తరములు, 1953)

ఆధ్యాత్మిక జీవితము – కష్టాల కడగళ్ళు

కష్టాలకు కారణాలు

నీవు చిత్తశుద్ధితో ఆధ్యాత్మిక జీవితా నికి వచ్చినట్లయితే, ఒక్క పెట్టున అష్ట కష్టాలు నీ మీదపడవచ్చు. నీ ఆత్మీయు లతో పేచీ రావచ్చు. నీ వాళ్ళే నిన్ను ఇంట్లోనుంచి బహిష్కరిం చవచ్చు. నీవు ఆర్జించుకున్నదంతా పూర్తిగా కోల్పోవచ్చు. చాలా కాలం క్రితం నాకు తెలిసిన ఒక అతను గొప్ప ఆకాంక్షతో

(చాలా సాధన తరువాత) భారతదేశము వచ్చాడు. ఆ రోజుల్లో గొలుసు గడియారాలు ధరించేవారు. మన పెద్దమనిషివద్ద వాళ్ళ నాయనమ్మ ఇచ్చిన బంగారు పెన్సిలు ఒకటి ఉండేది. అది అత నికి ఈ ప్రపంచంలోకెల్లా అతివిలువైన వస్తువు. కొలంబోలో అతను వస్తున్న ఓడ మీద నుంచి ఒక పడవలోకి మారటానికి గెంతవలసి వచ్చింది. (ఓడ మీదనుంచి చిన్న పడవల ద్వారా వారు తీరానికి చేరేవారు.) అప్పుడు కాలుజారి క్రిందపడ బోయాడు. అతనయితే ఎలాగో నిలదొక్కుకున్నాడు కాని ఆ కుదుపుకి ఆ బంగారం పెన్సిలు మట్టుకు సముద్రంలో పడి అట్ట డుగుకు వెళ్ళిపోయింది. అది అతనికి చాలా మనస్తాపం కల్గిం చింది. వెంటనే తేరుకొని "ఇది భారతదేశపు మహాత్మ్యమే కదా అమ్మయ్యా. నా బంధనాలనుంచి విముక్తుడనయ్యాను బాబూ" అని అనిపించింది. చిత్తశుద్ధిగలవారికి మాత్రమే ఇలా జరుగుతుంది. అతిశ్రద్ధ గలవారికెప్పుడూ అష్టకష్టాలే. చిత్తశుద్ధి లోపించినవారికి మిరుమిట్లు గొలిపే మంచిమంచి వస్తువులన్నీ ప్రాప్తిస్తాయి. ఎందుకు? అయ్యో తప్పైపోయిందే అని పాఠం నేర్పి నిన్ను బాగు చేసేందుకు. ఎవరికైనా పెద్ద పెద్ద కష్టాలు వచ్చాయంటే వారి చిత్తశుద్ధి ఒక స్థాయికి చేరుకుందన్న మాట.

అనువాదం: గోదావరి

సమాధుల తవ్వకాలు – ఉపద్రవాలు

ప్రశ్న: ఈజిప్టులో సమాధులను తవ్వేవాళ్లు ఆపదలకు గురవుతూ ఉంటారు ఎందుకని?

మంచిపనే. వాళ్లకి అలా కావాల్సిందే. సమాధులను కొల్ల గొట్టినప్పుడు ఏమౌతుందో తెలుసా? వీటిని గురించిన కథలు చాలా ఉన్నాయిలే – అదంతా వేరే విషయము.

భౌతిక దేవతలు

మనిషి ప్రాణంపోయినా కూడా అతని భౌతికకోశం కరిగిపోదు. అందులో ఓ భౌతికదేవత (spirit of the form) నివసిస్తూ ఉంటుంది. అది ఉన్నంతకాలం శరీరం కరిగిపోదు. పూర్వకాలం ఈజిప్టు దేశీయులకు ఈ జ్ఞానం ఉండేది. ఈ విషయాన్ని గురించి వాళ్లకి బాగా తెలుసు. భౌతికకాయాన్ని ఒక విధంగా తయారుచేసినట్లయితే ఆ భౌతికదేవత దాని నుండి నిష్క్రమించకుండా దాని నంటిపెట్టుకునే ఉంటుంది. ఆ శరీరానికేమి కాదు. కొన్ని సంవత్సరాలు గడిచినా కూడ చెక్కుచెదరకుండా ఉంటుంది. ఈ విధంగా వారు తయారుచేసిన శరీరాలు ఇప్పటికీ పాడయిపోకుండా ఉన్నాయి. కొన్ని వేల సంవత్సరాలు తరబడి విశ్రమిస్తున్న వాటిని ఆధునికులు ఏదో శాస్త్రపరిశోధనంటూ తెరచి చూసినట్లయితే వాటికి కోపం ఎందుకు రాదు?

మమ్మీలలో చైతన్యం

పారిస్ నగరంలోని గ్విమెట్ మ్యూజియంలో రెండు మమ్మీలున్నాయి. ఒకటి అయితే పూర్తిగా హరించిపోయింది. రెండవది చక్కగా ఉన్నది. అందులోని భౌతికదేవత ఇంకా కళకళలాడుతోంది. నువ్వు దాన్ని కావాలంటే పలకరించవచ్చును కూడాను. ఇంత పవిత్రమైన మమ్మీని కొంతమంది మూర్ఖులు వచ్చి వేళాకోళం చేసినట్లయితే దానికి కోపమెందుకు రాదు?

వారు ఆ పేటికలను. బలవంతంగా తెరచి వాటి మర్యాదలను ఉల్లంఘిస్తారు. ఆ మమ్మీల పేటికలు ఓ ప్రత్యేకమైన ఆకారంలో వుంటాయి. ఆ మనిషి తాహతునుబట్టి అలా చేస్తారు. శరీరాన్ని భద్రపరచేందుకు అవసరమైన పదార్థాలను కూడా అందులో ఉంచుతారు. అంత పవిత్రమైన పేటికను సుత్తులతో కొట్టి బలవంతంగా తెరచి, లోని మమ్మీ అందరికి కనపడేటట్లు కొన్ని పొరలను కూడ తొలగిస్తారు. ఈ విషయంలో ఓ సంగతి మరచిపోకూడదు. సాధారణంగా గొప్ప గొప్ప వాళ్లని, రాజకుటుంబీకులను, ఉపాసకులను మాత్రమే మమ్మీలుగా రూపొందించే వాళ్లు.

ఈజిప్టులోని ఫారో రాజవంశానికి చెందిన రాకుమారి మమ్మీ ఒకటున్నది. ఆమె థెబీస్‌లోని ఒక రహస్య విద్యాలయానికి అధినేత. అక్కడ సంభవించిన పెక్కు విపత్తులకు ఆ మమ్మీయే కారణము.

*

దయ్యాలంటే ఏమిటి?

పిసినికొట్టుల విషయంలో కూడ ఈ విధంగానే జరుగుతూంటుంది. ఆ పిసినిగొట్టు ఏదో ఒకనాడు మరణిస్తాడు. అతని ప్రాణకోశం కరిగిపోతుంది. కాని అతని డబ్బుమీద వ్యామోహం ఎక్కడికీ పోదు. అది తన చుట్టూ కొన్ని ధాతువులను పోగుచేసుకొని ప్రాణికలోకంలో ఓ మూర్తిమత్వాన్ని పొందుతుంది. అతను నిధిని ఎక్కడైతే దాచిపెట్టాడో అక్కడ పీఠం వేసుకొని కూర్చుంటుంది. ఎవరినీ దగ్గరకు రానీయదు. కాని కొంతమంది సూక్ష్మబుద్ధులు దాన్ని పసిగట్టి అక్కడ నిధి ఉన్నట్లు తెలుసుకుంటారు. కాని దానిని కాపాడుతున్న జీవి ఎవరిని దగ్గరకు రానీయదు. ఎవ్వరైనా ధైర్యంచేసి వచ్చినా వాళ్లను పట్టుకొని పీడిస్తుంది. వాళ్లకి జబ్బుచేస్తుంది. ఆపద సంభవిస్తుంది. వారి ప్రాణం తీసేందుకు కూడా వెనకాడదు. గడగడలాడించి వాళ్లను పిచ్చెక్కిస్తుంది కూడా.

కొంతమంది శనిగ్రహాలుంటారు జాగ్రత్త!

ఒక గుంపులో కొంతమంది అదృష్టవంతులు మరికొంతమంది శనిగ్రహాలు ఉంటారు. ఆ గుంపుకు ప్రమాదం సంభవించినప్పుడు దాని పర్యవసానము వారి బలాబలాలమీద ఆధారపడి ఉంటుంది.

ఇద్దరు మనుషుల భిన్న జాతకాలు

మొదటి ప్రపంచయుద్ధ సమయంలో ఒక పేరుమోసిన వైమానికుడు ఉండేవాడు. అతను బహునేర్పరి. పేరు

పొందిన విమానచోదకుడు. ఎన్నో విజయాలు సాధించాడు. అతనికి ఎప్పుడూ ఏ ప్రమాదము జరుగలేదు. ఇంతలో ఏమి జరిగిందో తెలియదు. తన రోజులు అయిపోయినై అనుకున్నాడు. ఏదో పెద్ద ప్రమాదము జరుగనున్నదని అతనికి అనిపించసాగింది. అతను వైమానికశాఖనుండి విరమించుకొని, పౌరవిమానాలు నడపడం కొనసాగించాడు. ఫ్రాన్స్‌నుంచి దక్షిణ ఆఫ్రికాకు వెళ్ళాలనుకున్నాడు. కాని అంతరంగికంగా ఏదో దెబ్బతిని ఉంటాడు. ఒక ఫ్రెంచి నగరము నుండి బయలుదేరి మడగాస్కర్ చేరాడు. అక్కడ నుండి ఫ్రాన్స్ తిరిగి వెళ్ళిపోదామనుకున్నాడు. ఆ రోజుల్లో కాంగో గవర్నరుగా పనిచేస్తున్న మా అన్నయ్య తన ఉద్యోగానికి త్వరగా వెళ్ళాలని తనను ఆ విమానములో తీసుకు వెళ్ళమని అడిగాడు. అక్కడున్న చాలామంది ఈ ప్రయాణాలు ఎప్పుడూ ప్రమాదకరమైనవని చెప్పారు. అందులో వెళ్ళవద్దని హెచ్చరించారు. అయినా కూడ వినిపించుకోకుండా మా అన్నయ్య ఆ విమానంలోనే బయలుదేరాడు. దారిలో విమానం అల్లరి పెట్టింది. సహారా ఎడారిలో ఆగిపోయింది. అదృష్టవశాత్తూ మళ్ళీ బయలుదేరింది. మా అన్నయ్యను కాంగోలో దింపేసి, దక్షిణం వైపు వెళ్లింది. అంతే, మార్గమధ్యంలో ఆ విమానం కూలిపోయింది. అందులోని వైమానికుడు మరణించాడు. అలా జరగాల్సి ఉన్నదన మాట. అన్నయ్యకు తనకేమీ జరగదనే విశ్వాసము పూర్తిగా ఉండబట్టి అతనికేమీ కాలేదు. దీని అర్థమేమిటో తెలుసా? వారిరువురి వాతావరణాలు పరస్పర విరుద్ధములు. మిశ్రమ ప్రభావం వలన ఆ విమానానికి మొదట మరమ్మత్తు మాత్రమే వచ్చి సహారాలో దిగవలసి వచ్చింది. ఆ విధంగా అప్పటికి ప్రమాదం తప్పింది. ఒక్కసారి మా అన్నయ్య ఎప్పుడైతే దిగిపోయాడో ఆ వైమానికుని దురదృష్టంవలన విమానము కూలిపోవటమూ, వైమానికుడు మరణించటం జరిగాయి.

శనిగ్రహాల ఉదంతం

ఇలాంటిదే ఒక ఓడ ప్రమాదం జరిగింది. నాకు బాగా తెలిసిన ఇద్దరు భార్యాభర్తలు విమానములో ఇండోచీనా వెళ్ళారు. ఆ విమానా

నికి ప్రమాదం జరిగింది. కాని వాళ్ళిద్దరూ ఆశ్చర్యంగా బ్రతికి బయటపడ్డారు. మిగతా అందరూ మరణించారు. అక్కడ నుండి ఫ్రాన్స్‌కి ఓడలో బయలుదేరారు. ఆ ఓడ ఎట్లాంటిసముద్రంలో అనూహ్యంగా ఒక ఇసుకదిబ్బ తగిలి (లక్షలో ఒక్కసారి కూడా ఇలా జరుగదు) మునిగిపోయింది. కాని ఈసారి కూడా ఆ ఇద్దరే బ్రతికారు. మిగతా అందరూ మృత్యువాత పడ్డారు. ఇలాంటి వాళ్ళను దురదృష్టవాహకులు అని అనవచ్చు. అందుకే ఇలాంటి వాళ్ళతో ఎప్పుడూ ప్రయాణం చేయరాదు. వీరెక్కడ ఉంటే అక్కడ అందరికీ ప్రాణగండమే. కానీ తమాషా ఏమిటంటే వాళ్ళకి మాత్రమేమీ జరగదు!

అనువాదం: గోదావరి

శక్తిని వృధాపరచరాదు

జీవయాత్రను సాగించేందుకు తెలివితేటలకంటె ఆధ్యాత్మికశక్తే ఎక్కువ ఉపయోగపడుతుంది. ప్రమాదాలకు, రోగాలకు ఇది ముఖ్యంగా వర్తిస్తుంది. వీటిని లోతైన దృష్టితో పరిశీలించినట్లయితే వాటికిగల అసలైన కారణాలు బైటపడతాయి. అప్పుడు దైవాన్ని కనుక అర్థించినట్లయితే అందుకు తగిన సహాయం లభిస్తుంది. ఇక అంతరంగికంలోకి పోయి ఆ శక్తి ద్వారా ఆరోగ్యాన్ని పొందవచ్చు. – సంపాదకుడు

దైవము సహాయము చేయుట

మానవులకు ఆధ్యాత్మికశక్తిని సద్వినియోగం చేసుకోవటం రాదు. ప్రమాదాలు జరిగినప్పుడుగాని జబ్బులు చేసినప్పుడుగాని సహాయాన్ని కోరినప్పుడు *నేను వెంటనే శక్తిని పంపిస్తాను. అవసరమైన దానికంటె రెండుమూడింతలు ఎక్కువ శక్తినే ఇస్తాను. కాని మానవులు ఆ శక్తిని ఎలా ఉపయోగించు*

కోవాలో తెలియక వృధా చేస్తారు. ఆ శక్తి రెండు కార్యముల కోసం ఇవ్వబడుతుంది. ఒకటి – ప్రమాదాలవలన లేక జబ్బుల వలన కలిగిన అవస్థనుండి కోలుకుండేందుకు, రెండు – పరివర్తనా మార్గంలో అడ్డుతగుల్తున్న కారణాలు – ప్రమాదాలకు జబ్బులకు గల అసలైన కారణాలను గుర్తించి వాటిని తొలగించేందుకు. కాని అందరూ ఆ శక్తిని ఆ పనికోసం వాడుకుండే బదులు ఊరికే వృధాపరుస్తారు. ఆ శక్తి వచ్చినప్పుడు దానివలన ప్రేరేపితులై మత్తెక్కి, ఊరికే ఉండలేక, అటు ఇటు తిరుగుతారు. గంతులేస్తారు. వాగుతారు. కాని అందుకోసం కాదు కదా ఆ శక్తిని ఇచ్చింది. దానిని వృధాపరచటంవల్ల వాళ్లు నీరసపడిపోతారు. ఆధ్యాత్మికశక్తిని వృధా చేస్తే ఇలాగే అవుతుంది. కేవలం ఈ సందర్భంలోనే కాదు. దివ్యశక్తి దొరికినప్పుడెల్లా వాళ్లు అలాగే చేస్తారు. అంతర్వర్తులై ఆ శక్తిని *సద్వినియోగం చేయటం వారికి రాదు. ఆ శక్తిని నిలవచేసేందుకు వీలు లేదు. వెంటనే అసలైన కారణాలను కనుక్కొని వాటిని ఆంతరంగికంగా తొలగించాలి.* కాని మనుమలు వెర్రెత్తిపోయి వాగుతారు. గంతులు వేస్తారు. ఆ విధంగా ఆ శక్తిని విచ్ఛిన్నపరుస్తారు.

అధిక సంఖ్యాకులు చేసే పని అదే. అంతటి విలువైన శక్తిని పిచ్చిచేష్టలు చేసి వృధాచేస్తేగాని వాళ్లు తృప్తి చెందరు. వాళ్లకి జీవితాన్ని అనుభవించినట్లుండదు.

ఏ పనికోసం ఇవ్వబడిందో ఆ పనికోసమే దివ్యశక్తిని ఉపయోగించాలి. రూపాంతరీకరణ (Transformation) కోసం ఇవ్వబడిన శక్తిని రూపాంతరీకరణకోసమే ఉపయోగించాలి. శరీరానికి కలిగిన సంక్షోభాన్ని సరిచేసేందుకు ఇచ్చిన శక్తిని అందుకే ఉపయోగించాలి.

ఒకవేళ ఎవరికైనా ఒక ప్రత్యేకమైన కార్యమును అప్పచెప్పినప్పుడు, దానికోసం ఇచ్చిన శక్తిని ఆ కార్యానికి ఉపయోగించవచ్చు.

కాని అందరు ఏం చేస్తారో తెలుసా? వారిలోకి శక్తి రాగానే వెర్రెత్తిపోయి గంతులు వేయటం మొదలుపెడతారు. ఆ

శక్తిని ప్రయోజనకరంగా ఉపయోగించాలనే జ్ఞానం వారికుండదు. కబుర్లు చెప్పటం మొదలుపెడతారు. మరికొంతమంది పిచ్చెక్కి పోయి వాళ్లను వాళ్లు అదుపు చేసుకోలేక మొండివాదనలకు లంఘించుకుంటారు. వాళ్లే గొప్పవాళ్లనే దర్పంతో వాళ్ల మాటలను ఖండించటం మహాపాపమన్నట్లు భావిస్తారు.

జరిగేదంతా మన మంచికేనా?

చేతనా స్థాయి ప్రాముఖ్యత

ఎప్పుడూ మంచే జరుగుతుందా? అది నీ చేతనాస్థాయిమీద ఆధారపడి వుంటుంది. ఎట్టి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు నీ చేతన ఒక చక్కటి ఆయుధము. *నీ చేతనను ఎప్పుడు నువ్వు అందుకోగలిగినంత మహోన్నత స్థాయిలో వుంచాలి. అప్పుడు నీకు సాధ్యమైనంత మంచే జరుగుతుంది.* నీ చేతన జారిపోయి నట్లయితే అటుల జరుగదు. ఎందుకని? అది పరమోచ్చ స్థాయిలో లేదు కాబట్టి. నువ్వు కనుక right attitude తో ఉన్నట్లయితే జరుగబోయే ప్రతి సంఘటన నీ కనుకూలంగానే పరిణమిస్తుంది. *ఇంకా చెప్పాలంటే అసలు ఆ పరిస్థితే పూర్తిగా మారిపోతుంది.* ఉదా: ఎవరైనా నిన్ను చంపేందుకు వస్తారనుకో. అప్పుడు మామూలు మనిషి మాదిరిగానే నువ్వు భయంతో వణికి పోయి నట్లయితే ఆ హంతకుడు తన పనిని తప్పకుండా నెరవేరుస్తాడు. కాని నువ్వు భయపడ్డప్పటికీ ఉన్నత చేతనాస్థాయినుంచి దైవాన్ని ప్రార్థించినట్లయితే, ఆ మనిషి నీ మీదకు వచ్చినప్పటికి నిన్ను చంపజాలడు. మహాచేస్తే కాస్త గాయపరచగలడేమో అంతే. అటుల గాక మొదటినుంచీ నువ్వు నీ చుట్టూవున్న దైవసాన్ని ధ్యాన్ని కనుక స్ఫురింప జేసుకున్నట్లయితే ఆ హంతకుడు నీ జోలికి కూడా రాజాలడు. నీకే అపాయము రాదు.

శరీరాన్ని కూడా చేతనామయం చేయాలి

ఒక పెద్ద గుంపులోని జనమందరూ ఒక్క మనిషి చేతన ద్వారా రక్షింపబడిన ఉదంతాలెన్నో నాకు తెలుసు. అయితే నీ చేతన మట్టుకు పైకిపోయి భౌతికశరీరాన్ని "నీ ఖర్మ నీది" అని ఒదిలి వేయటం తగదు. నువ్వు పైకి వెళ్లి 'దైవేచ్ఛయే జరుగుగాక' అని అనుకున్నా కూడ నీకు ఆపద తప్పదు. ఎందుకంటె నువ్వెంత ఎత్తైన చేతనను అందుకున్నప్పటికీ నీ శరీరం మట్టుకు అచేతనంగా అవికసితంగానే ఉండిపోతుంది. పాతధర్మాన్నే అనుసరిస్తుంది. అందుకని నీ భౌతిక శరీరానికి కూడ దివ్యచేతనను స్ఫురింప జేసి దాని భయాన్ని పోగొట్టాలి. దానిని దివ్యశాంతి సంభరితం కావించాలి. అప్పుడు హంతకుల ప్రయత్నాలు విఫలమవుటయే కాదు. క్రూరమృగాలు కూడ నీ జోలికి రావు. ప్రకృతి వైపరీత్యాలు నిన్నంటవు. (చూ: ఈ సంచిక పు. 7 చివరి పేరా).

అఖిల ఏప్రిల్ సంచికలో సవరణ

పుట 51 పై ఆర్టికిల్ చివర ఈ క్రింది విధంగా ఉండాలి:

ఆంగ్లమూలం: నిరోద్‌బరన్
తెలుగు అనువాదం: మానాప్రగడ శ్రీరాములు

8/6/2001



న విద్యావిధానము

జాతీయ విద్య యొక్క లక్ష్యములు

అఖిల

అఖిల భారత పత్రిక

జూన్ 2001

మీకిది తెలుసా?

శ్రీఅరవిందఘోష్ ఉన్నతవిద్యా విధానం లోపభూయిష్టంగా ఉందని సూచించారు. ఈ విద్యావిధానమూ, లక్ష్యాలూ కేవలం ప్రభుత్వోద్దేశాల కనుగుణంగా వున్నాయే కాని దేశావసరాలకి కాదు. ఈ విద్య కార్యాలయాలను నడిపించే యంత్రాలని, మరమనుషులని తయారుచేస్తుందే కాని మానవులని కాదు. జాతీయ విద్యావిధానం పౌరులను మానసికంగా, నైతికంగా మరియు శారీరకంగా శిక్షణ యిచ్చి మరే ఇతర జాతి పౌరులతోనైనా సరిసమానంగా ఉండేలా చేయాలి.

*

అది 1835 వ సంవత్సరం, ఫిబ్రవరి 2. ఆంగ్లేయులు యావత్ భారతదేశాన్ని తమ అధికారంలోకి తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్న రోజులవి. చరిత్రకారుడూ, రాజకీయవేత్తా అయిన మెకాలే ప్రభువు, శతాబ్దాల తరబడి నిత్యనూతనంగా వున్న భారతీయ విద్యావిధానానికి గొడ్డలిపెట్టు వంటి ఒక చారిత్రాత్మక ఉపన్యాసాన్ని (దీనిని 'ది మినిట్' అంటారు) బ్రిటిష్ పార్లమెంట్‌లో చేసారు. ఆయన ప్రసంగం ఇలా సాగింది:

"నేను భారతదేశం నలుమూలలా పర్యటించానుగానీ ఎక్కడా ఒక దొంగనికానీ, బిచ్చగాడినికానీ చూడలేదు. ఈ దేశంలో వున్న సంపదా, ప్రబల నైతిక విలువలూ, శక్తీ ఎంత గొప్పవంటే, ఈ దేశానికి వెన్నెముక అయిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని దెబ్బకొడితే కాని మనం ఈ దేశాన్ని గెలవలేమని నా ఉద్దేశ్యము. కాబట్టి ఈ దేశం యొక్క ప్రాచీనమైన, సనాతనమైన విద్యావిధానాన్నీ, సంస్కృతినీ మార్చాలని నేను ప్రతిపాదిస్తున్నాను. ఎందుకంటే, విదేశీయము, ఆంగ్లేయము అయిన ప్రతి వస్తువు తమ స్వంత వాటికంటే మంచిదీ, గొప్పదీ అనే అభిప్రాయాన్నీ కలిగిస్తే గాని, భారతీయులు వారి ఆత్మగౌరవాన్నీ, సంస్కృతినీ విస్మరించలేరు; మనకు అనుకూలంగా, పూర్తిగా మన అధికారానికి లోబడి ఉండే జాతిగా మారలేరు".

అనువాదం: బి. వరలక్ష్మి

విషయసూచిక

విద్య యొక్క నిజ లక్ష్యం

బోధననగా పాఠాలు నేర్పటమేనా?

జాతీయ విద్యావిధానము

అనుబంధం

ప్రాచీన పితృస్వామ్య పద్ధతి

శ్రీఅరవిందులు

ప్రాచీన పితృస్వామ్య పద్ధతిలో, బిడ్డ తండ్రికి సంక్రమించిన సజీవ ఆస్తి. బిడ్డ తండ్రి యొక్క సృష్టి – ఉత్పత్తి – తండ్రి తనను తానే బిడ్డ రూపంలో ఉత్పాదించుకొనినాడు. తండ్రి అంటే దైవమే లేక విశ్వాత్మ – ఈ బిడ్డకు సృష్టి కర్త అనమాట. భౌతికంగా కన్పిస్తున్న తండ్రే ఉత్పాదకు డయినాడు. సృష్టికర్తకు తన సృష్టి మీద అధికారం ఉంది. అలాగే ఉత్పాదకునికి తన ఉత్పాదన మీద సంపూర్ణాధికారం ఉన్నది కనుక, వానిని తన అభిప్రాయమునకు బద్ధునిగా మలిచే అధికారం ఉన్నది. అంతే కాని పసివాని ఆత్మతో ప్రమేయం లేదు. తండ్రి అభిప్రాయములకు అనుగుణంగా శిక్షణ, రూపకల్పన, దిద్దుబాటు జరగవలెగాని, బిడ్డలో నిక్షిప్తమైన సహజేచ్ఛానుసారముగా కాదు. తండ్రి చేపట్టిన వృత్తి కాని, తండ్రి కోరిన వృత్తి కాని చేయవలె – అంతేకాని, బాలుని అభిరుచి, శక్తి, ప్రకృతుల ననుసరించే వృత్తి కానే కాదు. ఇంత ఎందుకు, యుక్తవయస్కుడైనా కూడా, కుమారుని ప్రమేయం లేకనే, ఆతని జీవితంలోని మౌలికమైన విషయాలను స్థిరపరచడం తండ్రి హక్కే. విద్యా విషయంలో కూడా అంతే. ఆత్మననుసరించి స్వేచ్ఛగా వికసించవలసిన పసిగుడ్డును ఉపాధ్యాయుడు పోతపోసిన విగ్రహంలా తయారు చేస్తాడు!

కాని ఇప్పుడు పరిస్థితి మారింది. ప్రతి పిల్లవాడు అతని ప్రకృతి కనుగుణంగా వికసించ వలసిన ఓ పుష్పమని గుర్తిస్తున్నారు. ఆతని ఆంతరంగిక ఆత్మాభిరుచిని, సృజనశక్తిని కని పెట్టేందుకు ఆతని చదువు, శిక్షణ వీలుగా వుండాలి. ఆ సూచనలను అవలంబించి ఆతని భౌతిక, ప్రాణిక శక్తులను మెరుగు పరచాలి. వాటి వికాసానికి పూర్తిగా అవకాశం కల్పించి పరిపక్వం చేయాలి. ఆతని మానసిక, భావోద్వేగ, ఆత్మశక్తులను చక్కగా ప్రకాశింపజేసి సాధ్యమైనంత లోతుగా, సువిశాలంగా, ఊర్ధ్వదిశగా విస్తరింప చేయాలి.

అనువాదం: రంగనాథ ఆత్రేయ

నూతన విద్యకు నూతనాధ్యాపకులు

శ్రీఅరవిందుల ప్రవచనములు

మన విద్యావిధానంలో ఒక సిలబస్‌ను ముందరే నిర్ణయించుకొని దాని ప్రకారం పిల్లలకు పాఠాలు నేర్పటం ప్రధానం కాదు. వాళ్లకు జీవితాన్ని గురించి సరికొత్త అవగాహన కలిగించాలి. విద్యార్థి నూతన చేతనతో ప్రదీప్తము కావాలి. *ఈ విధమైన విద్య నేర్పుటకు మొదట ఉపాధ్యాయుడు నూతన చేతనను పొంది, దాని వెలుగులో జీవిస్తూ వుండాలి. పిల్లలకు బోధించే విషయాలకు ఉపాధ్యాయులు ప్రత్యక్ష నిదర్శనాలు కావాలి.*

*

మనం తెలుసుకోవలసిన జ్ఞానంతో పోలిస్తే మనకు ప్రస్తుతం తెలిసిన జ్ఞానమెందుకు పనికిరాదనే నైజాన్ని మనం గుర్తించాలి. *ఒక విషయాన్ని నేర్చుకోవాలనే తపన నీలో సజీవంగా భాసించినప్పుడే నువ్వు దానిని పిల్లలకు బోధించ గలుగుతావు.* ఇది మొదటి నిబంధన.

రెండవ నిబంధన: జీవితము యొక్క బాహ్య స్వరూపమంతయు ఒక భ్రాంతి మాత్రమే అని తెలుసుకోని, అసలైన సత్యం కోసం నిరంతర తపన పొందుతూ వుండాలి.

*

మధుమయీ! పిల్లలకు మనం చాల స్వేచ్ఛ నిస్తున్నాము కదా. ఆ స్వేచ్ఛను వాళ్లు సద్వినియోగం చేసుకుండేటట్లు చేయుటమెలా? పిల్లలు నేర్చుకోవాలసిన విషయాలు అనేకం ఉంటాయి. ప్రపంచంలో జీవించేందుకు అనువైన జ్ఞానాన్ని పొంది అందుకు సంసిద్ధులవటమే వారి ముఖ్య వ్యాపకం కావాలి. అయితే ఒక్కొక్కరికి ఒక్కొక్క విషయంలో ఎక్కువ అభిరుచి ఉండవచ్చు; దానిని కనిపెట్టి అభివృద్ధి పరచాలి. అంతే కాకుండా వారిలో ఏమేమి విద్యలు, కళలు, శక్తిసామర్థ్యాలు దాగివున్నయ్యో వాటిని పట్టుకొని వెలికి తెచ్చి వికసింప జేయాలి. క్రియాశీలము గావించాలి.

జీవితంలో సమస్యలు ఎదురైనప్పుడు పారిపోకుండా వాటికి పరిష్కార మార్గాలను కనిపెట్టటం వాళ్లకి నేర్పాలి. కష్టమైన పనులు చేయటంలో తగిన శిక్షణ ఇవ్వాలి. అప్పుడు వాళ్లకి జీవితమంటె విసుగు పుట్టదు. న్యూనతా భావముండదు. జీవితమెప్పుడు నిత్యనూతనంగా వసంత శోభతో అలరారుతూ వుంటుంది.

అభివృద్ధి చెందేందుకే మన మీ భూమ్మీద నివసిస్తున్నాము. మనం నేర్చుకోవలసింది చాలా వున్నది.

అనువాదం: సంపాదకుడు

విద్య యొక్క నిజ లక్ష్యం

శ్రీఅరవిందుల ప్రవచనాలు

విద్య యాంత్రికంగా ఉండకూడదు

ఆదినుండి విద్యార్థి ఆత్మ తత్త్వమును నిర్లక్ష్యం చేస్తూ, ఆతని ప్రకృతిని యాంత్రికంగా నిరంకుశ శిక్షణలతో కూడిన విజ్ఞానార్జనకు లోను చేస్తూ విద్యా విధానం కొనసాగింది. అతని యింట్లో కూడ అతనికి తన భావాలు, అలవాట్లు, ప్రవర్తనలను తనకు తాను గ్రహించి తీర్చిదిద్దుకొనే స్వేచ్ఛ ఒసగబడ లేదు. సాంప్రదాయక భావాలతో, అతని తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆదర్శాలకు, ఆశయాలకు అనుగుణంగా మాత్రమే ఇంట్లో పెంపకము, విద్యార్జన కొనసాగేవి. శిశువు యొక్క సంస్కారజనిత మేధాసంపత్తిని, నైతిక శక్తులను వీలైనంత ఉన్నత విలువల స్థాయికి వెలికి గొనివచ్చుట ఆరోగ్యవంతమైన విద్యాపద్ధతి యగును. ఈ పద్ధతికి శిశు స్వభావానికి సంబంధించిన మానసిక శాస్త్రం ఆధారంగా వుండాలి. ఎందుకంటే ఇది విద్యాగ్రహీతయైన విద్యార్థి యొక్క ఆత్మతత్వాన్ని (subjectivity) గుర్తించి తదనుగుణంగా విద్యాభ్యాసం కొనసాగించే పద్ధతి కనుక. కాని ఈ పద్ధతి నేటికీ ఇంకా కొరతగనే వుంటున్నది. ఎందుకంటే ఇప్పటికీ ఉపాధ్యాయుడు తన యిచ్చవచ్చిన పద్ధతిలో యిచ్చవచ్చిన రూపంలో

విద్యార్థిని మలచవచ్చునన్న అభిప్రాయమే సమాజంలో దృఢంగా వుంది. విద్యార్థి తన విద్యాభ్యాసంలో స్వతంత్రమైన ఆత్మగా గాక ఉపాధ్యాయుని చేతిలో తీర్చిదిద్దబడే ఒక సాధనంగా మాత్రమే భావించబడుతూ వున్నాడు.

ఆత్మవికాసానికి అవకాశము

కాని ఇప్పుడిప్పుడే విద్యాబోధనా పద్ధతిలో కొంత సద్భావన వెలుగులోనికి వస్తున్నది. ప్రతి వ్యక్తి స్వయంగా తనకు తాను అభివృద్ధిచెందే జీవుడని గ్రహించి శిశువు తన తెలివితేటలను, నైతిక సంపదను, రసహృదయాన్ని, క్రియాత్మక నైపుణ్యాన్ని తనకు తానుగా వృద్ధిపరచుకొనేందుకు, తద్వారా ఆత్మాభివ్యక్తిగా రూపొందేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అతనికి తోడ్పడాలి. అదే వారి అవస్య కర్తవ్యం కూడ. అంతే కాని అతన్ని తమ యిష్టం వచ్చిన రూపంలో పోతపోసి తయారుచేయగల ముడిపదార్థంగా భావించరాదు. మనిషిలోని ఈ ఆత్మ ఏమిటి అన్నది నేటి మానవాళి ఇంకనూ గుర్తించలేదు.

చైత్యపురుషుడే ముఖ్యం

మనిషిలో లేదా శిశువులో, నిగూఢంగా వుంటున్న ఆత్మను లేదా చైత్యపురుమని, అతడు గుర్తించడానికి సహాయపడడమే నిజమైన విద్యారహస్యం, అన్న సత్యాన్ని గూడ మనమింకా గ్రహించలేదు. అలాగాక మనం శిశువులోని ఆ చైత్యపురుమడు (psychic entity) ముందుకు రావడానికి అవకాశమిస్తే, రథ సారధిగా గుర్తించగల్గితే, ఆ అంతరాత్మయే మన చేతులనుండి విద్యాసంబంధమైన కార్యకలాపాలను లాక్కొని ఆ బాధ్యతలను స్వీకరించగలదు. శిశువులో దాగి వున్న ప్రజ్ఞలను వెలికి తీసికొనిరాగల శక్తిని అతనిలో పెంపొందించగలదు. జీవితం పట్ల మనకు గల యాంత్రికభావన ద్వారాను, బాహ్యాయాంత్రిక పద్ధతుల మూలంగాను, శిశువులో అలాంటి స్వీయ దివ్యశక్తి వికాస ప్రకటనను మనం చేజేతులా ఆటంకపరుస్తున్నాం. కనుక ఈ విధములైన నూతన విద్యాబోధనా పద్ధతులు ఇలాంటి స్వీయ

విలువల స్వయంవికాసానికి సరైన సూటి మార్గాలుగా వుంటున్న వని మన మిప్పటికైనా గుర్తించక తప్పదు.

మానవుని నిజస్వరూపమును ఆవిష్కరింపజేయుట

దేహప్రాణశక్తుల వెనుకనున్న యీ చైత్యపురుషుని స్పర్శ వల్లను, దాని శక్తులపై మరింతగా ఆధారపడడం వల్లను, మనకొక సత్యం విదితమవు తుంది. అదేమిటంటే మనిషి తాను తన అంతరంలో ఆత్మయనీ, ఎరుక గల్గిన దివ్యశక్తియనీ, ఈ అంతర్గత సత్యమానవుని ఆహ్వానించి అతనికి విద్యాబాధ్యతల నప్పగించుటే విద్య యొక్క నిజమైన ధ్యేయము అనుటయే. మనిషి యీ చైత్యాత్మను (psychic) గుర్తించి దాని నైజాన్ని పాటించడం జీవితధ్యేయం కూడ అవుతుంది. మన పూర్వీకులు, మతమునకు సమాజమునకు సంబంధించిన ఆచార వ్యవహారముల ద్వారా సంకేత పరచిన విజ్ఞానం యిదే. మనం కోల్పోయిన జ్ఞానగమ్యా నికి మళ్ళీ చేరుకోడానికి ఆత్మాశ్రయతంత్రమే (subjectivism) సరైన మార్గం.

*

ప్రకృతి చైతన్యము అతివిశాలము

విద్యావిధానంలో (from the subjective standpoint) మన ధ్యేయం శిశు మనస్తత్వాన్ని గ్రహించడం, దాని ఆధా రంగా బోధనా పద్ధతులను, శిక్షణా కార్యక్రమాలను తయారు చేయటం అవుతుంది. ఇంతవరకు పూర్వ విద్యాబోధనా పద్ధతులు ఒకే విధమైన విషయపరిజ్ఞానాన్ని విద్యార్థి మెదడులోనికి బలాత్కారంగా చొప్పించడం, మరియు ఒకే విధమైన యాంత్రిక ప్రవర్తనా నియమావళిని అతని చిత్త స్పందనలపై బలవంతంగా రుద్దడంగా వుంటున్నది. కాని యీ నూతన విద్య యొక్క ఆశయం అందుకు పూర్తిగా భిన్నము — శిశువు తనకు తానుగా, తన బుద్ధిని, రసహృదయాన్ని, హృద యావేశాన్ని, నైతిక ఆధ్యాత్మిక సత్తను గుర్తించి, తదనుగుణంగా తన సమాజ జీవితాన్ని, తన స్వభావం ద్వారా, తన శక్తియుక్తుల

ద్వారా అభివృద్ధిచెందాలి. (అనగా విత్తనం నుండి మొక్క ఎలా ప్రకృతిసిద్ధంగా బహిర్గతమవుతుందో, అలానే విద్య శిశువులోని దివ్యశక్తుల సహజవికాసానికి దోహదకారిగా వుండాలి.)

అనువాదం: బి. నరసింహయ్య

అంతరంగంలోని యథార్థ జీవుని మేలుకొలుపు

శ్రీమాత ప్రవచనములు

నేటి మానవజీవితం లోపభూయిష్టము. మానవ మేధకు దీనిని మెరుగుపరచే శక్తి లేదు. లోన దాగివున్న రహస్యచైతన్యానికి అట్టి శక్తి ఉన్నది. మనం దీన్ని పట్టుకొని మన జీవితాన్ని దానికి అప్పచెప్పినట్లయితే ఇక మనకెట్టి సమస్య వుండదు. పిల్లల విషయంలో ఇది చాల ముఖ్యం. చైత్యపురుషుడు ఆవిష్కారమైనప్పుడు మనిషిలో గర్భితంగావున్న అనేక శక్తిసామర్థ్యములు బయటపడతాయి. మనందరిలోను ఏవేవో ప్రజ్ఞలు దాగివుంటాయి. బయటకు వచ్చేందుకు అవకాశం కోసం పొంచి వుంటాయి.

– సంపాదకుడు

మనిషిలోని మహోచైతన్యము

మనిషి కొన్ని హద్దులలోనే జీవించగలడు. కాని ఈ హద్దులను మీరి ఇంతకంటే ఉన్నతము, విశాలము అయిన జీవితమును అనుభవించగల చైతన్యము అతనిలో నిక్షిప్తమై యున్నది. కొంతమంది విశిష్టమైన వ్యక్తుల విషయంలో ఈ చైతన్యము స్పష్టంగా కనబడుతుంది. పరిస్థితుల నన్నిటిని చక్కగా అమర్చి పెట్టి వారి జీవితమును చక్కగా తీర్చిదిద్దుతుంది. వారి వికాసానికి ఏ పరిస్థితులైతే అవసరమో వాటిని ఏర్పరచి, వారెప్పుడు ఏం చేయాలో ఆ విధంగా చేసేలా చేస్తుంది. ఈ ఊర్ధ్వచైతన్యము ఇంతకు ముందర మనసుకు తెలియని విషయములను తెలిసికొని, మనిషికి చేతకాని పనులను చేయిస్తుంది కూడ. అది మనిషి హృదయ

కుహరంలో ప్రకాశించే ఓ దీపం లాంటిది. దాని వెలుగు బాహ్యా మానవుని కప్పియున్న దట్టమైన తెరలను తొలగించి, బాహ్యా చేతన లోనికి ప్రవేశించి, దానిని ఉద్దీపింప జేస్తుంది. కొంతమం దికి దీని ఉనికి ఛాయగా తెలుస్తుంది. ముఖ్యంగా పిల్లల విష యంలో దీని ప్రభావం వారు చేసే అమాయాకపు చేష్టలలోను, పేదమాటలలోను స్పష్టంగా విదితమవుతుంది. కొంతమంది తల్లి దండ్రులు ఈ విషయాన్ని గుర్తించక, పిల్లలను అర్థం చేసుకోలేక వాళ్ళని కోప్పడతారు. వారి ఉద్దేశ్యంలో విద్య అనగా పిల్లలకు బాహ్యావిషయ పరిజ్ఞానమును చొప్పించి వాళ్ళ ఆత్మవికాసమును అణచివేయుట. అప్పుడు పిల్లలు ఏమనుకుంటారు? చదువంటే ఇదే కాబోలు ననుకుంటారు. బాహ్యావిషయ పరిజ్ఞానాన్ని సక్ర మంగా గరపినట్లయితే అదీ మంచిదే.

మానవ జీవితపు నిజ లక్ష్యము

విద్యలోని మూడు విభాగముల ద్వారా – భౌతిక, ప్రాణిక, మానసికములు – చేయు బోధన దృష్టిని బాహ్యా జీవితము మీదనే కేంద్రీకరించి మనిషి వ్యక్తిత్వమును తీర్చిదిద్దుతుంది. అచేతనము అస్పష్టము అయిన వస్తువులో నుంచి సచేతనమైన స్పష్టమైన వ్యక్తిని తయారు చేస్తుంది. మంచిది. కాని చైత్యవిద్య వీటన్నిటినికంటె భిన్నమైనది. జీవితము యొక్క నిజలక్ష్యము, భూలోక జీవితపు ఉద్దేశ్యము దానికి ప్రధానములు. వీటిని కనుక కనిపెట్టగలిగితే మనిషి తన జీవితమును తన శాశ్వతాత్మ కోసము అంకితం చేస్తాడు. ఈ ఆత్మజ్ఞానము ఆవిష్కారమైనప్పుడు మనిషి పరవశించి పోతాడు. సాధారణంగా దీనిని మతపరమైన జ్ఞానంగా పరిగణించడం కద్దు. ఎందుకంటే అదివరకు కేవలం మతగురు వులే దీనిని గురించి పట్టించుకొనేవారు. కాని ఈ వాదన సరియై నది కాదు. మతపరంగా కాకుండ మతాంతపరంగా కూడ దీనిని – అదే సత్యాన్ని సాధించవచ్చు. నిరీశ్వరవాదులు కూడ ఈ విధంగా తమ నైజాన్ని గుర్తించగలరు.

చైత్యపురుషుడు ఎవరు?

చైత్యపురుషుడంటే ఎవరో మనమిప్పుడు సూచించవలసి యున్నది. ఉదా: పరమాత్మ

దేశకాల పరిస్థితులలో దాల్చగలిగిన అసంఖ్యాకములైన అవతారములలో ఒక భూమికను మాత్రమే మనము మనిషి అని వ్యవహారిస్తున్నాము. దీనికి విశ్వచైతన్యమే మాధ్యమము. దీని ద్వారా పరమాత్మ ఆవిష్కారమై, క్రమక్రమాభివృద్ధి చెంది ఒక ఆత్మగా లేక చైత్యపురుషునిగా మూర్తీభవిస్తాడు[1].

చైత్యపురుషుని ఆవిష్కారము

చైత్యపురుష స్పర్శ ద్వారా మనిషి తన నిజస్వరూపమును కనిపెట్టగలుగుతాడు. సాధారణంగా ఈ స్పర్శ తెర వెనుక తెలియకుండా, గుర్తించబడకుండూ జరుగుతుంది. కొంతమంది మట్టుకు దీని స్పర్శను సూక్ష్మంగా గుర్తించగలరు. అతికొద్దిమం

---

[1] చైత్యపురుషుని గురించి ఇచ్చిన వివరణ తనకు అర్థం కావటం లేదని శ్రీమాతను ప్రశ్నించగా ఆమె ఇచ్చిన వివరణ:

ఇది తాత్త్విక విషయము.. subjective (ఆత్మాశ్రయము) అంటే ఏమిటో objective (వస్త్వాశ్రయము) అంటే ఏమిటో నీకు తెలుసా? సరే తెలుసునన్న మాట. మంచిది. సమస్తమైన సృష్టికి మూలమైన ఒకానొక సత్యాన్ని గురించి మనము మాట్లాడుకొంటున్నాము. ఆ సత్యము అమూర్తములో నుంచి మూర్తస్థితిని పొందినది అనుకో. అనగా లోపలి నుంచి బయటకి వచ్చిందన మాట. ఉన్నది ఒకే పదార్థము. లోపల బయట కూడ ఉన్నదొకే పదార్థము. దాని స్థాయి మారిందంతే. లోని స్థితిలో ఉన్నప్పుడు కూడ దాని మూర్తరూపములన్ని అందులో ఉన్నాయిగానీ గర్భితంగా, అవ్యక్తంగా, అనావిష్కారంగా వున్నాయి. బయటకు రాగానే సినిమాతెర మీద బొమ్మ వేసినట్లు మనకు అవి కనబడతాయి. లోపల వుండే ప్రతి అంశము బయటకూడ మూర్తీభవిస్తుంది. లోపల వుండే ప్రతి యొక్క అవకాశము బయట ఒక వ్యక్తిగా ప్రత్యేకమైన రూపంగా మూర్తరూపాన్ని పొందుతుంది. చైత్యపురుషుని పుట్టుపూర్వోత్తరాలు ఇందులోనే ఉన్నాయి. దీనినే మనిషి యొక్క సత్యమని వర్ణించవచ్చును. బుద్ధ భగవానుడు దీనినే ధర్మమన్నాడు. మనిషి యొక్క నైజము ఇదే. మూలస్థానముతో తనకు గల శాశ్వత బంధము ఇదే. చైత్యపురుషుని యాత్ర అక్కడి నుంచే మొదలవుతుంది. కొంచెం కొంచెం అభివృద్ధి పొంది తెరమీద చిత్రము వలెనే పరిణతి చెంది స్పష్టమైన ఆకృతిని దాలుస్తుంది. కాని ఎంత పరిణతి చెందినప్పటికి దాని మూలసత్యము ఒక్కటే. విభిన్నమైన అసంఖ్యాకములైన రూపములన్ని కలిసి ఒకే సత్యాన్ని అభివ్యక్తపరుస్తాయి.

దిలో మట్టుకు ఈ స్పర్శ బహిరంగంగా తెలిసి, చాలా స్పష్టంగా ఆవిష్కారమౌతుంది. అట్టి వారు వారి జీవితంలో చాలా నిబ్బరంగా ధైర్యంగా ముందుకు సాగిపోతూ ఉంటారు. వారు భయసంశయా లను ఎరుగరు. చైత్యపురుషావేశమును పొంది విజయోత్సాహంతో ధైర్యంగా జీవించాల్నంటే చైత్యవిద్య చాలా అవసరం. కాని ఇంత వరకు దీని ఆవశ్యకతను విద్యావేత్తలు గుర్తించలేదు. ఈ అంశ మును బోధనా ప్రణాళికలో చేర్చనేలేదు.

అభివృద్ధికి రెండు మార్గములు

సాధారణంగా విద్య రెండు రకాలుగా వుంటుంది. మొదటిది విషయపరిజ్ఞానము నకు సంబంధించినది. అనగా లౌకిక నైపు ణ్యమును పెంచుకొనుట, పలు శాఖలలో సామర్థ్యమును ఆర్జిం చుట – సాధారణంగా విద్యవలన లభించునది ఇదియే. కాని కొంచెం లోతుకు పోయినట్లైతే నీలో నిద్రాణంగా వున్న సామ ర్థ్యములను కూడ వెలికితెచ్చి వాటి ప్రయోజనములను నీవు పొందగలవు.

నీ కార్యరంగములను బహుళము గావించి ఒక్కొక్క రంగ మును పెంచి పెద్దగా చేయవచ్చును. అకస్మాత్తుగా నీలో ఇంతకు ముందులేని నూతనాంశములు ఆవిష్కారము కావచ్చును. ఈ విష యాన్ని గురించి నేను మీ కింతకు ముందరే చెప్పాను. నీవు నీ లోని చైత్యపురుషని కనిపెట్టినప్పుడు తలవని తలంపుగా కొన్ని క్రొత్తవిషయములు, నీ ప్రకృతిలో లేని అనేక నూతనాంశములు ఆవి ష్కారమవుతాయి. ఈ విధమైన దృష్టాంతములెన్నో నాకు తెలుసు.

మనందరిలోను కూడ ఒకానొక విద్య లేక ప్రజ్ఞ (genius), ఒక విశిష్టత దాగి వుంటుంది. కాని మనకు తెలియదు. దానినే విధంగా ఆవిష్కరించాలి అనేదే సమస్య. నీలో అది నిద్రాణంగా ఉంటుంది. బయటికి రావాలని తహతహలాడుతుంది. తలుపులు తీసి దాన్ని బయటకు ఆహ్వానించాలి. అంతే.

*

తనను తాను పరిశీలించుకొనుట

ఇది చాలా ముఖ్యమైన విషయము. ఆలోచనలు అంటే ఏమిటో, feelings

అంటే ఏమిటో, అవి పనిచేసే విధానమును గురించి తెలుసు కొన్నట్లైతే ఈ మార్గములో నీవు కొంతదూరము వెళ్ళినట్లే. నీ ఆలోచనలు, ఫీలింగ్స్ నీ శరీరం మీద ఎట్టి ప్రభావాన్ని చూపిస్తాయో పరిశీలించి కనుక్కోవాలి. దీనికి విరుద్ధంగా నీ శరీరము, ఆలోచనలు, నీ ఫీలింగ్స్ మీద ఎట్టి ప్రభావము కలిగిస్తాయో చూడాలి. నీ అంతరంగంలోకి లోతుగా చూసి నీ శరీరము కానిది, శాశ్వతంగా ఉండేది అయిన 'నేను' అనే పదార్థము ఏమిటో తెలుసుకోవాలి. మనిషి పెరుగుతున్న కొద్దీ, ఈ 'నేను' యొక్క స్వరూపము మారుతూ వుంటుంది. ఉదా: పదేళ్ళ క్రిందట నువ్వు ఏ విధంగా వున్నావో తలచుకొంటే నీకీ విషయం స్పష్టమవుతుంది. అనగా వయస్సును బట్టి ఈ 'నేను' మారుతూ వుంటుంది. అటులగాక వయస్సుతో సంబంధం లేకుండా నీలో శాశ్వతంగా వుండే వస్తువు ఒకటి వుంటుంది. అదేమిటో నీవు శోధించి కని పెట్టి దానిని అర్థం చేసుకోవాలి. ఈ ప్రతిక్రియ నిన్ను చాలా దూరం తీసుకొని వెళ్ళగలదు. ఈ వేర్వేరు అంశములకు – ఆలోచనలు, సంవేదనలు – శరీరం మీద వాటి ప్రభావము, వాటి మీద శరీర ప్రభావము – వీటికి గల సంబంధమును పరిశీలించి తెలుసుకోవాలి. మరియు వీటి అన్నింటి ద్వారా శాశ్వతంగా ప్రకాశించే 'నేను' ఎవరు? నీలో దాని కదలికలను గమనించి నిదానంగా పరిశీలించినట్లైతే నీవు చాలా దూరం వెళ్ళగలవు. పట్టుదలతో నీవీ ప్రక్రియను కొనసాగించినట్లైతే తప్పకుండా నీ చైత్యాత్మను చేరుకోగలవు.

నీ చైతన్యమును చేరుకోగలిగిన మార్గమిదే. అనుభూతి ఇదే. ప్రథమ స్పర్శ యిదే. ఒకసారి ఈ స్పర్శ కలిగినట్లైతే శాశ్వతమైన నీ అమర రూపంతో సంబంధం ఏర్పడినట్లయితే, ఈ ఆమరణ రూపం ద్వారా ఇంకా దూరం పోయి భగవంతుడిని కూడ కలుసుకోగలవు.

*

ఈ విధమైన చైత్యజీవనము (psychic life) భూలోకం మీదనే సాధ్యము – దైవము పదార్థాన్నికూడ జాగృతము చేసి దానిని

తన దివ్యమూలముతో ఐక్యము జేసే ప్రక్రియ. చైత్యాత్మ (psychic) లేనిదే పదార్థము అచేతనములో నుంచి మేలుకొనే అవకాశమే లేదు. తన జన్మస్థానం కోసం, ఆధ్యాత్మిక జీవితం కోసం ఆకాంక్షించేదే కాదు. మానవునిలో ఆధ్యాత్మిక ఆకాంక్ష యొక్క అభివ్యక్తియే చైత్యపురుషుడు (psychic being).

ఎక్కడైనా ఆకాంక్ష వున్నట్లయితే దానికి మూలము చైత్య ప్రకాశమే. చైత్యము గాని, దాని ప్రభావముగాని లోపించి నట్లైతే అభివృద్ధి అసంభవము. దాని కోసం పాకులాట కూడ ఉండదు.

అనువాదం: సంపాదకుడు

పరమ ప్రయోజనము

శ్రీమాత ప్రవచనములు

పిల్లలకు అనేక విషయాలను గురించి బోధించి వాళ్లను ఉక్కిరిబిక్కిరి చేస్తే ఇక ఆత్మవిచారణకు, ఆత్మజ్ఞానానికి అవకాశమెక్కడిది? విషయపరిజ్ఞానాన్ని పిల్లలు ఎప్పుడు పడితే అప్పుడే పుస్తకాలు చదివి పొందగలరు. నిజానికి వారు సాధించవలసినది – జీవితమును గురించి లోతుగా అధ్యయనము చేసి, సృష్టి ఆంతర్య మును గురించి తెలుసుకొని, జీవితము యొక్క నిజ స్వరూప మును ఎరిగి జీవితమును చేతనా పరిపుష్టము గావించుట.

– అనువాదకుడు

లౌకిక విజయము కాదు మన లక్ష్యము. ఆత్మవిద్య పరీపాకము.

*

జీవితము యొక్క లక్ష్యము లౌకిక ప్రయోజనములు సాధించి పేరు ప్రతిష్ఠలు సంపాదించుట కాదు. ఆత్మజ్ఞానమును పొంది పరమ ప్రయోజనమును సాధించుట.

*

నీలోని వేర్వేరు విభాగములు

నువ్వు అభివృద్ధి చెందాలంటే నీలోని వేర్వేరు విభాగములను, వాటి పాత్రలను గురించి తెలుసుకోవాలి. అప్పుడు నీ మనస్సులో మెరిసే ఆలోచనలకు మూలకారణా లేమిటో తెలుసుకోగలవు. అటులనే నీలోని కదలికలకు, ప్రేరణలకు మూలకారణాలను గురించి స్పష్టంగా తెలుసుకోగలవు.

*

ఆత్మవిశ్వాసము

తనను గురించి తెలుసుకొని తనను తాను అదుపుచేసుకొనుట ప్రతి ఒక్కరు తెలుసుకోవలసిన విషయము. తనను గురించి తాను తెలుసుకోవటమంటే ఏమిటి? తన కదలికలకు, స్పందనలకు, ప్రతిస్పందనలకు మూలకారణ మేమిటో, తనలో ఎందుకని ఇలా జరుగుతోందో తెలుసుకొనుట. తనను తాను అదుపులో పెట్టుకొనుట అనగా తను చేయదలచుకున్న పనులు మాత్రమే చేయుట. ఇంద్రియాలకు లొంగి ఇతరుల చేత ప్రేరేపింపబడకుండుట.

తమను తామెరిగి అదుపులో పెట్టుకొనుట ఎటులో నేర్పుట పిల్లలకు మన మివ్వగలిగిన చక్కని బహుమానము.

*

నిన్ను నీవు అర్థం చేసుకోవాలి

తమను తాము తెలుసుకొని తమ భవిష్యత్తును తామే ఎంచుకొని తమ మార్గములను తామే నిర్ణయించుకొనుట ఇవీ పిల్లలకు ముఖ్యంగా నేర్పవలసిన విషయములు. వాళ్లను వారు పరిశీలించుకొని అంతరంగంలోకి చొరబడి వాళ్ల అంతరంగిక సూచనల ననుసరించి ప్రవర్తించాలి. అంతేగాని ఈ భూమి ఎప్పుడు పుట్టిందో, భూలోకంలో ఇంతకు ముందర జరిగిన విషయాలను గురించి తెలుసుకొనుట కాదు. ప్రాపంచిక జీవితానికి అవసరమైన జ్ఞానాన్ని పొందవచ్చు – లేని యెడల “వీడు వట్టి మూర్ఖుడు వీడికేం తెలియదు” అని ఆక్షేపిస్తారు.

అయినప్పటికి ఈ విధమైన సమాచారాన్ని ఎప్పుడు కావాలంటే అప్పుడు పుస్తకాలు చదువుకొని తెలుసుకోవచ్చు.

దాని కోసం పాఠశాలకు పోనవసరం లేదు. లౌకిక విషయాలను గురించి తెలుసుకునేందుకు కావలసినన్ని పుస్తకాలు వున్నాయి.

నీకు నిజంగా ఏమి కావాలో తెలుసుకోవటం అంతకంటె చాలా ముఖ్యం. దానిని గురించి తెలుసుకోవాలంటే నీకు కొంచెం స్వేచ్ఛ కావాలి. బలవంతంగా అనేక విషయాలను గురించి చదువు కోవలసి వస్తే ఇక నీ బుర్రలో ఖాళీ వుండదు. నువ్వు ఆసక్తి కరంగా నీ ప్రాణం పెట్టి నేర్చుకోవటం అంటూ వుండదు.

*

చౌకబారు వాదనలు

గత నూరు సంవత్సరాలుగా "ఉప యోగతా వాదము" అనే విచిత్ర వాదన ఒకటి బయలుదేరింది. నేడు పరాకాష్ఠకు చేరుకుంది. దీని ప్రకారం మనుషులు, వస్తువులు, పరిస్థితులు, సన్నివేశములు – వీటి విలువ వాటి ఉపయోగత్వాన్ని బట్టే వుంటుంది. ఉపయోగత్వమే ఒక వస్తువు యొక్క ప్రమాణమన్న మాట. అయితే నిరుపయోగమైన దానికంటె ఉపయోగమైన దాన్ని కోరుకోవటంలో తప్పు లేదు – ఉపయోగమనగా ఎవరికి? దేనికి? ఎందుకు?

ధనకాంక్ష నాగరికతా లక్షణమా?

నేటి కాలంలో 'ధన మూల మిదం జగత్' ధనాన్ని ఆర్జించే వస్తువులు, సాధనములు మాత్రమే జీవిత పరమావధి అని తాము నాగరీకులమనే వర్గముల వారి వాదన. ప్రతిదాన్ని ధనదృష్టితో చూసి విలువ కట్టుట – దీనినే నేను ఉప యోగవాదనంటాను. ఇది ఒక అంటువ్యాధి లాంటిది. పిల్లలు కూడా దీని వలన పీడితులే.

పిల్లలపాలిట శాపము

అందమైన వస్తువులను గురించి కలలు కనవలసిన లేత వయస్సులో పిల్లలు కూడ ధనరాసులను గురించి ఆలోచించటం, వాటిని ఎలా సంపాదించాలి అని తాపత్రయపడుతూ వుండటం శోచనీయం. ఇది పెద్దవాళ్ల కర్థమయే విషయము కాదు.

అందుకని ఏది చదువుతే లాభముంటుందో, ఏ విషయం అధికంగా డబ్బు సంపాదించేందుకు పనికివస్తుందో అనే దృష్టే వాళ్లకుంటుంది.

ఇక పరీక్షల సంగతి సరే సరి. వాటికి కట్టటం, ఉత్తీర్ణులు కావటం, మంచి రాంకులు తెచ్చుకోవటం, డీగ్రీలు డిప్లొమాలు, సర్టిఫికేట్లు సంపాదించుకొని మంచి ఉద్యోగాలలో జేరి డబ్బు సంపాదించటం - చదువువలన ఇంతకంటె వేరే ప్రయోజనము లేదు!

జ్ఞానము యొక్క లక్ష్యము జ్ఞానమే

జ్ఞానాన్ని జ్ఞానం కోసమే అన్వేషించటం, సృష్టిరహస్యాలను, ప్రకృతి ఇంద్రజాలమును గురించి తెలుసుకోవటం, చేతనాభివృద్ధి కోసం చదువుకోవటం, క్రమశిక్షణతో ఆత్మనిగ్రహాన్ని పొందటం మనిషిలోని బలహీనతలను, అశక్తతను అజ్ఞానాన్ని జయించటం ఇంతకంటె అద్భుతమైనది, మహత్తరమైనది, విశాలమైనది, సత్యమైనది అయిన లక్ష్యం కోసం సంసిద్ధులవటం ఇవే కదా పిల్లలకు నేర్పవలసిన విద్యాసాంస్కృతిక విషయాలు.

*

సర్వసాధారణంగా చదువు సంస్కారము మనిషిని వాంఛాలోలత్వము నుండి, పాశవిక ప్రవృత్తుల నుండి రక్షించేందుకు ఉపయోగపడతాయి. అయితే కోరికలను, ఆవేశములను పూర్తిగా రద్దు చేయుటం మంచిది కాదు. అటుల చేసిన యెడల మనిషి నిర్జీవమైన కొయ్యబొమ్మ అయిపోతాడు. వాటిని సంస్కరింప జేసి, పరిశుద్ధము గావించినట్లయితే అవి కూడ అభివృద్ధికి సాధనములుగా ఉపయోగపడతాయి. అటుల జేయుట కూడ మానవుని విద్యా సంస్కృతుల లక్ష్యమే.

*

బంగారు భవిష్యత్తుకు ద్వారము

మన విద్యావిధానంలో ప్రపంచంలో ఇంతవరకు జరిగిన అనేక విషయాలను గురించి నేర్పుతారు. ఈ విద్య నేటి ప్రపంచ పరిస్థితిని అర్థం చేసుకునేందుకు పనికి

వస్తుంది. కాని మీరు ఒక విషయాన్ని గురించి జాగ్రత్త పడాలి. ఈ పురాతన చరిత్రను గురించి తెలుసుకున్న పిల్లలు జీవితమంటే ఇదే కాబోలు అని అనుకొనే ప్రమాదమున్నది. గత చరిత్ర నేటి జీవితానికి సన్నద్ధమయ్యేందుకు ఉపయోగిస్తుంది. నేడు జరుగుతున్నదంతా భవిష్యత్ జీవితానికి బాటవేయుటకు సాధనము. ఈ బంగారు భవిష్యత్తుకు సంసిద్ధమవుటయే మన ముఖ్య కర్తవ్యము. It is by cultivating intuition that one prepares to live for the future.

*

చదువనగా పుస్తక జ్ఞానమే కాదని, జీవితంలో మనకు కలిగే ప్రతి అనుభవము, ఎదురయ్యే ప్రతి ఒక సన్నివేశము మనకు పాఠాలు నేర్పేందుకు అమూల్యమైన అవకాశాలని పిల్లలకు మనం ముఖ్యంగా బోధించాలి. సర్వదా, సర్వథా, అన్ని పరిస్థితులు మన జ్ఞానాన్ని పెంపొందించుకుండేందుకు అమూల్యమైన అవకాశములే.

*

పిల్లలకు ముఖ్యంగా నేర్పవలసిన విషయాలు:

1. చిత్తశుద్ధి – the necessity of absolute sincerity
2. సత్యము యొక్క అంతిమ విజయమునందు విశ్వాసము.
3. అభివృద్ధి పొందుట తథ్యం – అదే మన నిరంతర వ్యాపకం.

ప్రియమైన స్వభావము, న్యాయబుద్ధి, నిజాయితి.
శాంతము, సహనము, పట్టుదల
సమత్వము, ధైర్యము, సంతోషము

*

ముఖ్యంగా రెండు విషయాలను గురించి పిల్లలకు చెప్పాలి.

1. అబద్ధాలు పూర్తిగా నిషేధము.
2. కోపతాపాలు, హింసాకాండ పనికిరావు.

ఈ రెండింటిని బోధించ గలుగుతే వాళ్లు అతిమానస దిశగా పయనించ గలుగుతారు. అతిమానవుడు (Superman) అని పిలవబడే స్థాయి నందుకునేందుకు ఈ రెండు లక్షణాలు – అబద్ధాలు చెప్పకుండా ఉండటం, తనను తాను అదుపు చేసుకోగలగటం

తప్పనిసరి. దైవము యెడల సంపూర్ణమైన భక్తి చివరి షరతు. కాని మొదటి రెండు లక్షణాలు వుండితీరాలి.

*

మానవ జీవితంలోని ఐదు అంగములకు సంబంధించిన ఐదు విద్యలు[1] – భౌతిక, ప్రాణిక, మానసిక, చైత్య, ఆధ్యాత్మిక విద్యలు పూర్ణవిద్యలో వుండాలి. పిల్లలు పెరుగుతున్న కొద్ది వీటిని అదే వరుసలో క్రమక్రమంగా బోధించాలి. అయితే రెండవ దశలో మొదటిది కూడ – ప్రాణిక దశలో భౌతికము కూడ – అదే విధంగా ఈ ఐదు విద్యలు పరస్పర పూరకాలుగా జీవితాంతం కొనసాగ వలసిందే.

అనువాదం: సంపాదకుడు

చైతన్యము, దాని ఉపకరణాలు

శ్రీమాత ప్రవచనములు

విద్య అనగా కేవలం మెదడును పదును పెట్టుటమే కాదు. అది కేవలం ఆలోచనలకు ఆలవాలం మాత్రమే. రసజ్ఞతకు మూలం హృదయం. క్రియాశీలతకు ప్రధానం ప్రాణికం. కర్మలు చేయునది భౌతిక శరీరము. ఈ నాలుగు విభాగములకు తగిన శిక్షణ ఇచ్చి చక్కగా తీర్చునది విద్య. ఒక సంగీత విద్వాంసుడు వీణ తంతులను మీటి మధుర సంగీతమును ఎటుల ఆలపించునో అటులనే ఆత్మచైతన్యము సుశిక్షితమైన ఉపకరణం ద్వారా మంచి ఫలితములను ఇచ్చి అద్భుతమైన కార్యములను సాధించగలదు.

– సంపాదకుడు

---

[1] ఈ ఐదు విద్యలను గురించి శ్రీమాతారవిందులు చేసిన వివరణలను *"On Education: Sri Aurobindo and the Mother"*. అనే ఆశ్రమ ప్రచురణలో చూడవచ్చు.

ముఖ్యంగా రెండు విషయాలు మనం పరిశీలించవలసి యున్నది. చైతన్యం, చైతన్యాన్ని అభివ్యక్తపరచే ఉపకరణాలు: ఆలోచనలను ఉత్పత్తి చేసే మనోమయ చైతన్యం; భావాలను, సంవేదనలను ఉత్పత్తి చేసే భావోద్వేగ చైతన్యం; కార్యాచరణ శక్తిని ఉత్పత్తి చేసే ప్రాణిక చైతన్యం; కర్మలను ఆచరించే భౌతిక చైతన్యం.

ఉపకరణాల పాత్ర

కొంతమంది సూక్ష్మ బుద్ధులుంటారు. సాధారణ వస్తువులతోటి కూడ రమణీయమైనదేదో సృష్టిస్తారు. మేలురకమైన ఉపకరణాలను ఇస్తే, ఇంకా అద్భుతమైన శిల్పాలను సృష్టిస్తారు. ఒక గొప్పగాయకుడ్ని గూర్చి ఆలోచిద్దాం. పనికిరాని పియానో పై – దానిమీది శబ్ద సంకేతాలు మాసిపోయినా కూడా అతను కమనీయమైన సంగీతాన్ని సృష్టిస్తాడు. కాని అతనికో శ్రుతి చేసిన మంచి పియానో ఇస్తే, ఇంకా అద్భుతమైన సంగీతాన్ని సృష్టించగలడు. రెండు సందర్భాలలోని మూలచైతన్యమూ ఒక్కటే. కాని అభివ్యక్తీకరణకు చక్కటి ఉపకరణాలు – మానసిక, ప్రాణిక, చైత్య (psychic) భౌతిక శక్తియుక్తులు అవసరం.

భౌతికంగా నువ్వు అధ్వాన్నంగా నిర్మించబడితే, అధ్వాన్నంగా శారీరక స్థితి ఉంటే, అంటే శారీరక సౌష్ఠవం సరిగా లేకపోతే, మంచి శిక్షణ ఇచ్చినా వ్యాయామం చేయడం నీకు కష్టతరమవుతుంది. అది మంచి సౌష్ఠవం గల శరీరంతో శిక్షణ బాగా పొందడం లాంటిది కాదు.

మేధా సంపత్తి ఆవశ్యకత

మనస్సు విషయంలో కూడా అంతే – చక్కని ఆలోచనలతో వివేచన ఉన్న నిండు మనస్సు, సంపూర్ణమైన, సుశిక్షితమైన, సంస్కారం గల మనస్సువున్న వ్యక్తి తనను తాను – అధ్వాన్నమై, సర్వసాధారణమైన వ్యక్తి కన్నా ఉత్తమంగా అభివ్యక్తం చేసుకోగలడు. ముందుగా నీ చైతన్యాన్ని వివేకవంతం చేసుకోవాలి. నీ గూర్చి ఎరుకను నీవు అభివృద్ధి చేసుకోవాలి. నీ ఆదర్శం

వెలుగులో నీ చైతన్యాన్ని చక్కదిద్దుకోవాలి. కాని అదే సమయంలో నీ శరీరంలో వున్న ఉపకరణాలను నిర్లక్ష్యం చేయవద్దు.

*

ప్రాపంచిక దృష్టి, దివ్యమైన ఆదర్శము రెండూ అవసరమే

నిజం చెప్పాలంటే, విద్యకు సంబంధించిన రెండు దృక్పథాలను ఒక దానితో పాటు మరొక దానికి ప్రోత్సాహం ఇవ్వాలి. అద్భుతావహమైన దేని కోసమో తీరని దాహం, దానిని సిద్ధింప చేసుకోవడం అసాధ్యమే కావచ్చు, దివ్యత్వ భావంతో నిన్ను ఆవరించే దాని కోసం తహతహ: అదే సమయంలో ప్రపంచం గూర్చి అవగాహనలో సరియైన, ఖచ్చితమైన, నిజాయితీతో కూడిన దృక్పథాన్ని ప్రోత్సహించాలి. పనికిరాని ఊహాగానాల్ని అణచివేయడం, నిరంతర నియంత్రణ, ఖచ్చితమైన వివరాల సేకరణకు అత్యున్నత రీతిలో ఆచరణాత్మకమైన, సునిశితమైన అవగాహన అవసరం. ఈ రెండు దృక్పథాలు ఒకదాని వెంట మరొకటి ఉండాలి. మరొక దానిని పెంచి పోషించడానికి ఒకటి అవసరమన్న భావనతో దానిని తుడిచి పెడుతూంటాం. ఇది పూర్తిగా తప్పు. రెండూ ఒకదాని సరసన ఒకటి ఉండవచ్చు. అవి ఒకే విషయానికి సంబంధించిన రెండు ముఖములని తెలుసుకోగల జ్ఞానం మనలో వృద్ధి చెందిన సమయం వస్తుంది. ఆ విషయాన్నే సమున్నతమైన వివేచన, అంతర్‌దృష్టి (insight) అంటాము. కాని సంకుచితమైన, పరిమితమైన అంతర్ దృష్టి, వివేచన కాకుండా, ఆ వివేచన ఖచ్చితమైనదిగా, సరియైనదిగా, నిజాయితీతో కూడినదిగా మారుతుంది. కాని అది సువిశాలం. స్థూల ప్రపంచానికి (అభివ్యక్తీకరణ) చెందని ఒక సర్వ సామ్రాజ్యం అందులో నిక్షిప్తమై వుంటుంది.

విద్యను దృష్టిలో పెట్టుకుంటే, ఇది చాల ముఖ్యమైనదనే చెప్పాలి. ఎటువంటి అలంకారాలు లేని, స్థూల దృష్టితో, వాస్తవ నేత్రంతో ప్రపంచాన్ని ఉన్నది ఉన్నట్లుగా సూటిగా పరికించడం, అత్యంత స్వేచ్ఛాయుతమైన, మహోన్నతమైన దర్శనం (vision) తో, పరిపూర్ణమైన ఆశతో, ఆకాంక్షతో, అద్భుతమైన కృతనిశ్చయ

భావంతో ప్రపంచాన్ని వీక్షించడం – వివేచనకు ఇవి రెండు ధృవాలు.

అత్యంత మహోజ్వలమైన, అద్భుతావహమైన, అత్యంత శక్తిమంతమైన, అత్యంత భావ ప్రపూర్ణమైన, సర్వసమగ్రమైన విషయాలను మనం ఊహిస్తాం. కాని నిజానికి వాటి అసలు అభివ్యక్తి రూపంతో పోలిస్తే అవి గణనీయం కావు. అలాగే అత్యంత సూక్ష్మమైన వివరాల విషయంలో మన సునిశితమైన అంచనాలు ఖచ్చితమైనవి కాకపోవచ్చు. ఈ రెండు దృక్పథాలు కలిసికట్టుగా పయనించాలి. ఒకే వ్యక్తి 'దీనిని' (క్రింది వైపునకు చేతితో సంజ్ఞ), 'దానిని' కూడ తెలుసుకున్నప్పుడు (పైకి చేతితో సంజ్ఞ) రెండిటినీ సమన్వయం చేయగలడు.

అనువాదం: యజ్ఞన్న

బోధననగా పాఠాలు నేర్పటమేనా?

శ్రీఅరవిందుల ప్రవచనములు

విద్య అనగా మెదడులోకి సమాచారమును గుప్పించడం కాదు – లోన దాగియున్న జ్ఞానమును వెలికి దీయుట. ఒక పుష్పమును వికసింప జేయుట. మల్లెమొగ్గ విచ్చినప్పుడు మల్లెవాసన గుబాళిస్తుంది. ఇది ఎక్కడి నుంచి వచ్చింది? బయటనుంచి కాదు గదా – లోపలే దాగి ఉన్నది. మనిషి విషయంలో కూడ అంతే. ఉపాధ్యాయుడు జ్ఞానాన్ని బోధించడు. జ్ఞానాన్ని ఎలా సంపాదించాలో చూపిస్తాడు. అంతరంగంలో దాగివున్న చైతన్యమును త్రవ్వి బయటకు రప్పించుటయే ఉపాధ్యాయుని కర్తవ్యము. అసలైన గురువు లోపలే దాగి వున్నాడు. పిల్లలకు ఎట్టి విషయాలు బోధించాలో పెద్దవాళ్లు నిర్ణయించటం చాలా అపచారం, కృత్రిమం. ప్రతి ఒక్కడు వాని స్వభావమును బట్టి, వాని ప్రకృత్యానుసారముగా ఎదగాలి. అప్పుడే ఈ సృష్టిలోని వ్యక్తులందరువారి వారి కార్యములను స్వధర్మానుసారముగా, నిర్వహించి కృతకృత్యు

లవుతారు. అటుల చేయని యెడల వారి వికాసానికి అడ్డుపడి వారి ఆత్మలకు ద్రోహం చేసినట్లే. దైవ నిర్ణయాన్ని ఖండించి సృష్టి పరిణామానికి ఎదురు తిరిగినట్లే. – సంపాదకుడు

మన గురువు లోన దాగి యున్నాడు

ఏదైనా ఒక విషయాన్ని బోధించాలి అంటే, దానికి సంబంధించిన జ్ఞానం ఆ జీవుని ఆత్మలో నిక్షిప్తమై ఉండాలి. లేనిచో ఆ విషయాన్ని మనస్సుకి పట్టించలేము. అదే విధంగా బాహ్యమానవుని పరిపూర్ణ సామర్థ్యం అంతా అతనిలో నిబిడీకృతమై ఉన్న దివ్య పరిపూర్ణ చైతన్యం యొక్క విన్యాసం మాత్రమే.

దివ్యత్వం అంటే ఏమిటో మనకు తెలుసు. దివ్యత్వాన్ని సంతరించుకోవడమూ తెలుసు. ఎలా తెలుసు? మన అంతరాంతరాల్లో ఉన్న యథార్థం అదే కాబట్టి!

బోధన అంటే ఏమిటి?

బహిర్గతం చేయడం. బయట విషయాన్ని లోపలికి పంపడం కాదు. లోపలి విషయాన్ని త్రవ్వి బయటకు తీసికొని రావడం. ఆత్మవికాసమే దాని అసలు రహస్యం. ఆత్మజ్ఞానం, చేతనా పర్యాప్తి దాని సంవిధానములు.

"దేనినీ బోధించలేము" అనేదే నిజమైన బోధనకు తొలి సూత్రం.

ముకుళితమైన దానిని వికసింప జేయుట

ఉపాధ్యాయుడు బోధకుడు కానే కాడు. పురమాయించే అధికారీ కాడు. కేవలం ఓ సహాయకుడు; ఓ మార్గదర్శి. సూచనలు ఇవ్వడమే తప్ప బలవంతంగా రుద్దడం కాదు ఆయన పని. ఆయన నిజానికి శిష్యుని మనస్సుకి ఎటువంటి శిక్షణా ఇవ్వలేడు. జ్ఞానోపకరణాలకు సానపెట్టి వాటి నుండి చక్కటి ప్రయోజనాలను పొందడం ఎలాగో సూచిస్తాడు. ఆ ప్రక్రియలో సహకరిస్తాడు; ప్రోత్సహిస్తాడు. అంతేకాని శిష్యునికి ఏ జ్ఞానాన్ని సమకూర్చడు. జ్ఞానాన్ని స్వయంగా సంతరించుకోవడం ఎలాగో చూపిస్తాడు. శిష్యునిలో నిబిడీకృతమై ఉన్న

జ్ఞానాన్ని బహిర్గతం చేయడం కూడా ఆయన వల్లకాదు. లోలో పల జ్ఞానం ఎక్కడ ఉందో చూపించి, దానిని బయటకు పొంగులు వారేలా చేసుకునే సాధనను తెలియ జేస్తాడు.

ఈ ప్రత్యేక సూత్రం కేవలం కౌమార దశలో ఉన్న వారికి, యువకులకు మాత్రమే వర్తిస్తుందే తప్ప చిన్న పిల్లలకు వర్తించదు అని ఎవ్వరైనా అనుకుంటారేమో. పసివారైనా సరే పెద్ద వారైనా సరే! బాలుడు అయినా సరే, బాలిక అయినా సరే సూత్రం ఒకటే! ఎటొచ్చీ సహాయకార్యక్రమాలలో హెచ్చుతగ్గులుండవచ్చు అంతే.

ఇక రెండో సూత్రం –

మనోవికాసం అనేది మనోభీష్టం ప్రకారమే జరగాలి. తల్లి దండ్రుల కోరిక మేరకో, ఉపాధ్యాయుని ఇష్టప్రకారమో పిల్లల్ని బలవంతంగా రూపుదిద్దాలనే అభిప్రాయము అనాగరికం, అవివేకం, మూర్ఖత్వం.

ఎవరి సహజ లక్షణానికి తగ్గట్టు వారే స్వీయ అభి వృద్ధిని నిర్ణయించుకోవాలి.

స్వధర్మము ననుసరించుట

తమ పిల్లలు ఏ లక్షణాలను అలవరచుకోవాలో, ఏ రకంగా అభివృద్ధి చెందాలో, ఎటువంటి సామర్థ్యాన్ని సంతరించుకోవాలో, ఎటువంటి ఆలోచనలు కలిగి ఉండాలో, ఏ జీవన మార్గం అనుసరించాలో ముందే తాము నిర్ణయించడం కంటె ఘోరమైన తప్పిదం మరోటి ఉండదు.

తన సహజ లక్షణాన్ని బలవంతంగా అణచివేస్తే, స్వీయ ధర్మాన్ని వదులుకొనేలా చేస్తే, అది అతనికి శాశ్వతమైన కీడే అవుతుంది. ఆతని పరిపూర్ణతను సర్వనాశనం చేయడమే అవు తుంది. అటువంటప్పుడు అది మానవ ఆత్మ పట్ల స్వార్థ నియం తృత్వ దాడే కదా! ఫలితంగా మనిషి తన జాతికి సమర్థవం తంగా ఇవ్వగలిగే దానిని ఇవ్వలేడు. కాబట్టి ఇది సమాజ ప్రయో జనానికి పెద్ద విఘాతమే!

మనస్సుపై జరిగే ఈ బలవంతపు దండయాత్ర సంపూర్ణత్వాన్ని, సహజత్వాన్ని నాశనం చేసి, అసంపూర్ణ, కృత్రిమమైన విషయాలను స్వీకరించేలా చేస్తుంది. నాసిరకం సామాన్య విషయాలను సైతం యాంత్రికంగా అంగీకరించేలా ఒత్తిడి చేస్తుంది.

స్వీయ ప్రకృతిని పాటించుట

ప్రతి వ్యక్తిలోను కొంత దైవాంశం ఉంటుంది. కొంత స్వీయ ప్రత్యేకతా ఉంటుంది. మనం ఉపయోగించుకున్నా, మానినా భగవంతుడు మాత్రం మనకు సామర్థ్యాన్ని, కౌశలాన్ని కొద్దో గొప్పో ప్రసాదిస్తాడు.

భగవంతుడు ప్రసాదించిన ఆ సంపదను కనుక్కొని అభివృద్ధి చేసుకుని, ప్రయోజనకరం చేసుకోవడమే మన విధి.

ఆత్మ తనకు తానే అభివృద్ధి చెందుతూ ఉదాత్త అభిరుచిని అలవరచుకుని అది ఉత్తమ కార్యానికి ఉపయోగపడేలా పరిపూర్ణతను సంతరించుకోవడానికి సహాయపడడమే విద్య ప్రధాన ఆశయం.

సుదూర భవిష్యత్తు కోసం సన్నిహితంగా కృషి సలపడంతో పాటు ప్రస్తుతం ఉన్న దానినుండి ఉండవలసిన దాని కోసం సాధనను కేంద్రీకరించడం – ఇది విద్యకు మూడో సూత్రం.

ఆత్మకు గల గతమే మానవుని ప్రాతిపదిక అనవచ్చు. దానికి తోడు అతని వారసత్వం, మసిలే పరిసరాలు, నివసిస్తున్న దేశం, ఆహారం అందించే భూమి, పీల్చే గాలి, చూసే దృశ్యాలు, వినే శబ్దాలు, అలవాటుపడిన ఆచారాలు – ఇవి కూడా ప్రాతిపదికలే! ఇంద్రియాలకు అతీతంగా వాటి ప్రభావం ఉంటుంది కాబట్టి అవి మానవుణ్ణి శక్తివంతంగా మలుస్తాయి. నిజానికి వాటి ప్రభావంతోనే మనం మనుగడ ప్రారంభిస్తాం.

మన నైజాన్ని భూమినుండి సమూలంగా వేరు చేయకూడదు. ఎందుకంటే ఆ నైజం భూమి సంబంధంగానే పెరుగుతూ ఉంటుంది. జీవన ఆలోచనలు, దాని ప్రతీకలు మనస్సుని పెనవేసుకుని ఉంటాయి.

కాబట్టి బయటి నుండి కూడా లోపలికి గ్రహించడం కొంతవరకు అవసరం ఉంటుంది. అయితే అలా బయటినుండి ఏదైనా విషయాన్ని గ్రహించడం అనేది హాయిగా స్వీకరించేలా ఉండాలే తప్ప మనస్సుపై ఒత్తిడితో కాదు.

నిజమైన వికాసానికి ఏ ఒత్తిడులు లేని స్వేచ్ఛతో సహజమైన ప్రగతి తప్పనిసరి.

పరిసరాలపై సహజంగానే ఎదురు తిరిగే ఆత్మలు కొన్ని ఉంటాయి. అవి మరో కాలానికి, మరో ప్రాంతానికి సంబంధించినవేమో అనిపిస్తాయి. అటువంటి వాటికి వాటి అభీష్టాన్ని అనుసరించే స్వతంత్రం ఇవ్వాలి. అలా కాకుండా వాటికి సంబంధం లేని విధంగా, కృత్రిమంగా మలిచినప్పుడు చాలా ఆత్మలు కృశించి పోతాయి. శూన్యం అవుతాయి. కృత్రిమంగా తయారౌతాయి. వారు ఆ రకంగా నిర్ణీతమైన జాతికి, కాలానికి, సమాజానికి చెంది ఉండాలనేది భగవంతుని ఏర్పాటు. అటువంటివారు భూతకాలం ముద్దుబిడ్డలు, వర్తమానం భాగస్వాములు, భావి సృష్టికర్తలు!

గతించిన కాలం మనకు పునాది వంటిది. వర్తమానం సంపద, భవిష్యత్తు మన ధ్యేయమూ గమ్యమూను.

*

ఉపాధ్యాయుని పాత్ర

ఎదురు చెప్పకుండా అంగీకరిస్తున్నాడు కదా అని పసివాడి మనస్సుపై తన ఆలోచనలను, అభీష్టాలను రుద్దాలని వివేకవంతుడైన ఏ గురువూ ఆశించడు.

అంతర్గతంగా దివ్యరక్షణలో వృద్ధిచెంది, కచ్చితంగా ఫలించే బీజాలను మనస్సుకు అందిస్తాడు గురువు. ఆదేశం ఇవ్వాలని కాకుండా, అవగాహన కలిగించాలనే ఆయన ఆశిస్తాడు.

సిద్ధాంతపరమైన ఓ సూత్రంగాను, చర్విత చర్వణం అయ్యే పద్ధతిలాగాను కాకుండా సహజమైన ప్రక్రియలో స్వేచ్ఛాపూరితమైన వికాసంతో శిష్యుని నైపుణ్యాలు, అనుభవాలు పెంపొందాలన్నదే ఆదర్శ గురువు అభిమతం. సహకరించే ఒక

విధానాన్ని ఆయన సూచిస్తాడు. ప్రయోజనకరమైన పరికరాన్ని అందిస్తాడు.

అంతే కాదు, ఆ విధానాలు లక్ష్మణరేఖలుగా మారకుండా, యాంత్రికమైన ప్రక్రియలు కాకుండా గురువు జాగ్రత్తపడతాడు. ఆదర్శ గురువు చేయవలసిన పని అంతా – దివ్యతేజస్సును చైతన్యవంతం చేయడం, దివ్యశక్తి కార్యరూపం దాల్చేలా చూడ్డమూ – అంతే!

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు

విద్య – ఒక ప్రసంగము

శ్రీమాత ప్రవచనములు

విద్యావిధానంలో శ్రీమాత చాలా విప్లవాత్మకమైన మార్పులను ప్రవేశపెట్టారు. ముఖ్యంగా లౌకికవిద్య వేరు, ఆధ్యాత్మికవిద్య వేరు అనే వాదన సరికాదనియు, చరిత్ర, కళలు, విజ్ఞానశాస్త్రము మొ॥ విషయాలను కూడ ఈ విశాలమైన దృక్పథంతోనే బోధించాలనియు వారి అభిమతము. పిల్లలకు ఆధ్యాత్మికవిద్య పేరుతో రామాయణ, భారతాల కథలను మాత్రమే బోధించటం సరి కాదు.

– సంపాదకుడు

బోధనా విషయాలను గురించి ఒక టీచరు వేసిన ప్రశ్న:

"మేము భవిష్యత్తును గురించి చర్చించుకున్నాము. పిల్లలు అసలు ఇక్కడెందుకు చదువుకుంటున్నారో వాళ్లకి చెప్పాలని ఉంది. ఆధ్యాత్మిక విషయాలని బోధించినప్పుడు వాళ్లు అసలు వినిపించుకోరు. వాళ్లకది నవ్వులాటగా వుంటుంది. ఏమాత్రం గిట్టదు"

ఆధ్యాత్మిక విషయాలా – ఆధ్యాత్మిక విషయాలంటే అతని ఉద్దేశమేమిటి?

ఆధ్యాత్మిక విషయాలని సోదల్లే చెప్పుకుపోతున్నారేమో! ఇదెక్కడి సోద్యము ఆధ్యాత్మికమంటే వేరు, చరిత్ర అంటే వేరూనా. విజ్ఞానశాస్త్రమంటే వేరు, ఆధ్యాత్మికమంటే వేరూనా. ఇదెంత మూర్ఖత్వము. చరిత్ర విషయాలూ ఆధ్యాత్మికమే, విజ్ఞానశాస్త్రమూ ఆధ్యాత్మికమే. సకల విద్యలు శాస్త్రాలు ఆధ్యాత్మిక చైతన్యానికి ఆలంబనాలే! సత్యము ఇక్కడ ఉండటము, అక్కడ లేకపోవటము అంటూ వుండదు కదా. మీరందరూ మీ విధులను అంత అందంగా నిర్వహిస్తున్నారన్న మాట! ఆధ్యాత్మిక విషయాలను సక్రమంగా బోధించాలి అనే సంగతి మీ బుర్రల్లోకి ఎప్పుడెక్కుతుంది?

"తల్లీ, టీచర్లని వాళ్ళ వాళ్ళ సబ్జెక్టులని మాత్రమే నేర్పమంటే బాగుంటుందేమో? ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని గురించి మీరే బోధిస్తారు కదా!"

మళ్ళీ అదే మాట – చూడు బాబు, ఆధ్యాత్మిక జీవితం అనేది ఓ వింత ప్రక్రియ కాదు. ఇదంతా పాత సంప్రదాయం. ఆధ్యాత్మిక జీవితమంటే మఠాలు సన్యాసులు అని, మిగతా లోకమంతా మామూలు జీవితమని – ఇది నిజం కాదు. నిజం కాదు. కానే కాదు.

ఒక వేళ ఇటువంటి ద్వంద్వత్వమే కావాలనుకుంటే – ఈ మనస్సుకు అలా చెపుతేకాని అర్థం కాదులే – సత్యము, అసత్యము అని చెప్పవచ్చు. ప్రతి దానిలోను సత్యాసత్యములు మిళితమై వుంటాయి. తామే ఆధ్యాత్మిక జీవితాన్ని గడుపుతున్నామనుకుండే సన్యాసులు, మతగురువులు ఉంటారే – వాళ్ళందరిలోను కూడ సత్యాసత్యాలు ఒక దాంతో ఒకటి పెనవేసుకొని వుంటాయి.

ఈ వేర్పాటుభావము లేకపోతేనే మంచిది.

(నిశ్శబ్దము)

పిల్లలకి ఇలా బోధించాలి: ఇక ముందర చాలా అద్భుతమైన విషయాలు ఆవిర్భవించ నున్నాయి. వాటిని గ్రహించేం

దుకు మీరు సన్నద్ధులు కావాలి. శ్రీఅరవిందులు ఈ నైజాన్ని బోధించేందుకే వచ్చారు. వారి ప్రవచనాలను కనుక చదువు కున్నట్లయితే మీరే ప్రత్యక్షంగా తెలుసుకోగలరు.

ఈ టీచర్ల సమస్య ఏమిటో నాకు తెలుసు. వారు చెప్పే పాఠాలలోగాని చేసే ఉపన్యాసాలలోగాని ఏమాత్రము సాధనా నుభవం ఉన్నట్లు తోచదు. ఊరికే చదువుకుంటూ పోతే పిల్లలకే మాత్రం బోధపడదు సరికదా వాళ్లకు ద్వేషం కలగవచ్చు కూడ.

అవును అందుకనే కదా వాళ్లని నేను చెప్పినట్లు చేయా లనేది.

ఏమైనా సరే ఈ భేదభావాన్ని పోగొట్టాలి. వాళ్ల మనస్సు లలో పాతుకుపోయిన ఈ అభిప్రాయాన్ని తుడిచి పెట్టేసేయాలి. *ఆధ్యాత్మిక జీవితానికి లౌకిక జీవితానికి, ఆధ్యాత్మిక చైతన్యా నికి మామూలు చైతన్యానికి ఏమాత్రం భేదం లేదు. ఉన్నది ఒక్కటే చైతన్యము.*

కాని అది సాధారణంగా అందరిలోను వికారము చెంది వుంటుంది. నిద్రాణంగా వుంటుంది. తిరిగి ఆ అఖండ చైత న్యాన్ని ఎలా పొందాలి? ఈ చేతనాస్థాయిలో నుంచి ఆ స్థాయి లోకి అమాంతంగా దుమకలేవు. నీ మనోచైతన్యాన్ని (చేతితో పైకి సూచన) ఊర్ధ్వోన్మీలనము గావించాలి. నీ ద్వారములను ఆకాశం వైపు తెరచిపెట్టాలి. నిన్ను నీవు సత్యచైతన్య స్పంద నములతో నింపుకోవాలి. ఇక్కడ ఆవిష్కరింపనున్న సత్యముతో సమన్వయపరచాలి. పై లోకాలలో అది ఆదినుంచి వున్నది. కాని ఇహలోకంలో భవిష్యత్తులో రానున్నది. పాతకాలపు శైథి ల్యాలనే ఇంకా నువ్వు పట్టుకొని వేలాడుతూ వుంటే అదంతా నీ మెడ చుట్టూ ఓ గుదిబండలా తయారవుతుంది. దానిని నువ్వు కనుక విస్మరించక పోయావంటే ఒక్క అడుగు కూడ ముందుకు వేయలేవు జాగ్రత్త!

ఈ లోకము యొక్క గత చరిత్రను గురించి తెలుసుకో వటం మంచిదేకాని మనం దానికి బందీలయి పోకూడదు. అది

మన కాళ్లకు సంకెళ్లు కాకూడదు. భవిష్యత్తులోకి దూకేందుకు ఒక స్ప్రింగ్‌బోర్డుగా మాత్రమే దాన్ని ఉపయోగించాలి.

(నిశ్శబ్దం)

పిల్లలను పసివయస్సులోనే మొదలుపెట్టి బోధించే ఒక సరికొత్త విద్యావిధానాన్ని తయారు చేయాలి. అందుకు సమర్థ వంతమైన ఉపాధ్యాయులు కావాలి. సుశిక్షితులైన వారు కావాలి. ఇంతవరకు తెలిసిన సమాచారాన్నంతా రెడీగా పెట్టుకుంటే వాళ్లు పిల్లల ప్రశ్నలకు సమాధానా లివ్వగలుగుతారు. ఆ తరువాత మనస్సు కతీతమైన స్వతస్సిద్ధమైన జ్ఞానాన్ని ఎలా పొందాలో మొదట సిద్ధాంతపరంగా తెలుసుకోవాలి. అది అనుభవ పరీపాక మైన జ్ఞానంగా పరిణమిస్తే మరీ మంచిది. *కనీసం మనస్సును నిశ్శబ్ద పరచుకుంటేగాని జ్ఞానం పట్టుబడదు. అట్టి నిశ్చల మనస్సును ఊర్ధ్వోన్ముఖము చేసినప్పుడు పైనుంచి దిగివచ్చే జ్ఞానము సమర్థవంతంగా గ్రహించబడుతుంది.* ఈ సామర్థ్యాన్ని పిల్లలలో కలగజేస్తే మంచిది. యథార్థ జ్ఞానానికి మార్గమిదేనని ప్రత్యక్షంగా నిరూపించాలి. ముందు ముందు జ్ఞానాన్ని ఆర్జించ వలసిన పద్ధతి ఇదే. ముందుకు సాగిపోతున్నకొద్దీ మార్గము దానంతట అదే ఆవిష్కారమౌతుంది. పిల్లలకీ విషయం ముఖ్యంగా నేర్పాలి. ఏడేళ్లప్పుడు పిల్లలకు ఆలోచనాశక్తి కలుగుతుంది. ఈ నూతన విధానాలను వాళ్ల కప్పుడు సూచించాలి. 14, 15 ఏళ్ళు వచ్చేసరికి పూర్తిగా బోధించాలి. లోతైన జ్ఞానాన్ని పొందేందుకు ఇదే ఏకైక మార్గమనియు ఇతర మార్గములు నిష్ప్రయోజనముల నియు చెప్పాలి.

దీని వలన ఒక విషయము స్పష్టంగా తెలుస్తోంది కదూ. ఇది పుస్తకాలలో చూసి పిల్లలకు చెప్పటం వంటిది కాదు. పుస్త కాల్లోంచి బోధన చేసే వాడు ఈ జ్ఞానాన్ని బోధించలేడు. ఈ శిక్షణని వారు ముందరే పొంది సిద్ధపురుషులు కావాలి. ఈ విష యాన్ని మనం చాటించి చెప్పుకోముగాని ఈ విద్యను ఎలా గర పాలో మనం రుజువుచేసి చూపించాలి. మరో మార్గం లేదని, ఇదే ఏకైక మార్గమని నిరూపించాలి.

పిల్లలకు పసిడి వయస్సులో విద్య నేర్పటం ఎంతో అద్భుతమైన విషయం. నువ్వేమి చేయనక్కర్లేదు – it is enough to *be*. నువ్వు కొన్ని నియమాలను పాటించాలి.

ఎప్పుడూ తప్పు చేయకూడదు.

కోపం తెచ్చుకో కూడదు.

పిల్లల నర్థం చేసుకోవాలి.

కాబట్టి అసలు ఈ ఉద్యమానికి కారణము ఏమిటో, ఈ ప్రేరణకి హేతువు ఏమిటో నువ్వు స్పష్టంగా తెలుసుకోవాలి. పిల్లల ఆంతరంగిక స్వరూపాన్ని గురించి దేనిని ప్రోత్సహించాలో, దేనిని బలపరచాలో, దేనిని ముందుకు తీసుకురావాలో నువ్వు తెలుసుకోవాలి. *పిల్లలను వాళ్లంతట వాళ్లను వదిలేసేయాలి. వాళ్ళు స్వేచ్ఛగా వికసించేందుకు అవకాశమివ్వాలి. రకరకాల వస్తువులను చూసి, ముట్టుకొని అనుభవించి ఆడుకుండేందుకు అవకాశాన్ని కల్పించాలి.* పిల్లలలో జరిగే మార్పుల ఇంద్రజాలాన్ని నువ్వు గమనించాలి. అదెంత అద్భుతంగా వుంటుందో చెప్పలేను. అంతేగాని నీకే అన్నీ తెలిసినట్లు వాళ్లకి ఏవేవో గొప్పలు చెప్పి వాళ్ల నెత్తిమీద రుద్దకూడదు.

పిల్లలని కోప్పడి వాళ్ల సహజ స్వభావాన్ని అణచకూడదు. వాళ్ల నర్థం చేసికొని సమయ మొచ్చినప్పుడు వాళ్లకు నచ్చజెప్పవచ్చు. ఒక వేళ వాళ్లు వినిపించుకునే మూడ్‌లో లేకపోతే మాటలతో పనిలేకుండా అంతరంగిక స్పందనల ద్వారా వాళ్లని ప్రభావితం చెయ్యాలి. ఈ విధమైన శక్తి చాలా అరుదు.

ఉపాధ్యాయులకి కూడా ఓ చక్కటి శిక్షణా ప్రణాళికను తయారుచేస్తే బాగుంటుంది. *లేతవయస్సులో నవనీతము వలె మృదువుగా వున్న పిల్లలకు బోధించటం చాలా తేలిక. వాళ్లకి ఏది చెప్పినా అది వెంటనే లోతుగా నాటుకుంటుంది.* పసివయస్సులో బీజాలని నాటుతే వాళ్లు వెంటనే స్పందిస్తారు. వాళ్ల కళ్లు మెరుస్తాయి. వాళ్ల శరీరాల్లో చైతన్యం తాండవ మాడుతుంది. పెరుగుతున్న కొద్దీ పరిపక్వతచెంది శతదళ పద్మంగా వికసిస్తారు. పిల్లలలో జరిగే ఈ అద్భుతమైన ఇంద్రజాలాన్ని చూసి తీరాలి.

అనువాదం: సంపాదకుడు

ఏది మంచి బోధనా విధానము

శ్రీఅరవిందుల ప్రవచనములు

నేటి విద్యావిధానం హాస్యాస్పదము

అసంగతం అయ్యేదాకా భారతదేశంలో దిగజార్చుట జరిగిన ఆధునిక శిక్షణా విధానంలో ప్రముఖ లక్షణం. – ముక్కలు ముక్కలుగా బోధించే అలవాటు. అనేక విషయాలతో కలిసి ఒక విషయాన్ని కొద్ది కొద్దిగా బోధించటం జరుగుతోంది. ఫలితంగా ఒక సంవత్సరంలోనే చక్కగా నేర్చుకో గలిగినదాన్ని ఏడు సంవత్సరాలలో చెడ్డగా నేర్చుకోటం జరుగుతోంది. సరిగా సమాయత్తం కాకుండా అపరిపూర్ణమైన జ్ఞానఖండములు పట్టుకొని, మానవ విజ్ఞాన శాఖలలో ఏ ఒక్కదానిలోనూ ప్రావీణ్యం లేకుండా బాలురు బయటకు పోతారు. జాతీయమండలి అవలంబించిన విద్యావిధానం రెండు లక్షణాలు కలిగిన ఉభయచర సృష్టి. అట్టడుగునా మధ్యదశలోను ముక్కలుగా బోధించే పద్ధతిని ఉచ్ఛ స్థాయికి తీసుకొనిపోయి పైకొన దగ్గర అకస్మాత్తుగా ఆడంబరం కల ప్రత్యేకతా విధానంగా మార్చుచేయాలని ప్రయత్నిస్తుంది. అంటే త్రిభుజాన్ని శీర్షం మీద నిలబెట్టి అది అలాగే నిలబడి ఉంటుందని ఆశించటం అన్న మాట.

ఒకే విషయాన్ని క్షుణ్ణంగా బోధించుట

పాత పద్ధతి ఒకటి రెండు విషయాలను చక్కగా పూర్తిగా బోధించి ఆ తర్వాత ఇతర విషయాలకు పోవటం; నిస్సందేహంగా ఆధునిక విధానంకన్న అది చాలా హేతుబద్ధమైన విధానం. ఇంత వైవిధ్యంకల సమాచారాన్ని అది ఇవ్వలేదు, కాని ఇంతకన్న లోతైన, ఉన్నతమైన ఇంకా యథార్థమైన సంస్కృతిని అది నిర్మించింది. సాధారణ ఆధునిక మనస్సులో లోతులేని, బహువిషయాల మీద ప్రసరించే తేలికదనంతో, చంచలమైన మార్పు కలదిగా ఉండటం చాలావరకు ముక్కలుగా బోధించే దుష్టసూత్రం వల్లనే. పాతపద్ధతి మీద మోపగలిగిన ఒకే అభియోగం ఏమిటంటే, తరవాత విషయాల

మీద ప్రాబల్యం సంపాదించేటప్పుడు ఇది వరకు నేర్చుకొన్న విషయం విద్యార్థి మనస్సులో నుంచి తొలగిపోవచ్చు అని. కాని ప్రాచీనులు జ్ఞాపకశక్తికి అత్యంత శ్రేష్ఠమైన శిక్షణము ఇవ్వటం వల్ల ఈ లోపం రాకుండా నివారించటం జరిగింది. భావి విద్యా విధానంలో మనం ప్రాచీన పద్ధతికిగాని ఆధునిక పద్ధతికిగాని కట్టుబడి ఉండవలసిన అవసరం లేదు. జ్ఞానం మీద ఆధిపత్యం అత్యంత పరిపూర్ణంగా అతిశీఘ్రంగా లభింపజేసే సాధనాన్ని మాత్రమే ఎంచుకోవాలి.

పిల్లలలో ఆసక్తిని ప్రేరేపించుట

ఆధునిక విధానాన్ని సమర్థించటం కోసం ఒకే విషయం మీద సుదీర్ఘకాలం లగ్నం చేయటంవల్ల పిల్లల మనస్సు సులభంగా అలసటకు గురి అవుతుందని వాదిస్తున్నారు. విషయాలను తరచుగా మార్చుతూ ఉండటం వల్ల మనస్సుకు విశ్రాంతి దొరుకుతుందని అంటున్నారు. ఇక్కడ సహజంగానే ఒక ప్రశ్న తల ఎత్తుతుంది. ఈనాటి పిల్లలకూ పూర్వం వారికి అంత తేడా ఉందా? అలా అయితే సుదీర్ఘమైన ఏకాగ్రతను నిరుత్సాహపరచి మనమే వారిని ఆ విధంగా చేయలేదా? చాలా చిన్నశిశువు శ్రద్ధ వహించలేక పోవటం నిజమే కాని అంత చిన్నశిశువు ఏ విధమైన బోధనకు అర్హుడు కాడు కదా! ఏ విధమైన క్రమఅధ్యయనానికైనా అనుమతించదగిన వయస్సు ఏడు లేక ఎనిమిది సంవత్సరాలు. అతనికి ఆసక్తి కలిగితే చాలావరకు ఏకాగ్రత పొందగలుగుతాడు.

అసలు ఆసక్తే గదా ఏకాగ్రతకు ఆధారం. మనమే అతని పాఠాలను ఏమాత్రం ఆసక్తి కలిగించనవిగా, జుగుప్సావహంగా, తయారుచేసి, నిర్బంధంగా బోధించి మళ్లీ నిలకడలేని అతని అశ్రద్ధను గురించి ఫిర్యాదు చేస్తాము! ప్రస్తుతం ఉన్న ఈ అసహజమైన పద్ధతి స్థానంలో మరొక పద్ధతిని, శిశువు తనకు తానుగా విద్య గరపుకొనే సహజమైన విధానాన్ని తీసుకొని రావటం ద్వారా అశక్తత అనే అభ్యంతరాన్ని తొలగించవచ్చు. ఆసక్తిగల పిల్లవాడు, పెద్దవారి లాగానే, ఒక విషయాన్ని అసంపూర్తిగా వదలి వేయటం

కన్న చివరిదాకా పోవటానికే ఎక్కువ ఇష్టపడతాడు. అడుగువెంట అడుగుగా అతడిని నడిపించి వచ్చే ప్రతి అడుగులోను ఆసక్తి కలిగించి లీనం అయేటట్లు చేయటమే నిజమైన బోధనా కళ.

భాషల ప్రాముఖ్యత

ఉపాధ్యాయునికి ఉండవలసిన మొట్టమొదటి శ్రద్ధ బోధనామాధ్యం మీద, ఉపకరణాల మీద అయి ఉండాలి. ఇది పరిపూర్ణం అయ్యే వరకూ, నిత్యమూ బోధించే విషయాలను పెంచుకుంటూపోవటం కాలాన్ని, శక్తిని వృథా చేయటమే. ఒక భాషను సులభంగా వేగంగా సంపాదించుకొనే విధంగా మానసిక ఉపకరణాలు పెంపొందిన సమయమే అనేక భాషలకు అతనిని పరిచయం చేయవలసిన సమయం. అంతేగాని తనకు బోధించిన దాన్ని పాక్షికంగా మాత్రమే అవగాహన చేసుకొని, అతికష్టంమీద అపరి పూర్ణంగా దాని మీద ఆధిపత్యం సంపాదించినప్పుడు కాదు. అదీగాక, తన మాతృభాష మీద పట్టు సంపాదించిన వానికి వేరొక భాష మీద ఆధిపత్యం వహించటానికి అవసరమైన సౌలభ్యం కలుగుతుంది. తన భాషలోనే భాషాపరమైన ప్రజ్ఞని సంతృప్తికరంగా వికాసం పొందనప్పుడు ఇతర భాషల మీద ఆధిపత్యం కావటం అసాధ్యం. పరిశీలన, నిర్ణయం, హేతువు, తారతమ్య విచారణలకు చెందిన ప్రజ్ఞలు చాలా స్వల్పంగా మాత్రమే పెరిగినప్పుడు విజ్ఞాన శాస్త్రాన్ని అధ్యయనం చేయటం అంటే నిరుపయోగమైన దండుగ మరియు శ్రమ అవుతుంది. ఇతర విషయాలలో కూడ ఇంతే.

పిల్లల లక్షణాలు అమోఘం

మాతృభాష విద్యాబోధనకు సముచితమైన మాధ్యం. కాబట్టి శిశువు మొదటి శక్తి యుక్తులన్ని కూడ మాధ్యం మీద ఆధి పత్యం పొందే దిశలో సాగాలి. దాదాపుగా ప్రతి శిశువుకూ, ఊహాశక్తి, శబ్దాలకు చెందిన సహజ ప్రేరణ, నాటకీయ ప్రజ్ఞ, అపారమైన భావాల ఊహాకల్పనల సంపద ఉంటాయి. వీరికి సాహిత్యంలో దేశచరిత్రలో ఆసక్తి కలిగించాలి. భారంగా మెప్పు లేని కార్యంగా భావించే మొద్దుబారిన శుష్కమైన వర్ణక్రమానికి

పుస్తకాలు చదవటానికి బదులుగా శీఘ్రంగా క్రమాధికం అయ్యే దశలవల్ల, అతని చుట్టూ వెనకా ఉన్న సాహిత్యంలో జీవితంలో ఉండే అత్యంత ఆసక్తికర భాగాలతో పరిచయం కలిగించి, నేను చెప్పిన గుణాల పట్ల ఆకర్షణను ఇష్టాన్ని కలిగించే విధంగా వాటిని అతని ముందు పెట్టాలి.

ఈ సమయంలో సమస్తమైన ఇతర అధ్యయనాన్ని మానసిక కౌశలాలను నైతికశీలాన్ని పరిపూర్ణం చేయుట కోసం వినియోగించాలి. చరిత్ర, విజ్ఞానశాస్త్రం, తత్త్వశాస్త్రం, కళల అధ్యయనానికి ఈ సమయంలోనే పునాది వేయాలి కాని అది బలవంతాన రొప్పించిందిగా లాంఛనంగా జరగకూడదు. ప్రతిశిశువు ఆసక్తికరమైన కథలను ప్రేమిస్తాడు. వీరులను పూజిస్తాడు. దేశభక్తి కలిగి ఉంటాడు. అతనిలోని ఈ గుణాల వంకకు దృష్టిని మళ్లించి వాటి ద్వారా అతనికి తెలియకుండానే తన దేశచరిత్రకు చెందిన సజీవ మానవభాగాల మీద ఆధిపత్యం పొందనీయాలి. ప్రతిశిశువు సమాచారాన్ని రాబట్టే వాడు, శోధకుడు, విశ్లేషకుడు, నిర్దాక్షిణ్యంగా శరీరవిభాగాలను పరిశీలించేవాడు. అతనిలోని ఈ గుణాల వైపు దృష్టిని మళ్లించి అతనికి తెలియకుండానే విజ్ఞానశాస్త్రజ్ఞుని స్వభావాన్ని ప్రధాన జ్ఞానాన్ని పొందనీయాలి. ప్రతి శిశువులోనూ తనివి తీరని వైజ్ఞానిక కుతూహలం, ఆధిభౌతిక విచారణ వైపు మలుపు ఉంటాయి. ప్రపంచాన్నీ తననూ అర్థంచేసుకోటం వైపు దీన్ని ఉపయోగించి నెమ్మదిగా రప్పించాలి. ప్రతి శిశువుకూ అనుకరించే ప్రజ్ఞ, ఊహాశక్తికి చెందిన స్పర్శ ఉన్నాయి. కళాకార ప్రజ్ఞకు చెందిన ఆధారక పునాదిని ఇవ్వటానికి దీన్ని ఉపయోగించాలి.

> *పిల్లల శిక్షణ వారి ప్రకృతి ననుసరించాలి*

ప్రకృతి మనకు ప్రసాదించిన ప్రజ్ఞలవల్ల లాభం పొందటానికి ఆమెను పని చేయనివ్వాలి. శిశువులకు విద్యగరపటంలో ఆమె ప్రక్రియలకు విఘాతం కలిగించి అడ్డంకులు పెట్టటాన్నే మానవజాతి ఎంచుకుంది. అలా చేయటం వల్ల దాని పురోగమ వేగానికి అడ్డంకులు అవరోధాలు కలిగించింది. హార్షణీయంగా పరిణత భావాలు ప్రాబల్యం వహించటం

ఇప్పుడు ప్రారంభం అయింది. కాని మార్గం ఇంకా కనపడ లేదు. తన ఇష్టాయిష్టాలు పొరపాట్లు అన్నింటితో గతం మన మెడకు గుదిబండ అయింది, మనను వదలి పెట్టదు. సర్వవివేకి అయిన అమ్మ మార్గదర్శకత్వానికి మనం తిరిగిపోయే అత్యంత విప్లవాత్మక ప్రయత్నాలలో కూడ అది ప్రవేశిస్తుంది. స్పష్టతరమైన జ్ఞానాన్ని చేపట్టి దాన్ని నిర్భయంగా భావితరాల ప్రయోజనాలకు అనువర్తింప జేసే ధైర్యం మనకు ఉండాలి. మృతవిషాదాలను ఉంచవలసిన పాతసామానులగదిలోకి ముక్కలుగా బోధించే విధానాన్ని నెట్టివేయాలి. మొదటగా చేయవలసింది జీవితంలో, పనిలో, జ్ఞానంలో శిశువుకు ఆసక్తి కలిగించి అతని జ్ఞానసాధనాలను అత్యంత సమగ్రంగా పెంపొందించి అతడు ఉపయోగించవలసిన మాధ్యం మీద అధికారాన్ని ఇవ్వాలి. ఆ తర్వాత క్రమ అధ్యయనాన్ని చేపట్టటంలో జరిగిన ఆలస్యం అతడు నేర్చుకోవటంలో వేగం భర్తీ చేస్తుంది. ఇప్పుడు కొద్ది విషయాలను చెడ్డగా నేర్చుకుంటున్న దాని బదులు అనేక విషయాలను సమగ్రంగా నేర్చుకోటం జరుగుతుంది.

అనువాదం: తెన్నేటి పూర్ణచంద్ర రావు

పిల్లలు – సద్బోధన

శ్రీమాత ప్రవచనములు

పిల్లలు అమాయకులు. అందమైన విషయాలను గురించి, ధైర్యసాహసవీరులను గురించి కలలు కంటూ ఉంటారు. విక్రమార్కుడు వాళ్ల హీరో. పెద్దవాళ్లు ఈ విషయాన్ని గుర్తించి, వాళ్లను ప్రోత్సహించి, వాళ్ల కలలు నిజమయేటట్లు చేయాలి. కాని వాళ్లు చేస్తున్నదేమిటి? తమ అభిప్రాయాలను – ధనార్జన, ఇతరులతో పోటీపడి జీవించటం మొ॥ విషయాలను వాళ్ల మీద రుద్దుతారు. పిల్లలకు, సమాజానికి గొప్ప ద్రోహం చేసిన వారవుతారు. అలా కాకుండా పిల్లలలో పొంగిపొరలే సహజోత్సా

ళాన్ని ప్రోత్సహించి "విజయం మీదే, లేవండి. ఉజ్వల భవిష్యత్తు మీకోసం వేచివుంది" అని చెప్పి వాళ్లకి భవిష్యజ్యోతి చూపించాలి.

— సంపాదకుడు

పిల్లల ఆశయాలు సత్యం శివం సుందరం

సంస్కారంతో పుట్టిన బిడ్డలందరూ ఒక రకమైన కలలు కంటారు. వారి కలల్లో ఒక రకమైన ఆకాంక్ష కనిపిస్తుంది. సంస్కారం గల బిడ్డలంటే పరిణతి పొందిన చైత్యసత్త ఉన్నవారన్న మాట. బిడ్డల చైతన్యస్థాయికి ఆకాంక్ష అనే దానికంటె అది వారి తృష్ణ అనవచ్చు. ఆ తృష్ణ వికారంలేని సౌందర్యం కోసం, తిరుగులేని న్యాయంకోసం, అవధులులేని సద్గుణాలకోసం, చైతన్యవంతమైన విజయపరంపరల కోసం, సర్వదా ఉండే ఇంద్రజాలం కోసం కావచ్చు. ఇంద్రజాల మహత్యం మాదిరిగా ప్రపంచంలోని చెడు అంతా మాయమైపోవాలనీ, అంతా దేదీప్యమానంగా, ఆనందంగా, అందంగా ఉండాలని చిన్నతనంలో అందరూ అనుకుంటారు. కథలన్నీ సుఖాంతం కావాలనుకుంటారు. సాధారణంగా పిల్లలు గాలిలో ఎగురుతున్నట్లు, ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్ళిపోతున్నట్లు, ఏదైనా బాగు లేనప్పుడు దాన్ని సరిచేసినట్లు, రోగులకి బాధా నివారణ చేస్తున్నట్లు అనేక రకాలైన కలలు కంటారు. అయితే పెద్దలు ముఖ్యంగా తల్లిదండ్రులు, అధ్యాపకులు వాళ్లని చిన్నబుచ్చి "అది వట్టి కల, నిజం కాదు" అంటూ నిరుత్సాహపరుస్తారు. నిజానికి మంచి కలలు కనేటట్లుగా వాళ్ళని ప్రోత్సాహపరచాలి: "నీ కలలు నిజమయేటట్లు చూసుకోవాలి. అది సాధ్యమయేదేనా అని ఆలోచించకుండా అదే తప్పక జరుగుతుంది. అనుకుంటూ నీ శరీరంలో ఏ భాగం దాన్ని యథార్థం కావించకలదో కనిపెట్టి దాన్ని నీవు అంటిబెట్టుకొని ఉండాలి. అప్పుడది నీ జీవితాన్ని చక్కగా తీర్చిదిద్ది సాధారణ ప్రజలు మిథ్యగా పేర్కొనే యథార్థ సత్యపు దిశగా నిన్ను నడిపించగలదు".

పిల్లల్ని ఈ విధంగానే ప్రోత్సహపరచాలి. లేకపో
పాటకజనం మాదిరిగా చప్పగా, నిస్తేజంగా ఉండటమే అలవా
ఏదైనా మంచి జరుగుతున్నప్పుడు "ఆ! అదెన్నాళ్ళులే" అంటు
ఎవరైనా కారుణ్యంగా ఉంటే, "ఎలాగూ అతను తర్వాత మా
పోతాడు" అనీ ఏదైనా బాగా చేయగలిగినప్పుడు "రేపు ఇ
చేయకల్గుతానని ఏమిటి నమ్మకం" అంటూ అవాకులు పలు
తారు. ఈ ధోరణి వ్యక్తిలో నాశనకరంగా పనిచేస్తూ భవి
త్తుపై వుండే విశ్వాసాన్ని, ఆశను, దృఢనిశ్చయాలను హరిం
వేస్తుంది.

పిల్లలను ప్రోత్సహించాలి

పిల్లలు ఉత్సాహంతో ఉరకలువేస్తున్నప్పు
"జీవితం ఎల్లకాలం ఇలాగే ఉండదు
అంటూ చన్నీళ్ళు చిలకరించ కూడద
దానికి బదులు కొంచెం ప్రోత్సాహ ధోరణితో "ఇప్పటి పరి
తుల్లో ఎప్పుడూ ఇలాగే జరక్కపోవచ్చు. నీకు అసహ్యంగా తో
వచ్చు. కానీ ఈ అసహ్యం వెనుక బయటపడాలనుకునే సౌందర్య
తొంగిచూస్తూ ఉంటుంది. దాన్ని తెలుసుకొని నీ దగ్గరకు ఆ
ర్షించుకోవాలి. నీ కలలకు ప్రధానాంశము, నీ ఆశయాల రూపవ
అదే కావాలి".

చిన్నప్పట్నుంచీ ఇలా చేసివుంటే నీ పాతభావాలన
తొలగించుకోడానికి ఎక్కువ శ్రమ పడక్కర్లేదు. నీ చిన్నప్ప
కువిద్య, కుసంస్కార ఫలితమైన నిరాశాధోరణి, జీవితంలో
మంచిని గ్రహించుకోలేని మొరటు ధోరణిని తొలగించుకోవడ
కష్టమై జీవితం రసవిహీనంగా, నిరుత్సాహంగా, నిరాశాజనకంగ
సౌందర్యసీమలకు దూరమైపోతుంది. అప్పుడు పిల్లవానితో ఇల
చెప్పాలి, లేదా నీవు ఇలా అనుకోవాలి (నీవు ఏ మాత్రం ప
పాపడివి కాకపోతే) "నాలో భ్రమగా, అసాధ్యంగా, మాయగ
కనబడేదే యథార్థం. నేను దాని కోసమే కృషి చేయాలి. ఇట
వంటి ఆశయాలతో నా అసమర్థత నాకు సీమితం కాకుండాను
నా దురుద్దేశాలు నాకు కళ్ళెం వేయకుండాను ఉండుగాక!" అ

దృఢనిశ్చయాన్ని కల్పించుకోవాలి. అదే యథార్థం, సిద్ధింప చేసుకోవలసిన సత్యం.

చిన్నపిల్లవాడెవ్వరైనా తనకొక మంచి కల వచ్చిందనీ అందులో తనకు చాలా శక్తులున్నాయనీ, అక్కడ అన్నీ చాలా అందంగా ఉన్నాయనీ చెప్తూంటే "అదంతా కల్ల, అట్లా ఎక్కడా ఉండదు" అని మాత్రం చెప్పవద్దు. అదెంతో తప్పు. దానికి బదులు "అవును జీవితం అలా ఉండటమే కావాలి. అలాగే ఉండాలి" అని చెప్పాలి.

పిల్లల్లో సత్యసంపన్నత

పిల్లల్లో చిన్నప్పట్నుంచీ పెంపొందించాల్సిన మంచి గుణం ఒకటుంది. ఏదైనా కాని పని చేసినప్పుడు తమలో కలిగే ఒక రకమైన బాధని గమనించే స్వభావం. పెద్దలు నిషేధించారని గానీ, శిక్షిస్తారనిగానీ బాధపడటం కాకుండా తమకు తామే ఆ తప్పుడు పనివల్ల బాధని, ఒక రకమైన నైతిక కల్లోలాన్ని అనుభవించడం ప్రతి బిడ్డా అలవరచుకోవాలి. ఎవ్వరైనా ఒక పిల్లవాడు ఇంకొకరిని కొట్టడమో, తిట్టడమో చేశాడనుకోండి. వెంటనే సహజంగా తనలో తాను బాధ ననుభవించాలి, అది తను చేసిన పనికి ప్రతిచర్యగా అంతరంగంలో విచారణ, సత్యదూరంగా జరిగిందనే బాధ తప్ప ఇంకేమీ కాకూడదు.

చిన్నప్పట్నుంచీ నేర్పించే నీతులన్నిటి కంటె, ఊహకందే ఆలోచనల కంటే, హృదయాంతరాళాల్లో ఎక్కడో లోతుగా పరిపూర్ణత, శ్రేష్టత, యథార్థాల కోసం పరితపించేది ఒకటుంటుంది. సత్యాన్ని వ్యతిరేకించే స్పందనలకు అది చాలా బాధపడుతుంది. సాధారణంగా పిల్లలు తాము పెరిగిన పరిసరాల ప్రభావం వల్ల, చెడ్డ అనుకరణల వల్ల పాడైపోకుండా వారి సహజస్థితిలో ఉండగా సత్యదూరులై వ్యవహరిస్తే ఎవరూ ఏమీ అనకపోయినా స్వతస్సిద్ధంగా వారికే బాధ కలుగుతుంది. దీన్ని బట్టే ఉత్తరోత్రా వారెంత పురోగతి చెందగలరో నిర్ణయమవుతుంది.

అంతః సత్యమునకు విధేయత

దురదృష్టవశాత్తు పిల్లలు అన్యాయమైన చదువులు

చదివితే వారి అంతరంగంలో మిణుకు మిణుకుమంటున్న సత్య
జ్యోతిని చేజేతులా వారే ఆర్పేయటానికి ప్రయత్నిస్తారు. అది
కనక ఆరిపోతే యింక ఈ ఆశాజ్యోతితో సంబంధం తెగిపో
టమేకాక మంచిచెడులను గుర్తించే శక్తిని కూడా కోల్పోతారు
అందుకే నే నెప్పుడూ ఒక విషయాన్ని పిల్లలకు చిన్నప్పట్నించీ
బోధించమని గట్టిగా చెపుతాను. ప్రపంచంలో అన్ని వస్తువుల
లోనూ, తమలోను, భూమిలోను, విశ్వాంతరాళంలోనూ సత్యం
నిబిడీకృతంగా ఉన్నదనీ, దాని ప్రభావం వల్లనే అన్నీ నిలిచి
ఉన్నాయనీ, అది లేనినాడు ఏదీ కూడా ఉండదనీ, బిడ్డలు
కూడా ఉండరనీ ప్రతిదీ పుట్టగానే నశిస్తుందనీ వారికి తెలియ
చెప్పాలి. ఇదే విశ్వానికి మూలాధారం కాబట్టి గెలుపు దానిదే
దాన్ని ప్రతిఘటించేది ఏదీ కూడా దానితో సమంగా నిలవలేక
నశించిపోతుంది. అదే సత్యం, నిత్యం జగతికి మూలం.

అట్లాగని పిల్లలకు వేదాంతం బోధించమనటం లేదు,
కానీ ఈ సత్యాన్ని వారు గ్రహించేటట్లు, గ్రహించటంలోని ఆనందం
దాన్ని లోపల పదిలపరచుకుంటే కలిగే హాయి, సంతృప్తి, దానికి
లోబడి నడుచుకునేటప్పుడు పొందే అమందానందం వారు పొందే
టట్లు చూడాలి. వారు దానికి వ్యతిరేకంగా నడవకుండా వారిలో
నిక్షిప్తమైయున్న ఈ చిన్న సత్యజ్యోతి జాగ్రత్త పడుతుంది. ఇటు
వంటి అనుభవం పొందేటట్లుగా పిల్లల శిక్షణ సాగాలి. వారిలో
ఈ శాశ్వత వస్తువు లేకపోతే ఏదీ ఉండలేదనే భావన పిల్లలకు
కలగాలి.

భవిష్యత్తులో అంతటా విజయవంతంగా ముందుకు సాగ
వచ్చునే సంకల్పాన్ని పిల్లల్లో కలిగించడం తేలిక. ముందు చూపుతో
చకచకా సాగిపోవాలనే కోరిక చిన్నతనంలోనే వారికి కలిగిం
చడం మంచిది.

వారికిలా చెప్పవచ్చు; "భవిష్యత్తులో రాబోయ్యే అద్భు
తాలు అనేకం ఉన్నాయి. వాటినన్నిటినీ ఆహ్వానించటానికి నీవు
సిద్ధం కావాలి". వాళ్ళింకా వివరంగా, ఉన్నదంతా తెలుసుకోవా
లంటే శ్రీఅరవిందుల రచనలు చదవగలిగే స్తోమత వస్తే ఇవన్నీ

బాగా అర్థమవుతాయనీ, వీటిని వివరించటానికే ఆయన మన ముందుకు వచ్చారనీ చెప్పవచ్చు.

అనువాదం: ఎ. ప్రభావతి; ఎ. వేంకట్రామ శాస్త్రి

భారతదేశంలో ప్రస్తుత విద్యావిధానంలోని మూలసమస్యలు

శ్రీమాత జవాబులు

(విద్యాకేంద్ర ఆశయాలను, విద్యాపద్ధతులను విలువ కట్టేందుకు భారత ప్రభుత్వం నియమించిన విద్యావిషయక సంఘం 1965 ఆగస్టులో ఆశ్రమాన్ని సందర్శించింది. అప్పుడు ఉపాధ్యాయ బృందం ఈ ప్రశ్నలను శ్రీమాతకు సమర్పించారు.)

1. *ప్రస్తుత, భవిష్యత్ జీవన విధానం దృష్ట్యా, జాతీయ. అంతర్జాతీయ విద్యావిషయంలో భారతదేశ లక్ష్యం ఎలా ఉండాలి?*

అసత్యాన్ని తిరస్కరించి, సత్యాన్ని వ్యక్తపరిచేందుకు బాల బాలికలను సన్నద్ధం చేయాలి.

2. *ఈ ఉన్నతలక్ష్య సాధనకు దేశం ఎటువంటి చర్యలు తీసుకోవాలి? దీనిని ప్రారంభించడమెలాగ?*

ఆత్మను వ్యక్తపరచేందుకు భౌతిక పదార్థాన్ని సన్నద్ధం చేయాలి.

3. *భారతదేశపు నిజమైన ప్రతిభ ఏమిటి? ఆమె నిర్వహించ వలసిన కర్తవ్యము ఏమిటి?*

ఆత్మను ఆవిష్కరింప జేయనిదే పదార్థం అసత్యమనీ, దుర్బల మైనదనీ ప్రపంచానికి తెలియజేయాలి.

4. *విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానంలో భారతదేశం సాధించిన ప్రగతి గురించి శ్రీమాత అభిప్రాయమేమిటి? మానవుని ఆత్మ ఎదగటానికది ఎలా తోడ్పడుతుంది?*

భౌతికమును పరిపుష్టము గావించి దాని సామర్థ్యము పెంచి దైవావిర్భావమునకు యోగ్యమైన పాత్రగా తయారు చేయుటయే దాని ప్రయోజనము.

5. *దేశం సమైక్యత గురించి చాల ఆందోళన చెందుతోంది. ఈ విషయంలో శ్రీమాత అభిప్రాయమేమిటి? తనంత తానుగాను, ప్రపంచ సాయంతోను తన కర్తవ్యాన్ని భారతదేశం ఎలా నిర్వహించగలదు?*

అన్ని దేశాల సమైక్యత ప్రపంచ భవితవ్యానికి తప్పనిసరి. దేశాలన్నీ సమైక్యం కావాలంటే, ప్రతి దేశము తన స్వీయ సమైక్యతను సాధించుకోవాలి.

6. *భాషా సమస్య భారతదేశాన్ని ఎంతో పీడిస్తోంది. ఈ విషయంలో మనం అవలంబించ వలసిన సరైన వైఖరి ఏది?*

సమైక్యత అన్నది కృత్రిమంగా విధించేందుకు వీల్లేదు. సమైక్యత సజీవమైన యథార్థం. భారతదేశం ఐక్యత సాధించినప్పుడు అందరికీ అర్థమయ్యే భాష స్వతస్సిద్ధంగా లభిస్తుంది.

7. *విద్య అంటే మామూలుగా అక్షరాస్యత, సంఘంలో ఒక హోదా అయిపోయింది. ఇది సరయిన వైఖరి కాదు కదా.? విద్యకు ఆంతరంగిక విలువను, సహజానందాన్ని సమకూర్చటమెలా?*

లోకరూఢి అయిన ఆచారాలు వదలుకుని ఆత్మ ఎదగటానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

8. *నేడు మన విద్యావిధానాన్ని పట్టుకొని పీడిస్తున్న జాడ్యము లేవి? వీటిని దూరంగా ఉంచటమెలాగ?*

   క. విజయ సాధనకు, వృత్తికి, ధనానికి ప్రాముఖ్యం ఇవ్వటం

   గ. ఆత్మను స్పర్శించేందుకు అత్యధిక ప్రాధాన్యం, మనిషిలో యథార్థ్యాన్ని పెంపొందించి, దానిని వ్యక్తపరచేందుకు ప్రాముఖ్యం ఇవ్వాలి

అనువాదం: జె. మంగమ్మ

శ్రీమాత, శ్రీఅరవిందుల మాటల్లో సంస్కృత భాషా ప్రాధాన్యం

"అన్ని దేశాల్లోకి భారతదేశమే గొప్పది. అన్ని భాషల్లోకి సంస్కృతం వైభవోపేతమైనది" – ఇవి ఒట్టి మాటలు కావు. అయితే ఈ సత్యములను నేటి పరిస్థితులతో సమన్వయపరచుట ఎలా? మనం పాశ్చాత్య నాగరికతా వ్యామోహంలో పడి మన సంస్కృతిని, సంస్కృత భాషను కూడా మరచిపోయాము. రష్యా, జర్మనీ, అమెరికా దేశాల వారు సంస్కృతం నేర్చుకుంటారు. మన వేదాలను శాస్త్రాలను అధ్యయనం చేస్తారు. ఆయుర్వేదాన్ని నేర్చుకుంటారు. మన సంస్కృతి మంచిదే, కాని ఆ ప్రాచీన కాలపు రూపములు, విలువలు నేడు పనికిరావు. వాటికి కాలం తీరిపోయింది. అలాగని మనం పాశ్చాత్య నాగరికతను గ్రుడ్డిగా అనుకరించటం తగదు. మన పునాదులు గట్టివే.

– సంపాదకుడు

ప్రతి భాష ఆ జాతి సంస్కృతికి ప్రతీక

ప్రతి భాషా మాట్లాడేవారి జీవసంస్కృతికి ప్రతిబింబం. ప్రతి బాషకూ ఒక జీవశక్తి, ఆలోచనా స్వభావం, జీవన వ్యవహారశైలి, అనుభవ జ్ఞానసంపద ప్రత్యేకంగా ఉంటాయి. కాబట్టి జాతికీ, దేశానికీ, తన భాషా వైశిష్ట్య పరిరక్షణ అత్యావశ్యకం. దానిని సజీవ భాషగా కాపాడుకోవటం ధర్మం. ఎందుకంటే జాతీయ సంస్కృతి కదే వాహిక కనుక. ఒక దేశం కానీ, జాతి కానీ తన భాషను నిర్లక్ష్యం చేస్తే దాని ప్రత్యేకతనది నాశనం చేసుకొన్నట్లే.

*

భారతీయ సంస్కృతి నవ్యరూపములు

భారతదేశ ధర్మము, బాధ్యత, నిర్వహించవలసిన కర్తవ్యకర్మ, సమస్త ప్రపంచ కర్తవ్యంలో తన వంతు కార్యమూ, తన ప్రత్యేకతా, చరిత్ర పుటలలో సువర్ణాక్షరాల్లో లిఖిం

పబడే వుంది. ఇంతే కాదు. నేడు దేశమాత ఎదుర్కొంటున్న కష్ట నష్టాల కడుగున రహస్య ప్రయోజనమూ లేకపోలేదు. తత్త్వతః మనలను మనం కొత్త రూపాల్లో మలుచుకోవాలి. శక్తిమంతమైన ఆలోచనా పరమార్థాలూ, సాంస్కృతిక మూల్యాలు, క్రొత్త ఉప కరణాలూ కలిగి ఉత్కృష్ట మూర్తులుగా రూపొందించుకోవటా నికి కావలసినంత ప్రాచీన చరిత్ర మనకున్నది. సారతరమైన సాంస్కృతిక మూల్యాలను, వాటి శక్తినీ గుర్తించ గలిగితే సామా జిక సాంస్కృతిక నూతన పరిణామాలను – మార్పులను స్వీక రించగలం. ఎంత మార్పైనా నష్టం లేదు. కానీ ప్రాచీన సంస్కృతీ, మూల్యాలు, సారం మాత్రం పోరాదు. అంటే ఐరోపా, జపాను, అమెరికా సంస్కృతుల మూసలో పోయరాదని భావం.

*

ప్రపంచంలో భారతదేశ పాత్ర

భరతఖండం తన సంస్కృతిని, నాగరిక తను, పోషించుకుంటూ ప్రపంచంలో తన ప్రత్యేక పాత్రను సమర్థవంతంగా నిర్వ హించగలదు. అయితే యావత్ప్రపంచానికి సంబంధించిన రాజ కీయ, సామాజిక, ఆర్థిక, నైతిక మూల్య పరిరక్షణ ఐరోపా ఖండం వల్ల కాలేదు. ఈ బాధ్యత భారతదేశానిది. అది విధివిధానంలో గర్భితమై వున్నది. కానీ ఐరోపా ప్రయోగ పరంపర ఎంత అప జయ గ్రస్తమైనా అదొక విజయ సోపాన పరంపరగా చిత్రించు కొంటున్నది. ఫలం కంటె సాధనం గొప్పది కావాలి. ఎప్పుడైతే దేశం శాశ్వత శక్తిమూలాలను తనలోకి ఆవహింప చేసుకొంటుందో అప్పుడే ఫలసాధనాలను గుర్తించే శక్తి లభిస్తుంది.

*

మూడు కర్తవ్యములు

ఆధ్యాత్మిక విజ్ఞానానుభవాల వైభవాన్ని, సారాన్ని పరిపూర్ణతను వెలికి తీయటం, ఆ నిలవ నీటిని నూత్న శాస్త్రప్రవాహం ద్వారా మళ్ళించటం ప్రథమ కర్తవ్యం. సాహిత్య కళాదులన్న పాయలు త్రవ్వి ప్రవహింప చేయటం – ఇది రెండవ కర్తవ్యం. ప్రాచీన మూల్యాలు దెబ్బతినకుండా ఒక వినూత్న సమన్వయాన్ని ఆవి

ష్కరింప చేయటం ద్వారా ఒక ఆధ్యాత్మిక సమాజాన్ని నిర్మిం చటం – ఇది మూడవ కర్తవ్యం. ఇది అత్యంత ప్రయాసతో కూడుకొన్న వ్యవహారం. ఈ మూటి విజయమే భవిష్య మానవా భ్యుదయానికి నాంది.

*

ఈ మహోత్కృష్ట ధ్యేయానికి మార్గమేది? సాధనాలేవి? దీనికి సమాధానం చెప్పుకోవాలంటే ఉన్నతానుభవాలను, ప్రత్యేక సిద్ధాం తాలను చూడాలి. ప్రాచీన సంస్కృత భాషా ప్రపంచాన్ని దర్శిం చాలి. ఎందుకంటే అవి ఆ భాషలోనే ఆవిష్కృతమైనవి కనుక.

*

దేవ భాష ప్రాశస్త్యము

సంస్కృత భాష విశ్వభాషల్లో అనేక విధా లుగా మహత్తరమైనదని అనేకమంది పండి తులు తీర్మానించారు. గాంభీర్యం – ఔదార్యం – నిండుదనంగల సాహిత్య సాధనంగా ప్రశస్తి పొందినది. మహో దారతతో పాటుగా మాధుర్యం కలదీ, సూక్ష్మ విషయ ప్రకటన సామర్థ్యం కలదీ, ఎలా బడితే అలా మలచుకోవటానికి వీలైనదీ, పుష్టమై, స్పష్టతకు నికేతనమై, తేజోవంతమై, ఓజోవంతమైన భాష అదొక్కటే. దానిని సృష్టించిన జాతి మనస్తత్వ సంకేతమై నేటికీ చెక్కుచెదరకుండా ప్రపంచ మన్ననలందుకునే భాష సంస్కృతమే.

*

మన్వంతరారంభంలో ఉత్తర మేరు ప్రాంతంలోని వారు సహజ భాష లేక దేవభాష అయిన సంస్కృతమును మాట్లాడేవారు. స్వచ్ఛతలో అది ద్వాపరంలోని సంస్కృతం కానీ, కలి లోని సంస్కృతం కానీ కాదు. అది వాక్కుకీ అర్థానికీ మధ్య సంపూర్ణ సంబంధంకల సత్యయుగపు భాష. *అందులోని ప్రతి అచ్చుకీ, హల్లుకీ సహజంగానే ఒక ప్రత్యేక శక్తి వుంది. అది వాటికి స్వతః సిద్ధం తప్ప మానవ ప్రయత్నం వల్లగానీ, క్రమ వికాసం వల్లగానీ వచ్చిన శక్తి కాదు.* ఈ బీజ శబ్దాలే తాంత్రిక బీజ మంత్రాలకి మూలం, వాటి ప్రభావానికి కీలకం. ఈ శక్తి వల్లనే దేవభాషలోని ప్రతి అచ్చుకీ, ప్రతి హల్లుకీ ఒక విశిష్టమైన మూల

అర్థం ఉండి, ఉత్పన్న శబ్ద, అర్థాలకి ఆధారమైంది. అచ్చుల హల్లుల కలయిక వల్ల ఎన్నో మూలధాతువులు ఏర్పడ్డాయి. మరి కొన్ని ధాతువులు కేవలం అచ్చులనుండే ఏర్పడ్డాయి. అనంతరం ఇవి మరికొన్ని హల్లులతో కలసి రెండవ స్థాయి ధాతువుల నేర్పరచాయి. అన్ని పదాలూ ఈ ధాతువులనుంచే వచ్చాయి. శుద్ధ అచ్చులకో, మిశ్రమ అచ్చులకో హల్లుల ముగింపులు జోడించి, మూలధాతువులలో మార్పులు చేసినందువల్ల కొన్ని సరళమైన శబ్దములూ, ఏ మార్పులూ చేయనందువల్ల మరి కొన్ని శబ్దములూ వచ్చాయి. క్లిష్టమైన మాటలు మిశ్రమాల ద్వారా ఏర్పడ్డాయి[1].

ఈ భాషే క్రమంగా అర్థంలోనూ శబ్దంలోనూ దోషభూయిష్టమై గ్రామ్యత పెరగడంతో త్రేత, ద్వాపర, కలియుగాలలోని

---

[1] ఋషులు భాషా ప్రయోగమీ ప్రాచీన వాక్యభావస్ఫోటశక్తి ననుసరించినట్లు విదితమగుచున్నది.. ఆధునిక భాషలో "వృకము", "ధేనువు", ఆంగ్లములో "వుల్ఫ్ (wolf)", "కౌ (cow)" మున్నగు శబ్దములు కేవల మా పదములు వ్యావహారికముగ సూచించు మృగములనే నిర్దేశించును. అనగా నొక శబ్దము నుచ్చరించినప్పుడు పుట్టుకతో నా శబ్దమున కేయర్థ మేర్పడినదని హేతువాదానుసారముగా వ్యుత్పత్త్యర్థము నూహింప నవసరములేక యా మాటకు వ్యావహారికముగా స్థిరపడియున్న భావమే మనకు స్ఫురించును. శబ్ద శ్రవణముతోనే దాని నిశ్చితార్థము గోచరించును. రచనాశైలి యందలంకారార్థము వ్యంగ్యముగ ప్రయోగించు పట్టున తక్క మిగిలిన సందర్భములం దెల్లప్పుడు నెల్లెడలను ప్రతి శబ్దమును దాని ప్రత్యేక వ్యావహారిక సుప్రసిద్ధార్థము నందే వాడుదుము. వేద సూక్తములందు ఋషుల శబ్ద ప్రయోగ మిట్టిది కాదు. "వృక" శబ్దమును ప్రయోగించినప్పుడు ఋషి దాని పుట్టుపూర్వోత్తర వ్యుత్పత్తి స్వభావ సామర్థ్యముల ననుసరించి యా శబ్దము బోధించు "చించు, అక్కు, పెఱుకు" మున్నగు భావముల కనుగుణముగ నొక్క తోడేలను జంతు విశేషమును మాత్రమేగాక యా శబ్దగర్భితమైన భావార్థముల నిన్నిటిని నిర్దేశింపగలిగెను. అలాగుననే 'ధేను' శబ్దము; 'ధేను' వనగా పుష్టినిచ్చునది. సంవర్ధిని యని వ్యుత్పత్త్యర్థము, కావుననే యావున కాపేరు వచ్చినది. ప్రాచీనకాలమందు వేదఋషులు శబ్దములను ప్రయోగించినప్పుడు వాని వ్యుత్పత్త్యానుగత భావార్థములనే ప్రధానముగా నిర్దేశించి, వానికి సహజ సంగతములైన విశేషార్థముల నానుషంగికములుగనే యుద్దేశించిరి.

సంస్కృతం అయింది. అప్పుడప్పుడు పాక్షికంగా శుద్ధిచేయబడినా, కొంతకాలానికి తిరిగి కలుషితమై మళ్లీ మళ్లీ కొంచెం శుద్ధిచేయ బడుతూండటం వలన ఈ భాష తన సహజ రూపురేఖలతోటి, నిర్మాణం తోటి పూర్తి సంబంధం కోల్పోకుండా వుంది. ఈ సహజభాష దేవభాషతో సంబంధం ఎంత దూరమైనా, ప్రతి ఒక్క భాష దీని వక్రీకరణ వలనో, వాడుక వల్ల వచ్చిన ప్రాకృత భాషనుంచో, లేక మళ్లీ ఆ ప్రాకృతం యొక్క ప్రాకృతంనుంచో, దాని లోని మాలిన్యం యొక్క వివిధ స్థాయిలని బట్టి ఏర్పడినదే. విశ్వవ్యాప్తమూ, అనంతమూ అయిన ఈ భాష భారతదేశంలో అత్యంత శుద్ధరూపంలో ఉండటం వల్లనే దానికి వేరే ప్రాంతీయ నామం ఏది ఇవ్వకుండా సంస్కృతమనే పిలవబడుతోంది. మానవ భాషని క్షుణ్ణంగా అర్థం చేసుకోవడానికి అవగాహన చేసుకోవ డానికీ, ఆ తరువాత సంస్కృతభాషని మళ్లీ తాజాగా క్షాళనం చేయ డానికీ నాంది ఎప్పుడూ సంస్కృతం ఆది భాష అనే సత్యాన్ని తెలుసుకోవడంలోనే వుంది.

మూలం: శ్రీఅరవిందులు

*

ప్రతి వ్యక్తికీ సంస్కృత భాష అవశ్య పఠనీయమౌతున్నది.

ఈ మాట పాండిత్య దృష్ట్యా కాదన్నది. మఱి సంస్కృతం సర్వ భారతీయ భాషావగాహనకది ఆధారభూతమన్న దృష్టితో నేననుకుంటాను – ఇది అవశ్యమని. కొన్ని ఏండ్లలో – అది భార తీయ ప్రతినిధి కాగలదు. ఆదర్శం కాగలదు. పునః శక్తిమంతం కాగలదు. సంస్కృతమే సర్వ భారతీయ భాషలకు ఆధారం కాగ లదు. కావాలని శ్రీఅరవిందుల అభిభాషణం. ఇవ్వాళ ఆంగ్లముం డుట యొక అసామాన్య విషయమే కావచ్చు. ఇతర ప్రపంచ వ్యవహారాలకది తోడ్పడుచున్నది. ప్రతి దేశానికీ ఒక భాష వున్నది – అలాగే ఇక్కడా, ఒకే జాతీయభాష వుండాలనుకోవ టంతో కలహం ప్రారంభమౌతుంది. ప్రతివారూ తమదే వుండాల నుకోవటం మూర్ఖత్వం. కానీ ఎవ్వరూ సంస్కృతాన్ని నిరసిం

చరు. అదే అన్నిటికంటే అనాది. ప్రతి శబ్దానికీ మూలధాతువు లైన ధ్వనులున్న భాష....

ఫ్రెంచిదేశంలో పుట్టిన ప్రతి బాలునికి ఫ్రెంచిభాష తెలిసి నట్లు ఈ దేశంలో జన్మించిన ప్రతి బాలునికీ సంస్కృతం తెలి యాలి. ప్రతి ఫ్రెంచి బాలునకూ ఆ భాషా పాండిత్యమున్నదని కానీ, ఉండాలనీ కానీ కాదు. కొంచెమైనా తెలిసి వుండాలి. తన జాతీయభాషతో వానికి పరిచయముండాలి. తర్వాత పెరిగి పెద్ద వాడై ఇతర భాషల ననేకం నేర్చుకోవచ్చు గాక. ప్రస్తుతం మనం కలహాగ్రస్తులమై వున్నాం. ఈ దుష్ట వాతావరణంలో ఏ మొక్కా మొలవదు. కానీ సద్వాతావరణం కల రోజు రాక తప్పదు. వస్తుందనుకుంటున్నాను.

కనుక నా దృష్టిలో సరళ సంస్కృతం నేర్పబడాలి. కానీ అంత మాత్రాన పలుచన చేయరాదు. సరళమంటే సహజంగా అది ఆదిమకాలంలో వున్న ధ్వన్యానుకరణ అని నా భావం. ఎందుకంటే ఈ ధ్వనులన్నీ అనంత కాలంలో ఏర్పడిన శబ్దము లకు మూలధాతువులు.

మూలం: శ్రీమాత

అనువాదం: టి. కోటీశ్వరరావు; బి. వరలక్ష్మి; శ్రీ వఝుల వెంకటరామ శాస్త్రి, శ్రీ రామకవచం వెంకటేశ్వర శాస్త్రి (నిగూఢ వేద రహస్యము నుండి)

విద్యార్థులకు (పిల్లలు, పెద్దలు) ప్రత్యేకం

శ్రీమాత ప్రవచనములు

మానవ జీవితము కొన్ని వేల సంవత్సరాలుగా పైపై మెరు గులు దిద్దుకుంటున్నప్పటికి మూలతః చెప్పుకోతగ్గ మార్పు ఏమి పొందలేదనే చెప్పాలి. ఈ స్తబ్ధత కాల మంతమయ్యేంత వరకు ఇలా కొనసాగవలసిందేనా లేక ఏదైనా నూతనంగా ఆవి ర్భవించి వానరుని లోనుంచి నరుడు వచ్చినట్లుగా మనిషి

లోనుంచి ఒక మహామనీషి అవతరించబోతున్నాడా అనే ప్రశ్న ఉదయిస్తుంది. తప్పకుండా నూతన మానవుడు వస్తాడు. అందుకు సమయమూ ఆసన్నమయింది, అవసరమైన దివ్య ప్రేరణా కలిగింది. ఇప్పుడు దివ్యచైతన్యం భూలోకంలోకి దిగి వచ్చి తగిన పాత్రల కోసం గాలిస్తోంది. ఈ విషయాన్ని గుర్తించి ఆ శక్తిని గ్రహించి ఈ పరిణామములో పాల్గొనే అమూల్యావకాశం అందరికి వున్నది. — సంపాదకుడు

సృష్టిలో నూతనాధ్యాయము

యుగయుగాలుగా నడుస్తున్న ఈ భూలోక చరిత్రలో ఒక పరివర్తనము రాబోవుతున్నది. ఒక నూతనాధ్యాయము ఆవిష్కారమయ్యే దివ్యముహూర్తములో మన మిప్పుడున్నాము. అట్టి సమయములో ప్రపంచ చైతన్యము తీవ్రతరమౌతుంది. వేగం పుంజుకుంటుంది. సృష్టి కార్యక్రమము ఇప్పుడొక బృహత్తర దశలో వున్నది. రూపాంతరీకరణ (transformation) సాధించనున్నది. తదనుగుణంగా అలనాడు మానవుడు (మనోగత జీవి) ఎలా అవతరించాడో ఈనాడు మానసాతీతమైన అతిమానస జీవి అవతరించబోతున్నాడు. అందుకై మానవుని మనోభూమికలో తీవ్రమైన మథింపు జరుగుతున్నది.

దేవతలు దిగివచ్చిన సమయము

ఈ రహస్యము తెలిసిన కొంత మంది దేవతలు ఈ అపూర్వ ముహూర్తము యొక్క ప్రాముఖ్యతను గుర్తించి తమ సహాయము నందించుటకై భూలోకంలో అవతరించి ఉన్నారు. ఈ భూలోక వాతావరణము ఒక మహాచైతన్య జ్యోతితో ఉద్దీప్తమై యున్నది. ఈ శుభసమయంలో తయారుగా ఉన్నవారు ఆ జ్యోతి నుండి ఒక కిరణమైనను గ్రహించి వారిలో క్రియాశీలము గావించగలరు.

అతిమానస చైతన్యాన్ని మానవ శరీరంలో ధరించిన శ్రీఅరవిందులు లక్ష్యసాధనకు అనుసరించవలసిన మార్గాన్ని సూచించారు. సూచించటమే కాకుండా తమ స్వీయానుభవంతో

ఇది సాధ్యమేనని ప్రత్యక్షంగా నిరూపించారు. అందుకు సమయ మాసన్నమయిందని కూడ ప్రకటించారు.

నూతన శక్తికి ఉపకరణాలు

ఇతరులు చేసిన దానినే పునరావృతం చేయకుండా నూతన చైతన్యవికాసానికి, నూతన జీవితానికి మనం సంసిద్ధులు కావాలి. అందువలననే విద్యార్థులయిన మిమ్ములను సంబోధిస్తున్నాను. నేర్చుకోవాలనీ, ఇంకా బాగా, ఇంకా ఎక్కువగా నేర్చుకోవాలనీ అనుకునే వారిని సంబోధిస్తున్నాను. నూతన శక్తిని స్వీకరించేందుకు వికసిత మనస్కులై మీరు ఏదో ఒకరోజు ఆ జ్యోతి భౌతికతలముపై సాక్షాత్కరించే అవకాశం కల్పించగలరు. అందులో మనం నిమగ్నులయ్యామనే విషయం మరచిపోకూడదు. వీలయినంత నిర్దిష్ట పరికరాలుగా మనం మారాలంటే మనం ఇక్కడ ఎందుకున్నామో సరయిన కారణం గ్రహించాలి. దైవేచ్ఛను ప్రపంచానికి అభివ్యక్తపరచే పరికరాలుగా మారాలి. ఆ పరికరాలు ప్రమాణంగా ఉండాలంటే వాటిని మెరుగు పెట్టాలి. తగిన శిక్షణనిచ్చి తీర్చిదిద్దాలి. వజ్రాన్ని అందంగా చెక్కి, మెరుగుపెట్టినప్పుడే కదా అది ధగధగా మెరుస్తుంది. మీరు కూడ అంతే. అతిమానస చైతన్యం ఆవిష్కారమయ్యేందుకు భౌతికకాయాన్ని పదునుపెట్టాలి. సర్వాంగసుందరంంగా తీర్చిదిద్దాలి. లోటుపాట్లను సవరించి పునీతము గావించాలి. అందుకే మీరు పాఠశాలకు వెడుతున్నారు. పెద్దలైనా సరే పిన్నలైనా సరే ఈ విషయాలు నేర్చుకునేందుకు వయస్సుతో నిమిత్తం లేదు.

శ్రీమాత విద్యార్థుల కోసం ఇచ్చిన ప్రార్థన

మాకు ధైర్యసాహసములను ప్రసాదింపుము. మమ్ములను సమర యోధులుగాజేసి మా తీవ్ర ఆకాంక్షను నెరవేర్చుము. పాత శిథిలములతో పోరాడి నూతన సృష్టి నావిర్భవింప చేయుటలో మాకు విజయమును చేకూర్చుము. నూతన సృష్టికి మేము పాత్రుల మగునటుల అనుగ్రహింపుము.

అనువాదం: జె. మంగమ్మ

పూర్ణయోగ లక్ష్యం: దాని రెండు దశలు

శ్రీఅరవిందుల ప్రవచనములు

విద్య వలన మానవ జీవితం ఉన్నత ప్రమాణాలను అందు కోవటం నిజమే గాని దీని వలన మానవుని అసలు సమస్య అలాగే వుండిపోయింది. మానవాతీతమైన దైవశక్తియే దానిని పరిష్కరించగలదు. దీనిని సాధించటము ఎలా? యోగము ద్వారా ఆ దైవశక్తిని నీలోని కాహ్వానించి నీలోని అన్ని విభాగములను దాని పరిపాలనకు లోబరచాలి. నీ ప్రకృతంతా ఆ శక్తికి ఒదిగి యుండి దాని ఇచ్ఛానుసారం నడుచుకోవాలి. ఇక నీ వ్యక్తిగత ప్రయత్నం బదులు ఆ శక్తియే తన చేతులతో నిన్ను నడిపి స్తుంది. ప్రత్యక్షంగా దైవమే నీ యోగానికి అధ్యక్షత వహించి నిన్ను పూర్తిగా ఆధ్యాత్మిక పరివర్తన మొనర్చగలదు.

— సంపాదకుడు

లోని దైవమును స్ఫురింప జేసికొనుట

మనిషిని దివ్యస్ఫూర్తిగల మహామనిషిగా తయారు చేయుటయే మన లక్ష్యం. సమస్త జీవితమూ రహస్యంగా జరుగుతున్న యోగమే. తనలో నిక్షిప్తమైన దివ్యతత్వాన్ని కనుగొని ఫలితం వైపుగా సాగుతున్న ప్రకృతి అస్పష్టమైన పెరుగుదల. జ్ఞానానికీ ఇచ్ఛకూ కర్మకూ జీవితానికీ చెందిన మానవ ఉపకరణాలన్నీ తన లోపలా, ప్రపంచంలోనూ, ఉన్న ఆత్మ వైపుకు తిరగటం వల్ల మానవునిలో దాని అస్పష్టత క్రమాధికంగా తగ్గి ఎక్కువ స్వయంచైతన్యం, స్వయంప్రకాశం, ఆత్మనిష్ఠ దానికి కలుగుతాయి. మనస్సు, శరీరం, జీవం, మన ప్రకృతివైన సర్వ రూపాలు ఈ పెరుగుదలకు సాధనాలు. కాని తమకు అతీతంగా ఉన్న దేని వైపుకో తెరుచుకోటంవల్ల మాత్రమే అవి తమ అంతిమ పరిపూర్ణతను కనుగొంటాయి. ఎందుకంటే మొదటగా మానవుడు ఏమై ఉన్నాడో అదంతా అవే కాదు. రెండవది అతడు అయి వున్న ఆ ఇతరమైన 'ఏదో' అదే అతని సంపూర్ణతకు కీలకం.

అతని అస్తిత్వానికి చెందిన ఉన్నత విస్తృత యథార్థాన్ని పరిశోధించి కనుగొనే వెలుగును అది తెస్తుంది.

దైవములో జీవించుట

వైజ్ఞానిక, నిశ్చయాత్మక, నైతిక, ఉద్రేక, సౌందర్యానుభవ భౌతిక విషయాల శిక్షణలన్నీ మంచివే. కాని అవి ఆత్మశక్తికి సాన్నిధ్యానికి తాము తెరుచుకోగలిగి దాని ప్రత్యక్ష వర్తనాలను అనుమతించగలిగిన స్థానాన్ని చేరితే తప్ప చివరి విడుదలనుగాని ప్రకాశమాన లక్ష్యాన్నిగాని ఇవ్వలేని వలయంలో నిరంతర గమనం మాత్రమే అవుతాయి. ఈ ప్రత్యక్షవర్తన మన సమస్త అస్తిత్వంలో పరివర్తన కలగజేస్తుంది. మన యథార్థ పరిపూర్ణతకు ఇది అనివార్యమైన పరిస్థితి. అందుచేత ఆత్మసత్యంలోకి, శక్తిలోకి ఎదగటం, ఆ శక్తి ప్రత్యక్ష కర్మల వల్ల దాని ఆత్మప్రకటనకు అర్హమైన వాహిక కావటం – అంటే మానవుడు దైవంలో జీవించటం, మానవజాతిలో ఆత్మ దివ్యజీవనాన్ని వహించటం – ఆత్మ పరిపూర్ణతకు చెందిన పూర్ణయోగానికి సూత్రమేగాక సమస్త లక్ష్యం కూడాను.

ప్రకృతి యొక్క దివ్యీకరణము

ఈ మార్పు జరిగే ప్రక్రియలో ఆ కృషికి రెండు దశలు ఉండాలి. మొదట మానవుని వ్యక్తిగత కృషి ఉంటుంది. తన అంతరాత్మ మనస్సు హృదయాలవల్ల ఈ దివ్య సంభావ్యతను తెలుసుకొని, నిజమైన జీవితలక్ష్యంగా దాని వైపు మళ్ళటం జరిగిన వెంటనే దాని కొరకు తన్ను తాను సిద్ధం చేసుకోవటం, నిమ్నవర్తనానికి చెంది ఆత్మసత్యానికి శక్తికి తెరుచుకునే మార్గంలో అవరోధంగా ఉన్న అన్నిటినీ విడనాడటం, ఈ విముక్తి వల్ల ఆధ్యాత్మిక అస్తిత్వాన్ని తనది చేసుకొని తన సహజ గమనాలన్నింటినీ దాని ఆత్మప్రకటనకు స్వేచ్ఛా సాధనాలుగా మలచటం జరుగుతాయి. ఈ మలుపు వల్లనే తన్ను తాను తెలుసుకొన్న యోగం ఆరంభం అవుతుంది. ఒక కొత్త జాగృతి జీవోద్దేశంలో ఊర్ధ్వముఖమైన మార్పులు ఉంటాయి. ప్రస్తుతస్థితి కోసం జీవసాధారణ ప్రయోజనాల కోసం కేవలం వైజ్ఞానిక, సౌందర్యా

త్మక, తదితర ఆత్మశిక్షణ మాత్రమే ఉన్నంతకాలం మనోజీవ శరీరాల సాధారణ వలయం దాటి అవి బయటకు పోవు. ఇంకా మనం అస్పష్టమైనా వెలుగురావలసి ఉన్న సిద్ధపరచే యోగం లోనే ఉండిపోతాము. మనం ఇంకా సాధారణ మానవ పరిపూర్ణత వెంబడే పడతాము. దైవమూ, దివ్యపరిపూర్ణత కావాలని మన సమస్త అస్తిత్వంలోనూ ఆయనతో ఏకం కావాలనీ, మన సమస్త ప్రకృతిలో ఆధ్యాత్మిక పరిపూర్ణత కావాలనీ ఆధ్యాత్మికమైన కోరిక ఈ మార్పుకు సమర్థమైన సూచన, మన అస్తిత్వ జీవితాల మహా సమగ్ర పరివర్తనకు ముందుగా వచ్చే శక్తి.

సంపూర్ణ పరివర్తనానికి మార్గము

మరింత ఉన్నతమైన శక్తి ప్రవేశించి సమస్త అస్తిత్వకర్మలనూ చేపట్టినపుడు ఇంకా గొప్ప పరిపూర్ణతను చేరగలుగుతాము. అందువల్ల ఈ యోగంలో రెండవ దశ, మనం ఆకాంక్షించే దైవం యోగానికి ప్రత్యక్షంగా అధిపతి అవుతూ అస్తిత్వానికి పూర్తిగా ఆధ్యాత్మిక పరివర్తన కలిగించే వరకు ఈ మహాత్తరశక్తి హస్తాలలో సర్వ ప్రకృతికర్మను పట్టుదలగా వదలివేయటం వ్యక్తిగతకృషి స్థానంలో దీని ప్రభావాన్ని, దీన్ని సొంతం చేసుకొనే యత్నాన్ని, దీని వర్తనాన్ని ప్రతిక్షేపించటం అవుతుంది.

అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రరావు

ఆరోగ్యపత్రం

శ్రీమాత ప్రవచనములు

నాగరికత పెరుగుతున్న కొద్దీ రోగాలు కూడ పెరుగుతున్నాయి. పల్లెవాసులు ఆరోగ్యంగానే ఉంటారు. అడవిలో నివసించే ఆటవిక జాతులవారు మరింత ఆరోగ్యంగా వుంటారు. ఎందుకని? ఏదైనా జబ్బుచేసినప్పుడు వెంటనే కోలుకుండే శక్తి శరీరానికి సహజము. కానీ నేడు అది తన సహజ ఆరోగ్యాన్ని పోగొట్టుకుంది. ఘోరమైన పరిస్థితుల వలన, మనస్సు యొక్క ఆధిపత్యము

వలన అది తన సహజ ధర్మాన్ని కోల్పోయింది. చిన్న పిల్లలకు ఈ విషయాన్ని బోధించి వాళ్లని ఈ దుర్గతి నుండి రక్షించటం మన విధి. — సంపాదకుడు

మంచి ఆరోగ్యం శరీరానికి సహజం

సామాన్య పరిస్థితుల్లో పుట్టి, కొంత వరకు సమతుల్యమైన మంచి వాతావరణంలో ఆరోగ్యంగా పెరిగి, చెడ్డ సావాసాలతో, చెడు ఉదాహరణలతో, దుర్బోధనలతో కలుషితం కాకుండా ఉన్నప్పుడు శరీరం నిశ్చింతగా ఉండి దానికి ఏదైనా వ్యాధి వచ్చినా దానంతటదే తగ్గిపోతుందనే దృఢనమ్మకంతో ఉంటుంది. రుగ్మత తప్పక తగ్గిపోతుంది, నివారణ తథ్యమనే దృఢత్వం దేహానికి స్వతహాగా ఉంటుంది. అందరూ అదే పనిగా నూరిపోస్తూండటం వలనా, అసాధ్యమైన జబ్బులు, అనివార్య దుర్ఘటనలు జరుగూతాయని, వార్ధక్యం వస్తుందని చెప్పడం వల్లనే దేహానికి తనపై తనకి విశ్వాసం నశిస్తుంది. కానీ సామాన్యంగా సాధారణ శిశువు యొక్క శరీరం ఏదైనా వచ్చినప్పుడు అదే బాగైపోతుందనే దృఢనమ్మకంతో ఉంటుంది. ఆలోచించనవసరము లేకుండా శరీరానికే తోస్తుంది; అలా బాగు కాకపోతే అది అప్పటికే కలుషితమైపోయిందన్న మాట. ఆరోగ్యం శరీరానికి సహజస్థితి. ఏదైనా జరగరానిది జరిగి రుగ్మతకు లోనైతే అది తన సహజధోరణిలో నయమైపోతుందనే నమ్ముతుంది. వక్రధోరణి మాత్రం ఈ నమ్మకాన్ని వమ్ము చేస్తుంది. ఇక పెరిగి పెద్దవుతుంటే ఆలోచనలింకా వక్రంగా అయి, చుట్టుప్రక్కలవారి సాముదాయక ప్రభావం కూడా జోడై క్రమక్రమంగా శరీరానికి తన మీద తనకి నమ్మకం పోతుంది. ఈ విధంగా ఆత్మవిశ్వాసం కోల్పోవడం వల్ల ఏదైనా జరిగినప్పుడు చెదిరిపోయిన సమతను పునరుద్ధరించుకునే శక్తి కూడా పోతుంది.

దుష్ట బోధనల వలన నష్టము

చిన్నప్పట్నించీ ఈ విధంగా నిస్పృహ కలిగించేవి, నిరాశ కల్పించేవి అనేక మాటలు, వినాశకరమైన విషయాలు వింటుంటే

పాపం శరీరం మాత్రం ఏం చేయగలదు? తనకు చేతనైనంత చేయాలనుకుంటుంది. కానీ వికటించిపోవడంవల్ల, బలహీనమై పోయి తనలోని శక్తిని ఉపయోగించి జరిగినదానికి విరుగుడు చేసుకోగల సామర్థ్యాన్ని కోల్పోతుంది.

శరీరానికి దృఢ విశ్వాసము

ఇలా వికటితం కాకుండా జాగ్రత్తగా ఉంటే అన్ని పరిస్థితుల్లోను విజయం పొందగల నిశ్చలత్వం కలిగి ఉంటుంది. తప్పుడు ఆలోచనల ప్రభావాన్ని మనస్సు శరీరం మీద రుద్దితే అది దాని విశ్వాసాన్ని హరించడమే అవుతుంది. అందువల్ల ముందుగా శరీరంలో దృఢవిశ్వాసాన్ని కలిగించాలి. అది ఉన్నప్పుడు ప్రయత్నం అక్కర్లేకుండానే ఆకాంక్ష వెల్లివిరుస్తుంది. అంతర్గతమైన విశ్వాసం పురివిచ్చుతుంది.

శరీరం లోపల ఉన్న దైవాంశం దానికి తెలుస్తుంది. ఆ భావన పోగొట్టుకున్నప్పుడు నీ ప్రయత్నంతో దానిని తిరిగి పట్టుకోవాలి.

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకట్రామ శాస్త్రి

స్త్రీలకు ప్రత్యేకం

శ్రీమాత ప్రవచనములు

గర్భంలో శిశువు పెరిగేందుకు తగిన జాగ్రత్తలు ఎలా తీసుకుంటారో అదే విధంగా తల్లి మనస్సు గురించి కూడా జాగ్రత్త వహించాలి. ఎందుకంటె తల్లి మనస్సు పిల్లమీద చాలా ప్రభావాన్ని చూపిస్తుంది. తల్లి ఆశయాలు ఆకాంక్షలు శిశువులో ప్రతిబింబిస్తాయి. కాబట్టి వాటిని మంచి విషయములందే లగ్నం చేయాలి. పరిసరాలను పవిత్రంగా వుంచాలి. — సంపాదకుడు

శిశువు గర్భంలో వుండగానే జాగ్రత్త పడాలి

మనిషి పుట్టినప్పట్నుంచీ చివరిదాకా విద్య కొనసాగా

ల్సిందే. ఈ విద్య గరిష్ఠమైన ఫలితాలివ్వాలంటే అది గర్భ స్థంగా ఉన్నప్పట్నించే ప్రారంభం కావాలి. తల్లిగా స్త్రీయే ఈ విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టాలి. ఇది రెండు రకాల ప్రభావం కలిగి ఉంటుంది. ముందుగా తన అభివృద్ధి కోసం తెలుసు కుంటూ తర్వాత తను ఊపిరిపోస్తున్న శిశువు మీద ప్రభావం చూపిస్తుంది. పుట్టబోయే శిశువు స్వభావం చాలావరకు తనకు రూపాన్నిస్తున్న తల్లిమీదా, ఆమె ఆకాంక్షమీద, ఆమె నివసిస్తున్న పరిసరాల మీద ఆధారపడుతుంది. తన ఆలోచనలను స్వచ్ఛం గానూ, కమనీయంగానూ ఉంచుకోవడం, తలపులను సున్నితంగా, ఉదాత్తంగా ఉండేటట్లు, స్థూలపరిసరాలను సామరస్యపూరితంగా, సరళాత్మకంగా ఉండేటట్లు చూసుకోవడమే మాతృశ్రీకి విద్య అందించే సారాంశము. దానికి తోడు అందుబాటులో ఉన్న అత్యు న్నత ఆదర్శం ప్రకారం తన శిశువును రూపుదిద్దాలనే చైతన్యం, నిర్దుష్టమైన ఊహాకల్పన ఉంటే సమర్థవంతమైన శిశువు ఆగమ నానికి అది సరైన వాతావరణమన్న మాట. నిజానికి ఇలా చేయ గలిగితే తరువాత వచ్చే కఠిన పరిస్థితులు, క్లిష్ట సంఘర్షణలు తప్పించుకోవచ్చు గదా!

*

ఒక చక్కటి ఉదాహరణ

ఇద్దరు బాలికలు నాకీ నాటికి గుర్తు. వాళ్ళు చాలా చక్కటి కవలపిల్లలు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే వాళ్ళకి వాళ్ళ తల్లిదండ్రుల పోలిక లేమాత్రం లేవు. వాళ్ళను చూడగానే నాకు రెనాల్డ్ అనే చిత్రకారుడు రచించిన ప్రఖ్యాత చిత్తరువు గుర్తు వచ్చింది. ఈ విషయమే నేను ఆ తల్లితో అన్నాను. దానికామె వెంటనే స్పందించి "అది ముమ్మాటికి నిజము. ఆశ్చర్యకరమైన విషయం ఇంకోటి కూడా చెప్తాను. వారిని గర్భంలో మోస్తున్నప్పుడు నా మంచం దగ్గర రేనాల్డ్ చిత్రమొకటి గోడ మీద తగిలించి ఉండేది. *నేను రోజూ నిద్రపోయే ముందు తిరిగి ఉదయం లేచినప్పుడు ఆ చిత్రాన్నే చూస్తూ ఆహా! ఆ బొమ్మలో ఉన్నటువంటి పిల్లలు పుడితే బాగుండునని అనుకునే దాన్ని.* ఆ విషయంలో నేను

కృతకృత్యురాలనయాను చూశావా" అని ముగించింది. నిజమే ఆ విధంగా సాధించగలిగి నందుకు ఆమె ధన్యురాలు. ఆమెను దృష్టాంతంగా తీసుకోవటం స్త్రీల కెంతో మేలు.

అనువాదం: ఎ.వి.ఆర్. శాస్త్రి, ఎ. ప్రభావతి

యువతకు సందేశం

శ్రీమాత ప్రవచనములు

ఇంకా తెలుసుకోవలసిన దానితో పోలిస్తే, నీకు తెలిసింది ఏమీ లేదని నీవు ఎప్పుడైతే నమ్ముతావో,

చేయవలసిన దానితో పోలిస్తే, నీవు చేసింది కేవలం ప్రారంభమేనని ఎప్పుడైతే నీవు భావిస్తావో,

ఇంకా సాధించవలసిన అనేకానేక అవకాశాలతో భవిష్యత్తు ఎప్పుడైతే ఒక ఆకర్షణీయమైన సూర్యభగవానునిగా నీకు కనపడుతుందో, అప్పుడు నీవు యువకుడివే.

రేపు నీవు సాధించిన వాటితో, ఈ భూమిమీద నీవెన్ని సంవత్సారాలు గడిపినా, నీవు యువకుడవు ధనవంతుడవు కూడా.

ఒక విషయంలో నీవు ఖచ్చితంగా ఉండవచ్చు. నీ భవిష్యత్తు నీ చేతులలో ఉంది. నీవు ఏ విధమైన వ్యక్తిగా తయారు కాదలుచుకొన్నావో, అలానే తయారవుతావు. నీ ఆశయం, ఆకాంక్ష ఎంత ఉన్నతమైనవో, నీవు సాధించిందీ అంత ఉన్నతంగా ఉంటుంది.

అయితే నీవు దృఢంగా తీర్మానించుకుని, జీవితంలో నీ నిజమైన ఉద్దేశ్యాన్ని ఎప్పుడూ మరువకూడదు.

ప్రతిక్షణమూ, ఇంకో నూతనమైన జీవితంలోకి ఎలా తిరిగి జన్మించాలో తెలుసుకోవటమే, యువ్వనపు అసలు రహస్యం.

*

జీవితంలో నీకు దెబ్బతగిలిన ప్రతిసారీ, తక్షణమే నీకు నీవే "ఓ, నేనింకా ముందుకు వెళ్లాలి" అని చెప్పుకో. అప్పుడు ఆ విఘా

తమే నీకో ఆశీర్వచనంగా మారుతుంది. భుజాలమధ్య తలవంచు కోని కూర్చోక, సంతోషంతో తల పైకెత్తి చెప్పు "నేనింకా నేర్చు కోవాలసింది ఏముంది, అది నే తెలుసుకోవాలి. నాలో మారవల సిందేముంది. అది నే తెలుసుకోవాలి."

ఇదే నీవు తప్పక చేయవలసింది.

అనువాదం: కాకుమాని తారానాథ్

వందేమాతరం

శ్రీమాత ప్రవచనములు

'అమ్మా! నీ సందేశంలో నీవొకసారి చెప్పావు. భారతదేశపు మొట్టమొదటి సమస్య ఏమిటంటే, భారతదేశం తిరిగి తన ఆత్మను కనుగొని, దానిని ఆవిష్కరించాలి' అని. ఆత్మను కనుకోవటమంటే ఏమిటి?

నీ చైత్యపురుమడిని (psychic being) గురించి పూర్తి చైత న్యాన్ని కలిగి ఉండటం. నీ చైత్యపురుమడు ఎల్లప్పుడూ, తీవ్రంగా భారతీయ ఆత్మ పట్ల ఉత్సుకతను కలిగి ఉండి, దాని వైపే ఆకాంక్ష కలిగి ఉండాలి. అదీ ఒక సేవాభావంతో సుమా! నీవు గనుక నిజంగా శ్రద్ధాసక్తులు కలవాడివైతే, తప్పక విజయాన్ని సాధిస్తావు.

భారతదేశం భవిష్యత్తు కొరకే పనిచేస్తూ, తానొక ఉదా హరణ కావాలి. ఆ విధంగా ఆమె ప్రపంచంలో తన నిజమైన స్థానాన్ని తిరిగి పొందగలుగుతుంది.

ఇంతవరకూ, చాలా కాలంనుంచి, విభేదాలు వ్యతిరేకతల ద్వారా పాలించటమే అలవాటు.

ఇప్పుడు ఐక్యత, పరస్పర అవగాహన సహకారాలతో పాలించటానికి తగిన సమయమొచ్చింది.

నీకు సహకరించే వారిని కోరుకోవటంలో, అతనే పార్టీకి చెందినవాడు అన్న దానికన్న, అతని వ్యక్తిత్వం, అతని విలువలే చాలా ముఖ్యం.

ఒక దేశపు ఘనత, ఏ ఒక్క రాజకీయ పార్టీ విజయం మీద ఆధారపడి ఉండదు. అది అన్ని పక్షాల సమైక్యత మీద ఆధారపడి ఉంటుంది.

ఈ అహంకారపూరితమైన, స్వల్ప వ్యక్తిత్వాన్ని అధిగమించి, భారతమాతకు తగిన బిడ్డవుకా. నీ బాధ్యతలను న్యాయంగా, నైతికస్ఫూర్తితో నిర్వహించు. భగవత్‌కటాక్షం పట్ల స్థిరమైన నమ్మకంతో, ఎల్లప్పుడూ సంతోషంగా, ఆత్మవిశ్వాసంతో ఉండు.

అనువాదం: కాకుమాని తారానాథ్

సమాచార పత్రం

ప్రకటనలు:

శ్రీఅరవిందో సొసైటీ వార్షిక సమావేశములు పాండిచ్చేరి సొసైటీ బీచ్ ఆఫీసులో ఆగస్టు 12, 13, 14 తేదీలలో జరుపబడును. శ్రీఅరవిందుల 129 వ జయంతి, మనదేశ స్వాతంత్ర్య 54 వ వార్షికోత్సవము ఆశ్రమంలోను, దేశవిదేశములలోని శాఖలలోను, కేంద్రములలోను ఆగస్టు 15 న జరువబడును.

ఆశ్రమంలో ముఖ్య దినములు:

29 మార్చి 1914 నాడు శ్రీమాత శ్రీఅరవిందులను పాండిచ్చేరిలో కలసుకొనిరి. మరునాడు తన 'పార్థనలు - ధ్యానములు' లో ఈ విధంగా రాసుకొనిరి. "వేలకొలదీ మానవులు అజ్ఞానాంధకారములో మునిగియున్నా పరవాలేదు. నిన్న మేము చూసిన మహనీయుడు భూతలం మీదనే ఉన్నాడు. ఇక ఆయన సన్నిధియే మనకు పెన్నిధి. చీకటి పోయి వెలుగు వచ్చుననియు, పృథ్వీపై

6/7/2001.

విశ్రాంతి

శ్రీమాత ప్రవచనములు



అఖిల

అఖిల భారత పత్రిక

జూలై 2001

మీకిది తెలుసా?

నువ్వు కదలకుండా కూర్చొని వుంటే నీలో ఏమైనా మార్పు వచ్చిందో లేదో తెలిసే అవకాశం లేదు. ఒక వస్తువును ఉపయోగించినప్పుడే గదా దాని మంచిచెడ్డలని గురించి తెలిసేది. నువ్వు పనిచేసినప్పుడే నీ సామర్థ్యము రుజువవుతుంది. జీవితమే నీ ఆధ్యాత్మిక పెరుగుదలకి చక్కటి గీటురాయి. *నీవు చేసే ప్రతి పనీ, నీలో కదిలే ప్రతి ఆలోచనా నీ సాధనలో ఒక విశిష్టానుభూతిగా ప్రకాశించాలి.* ఆంతరంగికంలో పొందిన జ్ఞానాన్ని జీవితం అనే యజ్ఞవాటికలో ప్రవేశ్చాలి.

ఏ పనీ చేయకుండా ఎప్పుడూ ధ్యానమే చేస్తూ గడిపినట్లయితే నీలో ఏమైనా మార్పు వచ్చిందో లేదో తెలియదు. ఆధ్యాత్మికంగా నీవెంత వరకు పురోగమించావో ఎలా తెలుస్తుంది? అంతరంగికానుభూతిని బట్టి నీవెంతో గొప్పవాడివనే భ్రమలో పడిపోవచ్చు కాని బయట ప్రపంచంలో అడుగు పెట్టగానే నీ పస ఏమిటో తెలుస్తుంది. నీ బండారం బయట పడుతుంది. నువ్వు చేసే పనుల తీరు, ఇతరుల తోడి సంపర్కము, బాహ్యపరిస్థితులతో పొత్తు – ఇవన్నీ నీ ఆధ్యాత్మిక సాధనకు గీటురాళ్లు. నీవు పొందిన అభివృద్ధికి కొలమానము, ఇంకా పొందవలసిన సిద్ధికి సూచనలు.

నిర్వ్యాపారంగా చేతులు కట్టుకొని కూర్చుంటే ఎంతో గొప్ప విజయాన్ని పొందినట్లు భ్రాంతి కలగవచ్చు. ఎప్పుడైతే బైట ప్రపంచంలో పడతావో అప్పుడు నీకు బాహ్య వ్యవహారాల తోడి సంబంధము, మనుషులతోడి సంపర్కము కలిగి నువ్వు నిజంగా ఏమైనా ఆధ్యాత్మిక పరివర్తన చెందావో లేదో తెలిసిపోతుంది. ఏమాత్రం ప్రశాంతత, ఉన్నతచేతన, శక్తి, నిస్వార్థత గడించావో; కోరికలు ఉపశమించినయ్యో లేదో; ఇష్టాయిష్టాలు, వ్యసనాదులు ఎంత వరకు వదిలించుకో గలిగావో నీకు స్పష్టంగా తెలుస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: సంపాదకుడు

విశ్రాంతి

విషయసూచిక

విభాగము I: నిజమైన విశ్రాంతి

విభాగము II: ఆచరణ మార్గములు

విభాగము III: నిద్ర, ఆహారము, ధూమపానము, మద్యపానము

ఇతర వ్యాసాలు

విశ్రాంతి అనగా కదలకుండా కూర్చోటం కాదు. నీ చేతనని విశాలపరచి విశ్వచేతనతో ఏకమైనప్పుడు ఎంత కష్టమైన పనినైనా నువ్వు చేయగలుగుతావు. ఆశ్చర్యమేమిటంటే అదే సమయంలో నీకు విశ్రాంతి కూడ లభిస్తుంది.

శ్రీమాత రచనల నుండి

విభాగము: I

విశ్రాంతి

సాధనకు తగినంత విశ్రాంతి చాలా అవసరము.

*

మామూలు జీవితంలో అయితే కొంతసేపు పని చేయటం, తర్వాత కూర్చోటం ఉంటాయి. కాని సాధన అటుల గాదు. *అది ఒక నిరంతర వ్యాపారం. విశ్రాంతి అనగా తాత్త్వికచింతన. నిర్వ్యాపారమనగా (relaxation) అంతరంగిక విశ్రమము. సుఖమనగా దివ్యానందము.*

*

విశ్రాంతి అనగా చేతులు కట్టుకొని కూర్చోటం అనుకుంటావేమో. అలా చేసావంటే నువ్వు క్షుద్రశక్తులకు దొరికిపోతావు. అవి నీ ఆట పట్టిస్తయి. విశ్రాంతి అనగా బలహీనత కాదు – శక్తివంతంగావుండి కార్యరంగంలోకి దుమికేందుకు సిద్ధంగా ఉండటం.

*

మనకు కావలసింది అచేతన (inconscience) లోకి దింపివేసే తామసిక విశ్రాంతి కాదు. ఊర్ధ్వసీమలకు అధిరోహించి అక్కడి వెలుగు, శాంతి నిశ్చలతలను గ్రహించుట. నిజమైన విశ్రాంతి అనగా అదే.

*

నువ్వు పూర్తిగా దైవానుగ్రహమునే నమ్ముకున్నప్పుడు ఇక నీకే విధమైన సంశయముగాని, సందిగ్ధతగాని, "ఏం చేయాలి ఏం చేయాలి" అనే వేదనగాని ఉండవు. కోరికలను విరమించుకున్నప్పుడే, 'అహంకారం మీద విజయము తథ్యం' అనే నమ్మకమున్నప్పుడే నీకు నిజమైన విశ్రాంతి దొరుకుతుంది. నిన్ను నీవు పునరుద్ధరించుకుండేందుకు ప్రకృతిలో అవకాశమున్నది. కాని నీకు దానిని గురించి తెలియదు.

మూలం: శ్రీమాత

అనువాదం: సంపాదకుడు

అలసట తీర్చుకోట మెలా?

ప్రశ్న: సాధారణంగా, మనం బైట వాళ్లతో వాళ్ల ఉద్యోగాన్ని గురించో వ్యాపారాన్ని గురించో ముచ్చటించినప్పుడు బాగానే మాట్లాడుతారు. కాని వాళ్ల వ్యక్తిగత జీవితం సంగతి ఎత్తగానే ముడుచుకు పోతారు ఎందుకని?

మనుషుల ప్రవర్తన

అవును నిజమే. పనులు – ముఖ్యంగా సాంకేతిక వృత్తులు మనిషిని వికసింపజేసి అతని అభ్యుదయానికి దోహదమవుతాయి. కాని అదే మనిషి తన విధి నిర్వహించుకొని ఇంటికి వెళ్లినప్పుడు దారుణంగా ప్రవర్తించి మామూలు (నిమ్న) చేతనాస్థాయికి దిగిపోతాడు. చాలా మంది గొప్ప గొప్ప విద్వాంసులు, రచయితలు, కళాకారులు వాళ్లిళ్లల్లో చాల ఘోరంగా ప్రవర్తిస్తారు. భార్యాబిడ్డలను కష్టపెడతారు. కొంతమంది శాస్త్రజ్ఞులు, పెద్ద పెద్ద సంస్థల అధినేతలు మొ॥ గొప్పవాళ్లను గురించి నేను మాట్లాడుతున్నాను. ఎంతో గొప్ప మేధావులు, కళాకారులు ఇంటికి వెళ్లగానే విశ్రాంతి కావాలనే నెపంతో, వినోదం పేరుతో, మొరటుగా చాలా నీచంగా పామరులవలె ప్రవర్తిస్తారు. ఎందుకని? అలా చేస్తే విశ్రాంతట, వినోదమట. దాని వలన అధోచేతనలోకి దిగజారిపోతారని వాళ్లకి తెలియదు. నిజమైన విశ్రాంతి ఒక మెట్టు పైకి ఎక్కినప్పుడే లభిస్తుంది. నిమ్నచేతనలోకి దిగటంలో మరో ప్రమాదమున్నది. ఇదంతాపోయి అవచేతనలో పేరుకుంటుంది. నెత్తిమీద పెద్ద బరువుగా తయారవుతుంది అనమాట. తర్వాత దీన్నంతా వదిలించుకోని పరిశుభ్రపరుచుకో వలసి వస్తుంది. దీన్ని గురించి మరియొకరికి బోధించాలంటే ముందర నువ్వు తెలుసుకోవాలి.

పిల్లలకు ఇటువంటి విషయాలను గురించి ఎవ్వరు చెప్పరు. ఆటల పేరుతో ఏదో అల్లరి చేసి వాళ్లు కాలం వృథా చేస్తారు.

అందుకని నేను నొక్కి చెపుతున్నాను – నిమ్నస్థాయిలోకి దిగి అధోగతి పాలుకావద్దు. *నిచ్చెన పైకి ఎక్కినప్పుడే, చేతనా సోపానాన్ని అధిరోహించినప్పుడే నీకు నిజమైన విశ్రాంతి లభి*



Mirra (the Mother) with her brother, Mattéo Alfassa: France c1886

స్తుంది. నీలోకి శాంతి, కాంతి కిరణాలను ప్రవేశిస్తాయి. అంతే కాదు. అతిముఖ్యమైన విశ్వాంతర మహాశక్తులు నీకు దొరుకు తాయి. వాటి వలన నీవు లాభం పొందగలవు. సత్యమును దర్శిం చటం వలన దాంతో నీ సంబంధము అంతకంతకు పెరుగుతుంది. సత్యమే కదా జీవిత గమ్యము.

ఆ సత్యాన్ని కనుక పొందినట్లయితే నీలోని అలసటంతా మాయమైపోతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: సంపాదకుడు

చిన్న పిల్లలకు హితవులు

పిల్లల దృష్టంతా చదువు మీద, కొత్త విషయాలను తెలుసు కోవటం మీదనే వుండాలి. తోచకపోవటమనే ప్రసక్తే రాకూ డదు. ఆటలు, పాటలు ఒకటేమిటి ఎటు చూసినా వాళ్లు నేర్చు కోవలసిన విషయాలు వాళ్ల దృష్టిని ఆకర్షిస్తాయి. వాళ్ల కిష్టమైన విషయాల మీద ధ్యాస వున్నప్పుడు ఇక వాళ్లకి వాళ్లను గురించి ఆలోచించేందుకు గాని చిన్న చిన్న విషయాలను పట్టించుకో వలసిన అవసరంగాని వుండదు.

– అనువాదకుడు

చిన్నపిల్లలు చిన్నపిల్లలకు మల్లె వుండాలిగాని పెద్దవాళ్లల్లే ఆలో చనలతో బుర్ర వేడిచేసుకోకూడదు.

పిల్లల కుతూహలం అనంతం

నీ వయస్సులో నాకు చదువు తప్ప వేరే ధ్యాస ఉండేది కాదు. పుస్తకాలు చదవటం, కొత్తవిషయాలను గురించి తెలుసుకోటం, అర్థం చేసుకోటం – ఇదే నా లోకం, నా ప్రాణం. నన్ను, మా అన్నను మా అమ్మ ఎంతో ప్రేమగా చూసేది. మా ఇష్టమొచ్చినట్లు మమ్మల్ని ఆడుకోనిచ్చేది. మాకు పూర్తి స్వేచ్ఛ

లభించేది. మాకు ఏమైనా కావాలని మారాము చేస్తే 'అల్లరి చేయకండి' అని చెప్పి మమ్మల్ని నవ్వించేసేది. మాకు తోచటం లేదంటే కూడా అదే వరస "మీరు మంచి మూడ్‌లో వున్నారో చెడ్డ మూడ్‌లో వున్నారో నాకు అనవసరము. వెళ్లి ఆడుకోండి పొండి" అని మమ్మల్ని తరిమేసేది.

అవును మా అమ్మ చెప్పింది నిజమే. "నిన్ను గురించి ఆలోచించే బదులు నీ పని మీదనే ధ్యానమంతా నిలిపి అందులో నిమగ్నమై పోవాలి", అని మాకింత మంచి హితవు చెప్పి తగిన శిక్షణ ఇచ్చినందుకు మా అమ్మకు నేనెంతో కృతజ్ఞురాలిని.

ఇప్పుడు నేనిదంతా ఎందుకు చెప్తున్నానో అర్థమయిందా? నువ్వు చేస్తున్న పనిని గురించి, నేర్చుకుంటున్న విద్యను గురించి (పెయింటింగ్, సంగీతం మొ॥) శ్రద్ధ వహించినప్పుడు నువ్వు సంతోషంగానే వుంటావు. నీ పసిమనస్సుకు చదువు సంస్కారం బాగా అబ్బుతాయి. జీవితానికి అవసరమైన జ్ఞానం చేకూరుతుంది. అవి లేనివాడు పశుతుల్యుడు.

నువ్వు రోజుకి 8 గంటల సేపు పని చేసినట్లయితే బాగా ఆకలి వేస్తుంది. అన్నం బాగా తిని హాయిగా నిద్రపోతావు. ఇక నీ మూడ్స్‌ను గురించి ఆలోచించేందుకు అవకాశమే వుండదు.

నీ మీద ప్రేమ కొద్దీ నీకీ సంగతులు చెబుతున్నాను. నువ్వు అర్థం చేసుకొని ఆచరణలో పెడతావు కదు.

ప్రేమతో,
మీ అమ్మ

*

చిన్నప్పుడు మా అమ్మతోటి తిండిని గురించిగాని మరేమైనా చిన్న చిన్న విషయాలను గురించి అడిగినప్పుడు, ఇటువంటి చచ్చు విషయాలను పట్టించుకో కూడదని, వెళ్లి మా పనులు చూసుకోమని మమ్మల్ని పంపించివేసేది. "నువ్వు హాయిగా సుఖంగా జీవితాన్ని గడపాలనుకున్నావేమో. అదేం కాదు. అంత కంటె గొప్ప విషయాలని సాధించవలసి వున్నది" అని చెప్పి

నన్ను పంపించివేసేది. ఆమె చెప్పింది నిజమే కాని నేను సాధించ నున్న ఆ గొప్ప విషయాలేమిటో ఆమెకు ఊహ కూడ లేదు.

మూలం: శ్రీమాత

అనువాదం: సంపాదకుడు

డిప్రెషన్‌కు మందు

ప్రశ్న: డిప్రెషన్‌ని తగ్గించటమెలా?

డిప్రెషన్‌కు చికిత్స

ఏముంది చాలా సింపుల్. అది ఎక్కడి నుంచి వస్తుందో కనుక్కోవాలి. సాధారణంగా మనిషి ప్రాణిక విభాగంలోంచి వస్తుంది. నువ్వు ప్రాణికంలోకి ప్రవేశించి అక్కడే ఉండిపోయినట్లయితే నీకు డిప్రెషన్ తప్పకుండా పట్టుకుంటుంది. అంతకంటె లోతైన చైతన్యంలోకి ప్రవేశించటమే దీనికి మందు. దేదీప్యమానమైన ఉన్నతమనస్సు (higher mind) కి కూడ డిప్రెషనుని పారద్రోలే శక్తి వున్నది. మహోన్నతమైన మేధాసీమలను అందుకున్నా కూడ డిప్రెషన్ మాయమై పోతుంది. ఇంకా మంచి పద్ధతి చైత్యపురుషావేశము. చైత్యము (psychic) లోకి ప్రవేశించినట్లయితే డిప్రెషనుకి ఆస్కారమే లేదు.

రెండు కారణాలు

డిప్రెషనుకి రెండు కారణాలు వుంటాయి. వాంఛాలోలత్వ మొకటి. శరీరం అలసిపోవుట రెండవ కారణం. అలసట వలన కలిగినట్లయితే విశ్రాంతి తీసుకుంటే నయమయిపోతుంది. హాయిగా పడుకొని నిద్రపోతే అదే నయమవుతుంది. ప్రాణిక అసంతృప్తి వలన కలిగినట్లయితే దాని కారణ మెక్కడుందో వెతికి కనుక్కోవాలి; అది నీ అంతరంగిక ఆకాంక్షకు సంబంధించినదో లేక మామూలు అసంతృప్తేనో కనుక్కోవాలి. సాధారణంగా అది నీ అంతరంగిక ఆకాంక్ష కాదని తేలిపోతుంది. నీ మామూలు సాధనా కార్యక్రమము నిర్వ

హించుకుంటూ పోతే, లోతైన చైత్యాత్మను స్పర్శించినట్లయితే ఇక డిప్రెషను ఎక్కడిది? మాయమైపోతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: సంపాదకుడు

ఆత్మ పరిశీలన

మనిషికి ఇష్టమైన విషయాలు కొన్ని, అయిష్టమైన విషయాలు కొన్ని ఉంటాయి. విభిన్న ధోరణులు, వ్యక్తిత్వాలు ఒకే మనిషిలో దాగి వుండి గందరగోళాన్ని సృష్టిస్తాయి. నీలో జరిగే ఈ వింత లన్నిటిని గుర్తించి వాటిని క్రమబద్ధం చేసినప్పుడు నీ కేంద్ర వ్యక్తిత్వము స్పష్టంగా భాసిస్తుంది. ఇక నీ జీవితము అయోమయంగా నడవదు. వెలుగుబాటలో పయనిస్తూ వుంటుంది.

— సంపాదకుడు

ప్రశ్న: ఒకే మనిషిలో పరస్పర వ్యతిరేక భావాలున్నట్లు తోస్తుంది

మనిషి ఓ కలగూర గంప

అవును నిజమే. నిన్ను నీవు పరిశీలించుకుంటే చాల విచిత్రమైన విషయాలు తెలుస్తాయి. మనలో పరస్పర భిన్నమైన భావాలు దాగి వుంటాయి. ఒకసారి ఇది చెయ్యాలనిపిస్తుంది. ఇంకొకసారి అది చెయ్యాలనిపిస్తుంది. మరొకసారి మనస్సు మరోదాని మీదకు పోతుంది. అంతే కాదు. నీలోని ఒక భాగము యతి అంటే మరో భాగం ప్రతి అంటుంది. ఈ సంత గోలనంతా సంబాళించటం ఎలా? *ఒక సినిమా మాదిరి నిన్ను నీవు ఒక తెర మీదికి ప్రక్షేపించుకోవాలి. నీలో జరుగుతున్న వ్యవహారాన్నంతా ఒక ప్రేక్షకుని వలె గమనించాలి.* ఈ అనుభూతి ఎంత విచిత్రంగా వుంటుంది! ఇది మొదటి మెట్టు.

నిన్ను నీవు సంబాళించుకొనుట

నిన్ను నీవు ఒక తెరమీదికి ఎక్కించుకో. అక్కడేం జరుగుతోందో గమనించు. అప్పుడు నీలో సంభవిస్తున్న అనేక విషయాలు గోచరమౌతాయి. ఈ విధమైన సూక్ష్మదృష్టి నీకు బాగా అలవాటయిన తరువాత నువ్వు మరో అడుగు ముందుకు వేయవచ్చు. నీలోని విభిన్న భావనలను నియమింపజేసి గందరగోళంగా వున్న పరిస్థితిని స్థిమితము చేయవచ్చు. *అనగా నీ చేతనాస్థాయి పెరుగుతుందన్న మాట. నీ జీవితాన్ని అంతరంగికస్ఫూర్తితో సుసంపన్నము జేసి, నిర్దిష్టమైన గమ్యం వైపు నడిపించవచ్చు.*

జీవితలక్ష్యమును కనిపెట్టుట

క్రమేపి నీ జీవిత లక్ష్యాన్ని కనిపెట్టి జీవితాన్ని ఆ బాటపై నడిపించవచ్చు. దీని అర్థమేమిటి? ఇక నీలో జరిగే ఏ ఆలోచనా, చేష్టా, ప్రక్రియా వ్యర్థము గాదు. సర్వ ప్రక్రియలు తప్పక నీ కేంద్ర లక్ష్యమునకు నిమిత్తములు కావలిసిందే. ఇక నీ జీవితస్వరూపమే మారిపోతుంది. *ప్రతి చిన్న చర్య అర్థవంతమౌతుంది. చేతనాస్ఫూర్తిని కలగజేస్తుంది. ఇంకా కొంచెం ముందుకు వెడితే నీ భవిష్యత్తులో జరుగబోయే విషయము కూడ నీకు ముందరే తెలుస్తుంది.*

నేను చెబుతున్నదంతా అర్థమౌతుందో లేదో కాని ఈ విధంగా చేస్తే నీ జీవితం ఎంతో తృప్తికరంగా వుంటుంది. సంతోషదాయకమౌతుది. ప్రపంచంలో ఇంతకంటె విలువైనదేదీ లేదనిపిస్తుంది.

చిన్న వయస్సులోనే అనుభూతి

నాకు 5, 6 ఏళ్లప్పుడే ఇటువంటి అనుభూతి కలిగింది. 7 ఏళ్ల వయస్సు వచ్చేసరికి గాఢమైంది. మా నాన్నకు సర్కస్ అంటే చాలా ఇష్టం. ఆయన ఒక ఆదివారం నాడు నన్ను సర్కస్‌కి వెడదాం రమ్మని పిలిచాడు. నేను అంతకంటె చాల గొప్ప విషయాలనే అనుభవిస్తున్నానని, సర్కస్‌కి రానని చెప్పేను. ఇంకొకసారి కొంతమంది స్నేహితులు ఆడుకుందాం రమ్మని

పిలిచారు. "నేను రాను, అంతకంటె వెయ్యిరెట్లు ఎక్కువ ఆనం దాన్ని పొందుతున్నాను" అని చెప్పేను. అది నటన కాదు. నిజం గానే నాకు అలా అనిపించేది. ప్రపంచకంలో ఇంతకంటె అద్భుత విషయము ఇంకొకటి లేదనిపించింది.

ఒక సినిమా చూస్తున్నట్లుగా నిన్ను నీవు చూసుకోవాలి

ఎవరైన సరే చిత్తశుద్ధితో ఈ విధంగా చేసినట్లయితే చాలా అద్భుతమైన ఫలితాలు కలుగు తాయని, నువ్వు ఆశ్చర్యపోతావని నేను కచ్చితంగా చెప్పగలను. నిన్ను నీవు ఒక తెరమీద కెక్కించుకొని నీలో జరుగుతున్న విషయాలను గమనించాలి. అందులో ఒక వేళ నీకు ఇష్టంలేని విషయాలు ఏమైనా కనపడినట్లయితే 'ఛీ, ఏం కాదు' అని కళ్లు మూసుకోకూడదు. విశాల నేత్రాలతో అక్కడ కనపడుతున్న దాన్నంతా చూసి, దేని స్థానంలో దాన్ని అమర్చాలి. ఆ తరువాత మరో అడుగు ముందరికి పోయి "ఇదంతా నాలోనే కదా జరుగు తోంది. దీనిని ఇక్కడ పెడితే బాగుంటుంది. దాని నా విధంగా చేస్తే బాగుంటుంది. తలా తోకాలేని విషయాలని ఒక పద్ధతిలో అమరుస్తే బాగుంటుంది కదా. అడ్డంగా నిలుచున్న దానిని పక్కకు తొలగించాలి. ఇదేమిటి? ఇది ఇక్కడెందుకున్నది? దాని స్థానం ఇక్కడ కాదు. అదిగో నువ్వక్కడికి వెళ్లు. అప్పుడైతే నీవల్ల ప్రయోజనం కలుగుతుంది. నష్టం బదులు లాభమే కలుగుతుంది". ఈ విధంగా సర్దుబాటు చేసుకుంటూ పోవాలి. ఇలా సర్దుబాటు చేసుకుంటూ పోగా పోగా నీ నిజస్వరూపము స్పష్టంగా గోచర మౌతుంది.

సృష్టిలో నీవు పోషించవలసిన పాత్ర

ఈ లక్షణాలు నీలో ఎందుకని ఉన్నయ్యో, నువ్వు ఎందుకని పుట్టేవో నీ జన్మ కారణమేమిటో నీవు నిర్వర్తించ వలసిన కార్యమేమిటో అంతకంతకు విస్పష్టమౌ తుంది. అనగా నీ నిజస్వరూపము నీకు తెలిసిపోయిందన్న మాట. నీ మార్గము సుగమమౌతుంది. నీ ప్రయాణం సూటియైన మార్గ ములో చేయగలవు. అది నీకు విస్పష్టంగా తెలిసిపోయింది. ఒక

వేళ బాహ్యాపరిస్థితులు అడ్డు తగిలినప్పటికి "నాకిది కావాలి. దీని వలన ప్రయోజనముటుంది. ఇది వద్దు. నన్ను నష్టపరుస్తుంది", అని చక్కపెట్టుకుంటూ నీ జీవనయానాన్ని కొనసాగించగలవు. కొన్ని సంవత్సరాల తర్వాత నిన్ను నీవు చక్కగా నిర్వహిం చుకో గలవు. కనుక నువ్వు ఎక్కడికి వెళ్లినా సరే ఏం చేసినా సరే, ఎలా చేసినా సరే, ఏం పరవాలేదు.

ఈ విధంగా శ్రమించి ఈ ప్రక్రియను నువ్వు నేర్చుకున్న ప్పుడు ఎంత లాభముంటుందో చూసుకో. ఎన్నో అద్భుతమైన విషయాలను గురించి తెలుసుకోగలవు.

మూలం: శ్రీమాత

అనువాదం: సంపాదకుడు

వినోద కార్యక్రమాలు అవసరమా?

మనోవికాసము కలిగించేది చదువు. చదువు అనగా పుస్తకాలు చదవడమేనా లేక వాటికి తోడు ఆటపాటలు కూడా అవస రమా? మనోవికాసానికి ఆటలు పాటలు తప్పకుండా కావా ల్సిందే. అయితే ఆ పేరుతో పత్రికా పఠనము, కథలు చదవ టము, సినిమాలు, టి.వి చూడటం జరుగుతున్నాయి. అలిసి పోయిన మెదడు కణాలను సేదదీర్చి మెరుగుపరిచేందుకు ఇటు వంటివి ఎంతవరకు దోహదమవౌతాయి అనేదే ప్రశ్న.

— సంపాదకుడు

మనస్సుకు ఆహ్లాదము కలిగించటం అవసరమే

చదువుకునే పిల్లలకు, కేవలం పుస్తకాలతో విసిగి వేసారిపోయే వారికి, వినోదం కలిగించేందుకు కొన్ని సరదాలు కావాలన్న మాట నిజమే. పిల్లలకే కాదు. పెద్ద లకి కూడా ఇది అవసరమే. అయితే వినోదం పేరుతో ఏమాత్రం తెలివితేటలు అవసరంలేని చౌకబారు కార్యక్రమాలను అవలం

బించడం జరుగుతోంది. వాటి వలన మనిషిలోని పాశవిక లక్ష ణాలు పైకి వచ్చేందుకు అవకాశం కలుగుతుంది. కాని ఇటువంటి కోతిచేష్టలు చేస్తేగాని అలసట తీరదనుకోవటం చాలా పొరపాటు. One can relax without being dissolute పాశవిక ప్రవృత్తులను ప్రకోపింప జేయకుండానే అలసట తీర్చుకోవటం సాధ్యమే.

వినోదమనగా ఆత్మవంచన గాదు

ఏమి పనిచేయకుండా ఎట్టి ప్రయత్నము లేకుండా ఊరికే కూర్చోటం వలన జీవితగమ్యాన్ని మరచిపోయి, జన్మ కర్త వ్యాన్ని విస్మరించి, ఊరికే గాలికి బ్రతుకుతూ, నిన్ను నీవు వంచిం చుకోవటమే అవుతుంది. అది నీ సహజధర్మం కాదు. తప్పనిసరి కాదు. నీలో ఆకాంక్ష నీరసంగా వుండటం వలన, అజ్ఞానం వలన, చేతనారాహిత్యం వలన, సోమరితనము వలన అలా జరగవచ్చు. ఇట్టి లక్షణాలని నీవు సమర్థించకుండా వున్నట్లయితే ఆ లక్షణా లన్నీ విపరీతములే కాని స్వాభావికములు కావని నీకు తెలిసి పోతుంది. నీకు అయిష్టం ఏర్పడుతుంది. అప్పుడు మనుషులను పులకరింపజేసి వినోదింపజేసే బదులు అధోగతిపాలు చేసే ఈ క్షుద్ర వ్యాపారములను ఎవరూ ప్రోత్సహించరు.

మూలం: శ్రీమాత
అనువాదం: సంపాదకుడు

సోమరితనము పనికిరాదు!

దివ్యజీవనం కోసం ఆకాంక్షించలేని వారు విఫలజన్ములు. వారి జన్మ సార్థకం కానేరదు. కాని ప్రకృతికి ఇది ఇష్టమే. ఎందుకని? తనని ధిక్కరించేవారు ఎవరూ లేరు కాబట్టి, తన శాసనం దీర్ఘ కాలం కొనసాగుతూనే వుంటుంది. చిరకాలం తను రాజ్యమేల వచ్చు.

*

'సామాన్య ప్రజ' అంటే ఎవరు? పేదవాళ్లు, జన్మాధములు, విద్యాసంస్కృతులకు నోచుకొని అభాగ్యులు కాదు. ఏమాత్రం ఉన్నతాదర్శములు లేక, అన్నపానాదులతోనే తృప్తిజెంది వుండే చౌకబారు మనుషులు.

*

యోగసాధనలో ఏదైనా ఒక అద్భుతమైన అనుభూతిని పొంద గానే పొంగిపోయి అక్కడే ఉండిపోయేవు జాగ్రత్త. ప్రయాసపడి సాధించవలసినది ఇంకా చాలా వున్నది కాబట్టి హుషారుగా ఎగిరి గంతేసి ముందుకు సాగిపొమ్ము.

*

ఒక ప్రయాణ సత్రమునకు చేరుకున్నప్పుడు గమ్యము చేరుకు న్నావని భ్రమపడేవు జాగ్రత్త. అక్కడే చతికిల పడిపోకుండా ముందుకు సాగిపొమ్ము.

శ్రీఅరవిందులు: మెరుపులు తలపులు

ఈ సూక్తులలో శ్రీఅరవిందులు మానవస్వభావంలో పాతుకొని పోయిన ఒకానొక మందకొడితనాన్ని ఎత్తిచూపిస్తున్నారు. ఏ మార్పునకుగాని మనుగడకుగాని ఇష్టపడక పై పై మెరుగుల తోటే తృప్తిచెందుతూ కష్టపడకుండా, ఏ మాత్రం ప్రయత్నం చేయకుండా, వున్న చోటే చతికిలబడిపోయే మనుషులు మనకి జీవితంలో ఎదురౌతూనే వుంటారు. ఇంతకంటె మనకింకేం వద్దులే అని తృప్తిపడి అక్కడే కూర్చుండిపోతారు. "ఈ జన్మకిది చాలులే, ఇంతకంటే ఇంకేం కావాలి" అని అర్థాంతరంగానే ఆగిపోతారు.

మూలం: శ్రీమాత
అనువాదం: సంపాదకుడు

జీవితం విసుగుపుట్టకుండా ఉండాలంటే ఏం చేయాలి?

వినోదావకాశాలు పెరుగుతున్నప్పటికీ మనిషికి తృప్తి లభించటం లేదు సరి కదా తన లక్ష్యాన్ని అసలు గుర్తించలేక పోతున్నాడు. నీ మెదడుకు పదును పెట్టటం వలన ఎలాగైతే నీ మనస్సుకు తృప్తి కలుగుతుందో, అలాగే నీ చేతనను వృద్ధి చేసుకుంటే నీకు ఆత్మ వికాసం కలుగుతుంది. నీ కళ్లల్లోకి మెరుపు వస్తుంది. నీ ఒడలు పులకరించి జీవయాత్ర దివ్యంగా సాగిపోతుంది.

— సంపాదకుడు

దుఃఖాన్ని దూరం చేసుకోవటం, విసుగు పుట్టకుండా ఏవో వినోదాలతో కాలక్షేపం చేయటం మనిషి యొక్క రెండు ముఖ్యమైన వ్యాపకాలు. అతను తన విలువైన జీవితంలో సగం కాలం ఈ విధంగా వృథా చేస్తాడు.

బోరు కొట్టినప్పుడు తోచేందుకోసం మనుషులు ఏవేవో పిచ్చి చేష్టలు చేయటం, వెక్కిరించేటట్లు ప్రవర్తించటం కద్దు. (ఈ విషయంలో ధనవంతులు మరీ దురదృష్టవంతులు. వాళ్లకు అసలు పనిచేయాల్సిన అవసరమే వుండదు. ఇది ఏమంత గర్వించతగ్గ విషయం కాదు) వాళ్లు ఎందుకని అలా చేస్తారు? తోచకపోవటమే కారణం. ఏమి తోచకుండా, దేనియందు ఆసక్తి లేకుండా మన్నుతిన్న పాములే పడివున్నప్పుడు రెండు కొరడా దెబ్బలు తగిలిస్తేగాని వాళ్లకు చురుకుదనం పుట్టదు!

అయితే ప్రకృతిలో విశ్రాంతికి స్థానమున్నది. అలిసిపోయిన ప్రాణం తిరిగి శక్తిని పుంజుకుండేందుకు అది ఓ అవకాశమన మాట. అయితే ఈ సూచనలను గ్రహించి ఈ విరామసమయాన్ని సద్వినియోగం చేసుకోవటం ఎంతమందికి తెలుసు?

అంతరంగంలో జరిగే సంతగోలని శాంతపరచినప్పుడు కదా మనిషి జ్ఞానాన్ని పొందేందుకు అవకాశం కలుగుతుంది. కాని

చాలామందికి ఈ విషయం తెలియదు. ఏం చేయాలో పాలుపోక ఏవేవో పిచ్చిచేష్టలు (పనిలేని మంగలి...) చేస్తూ వుంటూరు.

*

చేతనాభివృద్ధి జీవితం యొక్క ముఖ్యాశయం

నీవు కష్టపడి దేనినైనా సాధించినప్పుడే కదా నీకు ఉల్లాసము, తృప్తి కలిగేది. చేతనాభివృద్ధి పొంది ముందుకు పురోగమించినప్పుడే కదా నీకు సంతోషం కలుగుతుంది. పెద్దవాళ్లకి పిన్నవాళ్లకి కూడ ఇది వర్తిస్తుంది. చేతనాస్థాయి పెరుగుదలకు ఈ భూలోక జీవితం ఒక గొప్ప అవకాశం. కాని సాధారణంగా మనుమలు ఈ విషయాన్ని గుర్తించక జీవితంతో కుస్తీ పడుతూంటారు. *జీవితం అంటె తిని కూర్చోటం కాదు. దాని కంతకంటె ముఖ్యమైన ప్రయోజనం మరొకటి వున్నది. అది ప్రగతికి క్షేత్రము. జీవితాన్ని ఈ దృష్టితో దర్శించావంటే దాని స్వరూపమే మారిపోతుంది. బ్రతుకంటె విసుగు పుట్టదు. ప్రతి క్షణం పులకరింపుగానే వుంటుంది.*

అందుకని నీకు నీ మాస్టారు చెప్పే పాఠాలు నచ్చకపోతే వృథాగా కాలయాపన చేసే బదులు, ఎందుకు నచ్చుటల్లేదో కనుక్కోవాలి. పరిశీలనాదృష్టితో గమనించినట్లైతే చాలా ఆశ్చర్యంగా నీ విసుగు మాయమయిపోతుంది. ఇక నీకు 'బోరు' అనిపించదు.

మనుగడలేని జీవితం విసుగు పుడుతుంది

ఈ మందు సాధారణంగా అందరికి పనిచేస్తుంది. ఒక్కొక్కప్పుడు ప్రతిది మహామందకొడిగా స్తబ్దంగా వుండి చాల పిచ్చిగా అనిపిస్తుంది. రోత పుడుతుంది. ఎందుకని? నీ పరిస్థితిని ఎత్తి చూపించేందుకే. నువ్వు కూడా ఆ పరిస్థితుల మాదిరే, చాల నిస్సారంగా వున్నావన్న మాట. ఒక మందకొడి గాలి వీస్తోంది. నీ జీవితగమ్యానికి ఇంతకంటె విరోధి మరొకటి లేదు. అటువంటప్పుడు నిన్ను నీవు కుదిపేసుకొని *"ఎందుకని ఇలా జరుగుతోంది. నేను నేర్చుకోవలసినది చాల వుందన్న మాట. నాలోని జడత్వాన్ని, మొద్దుతనాన్ని జయించాలన మాట"*

అనే పాఠాన్ని నేర్చుకొని ఆచరించాలి. నీ చేతన మారకుండా ఒకే స్థాయిలో వున్నప్పుడు నీకు విసుగు పుడుతుంది. చాలా చప్పగా వుంటుంది. అంతరంగంలో దానిని నయం చేసుకున్న ప్పుడు అది మాయమయి పోతుంది.

తోచనప్పుడు చాలామంది చేతనా సోపానంలో ఒక అంతస్థు పైకెక్కే బదులు కిందికి జారిపోతారు. మొదట వున్న చేతనా స్థాయికంటె ఇంకా కిందికి దిగజారిపోయి పిచ్చిపనులు చేస్తారు. అయోమయంలో పడిపోయి వినోదాన్ని పొందుతున్నట్లు భ్రమి స్తారు. మాదకద్రవ్యాలు సేవించి మెదడును మత్తుపరచి ఆరో గ్యాన్ని పాడు చేసుకుంటారు. కిందికి దిగజారిపోకుండా చేతనా స్థాయిని పెంచుకున్నట్లయితే వారీ అవకాశాన్ని పురస్కరించు కొని అభివృద్ధిని సాధించగలరు.

మూలం: శ్రీమాత

అనువాదం: సంపాదకుడు

విభాగము: II

క్రియలలో అచంచలత్వము

ఏమి పని లేనప్పుడు మనిషి నిదానంగా కూర్చోటం అంత కష్టం కాదు. కాని మానవుడు మనోప్రాణిక దైహికాలకి బద్ధుడు. వాటిచే ఆతని జీవితం నియమించబడుతుంది. ఇంద్రియాల ఒర వడికి లోబడిపోతుంది. నిజానికి కొన్ని మానవాతీత శక్తులు మనిషి వెనకాలనుండి అతనిని ప్రేరేపిస్తాయి. సాధన వలన ఆ శక్తులను ముందరకు రప్పించి జీవితాన్ని సుసంపన్నము చేయ వచ్చు.

— సంపాదకుడు

ప్రశ్న: మనమేదైనా పని చేస్తున్నప్పుడు కాని వ్యవహా రంలో నిమగ్నమైనప్పుడుగాని మనస్సు అటు ఇటు పరి గెడుతూ వుంటుంది. అలా జరగకుండా అచంచలంగా వుండటు మెలా?

అంతరంగమును కుదుటపరచుట

ఇది నీ అంతరంగానికి సంబంధించిన విషయము. నువ్వు మానవాతీతమైన దైవశక్తిని పూర్తిగా నమ్ముకున్నప్పుడు ఇక నీకు దాని ఊసెందుకు? *"దేవుడు నా ప్రార్థనను వింటాడు. దానికి జవాబు కూడ ఇస్తాడు. తగిన శక్తినిచ్చి నన్ను నడిపిస్తాడు" అనే గట్టి నమ్మకం గనుక నీలో వున్నట్లయితే నీలోని గోల అంతా సమసిపోయి నిన్ను ఒక నిశ్చలత్వము ఆవహిస్తుంది.* ఒక వేళ నీలో అనుమానం గాని, సంశయము గాని, నేను ఈ పని చేయగలనో లేనో, ఈ కార్యము పూర్తవుతుందో లేదో అనే విపరీతమైన ఆలోచనలు కనుక వున్నట్లయితే అవన్నీ నీకు అడ్డు తగులుతాయి. నీలో ఒక చిన్న తుఫాను చెలరేగుతుంది. ఆ దివ్యశక్తి స్పందనలు ఇక నీకు దొరకవు.

ప్రశాంతంగా వేచి వుండాలి

అటులగాక నిశ్శబ్దంగా వుండి నువ్వు ఆకాంక్షించావనుకో. అట్టి ఆకాంక్షకు ఫలితం తప్పకుండా కలుగుతుందని నమ్మకంతో వేచి వుంటావు. సాధ్యమయినంత ఆర్ద్రతతో ఆకాంక్షించాలి. అలా అని ఆవేదనపడి వెంటనే ఫలితం కలగాలని తొందరపడ కూడదు. సావధానంగా నిరీక్షించాలి. నేనిదివరలో చెప్పినట్లు ఓర్పుతో వేచి వున్నట్లయితే ఈ కార్యము తక్కువ కాలంలో నెరవేరుతుంది! అది నిజమే. తొందరపడి గంతులేసినట్లయితే అన్ని విధాల నష్టాలు పాలవుతావు. ఎక్కువసేపు పడుతుంది. కాలం వృథా అయిపోతుంది. నీ ప్రయత్నం నిరర్థక మౌతుంది. ఇటువంటి పరిస్థితి నుండి తప్పించుకోవాలంటె మార్గమొక్కటే. నువ్వతి నిదానంగా, నిశ్చలంగా, ప్రశాంతంగా "జరగవలసినది జరిగి తీరుతుంది" అనే నమ్మకంతో ఉండి, జరిగేదాన్ని జరగనిచ్చి నట్లయితే నీ పని త్వరగా జరిగిపోతుంది. ప్రశాంత వాతావరణంలోనే అద్భుతమైన ఫలితాలు కలుగుతాయి!

మూలం: శ్రీమాత

అనువాదం: రాయప్రోలు లక్ష్మి ప్రసాదమ్మ

విశ్రాంతులు కండి, మిమ్మల్ని మీరు విశాలం చేసుకోండి, శాంతిని ఆహ్వానించండి

ప్రశ్న: స్వీకరణ సామర్థ్యాన్ని ఏ విధంగా పెంచుకోవాలి?

సడలింపు చర్యలు

మొదటి షరతు: సాధ్యమైనంత నిశ్శబ్దంగా ఉండటం. నీ అస్తిత్వములోని వేరువేరు భాగాలలోకి ఏదైనా ఒక శక్తి వచ్చి దాన్ని నీవు స్వీకరించ లేకపోతే అవి ముడుచుకుపోతున్నట్లు గమనిస్తావు. ప్రాణిక స్థితిలో, మనస్సులో లేదా శరీరంలో కఠినం అయ్యేది ఏదో ఒకటి ఉంది. ఒక బిరుసుతనం ఉంది. అది దెబ్బ తీస్తుంది. అప్పుడు మానసిక, ప్రాణిక లేదా భౌతిక బాధ అనుభవం అవుతుంది కనుక, మొట్టమొదట చేయవలసింది నీ ఇచ్ఛను ప్రయోగించి ఈ ముడుచుకు పోవటాన్ని సడలించాలి. విశ్రాంతుడవు కావటం ఎలాగో, అస్తిత్వంలో ఏ భాగంలోనైనా ఏర్పడే ఈ బిగువును సడలించడం ఎలాగో నీవు నేర్చుకోవాలి.

విస్తరణకు మార్గములు

ఈ సంకోచాన్ని సడలించే పద్ధతి మనస్సులోను, ప్రాణికస్థితిలోను శరీరంలోను వేరు వేరుగా ఉంటుంది. కాని దాని మూలరూప మొకటే. ఒకసారి ఒత్తిడిని సడలించిన తర్వాత నీకు సరిపడని ఫలితం ఆగిపోయిందో అని మొదట చూస్తావు. అది ఒక చిన్న క్షణిక నిరోధమని రుజువవుతుంది. కాని బాధ కొనసాగినట్లైతే, నీకు సహాయపడేదాన్ని తప్పక స్వీకరించవలసిన దాన్ని స్వీకరించటం కోసం స్వీకరణ సామర్థ్యాన్ని అధికం చేయటం అవసరం అయినట్లైతే, ఈ సంకోచాన్ని సడలించిన తర్వాత నిన్ను నీవు విశాలం చేసుకోటానికి ప్రయత్నించటం ఆరంభించు – నిన్ను నీవు విశాలం చేసుకుంటున్న అనుభూతి కలుగుతుంది. వీపు క్రింద చెక్క పెట్టుకొని నీటి మీద తేలిపోతునట్లు ఊహించటం కొంతమందికి ఉపయోగకరంగా కనిపిస్తుంది. అప్పుడు వారు తమను తాము విశాలం చేసుకొంటారు. విస్తార జలరాశితో

ఒకటి అయ్యేదాకా విశాలం అవుతారు. మరికొందరు ఆకాశంలో నక్షత్రాలతో ఒకటి కావాలని ప్రయత్నిస్తారు. కనుక అధికాధికంగా ఆకాశంతో తాము ఒకటి అయిపోయి విశాలం అవుతారు.

చేతనా పర్యాప్తి

ఇంకా కొందరికి ఈ మానసిక చిత్రాలతో అవసరం ఉండదు. వారి చైతన్యాన్ని గురించి వారు తెలుసుకోగలరు. అది అపారం అయ్యే వరకూ మరీ మరీ దాన్ని విస్తారం చేస్తారు. భూమి అంత, విశ్వం అంతగా కూడా అది విశాలం అయ్యేటట్లు చేయగలరు. ఆ విధంగా చేస్తే ఎవరైనా నిజంగా స్వీకరణ సామర్థ్యంకల వారవుతారు. నేను చెప్పినట్లు ఇది శిక్షణకు సంబంధించిన విషయం. ఏది ఏమైనా తక్షణ దృష్టిలో, ఏదైనా వచ్చినప్పుడు అది చాలా బలంగా ఉందనిపించి తలనొప్పి కలగచేసినపుడు, దాన్ని సహించలేనప్పుడు, పద్ధతి అదే. సంకోచం మీదనే వర్తించాలి. ఆలోచన ద్వారా కూడా చేయవచ్చు. శాంతిని నిశ్చలత్వాన్ని పిలవవచ్చు "(శాంతి అనుభూతి చాల వరకు ఇబ్బందిని తొలగిస్తుంది) శాంతి, శాంతి, శాంతి... నిశ్చలత్వం... స్థిరప్రశాంతి" అంటూ అనేక అసౌకర్యాలు, నాభీకేంద్ర సంకోచం వంటి ఎంతో అనిష్టమై, కొన్నిసార్లు వికారాన్ని కలిగించి ఉక్కిరిబిక్కిరి అయినట్లు తిరిగి శ్వాసించలేనట్లు అనిపించిన భౌతిక అసౌకర్యాలు కూడా, ఆ విధంగా మాయమై పోతాయి. ప్రభావానికి లోనయింది నాడీకేంద్రం అన్న మాట! సులభంగా అది ప్రభావితం అవుతుంది. నాభీకేంద్రానికి ఏదైనా జరిగిన వెంటనే "స్థిర ప్రశాంతి... స్థిర ప్రశాంతి... స్థిర ప్రశాంతి..." అని నీవు అనాలి. ఒత్తిడి తగ్గేంత వరకూ నీవు అధికాధికంగా స్థిరప్రశాంతుడవు కావాలి.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఆలోచనలో కూడా అంతే. ఉదాహరణకి నీవు ఏదో చదువుతున్నావు. అర్థంకాని పాఠం ఏదో నీకు తారసిల్లుతుంది. అది నిన్ను మించింది, నీకేమీ అర్థం కాదు. కనుక అది నీ తలలో ఓ రాయిలాగ ఉంటుంది. దాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తే ఇంకా ఇంకా బిరుసెక్కిపోతుంది. దాని వెంట

బడితే నీకు తలనొప్పి వస్తుంది. అప్పుడు చెయ్యవలసింది ఒకటే. *మాటలతో కుస్తీ పట్టకుండా ఉండటం. ఈ విధంగా ఉండు. (సంజ్ఞ: బయటకు చాచటం, అచలంగా ఉండటం) సడలింపును సృష్టించు. విశాలం అయిపో, విశాలం అయిపో, అర్థం చేసుకొనే ప్రయత్నం మాత్రం చేయకు. అన్నింటినీ మించి అర్థం చేసుకోవాలని ప్రయత్నించ వద్దు. నెమ్మదిగా దాన్ని అలానే నీ లోపలకి రానీ. విశ్రాంతి పొందు.* ఈ విశ్రాంత స్థితిలో నీ తలనొప్పి ఎగిరిపోతుంది. ఇక దేన్ని గురించీ నీవు ఆలోచించవు. కొద్ది రోజులు ఎదురు చూడు. కొన్నిరోజుల తర్వాత లోపలినుంచి నీకు అనిపిస్తుంది. “అబ్బ! ఎంత స్పష్టంగా ఉంది! నాకు ఇది వరకు అర్థంకానిది అర్థం అయింది”. అంత తేలిక మరి! స్వయంగా అభేదస్థితి పొందే పద్ధతి.

నరాలను సమాధాన పరచుట

నరాల వ్యాధులు నయం చేయటానికి ఈ రోజుల్లో ఉపయోగిస్తున్న పద్ధతుల్లో ఇది కూడా ఒకటి. అది ఉద్రేకంవల్ల గాని కంగారు పిరికితనంవల్ల గాని ఎవరికైనా నరాలు వ్యాధిగ్రస్తమై అతికలవరంవల్ల బలహీనపడితే, అతడిని ఎక్వేరియమ్ ముందు కూర్చోమని చెబుతారు – ఎక్వేరియమ్ మనోహరంగా ఉంటుంది కదా – చిన్న చిన్న బంగారురంగు చేపలున్న ఎక్వేరియం ముందు కూర్చోవాలి. పడక కుర్చీలో స్థిరపడాలి. దేన్ని గురించీ (ప్రత్యేకించి అతని బాధలను గురించి) ఆలోచించకుండా, చేపలనే చూడాలి. కనుక అతడు అటూ ఇటూ తిరుగుతూ, వస్తూపోతూ, ఈదుతూ, జారుతూ, కలుస్తూ, ఒకదానినొకటి దాటిపోతూ, ఒకదానివెంట మరొకటి పడుతూ ఉన్న చేపలను చూస్తాడు. నెమ్మదిగా ప్రవహిస్తున్న నీటిని, కదలిపోతున్న చేపలను చూస్తాడు. కొంతసేపటికి తానూ చేపల లాగానే జీవిస్తాడు. అతడు కూడ వాటితోపాటు వస్తాడు, పోతాడు, ఈదుతాడు, జారతాడు, ఆడతాడు. దాంతో అతని నరాలు కుదుటబడతాయి. అతడు సంపూర్ణమైన విశ్రాంతి పొందుతాడు.

అయితే ఒక్క షరతు: తన బాధలను గురించి మాత్రం అతడు ఆలోచించకూడదు. చేపలనే చూస్తూ ఉండాలి సుమా!

మూలం: శ్రీమాత

అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రరావు

అపారమైన శక్తి నిధులు

శరీరపోషణకు ఆహారమవసరం. మనిషికి కావలసిన శక్తి ఆహారంనుంచి లభిస్తుంది. కాని యోగం ద్వారా మరోరకమైన శక్తినిధులను గురించి మనకు తెలుస్తుంది. పృథ్వీలో అపారమైన శక్తినిధు లున్నాయి. పిల్లలు అప్రయత్నంగానే ఆ శక్తులను పొందగలుగుతారు. అంతకంటె గొప్పశక్తులు ఉన్నత లోకాల నుంచి లభించగలవు. యోగం ద్వారానే అవి లభ్యములు. ఆ శక్తులను కనుక గ్రహించ గలిగితే ఇక మనిషికి చాతకానిదంటూ ఏమి వుండదు. వ్యాధులు, వృద్ధాప్యము, మరణము ఇవేమియు అతనిని భయపెట్టవు.

— సంపాదకుడు

క్రీడాకారులు అలిసిపోయినప్పుడు యోగం ద్వారా విశ్వశక్తులను ఎలా గ్రహించాలో నేర్చుకున్నట్లయితే పోగొట్టుకున్న శక్తిని తిరిగి పుంజుకోగలరు.

శరీరానికి ఎటువంటి పోషక పదార్థాలు కావాలో, తగిన శక్తిని ఎలా సమకూర్చాలో ఆధునిక విజ్ఞానశాస్త్రం ద్వారా మనకు తెలుసు. అయితే ఈ పద్ధతులు ఎంత ఉపయోగించినప్పటికి వాటి వాడకంలో కొన్ని అనర్థాలున్నాయి. వాటి వలన కలిగే ఫలితములు కూడ అంతంత మాత్రమే. ఈ విషయాన్ని గురించి అది వరకే చాలా క్షుణ్ణంగా చర్చించటం జరిగింది. కాబట్టి మళ్లీ దానిని పునరావృతం చేయనవసరం లేదు. అయితే ఒకటి మట్టుకు

మనం గుర్తించాలి. నేటి మానవుని సామర్థ్యాన్నిబట్టి, ప్రాపంచిక పరిస్థితినిబట్టి మనిషి ఆహారంద్వారా మాత్రమే శక్తిని పొందగలడు. యోగం ద్వారా శక్తిని పొందేందుకు ఇతర మార్గాలు వున్నాయి. వాటిలో రెండు ముఖ్యమైన పద్ధతులను గురించి మనం తెలుసుకుందాము.

ప్రకృతిలో నిక్షిప్తమైన శక్తులు

ప్రకృతిలో నిక్షిప్తంగావున్న శక్తినిధులతో సంపర్కము చెంది వాటిని సంపాదించుకోవటం మొదటి పద్ధతి. అయితే ఇందులో ఒక ప్రమాదమున్నది. ఈ భౌతికశక్తులు గ్రుడ్డివి, దోషభూయిష్టములు. అవి మానవులలోని పాశవిక లక్షణాలను ప్రకోపింప జేస్తాయి. కాని ఇందులో కొంత మంచి కూడా లేకపోలేదు. వాటిద్వారా మానవునికి భౌతికంతో పొత్తు కుదురుతుంది. మైత్రి పెరుగుతుంది. ఈ శక్తులను గ్రహించ గలిగితే వారు జీవితంలో చాల ప్రయోజనవంతులౌతారు. వాళ్లు పట్టిందల్లా బంగారమౌతుంది. కాని ఇందులో ఒక లోపం కూడ లేకపోలేదు. పరిస్థితుల అనుకూలత మీద, శరీరారోగ్యం మీద ఆధారపడి వుండాల్సి వుంటుంది. పరిస్థితులు వికటించినప్పుడు వారు కూడ దాంతో పాటు తందాన తాన పలకాల్సి వుంటుంది.

పిల్లలు విశ్వశక్తులను గ్రహించగలరు

చిన్నపిల్లల విషయం వేరు. వాళ్లు అమాయకులు. విధి విరామం లేకుండా అలా ఆడుకుంటూనే వుంటారు. వాళ్లు వ్యయం చేసే శక్తినంతా విశ్వనిధులలో నుంచి మళ్లీ పూడుకుంటుంది. పెద్దవుతున్న కొద్దీ వాళ్లల్లో ఈ సామర్థ్యం తగ్గిపోతుంది. ఈ వెధవ మనసొకటి వున్నది కదా మనిషి నల్లరి పెట్టేందుకు – బాదరబందీలు పెరుగుతున్న కొద్దీ ఆ శక్తిని పొందే విధానం కూడ మరచిపోతాడు. ఆ శక్తిని పొందేందుకు ఇంతకంటే మేలైన మార్గము మరొకటున్నది. అది బాహ్యాపరిస్థితుల మీదగాని, మనిషి స్థితిగతుల మీదగాని ఆధారపడనిది, మహత్తరమైనది, ఎప్పటికి తరిగిపోని ఓ అనంత సాగరము. అది ఆధ్యాత్మికశక్తి అనుకోండి. దాని మూలము అజ్ఞాన అచేతన

కూపాలలో లేదు. అది విశ్వసృష్టికి, మానవుని ఆవిర్భావానికి మూలమైన పరమోన్నత లోకాల లోనిది.

అపారమైన శక్తినిధులు

ఆ శక్తి మహాచైతన్య సీమలకు చెందినది, మనలను అన్ని వైపుల పరివేష్టించి వుంటుంది. సర్వవస్తువుల యందు వ్యాపించి వుంటుంది. మానవమాత్రులకు దానిని అందుకొని ఆ శక్తులను పొందటం సాధ్యమేనా? *తప్పకుండా సాధ్యమే. చిత్తశుద్ధితో తపించాలి. దాని కోసం ఆకాంక్షించాలి. దానిని నీలోకి ఆహ్వానించాలి. దాని కోసం నీ ద్వారాలు తెరచిపెట్టాలి. నీ చేతనను విస్తరింపజేసి విశ్వచైతన్యంతో తాదాత్మ్యం చెందాలి.*

శక్తి నిధులను గ్రహించుట

"అయ్య బాబోయ్ ఇంత తంత్రాన్ని నడిపించటం ఎలా? దీన్ని ఎవరు సాధించగలరు? అని అనుకుంటావేమో?" కాని కొంచెం నిదానంగా ఆలోచించి చూసినట్లయితే ఇది మరీ అంత విచిత్రమైన విషయమేమి కాదు. సాధారణ మానవ చైతన్యానికి కూడా అందే విషయమే. జీవితంలో ఒక్కొక్కప్పుడు ఒక మహాశక్తి వచ్చి నిన్ను ఆవహించి చాల అసాధ్యమైన కార్యమును నెరవేర్చటమనేది ప్రతివారికి ఎప్పుడో ఒకప్పుడు అనుభవమయ్యే వుంటుంది. అప్పుడు ఏ పని అయినా చెయ్యగలం అనిపిస్తుంది. అది దుర్భేద్యము, అసంభవము అనిపించదు.

ఈ అనుభూతి వలన మనకి ఓ విషయం స్పష్టంగా తెలుస్తుంది. యోగశిక్షణ పొందటం ద్వారా ఆ మహాశక్తిని స్పృశించి ప్రయోజనం పొందవచ్చని తెలుస్తుంది.

దీనికి అవలంబించ వలసిన పద్ధతి మాటలతో వర్ణించి చెప్పటం అంత తేలిక కాదు. అది మనిషి తత్త్వాన్నిబట్టి ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా వుంటుంది. మనిషి చేతనాస్థాయిని బట్టి ఒక్కొక్క అడుగు ప్రత్యేకంగా (tailored) ఆవిష్కారమౌతుంది. అతనిలో ఎటువంటి మార్పు రావాలో దానికి మార్గమేమిటో – ఒక్కొక్కప్పుడు మార్గము చాలా దీర్ఘంగాను నత్తనడక వలె వుంటుంది. అయితే ఏం? 'కష్టేఫలే' అన్నారు కదా. కష్టపడ్డా

కూడా దానికి తగిన ఫలితం దక్కుతుంది. ఎటువంటి పరిస్థితులలోనైనా సరే అంతటి మహాశక్తిని అందుకొని నువ్వు అవసరమైనప్పుడు గ్రహించగలిగినట్లయితే అంతకంటె ఇంకేం కావాలి? *ఇక నీకు చేతకానిదంటూ ఏమి వుండదు. ఎంతటి మహాకార్యమునైనా అవలీలగా సాధించగలుగుతావు. నీకు అలసట అనేది వుండదు.* రోగాలు, వృద్ధాప్యము మృత్యువు అన్నా కూడా భయపడవలసిన అవసరము లేదు. అవన్నియు మార్గములో సంభవించే అవరోధములే కాని మరేమి కావనియు, పట్టుదలతో వాటిని కూడా జయించవచ్చు ననియు తెలుస్తుంది.

మూలం: శ్రీమాత
అనువాదం: సంపాదకుడు

ప్రాణికము (vital) మూడు చోట్ల నుంచి శక్తిని పుంజుకోగలదు. ఇంద్రియాలద్వారా వచ్చే భౌతిక శక్తులు తేలికగా దొరుకుతాయి.

శక్తికి రెండవ మూలము తన తలములోనే (plane) ఉంటుంది. నీలోని ప్రాణిక విభాగము విశాలమై విశ్వవ్యాప్తమై గ్రహణసామర్థ్యమును పొందినప్పుడు అపారమైన విశ్వశక్తులను పొందగలదు. మూడవది చాల కష్టమైనది. యోగములో చాలా పైకి వెళ్లిన వారికే ఇది సాధ్యము. ప్రగాఢమైన ఆకాంక్ష కలిగి, అధికతరమైన ఆవేశము కలిగినప్పుడు మాత్రమే ఈ ఆధ్యాత్మిక శక్తులను అందుకొనుట సాధ్యము.

శ్రీమాత

సోమరితనం చాలా ప్రమాదము

ఉదరపోషణార్థం పని చేయాలని, ఆ తరువాత హాయిగా కూర్చోవచ్చని అందరూ అనుకుంటారేమో కాని, అది ధర్మానికి విరుద్ధం. మానవజీవితం ప్రగతికి క్షేత్రం. అభివృద్ధి కవకాశం. పరిణామానికి సాధనం. కదలకుండా కూర్చుంటే నువ్వీ అవకాశాన్ని పోగొట్టుకున్నట్లే. దేవుని ఉద్దేశాన్ని వమ్ముచేసినట్లే. నీ జీవితాన్ని వృథాపరచినట్లే. విశ్రాంతి అనగా కదలకుండా కూర్చోటం కాదు. నీ చేతనని విశాలపరచి విశ్వచేతనతో ఏకమైనప్పుడు ఎంత కష్టమైన పనినైనా నువ్వు చేయ గలుగుతావు. ఆశ్చర్యమేమిటంటే అదే సమయంలో నీకు విశ్రాంతి కూడ లభిస్తుంది. ఏమి పనిచేయకుండా వుంటే నీకా శక్తుల మీద హక్కు లేదు.

— సంపాదకుడు

వయస్సులో ఉన్నప్పుడు కష్టపడి పుష్కలంగా డబ్బు సంపాదించడం, ఆ తరువాత కాలుమీద కాలు వేసుకొని కూర్చోటం — ఇది ఒకనాటి సాంప్రదాయము. పదవి, హోదా, ఇల్లు, వాకిలి ఒకటేమిటి నడివయస్సుకల్లా కావలసినన్ని ఆస్తిపాస్తులు కూడబెట్టుకొనటం.

> *నిర్వ్యాపారంగా ఉంటే మనిషి శిథిలమైపోతాడు*

ఈ విధమైన జీవనసరళి సోమరితనాన్ని పెంచి ప్రగతిని కుంటుపరచింది. ఒకే చోట చతికిలపడిపోయి కావలసినంత డబ్బు వున్నది కదా, ఇక కష్టపడాల్సిన అవసర మేముంది అనే భావాన్ని పెంచింది. నిర్వ్యాపారంగా వుండుటవలన జీవితం పసలేకుండా పోతుంది. మనిషి క్షీణించిపోతాడు. శరీరం శిథిలమైపోయి ఇక మరణమే శరణమా అన్నట్లు వుంటుంది. కాబట్టి ఈ వాదన సరికాదు. ఎప్పుడైతే మనిషి వుత్సాహంగా పురోగమించడో అప్పుడు వెనక్కి జారిపోతాడు. క్రింద పడిపోతాడు. ఎందుకని? ఒక వస్తువుని వాడకుండా వుంటే తుప్పుపట్టి కొన్నాళ్లకి పనికిరాకుండా పోతుంది. మనిషి కూడా

అంతే. డబ్బు వున్నది కదా ఇక పనిచేయటం ఎందుకులే అని తృప్తిపడి కూర్చుంటే నీ జీవితం సార్థకమైనట్లే! జీవితాన్ని శిథిలం చేసుకోకూడదు. దేవుడు నీకు కరచరణాదులను, మెదడును వూరికే ఇవ్వలేదు. ఉపయోగించుకోవడం కోసం ఇచ్చేడు. క్రమక్రమ ప్రవర్థమానం చెంది ఇంకా పైకి ఎదగటమే సృష్టియొక్క ఉద్దేశ్యము. *కాబట్టి నువ్వు అవిరామంగా ఆవేదనతో ఆకాంక్షిస్తూ వుండాలి. ఒకే చోట పడి వుండకూడదు. ఒక్క నిముసమైనా వృథా చేయరాదు. జీవితమంటె నిరంతర ప్రయత్నమూ, కదలికా ముందుకు సాగిపోవటం, పర్వతారోహణము, నిత్య నూతనత్వము, సిద్ధులు పొందటం, భవిష్య దర్శనము.*

విశ్రాంతికి మార్గము

నీకు విశ్రాంతి కావాలంటె ఏం చేయకుండా కూర్చుంటే సరిపోదు. ఉత్సాహంతో ప్రయత్నం ద్వారా ముందుకు పురోగమించటం లోనే నువ్వు విశ్రాంతిని పొందగలవు. ఇదేమిటి, పనిలో విశ్రాంతా అంటావేమో? ఎప్పుడైతే నువ్వు నీ కంటె అధికమైన శక్తియందు విశ్వాసాన్ని నిలుపుతావో, ఎప్పుడైతే కోరికలను పరిత్యజించెదవో, ఎప్పుడైతే అహంకార రక్కసిని తిరస్కరించెదవో అప్పుడు నీకు ఏ బెడద వుండదు. పని చేస్తున్నప్పుడు కూడ నిశ్చలత్వాన్ని పోగొట్టుకోవు.

చిత్తపర్యాప్తి ద్వారానే, చేతన విస్తరించి విశ్వవ్యాప్తమైనప్పుడే నీకు నిజమైన విశ్రాంతి (repose) లభిస్తుంది. అంటె మనస్సు పరిపరివిధాల పరిగెత్తటం మానేస్తుంది. నువ్వు ప్రపంచ పరిమాణానికి ఎదిగినప్పుడు నీ కెప్పుడూ నైశ్చల్యమే. ఎంత కష్టమైన పని చేస్తున్నా సరే, యుద్ధరంగంలో పోరాడుతున్నా సరే. నీ నిశ్చలత్వము ప్రగాఢమై అనంతమై చెక్కుచెదరకుండా వుంటుంది.

విశ్వశక్తులను గ్రహించుట

విశ్వంలో అపారమైన శక్తి నిధులున్నాయి. మనిషి వాటిని గ్రహించగలిగితే అతని కెప్పుడూ సంతోషమే. నిరంతరానందమే. మనిషి శ్రమించటం ద్వారా ఆ విశ్వశక్తులను పట్టుకోగలుగు

తాడు. ఆ ప్రయత్నం మేధతో కావచ్చు. నైతికం శారీరకము కూడ కావచ్చు. నీవు చేయు ప్రయత్నము వలన కొన్ని తరంగములు ఉత్పన్నమై, ప్రసారమై విశ్వతరంగములతో అనుసంధానము కాగలవు. అప్పుడిక నీకు కలిగే తృప్తి సంతోషములు వర్ణనాతీత ములు. దానిని చెప్పేందుకు భాష ఎందుకు పనికిరాదు. *కాబట్టి నీకు ఎప్పుడైనా తోచకుండా వున్నా, విసుగ్గావున్నా, 'ఛీ ఇదే మిటి'. అని లేచి విజృంభించు. క్రియాశీలుడవుకా. రంగంలోకి దుముకు. జీవితం నిరుచప్పగా జడమయంగా వుంటే ఇదే మందు. నీ ప్రయత్నం ద్వారా విజృంభణ ద్వారా నీలోని ద్వార ములు తెరవబడి విశ్వమహాశక్తులు నీలోకి ప్రవేశిస్తాయి.* నీకు నిజమైన సంతోషాన్ని ఈ శక్తులు మాత్రమే ఇవ్వగలవు. మన స్సును ఉల్లాసపరచగలవు. ఆకాంక్ష అంటె ఏమిటో ఆధ్యాత్మిక జీవితమంటె ఏమిటో తెలియని వాళ్లు కూడ ఇటువంటి సంతో షాన్ని పొందుతూ వుంటారు. దానికి అసలు కారణం వారికి తెలి యక పోవచ్చును. కాని వాళ్లకి విశ్వశక్తులతోడి వినిమయము (exchange of forces with universal forces) పొందినప్పుడే ఇంతటి ఆనందం కలుగుతుంది.

*

నువ్వు నీ జీవితాన్ని సార్థకంగా గడపాలి. నిష్ప్రయోజనంగా గడిపినట్లయితే త్వరగా వృద్ధాప్యము వచ్చేస్తుంది. ఎంతకాలం వృథా చేస్తే అంత త్వరగా వచ్చేస్తుంది. దీని అర్థమేమిటి? యోగంలో ఏమాత్రం పెరుగుదల లేకుండా వున్నట్లయితే చేత నలో అభివృద్ధిని సాధించలేక పోయినట్లయితే ఒక్క అడుగు కూడ ముందుకు వెళ్లలేకపోతే ఆ మేరకు, ఆ కాలమంతా వృథా చేసినట్లే. *నీ కంటె మహోన్నతమైన దాన్ని సాధించేందుకు, విశాలమైన చైతన్యంకోసం నీ జీవితాన్ని త్యాగం చేసినట్లయితే వయస్సు ముదిరినప్పటికి నీకు వయోభార మనిపించదు.*

*

చేతనాభివృద్ధియే, చేతనాస్థాయి పెరుగుదలయే జీవితం యొక్క ముఖ్యోద్దేశమై నట్లయితే కష్టాలన్నీ వాటంతట అవే మాయ మయి పోతాయి.

మూలం: శ్రీమాత

అనువాదం: సంపాదకుడు

విభాగము: III

నిద్ర – విశ్రాంతి

ప్రశ్న: అచేతనలో నిమజ్జనమైపోయినప్పుడు మెలకువగా ఉండడం ఎలా?

అప్రమత్తంగా ఉండటమే.

ప్రశ్న: మరి నిద్రించేటప్పుడెలా?

నిద్రలో మెలకువగా ఉండడమెలాగో అదివరలో వివరంగా చెప్పాను కదా! దాని కోసమే ప్రయత్నం చేయాలి.

ప్రశ్న: అయితే నిద్ర ఉండదన్న మాట!

నిద్రలో నిజమైన ప్రశాంతత

ఏం కాదు. అలా ఉంటేనే నిద్ర బాగా పడుతుంది! కలత నిద్ర కాకుండా సుఖ నిద్ర పడుతుంది. సాధారణంగా చాలా మంది నిద్రలో కలవరం జెంది లేచినపుడు ముందుకంటే ఇంకా అలసిపోయి ఉంటారు. నీవు నిద్ర పోదలుచుకోకపోతే నిద్ర రాదు. అంతే. నిద్ర పట్టటం లేదనే వారికి నా సలహా 'ధ్యానం చేయ మని', ధ్యానం చేస్తుండగా నిద్ర వచ్చేస్తుంది. ఎట్లా ఉన్న వారట్లా నిద్రలోకి జారిపోకుండా, చిందర వందరగా ఉన్న మనస్సును కూడదీసుకొని కొంచెం సేపు ఏకాగ్రత నిలిపి నిద్రపోవటం చాలా మంచిది. బాగా నిద్రపోవాలంటే నిద్రించటం ఎలాగో తెలుసుకోవాలి. ఎక్కువగా అలిసిపోయి వున్నప్పుడు వెంటనే నిద్రలోకి జారకూడదు. అలా చేస్తే అచేతనత్త్వం వస్తుంది. *అలా*

కాకుండా అలిసిపోయిననప్పుడు ముందర ఊరికే పడుకొని విశ్రాంతి తీసుకోవాలి; ఒకదాని తర్వాత ఒకటిగా నాడులన్నింటినీ సడలించుకోవాలి; శరీరంలో బిగువు లేకుండా ఒక పాత గుడ్డ ముక్కల్లే పడి వుండాలి. తర్వాత మనస్సును కూడా ఆ విధంగానే సడలించుకోవాలి. ఏ విధమైన ఆలోచనలూ లేకుండా, ఏ విషయం మీదా, సమస్య మీదా ధ్యాస లేకుండా, పగలు జరిగిన భావావేగాలనూ, ఉద్రేకాలనూ నెమరేసుకోకుండా మనస్సును విశ్రమింప చేయాలి. అలా అన్నిటినీ వదులుకున్నప్పుడు శరీరం పూర్తిగా ఒక మొత్తటి గుడ్డ మాదిరి పడి ఉంటుంది.

నిద్రలో తీవ్రమైన ఆకాంక్ష

ఇలా చేయగలిగినప్పుడు అంతరంగంలో నిరంతరం వెలిగే ఓ చిరుజ్వాలను దర్శించ గలుగుతావు. అది ఉన్నట్లుండి దివ్య జీవనం కోరే ఆకాంక్షగా పైకి ఉద్గమిస్తుంది. అలా మెల్లమెల్లగా వృద్ధిపొందుతూ సత్యచైతన్యం, పరదైవత్వం పొందాలనే ఆ ఆకాంక్ష అంతరాత్మతో ఏకం కావాలని ఇంకా ఇంకా ఎత్తుకి లేస్తుంది. చైతన్యమంతా అక్కడే చేరిన ఆ క్షణంలో నిద్రిస్తే అదే మంచినిద్ర. అప్రమత్తంగా ఉండి నీవు ఇలా చేయగలిగితే చీకటి గుహలో పడి నిద్రించటం కాకుండా తేజస్సులో నిద్రపోగలుగుతావని నేను కచ్చితంగా చెప్పగలను. అలా నిద్రపోయినప్పుడు ఉదయం విచ్చుతున్న పూవు మాదిరి స్వచ్ఛంగా, సంతృప్తిగా ఆనందంగా లేవటమేకాక రోజంతా పని చేయటానికి అవసరమైన శక్తితో బలంగా వుండగలవు.

ప్రశ్న: నిద్రలో మెలకువగా ఉన్నప్పుడు మెదడు నిద్రిస్తుందా? లేదా?

మెదడా! నిద్రించడమా! అది జరిగే పనేనా? నీవు గనుక నే మేధను పడుకోపెట్ట గలిగితే అది ఓ ఘన విజయమే. అది కుదురు లేకుండా ఎప్పుడూ గంతులేస్తూనే ఉంటుంది. దాన్ని స్థిమిత పరచి నీరవంగా విశ్రాంతి పొందేటట్లు చేయగలిగితే చాలా అద్భుతంగా ఉంటుంది. అలా ఒక అయిదు నిమిషాలు విశ్రాంతి

పొందినా ఎంతో పవిత్రంగా ఉండి ఎన్ని సమస్యలనైనా అవలీలగా పరిష్కారం చేయగలవు.

మూలం: శ్రీమాత
స్వేచ్ఛానువాదం: ఎ. ప్రభావతి; ఎ. వెంకటరామ శాస్త్రి

భుక్తాయాసం – పీడకలలు

ప్రశ్న: కడుపునిండా అన్నం తిని నిద్రపోతే పీడకల లెందుకు వస్తాయి?

జీర్ణకోశంలోని పరిస్థితికీ కలలకూ చాలా అవినాభావ సంబంధముంది. మనం తినే పదార్థాలను బట్టే వచ్చే కలలు వస్తాయని పరిశీలకులు తేల్చి చెప్పారు. అంతేకాక జీర్ణం సరిగా కానప్పుడు తప్పనిసరిగా పీడకలలే వస్తాయంటారు. ఆ పీడకలల్లో నిజం ఉన్నా లేకపోయినా, చాలా గాబరా మట్టుకు పెడతాయి. పెద్ద పులులు మొదలైన జంతువులు కనిపించడంకానీ లేదా కలత పెట్టే అనేక సంఘటనలు జరుగుతున్నట్లుకానీ కలలుకంటావు. నీవు ఎక్కడికో వెళ్ళాలని తొందరగా తయారవుతుంటే బట్టలు దొరకనట్లు, లేదా వాటిని ధరించడం యాతనగా ఉన్నట్లు, నీ వస్తువులేవో కనబడనట్లు, నీ కాళ్ళు కదలనట్లు, ఎంత ప్రయత్నించినా లేవలేక అవస్థపడుతున్నట్లు ఇంకా ఇటువంటి అనేక పీడకలలు కడుపులో గడబిడ వల్లనే వస్తాయి.

*

జీవించడానికే తిండి తిను; తిండికోసం జీవించకు.

మూలం: శ్రీమాత
అనువాదం: ఎ. ప్రభావతి; ఎ. వెంకటరామ శాస్త్రి

పొగాకు – త్రాగుడు

ప్రశ్న: ధూమపానం, మద్యం జ్ఞాపకశక్తినీ, తెలివిని పాడు చేస్తాయి ఎందుకని?

అది అంతే. దానికేమీ నైతిక కారణము లేదు. జరిగేది మాత్రం అదే. మద్యంలోనూ, పొగాకులోనూ విషపదార్థ లుండటంవల్ల అవి జీవకణాలకు హాని చేస్తాయి. తీసుకున్న మద్యం ఏ విధం గాను శరీరంలో నుంచి బహిర్గతం కాదు. అది మెదడుకు చేరి అందులోని ఒక భాగంలో పేరుకొనిపోతుంది. అలా పేరుకొన్న ప్పుడు అక్కడి జీవకణాలు పనిచేయడం మానేస్తాయి. ఎక్కువగా తాగే వారిలో అది విషమించడంవల్ల పిచ్చి ప్రేలాపనలు, చిత్త భ్రమణం వస్తాయి. అది అంత చెడ్డది. ఫ్రాంసు దేశంలో ద్రాక్ష రసంతో సారాయి తయారుచేసే ప్రదేశముంది. అందులో ఆల్క హాలు చాలా తక్కువ పరిణామంలో ఉంటుంది; అక్కడి ప్రజలు దాన్ని మంచినీరు త్రాగినట్లుగా తాగుతారు. తాగినప్పుడు బాగానే ఉంటారుకానీ క్రమంగా వ్యాధిగ్రస్తులవుతారు; మెదడు దెబ్బతిని పనిచేయడం మానేస్తుంది. అటువంటి వాళ్లను గురించి నాకు తెలుసు.

ఇక పొగాకు సంగతి చెప్పాలా? దానిలో ఉండే నికొటిన్ అనే పదార్థం అత్యంత హానికరమైనది. అది జీవకణాలను తినే స్తుంది. తీసుకున్నప్పుడు దాని విషప్రభావం తెలియనందువల్ల అది నెమ్మదిగా పనిచేస్తుందన వచ్చునేమోకానీ అది నిజం కాదు. మొదటిసారి పొగ పీల్చినప్పుడు ఉక్కిరిబిక్కిరై చాలా వ్యథ చెందుతారు. దీన్నిబట్టి తీసుకోగూడనిదని తెలుసుకోవాలి. అయితే మనుమలు మూర్ఖత్వంవల్ల ఈ సూచనని తెలుసుకోక అదేదో చాతకానితనమనుకొని ఆ విషం శరీరానికి అలవాటయే వరకూ వాడతారు. కొంత కాలానికి శరీరం ప్రతిస్పందించలేక నాశనం కావడానికే సిద్ధపడుతుంది. ఇక ఏ బాధా కలగదు.

శరీరంలో మాదిరిగానే మనస్సులో కూడా అదే జరుగుతుంది. నీవు చేయకూడనిదేమైనా చేసే ముందర నీ అంతరాత్మ తన చిన్నగొంతుతో చేయవద్దని హెచ్చరిస్తుంది. నీవు వినకుండా అదే చేసినట్లైతే కొంత కాలానికి చెప్పడం మానేస్తుంది. ఇక ఆ తర్వాత నీవు చేసే పనులకి ప్రతిఘటన ఉండదు. అప్పుడు పూర్తిగా చెడిపోయి గోతిలో పడిపోతావు. తొలిసారి పొగ త్రాగినప్పుడిదే జరుగుతుంది. ఒంట్లో చికాకు కలిగి వాంతులు వచ్చి అది తనకు పడదని గట్టిగా చెప్పినట్లవుతుంది. నీ బుద్ధిమాలిన మనస్సు, కోరిక కలిసి పట్టుబట్టి దానికి అలవాటు చేస్తాయి. అది ప్రతిఘటించడం మానేసి విషంతో నాశనానికే సిద్ధపడుతుంది. నరాలు విషపూరితమై బలహీనపడి పని చేయలేవు. మెదడిచ్చే ఆజ్ఞలను పాటించలేవు. చివరకు నరాల బలహీనత, వణుకు వస్తాయి. అటువంటి వారు చాలామంది ఉంటారు. వెతకవలసిన పని లేదు. వారు అతిగా తాగి, సిగరెట్లు కాల్చడం వల్లనే ఆ విధంగా తయరవుతారు. ఏదైనా పట్టుకోవాలన్నా చేతులు వణుకుతాయి. చివరికి జరిగేది అదే.

*

కోరికలను తీర్చడం కంటే వాటిని వశపరచుకొన్నప్పుడు కలిగే ఆనందమే మిన్న.

మూలం: శ్రీమాత

స్వేచ్ఛానువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామ శాస్త్రి

నీ మెదడుకు పదును పెట్టటం వలన ఎలాగైతే నీ మనస్సుకు తృప్తి కలుగుతుందో, అలాగే నీ చేతనను వృద్ధి చేసుకుంటే నీకు ఆత్మవికాసం కలుగుతుంది. నీ కళ్లల్లోకి మెరుపు వస్తుంది. నీ ఒడలు పులకరించి జీవయాత్ర దివ్యంగా సాగిపోతుంది.

శ్రీమాత రచనల నుండి

ఇతర వ్యాసాలు:

పూర్ణయోగమనగా నేమి?

సమస్త యోగప్రక్రియల లక్ష్యము ఒక్కటే – చేతనా పరివర్తనమును పొందుట; తద్వారా సర్వభూతముల వెనుక నున్న పరమ సత్యమును గాంచుట; దానితో సంబంధమును పెంచుకొని, సంపర్కము జెంది దాని ప్రకారములలో పాల్గొనుట.

*

పరమాత్మ స్వరూపమును భావించుటలో వైవిధ్యము గలదు. ఒక్కొక్క భావననుబట్టి ఒక్కొక్క యోగసిద్ధాంతము, పద్ధతి, సంవిధానము. ఈ యోగములు చాలా వరకు మనిషిని జీవితం నుంచి దూరముచేసి లోకాతీతమైన ఆనందమును మాత్రమే కలుగ జేయును. సాధారణ ప్రజకు దీని వలన ఏమియు ప్రయోజనము లేదు.

*

పూర్ణయోగ మనగా నేమి?

సంపూర్ణ దైవ సాక్షాత్కారమునకు మార్గము, సంపూర్ణ ఆత్మదర్శనానికి మార్గము, మనసత్త్వమును, చైతన్యమును సంపూర్ణముగా సఫలీకృతమొనర్చుట. మన ప్రకృతిని సంపూర్ణముగా పరివర్తన మొనర్చుట. అనగా అవశ్యము ఐహికజీవితమును కూడ దివ్యజీవనముగా పరివర్తన మొనర్చుటయేగాని పరలోకమునకు పలాయనము గాదు.

ఇదీ మన లక్ష్యము. దీనిని సాధించుటకు ఏ ఒక్క విధానము కాని, ప్రక్రియగాని సరిపోదు. మనసత్త్వమును, ప్రకృతిని, కదలికలను, కార్యకలాపాలను, సర్వదా, సర్వథా నిశ్శేషంగా సమర్పించుకొని మన లక్ష్యమునకు సాధనములుగా చేయవలెను.

మన మనస్సును, బుద్ధిని, హృదయమును, శరీరమును, జీవితమును, బాహ్యాంతర్గత విభాగములను, వాటి ప్రక్రియలను, అంతరంగిక అగాధములను, అతిచేతనను, అవచేతనను – ఒకటే

మిటి – అన్ని విభాగములను సమర్పించుకోవలెను. కేవలం సమర్పించుటయే కాదు. వాటన్నిటిని లక్ష్యసాధనకు సాధనములుగా చేయవలెను. సిద్ధికి, పరివర్తనకు క్షేత్రములు కావలెను. దివ్యచేతనను, దివ్యప్రకృతిని ధరించి ఈ దివ్యపరివర్తనములో భాగము కావలెను.

ఇదియే పూర్ణయోగము యొక్క స్వరూపము.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: సంపాదకుడు

పూర్ణయోగంలో నూతనాంశాలు

దాని అంశాలన్నింటిలోనూ నా యోగం సరిక్రొత్తదని నేను ఎన్నడూ చెప్పలేదు. దాన్ని నేను సమగ్రయోగం అని పిలిచాను. దాని అర్థం ప్రాచీనయోగాల సారాంశాన్ని, చాలా ప్రక్రియలను అది స్వీకరిస్తుందనే. దాని కొత్తదనం దాని లక్ష్యంలో ఉంది, దృక్పథంలో ఉంది, దాని విధానం సర్వసమగ్రం కావటంలో ఉంది.

కొంతమంది సాధకులకు వ్రాసిన జాబులో దీని నవ్యత మీద నేను నొక్కి చెప్పటం జరిగింది. అలా చేయటం ప్రాచీన యోగాల లక్ష్యాన్ని పునరుక్తం చేయుట నా దృష్టిలో సరిపోదనీ, సహజంగా ఉన్నదే కాని గత ఆధ్యాత్మిక కృషికి రహస్యమైన ఫలితం అయినప్పటికీ, ఇప్పటిదాకా సాధించని, స్పష్టంగా దర్శించని, దానిని సాధించవలసిన విషయంగా నేను ముందు ఉంచుతున్నానని వివరించటం కోసమే.

ప్రాచీన యోగాలతో పోలుస్తే ఇది కొత్తది. ఎందుకంటే

1. ప్రపంచంనుంచి ఏ స్వర్గంలోకో నిర్వాణంలోకో నిష్క్రమించటం దీని లక్ష్యం కాదు. జీవితాన్నీ ప్రపంచ పరిస్థితిని మార్పు చేయటం దీని లక్ష్యం. అదికూడా ఒక అప్రధానమైన అంశంగా

దానంతట అది వచ్చేదిగా ఉండకూడదు. నిర్దిష్టమైన కేంద్రీయ మైన లక్ష్యంగా ఉండాలి. ఇతర యోగాలలో కూడా అవరోహణ ఉండవచ్చుకాని అది అనుకోకుండా మార్గంలో తటస్థించిందో లేక ఆరోహణ పర్యవసానంగా వచ్చిందో అయి ఉంటుంది. అక్కడ యథార్థ విషయం ఆరోహణ మాత్రమే. కాని ఇక్కడ ఆరోహణ మొదటి మెట్టు. అవరోహణకు అది సాధనం. ఆరోహణవల్ల సిద్ధించిన కొత్త చైతన్యాన్ని క్రిందికి అవతరింపజేయటం దాని ప్రత్యేకత, విశిష్టత. చివరికి తంత్రం, వైష్ణవం కూడా జీవితాన్నుంచి విడుదలనే అంతిమ లక్ష్యంగా పెట్టుకున్నాయి; ఇక్కడ మాత్రం జీవితానికి దివ్యసాఫల్యత లభించటం లక్ష్యం.

2. మనం అన్వేషించేది దివ్యానుభవాన్ని వ్యక్తికోసం, వ్యక్తిగత సిద్ధిగా పొందటం కాదు. భూచైతన్యంకోసం ఇక్కడ సంపాదించ వలసిందేదో అది. ఒక్క విశ్వాతీతసిద్ధి మాత్రమే కాదు – విశ్వ గత సిద్ధి కూడ సంపాదించ వలసిన విషయం. ఇంకా వ్యవస్థీక రించని, భూప్రకృతిలో ప్రత్యక్షంగా ఆధ్యాత్మిక జీవితంలో కూడా పని చేయని ఒక చైతన్యశక్తిని (అతిమానసాన్ని) లోనికి తీసుకొని రావటం, వ్యవస్థీకరించటం, ప్రత్యక్షంగా పనిచేసేటట్లు చేయటం.

3, ఈ ప్రయోజనాన్ని సాధించటంకోసం ఒక విధానాన్ని బహి రంగంగా ప్రకటించటం జరిగింది. తన ముందుంచుకున్న చైత న్యంలో స్వభావంలో సంపూర్ణ సమగ్ర పరివర్తన లాగే ఈ విధానం కూడా అంతే సంపూర్ణం సమగ్రం. ప్రాచీన పద్ధతుల్ని స్వీకరించినా, పాక్షిక ప్రక్రియగా, విశిష్టమైన ఇతర సహాయకా లకు తోడ్పడేవిగా మాత్రమే. ఈ పద్ధతిని (మొత్తంగా) లేదా ఇటు వంటి దాన్ని దేనినైనా ఇతర యోగాలలో బోధించటంగాని అను భవంలోకి తెచ్చుకోటంగాని నేను చూడలేదు. అలా జరిగివుంటే, ఒక మార్గాన్ని నిర్మాణించడం, ముప్పై సంవత్సరాల అన్వేషణలో, అంతర్గత సృష్టిలో నా సమయాన్ని వృథా చేసి ఉండేవాడను కాను. ఇదివరకే సిద్ధంచేసి, వివరంగా నిరూపించి, నిర్మించిన రాజమార్గాలమీద సునాయాసంగా నడిచి గమ్యాన్ని చేరుకొనే



Sri Aurobindo

వాడిని. ఇతర యోగాలను మరమ్మత్తు చేసి వాటిని పునరుద్ధరించటం మన యోగం కాదు. అది ఒక ఆధ్యాత్మిక మహాప్రస్థానం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రరావు

ఆరోగ్యపత్రం:

మెరుపులు – తళుకులు

ఆధునిక వైద్యశాస్త్రం మనిషిని మందులకు బానిస చేసింది. మనిషిని రక్షించటంపోయి అతనికి శాపంగా తయారైంది. అంటు వ్యాధులను నిర్మూలించి రక్షించి, శస్త్రచికిత్సతో అద్భుతాలు సాధించిన మాట నిజమేకాని మనిషియొక్క సహజ ఆరోగ్యాన్ని కుంటుపరచి వ్యాధులను ఎక్కువ చేసింది. మనస్సులోను, శరీరంలోను భయాన్ని పుట్టించింది. సహజమైన ఆరోగ్యం బదులు మందులమీద ఆధారపడవలసి వచ్చింది.

*

నాటువైద్యులమీద ఆధారపడే ఆటవికుని మనం వెక్కిరిస్తాము. మరి నేటి డాక్టర్లని నమ్ముకుండే నాగరికుల సంగతేమిటండి? ఆటవికుడు ఒక మంత్రమును వల్లించుకొని జబ్బును నయం చేసుకుంటాడు. ఆధునికులు డాక్టరు ఇచ్చిన మందులు మింగి జబ్బుని నయం చేసుకుంటారు. వీళ్లిద్దరికి తేడా ఏమిటి?

*

ఉత్తరభారతంలోని పశులకాపరి జ్వరం వచ్చినప్పుడు ఏం చేస్తాడో తెలుసా? మంచునీటి ప్రవాహంలో ఒక గంటసేపు కూర్చొని జ్వరాన్ని తగ్గించి వేసుకుంటాడు. నాగరీకులు ఆ పని చేస్తే చచ్చిపోతారు. ఎందుకని? ఒకే రకమైన చికిత్స ఒకళ్లని నయం చేయటము మరొకరిని చేయకపోవడమూనా? కాదు. అసలైన కారణం వేరు. నేటి మానవుని మనస్సు కలుషితమై శరీరాన్ని కూడ పాడు చేసింది.

వ్యాధి నయమయేందుకు మందుకంటె రోగికి డాక్టరులోను మందులలోను ఉండే నమ్మకమే ముఖ్యం. కాని ఈ రెండు కూడ మనిషి యొక్క ఆత్మవిశ్వాసంతో పోలిస్తే తీసికట్టే. తనే, తనం తట తనే తన ఆత్మవిశ్వాసాన్ని పోగొట్టుకున్నాడు.

*

మందులులేని కాలములే ఆరోగ్యరీత్యా మానవజాతికి సువర్ణ యుగాలు.

*

ఆఫ్రికా దేశంలోని ఆటవికులు ఇప్పటివరకు సహజమైన ఆరోగ్యాన్ని పోగొట్టుకోకుండా మిగిలివున్న ఆరోగ్యజాతులు. కాని నేటి నాగరికుల విపరీత ధోరణులు వారి మీద దాడి చేస్తే వాళ్ల ఆరోగ్యాన్ని ఎన్నాళ్లు నిలబెట్టుకోగలరు?

*

మనలో నిక్షిప్తమైవున్న సహజశక్తితో మనం రోగాలు నయం చేసికొని, మళ్లీ రాకుండా చేసుకోవచ్చు. కాని 'గాలెను', 'హిపొక్రేట్స్' (Galen and Hippocrates) మహాశయులు మనకో వైద్య తంత్రాన్ని (barbarous Latin hocus-pocus) తయారుచేసి పెట్టి మనమీద ఓ మందుల వర్షాన్ని కురిపించి మన ప్రాణం తీసారు గదా!

*

వైద్యశాస్త్రం మంచిదే. వైద్యులు దయార్ద్రహృదయులు, త్యాగశీలురు కూడ. అయినా ఏం లాభం? అజ్ఞానులు ఎంత త్యాగం చేసినా మనని రక్షించలేరు.

*

వైద్యశాస్త్రమే నిజమైనట్లయితే, సిద్ధాంతాలు పవిత్రమైనట్లయితే, మందుల మహిమ నిజమే అయినట్లయితే మన సహజమైన ఆరోగ్యాన్ని, పటుత్వాన్ని ఎందుకు పోగొట్టుకున్నాముట?

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: సంపాదకుడు

A MESSAGE FOR THE YOUTH

What India needs especially at this moment is
the aggressive virtues,
the spirit of soaring idealism,
bold creation,
fearless resistance,
courageous attack;
of the passive tamasic spirit of inertia
we have already too much.
We need to cultivate
another training and temperament,
another habit of mind.
We would apply to the present situation
the vigorous motto of Danton,
that what we need,
what we should learn above all things is
to dare and again to dare and still to dare.

Sri Aurobindo

ఓర్పు – పట్టుదల

పంజాబీ గీతం ఒకటుంది. దానిని మన మాటల్లో చెప్పుకోవాలంటే.

విరబూసిన పువ్వుల తోట
తోటలోని కోయిల పాట
జీవితాన మధురానందం
ప్రియనేస్తపు మైత్రీబంధం
అరుదు, అపురూపం. కానీ
నిరంతరం నిలిచి ఉండవు

అందుచేత మనం ఓర్పుతో అవి లభించే వరకూ నిరీక్షించాలి. ఆ నిరీక్షణే మనకు అత్యంత ఉపకారి. మన జీవితంలో ప్రతిరోజూ ప్రతిక్షణం మన సహనశక్తిని నిరూపించుకుండేందుకు ఓ చక్కని అవకాశం.

నీవు ఒక ముఖ్యమైన పనికోసం ఒక పెద్దమనిషిని కలవాల్సి వచ్చింది. అతడిని చూడడం నీకు వెంటనే అవసరం. కానీ అతడు అప్పటికే తనను చూడవచ్చిన వారితో తన వ్యవహారాలతో తలమునకలై ఉండడం వలన నీ వంతు వచ్చేసరికి కొన్ని గంటలు పట్టింది. చివరకు నీవాతనిని కలిసావు. అది నీ 'ఓర్పు'.

మరొకసారి నీవు కలవాలనుకున్న వ్యక్తి నీవు వెళ్ళేసరికి ఇంటివద్ద లేడు. ఆ మర్నాడు కూడా వెళ్ళావు. అతడు దొరకలేదు. ఇలాగే ఎన్నో రోజులు ప్రయత్నించి విసుగు, విరామం లేక వెళ్తూనే ఉన్నావు. చివరకు ఒకనాడు అతడు నీకు దొరికాడు, నీ పని సంతృప్తికరంగా నెరవేరింది. దీనినే 'పట్టుదల' అంటారు.

'ఓర్పు', 'పట్టుదల' ఒకే నాణానికి ఇరువైపులా ఉండే బొమ్మా, బొరుసూ! ఎడతెగని ఓర్పే పట్టుదల.

బెర్నాడ్ పాలిస్సీ పింగాణీ పాత్రల తయారీలో జగత్ప్రసిద్ధుడు. అతడు మొదట ఎన్నో కష్టనష్టాలకు ఓర్చుకొని పట్టుదలతో ఆ వృత్తిలోని మెలకువలను సాధించాడు. పింగాణి పాత్రలకు మెరుగుపెట్టే రహస్యము కనుగొనుటకు నిర్ణయించుకొని, అనువైన కొలిమిని తయారు చేసుకొనినాడు. మట్టిపాత్రలు చేసి, ఎంతకాలం ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. అయినా అతడి పట్టు సడలలేదు, ఓరిమి తగ్గలేదు. బంధువులు, మిత్రులు, చివరకు అతని భార్య కూడా నిరుత్సాహపరచడమే కాక పిచ్చివాడని గేలి చేసారు కూడా. దుర్లభమైనదానికోసం డబ్బు తగలేస్తున్నాడన్నారు. అతడు పట్టించుకొనలేదు. చివరకు కొలిమితో కర్రలు కొనడానికి కూడా ధనము లేక ఇంట్లోని విలువైన ఫర్నిఛర్‌ని ఒక్కొక్కటీ కొలిమిలో పారేశాడు. ఆఖరి చెక్క కూడా అగ్నికి ఆహుతి చేసాడు. మంట చల్లారింది. కొలిమిని తెరిచాడు. ఆశ్చర్యం!

తళతళ మెరుపులు వెదజల్లే సొగసైనపాత్రలు దర్శనమిచ్చాయి అవే అతడికి ఘనకీర్తిని తెచ్చాయి.

అతడి బంధుమిత్రులు, భార్య మొదలైన వారిలో, అతడు విజయం సాధించేవరకూ వేచిచూడలేని అసహనం అతడిని మరింత కష్టాలపాలు చేసింది. దానిని కూడా సహించిన ఓర్పు, లక్ష్యాన్ని సాధించేవరకూ వదలని పట్టుదలలే అతని విజయసోపానాలు కనుక, పట్టుదల అన్నిటికంటే ఉత్కృష్టమైన శక్తి.

ఓరిమి, పట్టుదలలతో సాధించలేనిది ఏదీ లేదు. పట్టుద లలో ఉన్న శక్తి అనంతము. దానికి లొంగని విషయమంటూ ఉండదు. గడ్డిపరకలు సహితం వెంటిగా నేర్పడి, మదపుటేను గును బంధించుచున్నవి. కొండరాళ్లు వర్షపుధారలతో కొట్టబడి ఇసుకరేణువులుగా మారుతున్నవి. ఒక్క ఇసుకరేణువు ఏమీ చేయలేదు. కాని చాలా రేణువులు కలిసి ఇసుకమేటగా ఏర్పడి సముద్రపుటలలను సహితం నిలువరిస్తున్నవి. సముద్రగర్భంలో పర్వతాలు, ద్వీపాలు మొదలైనవి సూక్ష్మాతి సూక్ష్మజీవుల శ్రమ వలన ఏర్పడినవేనని ప్రకృతి చరిత్ర తెలుపుచున్నది.

మీ నిరంతర కృషి, దీక్ష ఎంత మంచి ఫలితాలనిస్తుందో గ్రహించలేరా?

మూలం: శ్రీమాత

అనువాదం: రంగానాథ ఆత్రేయ; నడిమింటి విజయలక్ష్మి

యోగమనగా చిత్తవృత్తి నిరోధము. నీ మనస్సులో చెల రేగే ఆలోచనలను నువ్వు ఒక ప్రేక్షకునివలె గమనించాలి అంతే. ఆ ఆలోచనలలో పాలు పంచుకోకుండా, వాటిని ఏమాత్రము సమర్థించకుండా ఉన్నప్పుడు, వాటిని ఆద రించేవారు లేనప్పుడు అవి సమసి పోతాయి. నీ మనస్సు గంతులు వేయటం మానేసి, తరువాత చిన్న చిన్న స్పంద నములు మాత్రమే చేసి చివరికి పూర్తిగా నిశ్శబ్దమైపోతుంది. ఒకానొక గంభీరమైన శాంతి నిన్నావహించేస్తుంది.

సమాచార పత్రం

పాండిచ్చేరి యూనివర్సిటీలో 19, 20 ఏప్రిల్ తేదీలలో శ్రీ నవ జాత స్మారకోపన్యాసములు డా॥ డి. రాజా గణేశన్ గారు "Sri Aurobindo's Interpretation of Dreams found in Indian Culture" పై యిచ్చిరి. మహారాష్ట్ర స్టేట్ కమిటీవారి ఆధ్వర్యంలో "ఆత్మాభ్యుదయము" అనే విషయముపై 23, 24, 25 మార్చి తేదీలలో ఒక శిబిరమును శ్రీ శ్రద్ధాలు, శ్రీమతి శ్రుతిగార్లు నిర్వహించిరి. శ్రీ అరవిందుల వెలుగులో "The Change of Consciousness in the 21st Century" అను విషయముపై వల్లభ్ విద్యానగర్ (గుజరాత్) లో 23, 24 మార్చి తేదిలలో ఒక సదస్సు నిర్వహించబడినది. సింద్రి (బీహారు) లో 24 ఏప్రిల్ 2001 నాడు సాంస్కృతిక కార్యక్రమములు, విద్యార్థులకు పారితోషిక ప్రదానములు చేయబడినవి. ఈ కార్యక్రమము అక్కడ ఒక గొప్ప సంచలనమును, ప్రజలలో ఉత్సాహమును కలుగచేసినది. నాదియాడ్ (గుజరాత్) లో 1 ఏప్రిల్ 2001 నాడు శ్రీఅరవిందుల అవశేషముల ప్రతిష్ఠాపన వార్షికోత్సవములు, "దివ్యసంస్పర్శ" అనే పుస్తకావిష్కరణము జరుపబడినవి. ఏలూరు శాఖవారు 29-4-2001 మొదలు 5-5-2001 తేదీ వరకు సావిత్రి జ్ఞానయజ్ఞం నిర్వహించిరి. ఇది సాధకులలో మంచి ఉత్సాహమును కల్గించినది.

శ్రీఅరవిందో సొసైటీ వార్షికోత్సవములు పాండిచ్చేరి బీచ్ ఆఫీసులో 12, 13, 14 ఆగస్టు 2001 తేదీలలో జరుపబడును. డా॥ ఎమ్. వి. నడ్‌కర్ణిగారి సావిత్రి అధ్యయన కార్యక్రమము రద్దు చేయబడినది. శ్రీఅరవిందో సొసైటీ బెంగుళూరు శాఖను (శ్రీఅరవిందో భవన్, 110 గంగాధర్ చెట్టి రోడ్డు, అల్సూర్, బెంగుళూరు - 560042) నిర్వహించుటకు నడివయస్సులో ఉన్న ఒక మనిషి కావలెను. వసతి, భోజనాది సౌకర్యములు యివ్వబడును. శాఖ కార్యదర్శి శ్రీ ఎమ్. ఎమ్. భట్టాచార్జీగారితో సంప్రదించవలెను.

చివరి మాట

ఒక నేరస్తుడు దీర్ఘమైన కారాగార శిక్ష అనుభవిస్తున్నాడు. ప్రతిరోజు అతని తీరు ఒకటే – దుఃఖం, కోపం, భయం. కాని ఒక రోజు చాలా ప్రశాంతంగా వున్నాడు. అది వరకు తన కొడుకుతో గడిపిన మంచిరోజులు గుర్తుకు తెచ్చుకొని చాలా ప్రశాంతంగా వున్నాడు. ఒకసారి వాళ్లు పక్క రాష్ట్రంలోకి వెళ్లి విహార యాత్ర చేసారు. ఇంటికి తిరిగి వెళ్లే సమయానికి దురదృష్ట వశాత్తు ఒక మంచుతుఫాను వచ్చింది. ఆ పిల్లవాడు వాళ్ల నాన్నని చూసి “అయ్యో దారి బాగుండలేదు. కాని నాన్నా నువ్వు మంచి డ్రైవరువే కదా నీ ఒళ్లో తలపెట్టుకొని పడుకుంటాను” అని చెప్పి వాళ్ల నాన్న ఒళ్లో హాయిగా నిద్రపోయేడు.

ఆ రోజున ఆ ఖైదీ దాన్ని గుర్తు తెచ్చుకొని వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టాడు. అతను దేవునితోటి ఇలా అన్నాడు. “తండ్రీ, ఇకనుంచి నీవే నాకు సారథివి. దారి బాగుండలేదు. కాని నేను నిన్నే నమ్ముకుంటాను” అని చెప్పి అతను దేవుని సమీపించగా అతనిని బ్రహ్మాండమైన శాంతి ఆవహించేసింది.

రెండేళ్లు గడచినై. ఇప్పుడు కూడ ప్రతిరోజు అతను దేవుని ఒళ్లో తలపెట్టుకొని హాయిగా నిద్రపోతాడు.

చాలా పనులున్నప్పుడు, తక్కువ వ్యవధిలో ఎక్కువ పనులు చేయాల్సి వచ్చినప్పుడు ఏం చేయాలి? వెయ్యిళ్ల పూజారల్లే ఉండకూడదు. ఒక పని చేస్తున్నప్పుడు మరో పనిని గురించి ఆలోచించ కూడదు. నీ మనస్సు ఒకే పని మీద లగ్నం కావాలి. నీ శక్తినంతా ఉపయోగించి ఒకే పనిని చేసినప్పుడు ఒక గంటలో అయ్యే పని ఒక అర గంటలోనో పావుగంటలోనో అయిపోతుంది. తరువాత కొన్ని నిమిషాలు విశ్రాంతి తీసికొని మనస్సును సావధాన పరచినట్లయితే మరో పనిని మళ్లీ శ్రద్ధగా చేయవచ్చు.


నిశ్శబ్దము - నిశ్శబ్దాతీతము
అఖిల
అఖిల భారత పత్రిక
ఆగష్టు, సెప్టెంబరు 2001

శ్రీఅరవిందుల రచనలు చదివే విధానం

శ్రీఅరవిందుల రచనలు* చదివేవారికి నేనిచ్చే సలహా యిది. మనస్సును సాధ్యమైనంత ప్రశాంతపరచుకొని, ఒక్కొక్కసారి కొంచెం కొంచెం మాత్రమే చదవండి. దానిని వెంటనే అర్థం చేసుకోవాలని ఆరాటపడి తలలు బ్రద్దలు చేసుకోవద్దు. మనస్సును అలజడులకు, ఆలోచనలకు దూరంగా ఉంచండి. తరువాత అటుల నిశ్శబ్దపరచిన మనస్సులోనికి ఆ రచనలలో నిక్షిప్తమైన మహత్తును తిన్నగా, నిరాటంకముగా ప్రవేశించనివ్వాలి; చొరబడి చోటు చేసుకోనివ్వాలి. అలా నిశ్శబ్దంగా ప్రశాంతంగావున్న మనస్సులోనికి ప్రవేశించిన ఆ శక్తి నిలదొక్కుకొని తన దీప్తిని తాను వికసింప జేసి బుద్ధిని ఉజ్వలాయమానం చేయటానికి తన పని తాను చేసుకొనిపోతుంది. అంతేకాదు. అవసరమైతే, చదివిన అంశాలను అర్థం చేసుకొనడానికి అవసరమైన కొత్త జీవకణాలను కూడా మెదడులో సృష్టిస్తుంది. అందుకని కొన్ని నెలల తరువాత అదివరకు చదివిన అంశాలను మళ్ళీ చదివినట్లైతే, అందులో వెలువరించిన భావాలు మునుపటికంటే బాగా ప్రస్ఫుటమవుతాయి. ఆ భావాలతో సాన్నిహిత్యం, మచ్చిక విస్తృతమవుతుంది. కొన్ని సందర్భాలలో, ఎంతో ఆశ్చర్యకరంగా అవి ఇంతకు పూర్వమే పరిచయమున్న విషయాలుకూడా ద్యోతకమవుతవి!

ప్రతిరోజూ ఓ నిర్ణీత సమయంలో, క్రమం తప్పకుండా, కొంచెం కొంచెం చదువుట మంచిది. ఎందుకంటే నిత్యానుష్ఠానం వలన మెదడు యొక్క గ్రహణశీలత పెరుగుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: అన్నవరపు ఆదిశేషయ్య

---

* శ్రీఅరవిందుల అభిభాషణలు ఉత్తిత్తి మాటల మూటలు కావు. అవి అక్షయతూణీరాలు. నమ్మకుంటే చాలు ఆ అమ్ములు పరిశ్రమ లేకుండా ప్రశాంతమందిరానికి చేరుస్తాయి. విడువక వెన్నంటి నడవటమే మన విధి.

నిశ్శబ్దము – నిశ్శబ్దాతీతము

విభాగము I: నిశ్శబ్దమే ప్రాతిపదిక

విభాగము II: నిశ్శబ్దానికి మార్గము

విభాగము III: నిశ్శబ్దానికావల తీరము

ఇతర వ్యాసాలు

The Silence bears the Eternal's great dumb seal,
His light inspires the eternal Word;

Sri Aurobindo

(Savitri, p. 656)

ప్రస్తావన


చిత్తవృత్తి నిరోధమే యోగము. మనం దీనిని silence అనవచ్చు. ఇదే యోగానికి తొలిమెట్టు. కాని దీని తరతమ రూపము లనేకములు. ఒక్కొక్క దానికి ఒక్కొక్క పేరు. దీనికి మనం మామూలుగా వాడే మాట 'నిశ్శబ్దము' అనగా మాట్లాడకుండా వుండటం. కాని యోగంలో దీనికింత కంటే విశేషార్థమే వున్నది. దీనిని నిశ్చలత్వమని కూడ అనవచ్చు. నిశ్చలత్వమనగా కేవలం బాహ్యాశబ్దముల ఉపసంహారణమే కాదు. మనస్సులో ఎట్టి ఆలోచనలూ లేకుండా అంతరంగికంలో కూడ నిశ్శబ్దమే రాణించాలి. ఆపాదమస్తకం ప్రశాంతమవాలి. మరియు శ్రీఅరవిందులు Truth, Light, Silence మొ॥ పదాల మొదటి అక్షరాలకు Capitals పెట్టి వాటికి మామూలు అర్థాలకంటె విశిష్టమైన ఆధ్యాత్మికమైన ప్రాముఖ్యత నిచ్చారు. వారి యోగజ్వాలతో పునీతం చేసిన ఆంగ్లపదజాలాన్ని ఇంద్రజాలంలా ప్రయోగించారు. అందుకని ఈ సంచికలో వాడిన నిశ్శబ్దము, నిశ్చలత్వం, మౌనం మొ॥ పదాలన్నిటిని విచక్షణతో, ఈ విశేషార్థంలోనే గమనించగలరు.

— సంపాదకుడు

Silence, the nurse of the Almighty's power,
The omniscient hush, womb of the immortal Word,

Sri Aurobindo

(Savitri, p. 41)



మనః నిశ్శబ్దతలో సర్వాతీత చైతన్యం
దుర్గ్రాహ్యాతీతమై సువిదిత మవుతుంది
అలాగే మౌనహృదయం మథించని మాటల
అంతరంగాన్ని చెవిన వేసుకొంటుంది
అనంత సమర్పణ అతని ఏకైక త్రాణ.

మౌనం మనసు విప్పిన వేళ

ఇప్పుడు నా మనస్సు ఏరి ప్రమేయమూ లేని
ఓ కేవల నిశ్చల నిశ్శబ్దం,
పారదర్శకము అసమానము నైన ఓ దృశ్యమాన జగతి,
ఓ దైవ ధృవీకృత నిశ్శబ్దపు సంపుటి –,
విస్తృత మౌన (విపంచి హృదయ) రాగ సంకలనం,
విశుద్ధ భావనా, అసూర్యం పశ్య సంకల్పం కలగరిసిన
ఓ అనుపమాన ఔన్నత్యం.

ఆ సంపుటి పుటల పైన
(ఆ మౌన హృదయ విపంచి తంత్రుల పైన)
ఒకప్పుడు కాలం గ్రుడ్డిగా ఊహించిన
వొకబారు అవగాహనల్ని (అపశ్రుతులని) అజ్ఞానం
అందంగా చిత్రించవచ్చు (మనోజ్ఞంగా మీటవచ్చు)

అంతేకాదు ప్రకృతి వలయంలో దేశద్రిమ్మరిలా తిరిగే
ఆత్మకు ఆహారంగా
క్షణభంగుర కాంతుల క్షణిక సందేశాలను విసరవచ్చు
(వినోదమునకు జేపట్టు వీణకు కర్తృత్వము లేని భంగి)

కాని నే నిప్పుడు కనిపించని నిశ్శబ్ద పరిపూర్ణ జ్ఞాన
కాంతికిరణ సంజనితమైన ఓ విశిష్ట శబ్దాన్ని ఆలకిస్తున్నాను
(మౌనవీణ మనసులోని మాటను)
నిశ్శబ్దపు శ్రవణేంద్రియాలు మాత్రమే ఆలకించిన
(సప్త స్వరాలకే అనుభూతమయ్యే మూగ మౌనరాగాలు)
ఓ అహస్సు యొక్క అనంత దివ్యతేజం నుండి
ఉద్ధృతంగా దుమికిన కంఠస్వరం.
(నాభినుండి పెల్లుబికిన అనంత అనుభూతితేజః
స్రవంతుల రవళి – తిమిర నాశక మురళి)

సర్వమూ అనంత విస్తృతినుండి నిరంతర
శాంతినుండి ఓ అనంత
ప్రవాహాంభోధిలోని ఆనంద సందోహాపు
ఆటుపోటుల లోనికి మళ్ళుతుంది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం అన్నవరం ఆదిశేషయ్య

(Collected Poems, p. 141 The Word of the Silence)

నిశ్చలత

యోగములో నిశ్చలత అనగా చిత్తవృత్తులు, ప్రాణిక స్పందనములు నిలిచిపోయి ఏ మాత్రం కదలిక లేకుండా సమస్త చైతన్యము రాయల్లే అయిపోవుట.

*

శాంతి (peace), స్థిరత (calm), అచంచలత (quiet), నిశ్చల నీరవత (silence) అనే పదాల మధ్య సూక్ష్మమైన భేదాలున్నాయి. వీటిని నిర్వచించటం అంత తేలిక కాదు.

అచంచలత: ఏ విధమైన వ్యాకులతగాని గొడవగాని లేని స్థితి.

స్థిరత: ఇంకా లోతైన పరిస్థితి. బాహ్య అలజడులవలన చెదిరిపోదు.

నిశ్చలత: చిత్తవృత్తులుగాని, ప్రాణికస్పందనములుగాని ఏ మాత్రము లేని స్థితి. ఉపరిగత ప్రేరణలకు చలించని ఓ గంభీరమైన శాంతి.

*

Quiet, calm and peace can all be described as tranquillity· silence is akin to what is meant by stillness.

*

ఈ సృష్టి కావల ఓ గంభీరమైన నిశ్శబ్దమే రాణిస్తూంటుంది. ఈ నిశ్శబ్దమునకే, లోకాల పరిభ్రమణానికంతా మూలమదే.

ఆ నిశ్శబ్దం (Silence) లో నుంచే శాంతి పుడుతుంది. శాంతి ప్రగాఢమయ్యే కొద్ది మళ్లీ నిశ్శబ్దంగా పరిణమిస్తుంది. నిశ్శబ్దమనగా చిత్త స్పందనలు, ఇంద్రియ స్పందనములు లేని స్థితి. మనస్సు ఆగి పోతుంది. ఆ స్థితి చెదిరిపోకుండానే కర్మలను ఆచరించ వచ్చు. నిశ్చలాకాశంలో నక్షత్రాలు మెరవటం లేదు? గోళాలు పరిభ్రమించటం లేదు? మనిషి విషయంలో కూడ అంతే.

*

నిశ్చలత్వము (silence) నిష్క్రియంగాగాని, సక్రియంగాగాని వుండవచ్చు. బాహ్యసంఘటనలకు ఏ మాత్రం చలించని అంతరంగిక నైశ్చల్యము మొదటిది. క్రియాశీలమై తన యోగశక్తి నుపయోగించి ఇతరులను ప్రేరేపించుట లేక తన 'ఇంద్రజాలాన్ని' ప్రయోగించి బాహ్యజగత్తులో అద్భుతమైన పరిణామములను కలగజేయుట రెండవ స్థితి.

*

నిశ్చలత్వమనగా సన్యాసం కాదు. అంతరంగికం నిశ్చలమైనప్పటికి ప్రశాంతమైనప్పటికీ ఆ స్థితి చెదిరిపోకుండానే సకలమైన యోగానుభూతులు కలుగుతూ వుంటాయి.

*

యోగజ్ఞానము మానసికజ్ఞానము కంటె భిన్నము. దాని స్వరూపాలు వేరు. అది నిశ్శబ్దంగా వుండి రెండు స్థాయిలలో వుంటుంది. ఆలోచనలుగాని, సంవేదనములుగాని, కదలికలుగాని లేక నిశ్చలమయ్యి, (మామూలుగా పనులు చేస్తున్నప్పటికి) చెదిరిపోని స్థితి ఒకటి. అయితే ఈ నూతన చైతన్యము ఇంతటితో సరికాదు. అది క్రియాశీలమై అద్భుతమైన అనుభూతులను కలగజేస్తుంది. ప్రేమానందములు, ఇతర ఆధ్యాత్మికానుభూతులు, అంతరంగిక పరిణామముల ద్వారా అభివ్యక్తమౌతుంది. తన నైశ్చల్యము మట్టుకు చెక్కు చెదరదు జీవుని పెరుగుదలకు ఈ రెండు స్థితులు అవసరమే. మొదటి స్థితి చాలా తేలికగా, ఖాళీగా విముక్తమైనట్లు

అనిపించి, మెల్లి మెల్లిగా క్రియాశీలమై రెండవ స్థాయిని చేరుకుతుంది.

మూలం: శ్రీ అరవిందు
అనువాదం: జె. మంగమ

పరమాత్మ సాక్షాత్కారం – పరమ నైశ్చల్యం లోనే

ప్రశాంతత, నిశ్చలత ఉన్నప్పుడే దైవసాక్షాత్కారం లభిస్తుంది వాటిని చెదర నివ్వకు. దైవం ప్రత్యక్షమౌతాడు.

*

మేమందరం కలిసి కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా ఆత్మసంపర్కాను భూతిని అనుభవించితిమి. మా ముంగిట అనంతలోకాల ద్వారా బార్లగా తెరుచుకోగా కళ్లు మిరిమిట్లు గొలిపే అద్భుత దర్శన లభించింది.

*

ధ్యానం ద్వారా సమస్తము నిశ్శబ్దమై అనంతం దాకా విస్తరణ జరుగుతుంది. ఆ పరిపూర్ణ నిశ్శబ్ద ప్రశాంతతలో భగవంతుడు దేదీప్యమైన తేజోవిరాజితుడై ప్రత్యక్షం కాగలడు.

*

భగవంతుని కంఠము ఎప్పుడైతే నీకు వినబడుతుందో అప్పుడే నీకు నిశ్శబ్దము (నైశ్చల్యము) కలిగిందన మాట.

*

ప్రశాంతత, ఆంతరంగిక నిశ్శబ్దత ఉన్నప్పుడు క్రమక్రమంగా దైవం యొక్క నిరంతర సాన్నిధ్యము నీ కనుభూత మవుతుంది.

*

హృదయాంతరాళపు నిశ్శబ్దతలోనే నువ్వు భగవానుని ఆదేశాలను వినగలవు.

*

మనం నోరు మూసుకొని భగవంతుని ఆరాధించెదము గాక. గంభీరమైన ప్రశాంతాగాధాలలోనే గదా ఆయన వాణిని మనం వినగలిగేది.

మూలం: శ్రీమాత

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామ శాస్త్రి

ప్రగతి పథము – నిశ్చల నీరవత (Silence)

నువ్వు నిశ్చలంగా (silent) ఉంటేగాని అభివృద్ధి చెందలేవు.

*

నిశ్చలనీరవత (silence) లోనే నీ చేతనాస్థాయి పెరుగుతుంది. నీ జిజ్ఞాస తీవ్రమవుతుంది.

*

నిజమైన ఆధ్యాత్మిక సిద్ధికి నిశ్శబ్దమే ద్వారం.

*

నిశ్చలత్వమే యథార్థ జ్ఞానానికి ద్వారాలు తెరుస్తుంది.

*

నువ్వు నిశ్చలంగా వున్నప్పుడే భగవంతుడిని నిజంగా ఆరాధించగలవు.

*

నిశ్చలత్వంలోనే మనం శక్తిని తిరిగి పుంజుకోగలం.

*

ఏకాగ్రత, నైశ్చల్యము కర్మల నాచరించుటకు అనివార్యములు.

*

It is *only in silence* that a true progress can be made; it is *only in silence* that one can rectify a wrong movement; It is *only in silence* that one can be of help to somebody else.

మూలం: శ్రీమాత

అనువాదం: బి. వరలక్ష్మి

నిశ్శబ్దంలోనే నిజమైన అనుభూతులు

శ్రీమాతారవిందుల పుస్తకాలకు కొఱత లేదు. వారి ప్రవచనములు, సాధకులతో జరిపిన సంభాషణలు, లిఖితరూపంలో వున్న ప్రశ్నోత్తరములు కోకొల్లలు. వీటి ద్వారా సాధనా విధానములతో కొంత పరిచయము, మనోవికాసము కలిగే మాట నిజమే. కాని అధ్యయనం కంటే అనుభూతమే ముఖ్యం.

నీకు జ్ఞానం కావాలంటే నువ్వు నడుము బిగించాలి. విజృంభించాలి. నీ మనస్సును 'నోరు ముయ్యి' అని చెప్పి అంతర్ముఖుడవు కావాలి. అక్కడి వెలుగును దర్శించాలి. ఆ వెలుగే నిన్ను పులకరింపజేసి యోగమార్గంలో నడిపిస్తుంది. నీ అంతస్తును పెంచి చివరకి నిన్ను 'పునర్జన్మ'కు సమాయత్తం చేస్తుంది. – సంపాదకుడు

మనం చదువుతాం. మనం అవగాహన చేసుకోవడానికి యత్నిస్తాం. వివరిస్తాం. అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాం. అయితే పుస్తక పఠనము నీకు జ్ఞానాన్ని ఇవ్వలేదు. నీకు అసలైన జ్ఞానం కలిగినప్పుడు ఇదంతా మనస్సు చేసే గారడీయే అని తేలిపోతుంది.

ఇలా అనే సరికి వెంటనే తలెత్తేది "అనుభవం పొందడం ఎలా?" అనే ప్రశ్న.

అంతర్ముఖుడవై నీలోకి నువ్వు తొంగి చూసుకోవడమే మొదటి మెట్టు.

నీ అంతరాంతరాల్లో ఉన్న సత్యాన్ని అనుభూతి చెందేటంత లోతుగా నువ్వు ఒకసారి అంతర్ముఖుడవు కాగలిగావా! అప్పుడు నీకు అభ్యుదయకరమైన, క్రమబద్ధమైన సువిశాల దృక్పథం అగపడుతుంది. దాంతో పరిధులు అన్నీ చెదిరిపోయి, *సరిహద్దులు చెరిగి పోయి విశ్వం అంతా నువ్వే అవుతావు.*

ఈ మొదటి రెండూ నిన్ను సమాయత్తం చేసే ప్రక్రియలు.

ఈ రెండూ అత్యంత ప్రశాంతంగాను, నెమ్మదిగాను, శాంతి యుతంగాను జరగాలి. ఈ శాంతిసామరస్యాలు మనస్సుకి నిశ్శ బ్దాన్ని, ప్రాణికానికి స్థిరత్వాన్ని ప్రసాదిస్తాయి.

ఈ కృషిని, ఈ సాధనను క్రమం తప్పకుండా నిత్యం ర్రిషిస్తూ, సుసంపన్నం చేసుకుంటూ పోవాలి. ఇలా కొంతకాలం ురిగేసరికి, అసలైన నైజాన్ని తెలుసుకోవడం మొదలు పెడతావు.

నిత్యం నువ్వు అనుభూతి చెందే బాహ్యాజ్ఞానంకంటె అది న్నంగా ఉంటుంది.

*

ఆలోచనలు అవరోధాలు

గూఢవిద్యను (occultism) నేర్చుకోదలచుకు న్నప్పుడు – సాధారణంగా మొదటి అంశం ఏమిటంటే – గురువు ఆ విద్యను గురించి ుతో ఏమీ మాట్లాడడు. నీకు ఏమీ వివరించడు కూడా. దీనికి ారణం ఒక్క ముక్కలో చెప్పాలంటే – మనస్సుకుగల అవలక్ష ుమే అనాలి. *ఇతర విషయాలు చెపితే మనస్సు వాటినిగురించి అనవసర ఆలోచనలు పెట్టుకుంటుంది. దానివల్ల పనికిరాని అను భవాలే తప్ప – పనికివచ్చేది ఒక్కటీ రాదు.* అవన్నీ మానసిక ల్పనలే అవుతాయి. అవి వాస్తవికతకు దూరంగా ఉంటాయి.

నువ్వు అనుభవాల లోకంలోకి అడుగిడ దలచుకుంటే మనస్సుపై విశ్వాసాన్ని పూర్తిగా తుడిచేసుకోవాలి. "ఓ! ఏం జరుగుతోంది?" అనే కుతూహలం తలెత్తుతే చాలు. ఆ తరువాత అనుభూతులు వాటంతటవే కలుగుతాయి – నిజానికి అవి అను భూతులయితే కదా – కేవలం కల్పనలు; ఉత్తిత్తి ఊహాలూను. ంతే!

మౌనం పరమౌషధం

నువ్వు నోరు మూసుకొని కూర్చోవాలి. ఇది మొదటి స్థితి. మౌనం అంటే కేవలం జిహ్వా స్తంభనమే కాదు. నీ మనస్సును మౌనంగా ంచాలి. మస్తిష్కంలో ఆలోచనలు ముసురుకో కూడదు. నీ జ్ఞానా ికి చక్కటి పునాది వేయాలంటే, అవసరమైన అసలైన, అచ్చ ైన అనుభవాల్ని పొందాలనుకుంటే – మౌనంగా ఉండడం

నిశ్శబ్దంలోనే నిజమైన అనుభూతులు

శ్రీమాతారవిందుల పుస్తకాలకు కొఱత లేదు. వారి ప్రవచనములు, సాధకులతో జరిపిన సంభాషణలు, లిఖితరూపంలో వున్న ప్రశ్నోత్తరములు కోకొల్లలు. వీటి ద్వారా సాధనా విధానములతో కొంత పరిచయము, మనోవికాసము కలిగే మాట నిజమే. కాని అధ్యయనం కంటే అనుభూతమే ముఖ్యం.

నీకు జ్ఞానం కావాలంటే నువ్వు నడుము బిగించాలి. విజృంభించాలి. నీ మనస్సును 'నోరు ముయ్యి' అని చెప్పి అంతర్ముఖుడవు కావాలి. అక్కడి వెలుగును దర్శించాలి. ఆ వెలుగే నిన్ను పులకరింపజేసి యోగమార్గంలో నడిపిస్తుంది. నీ అంతస్తును పెంచి చివరకి నిన్ను 'పునర్జన్మ'కు సమాయత్తం చేస్తుంది. — సంపాదకుడు

మనం చదువుతాం. మనం అవగాహన చేసుకోవడానికి యత్నిస్తాం. వివరిస్తాం. అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాం. అయితే పుస్తక పఠనము నీకు జ్ఞానాన్ని ఇవ్వలేదు. నీకు అసలైన జ్ఞానం కలిగినప్పుడు ఇదంతా మనస్సు చేసే గారడీయే అని తేలిపోతుంది.

ఇలా అనే సరికి వెంటనే తలెత్తేది "అనుభవం పొందడం ఎలా?" అనే ప్రశ్న

అంతర్ముఖుడవై నీలోకి నువ్వు తొంగి చూసుకోవడమే మొదటి మెట్టు.

నీ అంతరాంతరాల్లో ఉన్న సత్యాన్ని అనుభూతి చెందేటంత లోతుగా నువ్వు ఒకసారి అంతర్ముఖుడవు కాగలిగావా! అప్పుడు నీకు అభ్యుదయకరమైన, క్రమబద్ధమైన సువిశాల దృక్పథం అగపడుతుంది దాంతో పరిధులు అన్నీ చెదిరిపోయి, *సరిహద్దులు చెరిగి పోయి విశ్వం అంతా నువ్వే అవుతావు.*

ఈ మొదటి రెండూ నిన్ను సమాయత్తం చేసే ప్రక్రియలు.

ఈ రెండూ అత్యంత ప్రశాంతంగాను, నెమ్మదిగాను, శాంతిమిళితంగాను జరగాలి. ఈ శాంతిసామరస్యాలు మనస్సుకి నిశ్శబ్దాన్ని, ప్రాణికానికి స్థిరత్వాన్ని ప్రసాదిస్తాయి.

ఈ కృషిని, ఈ సాధనను క్రమం తప్పకుండా నిత్యం పోషిస్తూ, సుసంపన్నం చేసుకుంటూ పోవాలి. ఇలా కొంతకాలం జరిగేసరికి అసలైన నైజాన్ని తెలుసుకోవడం మొదలు పెడతావు.

నిత్యం నువ్వు అనుభూతి చెందే బాహ్యాజ్ఞానంకంటె అది భిన్నంగా ఉంటుంది.

*

ఆలోచనలు అవరోధాలు

గూఢవిద్యను (occultism) నేర్చుకోదలచుకున్నప్పుడు — సాధారణంగా మొదటి అంశం ఏమిటంటే — గురువు ఆ విద్యను గురించి నీతో ఏమీ మాట్లాడడు. నీకు ఏమీ వివరించడు కూడా దీనికి కారణం ఒక్క ముక్కలో చెప్పాలంటే — మనస్సుకుగల అవలక్షణమే అనాలి. *ఇతర విషయాలు చెపితే మనస్సు వాటినిగురించి అనవసర ఆలోచనలు పెట్టుకుంటుంది. దానివల్ల పనికిరాని అనుభవాలే తప్ప — పనికివచ్చేది ఒక్కటీ రాదు.* అవన్నీ మానసిక కల్పనలే అవుతాయి. అవి వాస్తవికతకు దూరంగా ఉంటాయి.

నువ్వు అనుభవాల లోకంలోకి అడుగిడ దలచుకుంటే మనస్సుపై విశ్వాసాన్ని పూర్తిగా తుడిచేసుకోవాలి. "ఓ! ఏం జరుగుతోంది?" అనే కుతూహలం తలెత్తుతే చాలు. ఆ తరువాత అనుభూతులు వాటంతటవే కలుగుతాయి — నిజానికి అవి అనుభూతులయితే కదా — కేవలం కల్పనలు, ఉత్తిత్తి ఊహాలూను. అంతే!

మౌనం పరమౌషధం

నువ్వు నోరు మూసుకొని కూర్చోవాలి. ఇది మొదటి స్థితి. మౌనం అంటే కేవలం జిహ్వా స్తంభనమే కాదు. *నీ మనస్సును మౌనంగా ఉంచాలి.* మస్తిష్కంలో ఆలోచనలు ముసురుకో కూడదు. నీ జ్ఞానానికి చక్కటి పునాది వేయాలంటే, అవసరమైన అసలైన, అచ్చమైన అనుభవాల్ని పొందాలనుకుంటే — మౌనంగా ఉండడం

నిశ్శబ్దంలోనే నిజమైన అనుభూతులు

శ్రీమాతారవిందుల పుస్తకాలకు కొఱత లేదు. వారి ప్రవచనములు, సాధకులతో జరిపిన సంభాషణలు, లిఖితరూపంలో వున్న ప్రశ్నో త్తరములు కోకొల్లలు. వీటి ద్వారా సాధనా విధానములతో కొంత పరిచయము, మనోవికాసము కలిగే మాట నిజమే. కాని అధ్య యనం కంటే అనుభూతమే ముఖ్యం.

నీకు జ్ఞానం కావాలంటే నువ్వు నడుము బిగించాలి. విజృంభించాలి. నీ మనస్సును 'నోరు ముయ్యి' అని చెప్పి అంతర్ముఖుడవు కావాలి. అక్కడి వెలుగును దర్శించాలి. ఆ వెలుగే నిన్ను పులకరింపజేసి యోగమార్గంలో నడిపిస్తుంది. నీ అంతస్తును పెంచి చివరకి నిన్ను 'పునర్జన్మ'కు సమాయత్తం చేస్తుంది.

— సంపాదకుడు

మనం చదువుతాం. మనం అవగాహన చేసుకోవడానికి యత్నిస్తాం. వివరిస్తాం. అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాం. అయితే పుస్తక పఠనము నీకు జ్ఞానాన్ని ఇవ్వలేదు. నీకు అసలైన జ్ఞానం కలిగి నప్పుడు ఇదంతా మనస్సు చేసే గారడీయే అని తేలిపోతుంది.

ఇలా అనే సరికి వెంటనే తలెత్తేది "అనుభవం పొందడం ఎలా?" అనే ప్రశ్న.

అంతర్ముఖుడవై నీలోకి నువ్వు తొంగి చూసుకోవడమే మొదటి మెట్టు.

నీ అంతరాంతరాల్లో ఉన్న సత్యాన్ని అనుభూతి చెందేటంత లోతుగా నువ్వు ఒకసారి అంతర్ముఖుడవు కాగలిగావా! అప్పుడు నీకు అభ్యుదయకరమైన, క్రమబద్ధమైన సువిశాల దృక్పథం అగ పడుతుంది. దాంతో పరిధులు అన్నీ చెదిరిపోయి, *సరిహద్దులు చెరిగి పోయి విశ్వం అంతా నువ్వే అవుతావు.*

ఈ మొదటి రెండూ నిన్ను సమాయత్తం చేసే ప్రక్రియలు.

ఈ రెండూ అత్యంత ప్రశాంతంగాను, నెమ్మదిగాను, శాంతి యుతంగాను జరగాలి. ఈ శాంతిసామరస్యాలు మనస్సుకి నిశ్శబ్దాన్ని, ప్రాణికానికి స్థిరత్వాన్ని ప్రసాదిస్తాయి.

ఈ కృషిని, ఈ సాధనను క్రమం తప్పకుండా నిత్యం పరిషిస్తూ, సుసంపన్నం చేసుకుంటూ పోవాలి. ఇలా కొంతకాలం జరిగేసరికి, అసలైన నైజాన్ని తెలుసుకోవడం మొదలు పెడతావు.

నిత్యం నువ్వు అనుభూతి చెందే బాహ్యాజ్ఞానంకంటె అది భిన్నంగా ఉంటుంది.

*

ఆలోచనలు అవరోధాలు

గూఢవిద్యను (occultism) నేర్చుకోదలచుకున్నప్పుడు – సాధారణంగా మొదటి అంశం ఏమిటంటే – గురువు ఆ విద్యను గురించి నీతో ఏమీ మాట్లాడడు. నీకు ఏమీ వివరించడు కూడా. దీనికి కారణం ఒక్క ముక్కలో చెప్పాలంటే – మనస్సుకుగల అవలక్షణమే అనాలి. *ఇతర విషయాలు చెపితే మనస్సు వాటినిగురించి అనవసర ఆలోచనలు పెట్టుకుంటుంది. దానివల్ల పనికిరాని అనుభవాలే తప్ప – పనికివచ్చేది ఒక్కటీ రాదు.* అవన్నీ మానసిక కల్పనలే అవుతాయి. అవి వాస్తవికతకు దూరంగా ఉంటాయి.

నువ్వు అనుభవాల లోకంలోకి అడుగిడ దలచుకుంటే మనస్సుపై విశ్వాసాన్ని పూర్తిగా తుడిచేసుకోవాలి. "ఓ! ఏం జరుగుతోంది?" అనే కుతూహలం తలెత్తుతే చాలు. ఆ తరువాత అనుభూతులు వాటంతటవే కలుగుతాయి – నిజానికి అవి అనుభూతులయితే కదా – కేవలం కల్పనలు; ఉత్తిత్తి ఊహాలూను. అంతే!

మౌనం పరమౌషధం

నువ్వు నోరు మూసుకొని కూర్చోవాలి. ఇది మొదటి స్థితి. మౌనం అంటే కేవలం జిహ్వా స్తంభనమే కాదు. *నీ మనస్సును మౌనంగా ఉంచాలి.* మస్తిష్కంలో ఆలోచనలు ముసురుకో కూడదు. నీ జ్ఞానానికి చక్కటి పునాది వేయాలంటే, అవసరమైన అసలైన, అచ్చమైన అనుభవాల్ని పొందాలనుకుంటే – మౌనంగా ఉండడం

ఎలాగో తెలుసుకోవాలి. లేకపోతే నిన్ను నువ్వు మభ్యపరచుకో
వడమే తప్ప మరొకటి సాధ్యం కాదు. లభించేది శూన్యమే అవు
తుంది. "భగవాన్! నా మనస్సు కథలల్లటంలో దిట్ట" అని అన
కోవడం తప్ప చేయగలిగేది ఏమీ ఉండదు.

*

నిశ్శబ్దంలోనే జ్ఞానోదయం

గీత పట్ల ఎంతో మక్కువ కలిగిన ఒక భార
తీయుణ్ణి కలుసుకున్నాను. ఆయనకు మౌనం
అంటే ఎంతో మక్కువ. ఆయన అంటూండే
వాడు. "నేను నా శిష్యుల వద్దకు వెళ్ళినప్పుడు – వారు సరియైన
స్థితిలో ఉంటే నేను మాట్లాడవలసిన పని లేదు. *నేనూ వాళ్ళూ
కలిసి మౌనం పాటిస్తాం. ఆ మౌనంలోనే ఎంతో కొంత అను
భూతి వస్తుంది.* మా శిష్యులు సరియైన స్థితిలో లేనప్పుడు -
నేను వారితో కొద్దిగా, బహు కొద్దిగా మాట్లాడతాను. అది కూడా
వాళ్లని సక్రమమార్గంలో పెట్టడానికే! ఒకవేళ వారు ఇంకా
అధ్వాన్నస్థితి లోనే ఉన్నారో! ఇక వారు ప్రశ్నలు గుప్పిస్తు
ఉంటారు" (నవ్వు)

*

హృదయాంతరాళంలో దైవసాన్నిధ్యం

నీ అంతరాంతరాల్లో, నీ హృద
యపు అఖాతాలలో దైవసాన్నిధ్యం
నిరంతరం ఉంటూనే ఉంటుంది
*అది ప్రకాశవంతంగా ఉంటుంది. ప్రశాంతంగా ఉంటుంది
ప్రేమతో నిండి ఉంటుంది. విజ్ఞానం వెల్లివిరుస్తూ ఉంటుంది*
నువ్వు దానితో తాదాత్మ్యం చెందాలి. అది అసలు అందుకే అక్కడ
ఉంది. అలా తాదాత్మ్యం చెందావో! అది నిన్ను తేజస్సుతో నింపే
స్తుంది. సంతోషంతో ముంచేస్తుంది. చైతన్యంతో మురిపిస్తుంది.

నువ్వూ, నేను కలిసి మన చుట్టూ ఉన్న గందరగోళాన్ని
శమింప చేద్దాం. అప్పుడే ఆ నిశ్శబ్ద, ప్రశాంత స్థితిలోనే నీవు నీ
ఆంతరంగిక తేజస్సుతో తాదాత్మ్యం చెందగలవు.

అప్పుడే! నీకు కొత్త జీవితాన్ని ఇచ్చే రోజు వస్తుంది.

మూలం: శ్రీమా

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరా

మౌనంలోని శక్తి

మనిషి ఎన్ని తెలివితేటలున్నప్పటికీ ప్రకృతిశక్తులకు బద్ధుడే. ఎందుకని? మానవమేధ సంకల్ప వికల్ప పీడితము కాబట్టి. ఈ జీవితానికి వెనుక మేధాశక్తికి మించిన మరొక చైతన్యమున్నది. అది చంచలము కాదు. అచలము, నిశ్శబ్దము. మనము ఆ స్థాయిని అందుకున్నట్లయితే మన జీవితాన్ని సమర్థవంతంగా గడుపుకోగలం. ఎందుకంటే నిశ్శబ్దము ఒక అనంతమైన శక్తికి నిలయము. మనం ఎప్పుడైతే ఆ నిశ్శబ్దంలో ప్రతిష్ఠితమవుతామో అప్పుడు ఆ యోగశక్తితో మన జీవితాన్ని సుసంపన్నం చేయగలం. సత్యమును దర్శించగలం. అమృతత్వాన్ని ఆస్వాదించగలం.

— సంపాదకుడు

రెండు మహాశక్తులు

ఈ ప్రపంచంలో మౌనమూ, వాక్కు అనే రెండు మహాశక్తులున్నాయి. 'మౌనం పూర్వ రంగాన్ని సిద్ధం చేస్తే వాక్కు సృజన చేస్తుంది. మౌనం సంకల్పిస్తే వాక్కు నిర్వర్తిస్తుంది. మౌనం శాసిస్తే వాక్కు ముచ్చటగా నచ్చ చెప్తుంది. ఈ ప్రపంచంలో జరిగే సంఘటనలన్నీ మనకు చాలా గందరగోళంగా అనిపిస్తాయి. కాని వాటి అసలు స్వరూపం మనకి తెలియదు. పైకి శబ్దతరంగాల జోరూ, సాగరతరంగాల హోరూ మాత్రమే వినబడుతుంటాయి. కాని వాటి ప్రభవభూమి నిశ్శబ్దమే. నిజానికి ఈ గంభీరమైన వ్యవహారమంతా నిశ్శబ్దమైన అగాధసీమలలో సిద్ధము చేయబడి అక్కణ్ణుంచి ప్రయోగింపబడుతుంది.

సత్యం బాహ్య దృష్టికి అతీతం

మానవులు సాగరతరంగాలను తిలకిస్తూ, ఆ తరంగ డోలలు చేసే శబ్దాల్ని వింటూ, భవిష్యత్తు గురించి, భగవంతుడి హృదయంలో దాగిన సంకల్పాల గురించి ఊహాగానం చేసి తీర్పునిస్తారు. అయితే ఆ తీర్పుల్లో పదింట తొమ్మిది సరైన తీర్పులు కావు. అందువలననే చరిత్ర గమనంలో ఎప్పుడూ ఊహించలేని

మలుపులు, మార్పులు చోటు చేసుకుంటాయి. తమ దృష్టిని బాహ్యమైన ఉపరితలంనుంచి అంతరంలో వర్తించే తత్త్వంలోకి మరలిస్తే పైకి కనిపించే వాటిని పక్కకు నెట్టి లోపల గుప్తంగా దాగివున్న రహస్యాలను వెలికి తీయాలంటే, జీవితంలో ఎక్కడైనా బాహ్యంలో వినిపించే శబ్దాన్ని వినటం మాని మౌనాన్ని వినటం అభ్యాసం చేసుకోవాలి.

ప్రగాఢమైన మౌనమే యోగశక్తికి మూలం

ఇది ప్రకృతి ధర్మం. మనం కర్మలలో నిమగ్నమై వున్నప్పుడు ప్రకృతిశక్తులు మన ద్వారా పని చేస్తాయి. అలా కాక మనం నిశ్చలంగా వున్నట్లయితే మనమే ఆ శక్తులను శాసించగలము. నిశ్చలత్వం రెండు రకాలు. ప్రళయానికి ముందు వర్తించే తమస్సులో జనించే నిస్సహాయితతో కూడిన నిశ్చలత ఒక రకం కాగా సంపూర్ణ అధికారంతో సిద్ధించే నిశ్చలత్వం మరొకటి. ఇది జీవితంలో మన ముందుకున్న సమన్వయత్వ మాధుర్యాన్ని సూచిస్తుంది. ఇటువంటి పరమోత్కృష్టమైన నిశ్చలత్వమే యోగికి సిద్ధించే ప్రశాంతత. ఈ నిశ్చలత్వం ఎంతగా సిద్ధిస్తే యోగికి శక్తి అంతగా లభిస్తుంది. శక్తి ఎంతగా పెరిగితే క్రియాశీలమైన నిర్వహణ సామర్థ్యం అంతగా పెరుగుతుంది.

జ్ఞానమే కర్మలకు మూలం

ఈ నిశ్చలత్వంలోనే నిజమైన జ్ఞానం దొరుకుతుంది మానవుల భావాల్లో సామాన్యంగా సత్యమూ అనృతమూ విడదీయ రానంతగా పెనవేసుకుని చిక్కుపడి ఉంటాయి. సత్య గ్రహణానికి అసత్య గ్రహణం మబ్బులా ఆవరిస్తుంది. సత్య నిర్ణయానికి, అసత్య నిర్ణయం అవరోధమవుతుంది. సత్కల్పనా శక్తిని, అసత్య కల్పన వికృతం చేస్తుంది. సత్యస్మృతిని అసత్యస్మృతి మోసగిస్తుంది. చిత్తవృత్తులన్నీ ఆగిపోయి మానవుడి చిత్తం పరిశుద్ధం కావాలి. ప్రకృతి కలిగించే పర్యుత్సుకత్వాన్ని మౌనం శమింప జేయాలి. అటువంటి నీరవ నిశ్శబ్ద మౌనంలోనే మనస్సుకు దివ్యమైన వెలుగు గోచరిస్తుంది. అనృతం తనంతట తానే

తప్పుకుని దూరంగా పోతుంది. మళ్ళీ కోరిక మనసులో మెదల నంత వరకూ, స్పష్టతా సరళతా ఉత్తమ చైతన్య కక్ష్యల్లో నిలదొక్కుకుని, అధోచైతన్య కక్ష్యల్లో కూడా సుఖాన్నీ శాంతినీ కల్గిస్తాయి. అప్పుడు సత్యమైన జ్ఞానం ఏ మాత్రం పొరపాటు లేని సత్కృత్యకు మూలకారణమవుతుంది. "*యోగః కర్మసు కౌశలమ్.*"

యోగుల శక్తి సామర్థ్యము లనంతములు

మౌనమూ, నిశ్చల ప్రశాంతతా, జ్ఞానం వలన లభించిన ఉదాసీనత (passivity) సాధ్యమయితే అమృతత్వం సిద్ధించినట్లే. '*అమృతత్వాయ కల్పతే*' ధీరత్వం మన ప్రాచీన నాగరికత యొక్క ఆదర్శం. అంటే తమోగుణంతో కూడిన జడత్వం, నిర్వ్యాపారత లేకుండా వుండటం. సామాన్యుడి నిర్వ్యాపారత్వం ఒక పెద్ద అవరోధంగా పరిణమించి, *తన చుట్టూ వున్న శక్తులను అడ్డగిస్తుంది. యోగి యొక్క నిష్క్రియత్వం తన చుట్టూ వున్న శక్తులను సృష్టించేదిగానూ, పరిరక్షించేదిగానూ, అవసరమైతే హరించి వేసేదిగాను ఉంటుంది.* యోగి కార్యనిర్వహణ శక్తివంతంగా వుండి మహత్తరమైన ప్రకృతి శక్తులను సూటిగా చాలనం చేస్తుంది శబ్దం యొక్క బలమూ క్రియాశీలతా నిస్సందేహంగా గొప్పవే – శబ్దం యొక్క బలం చేత జెరికో గోడలు కూల లేదా? అయినా నిశ్చలత్వం యొక్క శక్తి అనంతమైనది మౌనంలోనే మహత్తర శక్తుల కార్యక్రమాలన్నీ సిద్ధమవుతాయి.

*

గుహాల్లోనూ, కొండ శిఖరాల మీద కఠినశిలలపై నివసించే సన్యాసి ఏమీ చేయటం లేదనుకుంటున్నావేమో? నీకేం తెలుసు? ఆయన ప్రపంచంలోకి అమోఘమైన శక్తి తరంగాలను ప్రసరింపజేసి తన తపోశక్తి ద్వారా ప్రపంచాన్ని పరిణమింపజేస్తూ వుండవచ్చు.

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం ధారా రాధాకృష్ణమూర్తి

నిశ్చలత: నిజమైన కర్మకు పునాది

అన్నపానాదులే నేటి మానవుల జీవిత పరిధులు. జీవితాని ఇంతకన్నా ముఖ్యమైన దేమైనా వున్నదా అనేదే ప్రశ్న. ఋ సాంప్రదాయం మన దేశపు రక్తనాళాలలోనే వున్నది. తాత్కా లిక ఒడిదుడుకుల వలన అది చెరిగిపోదు. పూర్వకాలం రాజు క్లిష్టసమయాలలో ఋషులతో సంప్రదించి వాళ్ల నిర్దేశాలన పాటించేవారు. ఎందుకంటే ఋషులు యోగశక్తి సంపన్ను నేటి ప్రపంచ పరిస్థితులలో మన మీ విషయాన్ని గుర్తు తెచ్చుకోవాలి. పనులు అందరికీ ఉంటాయి. కాని పని అన పరిగెత్తటం కాదు. హడావిడిలో ఏ కార్యమూ నెరవేరదు. ఇదంత ప్రకృతి ఖేలనము. నిశ్చల చిత్తంలోనే నీవు దైవికశక్తుల పొందగలవు. ఈ సృష్టికి పూర్వస్థితి నైశ్చల్యము. ఈ ప్రప చంలోని ముఖ్యమైన పరిణామము లన్నియు నిశ్చలచిత్తులై ఋషిపుంగవులచే సాధించబడినవే. నీ కర్మలకు కూడ ఆ నైశ్చ ల్యమే ప్రాతిపాదిక అగు గాక. మహాకార్యము లన్నియు పర నైశ్చల్యములోనే సాధించబడును.

— సంపాదకు

ఆర్భాటం పనికి రాదు

ఆందోళన, ఆతృత, అస్థిరత ఏమీ సాధించ లేవు. సముద్రం మీది నురుగులాగా ఇ అక్కడికక్కడే ఆగిపోయే ఆర్భాటమే. ఎప్పుడు ఎడతెరిపి లేకుండా పరుగులుపెడుతూ ఏదో ఒకటి చెయ్య పోతే, తాము ఏమీ చెయ్యడం లేదనే భావం మనుషుల కుంటుం ఈ నామమాత్రపు కదలికలు మార్పు తెస్తాయనుకోవడం భ్రమే ఇది ఒక పాత్రలో నీటిని గిలక్కొట్టినట్టు; నీరు కదలడమైతే కద లుతుంది కానీ ఎంత కొట్టినా నీటిలో మార్పేమీ రాదు కదా మానవునికున్న పెద్ద భ్రమలలో కర్మ చేస్తున్నామన్న భ్రమ చాలా గొప్పది. ఇది ప్రగతికి అవరోధం, ఎందుకంటే నిన్ను ఎప్పుడూ ఏదో ఉత్తేజంలో, ఏదో హడావిడిలో వుండేలా చేస్తుం మీరు అదంతా నిష్ప్రయోజనమైన భ్రమ అనీ, దీనివల్ల ఎప్పుడు

ఎక్కడా ఏమీ సాధించలేమని తెలుసుకుంటే బాగుండు! ఇలా పాడావిడి పడేవారు తమ వినోదంకోసం వీళ్లని ఆడించే కొన్ని శక్తుల చేతిలో కీలుబొమ్మలు. ఈ శక్తులు అంత మంచివి కావు కూడా.

నిశ్చలంలోనే అనంతమైన శక్తి

ఈ ప్రపంచంలో ఏదన్నా ఉత్తమమైన కార్యం జరిగిందంటే అది ఈ కంగారులో చిక్కుకోకుండా స్థిమితంగా ఉండగలిగిన బహుకొద్దిమంది వల్లనే జరిగింది; ఎందుకంటే వారే దివ్య శక్తికి అనువైన ఉపకరణాలు. క్రియాశీల ప్రతినిధులు. ఆ దివ్య శక్తిని ధరిస్తారు. ఈ ప్రపంచాన్ని పరిణమింప జేసే శక్తులను ఇక్కడికి తెస్తారు. ఆ విధమైన పనులు అనిశ్చలతతో, ఆందోళనతో జరిగేవి కావు. ఈ జగత్తు శాంతి, నిశ్శబ్దం, ప్రశాంత నేపథ్యాలలోనే సృష్టించబడింది. *కనుక ఏదన్నా నిజంగా సృజనాత్మకంగా జరగాలంటే అది శాంతి, నిశ్శబ్దాలలోనే జరగాలి. ఈ ప్రపంచానికేదన్నా మేలుచేయాలంటే అహర్నిశలూ చెమటోడ్చి పరుగులు పెడుతూ నానారకాల నిష్ప్రయోజనమైన పనులూ చేయాల్సిందే ననుకోవడం అజ్ఞానం మాత్రమే.*

మనుషులు గుడ్డిగా పరుగెడుతూంటారు

సుడిగుండంలాంటి ఈ శక్తులనుంచి వెనక్కి తొలగినప్పుడే ఈ భ్రాంతి ఎంత బలమైనదో తెలుస్తుంది! అప్పుడు మీకు మనుషులంతా ఆలోచనారహితంగా, గుడ్డిగా, ఒకరినొకరు ఢీ కొట్టుకుంటున్న జీవులుగా కనిపిస్తారు. దీనినే వాళ్లు కర్మ అనీ, జీవితమనీ అంటారు! ఇది నిజజీవితమూ కాదు, కర్మా కాదు, నిష్ప్రయోజనమైన ఆందోళన మాత్రమే.

కాలమహిమకు లొంగిపోకూడదు

ప్రయోజనకరంగా పది నిమిషాలు మాట్లాడాలంటే, పది రోజులు నిశ్శబ్దంగా వుండాలని నేను ఒకసారి చెప్పాను. ఇంకా చెప్పాలంటే, ఒకరోజు ఉపయోగకరంగా పనిచేయాలంటే ఒక సంవత్సరం మౌనంగా వుండాలని అంటాను. నేను చెబుతున్నది బాహ్యజీవితం కోసం మనం రోజూ చేసే దినచర్య గురించి

కాదు. ఈ ప్రపంచానికి ఉపయోగకరంగా వుండేవీ, ఉంటాయన
కునే పనుల గురించీ చెబుతున్నాను. నేను బోధించే నిశ్శబ్ద
అంతర్గత ప్రశాంతత. ఇది తమ కర్మకి కర్తృత్వం వహించ
అందులో లీనమైపోయి, దాని వేగానికీ శబ్దాలకీ అంధులూ, బ
రులూ అవకుండా వుండగల వారికే సాధ్యం. ఈ ప్రాపంచి
చలనాలకి అతీతమైన దృష్టిని ఏర్పరచుకొని, నీ కర్మల నుం
విడివడి అనంత చేతనత్వంలోకి ప్రవేశిస్తేనే నిజమైన కర
ఏమిటో తెలుస్తుంది.

*

నీవు దివ్యచైతన్యంతో ఏకమైపోయినప్పుడు చేయవలసిన కార్య
మానవుల అంచనా ప్రకారం వెయ్యేళ్లు పడుతుందా లేక ఒక
ఏడాది పడుతుందా అనేది ముఖ్యం కాదు. ఎందుకంటే అప్పుడ
నీవు మానవస్వభావ సహజమైన గుణాలని/ప్రకృతిని వదలివే
దివ్యస్వభావ సిద్ధమైన అనంతత్వమూ, నిరంతరత్వములలో ప్ర
శిస్తావు. అప్పుడు ఈ మానవులకున్న ఆరాటం, ఈ పిచ్చి పర
గుతో పనులు పూర్తి చేయాలనే తపన నించి తప్పించుకో గల
గుతావు.

మూలం: శ్రీమా
అనువాదం: బి. వరలక్ష్మి

అంతా నిశ్శబ్దమే (Silence is all)

అంతా నిశ్శబ్దమే నంటారు ఋషులు,
నిశ్శబ్దమే పరికించును తరతరాల పనులు,
నిశ్శబ్దపు గ్రంథంలో పారత్రిక పుటలు
వ్రాసినాడు సర్వలోక సాక్షీ లేఖకుడు,
అంతా నిశ్శబ్దమే నంటారు ఋషులు.

విభాగము II. విజ్ఞానికి మార్గము

మొదటి దశ – నిశ్చల మనస్సు[1]

చంచలత్వము ఈ సృష్టి లక్షణము. మానవ మనస్సుకు కూడ అదే జాడ్యమున్నది. కాని ప్రయత్నించి దానిని అచంచలము చేయు సామర్థ్యము అతని కున్నది. ఆలోచనల రాకపోకలకు దూరంగా నిలబడి ఓ ప్రేక్షకుని వలె వాటిని గమనిస్తూ వుండాలి. నిశ్చల నీరవత (silence) ఇంకా లోతైన స్థాయి. దానిని స్వీయ ప్రయత్నము వలన సాధించటం కష్టం. దైవాన్ని ప్రార్థించి సంపాదించుకోవటం తేలిక. అప్పుడది (silence) నీలోకి పైనుంచి దిగుతుంది. సర్వాంగములకు వ్యాపిస్తుంది. నీ చైతన్యమంతా దాంతో నిండిపోతుంది. నీ నిశ్చలానుభూతి విశ్వమంతా వ్యాపించి మహైక్యభావనను పొందుతుంది.

– సంపాదకుడు

అచంచలత్వపు లక్షణాలు

మొదటి దశ నిశ్చల మనస్సు – నిశ్శబ్దం అనేది అనంతర దశ. కాని ప్రశాంత నిశ్చలత ఉండి తీరాలి. నిశ్చల మనస్సు అంటే. అంతర్గతమైన మానసచేతన. అది తనలోకి వస్తున్న ఆలోచనలను, కదిలే తలపులను చూస్తుందే కాని తనే ఆలోచిస్తున్నదని భావించదు. *ఆలోచనలతో సాయుజ్యము చెందదు. అవి తన సొంత ఆలోచనలని అనదు. ఒక నిశ్శబ్ద దేశంలోకి ఎక్కడ నుండో వచ్చి కదిలిపోయే బాటసారులవలె – ఆలోచనలు, మానసిక కదలికలు ఆ చైతన్యం గుండా ప్రయాణిస్తుంటాయి.* నిశ్చల మనస్సు వాటిని చూస్తే చూస్తుంది. లేకపోతే లేదు. చూసినా చూడక

---

[1] ఈ వ్యాసంలో శ్రీఅరవిందులు Truth, Light, Silence, Divine Shakti అనే ఆంగ్లపదాలకు ముందు సుస్పష్టంగా capitals ఉంచారు. అవి ప్రాపంచిక కార్యకలాపాలలో మునిగి తేలే మానవబుద్ధికి తెలిసిన సత్యం, కాంతి, నిశ్శబ్దం కావనియు, పూర్ణయోగమార్గంలో ఆవిష్కృతమయ్యే మహామహిమాన్వితమైన భగవంతుని పూర్ణ, విశిష్ట విభూతులనియు గమనింప ప్రార్థన.

పోయినా తను మట్టుకు ఆ విషయాలను గురించి పట్టించుకోదు. ఆన నిశ్చలత్వాన్ని కోల్పోదు. నిశ్చలత్వం (quietude) కన్నా నిశ్శబ్దం (silence) మరింత ప్రగాఢమైనది. లోపలి మనస్సునుంచి ఆలోచనను పూర్తిగా బహిష్కరించడం ద్వారా దానిని (నిశ్శబ్దం) సాధించవచ్చును. కాని పై భూమికలనుండి అవరోహణ (de-scent) ద్వారా దానిని తేలికగా నెలకొల్పవచ్చును – అది పై నుండి అవరోహించినట్లు, లోనికి ప్రవేశించినట్లు, వ్యక్తిగత చైతన్యాన్ని ఆవరించినట్లు, ఈ చైతన్యం అనంతమైన నిశ్శబ్దంలోకి (impersonal silence) కలిసిపోయిన అనుభవం కల్గుతుంది.

*

నిన్ను నీవు ఓ ప్రేక్షకుని వలె గమనించాలి

నిశ్చల మనస్సు అంటే అసలు ఆలోచనలు, మానస కదలికలు లేనట్లు అర్థం కాదు. కాని అవి ఉపరితలంపైనే ఉంటాయి. వాటికి భిన్నంగా వున్న నీ నిజమైన చేతనను నువ్వు అనుభూతికి తెచ్చుకోవచ్చు. నువ్వు వాటిని పరికిస్తూంటావు. వాటితో నువ్వు ఎక్కడికో కొట్టుకుని పోవడం జరగదు. వాటిని పరిశీలించి, న్యాయవిశ్లేషణ జరపగలవు. తిరస్కరించవలసిన వాటిని తిరస్కరించగలవు. వాటిని ఆమోదించి, నిజమైన చైతన్యం, నిజమైన అనుభవ పరిధిలో వాటిని నిక్షిప్తం చేయగలవు. మనస్సును ఉదాసీనం (passive) చేసుకోటం మంచిదే. కాని *"మహాసత్యానికి"*, *"దివ్యశక్తి"*, స్పర్శకు మాత్రమే ఉదాసీనంగా ఉండు. నిమ్నప్రకృతి ప్రేరణలకు, ప్రభావాలకు ఆ విధంగా ఉన్నావంటే నువ్వు ఆధ్యాత్మిక మార్గంలో ముందడుగు వేయలేవు. లేదా అదైవశక్తులకు దొరికిపోతావు. అవి నిన్ను నిజమైన యోగమార్గం నుండి దారి మళ్ళించి ఎక్కడికో లాక్కు పోతాయి.

నీలో సుస్థిరం చేయబడిన నిశ్చలత కోసం, మానసిక ప్రశాంతి కోసం, బాహ్యప్రకృతినుండి బయటబడి నీలోని చైతన్యం యావత్తూ దివ్యజ్యోతిర్నివహం వైపు, మహాసత్యం వైపు ఉన్మీలనం అవడం కోసం ఆకాంక్షా ప్రదీప్త హృదయంతో జగన్మాతను వేడుకో

సాధన మార్గంలో అడ్డుపడే శక్తులు నిమ్న మానస, ప్రాణిక, అన్నమయ భూమికలలోని శక్తులు. వాటి వెనుక మానస, ప్రాణిక, *సూక్ష్మభౌతిక లోకాలలోని అదైవశక్తులు చెలరేగుతుంటాయి. భగవంతుని పట్ల ఏకైక ఆకాంక్షతో మనస్సు, హృదయం ఏకోన్ముఖమై, కేంద్రీకృత మైనప్పుడు మాత్రమే ఈ అదైవ శక్తులతో పోరాడి వాటిని తరిమికొట్ట వీలగును.*

*

మానసిక వ్యాపారాలను మనం రద్దు చెయ్యగూడదు. వాటిని సన్మార్గంలో పెట్టాలి – అంతే. హేతువు (reason) ఈ సృష్టిలోని సమస్తాన్ని బయటనుండి మాత్రమే చూస్తుంది. మనం దానికి బుద్ధి చెప్పి పరివర్తన చెందించాలి. పాత మానసిక బుద్ధి నిశ్చలం కాకపోతే, ఆ పని నువ్వు చేయలేవు. హేతువు అన్ని కోణాలనుంచి చూడకుండా, తొందరపాటు దృష్టితో "*ఇతి, ఇతి*" అని, "*నేతి, నేతి*" అని చెప్తూ విశ్లేషణ, ప్రత్యక్ష అనుమాన ప్రమాణాల ద్వారా పరిశీలన జరుపుతుంది.

నిశ్చలమనస్సు ఆలోచనలతో సాయుజ్యం చెందదు. ఆలోచనా ప్రవాహంలో కొట్టుకుని పోదు. ఆలోచనలకు దూరంగా నిలిచి, వాటిని తన సొంత ఆలోచనలుగా చేసుకోకుండా, వాటితో ఏమాత్రం సాయుజ్యం చెందకుండా, ఒదిలేస్తుంది. అది సాక్షీభూత మనస్సుగా మారి, అవసరమైన ఆలోచనలను పరికిస్తుంది. అనవసరమైన వాటినుండి దూరంగా వెళ్లిపోగలదు. ఆలోచనలను లోపలనుండి, ఊర్ధ్వంనుండి స్వీకరిస్తుంది.

మనస్సుతో కుస్తీ పట్టి లాభం లేదు

నిశ్శబ్దం మంచిదేగాని పూర్తి నిశ్శబ్దం (absolute silence) అనివార్యం కాదు – కనీసం ఈ దశలో మనస్సును నిశ్చలం చేయడానికి దానితో కుస్తీపట్టు పట్టడంవల్ల ఎక్కువ ప్రయోజనం వుందో లేదో నాకు తెలియదు. ఆ సమరంలో సాధారణంగా మనస్సే గెలుస్తుంది. అంతకంటే నిశ్చలమనస్సుతో ఆలోచనలకు దూరంగా వెళ్లడం, వాటినుండి వేరైపోవడం, బాహ్యమనస్సులోని ఆలోచనలకన్నా మరేదో భావనాస్రవంతిని వినే శక్తిని సంపాదిం

వడం సులభమార్గం. అదే సమయంలో ఊర్ధ్వభూమికల వైపు వీక్షిస్తూ అక్కడ వున్న దివ్యమహాశక్తిని (force) అవరోహించే టట్లు ఆవాహన చేయడం, లేదా ప్రశాంతంగా ఆ మహాశక్తిసాయం కొరకు నిరీక్షించడం – ఇది జరగాలి. మనస్సు నెమ్మదిగా నిశ్చలమై తనకు తానే నిశ్శబ్దమై, లేదా పైనుండి నిశ్శబ్దం అవరోహించేంత వరకు – సాధకులు ఈ విధంగా సాధన చేస్తారు. ఈ సాధనలో వెంటనే విజయం సాధించలేకపోతే, ఆ కారణంగా నిరాశా నిస్పృహలకు లోనుకావడం, కృంగిపోవడం జరగకూడదు. ఇది చాలా ముఖ్యం. నిరాశ చెందితే, సాధన మరింత కష్టభూయిష్టమై, సంసిద్ధమవుతున్న పురోగతి కూడా నిలిచిపోతుంది.

*

నైశ్చల్యాన్ని పైనుంచి ఆహ్వానించాలి

దివ్యమహనీయ నిశ్శబ్దం లోకి ప్రవేశించడం అంత తేలిక కాదు మానస – ప్రాణిక కార్యకలాపాలన్నింటినీ త్రోసిపుచ్చడం ద్వారా మాత్రమే అది సాధ్యం. నీ లోకి నిశ్శబ్దం అవరోహింప చేయడం సులభతరం అంటే నువ్వు నిశ్శబ్దానికి పూర్తిగా ఉన్మీలన మవటమే. దీనిని సాధన చేసే పద్ధతి, ఉన్నతభూమికలలోని శక్తుల్ని ఆవాహన చేసే మార్గం ఒక్కటే. *ధ్యానసమయంలో నిశ్చలంగా ప్రశాంతంగా ఉండాలి. మనస్సుతో పోరాటం జరపకూడదు. మహోన్నత మహాశక్తిని, నిశ్శబ్దాన్ని క్రిందకు దింపడానికి మానసికమైన ప్రయత్నాలు వ్యర్థములు. వాటి కోసం నిశ్శబ్ద సంకల్పం, ఆకాంక్ష కలిగియుండాలి.* మనస్సులోని యాంత్రికమైన అలవాటు ప్రకారం జరిగే కార్యకలాపాలు శాంతంగా అణగారిపోయేంత వరకు ఈ ప్రక్రియను కొనసాగించాలి. ఒక వేళ మనస్సు పట్టినపట్టు వీడక పోతే శ్రమ, సంఘర్షణ లేకుండా నెమ్మదిగా ఆ కార్యకలాపాలను నిరాకరించడం నేర్చుకోవాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: యజ్ఞన్న

మానసిక, ప్రాణిక, శారీరక శాంతి

యోగులెప్పుడూ ప్రశాంతంగానే వుంటారు. అంతే కాదు – కష్టాలతో వారి దగ్గరకు వెళ్ళిన వారికి కూడ ఆ శాంతిని ధారపోయగలరు. ఆ శాంతి ఓ దావాగ్ని వలె చుట్టుప్రక్కలంతా వ్యాపిస్తుంది. అది ఓ గొప్పశక్తి. మనిషిని కుదుటపరచి జీవితాన్ని చక్కబెట్టే లక్షణం దాని కున్నది. ప్రపంచంలో గొప్ప గొప్ప కార్యములు సాధించే మహాపురుషులందరూ ఎప్పుడూ ప్రశాంతంగానే ఉంటారు. వాళ్ల శక్తికి మూలము ఆ ప్రశాంతతయే.

– సంపాదకుడు

మానసిక, ప్రాణిక, శారీరక శాంతి

నేను ఎవరితోనైనా "ప్రశాంతంగా ఉండు" అన్నానంటే – ఆందోళన, ఆతృత కలిగించే ఆలోచనలు లేకుండా ఉండేటట్లు ప్రయత్నించమని, మనస్సుని స్థిరంగా ఉండేటట్లు సాధన చేయాలని దాని అర్థం. నీ ఊహాలూ, వాదోప వాదనలు, మనోసౌధములు – వీటి చుట్టూ తిరగడం ఆపాలన్నదే నా ఉద్దేశం.

శాంతిని సంపాదించుట మెలా?

"ప్రశాంతంగా ఉండు" అని మీరు అంటున్నారు కదా! మరి అలా ఉండడానికి ఏం చేయాలి? అని ఎవ్వరైనా అడగవచ్చు. అటువంటి ప్రశ్న సమంజసమైనదే కూడా. ఎప్పుడు చెప్పినా, ఎవరికి చెప్పినా దాని జవాబు ఇంచుమించు ఒకేలా ఉంటుంది: దాని అవసరం ఉందని ముందు నువ్వు గుర్తించాలి. ఆ తరువాతనే దాన్ని కోరుకోవాలి. దానిపట్ల ఆకాంక్ష కూడా పెరగాలి. ప్రయత్నం అనేది అప్పుడుగాని ప్రారంభించ కూడదు.

ప్రయత్నం చేయడానికి అనేక విధానాలను చాలామంది అవలంబించి చూశారు – ఎంత తీవ్రంగా ప్రయత్నం చేస్తూంటే, అంత తీవ్రంగాను వారి మస్తిష్కంలో ఆలోచనలు గిర్రున తిరుగుతూ ఉంటాయి! దానితో వారికి మానసిక విశ్రాంతే లేకుండా

పోతుంది. గమ్యం చేరుకోకుండానే చాలామంది నీరుకారిపోవడానికి ఇదే కారణం.

ఒక్కొక్కరిది ఒక్కొక్క మార్గం. వాళ్లు అసలీ ప్రశాంతత ఎందుకు కోరుకొంటారు? ప్రాణం విసిగిపోవటం వలనా, లేక ఈ గందరగోళంలోంచి బైటపడాలనా – కారణాలు ఏమైనప్పటికీ – వారు ప్రప్రథమంగా మానసికశాంతి అవసరాన్ని గుర్తించి "ఇదే గదా నాకు కావల్సింది" అని అనుకోవాలి. ఆ తరువాత ఫలితం సాధించడానికి తెలుసుకున్న పాతపద్ధతులనో, కొత్తపద్ధతులనో నిరాఘాటంగా ప్రయత్నించవచ్చు.

ప్రాణికంలో శాంతి

అప్పుడు మనకు అవసరమైన శాంతి మరొకటి ఉందని వెంటనే గ్రహించగలుగుతాం. అంతేకాదు అది – అత్యవసరమని కూడా గ్రహిస్తాం – అది ప్రాణిక సంబంధమైన శాంతి. అంటే కోరికలు లేకపోవడం అన మాట. ప్రాణికం కూడా అభివృద్ధి చెందాల్సిందే. లేకపోతే అది సహకరించకుండా సమ్మె చేస్తుంది. అది నిద్రలోకి ఒదిగి పోవడమైనా కావచ్చు. లేదా పని పట్ల విముఖత్వం చూపే సోమరితనమైన కావచ్చు. అప్పుడు "అబ్బా! నేను ఏమీ చేయలేను. ఒక్క అడుగు కూడా వేయలేను. నాకు కావలసిన ప్రేరణ, ఉత్సాహం, తృష్ణ, ఉద్రేకం వంటి వాటిని నాకు కలిగించకపోతే – నేను అసలు కదల్లేను. ఏ పనినీ ఇక ఏమాత్రం చేయలేను" అంటారు. దానితో సమస్య సున్నితంగా తలెత్తి క్రమేపి అతిక్లిష్టంగా కూడా రూపొందవచ్చు. ఉత్సాహానికి దూరమై మందకొడితనానికి మళ్ళావా – ఇంక అంతే! ప్రగతి మాట సున్నా. మందకొడితనం, మత్తు, మగత మొదలైన వాటిని శాంతిగా అపార్థం చేసుకోకూడదు.

శాంతి అంటే మందకొడితనం కాదు

శాంతి (నిశ్చలత్వం) అంటే నిర్వ్యాపారంగా, మన్నుతిన్న పామల్లే కూర్చోటం కాదు. కలహం లేకపోవడం మాత్రమే కాదు. అదొక బలమైన ఆయుధము. పనిచేయగల ఆయుధము. అది ప్రవర్తనని నియంత్రించగలదు. ప్రశాంత

వాతావరణాన్ని నెలకొల్పగలదు. ప్రతీ దాన్ని క్రమబద్ధం చేసే నిర్వాహణా పటిమ దానికి ఉంది.

నేను ఎవరితోనైనా "ప్రశాంతంగా ఉండు" అన్నాను అంటే దాని అర్థం – "వెళ్ళి నిద్రపో! మత్తులోకి జారుకో! చైతన్యం లేకుండా ఉండు. ఏ పనీ చేయకుండా సోమరిగా (స్తబ్ధంగా) ఉండు" అని కాదు. నిజానికి 'శాంతి' అనే దానికి అమితమైన శక్తి ఉంది. ఎంతో పుష్టి ఉంది.

ఎవరు బలంగా ఉంటారో, ఎవరు శక్తివంతంగా ఉంటారో వారే సదా ప్రశాంతంగా ఉంటారని సహజంగా ఎవరైన చెప్ప గలరు. సరిగ్గా పరిశీలిస్తే బలహీనులే ఆందోళనకు లోనవుతారు. వారే బలవంతులుగా మారితే వెంటనే ప్రశాంతతను సంతరించు కుంటారు. హాయిగా నిశ్చలంగా ఉంటారు. వ్యతిరేక పవనాలను ఎదుర్కొనేందుకు అవసరమైన సహనశక్తిని సైతం కలిగి ఉంటారు.

శరీరానికి కూడ ఇది వర్తిస్తుంది. సింహాలు, పులులు, ఏను గులు వంటి జంతువులను మీరు జాగ్రత్తగా గమనించారో లేదో నాకు తెలియదు. నిజానికి అవి పనిలేనప్పుడు ఏమాత్రం కదలిక లేకుండా అతినిశ్చలంగా ఉంటాయి. ఎంతో ప్రశాంతంగా మనుమల వంక చూస్తూంటాయి. అవి మనుమలని చూసి ఏమనుకుంటాయో తెలుసా "వీళ్ల దుంపతెగ మనుమలెందుకని ఇంత పిచ్చెత్తి పోతూం టారు? కుదురుగా వుండలేరూ?" ఎంతో జ్ఞానిలా మౌనంతో అలా చూస్తూనే ఉంటాయి. వాటి శక్తి, బలం, శారీరక దారుఢ్యం అన్నీ సమాహారమై పదునుగా సంసిద్ధంగా ఉంటాయి. ఆందోళన ఛాయలు అసలు ఏమాత్రం కనిపించవు. అవసరం వస్తే రంగంలోకి దుమ కడానికి రెడీగా ఉంటాయి.

మూలం: శ్రీమాత

అనువాదం: పి. నాగేశ్వరరావు

శాంతి స్థిరతలు నీ స్నేహితులు – వాటిని ఆహ్వానించు

ఇంత గందరగోళంగా ఉన్న మనస్సుని శాంతపరచట మెలా? అది అసలు జరిగే విషయమేనా అని అనుమానం కూడా రావచ్చు. నిరంతర ప్రయత్నం వలన దానిని సాధించవచ్చు. గట్టి పట్టు దలతో ఈ 'శబ్ద కాలుష్యాన్ని' అరికట్టి ప్రశాంత వైభోగాన్ని అనుభవించవచ్చు. 'శాంతి శాంతి శాంతి' అని దాన్ని పిలవాలి. ఆలోచనలను ఏమాత్రం పట్టించుకో కూడదు. వాటిని నీకు సంబంధం లేని పరాయి వస్తువులవలె చూడాలి. నువ్వు శాంతిని ఒక స్నేహితునివలె మచ్చిక చేసికొని దాని సాన్ని ధ్యాన్ని పొందుతూ ఉండాలి. – సంపాదకుడు

ప్రశ్న: మనసులో స్థిరమైన శాంతిని, నిశ్శబ్దతను పదిలపరచుకో వడం ఎలా?

> *ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః*

మొదట నీవు అది కావాలని తప్పకుండా అనుకోవాలి. తరువాత నిరంతర పట్టు దలతో ప్రయత్నాన్ని కొనసాగించాలి. ఇప్పుడు నేను చెప్పినదే చక్కని మార్గము. అయితే ఇతర విధా నాలూ ఉన్నాయి. *మొదట నీవు ప్రశాంతంగా కూర్చోవాలి; అనేక విషయాలను గూర్చి ఆలోచిస్తూ ఉండరాదు. ప్రశాంత తను ఊహించుకుంటూ ఉండాలి. శాంతిని ఆకాంక్షిస్తూ 'శాంతి', 'శాంతి', 'శాంతి', 'ప్రశాంతి' అనుకుంటూ ఉండాలి. ఏదైనా భావన మనలను తాకినా కదిలించినా మనం మాత్రం శాంతిని మాత్రమే ఆకాంక్షిస్తూ ఉండాలి.* ఇతర ఆలోచనల వైపు మరల కూడదు, వాటికి చెవియొగ్గ కూడదు – తెలిసిందా? వచ్చే ప్రతి ఆలోచననూ నీవు పట్టించుకోరాదు. మనను ఎవరైనా అతిగా చికాకు పెడుతున్నప్పుడు వాళ్ళను, వదిలించుకోవాలనుకున్న ప్పుడు, మనము విననట్లుగా మిన్నకుంటాము, ఔనా? సరే, నీవు నీ తల మరోవైపు త్రిప్పి వేరే అంశంపై ఆలోచిస్తున్నట్లుంటావు

(అమ్మ అభినయించి చూపుతారు) అలాగే చేయాలి: ఆలోచనలు వచ్చినపుడు నీవు *వాటివైపు దృష్టి మరల్చ కూడదు. వాటికి చెవి యొగ్గ కూడదు. వాటిని ఏమాత్రమూ పట్టించుకో కూడదు. అసలు అవి లేనే లేనట్లు ప్రవర్తించాలి.* అంతే కాదు, 'శాంతి', 'శాంతి', 'శాంతి', అని అదే పనిగా మననము చేసుకుంటూ ఉండాలి. అవును, నువ్వు అలాగే చేయాలి. ఈ విధంగా కొంతసేపు కొనసాగించి నీ పని నీవు చేసుకుంటూ పోవాలి. మరలా ఇలాగే సాధన సాగించాలి. పట్టుగా కూర్చొని ప్రయత్నించాలి. *ప్రాతఃకాలము నిద్ర లేస్తూనూ, రాత్రి నిద్రించ బోయే ముందునూ ఇలాగే చేసుకొంటూ పోవాలి.* ఇది నీవు చేయగలవు కదా! నీవు ఆహారమును సక్రమంగా జీర్ణం చేసుకో వాలన్నా కూడ భోజనానికి ముందు కూర్చొని కొద్ది నిమిషాలు ఇలాగే చేయవచ్చును. నీ జీర్ణక్రియకు ఇది ఎంతగా దోహదపడు తుందో నీవు ఊహించ లేవు. *భోజనం ప్రారంభించబోయే ముందు ప్రశాంతంగా కూర్చొని కాసేపు 'శాంతి' 'శాంతి' 'శాంతి' అని అనుకో. అంతా ప్రశాంతమయిపోతుంది. శబ్దాలన్నీ ఎటో దూరంగా పోతున్నట్లు అనిపిస్తుంది.* (శ్రీమాత చేతులను ఇరు వైపులా చాపి అభినయిస్తారు) ఇక నీవు ఈ పద్ధతినే కొనసాగించాలి. కొంత కాలానికి ఏ ప్రయత్నం లేకుండానే ఎల్లవేళలా ప్రశాంతతను పొందగలుగు తావు. అప్పుడు నీవు ప్రయత్నపూర్వకంగా కూర్చోవలసిన అవ సరం ఉండదు. నీవు ఏమి చేస్తున్నా, ఏమి చెపుతున్నా అంతటా ప్రశాంతత నెలకొని ఉంటుంది. అంతా ఇక్కడ ఉంటుంది (శ్రీమాత నుదురు చూపిస్తూ అభినయిస్తారు) ఇలాగే ఉంటుంది. లోపలికి ప్రవేశించదు. కొన్ని సంవత్సరాల తరువాత నీవు ఎల్లపుడూ పరి పూర్ణ ప్రశాంతతలో ఉండగలవు.

> *ఆలోచనలను పట్టించుకోకూడదు*

> *శాంతి నీలో స్థిరనివాస మేర్పరచుకుంటుంది*

మొదట్లో రెండు మూడు నిమిషాలైనా మెల్లగా ప్రారం భించాలి. క్లిష్టమైనది ఏదైనా ప్రయత్నపూర్వకంగా సాధించాలి.

గురించి ప్రశాంతంగా ఉంటూ ప్రయత్నించడం ఎలా? కానీ నిజానికి ఇది చాలా తేలిక. నీవు ఒక స్నేహితుణ్ణి పిలిచినట్లే. పిలిచిన తడవుగా అతడు వస్తాడు. అలాగే 'శాంతము', 'ప్రశాంతత' లతో నీ మైత్రిని పెంచుకో. వాటిని రమ్మని ఆహ్వానించు. అంతే!

సర్వోన్నతుడైన ఓ దేవా! మాకు ప్రశాంతతను నేర్పుము. ఆ మౌనములో మేము నీ శక్తిని పొంది నీ యిచ్ఛను మేము నెరవేర్చెదము గాక!

మూలము: శ్రీమాత

అనువాదము: కె.ఆర్.ఎల్. నరసింహారావు

ప్రారంభకులకు హితం

కొత్తగా యోగం మొదలిడిన సాధకులు సత్వర ఫలితాలకోసం ఆరాటపడ కూడదు. ఊరికే కలవరపడితే లాభం లేదు. మనకు కావలసినది బౌద్ధిక జ్ఞానం కాదు. అతీంద్రియ జ్ఞానం. చేతులు జోడించి వినీత మనస్కుడవై దైవానుగ్రహం కోసం, వెలుగు కోసం వేచి వుండాలి. నువ్వు పునీతుడవై, సంసిద్ధుడవై వున్నప్పుడు పైనుంచి జ్ఞానం దానంతటదే దిగి వస్తుంది. నీకు సమస్య లెదురైనప్పుడు కూడ నిశ్చల మనస్సుతో దృష్టిని పైకి మళ్ళించాలి. ఊరికే మథనపడ కూడదు. నీ కంటె అతీతమైన శక్తి నీ సమస్యను పరిష్కరిస్తుంది.

– సంపాదకుడు

బాహ్యాంతరంగాల్లో నిశ్శబ్దము

వ్యక్తి అభివృద్ధి దృష్టి నుంచీ, ఇంకా మార్గ ప్రారంభంలోనే ఉన్న వారి కోసం, అర్థం చేసుకొనే ముందు నిశ్శబ్దంగా ఎలా ఉండాలో తెలుసుకోటం అభివృద్ధిలో ఎంతో సహాయం చేసే వాటిలో ఒకటి – నిశ్శబ్దంగా ఏ విధంగా ఉండాలో, కేవలం బాహ్యంలో ఒక్క మాట కూడా అనకుండా ఉండటం

మాత్రమే గాక అంతరంగంలో నిశ్శబ్దంగా ఉండటం ఎలాగో తెలియటం. అందువల్ల తనకు సాధారణంగా ఉండే దురహంకారంతో మనస్సు తన అజ్ఞానాన్ని నిలబెట్టదు. అర్థం చేసుకోవటానికి శక్తిలేని ఉపకరణంతో అర్థం చేసుకోవాలని ప్రయత్నించదు. తన బలహీనతను తెలిసికొని సరళంగా నిశ్శబ్దంగా తెరుచుకుని, ప్రకాశాన్ని స్వీకరించే సమయం వచ్చే వరకు వేచి ఉంటుంది. ఎందుకంటే ప్రకాశం మాత్రమే, నిజమైన ప్రకాశం మాత్రమే దానికి అవగాహన ఇవ్వగలదు. అలా ఇచ్చేది మనస్సు నేర్చుకున్నదంతాగాని, అది పరిశీలించిందంతాగాని, జీవితానుభవం అంటూ అది పిలిచేదంతాగాని కాదు – అది ఏదో ఇంకొకటి, దానికి పూర్తిగా అతీతంలో ఉంది. దైవానుగ్రహానికి ప్రకటన అయిన ఆ ఇంకేదో, దాని లోపలనే అభివ్యక్తం అయ్యే వరకూ చాలా నిశ్శబ్దంగా అణకువగా మౌనంగా ఉండగలిగి అర్థం చేసుకునే ప్రయత్నం, అన్నింటినీ మించి నిర్ణయం చేసే ప్రయత్నం చేయకపోతే, విషయాలు చాలా వేగంగా ముందుకు పోతాయి.

మాటలన్నీ నీ తలలో ఉన్న భావాలన్నీ చేసే ధ్వని ఎంత చెవులు చిల్లులు పడేటట్లు ఉంటుందంటే, సత్యం తాను అభివ్యక్తం కావాలనుకున్నప్పుడు అది నీకు వినబడకుండా ఇది అడ్డు పడుతుంది.

సమస్యల పరిష్కారం నిశ్శబ్దం లోనే

నిశ్చలంగా నిశ్శబ్దంగా ఉండటాన్ని నేర్చుకోటం.... పరిష్కరించ వలసిన సమస్య ఏదైనా నీకు ఉన్నప్పుడు నీ తలలో సంభావ్యత లన్నింటినీ, పర్యవసానా లన్నింటినీ తిరగనివ్వకుండా వాటి బదులు మంచిబుద్ధి కోసం వీలైతే మంచిబుద్ధి అవసరంకోసం, ఆకాంక్షతో నిశ్చలంగా ఉంటే పరిష్కారం చాలా తొందరగా వస్తుంది. నిశ్శబ్దంగా ఉన్నావు గనుక నీవు దాన్ని వినగలుగుతావు.

వెలుగుకోసం వేచి ఉండుట

ఏదైనా కష్టంలో నీవు చిక్కుకున్నపుడు ఈ పద్ధతిని ప్రయత్నించి చూడు. వ్యాకులుడవై చురుకుగా పరిష్కారాలు వెదు

గుతూ అన్ని భావాలతో తలక్రిందులు కావటానికి బదులు, కలవరపడుతూ చికాకుపడుతూ నీ తలలోనే ఇక్కడికీ అక్కడికీ పరుగులు తీసే బదులు – నా ఉద్దేశం బాహ్యంలో అని కాదు. కారణం బాహ్యంలో ఆ విధంగా చేయకుండా ఉండగలిగేటంత లోకజ్ఞానం నీకు ఉంటుంది. నిశ్చలంగా ఉండు. నీ స్వభావాన్ని బట్టి ఉద్వేగంతోగాని, ప్రశాంతంగాగాని, లోతుగాగాని. విశాలంగాగాని వీటన్నింటినీ కలిపిగాని ప్రకాశాన్ని ప్రార్థించు. దాని రాకకు వేచి ఉండు.

ఈ విధంగా చేస్తే పోవలసిన దారి చాలా తగ్గిపోతుంది.

*

నిశ్శబ్దం – ఓ, దాన్ని గురించి మాట్లాడటంకన్న ఆచరించటమే మేలు.

ఇది చాలా కాలం క్రిందటే ఇక్కడ నాకు కలిగిన అనుభవం. నేర్చుకున్నదాన్ని తక్షణం వ్యాపింపజేసి ఉపయోగించాలని కోరటానికి ఉన్నతజ్ఞానానికి పరివర్తన చేసే ఫలితం రావటం కోసం చేతనైనంత నిశ్శబ్దంగా ఉండి దానితో సంబంధం కలిగి ఉండటానికీ మధ్య ఉన్న తేడా. నాకు దీని సజీవమైన అనుభవం కలిగింది.

మూలం: శ్రీమాత

అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రరావు

Crossing the immobile silence of her mind:...
It siezed on speech to give those flamings shape,
Made beat the heart of wisdom in a word
And spoke immortal things through mortal lips.

Sri Aurobindo

(Savitri, p. 553)

నిశ్చలతను అనుదినం కొన్ని నిమిషాలు అభ్యసించండి

మనస్సును నియమించినప్పుడు అది మానసాతీత జ్ఞానమును గ్రహించగలదు. కనీసం దాని ఛాయలను చూడగలదు. ప్రతి రోజు నియమిత కాలంలో కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా వుంటే మంచిది. ఆలోచనలను అమాంతంగా ఆపివేయలేము కదా. అందుకని క్రమం తప్పకుండా అభ్యసించినట్లయితే ఫలితాలు కలుగుతాయి. నువ్వు మానసిక ప్రపంచాన్ని దాటి జ్ఞానభూమి కలను అందుకోగలవు. — సంపాదకుడు

చైనా, జపాన్, బర్మా దేశాలలో చిన్న చిన్న బౌద్ధులశాఖలు అసంఖ్యాకంగా ఉన్నాయి. ప్రతి ఒక్క శాఖ కొన్ని పద్ధతులను అవలంబిస్తుంది. మనస్సును నిశ్చలపరిచే ఏకైక అభ్యసన చేసేవి ఆ శాఖల్లో విస్తృతంగా ఉన్నాయి.

మనస్సును నిశ్చల పరచుట

ప్రతి నిత్యం, రాత్రిపూట కూడా తమ మనస్సును నిశ్చలపరుస్తూ వారు కొన్ని గంటలసేపు కూర్చుంటారు. వారి సాధన అంతటికీ ఇదే కీలకం – చంచలం కాకుండా గంటల తరబడి ప్రశాంతంగా ఉండటమెలాగో తెలిసిన ప్రశాంతచిత్తం. ఇది చాల సులభమని మీరు అనుకోకూడదు. వారికి ఏ ఇతర లక్ష్యము లేదు. ఏ ఒక్క ఆలోచన మీద వారు కేంద్రీకరించరు. ఇంకా బాగా అవగాహన చేసుకోవాలనీ, ఇంకా ఎక్కువ తెలుసుకోవాలనీ వారు ప్రయత్నించరు. ప్రశాంత చిత్తసాధన మాత్రమే వారి ఏకైక లక్ష్యము. ఈ ఫలితాన్ని సాధించేందుకు కొన్నిసార్లు ఏళ్లతరబడి కృషి చేస్తారు – మనస్సును నిశ్చలపరచి, దానిని సంపూర్ణంగా నిశ్చలం, అచంచలం చేసేందుకు కృషి చేస్తారు – 'ధర్మపథ'లో చెప్పినట్టుగా మనస్సు సమతులంగా లేనట్టయితే, భావాలు ఒకదాని వెంట మరొకటిగా, విధీ విరామం లేకుండా, కదులుతూ, పరస్పరం విరుద్ధమై, ఒకదాని నొకటి వ్యతిరేకిస్తూ,

ఊహాగానాలు చేసే భావాలు తలలో మెదలటం మొదలుపెడ తాయి (పై కప్పులో కన్నం పెట్టినట్టు). పైకప్పులోంచి ఇంట్లోకి నీరు చొరబడినట్టు అవాంఛనీయ కదలికలు చైతన్యంలోకి ఈ కన్నాల్లోంచి ప్రవేశిస్తాయి.

ప్రతి రోజూ అభ్యాసము

అది ఎలా ఉన్నా ఈ అభ్యాసం ప్రతి ఒక్క రికి సిఫార్సు చేయాలి. మనస్సు ప్రశాంతంగా, సమతులంగా, నిశ్చలంగా ఉండే ప్రయత్నం కోసం ప్రతి రోజు నిర్ణీత సమయాన్ని కేటాయించాలి. మానసి కంగా ఎంత ఎదిగితే అంత త్వరగా విజయవంత మవుతారనటం ప్రత్యక్ష సాక్ష్యం. మనస్సు ఎంత ప్రాథమిక స్థాయిలో ఉంటే విజయసాధన అంత జటిలమవుతుంది.

ఆలోచనలకు మాటలవసరమా?

మనస్సుకు శిక్షణ లేకుండా అట్టడుగున ఉన్న వారు ఆలోచించాలంటే మాట్లాడటం అవసరం. వారు మాట్లాడితేగాని భావాలను క్రోడీకరించలేరు. భావప్రకటన లేకపోతే వారు ఆలోచించ లేరు. మేధావంతులలో కూడా ఆలోచించేందుకు పదాలను మనస్సులో మెదిలించే వారున్నారు. పదజాలం లేకనే చింతన చేయగలిగేవారు నిజమైన చింతన చేస్తారు. అంటే వారు భావనతో సంపర్కం కలిగి వివిధ పదాలలో, పదసముదాయంలో ఆ భావనను ప్రకటించగలరు. ఇంకా ఉన్నత దశలు — ఎన్నో ఉన్నత దశలున్నాయి. పదజాలం లేకనే బుద్ధి కుశలతగల స్థితిని చేరుకోగల వారికి మనస్సును సమాధానపరచటం చాలా సులభం. బహిరంగ ప్రదేశంలో ప్రజలు తిరుగాడే రీతిని మనస్సులో మెదిలే పదజాలాన్ని నిరోధించి ఒకే భావం మీద మనస్సును కేంద్రీకరించగలరు.

ఈ విషయం నేను మరింత గట్టిగా చెపుతున్నాను. కొంత మందికి నేను silence ఇచ్చాను. కాని వారు తమ మేధాశక్తిని పోగొట్టుకొంటున్నామని వెంటనే కలవరపడ్డారు. ఆలోచనాశక్తి లోపించి మందబుద్ధులవుతామని వారు కలత చెందారు! నిరంతరం ఆలోచనలు కొనసాగించ గలగటం కన్న ఆలోచనలను

నంత బలవత్తరమై నీ చుట్టూ పరిభ్రమించే విషయాలను నీవ గమనించకుండా చేయాలి.

*

ఉన్నత జ్ఞానాన్ని గ్రహించుట

వ్యక్తి తన చేతనను పై స్థాయికి తీసుకొని వెళ్ళడం అంటే సత్తయొక్క నిమ్నతలాల్లోనుండి దానిని ఊర్ధ్వానికి తీసుకొని రావడం, దానిని వెలుగులో, ప్రశాంతతలో, ఉన్నతవైజ్ఞానిక సామరస్యాలలో ఉంచటం. అంటే వ్యక్తి తన చేతనను తన సత్త ఉంచగలిగినంత సమున్నతంగా ఉంచి అధోస్థాయి సంచలనాల నన్నిటినుండి తాను విముక్తుడవటం. అట్టి చేతన అనేది ఉన్నప్పుడు అది గ్రహించే ఆలోచనలు కూడా సహజంగానే సమున్నత స్థాయిలో ఉంటాయి. *ఆలోచన అనేది చేతనయొక్క ఒకానొక రూపము మాత్రమే కానీ అది చేతనయొక్క మూలపదార్థము కాదు. అసలు ఆలోచనలే లేనటువంటి చేతన కూడా ఒకటి ఉంది.* దీనిపైన సమున్నతస్థాయిలో ఆలోచనారహిత చేతన ఉంటుంది. అందులో ఆలోచనలకు స్థానమే లేదు. అట్టి స్థితిలో విషయపరిజ్ఞానము సమగ్రంగానూ, పరిపూర్ణంగానూ చేతలలోగాని మాటలలోగాని వ్యక్తం కానటువంటిదిగానూ ఉంటుంది ఆలోచన అనేది చేతన యొక్క ఒకానొక ప్రక్రియ మాత్రమే!

ప్రశ్న: “నిశ్శబ్దం పైనుండి దిగిరావటం వల్లనే తేలికగా స్థాపించబడుతుంది” అన్నారు కదా? “పైనుండి” అంటే ఏమిటి మదుమయీ?

జ్ఞానజ్యోతి దిగివచ్చుట

అంటే ఊర్ధ్వచైతన్యపు స్థరాలనుంచి: చూడు *నీవు చేతనయొక్క ఊర్ధ్వక్షేత్రాల దిశగా ఉన్ముఖుడవై హృదయాన్ని తెరచి ఉంచితే ఆ శక్తి పైనుండి కిందకు దిగి నిమ్నస్తరాలలో తప్పకుండా ప్రశాంతతను నెలకొల్పుతుంది.* ఏలననగా నిమ్నస్తరాలు ఊర్ధ్వ శక్తికి లోబడి ఉంటాయి కనుక. ఈ శక్తి మనసుయొక్క ఊర్ధ్వ స్తరాలనుండి గానీ, ఇంకా పైనుండిగానీ, దానిని దాటి ఉన్న

అతిమానసం నుండిగానీ క్రిందకు దిగిరావచ్చును. ఆ విధంగా దిగి క్రిందిచేతనలో ప్రవేశించినపుడు ఒక సమున్నత తేజస్సు నిమ్నస్థాయి చేతనను చుట్టుముడుతుంది. అప్పుడది సహజంగానే ప్రశాంతం అవుతుంది.

మనస్సు ద్వారా జ్ఞాన ప్రసారము

నిజానికి మనసులో స్థిరమైన నిశ్శబ్దత నెలకొల్పడానికి ఇదియే ఏకైక మార్గము. అంటే వ్యక్తి ఉన్నతచేతన వైపు హృదయాన్ని తెరచి ఉంచి ఊర్ధ్వచేతన, శక్తి, వెలుగు నిమ్నచేతన వైపుగా దిగి దాన్ని స్వాధీనపరుచుకునేలా చేయాలి. ఇది సంభవమైనపుడు నిమ్నమానసము స్థిరంగా, ప్రశాంతంగా, మౌనంగా ఉండగలదు. ఎందుకనగా సత్తను పూర్తిగా ఆవరించి పనిచేయు శక్తి ఇదే కనుక. *పైనించి ఈ శక్తి వచ్చి మనసు లోనికి చొచ్చుకొనిపోయి దానిని పనిచేయించడంవలన మనము మనసుయొక్క ప్రమేయం లేకుండానే వ్రాయడం, మాట్లాడటం మొదలైనవి చేయగలము.* మనసు కూడా ఒక ఉదాసీనమైన పరికరంగా మారిపోతుంది. నిజానికి నిశ్శబ్దాన్ని నెలకొల్పే విధానము ఇది ఒక్కటే. ఒక్కసారి దీన్ని సాధిస్తే నిశ్శబ్దాన్ని నెలకొల్పినట్లే. ఇక మనసు ఎప్పటికీ చలించదు. అది అభివ్యక్తమైనపుడు మనసు దాని ప్రేరణవలననే పనిచేస్తుంది. అది ఓ ప్రశాంత, మౌనక్షేత్రం వంటిది. పై శక్తి అందులోకి ప్రవేశించినపుడు మనసును ఏ ఆందోళనకూ గురిచేయకుండానే వ్యక్తము కాగలదు.

మూలం: శ్రీమాత

అనువాదం: కె.ఆర్.ఎల్. నరిసింహారావు.

To where Mind motionless sleeps waiting Light's birth,
And came back quivering with a nameless Force

Sri Aurobindo

(*Savitri*, p. 383)

యథార్థ సద్య స్ఫూర్తి

మనకు మనస్సు ద్వారా తెలిసిన జ్ఞానమంతా పరిమితమైనది. దీనిని అవిద్య అనవచ్చును. నిజమైన జ్ఞానముయొక్క స్వరూపమే వేరుగా ఉంటుంది. నీ మనస్సును నిశ్చలము జేసికొని ఊర్ధ్వోన్ముఖుడవైనప్పుడు, భగవంతుడు నిన్ను అనుగ్రహించినప్పుడు నీకది దొరుకుతుంది. నీవిక భగవంతునికి చక్కటి ఉపకరణము కాగలవు. నీవు దైవకార్యార్థివై ఉన్నప్పుడు నీకెప్పుడు ఏది కావాలో, దేనిని గురించి తెలుసుకోవాలో దానిని ఆయనే సమకూరుస్తాడు. అందుకని కష్టపడి విషయ పరిజ్ఞానమును పోగుచేసుకొని జ్ఞాపకముంచు కోవలసిన పనిలేదు.

— సంపాదకుడు

> *నేను జ్ఞానినేమీ కాదు. ఎందుకంటె నాకున్న జ్ఞానమంతా భగవంతు డిచ్చినది తప్ప — అదీ తన పనికోసం. నాకు కనిపించినది మంచో చెడో నాకెలా తెలుస్తుంది? అది రెండూ కాదు కనుక. అది తప్పూ కాదు, తర్కన్యాయమూ కాదు — కేవలం సత్యం.*
>
> శ్రీఅరవిందులు (సూక్తులూ, ఆలోచనలూ)

"నేను జ్ఞానిని కాదు". జ్ఞానమార్గ గామినే జ్ఞాని అంటారు. మరి శ్రీఅరవిందు లంటారు: నేను జ్ఞానిని కాదు — నేను జ్ఞానాన్వేషినికాను కనుక. నన్ను నేను దైవాని కర్పించుకొన్నాను — *ఆయన కార్యకలాప నిర్వహణ కోసం. ప్రతి క్షణమూ — దైవానుగ్రహంతో ఏది తెలుసుకోవాలో అది నాకందుతుంది. ఎందుకంటె — ఆయన పనులు చక్కబెట్టటం కోసం.*

అదెంత చక్కటి స్థితి! అది పరిపూర్ణ శాంతమనస్కత. ఆ స్థితిలో జ్ఞానాన్ని కూడబెట్టుకోవలసిన పనేమున్నది? పునః పునః స్మరించదగ్గ భావజాలంతో పనేమిటి? కాలానుగుణంగా అవసరమైన యథార్థజ్ఞానం — కార్యనిర్వహణార్థం — బోధానిమిత్తం — సమస్యాపరిష్కారం కోసం నిష్పన్న మౌతున్నపుడు

వేల ఆలోచనలతో మనస్సును నింపుకోవలసిన అవసర మేము న్నది? మనస్సు శాంత మౌతున్నది. మెదడు నిశ్చలమౌతున్నది. ప్రతి విషయమూ స్పష్టంగా వుంది. ప్రశాంతంగా వుంది. నిశ్చలంగా వుంది. సరైన నిమిషంలో ఈశ్వర కారుణ్యం వెలుగురేఖగా చైతన్యాన్ని తాకుతుంది. అవసరమమైనదేదో దానంతటది తెలుస్తున్నది. అలాంటప్పుడు జ్ఞప్తి పెట్టుకోవలసిన అవసరమేమీ లేదే! జ్ఞానం కూడబెట్టవలసిన అవసరమేమిటి? ఆ రోజున ఆ క్షణంలో రావలసినదేదో వస్తున్నది. *ప్రతి నిమేషమూ నీ మనస్సు తెల్లకాగితంలాగా ఉంటే కావలసినదేదో దానిపై అక్షరాకృతి పొందుతుంది. ప్రశాంత నిశ్శబ్ద నిశ్చలస్థితిలోనే దైవీజ్ఞానసంపద సద్యః సమావిష్కృతి పొందుతుంది.*

వినయసంపన్న నిశ్శబ్దమనస్కత – ఏకాగ్రమైన మనస్కత – బాహ్యాడంబరాలు లేని మనస్కత. ఆతురతలు ఆలోచనలూ లేని స్థితిలో, నిమిత్తమాత్రంగా ఉన్న స్థితిలో, – దైవరశ్మి భావమై అక్షరమై మనశ్చైతన్యంలో తళుక్కున మెరుస్తుంది. దానిని ప్రతిఫలింప చేస్తుంది.

ప్రథమావశ్యకత – నిన్ను నీవు మరిచిపోవటం – నిరహంకార భూమికలో వుండటం. నిన్ను నీవు దైవానికి సమర్పించుకోవటం.

అప్పుడు పరమేశ్వరునితో ఈ శరీరమంటుంది – నీవెలా నన్ను మలుచుకోవాలను కొంటున్నావో అలా మలచుకో. నాకేమి తెలుపాలను కొంటున్నావో అదే నా ఎరుక కందించు. నా కర్తవ్యమేదో నేనెలా చేయాలో అదే నాద్వారా చేయించుకో.

*

ఈ సద్యః స్ఫూర్తి మీ కర్థం కావాలంటే రెండు ఉదాహరణలు చూడండి. ఒకటి – మీకిది తెలుసు ననుకుంటున్నాను. అది 1914 లో 'ఆర్య' ప్రత్రికకు శ్రీఅరవిందులు వ్యాసాలు వ్రాసిన పద్ధతి. ఆ వ్రాతలు మనఃసృష్టి కావు – మానసిక జ్ఞానమూ కాదు. వారు తమ మనస్సును నిశ్శబ్దం చేసి – ప్రశాంతభూమికలో టైపురైటరు దగ్గర కూర్చుండేవారు. అప్పుడు జరిగిందే

మిటి? ఊర్ధ్వలోకాలనుండి వ్రాయవలసినదంతా చైతన్యంలోకి వచ్చి కూర్చునేది. వారు కేవలం టైపురైటరు పైన వ్రేళ్లాడించటమే. అంతా దానంతటది అక్షరరూపం ధరించేది. ఈ మౌన మనస్సులోకి జ్ఞానమూ తదభివ్యక్తీ ఊర్ధ్వ మనోభూమికల నుండి అవతరించేది. 64 పేజీల 'ఆర్య' పత్రిక ఈ విధంగా ప్రతి నెలా వచ్చేది. ఇదంతా అతిమానసిక చైతన్యంనుండి సద్యోగ వినిర్గమనం వల్ల నిష్పన్నమయ్యేది.

మూలం: శ్రీమాత

అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

బలిష్ఠమైన అచలత

భగవంతుడు నిశ్చలుడేకాని ప్రకృతి చేసే అవిరళ క్రీడవలన ఈ సృష్టిలో పైకి చంచలత్వమే కనబడుతుంది. మరి మనిషి కూడ అందులోని భాగమే కదా. చంచలమనస్సుతో నువ్వే పనీ సరిగ్గా చేయలేవు. నీ కెందుకీ శిక్ష? నీ ఆత్మస్వరూపమును కనుక్కున్నట్లయితే ఏ బెడదా ఉండదు. అది అచలము. అప్పుడు నీ మనస్సుయొక్క స్వరూపమే మారిపోతుంది. అది నిశ్చలమౌతుంది. అప్పుడు నీకు చేతకాని పని అంటూ ఏమి ఉండదు.

– సంపాదకుడు

తగ్గించటానికి వీలులేని, రాజీలేని ఒక నిరపేక్షాన్ని, ఒక మలుపును, సమస్తమైన అంతారాత్మస్థాయిని మార్పుచేసే దృక్పథాన్ని గీత లక్షిస్తున్నది – ప్రాణికప్రేరణల మీద మానసిక నియమాన్ని కాదు. అమృతాత్మకు చెందిన బలిష్ఠమైన అచలతను.

– (యోగ సమన్వయము: శ్రీఅరవిందులు)

ఇది పగటి వెలుతురంత స్పష్టంగా ఉంది. అమృతాత్మకు చెందిన బలిష్ఠమైన అచలస్థితిని గీత కోరుతోంది – మిగిలినదంతా రెండో

ష్టం. ఆత్మ తన అమృతస్థితిని తెలుసుకోవాలనీ ఆ విధంగా బలి ష్టమైన అచలతను పొందాలనీ గీత వాంఛిస్తోంది.

అచలతే కర్మలకు ప్రాతిపదిక

కారణం అది వాస్తవం. అది అంతే. ఆత్మ అమృతస్థితిని తెలుసుకున్నప్పుడు సొంతం బలంతోనే తయారైన అచలత అయిపోతుంది. అచలత అంటే అది ఇక కదలదు. అయితే అది బలిష్ఠమైన అచలతేగాని జడత్వానికి అసమర్థతకు చెందిన అచలత మాత్రం కాదు. కర్మకు ఆధారమైన బలిష్ఠమైన అచలత. అంటే మనం చేసేదంతా ఈ శక్తిమంతమైన – సర్వశక్తివంతమైన – అమృతత్వంగల ఆత్మకు చెందిన అచలత పునాదిగా ఉంటుంది.

ప్రత్యక్షంగా అనుభవించాల్సిందే

కాని చూడండి! ఏ వివరణ అయినా కూడా దాన్ని మీకు ఇవ్వలేదు. నీకు అనుభవం కావాలి. ఎంతవరకు ఈ అనుభవం రాదో అంతవరకు ఇదేమిటో అర్థం చేసుకోలేము. ప్రతిదానికి ఇది ఇంతే. తల, చిన్నమెదడు అర్థం చేసుకోలేవు. అనుభవం కలిగిన మరునిమిషంలో అర్థం అవుతుంది. *అంతకు ముందు కాదు. ఒక విధమైన ఊహాకల్పితమైన భావం ఉండవచ్చు, కాని ఇది అవగాహన కాదు. అవగాహన కావాలంటే దాన్ని అనుభవించాలి.* నీ అమృతాత్మ నీకు తెలిస్తే దాని బలిష్ఠమైన అచలత ఏమిటో తెలుస్తుంది. అంతకు పూర్వం మాత్రం కాదు. అలా కాకపోతే ఇవన్నీ వట్టి మాటలు మాత్రమే.

అచలంగానూ బలిష్ఠంగాను ఒకేసారిగా ఎలా ఉండగలమో నీకు అర్థం కాలేదు. అదేనా నిన్ను కలవరపెడుతున్నది? సరే, నా ప్రత్యుత్తరం ఏమంటే మహత్తరమైన బలం అచలతలోనే ఉంది. అది ఎదురు లేని శక్తి.

నువ్వు చలించకుండా ఉండాలి

దీనికి ఒక చిన్న ఉదాహరణ. ఇది నీకు బహుశా అర్థం కావచ్చు. ఎవరో వచ్చి నిన్ను అవమానించారనుకో లేదా నీకు బాధ కలిగే మాటలు మాట్లాడారు అనుకో! ఈ ఆగ్రహంతో లేదా గల శత్రుత్వంతో అదే విధంగా నీవు కూడా స్పందించటం మొదలు

బెడితే బలహీనుడవు శక్తిహీనుడవు అయినావని అనిపిస్తుంది. సాధారణంగా అప్పుడు నిన్ను నీవే బుద్ధిహీనుడుగా చేసుకొంటావు. కాని నీ లోపల, ముఖ్యంగా నీ తలలో ఈ ప్రకంపనాలను స్వీకరించక నిరాకరించే సంపూర్ణమైన అచలతను నీవు అట్టిపెట్టుకోగలిగితే అప్పుడు అదే సమయంలో గొప్ప బలం వచ్చినట్లు అనిపిస్తుంది. అవతలి వ్యక్తి నిన్ను భంగపరచలేడు. నీవు చాలా నిశ్చలంగా భౌతికంగా కూడా ఉంటే నీ మీద హింసాప్రయోగం జరిగినా నీవు చాలా నిశ్చలంగా, చాలా నిశ్శబ్దంగా, ఏమాత్రం కదలిక లేకుండా స్థిరంగా ఉండలిగితే దానికి నీ మీద మాత్రమే కాదు. అవతలి వ్యక్తి మీద కూడా ప్రభావం కలుగుతుంది. అంతరంగ స్పందనకు చెందిన ఈ ప్రకంపనలు నీలో లేకపోతే, నీ లోపలా, ప్రతిచోటా, తిరుగులేని అచలతను కలిగి ఉంటే, దీనికి అవతలి వ్యక్తి మీద కూడ తక్షణ ఫలితం ఉంటుంది.

అచలతకు ఎంత శక్తి ఉందో దీన్నిబట్టి నీకు తెలుస్తుంది. ఇది ప్రతి దినమూ సంభవించే సాధారణ వాస్తవం. ఆధ్యాత్మిక జీవితానికి చెందిన గొప్ప సంఘటన ఏమీ కాదు. బాహ్య భౌతిక జీవితానికి చెందిందే.

> అచలత్వమే
> శ్రీరామ రక్ష

అచలతలో, మానసిక అచలత, ఇంద్రియ అచలత, భౌతిక అచలతలో, బ్రహ్మాండమైన శక్తి ఉంది. అసలు కదలిక అన్నదే లేకుండా ఒక గోడలాగా ఉండగలిగితే, ఎదుటి వ్యక్తి నీ మీదికి ఏది పంపించినా అది తిరిగి అతని మీదనే పడుతుంది. హత్య చేయబోయే వాని చేతిని కూడా అది ఆపుతుంది. అర్థమైందా! దానికి అంత బలం ఉంది. అయితే ఒకటి: పైకి అచలంగా కనిపిస్తూ లోపల ఉడికిపోతూ మాత్రం ఉండకూడదు. అది కాదు నేను అనేది – సమగ్రమైన అచలత.

మూలం: శ్రీమాత

అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రరావు.

ఈ నిశ్శబ్ద పుష్పము నీలో వికసించు గాక!

అంతా నిశ్శబ్దమై ప్రశాంతమైనప్పుడే పరమేశ్వరుడు ప్రత్యక్ష మౌతాడు. ఏం జరిగినప్పటికి నువ్వు చలించకుండా ఉన్నప్పుడు భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. అన్ని పరిస్థితులలోను సమతతో వర్తించు. దైవము అభివ్యక్తమౌతాడు.... అయితే మేము నీ కోసం జరుపు అన్వేషణలో ఏ మాత్రం ఆత్రతగాని వేగిర పాటుగాని పనికి రావు. ఒకవేళ అలా చేసినట్లయితే మన మధ్య ఒక గోడ ఏర్పడుతుంది. ఇంకా చెప్పాల్నంటే మేము నిన్ను చూడాలని కూడ అనుకోకూడదు. ఎందుకంటె అది కూడ మనస్సును కలవర పెట్టటమే అవుతుంది. నీ నిరంతర సాన్నిధ్యం నిర్వివాదం. దానిని గుర్తించ గలిగిన ప్రశాంతత, ప్రసన్నత సంపూర్ణమైనప్పుడే గదా నీవు సర్వత్రా ద్యోతక మగుదువు. సర్వస్వము నీవే కదా. ఈ పవిత్రమైన ప్రశాంత వాతావరణంలో ఓ చిన్న భిన్నస్వరం చాలు, నీ అభివ్యక్తిని నిరోధించేందుకు. *ఏ మాత్రము తొందరపాటు పనికి రాదు. అశాంతి ఆతురతలు లేవు. అంతా నీవే. నీవుకాని వస్తువే లేదు. తర్కవిశ్లేషణ, మనస్సుతో ఊహాకల్పన లేనప్పుడు అంతా నీవే. నిస్సంశయంగా నీవే. ఎల్లెడలా ఓ పవిత్రమైన శాంతి, దివ్యమైన నిశ్శబ్దము.*

And that is better than all the meditations in the world.

*

మనుషులు ఎంత వెర్రెత్తి పోతున్నప్పటికీ నిశ్శబ్దము రాణిస్తోంది. ఈ అత్యద్భుతమైన నిశ్శబ్దము ద్వారా నీ అభివ్యక్తే జరుగుతోంది. ఎంత రణగొణ ధ్వని ఉన్నప్పటికి ప్రతి ఒక్క వస్తువులోను ఈ నిశ్శబ్దత, నీ నైశ్చల్యము నిరంతరం నిన్నే అభివ్యక్త పరుస్తున్నాయి. చెవి ఒగ్గి వింటే ఆ నిశ్శబ్దవాణి వినబడుతుంది కూడ! అది మనలో వికసించి వెలుగును శాంతిని కొని వచ్చు గాక. పరిసరములకు కూడ ప్రసారమై వాటిని పునీతము గావించు గాక.

మూలం: శ్రీమాత
అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి



“...ఆమె వెలుగుల దరహాసము
ప్రశాంత భువనములను ప్రదీప్తము కావించెను.
సర్వము ఓ యజ్ఞము, ఓ క్రతువు ఆయెను.”

ఆచరణ మార్గాలు

ప్రశ్న: ఏం చదవకుండా, ఏమీ చేయకుండా, నిశ్చలంగా ఉంటే మంచిదని ఒక్కొక్కప్పుడు అనిపిస్తుంది. కాలాన్ని వృథా చేస్తున్నట్లు భావిస్తాను. నేనేం చేయాలి?.

అది నిశ్చలత యొక్క ప్రమాణం మీద ఆధారపడుతుంది. దృఢమైన చైతన్యవంతమయిన ఏకాగ్రత, తేజోవంతమయిన నిశ్చలత మంచివే. తామసమయిన, అచేతనమయిన నిశ్చలత చాల హాని కరము.

*

ప్రశ్న: చాలసేపు ధ్యానప్రయత్నం చేశాక చాల అలసిపోయి విశ్రాంతి అవసర మనిపిస్తుంది. ఎందుకని? ఈ పరిస్థితిని మార్చుటమెలా?

నీవు కష్టంగా తన్నుకుంటున్నంతసేపు అది ధ్యానం కానేరదు. ఈ పరిస్థితిని గంటల తరబడి కొనసాగించినా ప్రయోజనం లేదు. నీ మనస్సును కుదుటబరచాల్నంటే నువ్వు నీటిమీద తేలియాడే కొయ్యపలక మాదిరి విశ్వ శక్తితరంగాల మీద తేలియాడాలి అంతే. మనస్సు చేసే ప్రయత్నం ఎన్నటికీ నిశ్చలంగా ఉండదు.

*

మొదట మనస్సుకి, చేతనకిగల తేడా అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి.

*

మనస్సుకు ఏం శక్తిలేదని, అది ఏం చేతకాని దద్దమ్మనీ నువ్వు తెలుసుకున్నట్లయితే నీలో నిశ్చలత ఏర్పడుతుంది. దానికి మించిన మహాచైతన్యం పైన ఉందనీ, దానికి జ్ఞానంతో పాటు శక్తికూడ ఉందనీ, అతిచిన్న విషయాన్ని కూడా అది సూక్ష్మాతిసూక్ష్మంగా చూస్తుందనీ, విచారించి పరిష్కార మిస్తుందనీ విశ్వాసం నీలో దృఢపడుతుంది. విశ్వాసం దృఢపడినప్పుడు నీవు వ్యక్తిగతంగా కల్పించుకోకుండా దాన్ని "నా స్థానం స్వీకరించు" అని ఆహ్వానించాలి.

*

కొంతవరకు వికసించి, క్రియాత్మకమైన మనస్సుగల చాలమందిలో మనస్సు ప్రశాంతంగా ఉండదు. పగటిపూట మనస్సు కొంత అదుపులో ఉన్నా, రాత్రిపూట శరీరం నిద్రావస్థలో ఉన్నప్పుడు అసలు ఉండదు. మితిమీరిన కార్యకలాపాలతో మానసిక ఒత్తిడి ఎక్కువై అలసట ఏర్పడి మేధాశక్తి తరిగిపోతుంది.

మానవశరీరంలోని అన్ని అంగాలవలె మనస్సుకు కూడ విశ్రాంతి అవసరం. విశ్రాంతి నివ్వటం మనకు తెలిస్తేనేగాని మనస్సు నెమ్మదించదు. మనస్సుకు విశ్రాంతి నివ్వడం నేర్చుకోవాలి. ఒకే పని చేస్తూ విసుగెత్తిపోకుండా పనులలో వైవిధ్యం విశ్రాంతి నివ్వడంలో ఒక పద్ధతి. నిశ్చలత ఉత్తమమయిన విశ్రాంతి. మనస్సుకు సంబంధించినంత వరకు గంటల తరబడి నిద్రించడం కన్నా నిశ్చల ప్రశాంతతలో కొన్ని నిమిషాలు గడపటం ఇంకా మంచిది.

*

ఉద్రిక్తతను సడలించేందుకు పదినిమిషాల సేపు నిజమైన, అంతర్గత, బహిర్గత స్థిరత ప్రపంచంలోని అన్ని రకాల చికిత్సలకన్న ఎక్కువ ఉపయుక్తము. దిట్టమయిన సహాయం నిశ్చలతలో ఉంది.

*

ప్రశ్న: భౌతికచైతన్య నిశ్చలత[1] (silence of the physical consciousness) అనగా నేమి? ఈ నిశ్చలతలో ఎలా ఉండ గలము?

భౌతికచైతన్యం శరీరచైతన్యం మాత్రమేగాక మన చుట్టూ కూడా ఉంటుంది – అంటే మన ఇంద్రియాలతో మనం చూడగలిగినదంతా రికార్డు చేసి మరుప్రసారం చేసేందుకు భౌతికచైతన్యము ఒక సాధనము. బయటనుండి వచ్చే అన్ని సంబంధాలను, తాకిడులను ఈ చైతన్యం ఎదుర్కొంటుంది. సుఖదుఃఖాలను పొందుతుంది. వాటిని ఆదరిస్తుంది లేదా తిరస్కరిస్తుంది. మన శరీరంలో

---

[1] శ్రీఅరవిందులు – లైఫ్‌డివైన్ (దివ్యజీవనము)

జరిగే నిరంతర కార్యకలాపాలవలన కలిగే గొడవకి అలవాటు పడి ఉన్నందున మనం వాటిని కొంతవరకే గుర్తించగలుగుతాం.

ధ్యానం లేదా ఏకాగ్రత ద్వారా మనం అంతర్ముఖులయి లేదా ఊర్ధ్వోన్ముఖులయి స్థిరతను, శాంతిని, అచంచలతను చివరకు నిశ్చలతను నిలపటమో లేదా వాటిని అధిగమించటమో జరుగుతుంది. అది మూర్తమంతమయిన వాస్తవమయిన నిశ్చలత (శబ్దరహిత నిశ్చలత కాదు) కొనసాగినంత కాలం ఈ నిశ్చలత మార్పు చెందదు. పెనుతుఫానులోగానీ, రణరంగంలోని బాహ్య కల్లోలంలో కూడా ఈ నిశ్చలతను అనుభవింపవచ్చు. ఈ నిశ్చలత అచంచలతకు సమానార్థకము, అతిశక్తివంతమయినది. అంతర్గతంగా మితిమీరిన క్రియ, శబ్దము మామూలుగా మన అదుపు తప్పి రాత్రింబగళ్ళు కొనసాగుతాయి. దీనినుండి ఏర్పడే అలసట, ఉద్రిక్తతలకు ఈ నిశ్చలతే వాస్తవమయిన గట్టి పరిష్కారము.

అందువలననే యోగాభ్యాసన చేయదలచిన వారు స్థిరతను, అచంచలతను, నిశ్చలతను తమలో మొదట ఏర్పరచుకోవాలి.

*

ప్రశ్న: సాధనను వేగిరపరిచేందుకు నేను ఏం చేయాలి?

సరైన సూచన కోసం మౌనంగా వేచి చూడు: మానసిక జోక్యము, నిర్ణయాలు మోసం; మనస్సు నిశ్చలమైనప్పుడే సరైన సూచనలు వస్తాయి.

*

(తప్పుడు సూచనలనుండి తప్పించుకోవడ మెలాగని సాధకుడు ఒకరు అడిగారు)

దృష్టిని కేంద్రీకరించి మనస్సును దాటి వెళ్లుటయే సరైన మార్గం.

నిశ్చలతతో పాటు ధ్యానం.

*

నిశ్చలత లోనే అత్యున్నతమైన గ్రహణశక్తి ఉంటుంది. చపలం లేని నిశ్చలతలో పని బాగా జరుగుతుంది. భగవంతుడు మనలను చక్కగా ఉపయోగించుకునేందుకు నిశ్చలంగా ఉండటం నేర్చుకుందాం.

*

నిశ్చలత, స్థిరత, శాంతి అంటే చాలమందికి భయం. సందడిగా లేకపోతే వారికి సజీవంగా ఉన్నట్టనిపించదు.

శ్రీఅరవిందుల అనుగ్రహంవలన నిశ్చలతను పొంది, మనస్సును నిశ్చలపరచుకున్న అనేక సందర్భాలలో ఆ వ్యక్తి నిస్పృహతో అరవిందుల చెంతకు తిరిగివచ్చి "నేను మూర్ఖుడనయ్యాను" అన్నాడు. ఎందుకంటే ఆయన మనస్సులో ఆలోచనలు పరిగెత్తటల్లేదు. స్వేచ్ఛను కోరినప్పటికి వారు బంధాలను ప్రేమిస్తున్నారు. బంధాలను తొలగించి, వాస్తవమైన స్వేచ్ఛామార్గాన్ని చూపాలంటే వారు తఱచు భయపడి పోట్లాడుతారు కూడా.

మూలం: శ్రీమాత
అనువాదం: జె. మంగమ్మ

శూన్యం – నూతన చైతన్యానికి సోపానం

శూన్యం యొక్క నిజస్వరూపమేమిటో నువ్వు తెలుసుకోవాలి. యోగమనగా మానవ చైతన్యమును దాటి దివ్యచైతన్యమును పొందుట. ఇది జరగాలంటే మనిషికి ఇంతవరకు అలవాటైన పాత మనోప్రాణిక ధోరణులన్నీ మారాలి. అవన్నీ పోయి శూన్యమేర్పడాలన్న మాట. ఆ శూన్యం లోకి పైనుంచి జ్ఞానం దిగుతుంది; శాంతి, విశాలత, వెలుగు, ఆనందములు ఆ చోటును ఆక్రమించుకుంటాయి. అవి ఉన్నత చైతన్యము యొక్క లక్షణములు.

– సంపాదకుడు

శూన్యత దివ్య చైతన్యానికి నాంది

మనస్సుయొక్క చాంచల్యం సమసిపోయినపుడు శరీరంలో ఒక బిగువు ఏర్పడుతుంది. దానిని చూచి నువ్వు భయపడకూడదు. ఆ భయాన్ని ముందు నువ్వు త్రోసిపుచ్చాలి. నిన్ను ఆవరిస్తున్న శూన్యం మహాప్రశాంతికి చెందిన నిశ్శబ్దం. ఈ నిశ్శబ్దంలో నువ్వు నీ ఆత్మ వైపు ఉన్మీలనమై, ఆ ఎరుక నీలో

కలుగుతుంది. శరీరంలో బంధింపబడిన అత్యల్పమైన అహం కాదు అది. విశ్వమంత విశాలమైన ఆత్మగా గుర్తిస్తావు. చైతన్యం రద్దు కాదు. చైతన్యపు పరిధులు, పరిమితులు అంతర్ధాన మవుతాయి. ఆ నిశ్శబ్దంలో ఆలోచనలు కొద్దికాలం ఆగిపోతాయి. *ఒక మహనీయ, అనంత స్వేచ్ఛ, విశాలత్వంగా భాసించే ఆ నిశ్శబ్దంలోకి ఊర్ధ్వ భూమికల నుండి అనంతశాంతి, తేజస్సు, జ్ఞానం, ఆనందం, మరింత ఉన్నతమైన చైతన్యం అవరోహిస్తాయి.* ఆ స్థితిలో నువ్వు దైవంతో ఏకత్వాన్ని అనుభవిస్తావు. అది పరివర్తనకు నాంది. అందులో భయపడవలసిన అగత్యం ఏదీ లేదు.

*

నవచేతనకు ద్వారము

నిన్న నీవు నీ లేఖలో వర్ణించిన శూన్యం చెడ్డదేమీ కాదు. యోగ మార్గంలో ఈ బాహ్యాంతర్గత శూన్యం ఒక కొత్త చైతన్యానికి మొదటి సోపానం అవుతుంది. మానవస్వభావం బురదనీటితో నిండిన పాత్ర వంటిది. ఈ బురదనీటిని తీసేసి, దివ్యసోమామృత రసధారలతో నింపడానికి ఆ పాత్రను పరిశుభ్రం చేయాలి. ఖాళీ చేయాలి. మానవ భౌతిక చేతన ఈ ఖాళీని భరించడం కష్టంగా భావిస్తుంది. అదే అసలు సమస్య. అత్యల్పమైన మానస, ప్రాణిక కదలికలు అనేక రకాలు ఈ చేతనలో నిండి వుంటాయి. ఇవన్నీ ఆ చేతనకు ఆసక్తిని, వినోదాన్ని కలిగిస్తుంటాయి. బాధల్లోనూ, కష్టాలలో కూడా అవి క్రియాత్మకంగా పని చేస్తూంటాయి. ఈ కదలికలు నిలిచిపోవడాన్ని ఆ చేతన భరించ లేదు. పాత ధోరణులు, ప్రవృత్తులు, కదలికల పట్ల చేతనకు ఆసక్తి ఉంటుంది.

ఈ అశాంతివల్ల నిశ్చలత్వం చెదిరిపోతుంది. బయటకు నెట్టివేసిన ప్రవృత్తులను చేతన తిరిగి తెచ్చుకుంటుంది. మళ్లీ సమస్యను సృష్టిస్తుంది. అంతరాయం కలిగిస్తుంది పురోగతికి. నిజమైన చైతన్యానికి, కదలికలకు ఈ శూన్యాన్ని నువ్వు ఒక మార్గంగా అంగీకరిస్తే, అంతరాయాన్ని తొలగించడం తేలిక అవుతుంది.

*

తొలిదశలో సాధకునికి అది శూన్యంగా కనిపిస్తుంది. ఎందుకంటే సాధారణంగా ప్రతివ్యక్తి జీవితాన్ని ఆలోచనలు, సంవేదనలు, కదలికలు, రూపాలు, వస్తువుల సమాహారంగా భావిస్తాడు. మరి ఇవన్నీ ఆ శూన్యంలో ఉండవు గదా. కాని నిజానికి అది శూన్యం కాదు.

*

శూన్యం అనేది చెడ్డదేమీ కాదు. అసంతృప్తి చెందిన ప్రాణికంలో విచారగ్రస్తమైన అలజడితో కూడిన శూన్యమైతే, అది చెడ్డదిగా భావించాలి. సాధనలో సర్వసాధారణంగా ఈ శూన్యం ఒక స్థితినుండి మరోస్థితికి మారేటప్పుడు అవసరమైన దశగా పరిగణించాలి.

ఆలోచనల ప్రతిష్టంభన

మనస్సు, ప్రాణికం నిశ్చలమైనప్పుడు, వాటి శాంతిరహిత కదలికలు, ఆలోచనలు కోరికలు నిలిచిపోయినప్పుడు సాధకుడు అంతా శూన్యంగా భావిస్తాడు. ఇది మొదట తటస్థంగా, శూన్యంగా ఉంటుంది. అందులో ఏమీ ఉండదు. మంచిగాని, చెడుగాని, సంతోషంగాని, దుఃఖంగాని, సంకల్పంగాని కదలిక కాని ఉండవు. ఈ స్థితి అంతర్గత అనుభవానికి ఉన్మీలన మవుతుంది.

శాంతి, నీరవతతో కూడిన శూన్యం కూడా వుంది. లోపల వున్న చైత్యపురుష శ్రేణి నుండి శాంతి, నిశ్శబ్దం ప్రభవిస్తాయి. లేదా ఉన్నతచైతన్యభూమికనుండి అవరోహిస్తాయి. ఇది తటస్థ (neutral) శూన్యం కాదు. ఎందుకంటే అందులో శాంతి వుంది. ఒక విశాలత్వం, ఒక స్వేచ్ఛ వుంటాయి. ఒక ఆనందమయమైన శూన్యం కూడా ఉంది. అందులో ఏమీ లేకపోయినా, ఏదో సమీపిస్తున్నదన్న భావన ఉంటుంది. ఉదాహరణకు జగన్మాత సామీప్యత లేదా అనుభవాన్ని సంసిద్ధం చేస్తున్న మరేదైనా.

*

మొదట పాత వ్యవహారాలన్నీ పోవాలి

ఆత్మసిద్ధి పొందినప్పుడు శూన్యం ఉన్నత చైతన్యపు లక్షణంగా ప్రాణికానికి కనిపించినప్పటికీ,

అది నిజం కాదు. కార్యకలాపలు లేనిదంతా ప్రాణికానికి శూన్యంగా కనిపించడమే దానికి కారణం. మనస్సు, ప్రాణికం, భౌతికాన్ని ఆవరించే శూన్యం ఊర్ధ్వభూమికలనుండి విశిష్ట విభూతులు (సత్య సాక్షాత్కారం వగైరా) అవరోహించడానికి అక్కడి ప్రదేశాన్ని ఖాళీ చేయడానికి ప్రత్యేకంగా ఉద్దేశించబడింది.

*

శూన్యం ఏర్పడినప్పుడు, ప్రతిసారీ ఆ చోటంతా విభూతుల ప్రాభవంతో నిండిపోతే నిండిపోనూవచ్చు. లేకపోనూవచ్చు. అది సాధనదశపై ఆధారపడి ఉంటుంది. శూన్యం తరుచు రావచ్చు. (అవరోహణకు ముందు) చాలా కాలం నిలిచి వుండవచ్చును. శూన్యాన్ని నిశ్శబ్దం, శాంతి, మహాశక్తి, జ్ఞానం పూరించవచ్చును. ఇవన్నీ మనస్సును మాత్రమే నింపవచ్చును; మనస్సును, హృదయాన్ని నింపవచ్చు; లేదా మనస్సు, హృదయం, ప్రాణికాలను లేదా అన్నింటినీ నింపవచ్చును. ఈ కార్యక్రమము యాంత్రికంగా ఒక నియమాన్ని అనుసరించి జరగదు.

*

ప్రాణికానికి (vital) శూన్యం గిట్టదు. ఈ విషయంలో ప్రాణికం నీకు సహకరించదు. ఆత్మ మాత్రమే మానసిక తదితర కార్య కలాపాలు ఏవీ లేని నిశ్శబ్దంలో ఒక స్వేచ్ఛను, విముక్త స్థితిని అనుభవించగలదు; తనను గురించి తాను తెలుసుకోగలదు. శూన్యం యథార్థ స్వరూపం కావాలంటే, సాధకుడు పురుషుని లోనికి లేదా సాక్షీభూత చైతన్యంలోకి ప్రవేశించి తీరాలి.

భౌతికపదార్థం లక్షణం ఏమిటంటే తనలోని జడత్వాన్ని శూన్యంగా భావిస్తుంది. నిజమైన శూన్యం ఏమిటంటే – "ఆర్య" పత్రికలో నేను వ్రాసిన "సమ" (sama) స్థితి – చిరంతన ఆత్మ లోని శాంతి, విశ్రాంతి, నీరవత. ఈ 'సమ' స్థితి భౌతికజడత్వం, తమస్సు స్థానాన్ని ఆక్రమించాలి. తపస్సు లేదా దివ్యశక్తి (divine force) సంకుచితమై ఏ విధంగా రజస్సుగా మారిందో, అదే విధంగా సమస్థితి తమస్సుగా మారింది.

మహాశక్తి సత్కార్యకలాపాన్ని రజస్సుగా ప్రాణికం ఎలా పరిగణిస్తున్నదో (స్వీకరిస్తున్నదో) అలాగే భౌతికచైతన్యం తన దైన జడత్వాన్ని, నిజమైన చైతన్యపు నీరవత, శాంతి, విశ్రాంతిగా పరిగణిస్తున్నది.

*

నిశ్శబ్దం అనగా నీరసం కాదు. నిశ్శబ్దంలో సమస్తశక్తి నిబిడీకృతమై ఉన్నది. నిశ్శబ్దం పట్ల నీ దృక్పథంబట్టి, శారీరక చైతన్యం నుండి శక్తిని స్వీకరించే స్వభావం ఉండే అవకాశం ఉన్నది. అదే భౌతికజడత్వాన్ని తెస్తుంది.

*

'శూన్యం' అంటే నిర్మలమైన పరిశుద్ధమైన కేవల అస్తిత్వం. అది లేకుండా నిశ్శబ్దబ్రహ్మాన్ని ఏ సాధకుడూ సాక్షాత్కరింప చేసుకోలేడు.

*

శూన్యమనేది ఆత్మస్థితి – అది స్వేచ్ఛామయం, సువిశాలం, పరమనిశ్శబ్దం. మనస్సుకు అది శూన్యంలాగే కనిపిస్తుంది. కాని నిజానికి అది కేవల అస్తిత్వం, కేవలచైతన్యం – శాంతితో కూడిన సత్తు, చిత్తు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: యజ్ఞన్న

"Beyond Personality the Mayavadin sees indefinable Existence; I followed him there and found my Krishna beyond in indefinable Personality"

– Sri Aurobindo

నిశ్శబ్దంగా వుండి అర్థం చేసుకోవటమెలా?

ప్రశ్న: మనస్సుని నిశ్శబ్దం చేసుకొని వినటమెలాగో సెల వియ్యండి?

చెప్పిన విషయాన్ని శ్రద్ధగా వినాలి. నీ బుద్ధినంతా పాఠం మీద కేంద్రీకరించినట్లయితే అది బాగా అర్థమౌతుంది. అప్పుడు నీ మనస్సు దానంతట అదే నిశ్శబ్దమౌతుంది.

ప్రశ్న: శ్రీమాతా, సంగీతాన్ని వినేందుకు సరైన పద్ధతి ఏది?

నువ్వు సంగీతం శ్రద్ధగా వినదలచుకుంటే కదలకుండా మెదలకుండా ఉండాలి. *నువ్వు ఆ సంగీతాన్ని రికార్డు చేసే ఒక యంత్రమే అనుకో. కదలకుండా చెవులు అప్పచెప్పి కూర్చున్నట్లయితే దాని మూలభావం నీలోకి ప్రవేశించి లోపల పొరలను ప్రదీప్తము చేస్తుంది.* కొంతకాలం తరువాత అది నీ మీద వేసిన ముద్ర నీ మనస్సులో మెరుస్తుంది.

వినేందుకు సరైన పద్ధతి... నువ్వు ఒక నిర్మలమైన అద్దమే అనుకో – నీ మనస్సును దానిమీదనే లగ్నం చేసి మౌనం వహించినట్లయితే అది నీలో చక్కగా ప్రతిబింబిస్తుంది. సంగీత ప్రియులు – సంగీత విద్వాంసులు, రాగకర్తలు, సంగీతోపాసకులు – సంగీతం ఎంత శ్రద్ధగా వింటారో తెలుసా? స్థిరాసీనులై ఒళ్ళంతా అప్పజెప్పి కదలకుండా కూర్చుంటారు. లోతైన విషయాలు ఏవైన అర్థం చేసుకొనుటకు పద్ధతి ఇదే. *మనస్సులో ఆలోచనలు లేకుండా నిశ్శబ్దంగా వుంటే మరీ మంచిది. అంతర్ద్వారాలను తెరిచేందుకు ఇది ఎంత మంచి మార్గమో చెప్పలేను.*

ప్రశ్న: మధుమయీ మీ పుస్తకాలు, శ్రీఅరవిందుల రచనలు మనస్సుయొక్క ప్రమేయం లేకుండా తిన్నగా చేతనలోకి ప్రవేశించాల్నంటే ఎలా చదవాలి?

నా రచనలు అందరూ మాట్లాడే మామూలు భాషలో వుంటాయి కనుక వాటిని అర్థం చేసుకోవటం అంత కష్టమైన పనేమీ కాదు. శ్రద్ధగా ఏకచిత్తాగ్రతతో సహృద్భావంతో విషయాన్ని గ్రహించాలి అనే పట్టుదలతో చదివితే అర్థమైపోతాయి.

శ్రీఅరవిందుల పుస్తకాలు అర్థం చేసుకోవటం కొంచెం కష్టమే. ఎందుకంటే వారి భాష తాత్త్వికము. శైలి ఉన్నతము.

వాటిని అర్థం చేసుకునేందుకు మెదడును కొంచెం పదును పెట్టుకోవాలి. అది కొంతకాలం పడుతుంది. వారి గంభీరమైన రచనల్లోని గూఢార్థమును గ్రహించగల ప్రతిభ స్వతహాగా ఏ కొద్దిమందికో తప్ప ఉండదు.

ప్రతిసారి కొంచెం కొంచెమే చదవాలి. మనసును నిర్మలంగా ఉంచుకుని, ప్రశాంతచిత్తుడవై ఉండాలి. వెంటనే అర్థం చేసుకోవాలనే ఉబలాటం పనికిరాదు. *మెదడును నిశ్శబ్దంగా ఉంచడానికి తగినంత ప్రయత్నం చేయాలి. అప్పుడు మీరు చదువుతున్న రచనలోని శక్తి మీ అంతరాంతరాల్లోకి ప్రవేశిస్తుంది; అక్కడ మెరుపులు మెరుస్తుంది.* అవసరమైతే అర్థం చేసుకోగలిగిన కొత్త జీవకణాలను సృష్టిస్తుంది. ప్రతి రోజూ ఇలా చదువుకుంటూ పోతే కొన్నాళ్ళ తరువాత అది చాలా స్పష్టంగా అర్థమవుతుంది. అంతేకాదు. అందులోని భావము మనకు సన్నిహితమై ఇంతకు ముందే సుపరిచితమైనట్లుగా భాసిస్తుంది.

రోజూ కొంచెం కొంచెం చదవడమే మంచిది. అదికూడా సాధ్యమయినంత వరకూ ఒకే సమయంలో చదవాలి. అది బుద్ధి యొక్క గ్రహణశక్తిని పెంచుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

Attuned to Silence and to the world-rhyme,
They loosened the knot of the imprisoning mind;

Sri Aurobindo

(*Savitri*, p. 381)

తెలియవలసిన పరమసత్యము –
చేయవలసిన నిత్యకర్మము

నిరపేక్ష ప్రశాంత మౌన సాగరాన కలయు వేళ,
నిస్సంగము నందు ఆత్మదర్శనంబు చేయు వేళ,
నిశ్చలత్వ కుడ్య మొకటి వేరుజేయు జగమునుండి,
ప్రశాంత సింధు శాఖలోన ప్రవృత్తులన్ని అణిగిపోవు.

శ్రమపడి ఇంద్రియజాలములల్లిన హరివిల్లులన్ని
ఆభాస రూపబింబంబుల సత్యమని భ్రమింపజేయు,
ఆత్మ పొందు పరమశాంతి అంబరంబు చుట్టివేయు
మనసున కందని తత్త్వము, అభావమై మిగిలిపోవు,

దేశ కాలమ్ముల కతీతమై నామరహితమై నిలచియుండు.
జీవవహన క్లేశమపుడు భారమై బంధింపదు,
చిత్తవృత్తి ప్రకోపంబు నిరోధింపబడును,
ద్వంద్వంబుల విజృంభణ స్వస్తి చెప్పి కదులు,
అహమెల్ల నశించిపోవ, దేహతాపము లన్నియు దీరును.

జనన మరణ చక్రభ్రమణ మందు చిక్కుకొనవు,
కర్మ పద్మవ్యూహమందు పోరాటమింక లేదు.
అయినను సంబరపడుటకు సమయమిద్ది కాదు!

అవధులు లేనట్టి మౌనసీమలో మెట్టి గూడ,
ఆనందపు లోయల అనుభూతి లోతులంటి గూడ,
ధ్యేయము నేమారినావె? ఆత్మశక్తి మరచి నావె?
నీ పథము నమృత తటమున లక్ష్యంబు వీడినావె?

విశ్వంబును విశ్వాత్మయు నీ లోపల నుండు
తారకలను ధరకు దించు వ్యూహంబు వదలినావె?
ధరణిని స్వర్గము జేసెడు స్వామి ఊహ తలచ లేదే?

పలాయనము చిత్తగింప విజయము కీర్తియు దక్కునె?
విశ్వహితము సమకూర్పగ అవతరించినట్టి నీకు,
పరాత్పరుని కార్యక్రమము సగమె సాధ్యమాయె,
జగమట్లే సాగుచుండె నీ కర్తవ్య మింక మిగిలె.

నిత్యమైన నిషేధముగ "నేతి" నిన్ను దరిసె,
నీ కన్నులలో జూచి జూచి జీవితేచ్ఛ తెగతార్చెను.
ప్రేమమూర్తి ప్రతిష్ఠించు ప్రేమభావమేది?
హృద్దేశము నధివసించు నిత్యాత్మ తత్త్వ మేది?
"స్వాహా" యని సృజనాగ్నిని స్వాగతించు మంత్రమేది?
ఓంకారము ధ్వనియించెడి అగ్నిహోత్రు గానమేది?

తన్మయత్వ మాధుర్యము మౌనమందు సంగమించ
నవ వధూటి ఉద్వేగము సౌందర్యమున లయించును,
ఆ మందిరమున గూడును పదార్థమాత్మ విభుని తోడ.
దయామయుని దరహాసము సర్వరక్షయగు సత్యము,
జీవగాంగ ఝురులన్నిటి సత్యము సృజియించునెపుడు.

అజ్ఞానపు తెర తొలగిన సర్వజ్ఞ ఛాయ నరయగలవు,
వెలుగుల తెర తొలగినపుడు ఈశు రూపు నరయ గలవె?
దివ్యత్వ మావరించి యుండు వాని జన్మ కర్మంబుల,
సృష్టి మహానాటకమున చరమాంకము ముగియ దెపుడు,
సాగిపోవు నాటకమున గర్భసంధినెవరు విప్పగలరు?

విశ్వనటుడు నవ్వుచుండు ధరియించినట్టి పాత్ర నుండి
బహు రూపమ్ముల వ్యక్తము అవ్యక్తమైన వాని రూపు
బహు నామమ్ముల వ్యక్తము అవ్యక్తమైన వాని రూపు,
చరమ సత్యమెల్లప్పుడు అవ్యక్తమై నిలచును.

బృహత్ శ్వేత కాంతిరేఖ ధ్యేయమ్ముమై నిలుచునెపుడు?
ఆదిత్యుని కాంతి కవల వెలుగు పుంత లెన్నొగలవు

అన్నిటి కాధారంబై కానుపించు కవాటంబు
అమృతత్వమునకు నీవు ఆరోహణ చేయు పథము

(*సావిత్రి,* పుట. 310-311)

మూలము: శ్రీఅరవిందులు
భావానువాదము: ధారా రాధాకృష్ణమూర్తి

నిర్గుణ తత్త్వ స్వరూపము

_నిష్క్రియ, సక్రియ బ్రహ్మము_

నిర్గుణ (శాంత) సగుణ (క్రియాత్మక) బ్రహ్మతత్త్వాలు భిన్నం కావు. విరుద్ధాలు – అసమన్వితాలూ – పరస్పర నిరాసకాలు – కావు. మిథ్యాజగత్తు నొకటి నిరసిస్తూ – మరొకటి పోషించేవి కావు. ఆ రెండూ ఒకే బ్రహ్మము యొక్క రెండు ముఖాలు – ఋణ ధన విద్యు దంశల వంటివి. పరస్పరాధార ఆధేయాలు. ఈ ప్రశాంత – మౌన – నిర్గుణ స్థితినుండి సకల సృష్టికారణమైన శబ్దబ్రహ్మోత్పత్తి జరుగుతున్నది. శబ్దమా మౌన దశలో గుప్తమైన దానిని అభివ్యక్తం చేస్తుంది. అదొక శాశ్వత మౌనస్థితి – తటస్థస్థితి. శాశ్వత దివ్యకర్మల యొక్క స్వాతంత్ర్యాన్నీ – సర్వశక్తిమత్త్వాన్నీ నిష్పన్నం చేస్తూ అనంత బ్రహ్మాండ సృష్టిని నిర్వహిస్తుంది. కార్యబ్రహ్మము యొక్క అనంత క్రియా సంపద ఆ శాంత బ్రహ్మమునుండే ఆవిష్కృతమౌతుంది. ఈ కార్యబ్రహ్మము యొక్క క్రియాశక్తి సర్వమూ దాని నుండే బహిర్గతమౌతుంది. దానికిదే ఆధారం.

_విశాల విశ్వచైతన్యం లోనే శాంతి, శక్తి_

మనిషి కూడా ఇంతే. అతని పరిపూర్ణతకు ఈ శాంత శబ్ద బ్రహ్మల సమన్వయమే కారణం. అంతశ్చేతనలో కేవల శాంత బ్రహ్మను పదిలం చేసుకొంటూ దివ్య క్షమా, ఆనందాలను అనుభవిస్తూ బాహ్యకర్మలను నిర్వహించటం కర్తవ్య

కర్మ. అంతశ్శాంతి నెవరు అనుభవిస్తారో వారు బాహ్యసృష్టిలో కర్తవ్య కర్మ ప్రేరకశక్తి విజృంభణమంతా ఆ లోపలి శాంతస్థితి (calm) నుండి ఉబికివస్తున్నట్లు దర్శించగలరు. కనుక ఈ శాంత శబ్దబ్రహ్మాలు విరుద్ధాలు కాకపోగా పరస్పర పోషకాలు. అంటే ఈ నిశ్శబ్దత (silence) విశ్వకర్మను నిరసించేది కాదు అని తాత్పర్యం. వీని మధ్య ఏదో వైరుధ్యమున్న దనుకోవటం మానవ మేధాశక్తి యొక్క సంకుచితత్వం. మానవమేధ కొక సంకుచిత పరిధి ఉన్నది. అదేమంటే ప్రతి జంట మధ్య వైరుధ్యాన్ని చూడటం; ఒకదాని నుండి మరొక దానికి దూకటం – రెంటిని వేరు చేయటం. ద్వంద్వాన్ని ఒకే తత్వంగా చూచే ఒక బృహచ్చైతన్యావిష్కృతిని పొందలేక పోవటం. ఆ విశాల విశ్వచైతన్యంలోనే సమన్వయ దర్శనముంటుంది కనుక ద్వంద్వం గాఢ పరిరంభణలో ఒదిగి ఏకమై పోతుంది. నిశ్శబ్ద బ్రహ్మం శబ్దబ్రహ్మరూపమైన సృష్టి కధి ష్ఠానం. విశ్వకర్మను నిస్వార్థంగా పోషిస్తుంది. అంటే దానినుండి విరామం పొందుతూ మళ్ళి రెంటిని ఏకం చేస్తూ, తద్వారా కార్య కలాపమగ్నమయ్యే జీవాత్మను స్వతంత్రంగా నిశ్చలంగా చేయ గలదు.

*

అనంత తాత్త్విక దర్శనం

ఆ నిశ్శబ్ద నిర్గుణ పరబ్రహ్మలో ఒక కేవల సత్తామాత్రస్థితి ఉంటుంది. ఆ నిశ్చల ప్రశాంతితో పాటుగా అనంత చలనస్థితి, క్రియాస్వభావం, నిశ్చలతత్త్వాన్ని అభివ్యక్తీకరించగల మహాశక్తీ వున్నాయి. సగుణ నిర్గుణ తత్త్వాలు విరుద్ధాలుగా తోచటం మర్త్య తర్కానికి సమంజసంగానే కన్పించినా, అనంత తాత్త్విక తర్కా నికి క్రియా – నిష్క్రియా తత్త్వాలు రెండూ ఒకటే. యోగతర్కం వేరు. పండితతర్కం వేరు.

శుద్ధచైతన్యంలో మహాశక్తి గర్భితం

నిశ్శబ్ద నిశ్చలతత్త్వం, ఎప్పటికి అలాగే ఉండిపోతుందనిగాని, అనంతశక్తీ, క్రియాత్మకశక్తి లేని అనంతత్త్వాన్ని గాని అంగీకరించలేము. ఊహించలేము – ఉంటుందన్నదొక

దృక్కోణం తప్ప. శక్తిరహిత కేవల తత్త్వం – నపుంసక తత్త్వం – ఊహించరానిది. అనంతశక్తి అప్రమేయతత్త్వంలోని మహా స్పందరూపం – సర్వశక్తిమత్వం ఆ శుద్ధచైతన్యంలో గర్భితాంశమైన మహాబీజశక్తి, మహాజవశక్తి పరమాత్మలోని జవసంపన్నత. కానీ, ఆ నిశ్శబ్దత, నిశ్చలతలు చలనాని కాధారం; శాశ్వత నిశ్చలత అనంత చలనశక్తి కత్యవసరమైన విధి – క్షేత్రం – సారం. నిశ్చల పరమాత్మతత్త్వం బృహచ్చల నాధారం. మనమీ నిశ్చల నిశ్శబ్ద తత్త్వదర్శనం చేసినపుడు జవశక్తుల కాధారంగా భావించగలం. ఇది బాహ్యా అవిశ్రాంత భూమిక కందదు.

ఈ వైరుధ్య భావన మానసికం – ఒక సిద్ధాంతం. కానీ వాస్తవంగా చలాచల తత్త్వములు అభిన్నము పరస్పర సమన్వయము అయిన ఒకే ఒక తత్త్వపు ముఖములు. అప్రమేయ నిశ్శబ్ద తత్త్వ నిశ్చలతలో (immutable silent spirit) అనంతశక్తి నిశ్శబ్దంగా – నిశ్చలంగానే వుంటుంది. ఎందుకంటె – అది తన జవసత్త్వాలకు బద్ధం కాదు; వాటి చేతిలో వస్తువు కాదది. వాటిపై తనకు పెత్తనమున్నది తప్ప వాటి చెప్పుచేతల్లో తాను లేదు. శాశ్వత, అనంత కర్మదక్షమైన ఆ మహాశక్తికలుపూ సొలుపూ లేదు. తన కర్మశీలత – స్వభావంలోనే నిశ్శబ్ద తత్త్వం గర్భితంగా వుంటుంది. దాని చలనస్వభావం క్షణకాలమేనీ క్షుబ్ధం కాదు; చెదిరిపోదు. మార్పు రాదు. తటస్థ నిశ్శబ్ద బ్రహ్మం/సాక్షిభూత పరమాత్మ – విశ్వంలో ప్రతి కంఠస్వరంలో – ప్రాకృతిక క్రియాకలాపాల్లో బీజప్రాయంగా – గర్భితంగా వుండనే వున్నది. వీటిని మానవమేధ గ్రహించలేదు. లేదా వాని అవగాహన కష్టసాధ్యం కావచ్చు. బాహ్యామైన మన ఉపరితల మనస్సునకు పరిమితు లనేకం. కనుక మన సిద్ధాంతాలు – భావాలు ఆ పరిమితికి లోబడినవే. ఈ సాపేక్ష సాంత భావజాలం అనంత శుద్ధచైతన్యానికి సమన్వయించదని గ్రహించటం సులభమే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

రహస్య జ్ఞానం

ఎవని విశ్వోత్తీర్ణత బ్రహ్మాండ చక్రేశ్వరి,
అతడు సర్వజ్ఞుడు. ఇపుడు,
సకల జీవాంతరాంతర్మగ్నుడు;
వైయక్తిక – స్వయంప్రకాశకమైన ఏకతత్త్వం.

గుణ రూపరహితయై – సాంద్ర నిశ్శబ్దం ముసుగులో,
చెదరని నిద్రలో కాలస్పర్శ నుండి,
ఎవ్వని;
అవిజ్ఞేయమైన ఒంటరితనాన్ని
గుప్తంగా పొదువు కొంటున్నదో
అతడు,
తన నిశ్శబ్దతనుండి మూకశక్తిని మేల్కొలిపెను.

అతడు,
కేవలుడు, ఆప్తకాముడు ఒంటివాడు,
మౌనంతో దేశకాలాలను ప్రవేశించేసాడు;
స్వాత్మనుండి బహురూపాలను సృజించి
ఆత్మీయ బృహదేకాంతంలో వుంటూనే –
సర్వగతుడైనాడు.

ఈ దేశకాలాలు తానే, తనవే,
పరిశుద్ధుడు – పరిపూర్ణుడు – స్పర్శాతీతుడు,
జీవాంతర్గుహా ప్రవిష్టుడై
మన, వికార సహస్ర ముఖాలతో
ఈ, మాంసమయ గృహాన్ని మజిలీగా చేసుకొని,
తానే జీవరూపుడైనాడు.

ఈ జీవుడా దివ్యమూర్తి కావాలి,
ఆదిమస్థానాని కెగిరిపోవాలి.
ఈ మృణ్మయమైన మూసలో, తన హిరణ్మయ ద్రవాన్ని పోసి

చేసిన నిర్మాణాలపై తన ముద్ర వేసాడు. –
మృణ్మయకృతి హిరణ్య బిందువుగా పరిణమించాలి –
అప్పుడు,
క్షణం, శాశ్వత కాలమౌతుంది.

ఈ, దివ్యరూపాంతరీకరణం సృష్టి పథకం:
లోక మీ బాకీ తీర్చుకోవాలి.
మన ముఖాల నతడు తొడిగినట్లు
అతని ముఖాన్ని మనం తొడగాలి.
ఈ జగత్పితకు వారసులీ జీవులు
అతడు మన భాషలో మాట్లాడుతున్నాడు,
మనమతని భాషలో ప్రసంగించాలి.
ఈ జీవిత వైకుంఠపాళిలో అతడే నిచ్చెన.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

ఆరోహణ: నిర్మల నిశ్చల నిశ్శబ్దం

ఓ అనంత జ్ఞాన స్వరూపమా! అవధులెరుగని సాక్షీభూత
ఆత్మ ప్రకాశమా!!

నీవు అచ్యుత శక్తివి అనంత త్రాణవు
లెమ్మ, మేల్కొని, నిర్ణయాత్మక మార్పున కాలవాలమౌ
చక్ర పరిభ్రమణానికి దూరంగా, మహేంద్రజాల
వలయాన్ని ఛేదించుకొని
(మాయామేయ జగతి మాయదృశ్య మాలికలను ఛేదించుకొని
రవిగానని చోట్లను సైతం వీక్షించగల కవిలా – విశ్వశ్రేయస్సుకై)
నిశ్శబ్దంలోనికి, కేవల నిశ్శబ్దంలోనికి ప్రవేశించు –
అట ఆవిర్భవించు,

అనంతంగా ప్రకాశించు

(దక్షిణా మూర్తి మౌనతత్త్వంలా – విశ్వవివేకంలా
శబ్దరాహిత్య దివ్యచైతన్య స్థితిలా)
ఒక్కడవే నీ ఒక్కడవే ఆధ్యాత్మిక జీవనపథగామివై అధిరోహించు;
ఇంకే మాత్రము రహస్యారోపణలను, నీలాపనిందలను,
గుసగుసలను మఱియు అజ్ఞానపు గావుకేకలను
లక్ష్యపెట్టకు – వాటికి
పేదచెవివై – అనంత నిశ్శబ్దం లోనికి శాశ్వతంగా
లోకశోకానికి, ద్వంద్వ యుద్ధానికి స్వస్తి పలికి,
సంకుచితమైన స్వల్పమైన మఱియు మసకబారిన
సహజ లౌకిక స్థితినుండి ముందుకు సాగిపో.

నీ జ్ఞానాన్ని – నిశ్చలము, అపారము, రూపరహితము అద్భుతము
అమరలోకాతీతము, విశాల విశ్వమునకన్న విస్తృతమునైన నీవు
విశుద్ధ వ్యక్తిత్వ యశోవలయంలో,
మనోజ్ఞ ఆత్మావలోకనా నిశ్చల నిగూఢత్వంలో
నిశ్శబ్దావృతము, సువేద్యము సుపరిచితమునైన
అనంతత్త్వంలో కబుర్లాడుతూ, –
ఆలోచనల కందనంతగా రూపొందించుకో
నీ ఆనందాన్ని ఉద్వేగోద్రేకాల కందనంత లోతుగా తీర్చిదిద్దుకో
(రసాత్మక వాక్పరిపూర్ణ ధ్వని సంభరిత లోకహిత కావ్యంలా
– ఋషి వచనంలా – నా నృషిః కురుతే కావ్యం)

పరిణామ శీలరహితమైన ఉజ్జ్వల కాంతి పథంలో,
నిలకడగా శబ్దరహిత ఆత్మావలోకనంలో,
ఓ అనంతజ్ఞాన స్వరూపమా (జీవాత్మా) నీవు అన్న భావననుండి
(నేను నాది యన్న మరీచికా వలయంనుండి)
విముక్తుడవై ముందుకు సాగు;
అవధులెరుగని సాక్షీ భూత ఆత్మ ప్రకాశమా!
ప్రకృతి గ్రహణపు పట్టునుండి ఆ స్వాభావిక సహజ ప్రకృతి
ధృతరాష్ట్ర దుష్ట కౌగిళ్ళ వలయం నుండి

తప్పించుకో (గ్రహణ విముక్త రవి, చంద్రులకీడై నిలిచి పో)
నీ కనులకు కనిపించిన చరాచర ప్రకృతి సాకల్యాన్ని
శంకరగిరి మాన్యాలవైపు సాగనంపు (నీ మనః పథం
నుండి పారద్రోలు)
ఏకము మఱియు పరిపూర్ణమునైన దివ్యాత్మ వైపుకు మరలు,
శాశ్వతత్త్వం వైపు తరలు
ఓ సర్వాతీత విశ్వచైతన్యమా! ఓ నామరహిత అద్వైతమా!
అపురూప సమతత్త్వమా! అనంత ఏకత్వమా!
ఓ అనంతజ్ఞాన స్వరూపమా! అవధులెరుగని
సాక్షీభూత ఆత్మప్రకాశమా!
నీవు అచ్యుత శక్తివి, అనంత త్రాణవు
కేవలం కేవలం అనంతంగా, శాంతంగా, మౌనంగా
నిశ్చలంగా నిర్మలంగా ఉండిపో (నీ ఉనికి నిత్యమై, సత్యమై యలరు గాక! సచ్చిదానంద సిరులు పొరలు గాక! మౌనమె నీ భాషయై మనుగాక!)

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: అన్నవరం ఆదిశేషయ్య

ఆరోగ్యపత్రం

మానసికంగా సాధించగల ఫలితాలు చాలా తక్కువ. అంతేకాక అవి కలగాపులగమై యుంటాయి. అందువల్ల మరో మార్గం చూసుకోవాలి. మనస్సును అధిగమించాలి. విశ్వాసపు పరిధిలోకి గానీ, దానికి మించిన చైతన్యభూమిక లోకిగానీ ప్రవేశించినట్లయితే శరీరం మీద మంచి ప్రభావముంటుంది.

బాహ్యశరీరంపై శక్తివంతంగా పనిచేయగల్గినది విశ్వాసం మాత్రమేననేది స్పష్టమైన విషయమే. ఏ మాత్రం గడసరి గోల లేకుండా, గొప్ప మానసికాభివృద్ధి లేకుండా ప్రగాఢ విశ్వాసం మాత్రం ఉన్న సాదా మనుష్యులు కొంతమంది ఉంటారు. అటు

వంటి వారు వారి బాహ్యశరీరాలపై గొప్పగా అజమాయిషీ చేయగలుగుతారు. అది ఒక్కొక్కసారి చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. ఎలాగంటే "ఒక గొప్ప సిద్ధిని పొందినవాడు అద్భుతవ్యక్తే కానీ చిన్న చిన్న దైహిక విషయాలకు దాసుడు. మరియొక వ్యక్తి చాలా సాధారణమైన వాడు, పైగా మొరటుగా కనిపిస్తాడు. అయినప్పటికీ గొప్ప నమ్మకం ఉండటంవల్ల కష్టాలనూ, ఆటంకాలను పెద్ద యోధునిలాగా అధిగమించి సాగిపోతాడు."

గొప్ప సంస్కారవంతుడైన వ్యక్తికి నమ్మకం ఉండదని నేను చెప్పనుగానీ అది చాలా కష్టమంటాను. ఎందువల్లనంటే అతని మనస్సు ఎప్పుడూ ప్రతిదాన్నీ తర్కిస్తూ, చర్చిస్తూ, హేతుబద్ధంగా అర్థం చేసుకొని నమ్మకం ఏర్పరచుకోవాలని చూస్తుంది. మనస్సుకు నచ్చచెప్పుకోవాలంటే ఋజువులు కావాలి. అతని నమ్మిక పారదర్శకంగా ఉండదు. అటువంటప్పుడు పరిణామ సోపానంలో ఒక మెట్టుపైకి ఎక్కవలసి వస్తుంది. అంటే మానసిక పరిధిని వదిలి ఆధ్యాత్మిక పరిధిని ఆశ్రయించాలి. అప్పుడు నమ్మకం ఉదాత్త తత్త్వంగా అవుతుంది. కానీ ఇక్కడ నేను చెపుతున్నది సాధారణ మానవులు సాదా జీవితం గడుపుతున్నప్పటికీ గాఢవిశ్వాసంవల్ల శరీరాన్ని స్వాధీనంలో ఉంచుకోగలరనే విషయం. అది వారు ప్రయత్నించి తెచ్చుకునేదికాక సహజసిద్ధంగా జరిగే చర్య; ఎంతో సాధన చేసి అభివృద్ధి పొంది ఉన్నతస్థాయి చేరిన సాధకులకంటే ఎంతో గొప్పవిషయం.

మూలం: శ్రీమాత

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామ శాస్త్రి

In the mind's silence the Transcendent acts
And the hushed heart hears the unuttered Word.

Sri Aurobindo

(Savitri, p. 315)

వందేమాతరం

ప్రార్థన

15 ఆగస్టు, 1947

ఓ మా జననీ, ఓ భారతమాతా! అత్యంత తీవ్రమైన విషాదాంధ కారంలో పడివున్నప్పుడు, నీ దివ్యవాణిని, నీ పిలుపును ఆలకింపక నీకు దూరమైనప్పుడు, పరాయిదేశపు ప్రభువులను సేవిస్తూ నిన్ను తిరస్కరించినప్పుడు సైతం నీ కన్నబిడ్డలను ఎన్నడును విడనాడని ఓ తల్లీ, ఇప్పుడు వారొక స్వతంత్ర జాతిగా తలయెత్తి నిలచినప్పుడు నీ స్వాతంత్ర్య ఉషోదయ సువర్ణకాంతులతో నీ వదనారవిందము మహోజ్జ్వలంగా ప్రకాశిస్తున్న ఈ శుభసమయంలో నీకు మేము ప్రణామములు అర్పించెదము. మాకు మార్గాన్ని చూపించు తల్లీ! మా ముందట సాక్షాత్కరిస్తున్న ఈ స్వాతంత్ర్య భానూదయం సర్వ ప్రపంచ దేశాల ఎదుట నీ నిజ ఔన్నత్య, నీ నిజ జీవన భానూదయమగునట్లుగా మాకు మార్గదర్శకత్వం వహించుము. మహనీయములైన ఆదర్శాలను మేము ఆచరణలో పెట్టి మానవులకు నీ మహనీయ స్వరూపమును, పరమాత్మ దివ్యమార్గములందు అగ్రగామిగా, సర్వజనులకు దివ్యవరప్రదాయినిగా తెలియచేయగల్గుటకు మాకు మార్గదర్శకత్వము వహించుము.

*

భారతదేశపు భవిష్యత్ చాలా స్పష్టంగా ఉంది. భారతదేశం ప్రపంచానికే గురువు. యావత్తు ప్రపంచపు భవిష్యత్తు భారతదేశం మీదే ఆధారపడి ఉంది, భారతదేశం అనేది జీవించి ఉన్న ఆత్మ. ప్రపంచంలోని ఆధ్యాత్మికజ్ఞానం, భారతదేశం లోనే సజీవంగా వున్నది. ఈ రంగంలో భారతదేశపు ప్రాముఖ్యతను, ప్రభుత్వం గుర్తించాలి. తదనుగుణంగా తమ చర్యలను రూపొందించుకోవాలి.

*

ఆత్మజ్ఞానం అధ్యక్షత వహించవలసిన దేశం భారతదేశం, వహించి తీరవలసిన దేశమూ అదే. దానికి ఇక్కడే, ఇప్పుడే సమయం ఆసన్నమైంది. ఇంతేకాక, ఈ దేశానికిగల ఏకైక తరుణోపాయమూ అదే. ఒక విదేశీయజాతి ప్రభావపాటవముల చేత ఈ దేశపు చైతన్యం, దురదృష్టవశాత్తు వక్రీకరించబడింది. అయినా, వీటన్నిటికీ అతిరిక్తంగా ఈ దేశపు చైతన్యం ఒక అపూర్వమైన ఆధ్యాత్మిక వారసత్వాన్ని కలిగి ఉంది.

ఆశీర్వచనాలు.

మూలం: శ్రీమాత

అనువాదం: కాకుమాని తారానాథ్, కె. భాస్కరరావు

లోకమాన్య తిలక్ శ్రీఅరవిందులను 1906 లోనే గుర్తించారని మీకు తెలుసా?

1972 ప్రాంతంలో నళినీకాంత్ సర్కార్ ఒకసారి కలకత్తా సందర్శించారు. అప్పుడొకనాటి సాయంకాలం శ్రీఅరవింద కేంద్రాలలో ఒకదానిలో జరిగే సమావేశంలో పాల్గొనమని, ఆయనను ఆహ్వానిస్తూ ఒక ఉత్తరం వచ్చింది. ఆ సమావేశంలో శ్రీఅరవిందులను గురించి ప్రసంగించే ముఖ్యఅతిథి శారదామఠం శ్రీ శంకరాచార్యులవారు.

శ్రీశంకరాచార్యుల వారు మాయావాదులైతే, తన తత్త్వ వివరణలో శ్రీఅరవిందులు దానిని తీవ్రంగా ఖండించారు. అందుకని నళిని ఆ సమావేశానికి తప్పక హాజరవుదా మనుకున్నారు. సమావేశ సమయానికి కొన్ని నిమిషాలకు ముందు వెళ్లారు. అప్పుడే ప్రధాన అతిథి కారునుంచి దిగి, తన దండంతో, వేదిక మీదికి తీసుకుపోబడ్డారు. వేదిక మీద ఉపన్యాసకులకు ఆసనాలు ఏర్పాటు చేశారు, శంకరాచార్యుల వారికి మిగతావారికన్నా ఉన్నతాసనాన్ని ఏర్పరచారు.

శంకరాచార్యులవారు ఉపన్యసించటానికి లేవటంతోనే, ఉత్కంఠతో నళినీదా గుండె కొట్టుకోవడం ప్రారంభించింది.

శ్రీశంకరాచార్యులవారి ఉపన్యాసం: ఈ క్రింది విధంగా సాగిన వారి ఉపన్యాసంతో, నళినీకాంతుని మనస్సు ఆశ్చర్యంతో, దిగ్భ్రమతో, సంతోషంతో నిండిపోయింది.

"మహారాష్ట్రలో మేం బాలగంగాధర తిలక్ అనుచరులం. భారతదేశంలో బ్రిటిష్‌పాలనకు వ్యతిరేకంగా ఏకకంఠంతో శ్రీఅరవిందుల మార్గదర్శకత్వంతో, వారి నాయకత్వంలో బెంగాల్ లేవటంతోనే, మన మాతృమూర్తి భారతదేశపు స్వాతంత్ర్యం – స్వరాజ్యం కోసం, మేమూ అదే స్ఫూర్తితో మహారాష్ట్రలో తిలక్ మహారాజ్ నాయకత్వంలో మేల్కొన్నాం.

"తిలక్‌మహారాజ్ అప్పుడప్పుడూ శ్రీఅరవిందులను కలిసి, వారితో సంప్రదించేందుకు కలకత్తా వెళుతుండేవారు. ఆ రోజులలో, బ్రహ్మచర్యం, భగవద్గీతా పఠనం మా అనుదిన కార్యక్రమం. కాని మేం భగవద్గీత చదివేటప్పుడు ఏం చేసేవారమో తెలుసా? అన్ని ప్రకరణాల్లో, ఎక్కడెక్కడయితే 'శ్రీ భగవాన్ ఉవాచ' అని వ్రాయబడిందో, అక్కడ భగవాన్ అన్న పదాన్ని కొట్టివేసి, 'శ్రీఅరవింద' అని వ్రాసేవారం. ఎందుకంటే శ్రీఅరవిందులు, శ్రీకృష్ణులు ఒకటే అని మేం గ్రహించాం కాబట్టి...."

వారి ప్రసంగం ఇంకా ఇలా సాగింది

"శ్రీఅరవిందులను కలకత్తా జైలులో పెట్టినపుడు, వారి సోదరి సరోజినీదేవి, వారి రక్షణ నిమిత్తం ధనసహాయాన్ని అర్థిస్తూ పత్రికలలో ప్రకటించింది గదా! మహారాష్ట్రలో కొంత ధనం వసూలు చేసి, ఆ ధనాన్ని కలకత్తాలోని చౌరంఘీలో, ప్రకటనలో ఇచ్చిన చిరునామాలో అప్పగించేందుకు మాలో ఇద్దరం కలకత్తా బయలుదేరాం. జస్టిస్ బీచ్‌క్రాఫ్ట్ కోర్టులోని విచారణను చూసేందుకు, శ్రీఅరవిందుల దర్శనానికి, ముద్దాయిల తరఫున బారిస్టర్ సి.ఆర్. దాస్ వాదనలు వినేందుకు, కలకత్తాలోనే ఉండటానికి మేం నిశ్చయించుకున్నాం.

జస్టిస్ బీచ్‌క్రాఫ్ట్ సహాయం: "ఒక రోజు చౌరంఘీ అడ్రసుకు ఒక కవరు వచ్చింది. మేం దానిని తెరిచిచూస్తే, అందులో ఏ ఉత్తరమూ లేదు. మాకు చాలా ఆశ్చర్యం వేసింది.... కేవలం రెండు టైపు చేయబడిన కాగితాలున్నాయి. అందులో ఏ విషయముందో మేం తెలుసుకోలేకపోయాం, కాకపోతే అది 'లా' కు సంబంధించిందని ఊహించాం. అయితే అదెవరు పంపించి ఉంటారు? పంపించిన వారి పేరు లేదు.

"మేం వెంటనే సి.ఆర్.దాస్ ఇంటికి వెళ్లి, వారికా కవరు ఇచ్చాం. ఆ టైపు కాగితాలు చదివిన తరువాత, దాస్ ఇలా అన్నారు. ఇంత ముఖ్యమైనది మీరు నాకు తెచ్చిస్తారని నేను కలలోకూడా అనుకోలేదు. శ్రీఅరవిందుల తరఫున వాదించటానికి చాలా యుక్తియుక్తమైన లా పాయింట్లు ఈ కాగితాలలో పూర్తిగా ఉన్నాయి. ఈ కాగితాలు నాకు అందకపోయినట్లయితే, ఈ పాయింట్ల విషయమై నేను శ్రీఅరవిందుల తరఫున వాదించటానికి కనీసం వారం రోజులు కష్టపడవలసి వచ్చేది. మేమెంతో ఆశ్చర్యంతో, సంతోషంలో మునిగిపోయాం. తన సహాధ్యాయియైన ఐ.సి.యస్ 'శ్రీఅరవిందో అక్రాయిడ్ ఘోష్' కు సహాయం చేసేందుకు జస్టిస్ బీచ్‌క్రాఫ్ట్ మహాశయులే ఇలా చేసి ఉండవచ్చని మాకు లోలోపల అనిపించింది....

ఆలీపూర్ బాంబ్‌కేసు పూర్తయిన తరువాత, దాస్ వారి అంతిమవాదనను వినిపించారు. అది ఈనాడు చారిత్రాత్మకము, భవిష్యత్సూచకమైనదిగా ఎంతో ప్రాముఖ్యతను పొందింది. తరువాత శ్రీఅరవిందులు నిర్దోషి అని ఋజువై, విడుదల తీర్పు వెలువడిన తరువాత, మేం ఏదో విధంగా జస్టిస్ బీచ్‌క్రాఫ్ట్‌ను సందర్శించి వారిని అభినందించాం. అప్పుడు సాహసించి, వారిని ప్రైవేటుగా ఒక ప్రశ్న వేశాం.

మాకో అజ్ఞాతవ్యక్తినుంచి రెండు పేజీల టైపు చేయబడిన కాగితాలందాయి. అవి తమరే పంపారని మేం ఊహించవచ్చా? బీచ్‌క్రాఫ్ట్ చిరునవ్వే దానికి సమాధానమయింది సుమా!"

"శ్రీఅరవిందుల దివ్యతేజాన్ని వారి అసలు స్వరూపాన్ని బహుశా మొదటిసారిగా, వారు పనిచేసిన బరోడా కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.బి.క్లార్క్ గ్రహించాడు.

శ్రీఅరవిందుల స్థానంలో, వారు రాజీనామా చేయటంతో, సి.ఆర్.రెడ్డి వైస్‌ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. క్లార్క్ రెడ్డిగారి నడిగాడు. "నీవు అరవింద ఘోష్‌ను కలిశావన్న మాట.... ఆయన కన్నులు చూశావా? 'జోన్-ఆఫ్-ఆర్క్' స్వర్గలోకపు గొంతులు విన్నట్లుగా, అరవిందులు స్వర్గలోకపు దృశ్యాలు చూస్తుంటాడు? అని.

1907 లోనే విశ్వకవి రవీంద్రనాధ ఠాగూర్, శ్రీఅరవిందులు నిజంగా ఎవరో గ్రహించాడు. దానినే తన బెంగాలీ కవిత 'నమస్కార్' లో వెలిబుచ్చాడు. కాని స్వదేశీ ఉద్యమ సందర్భంలో 1906 లోనే అరవింద ఘోష్‌ను శ్రీకృష్ణునిగా గుర్తించటమంటే అంత సులభం కాదు. దానికి వారు తమ గురువైన బాలగంగాధర తిలక్ చేతనే ఒప్పించబడ్డారు. తిలక్ భగవద్గీతను అపారమైన జ్ఞానభావనతో చదివి, దానిని గురించి వ్రాసిన వ్యాఖ్యానం, మహారాష్ట్ర యువతను ఉత్సాహపరచి, వారిని మేల్కొల్పింది.

1907 సూరత్ కాంగ్రెసు సభలో మహారాష్ట్ర వాలంటీర్లు సామూహికంగా, మరో ప్రశ్న వేయకుండా శ్రీఅరవిందుల ఆజ్ఞలను పాలించి ఎందుకు ఆ సభను భగ్నం చేసి, మితవాదుల ఉద్దేశాలను నిర్వీర్యం చేసిందీ, మనమిప్పుడు గ్రహిస్తున్నాం. వలంటీర్లకు శ్రీఅరవిందుల ఆజ్ఞ అంటే, సాక్షాత్ వాసుదేవుని ఆజ్ఞే అని తెలుసు.

సూరత్ కాంగ్రెసు భగ్నాన్ని గురించి శ్రీఅరవిందులే స్వయంగా ఇలా వ్రాశారు.

"మహారాష్ట్ర యువకులు ఒక గుంపుగా వేదిక మీదికి దూసుకొచ్చారు. మితవాదులు పారిపోయారు. వేదిక మీద కొద్దిసేపు కుర్చీలతో యుద్ధం జరిగిన తరువాత, సభ భగ్నమైంది. ఇక జరగనే లేదు. కాంగ్రెసును సస్పెండు చేసి, దాని స్థానంలో

ఒక జాతీయసభను, ఒక రాజ్యాంగాన్ని ఏర్పరచుకొని, తాము భద్రంగా ఉండే ఒక పద్ధతిని పెడదామని మితవాద నాయకులు నిశ్చయించారు.

నేషనలిష్టు పార్టీ ఈ సమావేశంలో చేరటానికి శ్రీఅరవిందులు అంగీకరించ లేదు. ఈ విషయం మనలో చాలామందికి తెలియదు. శ్రీఅరవిందులే స్వయంగా ఈ విధంగా చెప్పారు.

ముఖ్యమైన సంఘటనలకు తెర వెనుక జరిగిన అసలైన కారణాలను చరిత్ర చాలా అరుదుగా పేర్కొంటుంది. చరిత్ర కేవలం తెరముందు జరిగే దానినే చెబుతుంది. సూరత్‌లో రెండు నిర్ణయాత్మక ఘటనలు జరిగాయి. తిలక్‌ను సంప్రదించకుండానే, కాంగ్రెసుసభను భగ్నం చేయండని పిలుపు నిచ్చింది నేననీ, అలాగే మితవాదుల నూతన కన్వెన్షన్‌లోచేరటానికి నిరాకరించటానికీ నాదే బాధ్యత అనీ, అతికొద్దిమందికే తెలుసు. అలాగే బెంగాల్ ఉద్యమాన్ని తీవ్రవాదంవైపు తిప్పటంలోగాని, విప్లవోద్యమ స్థాపనలోగాని నా పాత్ర సంగతీ, చాలా కొద్దిమందికే తెలుసు...."

శ్రీఅరవిందులు తనంతట తానుగా, పురుషోత్తముడైన శ్రీకృష్ణుడూ తానూ ఒకటేనని ప్రకటించిన 1926 నవంబరు, 24 కు 20 సంవత్సారలకు ముందే, ఏ విధంగా మహారాష్ట్ర యువత తన అంతర్‌దృష్టితో గుర్తించిందో, అలాంటి దృష్టితో మనం శ్రీఅరవిందులను అంగీకరించ గలిగితే, మన దేశ అభివృద్ధికి అది ఎంతటి స్వాగతింపతగిన చర్య అవుతుంది!

మూలం: రఘునందన్

అనువాదం: కాకుమాని తారానాథ్

A work is done in the deep silences;
A glory and wonder of spiritual sense,

Sri Aurobindo

(Savitri, p. 170)

సమాచార పత్రం

శ్రీఅరవిందో సొసైటీ సర్వసభ్య వార్షిక సమావేశము 13 అక్టోబరు, 2001 నాడు కలకత్తాలో జరుపబడును. 72 వ పేజీలో దీని నోటీసు చూడండి.

నూతన కేంద్రములు: పండర్కవాడా, కద్కలిపూరా – అమరావతి (మహారాష్ట్ర); ధర్మనగర్ – చంద్రపూర్ (త్రిపుర); తంజావూరు (తమిళనాడు); జంషెడ్‌పూర్ (జార్ఖండ్); లక్నో (ఉ.ప్ర);


ఈ క్రింది AIM Booklets పునర్ముద్రితమైనవి (1) How to Cultivate Concentration, (2) The Way to Happiness, (3) Remain Young, (4) What is Hinduism. Price: Rs 15/- each

పాండిచ్చేరిలో 19-25 మే తేదీలలో ఉపాధ్యాయుల కోసం ఒక శిక్షణాకేంద్రము నిర్వహించబడినది. ప్రతి సంవత్సరం మే నెలలో జరిగే ఈ శిబిరంలో అన్ని ప్రాంతాలనుండి ఉపాధ్యాయులు వచ్చి పాల్గొన్నారు.

నైరోబీ (కెన్యా) లో 'కష్టాలు' అనే విషయంపై ఒక సదస్సు మే ఒకటవ తేదీన నిర్వహించబడినది. శ్రీఅరవిందుల పవిత్ర అవశేషములు అంబాలా (హర్యానా) లో 6 మే, 2001 నాడు ప్రతిష్ఠించబడినవి. ఉజ్జయిని (M.P) లో 'సాధన' మరియు 'Work of The Mother' అనే విషయములపై 29 ఏప్రిల్ నాడు ఒక కార్యక్రమం నిర్వహించబడినది. మథుర (యు.పి) లో స్త్రీల విభాగము వారు "శ్రీమాతారవిందుల వెలుగులో పిల్లలను ఎలా పెంచాలి" అనే విషయముపై 9 మే తేదీన ఒక సదస్సు నిర్వహించబడినది.

భయము

కారణాలు, నివారణ



అఖిల

అఖిల భారత పత్రిక

అక్టోబరు 2001

అనుబంధం

మనకి ఏమాత్రం భయం వెయ్యకుండా, మనని ఆపదలనుంచి, గండాలనుంచి కాపాడే ఓ కవచాన్ని ధరించి జీవయాత్రను సుఖంగా గడపాల్నంటే రెండే రెండు విషయాలు – ఎప్పుడు విడదీయరాని జంట – అవసరము. 1) శ్రీమాత కటాక్షము. 2) ఆమెపట్ల అకుంఠితమైన విశ్వాసము, చిత్తశుద్ధి, ఆత్మార్పణ ములతో కూడిన ఆంతరంగిక స్థితి... నీ విశ్వాసము, చిత్తశుద్ధి, ఆత్మసమర్పణము ఎంత సంపూర్ణంగా వుంటే ఆమె కటాక్షము, రక్షణ కూడ అంత సంపూర్ణంగా వుంటాయి.

శ్రీమాత

విభాగము I

భయము – కారణాలు – నివారణ

సంక్షిప్తం

మానవుడు సుఖసంతోషాలకు నోచుకోలేదు. నిత్యం భయం, ఆతురతలకు గురి అవుతూ ఉంటాడు. కాని ఈ లక్షణములు ఆతని చేతనయొక్క మూలరూపములు కావు – వికృతములు. నీకు భయం కలిగించే తలపులు నీ మనస్సులో అదే పనిగా విహరిస్తూ ఉంటాయి. అంతేకాదు, అవి నిజమవుతాయి కూడాను. బాహ్యా మనస్సులోనుంచి నువ్వు వాటిని నిరాకరించవచ్చు. కాని నీ అంతర్మనస్సు వాటినే కోరుకుంటుంది. నీ అవచేతన (subconscious) *నీ మనస్సుకంటె వెయ్యి రెట్లు పెద్దది, బలమైనది. నీ మనస్సుకు చేతకానివన్నీ అది సునాయాసంగా చేయగలదు. కాని ఈ రెండిం టిని మించిన వస్తువు మరొకటున్నది. అది నీ ఆత్మ – అందులో నీవు దర్జాగా మెలగవచ్చు. ఇక నీకు భయం లేదు, కోరిక లేదు. వీటి కతీతమైన ఆత్మ శాంతిలో ఓలలాడు.*

శ్రీఅరవిందులు

భయానికి మూలం ప్రాణమయ కోశం

ఉన్నతశ్రేణికి చెందిన చైతన్యంలో (higher nature) భయమనేది లేదు. భయం ప్రాణమయకోశం (vital plane) లో పుడుతుంది. అది అజ్ఞానపు సహజాతం. ప్రమాదాన్ని సూచిస్తుంది. దానికి దౌర్జన్యసంరంభపూరితమైన ప్రాణిక ప్రతిచర్య ఉంటుంది. మనిషిలో కాని, ఇతర ప్రాణికోటిలో కాని ఉన్న మేధను తొలగించి ఆ చోటును ఆక్రమిస్తుంది. *అందువలన పరిస్థితుల యథార్థ స్వరూపము మనకు తెలియకుండా అయిపోతుంది. భయమనగా అసురశక్తుల కల్పన అన మాట.*

*

ఔను, భయం ఊహాజనితమైన భయోత్పాతాన్ని సృష్టిస్తుంది. ఒక వేళ నిజంగా ఏదైనా ప్రమాదమే కనుక పొంచివుంటే, ఈ భయం ఏమాత్రం సహాయపడదు. అది తెలివితేటలను కూడా కప్పివేస్తుంది. సమయస్ఫూర్తి కూడ లేకుండా చేస్తుంది. నిజకర్తవ్యాన్ని మరపింప జేస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

*

ఔను, ప్రాణికజీవులు (vital beings) పెట్టిన శాపనార్థమే ఈ భయం. అది వాటి తొలి కానుక. అవి అత్యంత శక్తివంతమైనవి. భయం ద్వారానే అవి మనుష్యుల్ని ఆవహిస్తాయి. అవి మొదట భయ ప్రకంపనలు పుట్టిస్తాయి. ఆ ప్రకంపనలు నిన్ను బలహీనుణ్ణి చేస్తాయి. తరువాత క్రమక్రమంగా తమ శక్తివలయంలోనికి నిన్ను లాక్కొని వెళ్తాయి. అది హేతుబద్ధమైన భయం కాకపోవచ్చును. ఏదో భయం నిన్ను ఆవహిస్తుంది. ఎందుకు ఆవహించిందో నీకు తెలియదు. ఏదో భయం నీలో వణుకు పుట్టిస్తుంది. ఆందోళనను కలిగిస్తుంది. ఎందుకో నీకు తెలియదు. దానికి బాహ్యమైన హేతువు ఏదీ ఉండదు. అది ఈ ప్రాణికశక్తుల (vital beings) దుండగము అనమాట.

మూలం: శ్రీమాత

అనువాదం: యజ్ఞన్న

భయం – అచేతనా జనితం

మనుషులకు ఏదైనా కొత్తదాన్ని చూస్తే భయం. ఈ భయం మనిషి రక్తంలోనే ఉన్నది. కాని యోగికి భయం పనికిరాదు. ఎందుకంటె అది అభివృద్ధి నిరోధకము. యోగదృష్టిలో భయానికి కారణం అజ్ఞానము. నువ్వు దేన్ని చూసీ అసహ్యించుకో కూడదు. ఏవగింపు పనికి రాదు. ఎవరు వచ్చినా సరే, దేన్ని చూసినా సరే, ఏం జరిగినా సరే ప్రశాంతచిత్తుడవై ఉండాలి. అప్పుడు క్రూరమృగాలు కూడ నిన్నేమీ చేయలేవు. భయమనేది అజ్ఞానానికి చిహ్నము. నీ చేతనని లోతుగా విశాలంగా చేసినప్పుడు నీకే భయమూ ఉండదు. అప్పుడు నీ చేతనాదీప్తిని వస్తువుల మీదికి, పరిస్థితుల మీదికి సారించినప్పుడు వాటి యథార్థస్వరూపము నీకు అవగతమవుతుంది.

– సంపాదకుడు

> *అజ్ఞానమే భయానికి మూలం*

భయం అనేది అచేతనలోనుండి ఆవిర్భవించిన ఒక వైపరీత్యం. అజ్ఞానంనుండి పెల్లుబికే ఒక వ్యధ మనుమలకు వస్తువుల తత్త్వము తెలియదు. ఏం జరుగుతుందో తెలియదు. వారి చర్యల పర్యవసానాలు తెలియవు. వారికి చాలా విషయాలు బోధపడవు. *ఈ అజ్ఞానమే భయానికి మూలకారణం.* ఒక వ్యక్తి తెలియనిదానిని గూర్చి భయపడతాడు. ఒక పసిపిల్ల సంగతి చూద్దాం. ఒక తెలియని వ్యక్తిని ఆ పిల్ల వద్దకు తీసుకుని వస్తే అది ముందు భయపడుతుంది. (జాగృతమైన అంతశ్చేతనగల పిల్ల సంగతి నేను మాట్లాడటం లేదు. మాములు శిశువు గూర్చి మాట్లాడుతున్నాను.) కొంతమంది అరుదైన శిశువులు చాలా ధైర్యంగా ఉంటారు. వారిలో మరో చైతన్యం ఉంటుంది. రాబోయే ప్రమాదం విషయంలోని ఒకానొక భయాందోళన, సహజాతం కలగాపులగంగా ఉంటాయి. ఏదో ప్రమాదం సంభవిస్తున్నదనే భావన కలిగినప్పుడు, ఆ ప్రమాదాన్ని ఎలా నివారించుకోవాలో మార్గం

తెలియనప్పుడు, దానినుండి తనను తాను రక్షించుకొనే విధానం తెలియనప్పుడు, ఆ శిశువు భయపడుతుంది.

మనకు అసలు విషయం తెలిస్తే, భయం అనేది ఉండదు. పరిపూర్ణంగా జాగృతమై, పూర్తిగా ఎరుకతో వుండి, తెలుసుకుంటే, భయం అనేది దరిదాపులలోకి రాదు. భయంవేసినప్పుడు, దాని

చేతనాభివృద్ధివలన భయనివారణ

మీద చైతన్యం, జ్ఞానం, శక్తికాంతులను గనుక ప్రసరించగలిగినట్లయితే, దానిని పూర్తిగా నిర్మూలించవచ్చు. క్రైస్తవమతములో భయంగూర్చి ఒక సూక్తి చెబుతారు. ఈడెన్ తోటలో ఆపిల్‌పండును ఎవరైన కోసి తింటే వారికి భయం పట్టుకుని పీడిస్తుందని ఆ మతం చెబుతుంది. అంటే జ్ఞానంతోపాటు భయం వచ్చినట్లు. భూమిపై ఈ భయమే మానవాళి జీవితాలను శాసిస్తుందని ఆ మతం అంటుంది. ఇక్కడ నేను నీ వాదాన్ని తిరిగి చెబుతున్నాను. మరి మృగాలకుకూడా భయం ఉంటుంది కదా! మృగాలు ఏ పాపం చేయలేదే. అవి ఏ ఆపిల్ పండును తిన లేదే. కాబట్టి వాటికి భయం ఉండకూడదు మరి! నిజానికి అజ్ఞాన పూరితమైన, సహజాతంతో కలిసిన మిశ్రమచేతనే ప్రమాదానికి దోహదమౌతుంది. పరిష్కారం దానికే తెలియదు. కాని భగవంతుని దివ్యకార్యాన్ని ప్రతిఘటించే అసురశక్తులు, ప్రాణికజగత్తులోని శక్తులు ఈ భయాన్ని విస్తృతస్థాయిలో ఉపయోగించుకుంటాయని మాత్రం నిశ్చయంగా చెప్పవచ్చు. ఈ భయం ఆసరాగా అవి మానవులను గట్టిగా పట్టుకుని ఆడిస్తాయి. అంతే కాదు. రాజకీయాలు, మతాలు కూడ ఆ కోవకు చెందినవే. మృత్యుభయాన్ని కల్గించి, జీవితం ముగిసిన పిమ్మట జరిగేదానిని గూర్చి భయపెట్టి, తాము ప్రవచించే శాసనాలు కనుక గుడ్డిగా అనుసరించకపోతే మరణానంతరం సంభవించే ఉపద్రవాలు గూర్చి భయపెట్టి కొన్ని మతాలవారు వారిని నమ్మే ప్రజల్ని లోబరుచుకుంటారు.

సమరస భావం లోపించినప్పుడుకూడా భయం ఆవహించవచ్చు. కొందరు నిప్పు అన్నా, నీరు అన్నా భయపడిపోతారు. మరికొందరికి కొన్ని జంతువులంటే తగని భయం. ప్రాణిక

స్పందనలలో సామరస్యస్థితి లోపించినప్పుడు ఇటువంటి భయాలు ఏర్పడతాయి. శరీరంలోని అచేతనా విభాగంలో ఆ సామరస్య రాహిత్యం భయంగా మారుతుంది. శరీరం అచేతనామయం. దానికి కొంచెం చైతన్యం కల్గించడానికి ఎంత శ్రమపడాలో! అలవాట్లతో కరుడు కట్టుకొనిపోయిన స్వభావం దానిది. అది చెప్పలేనంతగా అచేతనామయం.

*

ప్రశ్న: పాములు, తేళ్లు వంటి కీటకాలంటే ఎందుకని భయమేస్తుంది? అసహ్యం కలుగుతుంది?

మృగాలపట్ల ఏహ్యాభావం కలగడం అనివార్యమైన అవసరం కానే కాదు. అది లేకుండా ఉండడమే యోగసాధనలో అత్యంత ప్రధానమైన విజయాలలో ఒకటి. భయంనుండే అసహ్యం కలుగుతుంది. భయం లేకపోతే కలగదు. ఈ భయం మనస్సులో పుట్టింది కాదు – సహజాతం (instinctive). వ్యక్తిగతం కాదు. జాతి నిష్ఠమైన గుణం. ఎవ్వరైనా మానవశరీరం ధరించినప్పుడు, దానితోపాటు ఈ లక్షణాలన్నింటినీ స్వీకరిస్తాడు. వాటితోపాటు జాతిభావాలు, సంవేదనలు, ఆకర్షణలు, ఏహ్యాభావాలు, భయాలు, సంబంధాలు అన్నీ స్వీకరిస్తాడు.

కాని మరొక దృక్కోణం నుండి చూస్తే ఆకర్షణలో లేదా ఏహ్యాభావంలో వ్యక్తిగతమైనదేదో ఉంది. ప్రతివ్యక్తికీ ఈ భావాలు ఒకే మాదిరి వుండవు. విభిన్నవ్యక్తులలో ప్రాణకోశం చైతన్యపు స్పందన, నాణ్యతపై ఆధారపడి వుంటుంది. పాములవంటి ప్రాణులపట్ల కొందరిలో ఏహ్యాభావం ఉండదు. ఇష్టముంటుంది. అదొక ప్రాణికమైన ఆకర్షణ.

ఈ ప్రపంచం నిండా మనస్సుకు ఆహ్లాదం కల్గించనివి, అందం లేనివి ఎన్నో ఉన్నాయి. కాని అంతమాత్రంచేత వాటి పట్ల నిరంతరం ఏహ్యాభావంతో జీవించడం అర్థంలేని విషయం. జుగుప్స కలిగించే భావాలు, భయాలు మానవమనస్సును కలవర పెట్టేవిగా ఉన్నప్పటికీ వాటిని అధిగమించవచ్చు. ఇటువంటి

ప్రతిక్రియలను యోగి అధిగమించి తీరాలి. అన్ని జీవరాసుల సాన్నిధ్యంలో, అన్ని వస్తువుల దగ్గర, అన్ని సంఘటనలలో పరిపూర్ణ సమస్థితిని పొంది ఉండాలన్నది యోగసాధనలో మొదటి నియమము. ఎల్లప్పుడూ నీవు పరమప్రశాంతంగా, ఎటువంటి కలవరం లేకుండా, నిశ్చలంగా, నిర్లిప్తంగా వుండగలగాలి.

యోగి ఆత్మబలం అంతా అందులోనే ఉంది. పరమ ప్రశాంతస్థితిలో, నిరామయ నీరవనిశ్చలస్థితిలో ఉన్నప్పుడు నిన్ను సమీపించే ప్రమాదకరమైన, అతి క్రూరమైన మృగాలు కూడా నీకు ఎటువంటి హాని చేయకుండా వెనక్కి మళ్లుతాయి.

ఏహ్యాభావం అజ్ఞానానికి చెందిన ప్రక్రియ. ఆత్మరక్షణకు సహజాతంనుండి పుట్టిన ఒక సూచిక. కాని ఏ ప్రమాదాల నుండైనా నిన్ను రక్షించేది జ్ఞానమేకాని ఇటువంటి ఏహ్యాభావంతో కూడిన ప్రతిక్రియ కాదు. ప్రమాదాన్ని గూర్చిన జ్ఞానం, ఆ ప్రమాదాన్ని తొలగించే, రూపుమాపే ఉపకరణాలను స్పృహతో వర్తింపచేసే నైపుణ్యం నీకు ఉండాలి. ఈ భావనలు పుట్టే అజ్ఞానం మానవాళి అందరికి సంబంధించిన సాధారణస్థితి. కాని దానిని జయించవచ్చును. మన బాహ్యాచైతన్యం సంస్కారవిహీనమైన మొరటు మానవప్రకృతినుండి ఆవిర్భవిస్తుంది. అది మన చుట్టూ వ్యాపించి ఉంటుంది. అయితే మనం అటువంటి మొరటు స్వభావానికి కట్టుబడి వుండనవసరము లేదు.

ఉన్నత చైతన్యంతో అజ్ఞానాన్ని రూపుమాప వచ్చును. నీకు కావలసింది చైతన్యం, మరింత చైతన్యం, పవిత్రమైన, నిర్మలమైన, నిరాడంబరమైన, దేదీప్యమానమైన చైతన్యం. ఈ పరిపూర్ణత్వం పొందిన చైతన్యపు వెలుగులో సంఘటనలు, వస్తువులు యథాతథంగా కనిపిస్తాయేకాని అవి ధరించే రూపములో కావు. ప్రవాహంగా సాగిపోతున్న సంఘటనలలో విశ్వాసనీయంగా రికార్డు చేసే తెర లాంటింది అది. ఆ తెరపై నీవు నలుపు, తెలుపు వస్తువులను తిన్నని వంకర వస్తువులలో చూడవచ్చును. నీ చైతన్యం ఒక తెరగా, ఒక అద్దంగా మారుతుంది. అయితే నీవు ధ్యానంలో వున్నప్పుడు, కేవలం సాక్షిగా ఉన్నప్పుడే ఇది సాధ్యం. నీవు

క్రియాశీలంగా వున్నప్పుడు, అది దీపస్తంభం కాంతిలాగా ఉంటుంది. నీకు ఏ వస్తువునైనా ఎక్కడవున్నా, తీక్షణంగా, లోతుగా పరిశీలించాలంటే, ప్రకాశవంతంగా పరిశీలించాలంటే, ఆ కాంతిని అటు ప్రసరింప చేయాలి.

ఈ పూర్ణ చైతన్యం సాధించడానికి ఒకే ఒక మార్గం ఉంది. నీ చైతన్యాన్ని దాని ప్రస్తుత పరిమితులనుండి, ఇరుకు దారులనుండి పెంచుకుంటూ పోవాలి. దానిలో విజ్ఞాన వికాసం తేవాలి. భగవద్రోచిర్ణవహం (divine light) వైపు దానిని ఉన్మీలనం చేయాలి. ఆ దివ్యతేజస్సు నీ చైతన్యంలో స్వేచ్ఛగా, నిండుగా పని చేసేటట్లు అనుమతించాలి. కాని, నిన్ను చీకటిలోకి నెట్టి వేసే, నిన్ను బంధించే కోరికలు, భయాలు నీవు తొలగించుకో గల్గినప్పుడు, మానసికమైన దురభిమానాలు, ప్రాణికమైన ప్రాధాన్యతలు, భౌతికమైన ఆకర్షణలు, ఆందోళనలు లేనప్పుడు ఆ అలౌకికమైన దైవప్రకాశం తన పనిని నిరంతరాయంగా, పరిపూర్ణంగా చేసుకొని పోగలదు.

మూలం: శ్రీమాత
అనువాదం: యజ్ఞన్న

యోగంలో ఫలితాలు అంత తేలికగా దక్కవు. మార్గము ఇరుకు. ద్వారములు దుర్భేద్యములు. మామూలు జీవితపరిధిని దాటిపోకుండా ప్రకృతి పెట్టిన భటులు భయము, సందేహము, అపనమ్మకము మనిషిని అడుగడుగునా సవాలు చేస్తూంటాయి.

— శ్రీఅరవిందులు

భయం ఎందుకు వేస్తుంది?

స్వార్థపరత్వమే భయానికి మూలం. దేవుణ్ణి నమ్ముకున్న వాళ్ళ భయముండదంటారు. అన్ని పరిస్థితులలోను మంచే జరుగుతుం దనే ఆత్మవిశ్వాసమున్నట్లయితే నిన్నెవరు ఏం చేయగలరు అటువంటప్పుడు 24 గంటలు నీ ప్రాణాన్ని గురించి కలవ పడవలసిన అవసరం ఉండదు. — సంపాదకుడ

ప్రశ్న: భయమెందుకు వేస్తుంది?

బహుశా అహంకారంవల్ల కావచ్చు. దానికి మూడు కా ణాలున్నాయి. తన కెప్పుడేం జరుగుతుందో, ఏం ముప్పు వా ల్లుతుందో అనే నిరంతరాందోళన మొదటిది. తెలియనిదాన్ని చూ నప్పుడు, కొత్త పరిస్థితు లెదురైనప్పుడు కలిగే బెడద రెండవది వీటన్నిటినీ మించి నీకు దైవంలో సహజమైన విశ్వాసము లే పోవటం — నువ్వు లోతుగా పరిశీలించినట్లయితే ఇదే ముఖ్య కారణమని తేలిపోతుంది. కొంతమందికి దేవుడుమీద నమ్మక లేకపోవచ్చు. అయినా పరవాలేదు. అసలు విషయ మేమిటంటే వారికి వారి ప్రయత్నం ఫలిస్తుందని కాని, వారి జన్మ సార్థకమే తుందని కాని నమ్మకం లేదు. ఎందులోను నమ్మకంగాని విశ్వా సంగాని లేనివాళ్ళని మూర్ఖులని గాక మరేమనాలి? అలా కాకుండ అన్ని పరిస్థితులలోను తప్పకుండా మంచే జరుగుతుందని అన కుండే వాళ్ళుంటారు. వాళ్ల కేకోశాన భయమనేదుండదు.

ఈ భయమనేది మనుషులతోటే పుట్టిందేమో అనిపిస్తుంది అది వరకు ఒక శాస్త్రజ్ఞుడు ఉండేవాడు. అతను మానసిక విజ్ఞా వేత్త కూడ. కొంత ఉన్నతచైతన్యాన్ని సిద్ధించుకున్నవాడు. ఏదైన ప్రమాద మెదురైనప్పుడు బెదిరిపోకుండా నిలదొక్కుకొని ఉం గలడా లేడా అని తనను తాను పరీక్షించుకో దలచుకున్నాడు తన శరీరం అప్రయత్నంగా చేసే reflex actions ని కంట్రోల చెయ్యగలడా లేడా అనేదే ప్రశ్న. (కంట్రోలు చేయుట సాధ్యవే కాని అతనా స్థాయికి చేరుకోలేదు). అతడు జంతుప్రదర్శనశాలక

వెళ్లి అందులో పాములుండే చోటికి వెళ్లేడు. కొన్ని పాములు గాజు పెట్టెలో పెట్టి ఉన్నాయి. అందులో ఒక నాగుపామున్నది. నిద్రపోకుండా మేలుకొని ఉన్నప్పుడు ఏమాత్రం అలజడి అయినా కాటేసేందుకు తయారవుతుంది. కాని అది గాజుపెట్టెలో ఉన్నంతకాలం ఎవరిని ఏం చెయ్యలేదు కదా! మన పెద్దమనిషి దాని దగ్గరకు వెళ్లి దాన్ని కవ్వించటం మొదలు పెట్టేడు. అది బుసలు కొడుతూ అతనిని కాటేయాలని పడగతో గాజు పెట్టెని కొట్టింది. మన శాస్త్రజ్ఞుడు ఆ పాము తనని ఏమి చేయలేదని తెలిసికూడ భయమేసి కళ్లార్పాడు. ఈ విధంగా మళ్లీ మళ్లీ జరిగింది. "ఆ పాము నన్ను కరిచే అవకాశం లేనప్పుడు నేను కళ్లెందుకు మూసుకోవలసి వస్తోంది?" అనే సమస్య అతన్ని వేధించింది. నిజమే. ఆ పరిస్థితిలో ఎవ్వరూ కళ్లార్పకుండా వుండలేరు. ఎప్పుడైతే నిన్ను నువ్వు రక్షించుకోలేవని అనిపిస్తుందో అప్పుడు నీకు భయం వేసి తీరుతుంది.

కళ్లార్పటం ద్వారా ప్రకటితమయ్యే భయము మానసికము గాని ప్రాణికముగాని కాదు. అది రక్తనిష్ఠమైన గుణము. ఎట్టి ప్రమాదమూ లేదని ఆ కణాలకు తెలియదు. ఆ భయాన్ని ఎట్లా ఎదుర్కోవాలో తెలియదు. యోగవిద్య నేర్చుకున్నవాళ్లకే ఆ జ్ఞానముంటుంది. వాళ్లు మరొక విధమైన శక్తిని ఆశ్రయించగలరు. కళ్లార్పకుండా తెరిచే ఉంచుకోగలరు. మనిషిలోని దైవసాన్నిధ్యమే ఆ శక్తికి మూలము. తగినంత సామర్థ్యము దానికున్నది. అది ఒక్కటే భయాన్ని నివారించగలదు.

మూలం: శ్రీమాత

అనువాదం: రా. లక్ష్మీప్రసాదమ్మ

తుపానులో కూడా ప్రశాంతంగా ఉండు; సాధనని నిశ్చలంగా కొనసాగించు; భగవంతునికి నిన్ను సంతోషంగా సమర్పించుకో; మొక్కవోని విశ్వాసంతో ఉండు; అప్పుడు భగవంతుడు నిన్నంటిపెట్టుకోనే వున్నాడని గ్రహించగలవు. — శ్రీమాత

మానసిక, ప్రాణిక, దైహిక భయం

భయమనేది ఏ కోశానా ఉండకూడదు. ఎందుకంటె నువ్వు దేనిని గురించి భయపడతావో అది జరిగే అవకాశమున్నది - అది మానసిక భయం. గుండె బరువెక్కిపోతోందని భయపడితే నిజంగానే గుండెపోటు వచ్చి ప్రాణం మీదికి వస్తుంది - అది ప్రాణికము. అప్రయత్నంగానే శరీరకణాలలో వణుకు పుట్టి వచ్చు - అది భౌతికం. — సంపాదకుడు

ప్రశ్న: మానసిక, ప్రాణిక, దైహిక భయాల మధ్యగల తేడా ఏమిటి?

నీవు నీ మనస్సులోని కదలికలను, ప్రాణిక కదలికలను, దైహిక కదలికలను గమనిస్తూ ఉంటే, ఈ తేడా తెలుసుకోగలవు. మానసికచలనాలను తెలిసికోడం బహు తేలిక. అవి నీ ఆలోచనలే. ఉదాహరణకు, పరిసరాలలో అంటువ్యాధులు ప్రబలినప్పుడు, నీవు వాటిని గురించి ఆలోచించడం ప్రారంభిస్తావు. ఒక వేళ నీకు అంటుతుందేమో! నీకొస్తే భరించలేవనీ, రాకుండా చేసుకునే మార్గాలు తెలుసుకోవాలనీ మనస్సు ఆందోళన పడుతుంది. రేపేం జరుగుతుందో అంటూ ఆలోచించడం ప్రారంభిస్తావు. ప్రాణికభయం ఇంద్రియగతంగా అనుభవానికి వస్తుంది. అంటే, ఉన్నట్లుండి వేడిగా ఉన్నట్లో, చలిగా ఉన్నట్లో నీకు తోస్తుంది. చెమటలు పడతాయి. బాధలు మొదలవుతాయి. గుండె వేగంగా కొట్టుకుంటుంది. ఉన్నట్లుండి జ్వరంగాని, లేదా రక్తప్రసారం తగ్గి శరీరం చల్లబడడంగాని సంభవిస్తుంది.

ఈ రకమైన మానసిక, ప్రాణికభయాలు నీకు లేనప్పుడు, దైహికభయం ఏమిటో తెలుసుకోగలవు. సాధారణంగా అవి రెండూ ఎక్కువగా ఉండి దైహికభయాన్ని మరుగుపరుస్తాయి. దైహికభయం అంటే దేహకణాలను కూడా భయకంపితం చేసే ఒక చిన్న విచిత్రమైన ప్రకంపనం. కాని, అది గుండె మాదిరిగా వేగంగా ఉండదు. ఆ కణాల లోపల సన్నని ప్రకంపనం కలిగి

అవి వణికిపోతాయి. వాటిని అలా వణకకుండా చేయడం కష్టం. కాని అది సాధ్యమే.

మూలం: శ్రీమాత
అనువాదం: ఎ. వెంకటరామ శాస్త్రి, ఎ. ప్రభావతి
(శ్రీమాత శతజయంతి ప్రచురణ, సం॥ 9)

భయానికి నివారణోపాయాలు

చైత్య పురుషానుభూతి (psychic being) కలిగిన వారు భయాన్ని తేలికగా పోగొట్టుకోగలరు. భయం వేసినప్పుడు ఆ చైత్య జ్యోతిని కనుక పిలిచినట్లయితే పరిస్థితి దానంతటదే సర్దుకుం టుంది. దైవానికి తమను తాము సమర్పించుకోని పూర్తిగా ఆ దైవం మీదనే ఆధారపడే వాళ్లకి కూడ ఎటువంటి సమస్య ఉండదు. "నీదే కదా బాధ్యత. ఈ గొడవ ఏదో నువ్వే చూసుకో బాబూ" అనుకుంటే ఆ భయం మాయమయిపోతుంది. లేదా నీకు భయం వేసినప్పుడు నదురు బెదురు లేకుండా ధైర్యంగా ఆ సన్నివేశాన్ని ఎదుర్కోటంకూడా మరో దీటైన పద్ధతి!

— సంపాదకుడు

ప్రశ్న: భయం కలిగినప్పుడు ఏం చేయాలి?

అది నీ స్వభావాన్నిబట్టి ఉంటుంది. భయాన్ని నివారించు కోడానికి అనేక మార్గాలున్నాయి.

నీకు చైత్యపురుషనితో కొంచెం సాన్నిహిత్యం ఉంటే, వెంటనే దానిని పిలిచి ఆ చైత్యదీప్తితో అంతా చక్కబరచుకో డమే అన్నిటిలోకీ ఉత్తమమైన మార్గం.

ఆ విధమైన చైత్యసంస్పర్శ లేనివారు కొంచెం వివేకవంతు లైతే పర్వాలేదు. సహేతుకంగా పసిపిల్లలకు నచ్చచెప్పినట్లు వారికి వారే నచ్చచెప్పుకోవాలి. ఈ భయం చాలా చెడ్డదని, నిజంగా ప్రమాదం ఉన్నప్పటికీ దానిని భయంతో ఎదుర్కోవడం తెలివి

తక్కువ అనీ నచ్చజెప్పుకోవాలి. ధైర్యం తెచ్చుకొని అపాయాన్ని ఎదుర్కొంటేనే దానిని తప్పించుకోవచ్చు; ఏమాత్రం భయపడినా నీ పనౌతుంది అని వివరంగా శరీరంలో భయానికి లోనైన భాగానికి నచ్చజెప్పి దాని భయం పోగొట్టాలి.

నీవు భక్తిప్రపత్తులు కలవాడవైతే చాలా సులువైన మార్గం ఒకటి ఉంది: "ప్రభూ, నీ సంకల్పం ప్రకారమే అంతా జరిపించు. నీవే నా మార్గదర్శకుడవు కాబట్టి, నా కేదీ భయం కలిగించ లేదు. నేను నీ వాడను, నా జీవితాన్ని నడిపించేది నీవే" అని చెప్పుకుంటే ఆ మంత్రం వెంటనే పనిచేస్తుంది. ఇది అన్నిటిలోకీ మేలైన పద్ధతి. నిజానికి, దైవానికి అంకితం చేసుకోడం అన్నిటి లోకీ గొప్పది. ఈ సమర్పణభావం ఉంటే, భయం అంతా కల మాదిరి కరిగిపోతుంది. భయంతోపాటు దానిని నీపైకి పంపిన దుష్టశక్తి (being) కూడా అదృశ్యమౌతుంది. అది వేగంగా పరుగెత్తి వెళ్ళడం నీవు చూసితీరాలి!

చాలా దృఢమైన ప్రాణశక్తి కలవారు కొందరుంటారు. వారు బాగా పోట్లాడగలరు. ఏదైనా రాగానే వారు "ఆ! శత్రువు వచ్చింది. దాన్ని ఇప్పుడే ఓడిస్తాను" అంటారు. అలా చేసేవారికి చాలా పరిజ్ఞానం, అత్యధికమైన ప్రాణశక్తి కావాలి. అది అందరికీ సాధ్యం కాదు.

ఈ విధంగా అనేక మార్గాలున్నాయి. అన్నీ మంచివే. నీ స్వభావానికి సరిపోయేదేదో చూచుకొని ఉపయోగించుకోవాలి.

ప్రశ్న: వ్యాయామ విన్యాసాలలో ఎత్తునుంచి దూకాలను కొన్నప్పుడు భయం వేస్తుంది. ఎందువల్ల?

అది రెండు విషయాల ననుసరించి ఉంటుంది. నీవు ఆ రెంటినీ వేర్వేరుగా గుర్తించి చేయవలసింది చేయాలి.

అది ప్రాణికభయం అయితే నీకు నీవు నచ్చజెప్పుకొని తగిన కర్తవ్యము చేయాలి. అది శారీరకమైన సహజోద్బోధ అయితే నీవు జాగ్రత్త వహించాలి (శరీరానికికూడా సహజోద్బోధ కలుగుతుంది). శరీరానికి కలిగిన సహజోద్బోధ నీ మాన

సికాలోచన, ప్రాణిక సంకల్పాలతో కలత చెందనిదైతే తప్పక పాటించాలి. స్వతహాగా తాను ఏమి చేయగలదో, ఏమి చేయ లేదో శరీరానికి బాగా తెలుసు. అంతే కాకుండా, మామూలుగా చేసే పనినే ఒక్కొక్కరోజు చేయ బుద్ధిపుట్టదు. శరీరం వెనక్కు తగ్గుతుంది. అటువంటప్పుడు ఆ పని చేయకుండా వదిలేయాలి. ఏ కారణంవల్ల నైతేనేమి – శరీరపరిస్థితి సరిగా లేకపోవచ్చు. ఆ సమయంలో ఆ పని చేయగల స్తోమత నీకు లేదన్నమాట. అప్పుడా పని చేయకూడదు. అది భయం కాదు. ఏం జరుగ నున్నదోనని ఆలోచించే మానస చర్యా కాదు. ఏదో అజ్ఞాతశక్తి నిన్ను వెనక్కు తగ్గేటట్లు చేస్తుంది. "ఏం జరుగుతుందో ఏమో" అని నీ ఆలోచన సాగడం మొదలుపెడితే దానిని లెక్కచేయ కూడదు. దానిని తొలగించుకోడానికి నీ తెలివితేటలన్నీ ఉప యోగించాలి. అది కేవలం శరీరంలో కలిగిన సంవేదన అయి, శరీరం బిగిసిపోయి, అనిష్టతచూపి, చేయడానికి నిరాకరిస్తే దానిని బలవంతపెట్టకూడదు; ప్రమాదాలు అప్పుడే జరుగుతాయి. ప్రమా దాన్ని సూచిస్తూ ఆ పని కొనసాగదని చెప్పే హెచ్చరిక అది. అందువల్ల నీవా పని చేయకూడదు. "ఈ రోజు నా పరిస్థితి బాగా లేదు" అని నీవు తెలుసుకోవాలి.

ఆటల పందెములు, పోటీలు జరుగుతున్నప్పుడు ఇటువంటి భయం కలిగితే అది ప్రాణికభయం కాబట్టి "నాకేం పర్వాలేదు" అని దాన్ని పారద్రోలాలి. అది అర్థంలేని భయం.

*

నీకు భయం పోవాలంటే నిన్ను భయపెట్టే పరిస్థితిని ముఖా ముఖీ ఎదుర్కోవటమే. ఈ విధంగా ఎదిరించినప్పుడు నీకు భయం పోతుంది. ఇక నీకు భయమే ఉండదు. యోగంలోకూడ ఇదే విధంగా ధైర్యాన్ని నేర్పుతారు. పూర్వకాలం ఈజిప్టులాంటి దేశాల్లో గూఢవిద్య (occultism) కోసం దీక్షనిచ్చేటప్పుడు మృత్యు భయాన్ని పూర్తిగా పోగొట్టాలని వాళ్లని శవపేటికలో పెట్టి చచ్చిపోయినట్లుగా కొన్నాళ్లు ఒదిలి వేసేవారు. పీల్చేందుకు గాలి, అన్నపానాదులు ఇచ్చినప్పటికి వాళ్లా పెట్లో చచ్చిపోయినట్లుగా

పడి ఉండాల్సిందే. ఆ విధంగా చేస్తే వాళ్లకు మృత్యుభీతి పూర్తిగా పోయేదిట.

మూలం: శ్రీమాత

అనువాదం: ఎ. వెంకటరామ శాస్త్రి, ఎ. ప్రభావతి

(శ్రీమాత శతజయంతి ప్రచురణ, సం॥ 10); ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

భయాన్ని పోగొట్టట మెలా?

భయం పోగొట్టేందుకు మార్గాలు: ఇది యోగశక్తి వలననే సాధ్యము. శక్తిసామర్థ్యములను అధో ప్రాణికస్థాయిలోకి (నాభి క్రిందిభాగము) తీసుకు రావాలి. మరియు భయం పుట్టినప్పుడు నీ సంకల్పబలం ద్వారా శరీరాన్ని ప్రశాంత పరచాలి. ఈ రెండింటిలోను ఏదో ఒక మార్గాన్నిగాని రెండింటిని కలిపిగాని ప్రయోగించ వచ్చును.

*

భయాన్ని, కోపాన్ని పారద్రోలి మదర్‌ని నమ్ముకుంటూ ఆమె మీదనే భారం మోపి నువ్వు నీ మార్గంలో యథాతథంగా నడుచుకుంటూ పోవాలి.

*

నువ్వు దేన్ని గురించి అయితే భయపడతావో దానిని ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడు ఆ భయము, సంకోచము పోతాయి. కష్టాలని, బాధ కలిగించే విషయాలని ఎదుర్కొనేందుకు ఒక్కటే మార్గము – దైవమునే నీ ఆధారంగా చేసుకోవాలి. అప్పుడు ఆయన సహాయంతో అన్ని కష్టాలను అధిగమించగలవు. అంతే కాదు. నీలో పనిచేసే యోగశక్తి ఈ సంఘటనల ద్వారా కూడ నిన్ను నీ లక్ష్యం వైపు నడిపించగలదు; నీ గమ్యానికి చేర్చగలదు.

*

నువ్వు పని చేసేటప్పుడు కూడ యోగశక్తిని (Mother's Force) గ్రహించి దాని సహాయంతో పని చెయ్యటం నేర్చుకోవాలి.

అప్పుడది నీ మనస్సులోంచి, యితర భాగాలలో నుంచి మాలి న్యాలను తొలగించి నిన్ను శుద్ధిపరుస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: ఆర్.ఎల్.ఎస్. శాస్త్రి

సులభమైన పద్ధతి

భయమనేది ఓ అయస్కాంతం లాంటిది. భయపడటంవలన ఆ భయానికి కారణమైన విషయాన్ని నీవు ఆకర్షిస్తున్నావన్న మాట. జబ్బు చేస్తుంది, జబ్బు చేస్తుంది అని పాట పాడుతూ వుంటె నిజంగా జబ్బు చేయకేమవుతుంది? ప్రమాదం జరుగు తుందేమో అని తలుస్తే నిజంగానే ప్రమాదం జరుగవచ్చు. కాబట్టి చెడు తలపులు, వ్యర్థమైన భయాందోళనలు పనికి రావు. తథాస్తు దేవతలు ఉంటారు జాగ్రత్త! – సంపాదకుడు

అది లౌకిక సంబంధమైన ఒక చిన్న వ్యక్తిగత ప్రశ్న ననుస రించి ఉంటుంది.... నీకు భయం కలిగినప్పుడు, నీ భయమే నీవు భయపడిన విషయాన్ని ఆహ్వానిస్తున్న సంగతి *నీలో నీవు పరి శీలించుకొని నీకు చెప్పుకోవాలి. నీవు రోగాలను గురించి భయపడ్డావంటే ఆ భయమే రోగాన్ని ఆహ్వానిస్తుంది. ప్రమా దాలను గురించి భయపడ్డావంటే ఆ భయమే ప్రమాదాన్ని ఆహ్వానిస్తుంది.* నీలోను, నీ చుట్టుప్రక్కల నీవు గమనిస్తే యిది ఎప్పుడూ జరిగే విషయమేనని తెలుసుకోగలవు. నీ కేమాత్రం లౌకికజ్ఞానం ఉన్నా "దేన్ని గురించైనా భయపడడం బుద్ధి తక్కువ. అలా భయపడటం దానిని దగ్గరకు రమ్మనడానికి సూచన చేయ డమే. నన్ను చంపడానికి ప్రయత్నిస్తున్న నా విరోధి దగ్గరకు వెళ్ళి: ఇదుగో, నీవు చంపాలనుకుంటున్నది నన్నే అని చెప్పాను కదా!" అనుకుంటావు. అందువల్ల, భయం చెడ్డది కాబట్టి భయ పడకుము. నీ తర్కంతో నీవు దానిని పొగొట్టుకోలేకపోతే నీ

మీద నీకు అదుపులేదని అర్థము. అప్పుడు నిన్ను నీవు స్వాధీనం చేసుకోడానికి ప్రయత్నించాలి. అంతకు తప్ప ఏమీ లేదు.

*

కొంతమంది రహస్యజ్ఞాన సంపన్నులు (mystics = మర్మజ్ఞులు) ఉంటారు. వారికి భయం వేస్తే వెంటనే దైవాన్ని స్మరించి ఆయన బాహుబంధములలో రక్షణ పొందగలరు. లేదా ఆయన పాదాలకు ప్రణమిల్లి (బహిరాంతరంగాలలో) జరిగే దానికి బాధ్యతనంతా ఆయనకే అప్పచెప్పినట్లయితే కూడ భయం వెంటనే మాయమయిపోతుంది. మర్మజ్ఞులకి ఈ విధంగా భయాన్ని పోగొట్టుకోవటం చాలా తేలిక. కాని అందరూ మర్మజ్ఞులు కారు కదా.

మూలం: శ్రీమాత

అనువాదం: ఎ. వెంకటరామ శాస్త్రి, ఎ. ప్రభావతి (శ్రీమాత శతజయంతి ప్రచురణ, సం॥ 10), ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

జరిగేదంతా మన మంచికేనా?

కీడు జరుగుతూ వుంటే చూసి 'ఇదంతేలే, ఎవరేం చేయగలరు?' అని మనం ఊరుకుంటాం. కాని ఈ బాహ్యసంఘటనలను నిశ్చయించేది, అంతకంటె శక్తివంతమైనది మరొకటున్నదని మనకు తెలియదు. దాని పేరే చేతన. యోగం ద్వారా నువ్వు నీ చేతనా స్థాయిని పెంచుకోవచ్చు. అది పెరుగుతున్న కొద్దీ, దాని గుణం నీ జీవితంలో కూడా ప్రతిఫలిస్తుంది; దానిని సుసంపన్నం చేస్తుంది. కాబట్టి ఏం జరిగినా ఎట్టి ప్రమాదం ఎదురైనా నువ్వు నుట్టుకు వణికిపోకుండా ఉన్నతచేతనలో సుఖాసీనుడవై ఉన్నావంటె నువ్వు భయపడవలసిన అవసరం లేదు. నీకే హాని జరుగదు. నిన్నెవరూ ఏం చేయలేరు. — సంపాదకుడు

చేతనా స్థాయి ప్రాముఖ్యత

ఎప్పుడూ మంచే జరుగుతుందా? అది నీ చేతనాస్థాయిమీద ఆధారపడి వుంటుంది.

ఎట్టి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు *నీ చేతన ఒక చక్కటి ఆయుధము. నీ చేతనను ఎప్పుడు నువ్వు అందుకోగలిగినంత మహోన్నత స్థాయిలో వుంచాలి. అప్పుడు నీకు సాధ్యమైనంత మంచే జరుగుతుంది.* ఈ చేతన జారిపోయినట్లయితే అటుల జరుగదు. ఎందుకని? అది పరమోచ్ఛ స్థాయిలో లేదు కాబట్టి. *నువ్వు కనుక right attitude తో ఉన్నట్లయితే జరుగబోయే ప్రతి సంఘటన నీ కనుకూలంగానే పరిణమిస్తుంది. ఇంకా చెప్పా లంటే అసలు ఆ పరిస్థితే పూర్తిగా మారిపోతుంది కూడా.* ఉదా: ఎవరైనా నిన్ను చంపేందుకు వస్తారనుకో. అప్పుడు మామూలు మనిషి మాదిరిగానే నువ్వు భయంతో వణికి పోయి నట్లయితే ఆ హంతకుడు తన పనిని తప్పకుండా నెరవేరుస్తాడు. కాని నువ్వు భయపడ్డప్పటికీ ఉన్నత చేతనాస్థాయినుంచి దైవాన్ని ప్రార్థించినట్లయితే, ఆ మనిషి నీ మీదకు వచ్చినప్పటికి నిన్ను చంపజాలడు. మహాచేస్తే కాస్త గాయపరచగలడేమో అంతే. అటుల గాక మొదటినుంచి నీ చుట్టూవున్న దైవసాన్నిధ్యాన్ని నీ అనుభ వంలోకి తెచ్చుకున్నట్లయితే ఆ హంతకుడు నీ జోలికి కూడా రాజాలడు. నీకే అపాయము రాదు.

శరీరాన్ని కూడా చేతనామయం చేయాలి

ఒక పెద్ద గుంపులోని జనమందరూ ఒక్క మనిషి చేతన ద్వారా రక్షిం పబడిన ఉదంతాలెన్నో నాకు తెలుసు. అయితే నీ చేతన మట్టుకు పైకిపోయి, భౌతికశరీరాన్ని "నీ ఖర్మ నీది" అని ఒదిలివేయటం తగదు. నువ్వు పైకి వెళ్లి 'దైవేచ్ఛయే జరుగుగాక' అని అనుకున్నా కూడ నీకు ఆపద తప్పదు. ఎందుకంటె నువ్వెంత ఎత్తైన చేతనని అందుకున్నప్ పటికి నీ శరీరం మట్టుకు అచేతనంగా అవికసితంగానే ఉండిపో తుంది. పాతధర్మాన్నే అనుసరిస్తుంది. అందుకని నీ భౌతిక శరీ రానికి కూడ దివ్యచేతనను స్ఫురింపజేసి దాని భయాన్ని పోగొ ట్టాలి. దానిని దివ్యశాంతి సంభరితం కావించాలి. అప్పుడు హంత కుల ప్రయత్నాలు విఫలమవుటయే కాదు. క్రూరమృగాలు కూడ నీ జోలికి రావు. ప్రకృతి వైపరీత్యాలు నీ దరి జేరవు.

పుట 55 చూడండి

ఎవరినీ ఏవగించుకో కూడదు

శ్రీఅరవిందులు ఉపనిషత్తులను గురించి అందరికి అర్థమయ్యే టట్లు తేటతెల్లమైన భాషలో వ్రాసారు. (SABCL Vol. 12) ముఖ్యంగా ఈశావాస్యోపనిషత్తును గురించి భిన్నదృక్పథాలతో, విభిన్నరూపాలలో ఎనిమిది వ్యాఖ్యానాలు వ్రాసారు. వాటిలో ప్రశ్నోత్తరాల రూపంలో చేసింది మరీ ముచ్చటగా ఉంటుంది. ఇది ఆత్మానుభూతికి సంబంధించిన విషయము. తనయందున్న ఆత్మయే అందరియందు అన్నిటియందు ఉన్న ఆత్మ అనియు, అన్నిటియందు ఉన్న ఆత్మయే తనయందు కూడ ఉన్నదనే సత్యమును అనుభూతిపరంగా తెలుసుకోవాలి. – సంపాదకుడు

సర్వజీవులలోనూ తననే చూచే మానవుడు ద్వేషించలేడు. భయంతో ముడుచుకుపోడు. అతనికి జుగుప్సగాని భయంకాని ఉండవు. "తతో న విజుగుప్సతే"[1] అందరూ తననుండి దూరంగా తొలిగిపోతున్న కుష్ఠురోగి అక్కడున్నాడు. కాని విచిత్రమైన ఈ మారువేషం లోనించి, నవ్వుతున్న కన్నులలో బ్రహ్మ బయటకు చూసున్నాడని తెలిసిన నేను అతన్నించి దూరంగా పోతానా? కత్తిపట్టుకొని నా గుండె చీల్చటానికి వచ్చే ఈ శత్రువు చేతి లోని పదునైన, భయంకరమైన ఖడ్గానికి ఆవల కోపంతో చిట్లించిన కనుబొమలనుంచి ద్వేషం కక్కుతున్న వదనానికావల ఏముందో చూస్తాను. అక్కడ నా ఆత్మ ధరించిన ముసుగే నాకు కనిపిస్తుంది. ఆ తర్వాత నేను కత్తికి భయపడను, అది ధరించిన వాడిని ద్వేషించను. ఓ! బుద్ధి తక్కువై, నా శత్రువని నిన్ను పిలిచే నేను ఎన్నుకుంటే తప్ప నీవు నా శత్రువు ఎలా అవుతావు? అసలు శత్రువుల్ని, మిత్రుల్ని సృష్టించింది ఎవరు? ఇదంతా మనస్సు చేసే ఇంద్రజాలం. శత్రువుగా నిన్ను పరిగణించకపోయినట్లైతే నీవు ఒక స్వప్నం లేదా ఒక నీడను మించిన శత్రువు కావు. తళతళ

---

[1] ఈశోపనిషత్ 6 వ మంత్రం 2 వ వాక్యం

మనే నీ కత్తి ఒక కల తప్ప మరేమీ కాదు. కోపంతో ముడి బడిన నీ భ్రుకుటి ఒక నీడ తప్ప ఇంకేమీ కాదు.

అయితే నన్ను నీవు కత్తితో నరుకుతావా? నన్ను చంపుతావా? తుపాకీ గుండ్లతో నన్ను తూట్లు పొడుస్తావా? నిప్పుతో నన్ను చిత్రహింస పెడతావా? నీ శతఘ్నితో నన్ను పేల్చి వేస్తావా? నన్ను నీవు నరక లేవు. కారణం నేను వధింపబడను, ఛేదింపబడను, ఖండింపబడను, కాల్చబడను, అచలుడను. నేను ధరించిన ఈ ఉడుపును, ఈ అన్నమయకోశాన్ని, ఈ పాంచభౌతిక శరీరాన్ని మాత్రమే నీవు ముక్కలుగా నరకగలవు. కాని అది వరకు 'నేను' ఎలా ఉన్నానో ఇప్పుడూ అలాగే ఉన్నాను. నీ మీద నాకు కోపం లేదు. ఎందుకంటే ఒక శిశువు తన ఆటలోనో లేదా చిన్నతనపు కోపంతోనో తన బట్టను చింపిందని ఆ శిశువు మీద కోపం తెచ్చుకొనే శ్రమ ఎవరు పడతారు? బహుశః ఆ బట్ట చాలా విలువైనదని నేను అనుకొని ఉండవచ్చు. ఇంత త్వరగా దాన్ని నేను వదలుకోకుండవచ్చు. దాన్ని కాపాడుకోవాలని ప్రయత్నించి ఉండేవాడనేమో!

అనుకుంటే నిన్ను కోపం లేకుండానే శిక్షించి ఇంకా ఎక్కువ వస్త్రాలను నువ్వు ముక్కలు చేయకుండా నివారించవచ్చు. కాని ఒకవేళ ఆ విధంగా చేయలేకపోతే, సరే – అది వస్త్రమే కదా! వర్తకుడి దగ్గర మరొకటి త్వరలోనే దొరుకుతుంది. కాదు కాదు ఇదివరకే దానికి మూల్యాన్ని చెల్లించలేదూ? ఓ న్యాయాధిపతీ తిండికిలేక మాడుతున్న వేలాదిమందికి బహుశః ఆహారం ఇవ్వటం కొరకు, నీ సరదా కోసం, నీవు బానిసలుగా అట్టేపెట్టిన నా దేశీయులకు సహాయపడటం కొరకు నీ శాసనాలు ఉల్లఘించానంటూ చచ్చేవరకు నన్ను ఉరితీయమని తీర్పు చెబుతూ కూర్చున్న నీవు 'నన్ను' ఉరితీస్తావా? ఆకాశంనుండి సూర్యుణ్ణి నీవు కదిలించ గలిగినప్పుడు లేదా వస్త్రంలాగా ఆకాశాలను చుట్టచుట్టినప్పుడు నన్ను ఉరితీసే శక్తి నీకు వస్తుంది. ఉరితీస్తే చనిపోయేది ఎవరనుకుంటున్నావు? ఒక జీవకణాల మూట తప్ప ఇంకేమీ కాదు. బాహ్యంలో నీవుగా నేనుగా ఉన్నది

నాటక రంగస్థలంమీది వేషాలమే. వాటి వెనక ఎవరినీ చంపని, ఎవరిచేతా చంపబడని 'ఒకటి' ఉంది. న్యాయాధిపతిగా పిలవ బడుతున్న ఓ వేషమా – నీ పాత్ర నీవు నిర్వహించు, నా పాత్ర నేను నిర్వహించాను.

ప్రాచీన యోగపుత్రుడా అన్నింటిలోనూ నీ ఆత్మను చూడు; దేనికీ భయపడకు దేన్నీ అసహ్యించుకోకు; ఎవరికీ భయపడకు ఎవరినీ ద్వేషించకు. దృఢంగా ధైర్యంతో నీ పాత్ర పోషించు. అలా అయితే నిజంగా నీవేమిటో – అంటే నీ విజయంలో దైవంగా నీ ఓటమిలో దైవంగా నీ మరణంలో యమ యాతనలో దైవంగా, ఓడించరాని మరణించలేని దైవంగా నీవు అవుతావు. దైవం ఎవరికైనా భయపడతాడా? నిస్పృహకు ఆయన లోనవుతాడా? వణకిపోయి కదలిపోతాడా? లేదు, కదిలిపోయేది కంపించేదీ నీ శరీరానికి మెదడుకు రూపం కల్పించిన క్రిములు. వాటిలోని నీవు ప్రశాంత నేత్రాలతో వాటి బాధనూ భయాన్నీ చూస్తూ కూర్చుంటావు. ఎందుకంటే తమ్ముతాము యథార్థం అని కలలుకంటున్న నీడలు తప్ప మరేమీకావు. సర్వజీవులలో ఆత్మను చూడు. సర్వజీవులను ఆత్మలో చూడు. అప్పుడు చివ రికి భయమే భయంతో నీ నుంచి పారిపోతుంది. నీ స్పర్శతో చిత్రహింసకు గురికావలసి రాకుండా ఉండాలని బాధ నిన్ను తాకనే తాకదు. తన్ను చంపుతావేమోనని మృత్యువు నీ దరి దాపులకైనా వచ్చే సాహసం చేయదు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రరావు

భయమంటే బానిసత్వమే. కర్మలు విముక్తి.
ధైర్యమే జయం

శ్రీమాత

యోగము – భయము

యోగాన్ని గురించి సరైన అవగాహన ఉండాలి. యోగశక్తిని గ్రహించి దానిని నీలో క్రియాశీలము చేసుకోవాలి. హాయిగా సంతోషంగా ఉంటేనే అది సాధ్యం. విచారంగా భయంభయంగా ఉన్నట్లైతే ఈ పాత అలవాట్లు మళ్ళీ వచ్చే అవకాశం ఉంది. యోగశక్తి నీలో చేసే మార్పులకు అవి అడ్డుతగులుతూ ఉంటాయి. అందుకని నువ్వు చాలా అప్రమత్తంగా ఉండాలి. నిన్ను నీవు వెయ్యి కళ్లతో కాపలాకాస్తూ ఉండాలి. ఒక్కొక్కప్పుడు కాస్త తలనొప్పిగాని మరే యితర బాధగాని కలిగినా తల్లడిల్లిపోకూడదు. అది నీ శరీరం యోగశక్తిని నిరోధించడంవలన కలిగిన తాత్కాలిక దశే అని గ్రహించాలి. భయపడకూడదు. పిరికిపందలకు యోగంలో తావు లేదు.

– సంపాదకుడు

భయంతో యోగసాధన అసాధ్యం. భయానికి యోగానికి పొత్తు కుదరదు.

*

భయదుఃఖాలు యోగానికి అవరోధాలు. యోగసాధనకు ప్రతిబంధకాలు. భయంభయంగా, ఏడుపుగొట్టుగా ఉంటే నువ్వు ముందుకు పోలేవు. అంతేగాదు. వెనక్కుపోయి గమ్యానికి దూరమైపోతావు. నువ్వు దేనిని గురించయితే భయపడుతావో అదే నిన్ను పట్టుకొని పీడిస్తుంది. విడిచిపెట్టకుండా వెంటాడుతుంది. నువ్వు విచారంగా ఉన్నట్లైతే నీ బలంకూడా ఉడిగిపోతుంది. అంతేగాదు – యింకా దుఃఖాలను తెచ్చిపెడుతుంది కూడా.

అల్పత్వానికి అవివేకానికి అతీతంగా ఆనందోల్లాసాలతో వేడుకగా ఉండవచ్చు. కాని, ఈ వేడుకలు ప్రాణికస్థాయిలో ఉత్సాతాలు తెచ్చిపెట్టేవిగా ఉండకూడదు. ముఖ్యంగా ఉండవలసినది – శ్రద్ధ, జాగరూకత. తప్పుడు మార్గాలకు అతీతంగా ఉంటూ, ఛాందస భావాలకి, అజ్ఞానానికి లోబడకుండా జాగ్రత్తపడాలి.

•

ఆత్మస్థైర్యంతో అప్రమత్తుడవై ఉన్నప్పుడు నీలోని దివ్యశక్తి ఇతోధికంగా నిన్ను ఆదుకుంటుంది. ఆ శక్తి నిన్ను అపమార్గం వైపు మళ్లనీయదు. విపరీత ధోరణులను తిరస్కరింప చేస్తుంది. భయాందోళనలతో ఉన్నప్పుడు ఇది సాధ్యం కాదు. అప్రమత్తంగా నిర్భయంగా ఉండి దివ్యశక్తికి ఒదిగి ఉన్నప్పుడే ఇది సుసాధ్యం.

మూలం: శ్రీఅరవిందులు

*

యోగసాధనలో శరీరం ఒడిదుడుకులకు, ఒత్తిడులకు గురి అవుతుంది. అలాటప్పుడు భయం కలుగుతుంది. ఈ భయం నిరాధారమైనదని తిరస్కరించాలి. అలాకాక అర్థంలేని వ్యర్థభయాలకి లొంగిపోతే అది కీడు కలుగ చేస్తుంది. యోగసాధన చేసేటప్పుడు మొదట్లో తల బరువెక్కినట్లుగా ఉంటుంది. ప్రాథమిక దశలో చాలామంది యోగసాధకులకు ఇది అనుభవైకవేద్యమే. క్రింది చైతన్యస్థాయినుంచి ఉన్నతస్థాయికి ఎదిగే సంధి దశలోని ఘర్షణ అది. కొంత కష్టమైనా కూడ ఏం పరవాలేదు – ఉన్నత చైతన్యశక్తులకు నీవు తెరుచుకుంటున్నావని గ్రహించాలి. ఈ నైజం తెలుసుకున్నప్పుడు నిన్ను అవేమీ బాధించవు సరికదా, ఆ ఉన్నత చైతన్యశక్తులు నీ శరీరంపై బలంగా పనిచేసి నీ రూపాంతరీకరణాన్ని (transformation) వేగిరపరుస్తాయి. నిశ్చలంగా ఈ శక్తులను నీలో ఆవహింప చేయగలిగినప్పుడు అవి నీకు హర్షదాయకమూ, ఆమోదయోగ్యము కాగలవు. అలా కాక వాటివల్ల నీవు ఏ మాత్రం వ్యాకులత చెంది భయపడినా నీకు అవి శిరోభారంతోపాటు రోగాన్నికూడా దాపురింప చేస్తాయి. నీ భౌతికప్రకృతి నిరోధంవల్ల కలిగిన అసౌకర్యం అది. దీని నుంచి విముక్తి పొందే మార్గమేదో నీకు తెలుస్తే వెంటనే స్వస్థత చేకూరుతుంది. అలాకాక భయపడితే పరిస్థితి విషమిస్తుంది.

ఎంతటి తీవ్రమైన అనుభూతి కలిగినా భయానికి మాత్రం చోటు ఇవ్వకూడదు. గట్టి నమ్మకంతో ఉండాలి. జరగాల్సిందేదో జరిగి తీరుతుందిలే అనే భావనతో నిమ్మకి నీరెత్తి

నట్లుగా ఉండాలి. *ఒకసారి యోగమార్గాన్ని ఎన్నుకుని సాధనలో ఉన్నప్పుడు ఎలాటి పరిణామాల నెదుర్కొనటానికైనా సంసిద్ధం కావాలి. తీరా మార్గంలో పయనిస్తూ ఓ అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి – ఈ ఊగిసలాట పనికిరాదు.* సంశయాత్మకుడవై, భయగ్రస్థుడవై ఉంటే నీకు నీవే అశాంతిని కోరి తెచ్చుకుంటావు. ఇది సాధనకి ప్రతిబంధకమే కాకుండా శారీరక, ప్రాణిక, మానసిక భూమికలలో అలజడి, అశాంతి సృష్టించేందుకు మూలకారణం కూడా అవుతుంది. చికాకు కల్గిస్తుంది. అస్వస్థతకి దారితీస్తుంది కూడా.

*

ధ్యానావస్థలోశ్వాస బంధింపబడినట్లు అనిపించి నీకు భయం కలుగుతుంది. భయపడుతూ ఈ మార్గంలోకి అడుగిడ కూడదు. నీ పిరికితనం కారణంగా రాకూడని విపత్తు ఏదైనా నీకు దాపురించవచ్చు. కాబట్టి ఈ యోగం పిరికివాళ్లకి కాదు. ధైర్యం చాలనప్పుడు తప్పుకోవడం మేలు. భయాలు వ్యాధులకు మూలకాలుగా పరిణమిస్తాయి. విధ్వంసాన్ని సృష్టిస్తాయి.

*

సాధారణ మానవుని జీవితం ఎప్పుడూ సంశయము, భయము, ఆందోళనలతోటే కూడి ఉంటుంది. ఓ పది నిముషాలు కుదురుగా కూర్చుని మనసుని కాస్తంత లోతుగా పరిశీలిస్తే నూటికి తొంభై పాళ్లు నీ మనస్సు భయసందేహాలతోనే నిండి ఉండటం గమనిస్తావు. చిన్నవి, పెద్దవి, తెలియనివి, పైకి అగుపించేవి, అగుపించనివి, ఎప్పుడో వస్తాయనుకొనేవి, చేరువలోనే ఉన్నవి – ఇలా నీకు తెలియకుండానే రకరకాల భయాలు, ఆందోళనలు నీలో గూడుకట్టుకొని కాపురం ఉంటాయి. మానవుని జాగృత చేతనకంటె అతని అవచేతన (subconscious) వందరెట్లు ఎక్కువ శక్తివంతమైనది. అందుకని అది అంత ఎక్కువగా, అంత తీవ్రంగా నీలో పనిచేయగలదు. స్థిరమైన ఆధ్యాత్మికకృషి, క్రమశిక్షణ నీలో ఉంటే నిర్భయంగా మనుగడ సాధించగలుగుతావు.

క్రమశిక్షణతో కృషిచేసి మనో ప్రాణికస్థాయిలలో భయాన్ని పారద్రోల కలిగినా కూడా, శారీరకంగా నిర్భయంగా ఉండగల్గటం అంత సులువు కాదు. శరీరం ఓ పట్టాన లొంగదు. మరి యోగ మార్గంలో పయనిస్తూన్నప్పుడు అన్ని స్థాయిలలోను – మానసిక, ప్రాణిక, శారీరక స్తరాలలో – భయరహితుడు కావాలి. జీవితంలో నీకు ఎదురయే వడిదుడుకులు, కష్టాలు నీకు ఎందుకు దాపురిస్తాయనుకుంటున్నావు? నిన్ను భయరహితునిగా చేయుట కొరకే. నీకు దాపురించే ముప్పులను, భయాందోళనలను ఏ మాత్రమూ లక్ష్యపెట్టకుండా నిర్లిప్తంగా, పరిశుద్ధుడవై ఉన్నావా సరేసరి. లేకపోతే అవి మరింత విజృంభించి నీపై దాడి చేస్తాయి. ఒకనికి నీరంటే భయం, మరొకనికి నిప్పు అంటే భయం అనుకుందాం. అలాటి చిత్తవిభ్రమంలో ఉన్నవాడు నీటిలో మునిగిపోతూన్నట్లు, దావానలంలో ఇరుక్కుపోయినట్లు తీవ్రమైన చిత్తక్షోభకి గురైపోతాడు. శరీరంలో ఏ కణంలో భయం దాగి ఉన్నా కూడా ఈ దుస్థితి తప్పదు. నువ్వు భయపడే కొద్దీ నీ భయం తీవ్రతరమై మరింతగా భయపెడుతుంది. పరిపూర్ణ భయరహితుడైనవాడే యోగానికి అర్హుడు. తన ప్రకృతిలో ఏ భూమికలోను, ఎక్కడా ఏ కణంలో కూడ భయమనేది లేకుండా దానిని నిశ్శేషంగా చేసుకోవాలి. అప్పుడే నీ రూపాంతరీకరణం (transformation) సుసాధ్యమవుతుంది.

*

జీవుడు కొన్ని చైతన్యభూమికలలో నిర్భయంగా ధైర్యంగా ఉంటాడు. కొన్ని స్తరాలలో భయం ఉండటంవల్ల నీరసపడతాడు. బలోపేతమైన భాగం పిరికితనంవలన బలహీనమై ఉన్న భాగాన్ని ఉద్ధరించి బలపరచి తద్వారా భయాన్ని నిశ్శేషంగా రూపుమాపాలి.

మూలం: శ్రీమాత
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

యోగ పథితులకు హితవు

ఈ మార్గంలో కొనసాగటానికి అనన్య ధైర్యం కావాలి. క్షుద్రమైన ప్రలోభాలకు లొంగని, చెక్కుచెదరని చైతన్యం కావాలి. యోగసాధకుడు ఏ కించిత్ భయానికి కూడ తావు ఇవ్వకుండా చిత్తశుద్ధితో, శక్తివంచన లేకుండా ఓపిగ్గా భయాన్ని కూకటి వ్రేళ్లతో పెకలించి పారవేయాలి. భయం అనేది ఒక అశౌచం. పెద్దమాలిన్యం. అసురశక్తుల ప్రభావంవల్ల అది అంటుతుంది. ఈ భూమిమీద దివ్యకార్యకలాపాలను భ్రష్టు పట్టించడమే అసుర శక్తులు చేసే పని. చైతన్యాన్ని భయరహితం చేసుకొనకపోతే అసురశక్తుల ప్రభావానికి లొంగిపోవలసి వస్తుంది.

ఇందుకు మొక్కవోని ధైర్యం, పరిపూర్ణమైన చిత్తశుద్ధి కావాలి. నిస్వార్థచిత్తం కావాలి. లాభనష్టాలు లెక్కలు కట్టి బేరీజు వేసుకునే మనస్తత్వం పనికిరాదు. దృఢమైన నమ్మకం ఉండాలి. దీనివల్ల నాకేం లాభం? నాకు ఇది ఏమి ఇస్తుంది? అని ప్రశ్నిస్తూ సాక్ష్యాలు, ఆధారాలు కోరే అపనమ్మకం పనికి రాదు. నీ చిత్తశుద్ధి, భయరాహిత్యం – ఇవే నీకు ఏ ప్రమాదము దరిచేరనీయని రక్షణ కవచాలు.

*

ఆత్మార్పణ కావించుకొని, దివ్యచిత్తంతో మమేకమై, ఎల్లవేళలా దివ్యచైత్యన్య స్పృహతో ఉన్నప్పుడు నీకు ప్రతిఘటనంటూ ఉండనే ఉండదు. అంతా పూలబాటే!

ఎక్కడ ఉన్నా ఏ ముప్పు వాటిల్లినా ఇక నీ సుస్థిర ప్రశాంతవైఖరి సడలదు.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

అనారోగ్యము – భయము

ప్రశ్న: భయంవల్ల ఎవరైనా అనారోగ్య పీడితులవుతారా?

భయంతో కలరా వ్యాధిపాలైన ఒక వ్యక్తిని గురించి నాకు తెలుసు. పక్కింట్లో ఒకరికి కలరా సోకిందని తెలుసుకొని భయంతో వణికిపోయేసరికి అతనికి కూడా కలరా వచ్చింది. నిజానికి భయంతప్ప ఇతర కారణం ఏమీ లేదు. ఇది సాధారణంగా జరిగే విషయమే. అంటువ్యాధులు వ్యాపించడానికి ముఖ్య కారణం ఇదే. భయమే తలుపు తీసి వ్యాధిని నీలోకి ప్రవేశించేటట్లు చేస్తుంది. భయం లేనివాళ్లు ఎక్కడ తిరిగినా వారికే వ్యాధీ సోకదు. మనస్సులో భయం లేకపోవచ్చు, ప్రాణికకోశంలో కూడా భయం లేకపోవచ్చు. కానీ భయంతో శరీరం జలదరించని వాళ్లెవరు? చాలా కొద్దిమంది.

శరీరానికి భయం లేకుండా ఉండాలంటే చాలా నిష్ఠతో కూడిన క్రమశిక్షణ అవసరము. క్రమశిక్షణ. యోగసాధన ఉంటే తప్ప భయప్రకంపనాలను ఎవరూ తట్టుకోలేరు. భయంవల్లనే అన్నీ వస్తాయనేది యథార్థ విషయము. చివరికి ప్రమాదాలు కూడా భయంవల్లనే ఆకర్షితమవుతాయి!

*

ప్రశ్న: మానసికంగానూ, ప్రాణికంగానూ విముక్తులైనవారి కూడా శరీరాన్ని ఒప్పించటం కష్టమౌతుంది ఎందువలన?

దానిక్కారణం శరీరానిక్కావలసిన ప్రేరణలన్నీ అది అవచైతన్యం (subconscious) నుంచి గ్రహించడమే. ఈ విధంగా ఎక్కువమందిలో వారి శరీరం అవచైతన్యపు అజమాయిషీలోనే ఉంటుంది. జాగృతంలోంచి భయాలను త్రోసిపారేసినప్పుడు అవి వెళ్లి అవచైతన్యంలో పీఠం వేసుకొని కూర్చుంటాయి. అక్కణ్ణుంచి కూడా వాటిని వేటాడి వేళ్లతోసహా తీసిపారెయ్యాలి.

*

సాధారణంగా అంటువ్యాధి సోకిందంటే దానిక్కారణం భయమేనని చెప్పవచ్చు. అది మానసికమైన భయం కావచ్చు, ప్రాణిక

భయం కావచ్చు. ఏదైనప్పటికీ శరీరకణాల్లోకి భయమే అన్నిరకాల అంటువ్యాధులను ప్రవేశపెడుతుంది. తనపై తనకి ఏ మాత్రం గౌరవంకానీ, ఆత్మనిగ్రహంకానీ ఉంటే మానసికభయాన్ని నివృత్తి చేసుకోవచ్చు. దానికంటే సూక్ష్మమైంది ప్రాణికభయం కాబట్టి దాన్ని నివృత్తి చేసుకోటానికి ఇంకా ఎక్కువ నియంత్రణ కావాలి. ఇక దైహికభయం పోగొట్టాలంటేమాత్రం యోగమార్గాన్ని ఆశ్రయించాల్సిందే. ఎందుకంటే జీవకణాలు ప్రతిదానికీ భయపడతాయి. ఏమాత్రం అసౌకర్యం ఉన్నా, బాధ కలిగినా, లేశమాత్రపు అసౌఖ్యం కలిగినా దైహికకణాల్లో గాబరా పుడుతుంది. ఏ కాస్త అసౌఖ్యాన్నీ అవి తట్టుకోలేవు. ఈ గాబరాయే అనారోగ్యం ప్రవేశించడానికి కారణమవుతుంది. అది కలగకుండా నిగ్రహించాలంటే నీ చేతనలో గట్టి సంకల్పం ఉండాలి. మొదటి రెండు భయాలూ పరవాలేదు. నేను చెప్పినట్లు మానవునిగా ఉండాలనుకునే ప్రతివాళ్లూ నిగ్రహించుకోవచ్చు. మరీ పిరికివారైతే చేయలేరు. దైహికభయాన్ని పోగొట్టుకోవటం మాత్రం చాలా కష్టం. ఆ భయం లేనప్పుడు ఎటువంటి తీవ్రమైన తాకిడి తగిలినా తిప్పికొట్టవచ్చు. ఒకవేళ వచ్చినా దేహంపై ఏ మాత్రం నియంత్రణ ఉన్నా దాని ఉద్ధృతాన్ని తగ్గించవచ్చు అయితే అది నిరోధించినట్లు కాదు. ఇంతకుముందు చెప్పుకున్నట్లు దైహికకణాల్లో భయంవల్ల వణుకు కలిగితే అది అన్ని రోగాలనూ ఉద్ధృతపరుస్తుంది.

కొంతమంది స్వతఃస్సిద్ధంగానే ఏ రకమైన భయమూ లేకుండా ఉంటారు. వారికి దైహికభయం కూడా ఉండదు. వారిలో ప్రాణిక సమతులనం తగినంతగా ఉండటంవల్ల ఏ బెదురూ లేకపోవడమేకాక, వారి దైనందిన జీవనం సహజంగానే సామరస్యపూరితంగా ఉండటంవల్ల ఏదైనా రుగ్మత వచ్చినా కూడా అది తేలిగ్గా తగ్గిపోతుంది. ఇంకొక తరహావారు కూడా ఉంటారు. వారికేమొచ్చినా విపరీతమైపోయి ఒక్కొక్కసారి విషమపరిస్థితికి దారితీస్తుంది. ఈ రెండు తరహాల వారి మధ్యనా అనేక శ్రేణుల వారీగా మనుష్యులుండవచ్చు. వారి నియమబద్ధమైన జీవనసరళి

ననుసరించి బయట తాకిడులను ఎదుర్కొని తిప్పికొట్టే సమర్థత ఉంటుంది. లేదంటే అసమర్థతే కనిపిస్తూ, తాకిడులను తిప్పికొట్టే సమర్థత లోపించి, దానికి బదులు భయంతో వణికిపోయే స్వభావం ఉంటుంది. ఇటువంటి సహజ బాధా స్వభావమే ఏ మాత్రం అసౌకర్యస్పర్శ కలిగినా దాన్ని బాధాజనకంగా ప్రమాదభరితంగా తయారు చేస్తుంది. ఈ విధంగా అనేక వర్గాల వారుంటారు. మొదటిరకం వారు రోగపూరిత వాతావరణంలోకి వెళ్లినా కూడా చెక్కుచెదరకుండా వస్తారు, రెండవరకం వారు స్వల్పమైన కారణాలకే పడిపోతారు. అంతా వ్యక్తి శరీరతత్వంపై ఆధారపడుతుంది. పురోగమించాలని ప్రయత్నం చేస్తున్నప్పుడు స్వయం నియంత్రణ చాలా అవసరం. దైవసంకల్పానికి అనువైన పరికరంగా శరీరం మారినప్పుడు రోగనిరోధకశక్తి సహజంగా కలుగుతుంది.

భయాన్ని వదిలించుకో గలిగితే సురక్షితంగా ఉన్నట్లే. అట్లాకాక అంటువ్యాధులు ప్రజ్వలిస్తున్నప్పుడు తొంభైతొమ్మిది కేసుల్లో భయంవల్లనే వస్తాయి. వార్తాపత్రికలు మొదలైన సమాచార సాధనాల వల్లనూ, అనవసర ప్రేలాపన వల్లనూ మానసిక భయం వికృతరూపం ధరిస్తుంది.

*

ప్రశ్న: తల్లీ, ఏదో వ్యాధి రాబోతోందని తెలిసినప్పుడు దాన్ని నిరోధించడమెలా?

మొట్టమొదట నువ్వు దాన్ని కోరుకోకూడదు. నీ శరీరంలో ఏ భాగంకూడా జబ్బు రావాలనుకో కూడదు. అలా జబ్బుపడకూడదనే దృఢనిశ్చయంతో ఉండటమే మొదటి నియమము. ***తర్వాత నీలో ఒక వెలుగు నింపుకోవాలి. సమత, ప్రశాంతత, నిశ్చలతల తాలూకు వెలుగును నీ జీవకణాల్లో నింపటమేకాక భయపడొద్దని వాటిని బుజ్జగించాలి.*** ఇది ఆఖరు షరతు.

సంగ్రహంగా చెప్పాలంటే జబ్బులు రావాలని కోరక పోవడం, వాటికి భయపడకపోవటం – అంటే భయంతో అవి రాకూడదనుకోవటమే కాకుండా వాటిని పూర్తిగా నిరోధించాలి.

భయానికి బదులు ప్రశాంతమైన నమ్మిక, నిశ్చలత, అన్ని సందర్భాలలోనూ నిన్ను రక్షించేది దైవకటాక్షమే అనే విశ్వాసంతో ఇక ఈ విషయాన్ని పూర్తిగా వదిలిపెట్టి మిగతా కార్యక్రమాలపై దృష్టి సారించాలి. ఇలా శాయశక్తులా రోగాన్ని నిరోధిస్తూ అదే సమయంలో జీవకణాల్లో భయాన్ని పోగొట్టే విశ్వాసాన్ని కలిగిస్తూ ఇతర కార్యక్రమాలు కొనసాగించగలిగితే ఇక అంటురోగుల మధ్య తిరిగినా నీకేమీ కాదు. ఇదంతా చేతకావాలి.

చాలామంది తమకి భయం లేనే లేదంటారు. వారి మనస్సు భయం లేకుండా దిట్టంగానే ఉంటుంది కానీ శరీరంలో వణుకుంటుంది. అది జీవకణాల వణుకు కావటంవల్ల వారికి తెలియదు. అలా తెలియకుండా వణికీ వణికీ గాబరాపడితే రోగం దగ్గరకొచ్చేస్తుంది. ఇక అప్పుడు భగవంతునిపై సంపూర్ణ విశ్వాసం ఉంచుకొని, ప్రశాంతచిత్తంతో శక్తిని ఉపయోగించాలి. ఇక నీకు కలిగే సూచనలను కూడా ఆ శక్తితోనే అరికట్టాల్సి వస్తుంది. ఈ సూచనలు అనేక రకాలైనవి వస్తూంటాయి. "అంతటా ఏవో జబ్బులూ, ఏవో అంటువ్యాధులూ ఉంటూంటాయి. అటువంటి రోగిష్టులను కలిసాం కాబట్టి మనకీ తప్పక అంటుకుంటుంది. అంతర్గతమైన పద్ధతుల్లో బాహ్యారోగాలను కుదర్చలేము" అనే మూఢాలోచనలు అంతటా వ్యాపించి ఉంటాయి. ఒక్కొక్కసారి సామూహికంగా ఒకరి దగ్గర్నుంచి మరొకరికి ప్రసారమవుతూంటాయి. దీనికితోడూ ఇద్దరు, ముగ్గురు డాక్టర్లక్కడున్నారంటే ఇక చెప్పక్కర్లేదు (నవ్వు).

*

నీ కేదైనా రుగ్మత కలిగినప్పుడు అందరూ చాలా భయంతో ఆతృతతో నీకు సేవలందించి హడావుడి చేస్తుంటే అసలైన సహాయమందించే ఆ భగవంతుని కోరటం మర్చిపోతావు. దానితో నువ్వొక విషవలయంలో చిక్కుకున్నట్లై, రోగాన్నే ఆదరించటం మొదలు పెడతావు.

*

ఒంటికేదైనా వ్యాధి వచ్చినప్పుడు భయపడి దాన్ని తప్పించుకుని తిరగాలనుకో కూడదు. అస్వస్థత తాత్కాలికమైనది, సత్యదూర మైనది అని గ్రహించి ప్రశాంతంగా నిశ్చలంగా ధైర్యం వహించి తట్టుకొని నిలవాలి. *పరిపూర్ణ విశ్వాసంతో భగవంతునిపై భారం వేయగలిగితే ఆ భావం అంతరాంతరాల్లోకి చొచ్చుకొనిపోయి జీవకణాల్లో స్థిరపడుతుంది.* అప్పుడు జీవకణాలు కూడా నిత్యము, సత్యము అయిన పరమానందాన్ని పొందగలుగుతాయి.

*

ప్రశ్న: అమ్మా నా కాళ్ల మీదగల చర్మవ్యాధి నాకు చాలా కాలంనుంచీ ఆందోళన కలిగిస్తోంది. దీన్ని వంటిమీదినుంచి తీసిపారేయి తల్లీ, నా మనస్సులోని భయాన్ని కూడా తొల గించు తల్లీ.

అసలుజబ్బు నీ భయం. నువ్వు భయాన్ని పోగొట్టు కుంటే జబ్బు పోతుంది. నా సాయం నీకెప్పుడూ ఉంటుంది.

*

ప్రశ్న: ఎక్కువ మాంసకృత్తులు, పిండిపదార్థాలు ఉన్న ఆహారం తీసుకుంటే ఎక్జిమా ఎక్కువవుతున్నదని నా అనుమానం.

తినే తిండివల్ల శరీరంలో గుణం కన్పిస్తోందంటే అది కేవలం అనుకోవడం వల్లనే. నమ్మకంతో డాక్టరుగారి సలహా ప్రకారం నడుచుకుంటే నీకు నివారణ అవుతుంది.

*

కేన్సర్ వ్యాధి సంబంధించినంతవరకు మొదట చేయవలసినది భయాన్ని పోగొట్టుకోవడమే.

భయమంటే ఆంతరంగికంగా జబ్బును అంగీకరించటమే. నీవు దేన్ని గురించైనా భయపడుతున్నావు అంటే దాని ఉని కిని అంగీకరించి బలపరుస్తున్నావన్న మాట. దాన్నే అవచైత న్యపు అంగీకారమని చెప్పవచ్చు.

*

దేనికీ భయపడకూడదు. నీ కష్టాలు చాలా వరకు భయంవల్లనే వస్తాయి. తొంభైవంతులు రోగాలన్నీ అవచైతన్యంలోని భయం

వల్లనే వస్తాయి. సాధారణ చైతన్యంలో ఉన్న శరీరానికి ఏమా త్రం ఇబ్బందికలిగినా ఏమౌతుందోననే ఆందోళన లోపల దాగి ఉంటుంది. అది ముందు ముందు ఏం జరుగుతుందో ఏమోనని భవిష్యత్తును గురించి ఆందోళనగా మారవచ్చు. ఆ ఆందోళననే నిగ్రహించాలి. గాబరాపడటమంటే దైవానుగ్రహంపై విశ్వాసం తగినంత లేకపోవడమే. సమర్పణ సంపూర్ణంగా లేదనటానికిది నిదర్శనం.

ఈ అవచేతనలో భయాన్ని పోగొట్టుకోవాలంటే అది పైకి కన్పించినప్పుడల్లా మనలో జ్ఞానాన్ని పొందిన భాగం వెళ్లి శరీరానికి నచ్చ చెప్పాలి. దైవానుగ్రహంపై పరిపూర్ణ విశ్వాసం ఉంచుకోవాలనీ, మనలోనూ, మిగతావారిలోనూకూడా భగవద నుగ్రహం ప్రసరిస్తూనే ఉంటుందనీ, అందరికీ అది మంచి చేస్తుందనే విశ్వాసాన్ని దేహానికి కలుగ చేయాలి. ఏ విధమైన సంకోచం, దాపరికం లేకుండా దైవానికి సర్వసమర్పణ చేసుకో వాలని నిర్ణయించుకునేటట్లు చేయాలి.

తనయొక్క యథార్థతత్వం భగవంతుడేననీ, ఆయన కార్య క్రమంలో అడ్డంకులు కల్పించకపోతే మనకేమీ హాని కలగదనే నమ్మకం దేహానికి కలుగ చేయాలి. మళ్ళీ మళ్ళీ భయపడ కుండా ఉండేవరకూ ఇదే కొనసాగించాలి. అప్పుడిక వ్యాధి ఏదో విధంగా పైకి తేలినా దాని పట్టు సడలిపోయి రోగతీవ్రత కూడా తగ్గిపోయి చివరికి పూర్తిగా ఓడిపోతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వేంకటరామశాస్త్రి

నువ్వు (ఉద్రేకాలని) కోపతాపాలను దౌర్జన్యాన్ని పూర్తిగా వదిలించుకున్నప్పుడే నీకు భయం పూర్తిగా పోతుంది.

ప్రాణికలోకము – పీడకలలు

ప్రాణలోకవాసులు (vital beings) భౌతికాతీత ప్రపంచమున సంచరింతురు. మానవులు అక్కడకు పోవుట సంభవించెనేని సముద్రములో మునిగినట్లు, నిస్సహాయులైనట్లు, రక్షణ కోల్పోయినట్లు అనుభూతి నొందుదురు. మానవులు భౌతికశరీరమునందే సుఖముగా, క్షేమముగా నుందురు. శరీరమే రక్షణ కల్గించును. తమ శరీరము నేవగించుకొనువారు కొందరున్నారు. చనిపోయిన తరువాత, శరీరము వదిలిన తరువాత, పరిస్థితులు బాగుపడి, సుఖముగా నుండవచ్చునని వారు తలచెదరు. కాని వాస్తవమున శరీరము రక్షణ కలిగించు కోట వంటిది. అది ఆశ్రయమిచ్చును. కోటవంటి శరీరములో నున్నంతకాలం శత్రులోకశక్తులు ఏమియు చేయజాలవు. పీడకలలన నేమి? నిద్రించునప్పుడు ప్రాణలోకములో ప్రవేశించినచో అట్టి పీడకలలు వచ్చును. పీడకల చేత చిక్కి భీతినందునప్పుడు మొదట చేయవలసినది ఏమిటి? వెంటనే శరీరములో ప్రవేశించి తటాలున మేల్కొని, సాధారణ భౌతిక చేతనను పొందవలెను. కాని ప్రాణికశక్తుల ప్రపంచములో ఎట్లు వ్యవహరించవలెనో మీకు తెలియదు. ఆ లోకము దారితెలియని సముద్రము వంటిది. అందు పయనించుటకు మీకు దిక్సూచి, చుక్కాని లేవు.

*

కలలు వచ్చినపుడు నువ్వు ఈ భౌతికలోకంలో కాకుండా ప్రాణికప్రపంచంలో (vital world) సంచరిస్తావు. మన లోకపు దేశకాలనిబంధనలు ఆ లోకానికి వర్తించవు. కాబట్టి నువ్వు ఈ శరీరంలోనే ఉన్నట్లు ప్రవర్తించకూడదు. ప్రాణికంలోని జీవులు నిన్ను భయపెడతాయి. ఆ లోకం యొక్క జ్ఞానాన్ని పొందితేగాని నీకు ఆ జీవులతో ఎలా ప్రవర్తించాలో తెలియదు. ఆ జీవులు శరీరాన్ని పెద్దగా చేసి నిన్ను హడలగొట్టగలవు. జడిపించి వశపరచుకోగలవు. వాటిని గురించి నువ్వు ముందరే తెలుసుకొని భయాన్ని విసర్జించాలి. ధైర్యం తెచ్చుకొని నువ్వు ఎప్పుడైతే ఆ

జీవుల కళ్ళల్లోకి కళ్ళు ఆర్పకుండా చూస్తావో అవి బలహీనమై పోతాయి. నువ్వు మా సహాయాన్ని కోరినట్లైతే వెంటనే పారి పోతాయి కూడాను. నా మిత్రుడు ఒకాయన తన ప్రాణిక శరీరంతో బైటికి పోతూండేవాడు. అతనికి ఒక పెద్దపులి కనపడి రాత్రంతా ఏడిపించింది. నేనతని తోటి దాని దగ్గరకు వెళ్ళి ఏ మాత్రం భయపడకుండా దాని కళ్ళల్లోకి చూడమనీ, ఇంకా అవసరమైతే నా సహాయాన్ని కోరమని చెప్పేను. నేను చెప్పినట్లుగానే అతను చేసినప్పుడు ఆ పెద్దపులి వెంటనే ముడుచుకుపోయి ఓ చిన్నపిల్లిగా మారిపోయింది.

ప్రాణికజీవుల (vital beings) కళ్ళల్లోకి తేరిపార చూసినట్లైతే అవి ఎంత భయపడిపోతాయో చెప్పలేను. అంతవరకెందుకు, ఈ భూలోకంలో గూడ అదే మంత్రం పని చేస్తుంది. క్రూరమృగాలన్ని ఆ ప్రాణికశక్తుల మూర్తరూపాలే. పెద్దపులి కళ్ళల్లోకి ఏమాత్రం నదురుబెదురు లేకుండా ఒక రోమమైనా కదలకుండా తేరిపార చూసావనుకో – అది వెంటనే పారిపోతుంది. పాము కళ్ళల్లోకి చూసేవంటే అది నిన్ను కరవదు. అయితే లోలోపల జంకుతూ ఉంటే లాభం లేదు. ఏ కోశాన భయం ఉండకూడదు. పాము పడగతో అటు యిటూ ఊగుతూ నీ ఎదురుగుండా ఉన్నప్పుడు నువ్వు దాని కళ్ళల్లోకి కళ్ళార్పకుండా చూడాలి. మానవనేత్రాలలో ఒకానొక వెలుగు ఉంటుంది. జంతువులకీ విషయం బాగా తెలుసు. ఆ వెలుగు వాటి మీదికి ప్రసారమైనప్పుడు అవి భరించలేవు. మానవదృక్కులోని ఒకానొక శక్తి క్రూరమృగాలను కూడ మచ్చిక చేయగలదు.

చివరగా చెప్పవచ్చేదేమిటంటే ఎట్టి పరిస్థితులలోను నువ్వు భయపడకూడదు. అన్ని సన్నివేశములలోను మా సహాయాన్ని కోరినట్లైతే నీ బలం వెయ్యిరెట్లు పెరుగుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: కె.ఎస్. భాస్కరరావు, ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

భయపెట్టి చదువు నేర్పటం మంచిది కాదు

మీ పిల్లలకు, మీకు మధ్య భయానికి తావియ్యకండి. ఈ భయం విద్యాభ్యాసంలో అవాంఛనీయమైనది. అది కచ్చితంగా పిల్లల్లో మోసం, కపటంలాంటి చెడులక్షణాలకు దారితీస్తుంది.

మీ పిల్లలపట్ల మీలో సుస్థిరమైన, ప్రగాఢ వాత్సల్యము విద్య నందించడలో నైపుణ్యము వాళ్ళు మీ పట్ల నమ్మకాన్ని పటిష్టపరచుకునేందుకు తోడ్పడతాయి. అప్పుడే మీరు వారికి సంపూర్ణంగా, ప్రతిభావంతంగా జ్ఞానాన్ని అందివ్వగలరు.

*

ఇంకొక విషయం – పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరచుకోవాలని పిల్లలకు చిన్నప్పటినుండే నేర్పుతూ ఉండాలి. రోగమంటే భయం పనికిరాదు. ఏ విషయమైనా తెలిపేటప్పుడు, ఏదైనా నేర్పేటప్పుడు పిల్లలను భయపెట్ట కూడదు. భయం చాలా ఘోరాలకు దారితీస్తుంది; వాళ్లు దేనివలన భయపడతారో దానిని ఆకర్షించినట్లవుతుంది.

*

పిల్లలు అల్లరి చేయకూడదు. శిక్షిస్తారని కాకుండా సిగ్గు పడి అల్లరి మానుకోవాలి.

పై రెండు పద్ధతుల్లో

మొదటిదాని వలన భయరహితుడుగా సహజంగా అభివృద్ధి చెందుతాడు.

రెండవదాని వలన అంటే భయపడటంవలన అతని చైతన్యస్థాయినుండి ఒక మెట్టు క్రిందకి దిగజారుతాడు. ఎందుకంటే ఈ భయమే మానవుని చైతన్యస్థాయిని దిగజార్చి వేస్తుంది.

మూలం: శ్రీమాత
అనువాదం: హర్షవర్ధన్

దైవభీతి

మానవుడు అపరిపక్వంగా ఉన్న దశలో ఆత్మ ఇంకా అసమర్థంగా ప్రాథమికస్థాయిలో ఉన్నప్పుడు, తన జీవితాన్ని తాను నియంత్రించుకోలేనప్పుడు, అతనిని శాసించేందుకు దైవభీతి అవసరమైంది. మనం తాత్త్వికముగా పరిణామం పొందితే, ఈ భీతి లాంటి దానికి తావు లేదు. కాకపోతే పూర్వవాసనలు వదలనందువల్ల కొంత గుంజాటన తప్పదు. ఈ నైతికమానవుడు దివ్య స్వభావంలోకి ఎగబ్రాకితే అట్టి అవసరమండదు. *దీనికి దైవానుభవ మొక్కటే శరణ్యము. పరమాత్మానుభవ మొక్కటే మార్గం. పరమేశ్వరుని ఇచ్ఛ ఒక్కటే మార్గదర్శకం. అతనియందు ప్రేమ ఉండాలి తప్ప భయం కాదు.* శాశ్వత స్వాతంత్ర్య కామన ఉండాలి. దానితోపాటుగా నిత్య స్వచ్ఛతత్త్వాన్వేషణ అవసరం.

భయమన్న దానికి ప్రభువు, సేవకుడు ఉండాలి. లేదా తండ్రికొడుకుల బంధం లోనిదవాలి. అప్పుడే దానికి ఉనికి. కానీ ఇవన్నీ మానవసంబంధాలు – ఆ పరిధి కొదిగినవే తప్ప అన్యం కాదే! నియంత్రణ – సేవాప్రవృత్తి లేదా దాస్యం, శిక్షా – ఇవి కేవలం మానవుని భౌతికపరిధి లోనివి. ఈ అధికారాచ్ఛాదనంలో ప్రేమతత్త్వం మరుగున పడిపోతుంది. అయినప్పటికి పరమేశ్వరుడు ఎవరినీ శిక్షించే స్వభావం కలవాడు కాడు. దాస్యాన్ని విధిస్తూ భయపెట్టడు. మానవాత్మ పరమాత్మను సమీపించి దాని మహాశక్తికి తలవొగ్గుతుంది. ఆ వినయసహిత భక్తి జీవాత్మను పరమాత్మస్థాయికి తీసుకొనిపోతుంది. దాని సంకుచితసంతోషం దివ్యానందంగా పరిణమిస్తుంది. దివ్యసేవలో జీవునికి స్వాతంత్ర్య లాభం కలుగుతుంది – సంకుచితమైన అహంకారావరణ విచ్ఛేదంద్వారా అనంతత్వ పరిధిలోని కెగసిపోతుంది కనుక. ప్రణయ మొక్కటే మార్గం. భారతీయ యోగశాస్త్రంలో ఈ దాస్యం దివ్యప్రేమికుని ఆరాధన లేదా దివ్యస్నేహితునికి చేసే పరిచర్య. ఇది ఆనందమూలకం తప్ప విధిగాని బాధ్యతగాని కాదు.

గీతలో చెప్పినట్లు జగత్ప్రభువునకు భక్తుడు ఒక సాధనం మాత్రమే; ఈ సాధనం స్నేహసంపత్తితో మార్గదర్శనం చేయించే పరమాత్మునిగా చెప్పిన మాట. లోకంలో రాజుగాకాక, సర్వలోక మహేశ్వరునిగా, సర్వభూతాలకు స్నేహితునిగా చెప్పిన మాట. తానలాంటివాడు కనుక తన చేతిలో భక్తుడు సాధనపని ముట్టుగావుంటే అతని ఆత్మపరిణతికది మార్గమౌతుందని. ఈ ప్రభుభావన – స్నేహభావన రెండూ ఒకదానితో ఒకటి ముడి పడి వుంటాయి తప్ప భిన్నమైనవి కావు. ఆతడు జగత్పిత కావున, సృష్టికర్త కాబట్టి జీవుడు వినయసంపన్నుడు కావాలని చెప్పటం కాక – పితృప్రేమగా స్వీకరించమని అప్పుడే అది జీవేశ్వర సమన్వయ రూపమైన యోగమౌతుందని చెప్పటం. రెంటికీ మార్గం ప్రేమే. ఈ ప్రేమ ఉన్నచోట భయముంటుందా? రెంటికి చుక్కె దురు. *పరమాత్మకు జీవుడు సన్నిహితుడు కావటమే ధ్యేయం. ఈ సంబంధాన్ని ధ్వంసం చేసేది భయభావం.* ఇరువురి నడుమ దూరాన్ని పెంచేది భయం. ఇద్దర్ని కలిపేది ప్రేమ. భగవంతుని చూచి ఆశ్చర్యచకితుడు కావటం, గౌరవించటం కూడా ఇరువురి నడుమ దూరాన్ని సూచిస్తాయి. భేదభావాన్నే కల్పిస్తాయి. ఇవన్నీ ప్రేమయోగంలో మటుమాయమైపోతాయి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

పాపభీతి

దివ్యాచార్యుడు అర్జునునితో అన్నాడు – నీవు నీ కర్మ ఫలాలనుండి విచ్యుతుడవౌతున్నావు. నీవు వేరే వాటిని కోరు కొంటున్నావు. నీ జీవితమార్గానికి దూరమౌతున్నావు. ఇది మంచి పని కాదు. కానీ ఈ కర్మభావన, దాని ఫలితం – ఫలవాంఛ లేదా వాంఛాపరితృప్తికి కర్మసాధనగా స్వీకరించటం, బంధం. ఇది అజ్ఞానం. ఈ అజ్ఞానానికి కర్మస్వభావం తెలియదు. వాని

మూలంకానీ, వాని యథార్థప్రయోగంకానీ – వాని ఉత్తమప్రయో జనంకానీ తెలియవు. నీవు అనేక విషయాలకు భయపడుతు న్నావు. పాపభీతి – ఈ భౌతికప్రపంచభీతి, జీవితానంతర విషయ భీతి, నీకు నీపై భీతి. ఈ క్షణంలో నీవు భయపడని విషయ మంటూ ఏమీ లేదు. నీవు కేవల భయభావస్వరూపుడవు. ఈ నీవా ఆర్యయోద్ధవు! ప్రపంచ ఏకైక వీరుడవు!

కానీ ఈ భయమే మనిషికి పెద్ద మాయావరణ. పాపభీతి, జీవిత తదనంతర భీతి, అజ్ఞాన ప్రపంచభీతి, దైవభీతి – ఏ దైవమంటే నీకేమీ తెలియదో దానినుండి భీతి! ఆ దైవం నిర్వహించదలచుకున్న విశ్వప్రయోజనమేమిటో తెలియకుండానే అంత భయమా? నా యోగం నిన్నా మహద్భయం నుండి తొల గిస్తుంది. దాని పరిజ్ఞానమేకొంచెమున్నా నీకు ముక్తి లభిస్తుంది. *నీవీ మార్గంలో నాల్గు అడుగులు నడిస్తే చాలు. ఏ అడుగూ వ్యర్థం కాదని తెలుస్తుంది. ప్రతి చిన్న కదలికా ప్రయోజనవం తమే. నీ నడక నేదీ అడ్డుకోలేదని నీకే తెలుస్తుంది.* ప్రతిక్షణం సంకోచిస్తూ – సందేహిస్తూ అడుగువేసే మనిషికి దైవంమీద శ్రద్ధ – విశ్వాసం లభించవు. వాటి గొప్పతనమేమో వాడికి తెలి యదు. వాటి విస్తృత సత్యస్వరూపం గోచరించదు. గీతా ప్రారం భాంత వాక్యంమహత్వం తెలుసుకోనంతవరకది అర్థం కాదు.

"సర్వధర్మాలను పరిత్యజించు. నన్నే శరణను.
సర్వపాప విముక్తి నీకు ప్రసాదిస్తాను"

అయితే అజ్ఞానంలో మునిగి ఉన్న మానవుడు ఈ మహా వాక్యాల అంతరార్థాన్ని గ్రహించలేడు. అందుకని గీతాచార్యుడు మానవమేధకు అర్థమయ్యే రీతిలో తన ఉపదేశాన్ని ప్రారం భిస్తాడు. మొదట స్నేహితుడుగాకానీ, ప్రేమికుడుగాకానీ కాక మార్గదర్శకునిగా, జీవునిలో కరుడుకట్టుకొని జన్మల మీదుగా పేరుకొన్న అజ్ఞాన అంధతమస్సును ధ్వంసం చేసి ఆత్మజ్యోతి ర్దర్శనం చేయిస్తాడు. అప్పుడే ప్రపంచస్వభావం తెలుస్తుంది. స్వక ర్మల మూలాధారం తెలుస్తుంది. అతనికి విషయంబోధ లేనందు వల్ల అజ్ఞానంతో కర్మనిర్వహణ చేస్తున్నాడు. కనుక అతని సంక

ల్పం అయథార్థం. కనుక వాడు కర్మబంధితుడౌతున్నాడు. అంతే కాని కర్మలు స్వతంత్రాత్మకు బంధాలు కావు. ఈ అయథార్థ జ్ఞానంవల్లే మనిషికి ఆశాభయాలు, కోపతాపాలు, దుఃఖం, క్షణిక సంతోషాలు ఏర్పడుతున్నాయి. కానీ కర్మలు పరిపూర్ణ పవిత్రతా స్వాతంత్ర్యాలతో చేయటం సాధ్యమే.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

సంక్షిప్తంగా మరొక్కసారి

భయమా... దేనికి భయం? అంతా దైవమయమే కదా. ఈ ప్రపంచంలో దైవం కానిదేదీ లేదే. ఆయన పరి వేషాలను చూసి మనమెందుకు భయపడాలి? ఎందుకు మోసపోవాలి?

*

నా పిల్లలు దేనికీ భయపడకూడదు.

*

ఒకసారి నువ్వు దైవానికి చెందిన తరువాత ఇక నీకు భయమనే ప్రశ్నే లేదు. ఆయన నీ కోసం వేసిన బాటపై – ఆ బాట ఏదైనా సరే, నీ కర్థమైనా సరే, కాకపోయినా సరే – జ్ఞాననేత్రంతో, విశాలమౌతున్న ఆత్మతో దర్జాగా నడిచిపో.

మూలం: శ్రీమాత
అనువాదం: ప్రతిభ

అనుబంధం:

యోగమార్గంలో అవరోధాలు

యోగం చిత్రమైనది. మనస్సుకందని అనుభూతులను కలిగిస్తుంది. దానివలన జ్ఞానం, సిద్ధి పొందవచ్చు. అయితే వెంటనే కాదు. యోగప్రయాణం బహుదీర్ఘమైనది. మార్గములో బోలెడు అడ్డంకులు, అవరోధాలు. మరి యోగఫలితములు తగినంత ప్రయాస, కృషి లేకుండా కలగవు కదా. భయం, అపనమ్మకము వాటిని నిరోధిస్తాయి. అవి ప్రకృతినిష్ఠమైన గుణములు. అంత తేలికగా వదిలిపోవు. వాటికి ఒక ప్రయోజనమున్నది. మానవాకాంక్షను తీవ్రతరము జేసి, ఈ అవలక్షణములను తొలగించి ఉన్నతమైన దైవానుభూతులకు దారి తీయుటయే.

— సంపాదకుడు

కొంత సాధన చేసి యోగమార్గంలో పైనుంచి ఉత్తమ ఫలితాల కోసం ఎదురుచూసే వారికి ముందరే కొన్ని సూచనలు వస్తాయి. ఒక మెరుపు మెరుస్తుంది. 'ఔరా ఇదా సంగతి' అని వాళ్లు ఇక దానికోసం వేటాడటం మొదలుపెడతారు.

కాని ఎంత గొప్పవారికైనా కొంత పోరాటము, పెనగులాట తప్పవు. మనం పీల్చే గాలితోపాటే ఒక విధమైన భయం, ఏం జరగబోతోందో బాబోయ్ అనే బెడద మనలోకి ప్రవేశిస్తాయి. ఇది మూర్ఖత్వమే అనిపిస్తుంది. ఎందుకంటె అందరు మానవుల జీవితము, గమ్యము ఒకటే. మనుమలు పుడతారు. కాస్త హెచ్చుతగ్గులతో తృప్తిగానే జీవిస్తారు. మరణిస్తారు. కొంతకాలమైన తరువాత మళ్లీ ఇదే వరస — విసుగు పుట్టేంతవరకు.

భయమెందుకు? ఈ చక్రభ్రమణం తప్పిపోతుందనా? లేక ఈ చెరసాలనుంచి బయటపడి స్వేచ్ఛ కలుగుతుందనా?

ఆఖరికి ధైర్యం తెచ్చుకొని "ఏమైనా పరవాలేదు. పోగొట్టుకుండేందుకు ఏముంది కనుక. ఇంతకంటె కనాకష్టం కాదులే" అని నిదానంగా ఆలోచించటం మొదలుపెడతావు. ఇదంతా నే

నూహించుకుంటున్నానా లేక ఇందులో ఏదైనా నిజమున్నదా, అని అనుకుంటావు. నీకే కాదు. చాలా తెలివైన వాళ్లకికూడ, అద్భుతమైన అనుభూతులు కలిగిన వాళ్లకికూడ ఈ విధమైన అపనమ్మకము, సందేహాలు రావటం పరిపాటి.

నీవీ రెండు అడ్డంకులను దాటిపోయినా సరే. మిరుమిట్లు గొలిపే దర్శనానుభూతులు కలిగినాసరే, అనుమానమనేదానికి ఏ మాత్రం ఆస్కారం లేకపోయినా సరే – ఏదో ఒక విధమైన అనుమాన పిశాచము నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. దీనికి కారణం మనిషి యొక్క గర్వమే. "నేనేం పిచ్చివెధవనా ఏమిటి? నాకూ పరువు మర్యాద లున్నాయి" అనే లౌకికవాదము తలెత్తి ఎంతటి వాళ్ళనైనా మోహపరుస్తుంది. కాని ఇది చాల మూర్ఖం, ఘోరం, ప్రమాదం....

ఈ విధంగా పల్టీలు కొట్టి, విసిగి వేసారిపోయి, ఇలాగే కొనసాగుతూ ఉంటె ఇక లాభం లేదులే అనుకొని గుండె గట్టి చేసుకొని భయము, అనుమానము, అపనమ్మకము అనే మూడు పిశాచాలను వదిలించుకోవాలని గట్టిగా తీర్మానించుకోవాలి. ఒకసారి అనుకుంటె చాలదు. మళ్లీ మళ్లీ యుద్ధం చేస్తూ ఉండాల్సిందే – ఈ అవలక్షణాలు పూర్తిగా విరగడ అయిపోయేంత వరకు. నిజానికి వాటిని ఎప్పటికి పూర్తిగా వదిలించుకోలేవు. కాని నీకు లోపల ఒక గట్టి నమ్మకం కలుగుతుంది. నీ స్వరూపమే మారిపోతుంది. "ఇక ఏమైనా పరవాలేదు, నన్నెవరేం చేసినా పరవాలేదు" అని చిరునవ్వుతో ఒక చిటికె వేసి "మీరు వెళ్లిపోండి, ఎక్కడినుంచి వచ్చారో అక్కడికే వెళ్లిపోండి, మీ బలాన్ని తగ్గించుకోండి. మొండిగా ఉండకండి, మీద పడిపోకండి" అని ఆ శత్రువు లందరిని తరిమికొట్టాలి. *ఇక నీలో యోగజ్వాల చాలా తీక్షణమై వాటన్నిటిని భస్మం చేసేస్తుంది!*

మూలం: శ్రీమాత
అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

చివరి మాట

ఒకనాడు ప్రొద్దున నగరంలోకి మృత్యువు ప్రవేశిస్తూండగా కాప లావాడు దాన్ని అడ్డుకున్నాడు. "ఏయ్ ఏం చేస్తావు" అని అట కాయించాడు. వందమందిని చంపేస్తానని మృత్యువు సమాధాన మిచ్చింది. "బాబోయ్ ఎంత ఘోరము" అన్నాడు. "అంతే, మరి నేను నా పని చేసి తీరుతాను" అని మృత్యువు చెప్పింది. భటుడు వెంటనే నగరంలోకి వెళ్లి అందరిని హెచ్చరించాడు. అయితే ఆనాడు వందమంది కాదు – వెయ్యిమంది మరణించారు!

సాయంత్రం మృత్యువు తిరిగి వెళ్లిపోతుండగా కాపరి దాన్ని పట్టుకొని "వందమంది అని చెప్పి వెయ్యిమందిని ఎందుకు చంపే శావు" అని అడిగాడు. అందుకా మృత్యువు సమాధానం "నేను నా మాట ప్రకారం వందమందినే చంపాను. మిగతావాళ్లు భయా నికి బలైపోయారు"!

మూలం: అనామకుడు
అనువాదం: ప్రతిభ

దైవసాన్నిధ్యము, సాహాయ్యము, రక్షణ

నువ్వు దైవాన్ని నమ్ముకుంటే చాలు – ఆయనెప్పుడూ నీ వెంతనే ఉండి నీకు దారి చూపిస్తూంటాడు. నీకు కవచం తొడిగి నిన్ను రక్షిస్తూ వుంటాడు. నీ చుట్టూ కోటకట్టి నిన్ను కాపలా కాస్తూ వుంటాడు. – సంపాదకుడు

ప్రశ్న: మధుమయీ, నువ్వు అనుక్షణం మాతోటే వుంటావు నిజమే. అయినా మామూలు పరిస్థితుల్లో మేము దీన్ని గురించి అంతగా పట్టించుకోము. ఆపదలొచ్చినప్పుడు మాత్రమే నీ సాన్నిధ్యాన్ని గుర్తించి మమ్మల్ని రక్షించమని వేడుకుంటాము. కాని మొన్న మేము దీర్ఘప్రయాణం చేసినప్పుడు, ఎట్టి ఆపదా

లేనప్పటికి, కారులో మేము కాకుండా ఇంకెవరో కూడ వున్నట్లు కొట్టవచ్చినట్లుగా తెలిసింది! ఒకవేళ ప్రమాదం జరిగే అవకాశమేదైనా వున్నదేమో మరి మాకైతే ఏ మాత్రం తెలియలేదు.

మీలో ఒకరు కారు టైర్లు పూర్తిగా అరిగిపోయినట్లు నాకు తెలియచేసారుగదా. నేను కూడ అందుకు తగినట్లుగానే మిమ్మల్ని రక్షించేందుకై సచేతనంగా, చాలా పటిష్ఠంగా మీతో వున్నాను.

*

దైవము నిరంతరం మనని పరివేష్టించి రక్షిస్తూ ఉండే మాట నిజమే. అయితే ఈ రక్షణ అకస్మాత్తుగా మనకేదైనా అపాయం ఎదురైనప్పుడే పని చేస్తుంది. ముఖ్యంగా దైవకార్యనిర్వహణలో నీ కెట్టి విఘ్నము సంభవించకుండా చూస్తుంది. కాని దైవసంర క్షణ వుందికదా అని దైవకార్యంతో నిమిత్తం లేకుండా ఊరికే సరదాగా నువ్వు ఏ సింహం నోట్లోనో తల దూర్చావంటే నీకు తగిన శాస్తే అవుతుంది. దైవాన్ని మన మెప్పుడూ సవాలు చేయ కూడదు!

*

ప్రశ్న: మధుమయీ 'క.' అనే ఆయన చాల ఏళ్లుగా ఏవేవో నొప్పులతో బాధపడుతున్నాడు – కాళ్లు, చేతుల మంటలు, నరముల బలహీనత మొ॥. వీటికి మూలకారణం చాతపడి కావచ్చునని తెలిసింది. ఇది నిజమేనా శ్రీమాతా? నీ కరుణా కటాక్షములతో అతనిని రక్షింప ప్రార్థన.

మొదట ఈ జబ్బుకు ఏమైనా బాహ్యకారణాలున్నయ్యేమో తెలుసుకోవాలి. పరిసరములు శుభ్రంగా వున్నాయో లేవో చూసు కోవాలి. ఒకవేళ చాతపడే కారణమైనట్లయితే భయపడకుండా నన్ను పిలిచి నా సహాయాన్ని, రక్షణని కోరమని చెప్పు. ఆ రోగ లక్షణాలన్నీ ఒక్క చిటికెలో మాయమైపోతాయి!

*

ఇవిగో "Aspiration in the physical" పుష్పములు – నా ప్రేమతో ఆశీర్వాదములతో ఇస్తున్నాను. నీ జబ్బును గురించి డాక్టర్లు

చెప్పిన మాటలు అసలు నమ్మవద్దు. నీ అంతట నువ్వే కోరు కుంటేతప్ప జబ్బు లెన్నటికీ సీరియస్ కావు

*

భయపడ వద్దు. పైకి కనపడుతున్న విషయాలను చూసి నేను మోసపోతాననుకుంటున్నావా? అసలు విషయాన్ని మాటల కతీతమైన నిశ్శబ్దంలో చూసి గ్రహిస్తాను.

నా అభయహస్త మెప్పుడూ నీ భుజం మీద ఉండి నీకు బలాన్నిచ్చి నిన్ను గైడ్ చేస్తూ వుంటుంది. నువ్వు నా కత్యంత ప్రియమైన వ్యక్తివి. విచారంగా వుండకు – సంతోషంగా వుండు. చీకట్లో పడి దిక్కుతోచక కొట్టుకోవద్దు. వెలుగులో నడు.

*

నేను నిరంతరం నీ తోనే వుంటాను. *జాగ్రత్తగా చెవి యొగ్గి విన్నట్లయితే నీ ప్రశ్నలకు నా సమాధానములను కూడ విన గలవు.* అపాదమస్తకము నీ శరీరమంతా ప్రశాంతమైనప్పుడు నేను నీతో ఉన్నట్లు కూడా చాలా నిశ్చయంగా తెలుసుకోగలవు.

శ్రీమాత


*

నిన్ను పరివేష్టించి రక్షిస్తూ, నిన్ను ప్రేమతో కాపాడుతున్న దెవర నుకుంటున్నావు? శ్రీమాతయే. *ఆమెమీదే ఆధారపడటం, ఆమె శక్తికి నీ హృదయద్వారములను తెరిచి వుంచటం నేర్చుకో.* అప్పుడు నీ మీదికి దాడిచేసే శక్తులు నీ జోలికి రావు. నిన్నె వరూ ఏం చేయలేరు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

మతము - యోగము



అఖిల

అఖిల భారత పత్రిక, నవంబరు 2001

మతము – యోగము

శ్రీమాత ప్రవచనములు

మానవజీవితము మూడు వేర్వేరు పంథాలలో నడుస్తుంది – నైతికము, ధార్మికము, ఆధ్యాత్మికము. అతని అభిరుచినిబట్టి అతనికేది కావలెనో దానిని ఎంచుకొనవలెను.

శ్రీఅరవిందులు

విషయసూచిక

అనుబంధం

మతానికి యోగానికి భేదము

శ్రీమాత ప్రవచనములు

ప్రశ్న: మధుమయీ! యోగానికీ మతానికి తేడా ఏమిటి?

శ్రీమాత: అయ్యో! నాయనా... నీ సందేహం పిల్లికీ కుక్కకీ మధ్య భేదమేమిటన్నట్లుగా ఉంది.

(కొంతసేపు మౌనంగా ఉన్నాక)

ఒక వ్యక్తి భగవంతుని గురించి ఏదో కొంత వినడమూ అతనున్నాడని నమ్మి అతనిని కనుక్కోవడానికీ, అతన్ని గూర్చి తెలుసుకోవడానికీ, అతనితో ఐక్యమవడానికీ, పట్టుదలతో, నియమ నిష్ఠలతో, ఏకాగ్రతతో కృషి చేస్తే, అది యోగం.

ఇదే వ్యక్తి తానవలంబించిన అన్ని పద్ధతులనీ ఉపయోగించి ఒక నిర్దిష్టమైన క్రమపద్ధతిని ఏర్పరచి, తను తెలుసుకున్నవన్నీ తిరుగులేని నియమాలని చెప్పి, దేవుడిలా ఉంటాడు, అతనిని తెలుసుకుందుకు మీరు యిది చెయ్యాలి, ఈ ముద్రలు పట్టాలి, ఈ క్రతువులు చెయ్యాలి. ఇదే సత్యమని నమ్మి "నేను దానినే సత్యముగా స్వీకరించి, దీనికే కట్టుబడి ఉంటాను. ఈ మార్గ మొక్కటే సరైనది" అనే నిర్దిష్టమైన నియమాలు, క్రతువులు, శాస నాలు చేస్తే అది మతం.

అనువాదం: బి. వరలక్ష్మి

So long as religions exist, atheism will be indispensable to counter-balance them. Both must disappear to make way for a sincere and disinterested search for Truth and a total consecration to the object of this search.

మతముల పుట్టుక

శ్రీమాత ప్రవచనములు

మతాలయొక్క అసలు సత్యాన్ని పట్టుకోవాల్నంటే వాటి పుట్టుపూర్వోత్తరాల్లోకి వెళ్లాలి. వాటి మూలపురుషుడెవరో అతను ఏం చెప్పాడో చూడాలి. కాని సాధారణంగా జరిగేదేమిటంటే అతని శిష్యులు, శిష్యుల శిష్యులు, అనంతర పరంపర ఆ మూల సత్యాన్ని వాళ్ల స్వంత వ్యాఖ్యానాలతో కప్పివేస్తారు. పిదప మతగురువులు వచ్చి ఏవేవో నిబంధనలు, శాసనాలు అంటూ కట్టడిచేసి వాటి నుల్లంఘించిన వారిని శిక్షిస్తామని బెదిరిస్తారు. ఎవరో అన్నట్లు ఒకవేళ క్రీస్తు గనుక బ్రతికివచ్చినట్లయితే తను ప్రవచించిన మతానికి నేడు పట్టిన దుర్గతిని చూసి నిర్ఘాంతపోతాడు!

— సంపాదకుడు

మతాలు మూలతః దివ్యములే కాని వాస్తవంలో కాదు

మానవుడు తన కతీతమైన జ్ఞానాన్ని పొందేందుకు మనస్సుతో, మేధాసంపత్తితో సలిపే కృషి యొక్క ఫలితమే మతము. సర్వమానవాళి భగవంతుడు, పరమాత్మ, సత్యము, శ్రద్ధ, జ్ఞానము, అనంతము, ఒక విధమగు బ్రహ్మస్వరూపమని పేరు పెట్టి పూజిస్తారే కాని దానిని మనస్సుతో అందుకోజాలరు. అయినను అందుకొనేందుకు ప్రయత్నిస్తారు. దానిని సమీపించుటకై మానవునిలోని ఈ ఉన్నతతర మనస్సు దాని శక్తికి సాధ్యమయిన పరిమితికి లోబడి చేయు ప్రయత్నమే మతము. మతము దాని మూలమునందు దివ్యము కావచ్చునుగాని. బాహ్యారూపమునందు, ఆచరణలోను కాదు, వాస్తవమునకు మనము మతము అని కాక మతములు అని చెప్పవలసి యున్నది. ఏలయన మానవుడు స్థాపించిన మతము లనేకములు. ఈ విభిన్న మతములన్నియు ఒకే విధముగా ఉత్పత్తికాకపోయినను వాటి రూపురేఖలన్నియు ఒకటే.

క్రీస్తు బోధలను ఆతని అనుచరులు వక్రీకరించారు

క్రైస్తవమత మెట్లు పుట్టినదో మనకు తెలియును. క్రైస్తవ మతమని పిలువబడు యీ మతమును నిజముగ జీసస్ క్రీస్తు ప్రారంభించి యుండలేదు. కొందరు పెద్దమనుషులు తెలివైన వాళ్లు కలసి ఇప్పుడు మనము చూచుచున్న యీ క్రైస్తవమతమును కల్పించియున్నారు. ఆ మతము రూపొందిన రీతిలో దివ్యమయిన దేదియును లేదు. ఆ మతము పనిచేయు రీతిలో, ఆచరణలో, దివ్యమయిన దేదియును లేదు. కాని ఆ మత మేర్పడుటకు ఒక సాకు, సందర్భము నిశ్చయముగా, ఎచ్చట నుండియో ఇట అవతరించి, ఒక ఉన్నతతర లోకమునుండి జ్ఞానమును, సత్యమును భూమిపైకి తెచ్చిన ఒక దివ్యమూర్తి యనదగు వానినుండి లభించిన ఆత్మప్రకాశమే. అతడు భూమిపైన అవతరించి, తాను బోధించిన సత్యము కొరకై పాటుపడ్డాడు. బలియై పోయాడు. కాని అతడు బోధించిన దానిని కొలదిమంది మాత్రమే అర్థము చేసికొనగలిగిరి. ఆ సత్యమును కొందరు మాత్రమే తెలిసికొనుటకు శ్రద్ధ వహించి, అనుసరింపగలిగిరి.

బుద్ధుని జీవితకాలంలోనే అతని శిష్యులు పక్కదోవ పట్టారు

బుద్ధుడు ప్రపంచమును విడిచి సన్యసించి, బోధి వృక్షము క్రింద ధ్యానమగ్నుడై, మానవుల బాధాదుఃఖములు తొలగిపోవుటకు – వ్యాధి, మృత్యువు, వాంఛ, పాపము, ఆకలి – వీని నుండి తప్పించుకొనుటకు మార్గమును కనుగొనినాడు. అతడొక సత్యమును సందర్శించినాడు. తన చుట్టూ చేరిన శిష్యులకు, అనుచరులకును దానిని బోధించ ప్రయత్నించినాడు. కాని బుద్ధుని మహానిర్వాణమునకు పూర్వమే, వాని ఉపదేశము వికృతమై పోనారంభించినది. బుద్ధుని నిర్వాణానంతరమున, అతనిచే చెప్పబడినవని భావింపబడిన సిద్ధాంతములపై స్థాపింపబడి, పూర్తిగ విస్తరించిన మతముగా బౌద్ధమతము తలయెత్తినది. కాని శీఘ్రకాలముననే, బుద్ధుని శిష్యులు, ఆ శిష్యుల శిష్యులు, శిష్యప్రశిష్యులు, బుద్ధభగ

వానుడు బోధించిన దాని విషయమై ఒక అంగీకారమునకు రాలేకపోయారు. అందుచే ఆ మతము నందనేక శాఖోపశాఖలు — దక్షిణపథమని, ఉత్తరపథమని, దూర ప్రాచ్యపథమని ఏర్పడి, ప్రతి శాఖయు అది మాత్రమే అసలైన అకళంకమైన బౌద్ధమత సిద్ధాంతమును తెలిసియున్నదని వాదింప జొచ్చినది.

'గురువుల' చేతుల్లో మతాల రాజకీయీకరణ

అదే గతి క్రీస్తుబోధకుకూడ పట్టినది. అదే విధముగ అదికూడ ఒక వ్యవస్థితమైన మతమైనది. ఒకవేళ జీసస్, పునరుత్థానము పొంది, తిరిగి జీవించవచ్చినచో తాను బోధించిన సత్యముపైన ఆపాదింపబడిన వికృతరూపములలో తాను బోధించినదానిని తానే గుర్తింపజాలడనియు, బుద్ధుడొకవేళ తిరిగి జీవించి వచ్చినచో తన ఉపదేశమునకు బట్టిన దుర్గతిని చూచి, నిరుత్సాహముతో వెంటనే వెనుకకు పరుగిడి నిర్వాణమును పొందునని తరచు అనుచుందురు. అన్ని మతముల గతి యింతే, అన్నిటి కథ ఒకటే. *ఒక మతము పుట్టుటకు కారణము, సందర్భము ఒక మహనీయుడైన జగద్గురువు ప్రపంచమునందు జన్మించుటయే.* అట్టి మహనీయు డవతరించును, దివ్య సత్యస్వరూపుడై ఆత్మప్రకాశము ప్రబోధము చేయును. కాని మనుషులు అతడు చెప్పిన దానిని పట్టుకొందురు, దానితో వ్యాపారము చేయుదురు. దాని ద్వారా ఒక రాజకీయమైన ముఠాగా ఏర్పడుదురు. వారు మతమును ఒక పాలనా విధానము, శాసనములు, మూఢవిశ్వాసములు, మూర్ఖసిద్ధాంతములు, నియమనిబంధనలు, కర్మలు, ఉత్సవములతో ఒక ప్రభుత్వమును తయారు చేసియున్నారు. ఆ మతస్థులు వాని నన్నిటిని విధిగా పాటించవలెను. ఉల్లంఘించ రాదు.

అనువాదం: కె.ఎస్. భాస్కరరావు (శ్రీమాత సంభాషణలు)

మతాలలో ఉన్న ప్రధానమైన దోషము

శ్రీమాత ప్రవచనములు

మతం వేరు, సత్యం వేరు. సత్యమనగా స్వేచ్ఛ. అది బహు ముఖం, అనంతం. మతమనగా కొన్ని శాసనాలు కట్టుబాట్లు, పాపాలు, పుణ్యాలు – అది ఓ తతంగము. కొన్ని నియమాలకు కట్టుబడి వుండకపోతే మనిషి నరకానికి పోతాడు. ఈ కట్టుబాట్లను అమలుపరిచేందుకు మతాధికారులు, అధికారం ఎక్కడ వుంటే అక్కడ నేరాలు, శిక్షలు మొదలయిన ఘోరమయిన పరిణామాలు – ఇదండి కొన్ని మతముల యొక్క నేటి స్వరూపము. ఒక మనిషికి జ్ఞానోదయమైనప్పుడు అతను దైవ సాన్నిధ్యాన్ని పొందుతాడు. అనంతంలో మునిగిపోతాడు. ఇంకో మనిషికి జ్ఞానం కలిగినప్పుడు అతని అనుభూతి మరో రకంగా వుంటుంది. అందుకని వాళ్లు నేను గొప్పంటే నేను గొప్పని పోట్లాడుకో కూడదు. వాళ్లు జ్ఞానంయొక్క పాక్షిక స్వరూపాన్ని మాత్రమే తెలుసుకున్నారు. – సంపాదకుడు

వ్యక్తి తన విశ్వాసాన్ని సమిష్టిమీద రుద్దకూడదు

ప్రపంచాన్ని గురించి గాని విశ్వాన్ని గురించిగానిఏర్పడే ఓ విశ్వాసాన్ని మనం మతం అంటాము. దానినే సంపూర్ణ సత్యంగా ప్రదర్శించి దానిలో సంపూర్ణ విశ్వాసం ఉండాలంటాము. ఎందుకంటే సాధారణంగా ఈ సత్యం దర్శనఫలితంగా వచ్చిన సత్యం అని ప్రకటిస్తాము.

చాలా మతాలు భగవంతుడున్నాడని నిర్ధారిస్తాయి. ఆయనకు విధేయమై ఉండటానికి అవసరమైన నియమాలను చేస్తాయి. కాని దేవుడు లేని మతాలు కూడా ఉన్నాయి. ఒక ఆదర్శం పేరుతోనో, రాజ్యవ్యవస్థ పేరుతోనో తమకు విధేయంగా ఉండాలని కోరే సాంఘిక-రాజకీయ వ్యవస్థలు ఇటువంటివే.

యథేచ్ఛగా సత్యాన్ని అనుసరించటం, తన సొంతదారిలో దాన్ని చేరటం మానవుని హక్కు. కాని తాను కనుగొన్న సత్యము

తనకు మాత్రమే వర్తిస్తుందనీ ఇతరులమీద విధించవలసినది కాదని తెలుసుకోవాలి.

*

మతం పేరుతో జరిగిన ఘోరాలు

ఎప్పుడూ మతాలు పొరపాటు చేసేది ఇందువల్లనే. ఎందుకంటే ఒక అనుభవ ప్రకటనను ప్రామాణీకరించాలని, తిరుగులేని సత్యంగా ప్రతివారి మీదా రుద్దాలనీ అవి కోరతాయి. దాన్ని పొందినవానికి ఆ అనుభవం నిజమే, సంపూర్ణమే, విశ్వాసనీయమే. కాని ఇతరులమీద దాన్ని విధించాలనుకోవటం మౌలికమైన తప్పిదం. దాని పర్యవసానాలు వినాశకరంగా ఉంటాయి. మనుషులను సత్యాన్నించి దూరంగా, చాలా దూరంగా తీసుకొనిపోతాయి.

ఎంత న్యాయంగా ఉన్నా మతాలన్నీ ఈ కారణంచేతనే మనుష్యులకు అత్యంత హేయమైన దురాగతలవైపు నడిపించాయి. మతం పేరుతో సాగించిన నేరాలు, భయంకరకృత్యాలు అన్నీ మానవచరిత్రమీద మాయనిమచ్చలుగా మిగిలిపోయాయి. ప్రారంభంలో జరిగిన ఈ చిన్నతప్పు – అంటే, ఒక వ్యక్తికి నిజం అయినదేదో సమస్త జనులకూ లేదా సామూహిక వ్యవస్థకు కూడా నిజం కావాలని కోరటమే దానికి కారణం.

*

సత్యాన్ని నిర్వచించబూనటం మూఢత్వం

చక్కగా నిర్వచించి చక్కగా వర్గీకరించిన సత్యాన్ని తెలుసుకోవాలనుకుంటావు. ఆ తర్వాత విశ్రమిస్తావు. దాన్నే "ఇదిగో సత్యం ఇదే" అంటావు. ఆ తర్వాత అదే స్థిరపడిపోతుంది. మతాలన్నీ చేసింది అదే. తమ సత్యాన్ని అవి మూర్ఖవిశ్వాసంగా స్థాపించాయి. కాని ఇకమాత్రం అది సత్యం కాదు.

*

మతాలకు కాలం తీరిపోయింది

మనుష్యులు మతాన్నే ఎందుకు అంటిపెట్టుకుంటారు? మతాలు విశ్వాసాలమీద

ఆధారపడినవి. తేలికగా గ్రహించటానికి వీలైన స్థాయికి క్రిందికి తీసుకొని వచ్చిన ఆధ్యాత్మిక అనుభవాలు అవి. అయితే అలా చేయటంలో సమగ్ర పరిశుద్ధత, సత్యం మాత్రం ఎగిరిపోయాయి.

మతాలకు కాలం చెల్లిపోయింది

విశ్వజనీనమై ఆధ్యాత్మికమై తొలి పరిశుద్ధత నష్టపడని ఆధ్యాత్మిక అనుభవానికి చెందిన యుగంలో మనం ప్రవేశించాము.

*

మతాలు ఆధ్యాత్మిక సత్యంయొక్క కురూపాలు

నా మటుకు నాకు ఇవి అంతగా ముఖ్యమైనవి కావు. నాకు ఏ మతంతోనూ అనుబంధం లేదు. అనుబంధం లేనప్పుడు వైముఖ్యమూ ఉండదు. నాకు మతాలు ఆధ్యాత్మిక జీవితానికి చెందిన మానవసంబంధమైన రూపాలు. ప్రతీదీ ఏకైకము, నిత్యము అయిన సత్యానిదే అయిన ఒక రూపాన్ని ప్రకటిస్తుంది. కాని ఇతరరూపాలను తొలగించి ప్రకటించటం వల్ల ఆ రూపం వికృతమై క్షీణించిపోతుంది. తాను మాత్రం నిజ మని చెప్పటంకోసం ఇతరమైనవాటి సత్యాన్ని కాదనటానికి దేనికీ హక్కు లేదు. అవన్నీ కలిసినా ప్రతిదానిలోనూ అధివసిస్తూకూడా సమస్త ప్రకటనకూ అతీతమైన పరమసత్యాన్ని వెల్లడించటానికి సరిపోవు.

*

దైవం సమస్త సృష్టికీ తన్నుతాను ఇచ్చుకొంటాడు. ఆయన అను గ్రహానికి ఏ మతానికీ ఏకస్వామ్యం (monopoly) లేదు.

*

మతములు పరస్పర విరుద్ధములుగా ఉండే బదులు పరస్పర పూరకములుగా ఉండాలి.

*

ఆరాధన, భక్తి, అంకితభావం కల మతానుభూతి ఆధ్యాత్మిక భావ నకు విరుద్ధం కాదు. కాని మతాల దోషం ఏమంటే, ఏకైక సత్య మని ఒకే ఒక సూత్రాన్ని పట్టుకుని వ్రేలాడే స్థిరమైన మనస్సు. సూత్రాలన్నీ సత్యానికి మానసిక ప్రకటనలే అనీ, ఈ సత్యాన్ని

అనేక ఇతర విధానాలలో కూడా ప్రకటించవచ్చుననీ మనం సర్వదా జ్ఞాపకం పెట్టుకోవాలి.

*

మతాలపట్ల అవలంబించవలసిన దృక్పథం:

ఆరాధకులందరిపట్ల ఉదారమైన సౌజన్యత
అన్ని మతాలపట్ల సౌహార్ధవంతమైన ఉదాసీనత
అన్ని మతాలూ తమకు పైన ఎంతో దూరాన ఉన్న ఒకే ఒక సత్యానికి సాక్షికమైన రమారమి రూపాలు.

అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రరావు

మతాలు అజ్ఞానాన్నే కొనసాగిస్తాయి

శ్రీమాత ప్రవచనములు

జ్ఞానము అనంతం. కాని సాధారణప్రజకు దానిని పొందటం దుర్లభం. ఎందుకని? ఉష్ట్ర పక్షి తలను నేలలో పెట్టుకొని అదే లోకమనుకుంటుంది. మనుషుల విషయంలోకూడ అంతే! పాక్షిక జ్ఞానం చాలా ప్రమాదము. కళ్లకు గంతలు కట్టుకుంటే మార్గం ఎలా కనబడుతుంది? జ్ఞానమన్నది పెక్కు శ్రేణులలో విస్తరించి వుంటుంది గదా. ఈ మతాలన్నీ కలుపుతే అందులో ఒక మూలకికూడ రావు. కాని సాధారణ మానవులకీ విషయం అర్థం కాదు. అందుకని జ్ఞానాన్ని కొన్ని నియమాలతో పరిమితం చేసి జనసామాన్యానికి అందుబాటులో చేసింది మతం. కాని ఎప్పటికి ఈ అజ్ఞానాన్నే పట్టుకొని ఉండటం తగదు.

— సంపాదకుడు

విద్యావలన చేతనాభివృద్ధి

నువ్వు చదువుకోవటం మొదలుపెడితే నీలో కొన్ని విచిత్రమైన మార్పులు వస్తాయి. నీ జ్ఞాననేత్రం తెరుచుకొంటుంది. నీలో

చేతన జాగృతమౌతుంది. ఇంతకుముందు తెలియని విషయాల నెన్నిటినో (కేవలం కంటికి కనపడేవికాకుండా) తెలుసుకోగలుగుతావు. అదివరకు ఒక ఆవిడ నా దగ్గరకు వచ్చి నేను చెప్పినట్టుగా చేయటంవలన తన చేతనని విశాలపరచుకొన్నది. అదివరకు తెలియని రహస్యాలెన్నో ఆమెకు ఇప్పుడు తెలియవచ్చినాయి. ఇక ఆమెకు ఒకటే ఆశ్చర్యం! నాతో ఈ విధంగా అంది. "ఇంతకు ముందర నేను మనుషులలోని సజ్జనత్వాన్నే చూసేదాన్ని. అందరు ఎంతో మంచివాళ్లని సంతోషపడేదాన్ని. కాని చేతన పెరగటంవలన వాస్తవమేమిటో నాకు ఇప్పుడు తెలుస్తోంది. నా అభిప్రాయాలను మార్చుకోవలసి వస్తోంది. అదివరకు కుదురుగావున్న మనస్సు ఇప్పుడు చెదిరిపోయింది. చేతన జాగృతమైనాకూడ ఒక విధంగా ప్రమాదమే మరి!"

> *మూసలో పోసిన జ్ఞానం సత్యం కానేరదు*

అయితే ఏమి చేయాలి? నీ చైతన్యస్థాయిని ఇంకా పెంచుకోవాలి మిడిమిడి జ్ఞానం హానికరం. తనకు ఏమీ తెలియదు అని తెలుసుకునే స్థితి వచ్చేవరకూ ఇంకా నేర్చుకుంటూనే ఉండాలి. కొత్తగా మతస్వీకారం చేసిన ఒకతని సంగతి నీకు చెప్పానుకదా! చివరకి తనకు చెప్పడానికేమీ లేదు అనుకునే రోజు వచ్చేదాకా అతడు ఎప్పటికప్పుడు తాను నేర్చిన దానిని ఇతరులకు అందజేయాలని తహతహలాడుతూ ఉండేవాడు. మతబోధలన్నీ, సామాన్యంగా ఇలాగే నడుస్తూ ఉంటాయి. చాలా కొద్ది జ్ఞానంతో, బాగా సూత్రీకరించి కూర్చిన కొన్ని ఖండితమైన సూత్రాలను మనసులో దృఢపరచుకొని, "అదే అసలైన సత్యం" అనుకుంటారు. "ఎంత సులభం! పుస్తకం చూసి చదువుకోవడమే!" అనే ఊహ కలుగుతుంది. అన్ని మతాలలోను ఇటువంటి గ్రంథం ఒకటి ఉంటుంది. ప్రశ్నోత్తరముల ఫక్కీలో రూపొందిన బోధామృతమైనా, హిందూగ్రంథాలైనా, ఖురానైనా, – ఒకటేమిటి, అన్ని మతగ్రంథాలూ అంతే – వాటిని కంఠస్థం చేస్తే చాలు. అదే సత్యము అని అంటారు. ఆ ప్రకారం నీవు వాటిని చదువుకొని నిశ్చింతగా ఉంటావు. అది చాలా వీలు.

నీకు అర్థం చేసుకోవాల్సిన తంటాలేదు. ఈ విధంగా నీకు బోధపడినది ఇతరులకు తెలియకపోతే వారంతా అజ్ఞానంలో ఉన్నట్లే అంటావు. నీవు వారికోసం భగవంతుని ప్రార్థిస్తావు కూడా. ఇది అన్ని మతాలకు వర్తించే విషయము.

మతాలు అజ్ఞానానికి మారుపేరు

కాని మతాలన్నిటిలోనూ కొంతమంది తెలిసినవారు ఉంటారు. ఇట్టి విషయాలను వారు నమ్మరు. అటువంటివారిని ఒక్కరిని నేను కలుసుకున్నాను. ఆయన చాలా ఘటికుడైన కేథలిక్ మతస్థుడు. మతాన్ని గురించి నాకు తెలిసినంతవరకు ఆయనతో మాట్లాడి, "మీరు ఈ పద్ధతినెందుకు అనుసరిస్తారు, అజ్ఞానాన్ని సుస్థిరపరుస్తున్నారెందుకు" అని అడిగాను. దానికి ఆయన *"ఇది మనశ్శాంతిని కూర్చే విధానం. మనం అలా చెప్పకపోతే ఎవరూ మనమాట వినరు. ఇది మతాలలో ఉండే మర్మం"* అని సమాధానం చెప్పి, "మా మతంలోకూడా పురాతనమతాలలో మాదిరిగా బాగా జ్ఞానులు ఉన్నారు. పురాతనసాంప్రదాయమును నేర్చే పాఠశాలలున్నాయి. కాని, దానిని గురించి మేం మాట్లాడకూడదు. అక్కడతప్ప ఇవతల దానిని నేర్పించరు. మతసంబంధమైన ఈ ఆడంబరాలన్ని వాటికి భిన్నములు

మతాలు కొనసాగేందుకు కారణం

దీనికి కారణం దయ, ఔదార్యం అని వారి అభిప్రాయం. ఎందుకంటే, *"మామూలు మనుష్యుల మెదడు చాలా చిన్నది. మనం మరీ పెద్దవిషయాలనుగురించి చెపితే వారికి కష్టమవుతుంది. అర్థంకాదు. సుఖం కోల్పోతారు.* అటువంటప్పుడు, అనవసరంగా వారిని బాధపెట్టడమెందుకు? వారికి సత్యం కనుక్కోగల సామర్థ్యం లేదు. అంతకంటే 'దీనిని నమ్మితే స్వర్గానికి వెడతావు' అని చెపితే వారికి బాగా నచ్చుతుంది" చూసారా, ఇది ఎంత వీలైన పద్ధతో! అందువల్లనే దీనిని స్థిరపరచడం జరుగుతున్నది. అలా చేయకపోతే మతాలుండవు.

అనువాదం: ఎ.వెంకటరామ శాస్త్రి, ఎ.ప్రభావతి

(ప్రశ్నోత్తరములు 1953)

మతాలు ఆధ్యాత్మిక జీవితానికి అవరోధాలు

శ్రీమాత ప్రవచనములు

మతమనగానే మనకు కనపడేది తంతు, తతంగము. ఇది నిజమైన ఆధ్యాత్మికసత్యానికి మనస్సు ఇచ్చిన కురూపము. అయితే సత్యము వీటి కతీతము. నువ్వు ఈ బాహ్యాకర్మకాండలనే పట్టుకొని కూర్చుంటే ఆధ్యాత్మికంగా పురోగమించలేవు. అయితే కొంతమంది మేధావులు మట్టుకు ఈ లాంఛనాలతో మోసపోకుండా వాటి మరుగునవున్న సత్యాన్ని దర్శించగలుగుతారు. అంతరంగిక తపనతో దైవానుభూతినికూడ పొందుతారు.

— సంపాదకుడు

మతసిద్ధాంతములు సంకుచితములు

మతసిద్ధాంతములు, మూఢాచారములు మనస్సు కల్పించినవి. నీవు వాటిని పట్టుకువ్రేలాడుచు, ఏర్పాటైన గట్టి ఆచారపద్ధతికి కట్టుపడి జీవించినచో, అన్ని మూఢమతాచార పద్ధతుల కతీతమై విశాలమై, ఉదారమై, స్వతంత్రమై విలసిల్లు సత్యస్వరూపము నెరుగవు. ఎరుగజాలవు. ఒక మతసిద్ధాంతముతో నీవాగిపోయి, దానికి కట్టుపడియున్నచో, లోకమున అదియే సత్యమని నమ్మియున్నచో నీ అంతరాత్మ అభివృద్ధిని, విస్తృతిని నిరోధింతువు.

*

నా మతం గొప్పదంటే నా మతం గొప్పది

ప్రపంచమున స్థిరపడి ఆచారవ్యవహారములలో మునిగిన ఈ మతముల సిద్ధాంతములు ఇట్లుండును: "నా మతమే గొప్పది. పరమోత్కృష్టమైనది, సత్యమైనది. ఇతర మతములన్నియు అసత్యములు, హీనములు." ఏలయన ఇట్టి మూర్ఖసిద్ధాంతములు లేనిచో, మతములు నిలువజాలవు. మహోన్నతమైన ఏకైక సత్యమును నీవు మాత్రమే కనుగొనినావని

నీవు నమ్మినచో, గొంతెత్తి ఉద్ఘాటింపనిచో నీవు జనులకు నచ్చ చెప్పజాలవు. వారు నీ చుట్టూ గుమిగూడి యుండరు.

*

శక్తిసామర్థ్యములున్నవారు ఏదో ఒక మతాన్ని అనుసరిస్తూ పురోగమించి దైవంతో సారూప్యాన్ని పొందగలరా?

అది అసంభవము.

మతం ఆత్మపురోగతి కెప్పుడూ అడ్డుతగులుతుంది. మానవుడు తన మానసిక అభిప్రాయాలనూ, జీవితపరిమితులనూ వదలి ఆధ్యాత్మికజీవితం మొదలుపెడితే, తద్వారా మతసూత్రాలను అధిగమించి ఉన్నతభూమికలలోకి ప్రవేశించగలడు. ఆ విధమైన అర్పణ లోపలినుంచి రావలసిందేగాని బాహ్యాచారాల ద్వారా కాదు. అది కేవలం బాహ్యాచార ప్రధానమే అయితే హద్దులు మరీ ఎక్కువై ఒక్క అడుగైనా ముందుకు వేయలేరు.

పురోగతి ఆగిపోవడం యిష్టం లేనపుడు, కొంతమంది తప్పనిసరిగా మతంలోనుంచి బయటకు రావలసి వస్తుంది. మానసికమైన వ్యథ లేకుండా తమను తాము ఎక్కువ ప్రశ్నించుకోకుండా, హృదయంలో మాత్రం మిక్కుటమైన భక్తిప్రపత్తులు కలిగి, కేవలం అనంతమైన గొప్పశక్తికి తమను తాము సమర్పించుకోవాలని ఉత్కాంక్షించేవారికి మతం ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. బాహ్యాచారాల మీద మమకారంగలవారు ఎన్నటికీ పురోగమించలేరు.

మతబంధాలనుండి విముక్తమై వెలుగుబాటలో నడుస్తేతప్ప అంతదూరం వెళ్ళలేరు. పురోగతికి ఇది తప్పనిసరి. తెలివితేటలు ఏమాత్రమూ లేని దద్దమ్మలు ఏమీ వాదించకుండా బాహ్యాచార విధుల నన్నిటినీ అనుసరిస్తారు. అవే దైవంతో తమకు సాన్నిహిత్యం కల్పించగలవనీ, వాటియెడ తమకు ఏర్పడిన యీ ఆంతరికాభినివేశం దేనివలననూ నిరోధింపబడదనీ వీరి భావన. కాని, నిజానికి వీరికి మానసికజీవితం లేదు. అది చాలా పరిమితము.

అనువాదం: కె.యస్. భాస్కరరావు (శ్రీమాత సంభాషణలు);
ఎ. వెంకటరామ శాస్త్రి, ఎ. ప్రభావతి, (ప్రశ్నోత్తరములు)

మతాలు లాంఛనప్రాయం మాత్రమే

శ్రీమాత ప్రవచనములు

నువ్వు పల్లెటూరిలో బ్రతకాలంటే మతం పేరుతో జరిగే పండగలు, పబ్బాలు మొ॥ సామూహిక కార్యక్రమాలలో పాల్గొనవలసి వస్తుంది. ఇది కేవలం సాంఘికం మాత్రమే. అందులో ఆధ్యాత్మికమేమి లేదు. మతాచార్యులు చేసే ప్రవచనాలు లాంఛనంగా చేసేవేగాని దార్శనిక సంపత్తితో కాదు. శ్రీమాత ఒకసారి ఒక క్రిష్టియన్ మిషనరీని కలుసుకొని "నువ్వెక్కడికి వెడుతున్నావు" అని అడిగేరు. అతను చైనా వెడుతున్నానని, అక్కడి 'అనాగరిక' ప్రజలను క్రిష్టియనులుగా మార్చి వాళ్లను రక్షిస్తానని చెప్పేడు. అంతట ఆమె "వాళ్లు నీకంటె కొన్ని వేల సంవత్సరాల పురాతన నాగరికతా సంపన్నులు. పశ్చిమదేశవాసులను వాళ్లు బర్బరులుగా పరిగణిస్తారని నీకు తెలియదేమో" అని దెబ్బ కొట్టారు. — సంపాదకుడు

ప్రశ్న: మదర్, ఈనాడు ప్రపంచంలో చాలామంది ఏదో ఒక మతాన్ని అవలంబిస్తారు. అది వారికి సహాయపడుతుందా?

బహుశా వాళ్లు ఇప్పుడు మళ్లి మతాన్ని పాటిస్తున్నారేమో. ఈ శతాబ్దం మొదట్లో మతం విజ్ఞానానికి వ్యతిరేకమని మేధావులు కొందరు త్రోసిపుచ్చారు. ఇటీవల ఈ అభిప్రాయం మార్పుచెంది సత్యాన్వేషణ ఉద్యమం ప్రారంభమయింది.

ఇతరుల దృష్టిలో మంచివారని అనిపించుకోవటానికి మతాన్ని సాంఘిక అలవాటుగా పాటిస్తున్నారు కొంతమంది. ఉదాహరణకు ఒక గ్రామంలో ఉంటూ మతపరమయిన కార్యక్రమాలకు వెళ్లకపోతే ఇరుగు పొరుగు వారంతా మిమ్మలను వేలెత్తి చూపుతారు. అయితే మతానికీ, ఆధ్యాత్మిక జీవితానికీ ఏ మాత్రం పొంతన లేదు.

(నిశ్శబ్దం)



THE MOTHER

మొదటిసారి నేను భారతదేశానికి వచ్చినప్పుడు జపాన్ నౌక మీద ప్రయాణం చేశాను. అదే నౌకమీద ఇద్దరు మత గురువులున్నారు. ఇద్దరూ ప్రొటెస్టెంటులే అయినా విభిన్నశాఖలకు చెందినవారు. ఏ శాఖలో నాకు నిర్దిష్టంగా గుర్తు లేదు. అయినా ఇద్దరూ ఆంగ్లేయులే. వారిలో ఒకరు ఆంగ్లికన్, మరొకరు ప్రెసి బిటేరియన్ అనుకుంటాను.

అదివారంనాడు సర్వీసు (క్రైస్తవ మతాచారము) జరగవలసి ఉన్నది. కార్యక్రమానికి హాజరుకానివాళ్లని వాళ్లు heathens అంటారు. కార్యక్రమం జరగాలి. అయితే దానిని ఎవరు జర పాలి? ఆంగ్లికన్ మతగురువా లేక ప్రెసిబిటేరియన్ మతగురువా? ఇది తగాదాకు దారి తీసింది. ఆఖరికి ఆ ఇద్దరిలో ఒకరు హుందాగా తప్పుకున్నాడు. ఆ ఇరువురిలో ఎవరని గుర్తులేదుగానీ బహుశా ఆంగ్లికన్ అయి ఉండవచ్చు – కార్యక్రమాన్ని ప్రెసిబిటేరియన్ నిర్వహించాడు.

నావలోని హాల్లో (lounge) కార్యక్రమం జరగాలి. పైఅం తస్తు (deck) నుండి కొన్ని మెట్లు దిగి హాల్లోకి వెళ్ళాలి. అప్పుడు మేము ఎఱ్ఱసముద్రం మీద ఉన్నాం. ఉక్కపోతగా ఉంది. మగ వారంతా లాంఛనపూర్వకంగా జాకెట్లు, బిగుతు కాలర్లు ధరించి, చర్మపు బూట్లు వేసుకున్నారు. నెత్తి మీద టోపి, చంకన పుస్త కంతోసహా పైఅంతస్తునుండి హాల్లోకి దిగారు. మహిళలుకూడా టోపీలు పెట్టుకుని ఎండగొడుగులు పట్టుకున్నారు. ప్రార్థన పుస్త కాలు చంకన పెట్టుకున్నారు.

అందరూ హాల్లో సమావేశమయ్యారు. ప్రెసిబిటేరియన్ ప్రసంగం చేశాడు. అంటే బైబిల్ చదివాడు. అందరూ చాలా భక్తితో విన్నారు. ప్రసంగం ముగియగానే, విధులు నిర్వర్తించిన వారివలె చాలా సంతృప్తిగా మరల వెనుదిరిగారు. అయిదు నిమిషాల్లో బార్‌లో మద్యం సేవిస్తూ, పేకాట ఆడుతున్నారు. మత ప్రసం గాన్ని మరచిపోయారు. తమ కర్తవ్యం నిర్వర్తించారు. అది ముగి సింది. దానిని గురించి ఇంకేదీ ఆలోచించే పని లేదు.

మతగురువు వచ్చి నేనెందుకు ప్రార్థనకు వెళ్లలేదో నమ్ర గానే అడిగాడు. అందుకు నేనిచ్చిన సమాధానం.

"క్షమించాలి. మతంలో నాకు విశ్వాసం లేదు."

"అయితే నీవు నాస్తికురాలివా?"

"కానే కాదు"

"అయితే మరెందుకు విశ్వాసం లేదు."

"నేను చెబితే మీరు ఒప్పుకోరు. నేనేమీ చెప్పకపోవడమే మంచిది."

ఆయన బలవంతం మీద చివరకు చెప్పవలసి వచ్చింది.

"చూడండి, మీలోగానీ, మీ అనుయాయుల్లోగానీ ఎవరి ఆత్మశుద్ధి లేదని భావిస్తున్నాను. సాంఘికంగా కర్తవ్యాన్ని నిర్వర్తించేందుకు మీరంతా అక్కడ సమావేశమయ్యారేగానీ, భగవంతుని సాన్నిహిత్యం కోసం కాదు."

"భగవంతుని సాన్నిహిత్యమా! అది మనవల్ల గాదు! మన చేయగలిగిందంతా ఏవో కొన్ని మంచిమాటలు చెప్పడమేగానీ భగవంతుని సంసర్గానికి మనకు శక్తి చాలదు."

అప్పుడు నేనన్నాను. "అందువల్లనే నేను వెళ్లలేదు. దానిలో నాకు ఆసక్తి లేదు."

ఆ తర్వాత ఆయన నన్ను ఎన్నో ప్రశ్నలడిగి, heathen ని మతమార్పిడి చేయించేందుకు తాను చైనా వెడుతున్నట్టు అం కరించాడు. నేనప్పుడు ముక్కుమీద వేలు వేసికొని గంభీరంగ అన్నాను. "ఔరా! మీ మతం పుట్టక ముందే – రెండువేల సం త్సరాలు కూడా కాలేదు – చైనావారి సంస్కృతి చాలా గొప్పది సంసర్గ మార్గం వారికి తెలుసు. పాశ్చాత్యులు అనాగరికులని వా ఉద్దేశ్యం. అయితే మీకంటే గొప్పవాళ్లని మతం మార్పిడి చేసే దుకు మీరు వెడుతున్నారా? వారికి ఏమి నేర్పాలనుకుంట న్నారు? నిగూఢ వేదాంతంలో ఆధ్యాత్మిక చైతన్యానికి దారితీసే జీవనం గడిపేవారికి కపటంగా మసలటం నేర్పి, అర్థంలేని జీ తానికి దారి చూపటానికా? మీరు చేసేది అంత మంచిపని అ నేననుకోను."

పాపం, ఆ మాటలకు ఉక్కిరిబిక్కిరయి నాతో ఇలా ఉన్నాడు. "ఆహా! మీ మాటలు నన్ను ఒప్పించ లేవనుకుంటా."

నేనన్నాను "మిమ్మలను ఒప్పించాలని నేను ప్రయత్నించటం లేదు. పరిస్థితిని వివరించాను అంతే. ఇంతకు ముందరే జ్ఞానం పండించుకొనియున్న ఆ జాతికి మీరింకా ఏం బోధించాలని అనుకుంటున్నారో నాకు సరిగా అర్థంకావటం లేదు. అంతే"

ఆ సంభాషణ అంతటితో ముగిసింది

అనువాదం: డా॥ జె. మంగమ్మ

దేవాలయాలు, అందలి మూర్తులు

శ్రీమాత ప్రవచనములు

మనుషులెంతో భక్తితో గుడికి వెళ్లి దేవుణ్ణి ఆరాధిస్తారు. కాని మన ఆధ్యాత్మికజ్ఞానం పెరుగుతున్నకొద్దీ సృష్టిలోని విచిత్రమైన విషయాలు కొన్ని మనకు తెలుస్తూ వుంటాయి. దేవుడు గుళ్లను క్షుద్రదేవతలు ఆక్రమించుకొని మనుషులపై అధికారాన్ని చెలాయిస్తూ వుంటాయి. మనుషులు కోరే నీచమైన స్వార్థపరమైన కోరికలను తీరుస్తూ, తమ శక్తితో మనుషులను మభ్యపెట్టి వారి వారి ఆవేదనలతో ఆవేశాలతో కడుపునింపుకుంటూ ఆ అసురశక్తులు అక్కడి వాతావరణాన్ని కలుషితపరుస్తాయి.

— సంపాదకుడు

దేవాలయాలలో దేవుడున్నాడా?

ఏ దేవాలయం సందర్శించినా, ఏ చర్చిలో అడుగిడినా అది ఏ మతానికి సంబంధించినదైనా వాటన్నిటిలోని వాతావరణం ఒకే విధంగా ఉండటం గమనించాను. చర్చి, దేవాలయం ఒకటే కాకపోయినా, అక్కడుండే మూలవిరాట్ ఒకరే కాకపోయినా, అది ఫ్రాంసులోనైనా, జపాన్‌లోనైనా, ఎంతటి ఉత్కృష్టమతానికి చెంది

నదైనా, నేను సందర్శించిన అన్నిచోట్లా నాకు అనుభవమైంది ఒకటే. అక్కడ కేంద్రస్థంగా ఉన్న శక్తి ఏదైనప్పటికీ అది దాన్ని సందర్శించే భక్తుల విశ్వాసాన్ననుసరించి ఉన్నట్లు నాకు బోధ పడింది. అంతేకాదు. అక్కడున్న శక్తి ఒకటైతే, భక్తుల కనుభూతమయేది మరొకటి. దీనికి దృష్టాంతంగా ఫ్రాంసులోని అత్యంత సుందరమైన కేథెడ్రల్ (బిషప్ ఉండే అతి పెద్ద క్రైస్తవ ఆలయం) లో నేను చూసిన సంగతి ఒకటి చెపుతాను. కళాభిరతితో చూస్తే అత్యద్భుతమైన ఆ భవనంలో లోపల నాకు కనిపించింది మాత్రం బృహత్తరమైన ఒక నల్లని ప్రాణిక సాలెపురుగు (vital spider). లోపలి పవిత్రప్రదేశంలో స్థావరమేర్పరచుకొన్న ఆ ప్రాణికజీవి ఆ ప్రదేశమంతా తన సాలెగూటిని విస్తరింపజేసి సందర్శకుల భక్తి ద్వారా, ప్రార్థనలద్వారా వెలువడే శక్తులను తన గూటిలో బంధించి పీల్చివేస్తున్నది. అది చూడటానికి బాగుండదు కదా! అయితే భక్తులు మాత్రం భగవంతుడు తమను అనుగ్రహిస్తున్నట్లు, ఆయన స్పర్శను పొందినట్లు భావించేవారు. వారి ప్రార్థనలు ఫలించేవి. కోరికలు సిద్ధించేవి. అయితే అక్కడున్న శక్తిమాత్రం నేను చెప్పినదే. కాని వారి భక్తివిశ్వాసాలే ఆ క్షుద్రశక్తిని మార్చి తమకు మేలు జరిగేటట్లు చేస్తున్నాయి. వారి విశ్వాసం అటువంటిది.

క్షుద్రదేవతల పరిపాలన

సాధారణంగా అంతటా అలాగే జరుగుతుంది. అక్కడుండేవి ప్రాణికశక్తులు. ఈ ప్రాణిక దేవతలు (vital entities) మానవుల భావోద్రేకాలవల్ల ఏర్పడే స్పందనలను ఆహారంగా చేసుకుంటాయి. బహు కొద్దిమంది మాత్రం కోరికలకోసం కాక నిజమైన భక్తితో భగవంతుని అనుగ్రహమునకు కృతజ్ఞతతో, తమను తాము ఆత్మార్పణ చేసుకోవాలనే ఆకాంక్షతో దేవాలయాలకు, చర్చిలకు వెడతారు. అటువంటివారు బహు కొద్దిమంది మాత్రమే ఉంటారు కాబట్టి దేవాలయాలలోని వాతావరణాన్ని వారేం మార్చగలరు? వారుమట్టుకు ఏదో విధంగా దైవసంస్పర్శను పొందగలరుకానీ అక్కడికి వెళ్ళే వారిలో ఎక్కువ భాగం మూఢనమ్మకాలతోనూ, అహంభావంతోనూ, కోరికలతోనూ వెళ్ళడంవల్ల అక్కడ వాతావ

గణం కలుషితమైపోతుంది. అక్కడికి వెళ్ళినప్పుడు నువ్వు కూడా ఆ గాలే పీల్చవలసి వస్తుంది. నువ్వెంతో మంచి ఉద్దేశంతో వెడితే అక్కడ ధ్యానం చేయటానికి ప్రశాంతంగా బాగుంది అని అనుకోగలవు.

ప్రసిద్ధమైన చర్చిల లోని వాతావరణం

ప్రపంచప్రఖ్యాతిగాంచిన అనేక చర్చిల పరిస్థితి కూడా ఇంతే. ఇటువంటి పరీక్షలు చాలా చోట్ల చేసి చూశాను. ఒక మారుమూల కుగ్రామంలో ఉన్న ఒక చిన్న చర్చిలో మాత్రం ఆకాంక్షాపూరితమైన ప్రశాంత వాతావరణముండి ధ్యానం చేసుకోడానికి అనువైన ప్రదేశం దొరికింది. అది ఎంతో అపురూపం. ఇటలీలోని ప్రసిద్ధమైన చర్చిలను అనేకం సందర్శించానుకానీ అవన్నీ ఇటువంటి ప్రాణికజీవులతో నిండి భయంకరంగా ఉన్నాయి. నేను వెనిస్ పట్టణంలో ఒక పెద్ద చర్చి భవనంలో చిత్రాలకు రంగులు వేస్తున్నప్పుడు ఒక విషయం జరిగింది. Con fession table[1] వద్ద ఒక priest ఒక బీదవనిత యొక్క పాపవృత్తాంతాలను వినడం గమనించాను. అది ఒక భయానకమైన సన్నివేశం. ఆమె నివేదించుకుంటున్న బల్ల వెనుక మతాచార్యుడెవరో నాకు తెలియదు. అతనెటువంటి వాడో తెలియదు. కనబడకుండా వెనుకనున్నాడు. కానీ అతిఘోరంగా పీల్చి పిప్పి చేస్తున్న శక్తి ఒకటి అతని దగ్గర నాకు గోచరించింది. ఇక ఆ పేదరాలున్న భయంకర భీతావహస్థితి చూడశక్యం కాలేదు. ఇటువంటి వారు ఆ స్థలాన్ని అతి పవిత్రస్థలంగా భావిస్తారు. నిజానికి అది దుష్టశక్తులకు ఆలవాలం. – మానవుల శక్తిని పీల్చి పిప్పిచేసే ప్రతిగూల ప్రాణికశక్తుల గూడు.

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామ శాస్త్రి

---

1 క్రైస్తవ సంప్రదాయ ప్రకారం ప్రతి చర్చిలోనూ పాపనివేదనకి confe-ssional అనే ఒక స్థలం కేటాయించబడి ఉంటుంది. అక్కడొక జాలీ వెనుక కనబడకుండా మతాచార్యుడు ఆసీనుడై ఉంటాడు. తప్పుచేశామనుకునే వారు తమ దోషాలను కడిగివేసుకోటానికి అక్కడ నివేదించుకుంటారు.

మతాలలోని దేవుడు

శ్రీమాత ప్రవచనము

దేవుడు దేవుడని సామాన్యోక్తిగాచెప్పుకోవటమేగాని నిజం దేవుడంటే ఎవరో మనకు తెలుసా? మనది భూలోకం. మన భూలోకవాసులం. అటులనే ఇతర లోకాలు – అధిమనస (overmind), అతిమనస్సు (supermind) ఉంటాయి. ఆ లోక సులు వుంటారు. శ్రీమాత ఆ లోకాలను సందర్శించి ఆ దేవ లను చూసారు. మతాలను పరిపాలించే దేవతలు మానవు సృష్టించుకున్న వారే అని ఆమె గుర్తించారు. దేవాలయాలలో మూర్తులు ఎక్కువగా ప్రాణికలోకానికి చెందినవి. వాటికి పూజ ఆరాధనలు అంటె ఇష్టం. కాని యథార్థమైన దేవుళ్లకి ఇటు టివేవి నచ్చవు. నిజమైన ఆకాంక్ష, నిస్వార్థమైన ప్రవర్తన, వగాహన ఇవే వారి కిష్టం. మనుషులు కొలిచే కాళికాదేవి మె ఇలవేల్పులన్నీ మనుషులను భయపెట్టే ప్రాణికదేవతలే. అసు శక్తులకు ఇది ప్రీతి. నువ్వు వీటిని దాటి ఉన్నతశిఖరాల కనుక అందుకున్నట్లయితే భగవంతునికి ఒక చక్కని ఉపక ణము కాగలవు. — సంపాదకు

అధిమానస లోకవాసులు

అధిమనస్సు (overmind) దేవతలకు ని సము. వివిధ మతాలలోని ప్రార్థనలన్నీ దేవతలకే ఉద్దేశించబడ్డాయి. అనేక కార లవల్ల ఈ మతాలవారు ఏదో ఒక్క దేవతనే ఎంచుకొని, త వ్యక్తిగత ప్రయోజనాలకోసం దానినే పరమేష్టిగా పరిగణిస్తారు.

*

నా అనుభవంగూర్చి మీకు చెప్పాలనుకుంటున్నాను. నాకు సంవత్సరాల ప్రాయం వచ్చేవరకు, మతాలలోని దేవుడు – అం మానవులు సృష్టించుకున్న దేవుడు ఎవరో నాకు తెలుసు. అ వంటి దేవుణ్ణి నేను అభిలషించ లేదు. భగవంతుని అస్తిత్వా

గ్రోసిపుచ్చాను. అటువంటి భగవంతుడు కనుక ఉంటే, నేను నిస్సంశయంగా అతనిని గర్హించాను.

నాకు 25 సంవత్సరాలు వచ్చినప్పుడు, అంటే 1903 సం॥ లో నేను అంతస్థిత దైవాన్ని కనుగొన్నాను. అదే సమయంలో – 'పాశ్చాత్యమతాలు' చాలావరకు ఏ దేవుణ్ణి వర్ణించాయో ఆ దేవుడు "పరమ విరోధి" (great adversary) కన్నా మరొకడు కాదని తెలుసుకున్నాను.

నేను 1914 లో భారతదేశానికి వచ్చినప్పుడు, శ్రీఅరవిందుని ప్రబోధంతో పరిచయం కలిగిన పిమ్మట, అంతా సుస్పష్టమైనది నాకు.

*

ప్రాణికలోకవాసులు

అదృశ్య ప్రపంచంలో, ప్రాణికశ్రేణిలోని దేవతలు తప్ప, మిగిలిన దేవతలెవరికీ పూజలన్నా, ఆరాధనలన్నా ఇష్టం ఉండదు. నేను చెప్పినట్లు ఈ ప్రాణికదేవతలు పూజలవల్ల తృప్తిపడతారు. ఆ పూజలవల్ల ఆ దేవతలకు ప్రాధాన్యం వస్తుంది. వారిలో గర్వాతిశయం పెరిగి, చాలా సంతోషపడిపోతారు. తమను పూజించే ప్రజాబాహుళ్యము లభించగానే వారు తృప్తిపడిపోతారు.

బాహ్యపూజలు కాదు ఆధ్యాత్మికచింతన ముఖ్యం

కాని మీరు యథార్థమైన దేవతామూర్తులను పరిశీలిస్తే, వారు ఈ పూజలకు విలువ ఇవ్వరు. తమని పూజించడం వారికి అసలు ఇష్టముండదు. ఈ పూజలవల్ల వారికి ఎటువంటి ప్రత్యేక ఆనందం కలుగదు. వారేదో సంతోషపడిపోతారని అనుకోవద్దు. ఎందుకంటే వారిలో గర్వం లేదు. గర్వంవల్ల ఒక మనిషి తనను పూజించమని అభిలషిస్తాడు. మనిషికి గనుక గర్వం లేకపోతే, తనను పూజించాలని కోరుకోడు. ఒకవేళ వారు మంచి ఉద్దేశ్యాన్ని, చక్కని భావాన్ని, స్వార్థరహిత చింతనము, ఉత్సుకతను, ఆనందాన్ని, ఆధ్యాత్మిక ఆనందాన్ని గమనిస్తే – వీటికి ప్రార్థనలు

పూజలు, ఆరాధన కన్న అనంతమైన, మహోన్నతమైన విలువ ఉన్నట్లు వారు భావిస్తారు.

పూజలనందుకునేది ప్రాణికదేవతలు

నేను ఇదంతా ఊరికే తమాషాకి చెపుతున్నా ననుకుంటారేమో. చాలా యథార్థమైన విషయం అని నేను హామీ ఇస్తున్నాను. యథార్థమైన ఒక దేవతామూర్తిని ఒక పీఠంపై కూర్చోబెట్టి, మీరు పూజిస్తున్నంతకాలం ఆ మూర్తి ఆ పీఠంపై వుండేటట్లు ఒప్పించగలిగితే, మీరు చేసే పూజలోని తమాషా అంతా ఆ మూర్తి చూస్తూంటుందే తప్ప ఎటువంటి తృప్తిని పొందదు. మీ పూజవల్ల అతను ఉబ్బిపోడు. సంతోషించడు. మహిమాన్వితుడు కాబోడు. అటువంటి భావనను మీరు దూరం చేసుకోవాలి. *ఆధ్యాత్మిక లోకాలకు, భౌతికలోకాలకు మధ్య ఒక పెద్ద సామ్రాజ్యం ఉంది. అందులో ప్రాణికశక్తులు (vital beings) రాజ్యమేలుతుంటాయి.* ఈ ప్రాణికజీవుల రాజ్యం నిండా పూజలు పునస్కారాలు నిండి వుంటాయి. ఈ జీవులు వాటివల్ల జీవిస్తారు వాళ్ళకు పూజలంటే మహాసంతోషం. ఇవి వాటికెంతో విలువను ఇస్తాయి. ఏ శక్తికి ఎక్కువమంది భక్తులు, నమ్మకస్తులు, భజనపరులు ఉంటే ఆ శక్తి అంత ఎక్కువగా ఆనందపడుతుంది. గర్వాతిశయంతో పొంగిపోతుంది. అటువంటి పూజల్ని దేవతలెందుకు హర్షిస్తారు? నిజమైన దేవతలకు, అనేక మానవలోపాలను తమ లోకి స్వీకరించిన (overmind) దేవతలకు సైతం, ఆ లోపాలు ఉన్నప్పటికీ – ఉన్నతమైన చైతన్యం ఉంటుంది. వారికి ఈ పూజలు ఏమాత్రం ఆనందం ఇవ్వలేవు.

నిజమైన మంచితనంతో చేసిన ఒక సత్కార్యం, మేధస్సు నిస్వార్థం, సూక్ష్మ అవగాహన, చిత్తశుద్ధితో నిండిన ఆకాంక్ష – ఇవి వారి దృష్టిలో మతపరమైన ఉత్సవంకన్న అనంతమైన ఔన్నత్యం కలవి. వాటి విలువ అనంతం.

భయంకరమైన ప్రాణికశక్తులు

మనం పూజించే విగ్రహాల సంగతంటారా! ఉదాహరణకు – కాళికాదేవి వివిధ రూపాలు! ఆ రూపాలకు భయంకరమైన

రీటిలో అలంకరణలు చేస్తారు. ఇలవేల్పుగా ఇళ్ళల్లోకూడ ప్రతి ష్ఠించుకుంటారు. ఆ రూపాలనిండా భయంకరమైన ప్రాణికశక్తి ఉంటుంది! తమ ఇళ్ళల్లోవున్న కాళిని చూసి భయంతో గడగడ వణికిపోయిన వారినిగురించి నాకు తెలుసు. చిన్నతప్పు జరిగినా వణికిపోతారు. ఉపద్రవాలు వస్తే, వాటిని కాళి సృష్టించిందని భావిస్తారు. అది చాలా భయంకరమైన భావన. కాళికాదేవి శక్తి రూపాలు నాకు తెలుసు. వాటిని గూర్చి నాకు బాగా తెలుసు. అవన్నీ ప్రాణికశక్తులు, ప్రాణిక ఆకారాలు, మానవభావనలే వాటికి ఆ ఆకారాలు కల్పించినవి. ఏం రూపాలవి! అటువంటి భయానక వికృతరూపాలను మనుమలు పూజిస్తారన్న ఆలోచనే భరింపరానిది!

రాక్షసశక్తులకు బలైపోతారు

ఈ విషయాల దృష్ట్యా, భయం, గుడ్డిగా మూఢనమ్మకాలతో ఆ శక్తులకు అణిగి మణిగి వుండడం – ఇటువంటి మతవిశ్వాసాల ఆవరణం నుండి, కలుషిత వాతావరణంనుండి కొద్ది కాలం పాటు మనుమలు బయటపడడం మేలు. ఇటువంటి గుడ్డినమ్మకాలను ఆసరాగా తీసుకుని అసురశక్తులు ప్రయోజనం పొందుతాయి, పొందుతున్నాయి. ఇటువంటి గ్రుడ్డివిశ్వాసాలను తిరస్కరించడం, వాస్తవికదృష్టిని పెంపొందించుకోవడం – మనుమ్యలను మూఢ నమ్మకాల విషవలయంనుండి విముక్తం చేయడానికి అనివార్యం కాగలదు. ఈ మూఢనమ్మకాలనుండి బయటపడినప్పుడు, బ్రహ్మాండమైన వికృతప్రాణికశక్తులకు దాసోహం అంటూ క్షుద్రపూజలు చేసే విధానంనుండి విముక్తమైనప్పుడు మాత్రమే ఎవ్వరైనా నిజమైన ఆధ్యాత్మిక శిఖరాల నధిరోహించగలరు. అప్పుడే, ఆ ఉన్నత భూమికలలోనే నిజమైన దివ్యచైతన్యం, మహాసత్యం, మహాశక్తి, వైభవప్రాభవాలకు నిజమైన ఉపకరణం కాగలరు. వాటిని మానవాళికి అందివ్వడంలో సహకరించగలరు.

ఎవ్వరైనా ఉన్నతశిఖరాలు అధిరోహించడానికి ముందు ఈ రకమైన మూఢవిశ్వాసాలను, ప్రాణికశక్తుల పూజల్ని వదిలివేయవలసిందే!

అనువాదం: కె. యజ్ఞన్న

మతాలలో భయము, మూఢనమ్మకాలు, శకునాలు, అద్భుతాలు

శ్రీమాత ప్రవచనముల

అన్ని దేశాలలోను అన్ని మతాలలోను కొన్ని మూఢనమ్మక లుంటాయి. ఇవి మనుషుల అనుభవం మీద ఆధారపడిన కానీ సత్యములు కావు. ఒకే శకునం కొంతమందికి మంచి కావచ్చు, కొంతమందికి చెడు కావచ్చు. నల్లపిల్లి ఎదురయిత కొంతమందికి కీడు, మరి కొంతమందికి శుభం! జంతువులన బలి ఇవ్వటానికి ఈ మూఢత్వమే కారణం. – సంపాదకుడ

ప్రశ్న: మూఢనమ్మకాలు కేవలం మనుషులు ఆలోచించిపెట్టుకున్న నియమాలేనా?

> *మూఢనమ్మకాలు స్థానికంగా ఏర్పడిన విషయాలు*

కావు. నియమాలు కావుగాని మానసిక రూపకల్పనలు (mental formations) సాధార ణంగా ఒక అనుభవంద్వారా ఒక మూఢనమ్మకం ఏర్పడుతుంది ఉదాహరణకు, యూరోపు దేశంలో "నిచ్చెన క్రిందుగా నడవ కూడదు, అది దురదృష్టానికి హేతువవుతుంది" అని చెపుతారు నిజానికి ఎవరో ఒకరు నిచ్చెన క్రింద నడుస్తుండగా అది జారి అతనిమీద పడివుండవచ్చు. ఆ విధంగా ప్రారంభమై అదే అనేక సార్లు సంభవించి ఒక నమ్మకంగా ఏర్పడవచ్చు. ఎందువల్ల నంటే, నిచ్చెన సరిగా పెట్టకుండా దానికింద నడిచినప్పుడు అది ఏ క్షణంలోనైనా పడవచ్చు. అదే దురదృష్టం. ఈ రకమైన మూఢ నమ్మకాలు అనేకం. స్థానికమైన ఈ మూఢనమ్మకాలు దేశానుగు ణంగా ఏర్పడతాయి. అంతేకాకుండా వివిధ దేశాలలోని మూఢ నమ్మకాలు పరస్పర విరుద్ధాలుగా కూడా కనబడుతాయి. కొన్ని దేశాలలో నల్లపిల్లిని చూస్తే విపత్తు వస్తుందంటారు. మరికొన్ని దేశాలలో అది అదృష్టహేతువంటారు. నీవు ఈ రెండింటినీ సమ న్వయించి చూస్తే, ఏమీ జరగదనే నిశ్చయానికే వస్తావు. అన్ని

మూఢనమ్మకాలూ ఒకానొక అనుభవంవల్ల స్థానికంగా, అప్పు డప్పుడు ప్రత్యేకమైనవిగా ఏర్పడి మానసిక నియమాలుగా తయా రౌతాయి. అవి మానసిక రూపకల్పనలే కాని నియమాలు కావు.

కొన్ని నిబంధనలు పారిశుద్ధ సూత్రాలు

ఇదిగాక, మతనిబంధనలనేవి ఉంటాయి: ఇవన్నీ పారిశుద్ధ్య సూత్రాల దృష్ట్యాగాని, వైద్యరీత్యా గాని ఏర్పడి మతనిబంధనలుగా మారుతాయి. జనులు వాటిని పాటించేటట్లు చేయాలంటే అదే మార్గం – "నీవు ఈ విధంగా చేయాలి, ఆ విధంగా చేయాలి" అని భగవంతుడు చెప్పినట్లుగా చెప్పాలి. లేకపోతే చాలామందికి నచ్చదు. దానిని పాటించరు. భోజనానికి ముందు చేతులు కడుక్కోవటంవంటి చిన్న విషయాలు దగ్గరనుంచి ఈ విధంగానే చెప్పాలి. వైజ్ఞానిక నాగరికత లేని దినాలలో భోజనసమయమున చేతులు కడుక్కోవటం నిజానికి శుభ్రతకోసమై ఉంటుందని కొందరు గుర్తించారనుకోండి. వారు దానిని మతసూత్రంగా చేసి, చేతులు కడుక్కోకపోతే భగవంతు నికి అపచారమని చెప్పిఉండకపోతే, ప్రతివారూ "ఈ రోజు వేళ మించిపోయింది, తొందరగా ఉంది, రేపు కడుక్కుంటాను" అని అంటారు. కాని ఈ విధంగా చెపితే, భగవంతుడు ఆగ్రహించడం వల్ల ఏదో చెడు జరుగుతుందనే భయం వారిలో ఏర్పడుతుంది. ఇదికూడా ఒక మూఢనమ్మకమే.

*

జంతుబలికి కారణాలు

అన్ని మతాలలోను కొన్ని విధులు, నిషేధాలు చోటు చేసుకున్నాయి. అయ్యో ఇలా చేయకపోతే ఎలా అనే భయం ఉంటుంది. నేను 12 కోడిపిల్లలని బలి ఇవ్వకపోతే ఉపద్రవం సంభవిస్తుం దేమో, రాబోవు 12 నెలలు నరకం అనుభవిస్తానేమో, నా పిల్ల లకి జబ్బు చేస్తుంది. ఉద్యోగం ఊడిపోతుంది. తిండికి డబ్బులేక పస్తు పడుకోవలసివస్తుంది. ఇంత అవస్థపడే బదులు వాళ్లు చెప్పి నట్లు ఆ కోళ్లను బలి ఇస్తే సరిపోతుంది కదా. అయితే అది జీవ

లను చంపాలనే ఉద్దేశంతో కాదు. క్రూరత్వంవల్ల కాదు. అజ్ఞానము, అచేతనల వలన అలా చేస్తారు.

*

ఈడెన్ గార్డెన్‌లో ఆపిల్ తిన్న వృత్తాంతము

క్రైస్తవమతములో భయంగూర్చి ఒక సూక్తి చెబుతారు. ఈడెన్ తోటలో ఆపిల్‌పండును ఎవరైన కోసి తింటే వారికి భయం పట్టుకుని పీడిస్తుందని ఆ మతం చెబుతుంది. అంటే జ్ఞానంతోపాటు భయం వచ్చిందని, భూమిపై ఈ భయమే మానవాళి జీవితాలను శాసిస్తుందని ఆ మతం అంటుంది. ఇక్కడ నేను ఈ వాదాన్ని తిరిగి చెబుతున్నాను. మరి జంతువులకుకూడా భయం ఉంటుంది కదా! అవి ఏ పాపం చేయలేదే. ఆపిల్‌పండును తిన లేదే. కాబట్టి వాటికి భయం ఉండకూడదు మరి! నిజానికి అజ్ఞానపూరితమైన, సహజాతంతో కలిసిన మిశ్రమ చేతనే ప్రమాదానికి దోహదమౌతుంది. పరిష్కారం దానికే తెలియదు. కాని భగవంతుని దివ్యకార్యాన్ని ప్రతిఘటించే అసురశక్తులు, ప్రాణికజగత్తులోని శక్తులు ఈ భయాన్ని విస్తృతస్థాయిలో ఉపయోగించుకుంటాయని మాత్రం నిశ్చయంగా చెప్పవచ్చు. ఈ భయం ఆసరాగా అవి మానవులను గట్టిగా పట్టుకుని ఆడిస్తాయి. అంతే కాదు. రాజకీయాలు, మతాలు కూడ ఆ కోవకు చెందినవే. మృత్యుభయాన్ని కల్గించి, జీవితం ముగిసిన పిమ్మట జరిగేదానిని గూర్చి భయపెట్టి, తాము ప్రవచించే శాసనాలు కనుక గుడ్డిగా అనుసరించకపోతే మరణానంతరం సంభవించే ఉపద్రవాలను గూర్చి భయపెట్టి కొన్ని మతాలవారు వారిని నమ్మే ప్రజల్ని లోబరుచుకుంటారు.

*

ప్రజలను నమ్మించేదుకే మిరకిల్స్

సాధారణ మానవులు మాములుగా దైవికశక్తులతో సంబంధము లేనివారగుట, దివ్యచేతన యనేమో ఎఱుగని కారణమున, గురువులనుండి భౌతిక రుజువులను గోరుదురు. ఈ విధమైన అభ్యర్థనల పైననే సర్వసామాన

ముగా అన్ని మతములు స్థాపించబడినవి. నిర్మొగమాటముగా చెప్పవలయుననన్న, ఆధారము 'రాజకీయ' కారణములే. మతస్థాపకులు అనేక అద్భుతములు (miracles) చేసిరని మతముల పునాదులలోనే నిక్షిప్తము చేసిరి. మొరటుగా అమాయకులైన ప్రజలలో ప్రచారము చేసి, అద్భుతములయందు రుచి కల్పించిరి. దైవిక శక్తిని నిరూపించుకొనుటకు అద్భుతములు చేయవలసిన అవసరమును ప్రజలు కల్పించిరి.

అనువాదం: ఎ. వెంకటరామ శాస్త్రి, ఎ. ప్రభావతి; ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి; యజ్ఞన్న; పాలా వెంకట సుబ్బయ్య (శ్రీమాత శతజయంతి ప్రచురణ 7)

స్వర్గనరకములు మతముల కల్పనలు

శ్రీమాత ప్రవచనములు

పుణ్యం చేసిన వారందరు స్వర్గానికి, పాపాత్ములందరు నరకానికి వెడతారనే నమ్మకం అన్ని మతాలలోను పాతుకుపోయి వున్నది. సామాన్యప్రజను భయపెట్టి వాళ్లమీద పెత్తనం చలాయించేందుకు మతాచార్యులు కూడ ఈ నమ్మకాన్నే ప్రోత్సహించారు. ఇది ఎంతవరకు నిజం అనేదే ప్రశ్న. మానవుడు ఒక విషయాన్ని గురించి ఊహాచిత్రములు కల్పించుకొని, సూక్ష్మలోకాలలో వాటికి ఆకారాలను కూడ సృష్టించగలడు. స్వర్గనరకాదులన్ని ఈ కోవకు చెందినవే. – సంపాదకుడు

(ఒక పాప) మరణించిన తర్వాత మనుష్యులు ప్రాణికలోకానికి వెడతారన్నారు కదా. మరి పుణ్యం చేసుకున్నవారు స్వర్గానికి వెళ్తారా?

నీ వనే స్వర్గం ఎక్కడుంది? నీ కివన్నీ ఎవరు చెప్పారు? స్వర్గం, నరకం మొదలైన వాటన్నిటి గురించి నీకు ఎవరు

చెప్పారు? వాటిని గురించి కాదు నేను చెప్పేది. నీవే పుస్తకంలో నుంచి అయినా చదివావా?

ఊరికే వాటిని గురించి విన్నాను.

ఎవరు చెప్పారు?

ఎవరు చెప్పారో గుర్తు లేదు.

మతముల నీతి బోధలు

సాధారణంగా మంచిపనులు చేయడానికి ప్రోత్సాహం కోసం మతాధికారులే ఆ విధంగా చెపుతారు. చెడ్డవారికంటె మంచివారి జీవితం ఎక్కువ సుఖంగా ఉండదన్న విషయం అందరికీ తెలిసినదే. ఎక్కువ దైవచింతన లేనివారు, "నేనుమంచిగా ఉండాలని ఎందుకు కష్టపడాలి? చెడ్డగానే ఉండి సుఖంగా జీవితం గడుపుతాను" అనుకుంటారు. మంచి చాలా రకాలు. ఒక్కొక్కసారి మంచికోసం కష్టపడితే తగిన ప్రతిఫలం ముంటుందని వీరికి బోధపరచడం చాలా కష్టం. అందువల్ల, మరీ అజ్ఞానంగా ఉండేవాళ్ళకి కూడా తెలియడానికని, "అదంతా కడు సులభం. నీవు విధేయుడవై, మంచిగా, స్వార్థరహితంగా, మంచిపనులు చేస్తూ, మేము చెప్పిన ఆచారాలను పాటించావంటే, దేవుడు మెచ్చి, చనిపోయిన తర్వాత నిన్ను స్వర్గానికి పంపుతాడు. ఒకసారి సత్సంకల్పం ఉండీ, వేరొకసారి లేకా, ఒకసారి మంచిపనులు చేసీ మరొకసారి చెడు పనులు చేసీ, నీ గురించే ఎక్కువ ఆలోచిస్తూ ఇతరుల సంగతి పట్టకుండా ఉంటే, ఇంకొక అనుభవం కోసం "పర్గెటరీ"[2] కి వెళతావు. నీవు పూర్తిగా చెడ్డవాడివై, ఎప్పుడూ ఇతరులకు హాని చేస్తూ, ఎవరిమంచీ తలవక అన్నీ చెడ్డపనులే చేస్తుంటే, ముఖ్యంగా మేము చెప్పిన ఆచారాలు పాటించకపోతే, సూటిగా శాశ్వత నరకానికి వెళ్లి అక్కడే ఉండిపోతావు" అని చెపుతారు.

నరకజీవితం శాశ్వతమా?

నేను విన్నవాటన్నిటిలోకీ విచిత్రమైనది ఇది. శాశ్వత నరకం అనే ఒక లోకాన్ని వారు సృష్టించారు. అంటే, నీ వొకసారి నర

---

[2] స్వర్గానికి వెళ్ళే జీవులకు పాప ప్రక్షాలన గావించే లోకం

కానిక వెళిత ఇక అక్కడె శాశ్వతంగా స్థిరపడతావు. శాశ్వతమంటే అర్థమైందా? నిన్ను చిత్రహింస పెట్టి కాలుస్తారు. (వేడిదేశాలలో అయితే కాలుస్తారు, శీతలదేశాలలో మంచులో శరీరాన్ని గడ్డకట్టిస్తారు) ఆ స్థితి శాశ్వతం.... అది అంతే! నీకివన్నీ ఎవరు బోధిందారో తెలియదు. కాని, ఇవన్నీ జనులను లొంగదీయడానికి, అదుపులో పెట్టడానికి చేసిన ప్రయత్నాలు.

అన్ని బోధలూ ఈ విధంగానే ఉంటాయని కాదు. ఇటువంటి విషయాలు లేని మతాలున్నాయి. అయినప్పటికీ, స్వర్గాన్ని గురించి ఊహాకల్పనలూ, వర్ణనలూ ఎవరైనా చేయవచ్చు. ఎందువల్లనంటే, అత్యద్భుతమై, సుఖదాయకమై, ఆనందం వెల్లివిరిసే ప్రదేశాన్ని కదా స్వర్గం అంటారు. కాని అది నీవు ఏ మతానికి చెందినవాడివనే దానినిబట్టి ఉంటుంది. కొంతమంది ఉద్దేశ్యం ప్రకారం, స్వర్గం అంటే ఏమీ చేయకుండా భగవంతుని కీర్తనలు పాడుకుంటూ ఉండడమే – కాని, చివరకు అది విసుగు కలిగించకమానదు. ఏమైనప్పటికీ, అక్కడ వాద్యగానాలతో కాలం గడుపుతావు. దీనికి విరుద్ధంగా ఇంకొకరకపు స్వర్గంలో, నీవు జీవించి యుండగా అనుభవించని రకరకాల సౌఖ్యాలను పొందుతావు. ఇంకొన్ని స్వర్గాలలో, నీవు నిరంతర ధ్యానంలో నిమగ్నుడవై ఆనందాన్ని అనుభవిస్తావు. కాని, ధ్యానంలో ఉత్సాహం లేనివారికి ఇది నచ్చదు. ఈ విధంగా మతాచార్యులు అన్నిరకాల స్వర్గాలనూ సృష్టించారు. దానివల్ల మానవులు నిజంగానే బుద్ధి కలిగి ఈ ఆచారాలన్నీ పాటిస్తారని వారి ఉద్దేశ్యం.

ఊహాకల్పనలు భ్రమలు

అద్భుతమైన మానవుని ఊహాకల్పన, సృజనాత్మక శక్తుల మూలంగా, స్వర్గధామాలవంటి ప్రదేశాలనేకం ఈ ప్రపంచంలోనే ఏర్పడ్డాయి. అదే విధంగా నరకాలూ, "పర్గెటరీ" లూ రూపొందాయి. కేవలం శూన్యంలోనుంచి మానవుడు తాను ఊహించినవన్నీ సృష్టించగలడు. నీ చైతన్యం వికాసం పొందితే వీటిలోనుంచి బయటపడగలవు. లేకపోతే నీవు జీవించి ఉండగానే ఏర్పరచుకున్న నమ్మకంతో కట్టుబడిపోతావు. అదికూడా జీవితమేనని నీవు

చెప్పవచ్చుగాని, అది భ్రమతో కూడినది, చాల పరిమితమైనది. ఆ విధంగా ఆలోచించేవారుమాత్రమే దానిని నమ్ముతారు. ఇంకో విధంగా ఆలోచించడం మొదలుపెడితే నీకది తటస్థించదు. నీవు అందులోనుంచి బయటపడవచ్చు. అందులోనుంచి ఎవరినైనా ఆ విధంగా బయటికి లాగితే, ఇవతలకు వచ్చిన వెంటనే తాను కల్పించుకున్న భ్రమలో తాను ఎలా చిక్కుకొనిపోయినదీ అతను తెలుసుకుంటాడు.

మానవునికి సృజనాత్మకశక్తి అధికం. తన ప్రతిరూపంలో తనలోని లోపాలే వారిలో కల్పించి, భారీఎత్తున అధికశక్తితో పనిచేసే దేవతలను సృష్టించాడు. వాటి ఉనికి సాపేక్షికమైనప్పటికీ, నీ ఆలోచన మాదిరిగానే ఒక ప్రత్యేకమైన ఉనికికూడా వాటికి ఏర్పడుతుంది.

నువ్వు స్వర్గలోకాన్ని గురించి అడిగావు కదా. అది అసలు లోకముయొక్క వికారరూపము. అజ్ఞాననేత్రానికి ఈ వికారరూపమే గాని మూలరూపము కనబడదు.

చైత్యజ్ఞానంతో ఏకత్వము

అలా కాకుండా, నీవు కనుక చైత్యపురుషని (psychic being) చైతన్యంతో ఏకమైనట్లయితే మరణించినప్పుడు చైత్యపురుషని జ్ఞానంతో ఉంటావు. చైత్యపురుషుడు చైత్యలోకానికి (psychic world) మరలిపోతాడు. చైత్యలోకం అంటే ఆనందము, శాంతి, నిశ్చలనీరవత, జ్ఞానవికాసమూగల లోకం. నీవు దీనిని స్వర్గమన్నా పర్వాలేదు. నీవు నీ చైత్యపురుషనితో ఎంతగా తాదాత్మ్యం చెంది ఉంటే, అంతగా నీవు తత్సంబంధమైన జ్ఞానం కలిగి, దానితోడి ఏకత్వమున మనగలుగుతావు. అది అమరమగుటచే, స్వకీయమైన అమరక్షేత్రమందది పరిపూర్ణ, సౌఖ్యవంతమైన జీవితాన్ని పొందడంకోసమో లేక విశ్రాంతి తీసుకోడం కోసమో, ఆ క్షేత్రానికి నిర్గమిస్తుంది. ఆ చైత్యపురుషనితో ఏకత్వజ్ఞానం నీకుంటే, నీవు కూడా, శరీరం నశించినప్పుడు, చైత్యలోకపు పరమానందస్థితియందు విశ్రాంతి తీసుకోడానికై చైత్యపురుషనితోపాటుగా వెళ్ళగలవు.

•

నీవు ప్రాణకోశంలోనే, ప్రాణికమైన కోరికలతో కనుక జీవితం గడిపినట్లయితే, మరణించగానే ప్రతి కోరిక నెరవేర్చబడేందుకోసం ఎక్కడో ఒక చోట ప్రయత్నిస్తుంది. ఉదాహరణకు, తన ధనంమీదే దృష్టిపెట్టుకొని పిసినారి మరణిస్తే, ధనాపేక్షగల అతని ప్రాణికాంశ ఆ ధనాన్నే అంటిపెట్టుకొని ఎవరూ తీసుకోనివ్వకుండా చూస్తుంది. ఎవరికీ కనిపించకుండా అక్కడే కనిపెట్టుకొని, ధనానికేమైనా జరిగితే బాధపడుతుంది.

*

ప్రశ్న: నరకలోకం ఎంతవరకు నిజం?

అది ప్రాణికసీమలో ఉంటుంది. మానవుడు తన ఊహాలతో నిర్మించుకున్న లోకము.

*

మానవులు కల్పించుకొన్న లోకములు

ఈ అదృశ్యసీమలలో మానవ మనస్సుచే రూపొందించబడిన లోకములు కొన్ని ఉంటాయి. మనిషి కోరుకున్నదంతా అచ్చట దొరుకుతుంది. నువ్వు ఏది కోరుకుంటే అది దొరుకుతుంది. నరకము, స్వర్గము, పాపవిమోచనాలోకము (purgatory) ఇవన్నీ కూడా ఈ కోవకు చెందినవే – ఒక్కొక్క మతము ఒక్కొక్క ప్రత్యేకరూపాన్ని యిచ్చినప్పటికి మూలంలో ఒకటే. భౌతికప్రపంచంలోని వస్తువులకు ఇక్కడ ఎలాంటి ఉనికి ఉంటుందో ఆ లోకంలోని వస్తువులకు అక్కడా అంతే.

వాటి నిజస్వరూపము

ఈ భ్రమనుండి తొలగిపోయి వాటి నిజస్వరూపాన్ని చూడాల్నంటే నువ్వు అంతరంగిక విముక్తిపొందాలి. నీకు చేతనాదృష్టి, సత్యదర్శనము కలగాలి. ఉదా: ఈ భూలోకం సంగతే చూసుకొందాం. నువ్వు ముట్టుకొని చూడగలిగే వస్తువులే నిజమని నమ్ముతావు. ముట్టుకోలేని అమూర్తవస్తువులను గురించి నీకు తెలియదు. ఇదే న్యాయం ఆ లోకానికి గూడా వర్తిస్తుంది. మరణించేటప్పుడు స్వర్గానికి వెళ్తున్నామనుకొనే వాళ్లు స్వర్గ

లోకానికే వెడతారు. నరకమనుకుండే వాళ్లు నరకానికే వెళ్తారు. ఆ లోకాలు నిజంగానే ఉన్నాయని వాళ్లు భ్రమపడతారు. ఇంత కంటే నిజమైన యథార్థమైన లోకం మరొకటి ఉంటుందని వాళ్లకి నచ్చచెప్పడం చాలా కష్టం.

*

నమ్మకం మీద ఆధారం

స్వర్గం, నరకం ఎంతవరకూ నిజాలు? ఔను. కాదు. అవి ఉన్నాయనీ చెప్పవచ్చు, లేవనీ చెప్పవచ్చు!

మానవమనస్సు ఓ గొప్ప సృష్టికర్త. తన భావనాశక్తి వలన ఒక మానసికరూపమును సృష్టించగలదు. ప్రాణికరూపమును సృష్టించగలదు. సూక్ష్మభౌతికరూపమును సృష్టించగలదు. దీని అర్థం ఏమిటి? మనిషి ఒక దానిని గురించి గాఢంగా ఆలోచించినట్లయితే దానికి రూపకల్పన చేయగలడు. అది నిజంగానే ఉన్నది అనేటంత స్పష్టంగా కనబడుతుంది. మతగాథలలో నమ్మే వారికి నరకము, స్వర్గము వాళ్ళు ప్రత్యక్షంగా అక్కడికి వెళ్ళి నివసించగలిగిన అనేకమైన యితరలోకములు ప్రత్యక్షంగా ఉంటాయి. మరణానంతరం వాళ్ళు వెళ్ళి కొద్దికాలమో, ఎక్కువ కాలమో అక్కడ వుండవచ్చు. కాని ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఆ లోకాలకు నిత్యత్యం లేదు. అవి శాశ్వతాలు కావు. కేవలం మనస్సు తయారుచేసిన రూపములు – అంతే.

అనువాదం: ఎ. వెంకటరామ శాస్త్రి, ఎ. ప్రభావతి
(ప్రశ్నోత్తరములు - 1953); ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి

జ్ఞానాన్ని కొన్ని నియమాలతో పరిమితం చేసి జనసామాన్యానికి అందుబాటులో చేసింది మతం. కాని ఎప్పటికీ ఈ అజ్ఞానాన్నే పట్టుకొని ఉండటం తగదు.

శ్రీమాత రచనల నుండి

...ములు — సన్యాసము, నిర్వాణము

శ్రీమాత ప్రవచనములు

'బ్రహ్మ సత్యం జగన్మిథ్య' అనే భావం అన్ని మతాలలోను, అన్ని దేశాలలోను ప్రబలియున్నది. ముఖ్యంగా భారతీయులకు యుగాలలో జీర్ణించి వున్నది. ప్రాపంచికజీవితం దుఃఖభాజక ము. దీనిని విసర్జిస్తే పైలోకాలలో సుఖసంతోషాలు వుంటా యి. కాని నువ్వు ఒక విషయాన్ని మరచిపోతున్నావు. ఈ సృష్టి భగవంతుని సృష్టి — ప్రస్తుతం అచేతనా భూయిష్ఠమై క్షుద్రశక్తుల పరిపాలనలో వున్నది. ఇక్కడి బాధలకు కారణం ఆ క్షుద్రశక్తులే. అసలు సమస్యకూడ యిదే. ఈ సమస్య ప్రపంచాన్ని విడిచిపోవటంవలన తీరేది కాదు. ఈ క్షుద్రశక్తుల పట్టునుండి ఈ ప్రపంచాన్ని విడిపించాలి. ఎప్పుడైతే నువ్వు ...దివ్యశక్తులను ఆహ్వానించి వాటి అభివ్యక్తికి నీవొక సమర్థవంతమైన పాత్రగా మలచుకొందువో అప్పుడు ఇక్కడి దుఃఖమంతా కూడ ఆనందంగా మారుతుంది.

— సంపాదకుడు

"A Power greater than that of Evil can alone win the Victory. It is not a crucified but a glorified body that will save the world".

పరలోకవాదన తప్పు

1957 నూతనసంవత్సరానికి యిది నేనిచ్చిన సందేశం. ఈ ప్రపంచం ...ఈ అజ్ఞానం మతాన్నిబట్టి, దేశాన్నిబట్టి వేరువేరు రూపము లను పొంది ఉండవచ్చును. ఈ అజ్ఞానాన్ని తొలగించేందుకే నేనీ సందేశాన్నిచ్చాను. భారతదేశంలో కూడా ఈ పరలోకవాదన ప్రబలివుంది. ఈ ప్రపంచం అంతా ఒక మాయ, ఒక మిథ్య కనుక ఈ పాంచభౌతికశరీరం కూడా అంతే. 'ప్రాపంచిక జీవితం దుఃఖము' అని భావించుటవలన శత్రుశక్తులను, అసురులను మనం ఆహ్వానిస్తున్నామన మాట. ఈ లోకంలోకి ఆహ్వానించి

"రండి రండి" ఇక్కడ మీరు విజృంభించండి అని ద్వారములు తెరచి ఈ ప్రపంచాన్ని వాళ్ళ కప్పజెప్పుతున్నామన మాట. అవి విజృంభించి యిక్కడ విచ్చలవిడిగా స్వైరవిహారము చేయవచ్చని కూడ శ్రీఅరవిందులు మనలను హెచ్చరించారు.

విరోధులకు స్థావరం

దీని పర్యవసానం ఏమిటి? నువ్వు ఈ లోకాన్ని వదిలేసి ఎక్కడోవున్న దూరలోకాల్లోకి అమూర్తలోకాల్లోకి వెళ్ళిపోయావనుకో అప్పుడు ఏమౌతుందో తెలుసా? నీ విరోధులకు యిక్కడకు వచ్చి ఈ లోకాన్ని జయించేందుకు స్థావరాన్ని కల్పిస్తున్నావు. మనిషి సర్వమును త్యజించి నిర్వాణంలోకి వెళ్ళిపోతాడు. ప్రపంచ మందెల్లెడల యిటువంటి వేదాంతమే ప్రబలియున్నది.

భూలోక జీవితపు పరివర్తనము

నేటి ప్రపంచదుస్థితికి ఇదే కారణం ఆత్మబలంతో ఈ విరోధుల నెదుర్కొనే బదులు మనిషి ఇక్కణ్ణుంచి పలాయనం చిత్తగిస్తున్నాడు. దీనివల్లనే ఇక్కడ ముప్పు వాటిల్లుతోంది. ఇది సరి కాదు. ఆధ్యాత్మికశక్తితో దుష్టశక్తులను ఎదుర్కొని వాటిని జయించాలి. మానవజీవితాన్ని పూర్తిగా పరివర్తింపగల మహాశక్తిని సంపాదించాలి. నువ్వు ఒక సంగతి మట్టుకు గుర్తుంచుకోవాలి. *దుష్టశక్తులు ఎక్కడ విజృంభిస్తున్నాయి? ఇక్కడే గదా! ఈ భూలోకంలోనే గదా! ఈ జీవితాన్ని వల్లకాదని దానిని త్యజించి పైకెక్కడికో వెళ్ళిపోయి అక్కడ వుండి శక్తిని, జ్ఞానాన్ని సంపాదించడం కుదరదు. నీ పోరాటాన్ని 'ఇహైవ' యిక్కడే సలపాలి. భూలోక చైతన్యాన్ని పరివర్తింపచేయాలి. ఈ విశేషకార్యము అతిమానసము (supramental force) వలననే సాధ్యము. నీ తపస్సువలన దానిని నీలోకి స్వీకరించాలిగాని నిర్వాణం, నిర్వాణం అంటూ ఎక్కడికో పారిపోకూడదు.*

కాబట్టి వైరాగ్యము, సన్యాసము నీకు విజయం చేకూర్చలేవు. ఆధ్యాత్మికానందం (delight) మాత్రమే దానిని సమకూర్చ గలదు. ఈ ఆనందము వట్టి శూన్యము కాదు. అది ఆనందఘనము.

శక్తికి సహనానికి పట్టుదలకి ధైర్యానికి మారుపేరు. ఒక్క అతి మానసమే దానిని సమకూర్చగలదు

*

దుఃఖానికి కారణాలు

దుఃఖానికి కారణం అజ్ఞానమే. దేని యొక్క అజ్ఞానము? ఏకత్వము, సాయుజ్యము, తాదాత్మ్యముల అజ్ఞానము.

సృష్టి ఎప్పుడైతే సృష్టికర్తనుండి వేరైపోయి ఆయన స్పర్శను కోల్పోయిందో ఆ క్షణంనుంచి అజ్ఞానమే యిచ్చట రాణిస్తోంది దుఃఖమే దాని పర్యవసానము.

ఆంతరంగికానుభూతి పొంది, దైవంతో సాన్నిధ్యమును పొందిన వెంటనే ఈ దుఃఖం మాయమైపోతుంది. అయితే మరో విచిత్రమైన వాదన బయలుదేరింది. సృష్టికి కారణం ఈ ఆనందం బదులు కామన (కోరిక) ట. ఇటువంటి పెద్దమనుష్యులు ఒకళ్లు కాదు. ప్రపంచంలోని మతాలన్నీ కూడా దాదాపు యిదే విధంగా బోధిస్తున్నాయి ముఖ్యంగా బౌద్ధుల వాదన యిదే. కోరిక చెడ్డది గనుక యి కోరికను వదిలేసి మళ్లి పెకెళ్ళిపోవడం ఒక్కటే విముక్తట!

కాని యీ వాదన చాలా పెద్ద తప్పు విముక్తిపొంది ఆత్మజ్ఞానాన్ని పొందేందుకు మంచిమార్గములనే సూచించారు బాగానే వున్నది అయితే యీ ప్రపంచం చెడ్డది ఈ జీవితం పాపభూయిష్టం ఇది కోరికవల్ల జనించింది. కాబట్టి నీ యావచ్ఛక్తిని ఉపయోగించి సాధ్యమైనంత త్వరలో ఈ లోకాన్ని వదిలి పారిపోవాలి అనే ఉద్దేశ్యము మానవ చరిత్రలోని ఒక కడుశోచనీయమైన ఘట్టము

ఒకానొకప్పుడు ఈ విధమైన బోధనవలన ఉపయోగం వుండియుండవచ్చును. *అయితే దానికిప్పుడు కాలం తీరిపోయింది. ఇంకా దానినే పట్టుకొని వేళ్ళాడటమెందుకు? ముందుకుపోయి మౌలికమైన సత్యాన్ని పట్టుకోవాలి. సృష్టిలోని ఆనందాన్ని చవిచూడాలి. దైవంతో తాదాత్మ్యంచెంది దానిని క్రిందికి తీసుకొని వచ్చి అభివ్యక్త పరచాలి.*

అతిమానస ఆవిర్భావము

ఇదీ భూలోకంలో యిప్పుడు మనం చేయవలసిన కర్తవ్యం. పూర్వపు ఆధ్యాత్మిక భావాలను త్యజించాలి. సరికొత్త మార్గములపై పయనించాలి. నూతన ఆవిర్భావమునకు ద్వారములను తెరవగల అతిమానససిద్ధిని (supramental realisation) సంపాదించుకోవాలి. అందుకనే నేను మీకు ఆనందము (delight) నిజమైన, అసలైన దివ్యానందం ఒక్కటే (divine delight) మనకు విజయమును చేకూర్చగలదని నొక్కి వక్కాణిస్తున్నాను. అయితే ఈ ఆనందం ఏమిటి? దాని స్వరూపం ఏమిటి? శ్రీఅరవిందులు దాన్ని గురించి మొదటినుంచి మనలను హెచ్చరిస్తూనే ఉన్నారు. నువ్వు ప్రాపంచిక భోగములను అధిగమించినపుడే ఆ ఆనందమును పొందగలవు. ఆనందము (delight) అభివ్యక్తమైనప్పుడే bliss అంటే ఏమిటో నీకు తెలుస్తుంది. *నువ్వు మామూలుగా పొందే సుఖసంతోషములతో దానిని పోల్చేవు జాగ్రత్త. వీటిని నీవు పూర్తిగా పరిత్యజించినప్పుడే ఈ delight, bliss అంటే ఏమిటో అర్థమవుతాయి.*

అనువాదం: ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి

శ్రీఅరవిందులు ఒక మతాన్ని బోధించారా?

శ్రీమాత ప్రవచనములు

శ్రీఅరవిందులు ఒక నూతన ప్రవక్తయా? నేటివరకు వచ్చిన మహాత్ములందరు సరికొత్త మతాలను స్థాపించడమో లేక పాత మతాలను సంస్కరించటమో చేయటంవలన సాధారణప్రజలలో ఇటువంటి అనుమానం కలగవచ్చు. వారి ఉద్దేశ్యంలో మతమే మానవుల పరమావధి. అంతకుమించిన సత్యము వారి ఊహకతీతమైన విషయం. శ్రీఅరవిందులు మతాల కతీతమైన ఒక నూతన సత్యాన్ని ఆవిష్కరించారు. దీనిని మామూలు మతములవలె కొన్ని సూత్రములతోను, నిబంధనలతోను బిగించుట

అసంభవము. భూలోకమును పరివర్తనము గావించి దివ్యీకరించుటయే దాని లక్ష్యము. — సంపాదకుడు

ప్రశ్న: చాలామంది శ్రీఅరవిందుల బోధలు ఒక నూతనమతమని అంటారు. మీరు అంతేనా?

శ్రీఅరవిందులు మతాల కతీతం

అలా చెప్పేటటువంటి వారు, తామేం చెబుతున్నారో కూడా తెలుసుకోలేని మూర్ఖులు. నీవు శ్రీఅరవిందులవారేం వ్రాశారో చదివితే, ఆయన రచనల ఆధారంగా ఒక మతాన్ని నిర్మించటం ఎంత అసంభవమో తెలుస్తుంది. ఎందుకంటె వారు ప్రతి సమస్యను, ప్రతి ప్రశ్నను అన్ని కోణాలనుంచీ మన ముందుంచుతారు. వాటిలోని సత్యాన్ని చూపుతారు. సత్యసిద్ధి కోసం, మానసికభావనల కవతల నీవొక సమన్వయాన్ని తెలుసుకోగలిగి, ఆలోచనాతీతస్థితిలోకి ప్రవేశించగలగాలని, శ్రీఅరవిందులు వివరిస్తారు.

మనం శ్రీఅరవిందులను గురించి మాట్లాడుతున్నప్పుడు, వారిది ఒక బోధననిగాని లేక నూతనవిషయ వివరణ అనిగాని అనే ప్రశ్నే తలెత్తదు. భగవంతుడు తనంతట తానుగా చేయు కార్యము. దాని ఆధారంగా ఒక మతాన్ని ఎలా స్థాపించగలం?.

మానవులదృష్టి సంకుచితము

కాని మానవులు దేనినైనా సరే మతంలోకి మార్చగల మూర్ఖులు. తమతమ సంకుచిత ఆలోచనకో, పరిమిత చర్యకో ఒక స్థిరమైన చట్రం యొక్క ఆవశ్యకత వారికంత ఎక్కువగా ఉంది. ఒక దానిని ఇది సత్యం, ఇది కాదు అని నొక్కి చెప్పక పోతే అది వారు తమ వాదనలోని లోపముగా భావిస్తారు. కాని శ్రీఅరవిందుల రచనలను చదివి అర్థం చేసుకున్న వారెవరికైనా, అలా నొక్కి చెప్పటం అసంభమవుతుంది. మతం, యోగం రెండూ ఒకే అస్తిత్వస్థాయికి చెందినవి కావు. అన్ని మానసిక అంధ

విశ్వాసాలనుండీ బయటపడినప్పుడే ఆధ్యాత్మికజీవితమనేది తానుండవలసినంత స్వచ్ఛంగా ఉండగలుగుతుంది.

*

వైరాగ్యవాదన

శ్రీఅరవిందులు జన్మించేదాకా, మతాలు, ఆధ్యాత్మికశాఖలు ఎప్పుడూ గతంలోని వ్యక్తుల చుట్టూ కేంద్రీకృతమయ్యాయి. వారు ఈ భూమిమీది జీవితాన్ని కాదనటమే తమ 'లక్ష్యం' గా చూపుతూ వచ్చారు. కాబట్టి, నీవు కోరుకోవలసింది కేవలం రెంటిలో ఒకదానినే: 'ఈ' భూమి మీది జీవితం, దాని చుట్టూగల చిన్నచిన్న సుఖాలు, బాధలు, సంతోషాలు కష్టాలు, నీవు సరిగ్గా ప్రవర్తించకపోతే నరక యాతన, లేదా – ఇంకో ప్రపంచంలోకి తప్పించుకోవటం, స్వర్గం, నిర్వాణం, మోక్షం....

ఈ రెంటిమధ్యా పెద్దగా కోరుకోవటానికేమీ లేదు, రెండూ చెడ్డవే.

భారతదేశపు బలహీనతకు, పతనానికి ఇదే మౌలికమైన కారణమని శ్రీఅరవిందులు చెప్పారు. దేశంలోని శక్తినంతా పీల్చి వేయటానికి బౌద్ధం, జైనం, మాయావాదం చాలు.

కాని ఒకటి నిజం, పదార్థం కంటే భిన్నమైంది ఉంది అని ఇంకా భావించే ప్రదేశం, ఈ ప్రపంచంలో భారతదేశమొక్కటే.

ఈ భౌతికజీవితంనుంచి పారిపోవటంలో సత్యం లేదని శ్రీఅరవిందులు మనకు చూపారు. ఈ భౌతికజీవితంలోనే ఉండి, దానిని అధిగమించటం, దానిని దివ్యమయం చేయటం, దాని వలన దివ్యత్వం ఇక్కడ, ఈ భౌతికప్రపంచంలోనే అభివ్యక్త మవుతుందని మనకు శ్రీఅరవిందులు చూపారు.

*

తనను గురించి శ్రీఅరవిందులు

శ్రీఅరవిందులు ఒక మతాన్ని స్థాపించేందుకు రాలేదు

ఏదైనా ఒక మతాన్ని అభివృద్ధిచేయటంగాని, వివిధములైన ప్రాచీనమతాలను

కలపటంగాని లేక ఒక నూతనమతాన్ని స్థాపించటంగాని శ్రీఅరవిందుల ఉద్దేశ్యం కాదు – ఎందుకంటే, ఇవన్నీ వారి కేంద్ర లక్ష్యంనుంచి దూరంగా తీసుకుపోతాయి. ఆయన యోగం ఏకైక లక్ష్యం అంతర్గతమైన ఆత్మాభివృద్ధి; సర్వభూతములలోను అధివసించే ఏకైకాత్మను కనుగొని మానసికంకంటే భిన్నమైన, ఉన్నతమైన చైతన్యాన్ని – మానవప్రకృతినే మార్పు చెందించి, దైవీకరణం చేయగల మహాచైతన్యాన్ని – ఆవిర్భవింపజేయుట.

అనువాదం: కాకుమాని తారానాథ్

మతముల భవిష్యత్తు

శ్రీమాత ప్రవచనములు

ఈ సృష్టంతా భగవంతుడు చేసినమాట నిజమేకాని ఆయన పూర్ణరూపాన్ని ఒకేసారి ఆవిష్కరింపజేయడుకదా! సృష్టికార్యము నిర్వహించుటకై ఆయన మెట్లుమెట్లుగా దిగివస్తాడు. ఇంతవరకు జరిగిన సృష్టంతా అధిమానసము (overmind) అనే స్తరము నుండి జరిగినది. శ్రీఅరవిందులు ఇంతకంటె పైనవున్న అతిమానసము (supermind) నుండి ఓ సరికొత్త సృష్టిని నిర్వహించుటకై అవతరించారు. మొదటిది మతములకే పరిమితమైనది. అతిమానసము మతముల కతీతము. ఈ అద్భుతమైన అతిమానససృష్టినే మనమిప్పుడు వీక్షించుచుంటిమి.

– సంపాదకుడు

ప్రపంచ పరివర్తనం

పూర్వకాలపు ఆధ్యాత్మికమనగా జీవితం నుంచి దివ్యసత్యంలోకి తప్పించుకు పోవడమే అని శ్రీఅరవిందులు చెప్పారు. దీనిని నేను కూడా చాలా సార్లు చెప్పడం జరిగింది. ఈ ప్రపంచాన్ని దాని ఖర్మ ఇంతేలే, దానిని ఎవరు బాగు చేయలేరు అని అలాగే వదిలేయడం.

అయితే, దానికి విరుద్ధంగా, మన క్రొత్త దర్శనంలో, జీవితాన్ని దివ్యమయం చేయడం, భౌతికప్రపంచాన్ని దివ్యప్రపంచంగా పరివర్తనం చేయడం జరుగుతుంది. ఇది చాలాసార్లు మళ్ళీమళ్ళీ చెప్పడం జరిగింది. కొద్దో గొప్పో అర్థం చేసుకోడం జరిగింది. అదే మనం చేయాలనుకునేదానికి మూలభావన. కాని ఇది, ఆలోచనాక్షేత్రంలో ఒక భావన ఉన్నంతవరకు వాస్తవానికి అది అంతకంటె ఎక్కువైందేమీ కాదు. అదివరకు ఉన్నట్లుగానే ఉండే పాతప్రపంచాన్ని కొంత మెరుగుపరచి కొనసాగించటం, విశాలం చేయటం కాగలదు.

నూతనసృష్టి ప్రభావము

కాని ఇప్పుడు జరిగింది, అది కాదు, కానే కాదు. ఇదొక సరి క్రొత్త సృష్టి. క్రొత్తప్రపంచం జనించింది, జనించింది, జనించింది. అది పరివర్తన చెందుతున్న పాతప్రపంచం కాదు. క్రొత్తగా జనించిన ప్రపంచం. మనం ఇప్పుడు రెండూ పెనవేసికొన్న సంధి కాలంలో ఉన్నాము. పాతప్రపంచమూ, దాని వ్యవహారమూ అంతా ఇంకా నడుస్తూనే ఉంది. అయినప్పటికి ఈ నూతనప్రపంచం నిశ్శబ్దంగా, కనబడకుండా, నిరాడంబరంగా తెలియబడకుండా ప్రవేశిస్తోంది.

మతముల కాలం తీరిపోయింది

దీనిని గురించి ఇంకా ఎవ్వరికీ తెలియదు. ఎవరూ దానిని గుర్తించలేదు. బాహ్యప్రపంచంలో దాని సాక్ష్యాధారాలేవీ కనబడవు. అయినా దాని పని అది చేసుకుపోతూనే ఉన్నది. దినదిన ప్రవర్ధమానమై అనతికాలంలో బాహ్యదృష్టికి కూడా అది గోచరిస్తుంది. నేటి ప్రపంచాన్ని శ్రీఅరవిందులు అధిమానస (Overmind) సృష్టి – అధిమానస లోకస్థులు చేసిన సృష్టి (age of the gods) అన్నారు. దీనినే మనం మతముల యుగం అంటాము. మానవుడు తన తెలివితేటలతో శోధించి పొందిన జ్ఞానమే లోకములో మతముల రూపంలో ఆవిష్కారమైంది. అయ్యది పైలోకాలకి, మానవునికి మధ్య ఒక వారధి. ఈ జ్ఞానముయొక్క అత్యుత్తమ స్వరూపము మతముల యొక్క సమగ్ర

స్వరూపం. ఇదే మానవ ఆకాంక్ష అందుకోగలిగిన మహోన్నత స్థాయి – అధిమానసము (Overmind). ఆ స్థాయినుంచి దృష్టిని యింకా పైకి సారించినపుడు ఆ లోకములు, వాటిని గురించిన జ్ఞానము, వాటి చైతన్యము ఛాయగా కనబడుతూ ఉంటాయి. కాని దాని నందుకొని క్రిందికి తీసుకొని ఆవిర్భవింపజేయుటకు మరొక విధమైన ప్రజ్ఞ కావాలి. ఈ అధిమానసమును దాటి దాని ఆవలి దిక్కునకు చేరుకోవాలి. (to grasp it, a reversal of consciousness is needed) అప్పుడుగాని అతిమానససృష్టి (supramental creation) ఆవిష్కారము జరగదు.


ఇప్పుడేమి జరుగుతుందో తెలుసా! ఈ పాతప్రపంచమంతా కాలం తీరిపోయిందన్న మాట. అదంతా అసలు సత్యము యొక్క వికారస్వరూపము.

అతిమానససృష్టిలో మతాలకు తావు లేదు. ప్రపంచంలో దైవముయొక్క అఖండస్వరూపమే రాణిస్తుంది. భేదప్రతిష్ఠితమైన మతములిక ఉండవు. And there will no longer be what men now call gods...

అయితే ఇదంతా భవిష్యత్తులో జరిగే విషయం. ఈ భవిష్యత్తు యిప్పుడే ఆరంభమై క్రమక్రమంగా ప్రవర్ధిల్లుచున్నది. మనమిప్పుడొక అపూర్వమైన తరుణంలో ఉన్నామని మీ కర్థమయిందా లేదా? ఇటువంటిది ఈ ప్రపంచచరిత్రలో ఇంతవరకు ఎప్పుడు జరగలేదు.

మనమిప్పుడొక నూతనసృష్టికి నాంది పలుకుతున్నాం. కనుక మానవబుద్ధితో నిర్మించిన వ్యూహాము లన్నిటిని ప్రక్కన పెట్టి సాహసంగా ముందుకు సాగిపోవాలి.

అనువాదం: టి. ప్రసన్న కృష్ణ. ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి



SRI AUROBINDO

మత-యోగాల భిన్నత్వం

శ్రీఅరవిందుల రచనలనుండి కూర్పు

మతమనగా ఓ తతంగము. ఆడంబరముతో కూడినది. మానవుడు దైవమువైపు వేసే తప్పటడుగు. దీనివలన దైవాన్ని గురించిన ప్రత్యక్షజ్ఞానము ఏమాత్రం కలుగదు. అయినప్పటికి దాని వెనుక కొన్ని మౌలికసత్యములు లేకపోలేదు. మతము భక్తునికి భగవంతునికి మధ్య ఒక అగాధమును కల్పిస్తుంది. యోగము దానిపై వారధి కడుతుంది. ఆధునిక మానవుడు ఏవిధంగా భౌతికప్రపంచాన్ని విశ్లేషించి విజ్ఞానశాస్త్రాన్ని తయారుచేసాడో అదేవిధంగా యోగి ఊర్ధ్వలోకములను, వాటి విన్యాసములను పరిశీలించి యోగశాస్త్రమును తయారుచేసాడు. భక్తుడు భగవంతుణ్ణి ఏవిధంగా సమీపిస్తాడో ఆయన కూడా అదేవిధంగా భక్తునికి దర్శనమిస్తాడు.

— సంపాదకుడు

మతము ఆత్మజ్ఞాన ప్రేరకము

మతము జ్ఞానంకాదు. ఒక విశ్వాసం, ఒక సత్యకామన. అది అనంత తాత్త్విక సత్యానికి సంబంధించిన ఒక అనుభవం. దానికి సంబంధించిన ఒక అంతరసంవేదన లేదా స్ఫురణ. కనుక మతవ్యక్తి సాధారణ మానవజీవితం కంటె పైనున్నాడు. కానీ, మతం మనకి ఆశా విశ్వాసాలను కల్పిస్తుంది. మనలో గుప్తంగా తత్త్వాన్ని గుర్తించటానికి వీలైన రహస్యమార్గాలను తెరుస్తుంది. తదన్వేషణ — తత్‌కామనల ద్వారా మనకు కొన్ని సత్యాలను ప్రతీకలను అందిస్తుంది. లేదా మతానికి సంబంధించిన కొన్ని మూఢనమ్మకాలను కల్గిస్తుంది. ఆధ్యాత్మిక సత్యజ్ఞానంలో లేదా ఆధ్యాత్మిక విద్యలో మనం బాలకులమనీ, అనంతత్వం మన కందనంత దూరాన ఉన్నదనీ భావించటానికదొక గుర్తు. ఆ అంధ విశ్వాసం, మూఢాచారాలు మతబాహ్య స్వరూపం మాత్రమే.

మతముల వెనుక సత్యము

ఐనా, ప్రతి మతంలో బాహ్యస్థితికి సంబంధించిన విశ్వా

సాలు, ఆచారాలు, ఆశలు, ప్రతీకలు – వీటికడుగున చాలాలోతున, ఆంతర ఆధ్యాత్మ విద్యాశిక్షణ, ఒక వెలుగు దాగివుంటాయి. ఇవి మనకు అంతరాత్మాన్వేషణకు – గుప్తనిధికి బాటలు తీరుస్తాయి. కనుక ప్రతిక్రతురూపమతానికి అడుగున ఆత్మవిద్యా రహస్యా లుంటాయి. యోగవిద్య ఇమిడి వుంటుంది. ఆత్మసంవేదనకది ఆధారం. విశ్వాసానికది మొదటిమెట్టు. మతప్రతీకలు అవ్యక్త సత్యాలకు కల్పిత రూపాలు. చెల్లాచెదరైన అంతస్సత్యాలకవి ప్రతిమలు – బాహ్యంగా కన్పించే మూఢవిశ్వాసాలు కూడా ఊర్ధ్వ భూమికలలోని అద్భుతాలకు సంకేతాలు. స్థూలప్రపంచ వస్తువుల ఆకారాలకంటె అడుగున దాగిన సత్యాలను *విజ్ఞానశాస్త్ర మందిం చినట్లు – యోగం అంతర్లోకాలకు – ఊర్ధ్వభూమికలకు సంబం ధించిన సత్యప్రకటన చేస్తుంది.* మతప్రయోజనమైన ఆత్మజ్ఞానా న్వేషణకు మనకు ఆశా సంకల్పాలను కల్పిస్తుంది.

*

మతములు – దేవతారాధన

ప్రతిమతమూ మానవాతీత శక్తి ఒకటి వున్నదన్న నమ్మకమునుండి బయల్వెడలుతుంది. దాని ఆరాధనా విశేషంగా ఒక కర్మరూపమైన ఉపాసన, అర్చన తదాలోచనలను వినమిత బుద్ధియై సమర్పించటం. ఆ మహాశక్తి సంకల్పమూ – ధర్మక్రమా లను శిరసా స్వీకరిస్తూ జీవించే విధానమే ఆరాధన. కానీ, ప్రథ మతః ఈ మతదృష్టి ఆరాధింపబడే ఆ మహాశక్తి రూప దైవానికీ – ఆరాధించే వ్యక్తికీ నడుమ ఒక భేదం – దూరముంటుంది. యోగమలాకాక దాని పరిపక్వదశలో ఆ దూరాన్ని కలుపుతుంది. యోగమంటే సమైక్యం కనుక. ఈ సమైక్యభావం జ్ఞానం ద్వారా సాధ్యం. *మొదట్లో మన దైవభావన గజిబిజిగా – సంకీర్ణంగా వుండి – క్రమంగా స్పష్టపడి, విస్తృతమై, అగాధమై తుదకు అదీ మనమూ ఒకటేనన్న భావంగా – అనుభవంగా పరిణతి పొందుతుంది.* మన జీవితాల కదే ఆదిమస్థితిగా, పోషకునిగా చివరి ధ్యేయంగా రూపొందుతుంది. తదైక్యానుభవము కర్మల ద్వారా పొందగలం. కేవల వినమిత బుద్ధితో మన సంకల్పాలను

దాని సంకల్పంలో లీనంచేసి – తదాజ్ఞాబద్ధులమై నడుచుకో వటంద్వారా – దానిలో మనం లీనం కావచ్చు. ఈ కార్యాచరణ ద్వారా ఆలోచనద్వారా మన సంకల్పం పవిత్రమై విశాలమై తుదకు తత్ సంకల్పంగా పరిణామం పొందుతుంది. ఈ సమైక్యం ఆరాధన ద్వారాకూడ పొందవచ్చు. దూరంగావున్నదన్న తలంపు క్రమంగా సామీప్యాన్ని పొంది అది ప్రేమపూర్వక సాన్నిహిత్యాన్ని సాధిస్తుంది. ఈ దివ్యప్రేమావేశమే చివరకు జీవుని ఈశ్వరునితో సమైక్యపరుస్తుంది.

యోగము అనుభవపూర్వకము

యోగమొక తర్కమో – సిద్ధాంతమో కాదు. అది తత్త్వశాస్త్రం కాదు. లేదా సాధారణ మతమూ కాదు. కేవలం అనుభవం. *అదీ విశ్వోత్తీర్ణమైన విశ్వజనీనమైన దివ్యమూర్తితో మనకు లభించే సంయోగం – సమైక్యానుభవం. ఈ అనుభవం జాగ్రద్దశలో తెలిసి పొందేది. ఎవరితో? అదృశ్యశక్తితో. ఈ అనుభవం నిత్యమూ పరిశీలించుకో దగ్గది.* సవరించుకోదగ్గది. దృశ్యమాన జగత్తులో మనం పొందే అనుభవం ఎంత మెలకువతో పొందుతున్నామో అంత మెలకువగా పొందేదీ యోగానుభవం కనుక యోగం జాగృతదశలో పొందే అనుభవం. నిత్యజాగృతుడైన వ్యక్తి యోగానికి సాధనభూతుడు.

*

దైవముతో సంబంధము పలువిధములు

పరమపురుషుడే విరాట్పురుషుడు. ప్రపంచంతో మనకున్న సంబంధ బాంధవ్యాలన్నీ అతనితో ఏకం కావటాని కుపయోగించే మార్గాలే. నిత్యజీవితంలో ఏ ఉద్రేకాలూ – ఆవేశాలూ మనం చవిచూస్తున్నామో అవన్నీ ఆయనపై ప్రయోగించే బాణాలే. అజ్ఞానావరణలో మొదటగా, ఆ ఉద్రేకాదులు జ్ఞానాభివృద్ధి క్రమంలో మనమతనికతి సన్నిహితం కావటానికి కుపయోగించేవే. వానిలో ఏ లోపమున్నా అజ్ఞానలేశమున్నా – మన సమైక్యానికి సన్నిహితమవుతున్నకొలదీ – రాలిపోతాయి. అన్నిటినీ అతడు సమాధానపరుస్తాడు. మన పురోభివృద్ధి

క్రమంలో మనమే భూమికలో వున్నామో తదనుగుణంగా ఆయన సమాధానపరుస్తాడు. మన బాట ఎత్తుపల్లాల బాట కనుక ఆ ప్రయాణంలో మనకే విధమైన ఊరట కానీ, సాయం కానీ లభించలేదనుకో — *మనకిక పరిపూర్ణ బాంధవ్యం సాధ్యం కాదు. ఎవరే విధంగా ఆయనను సమీపిస్తారో ఆయన తన దివ్య ప్రేమతో వారి భక్తికనుగుణంగా వారికి సేద దీరుస్తాడు. ఆదరిస్తాడు — "తథైవ భజతే" — వారే గుణానుసారంగా, వ్యక్తిత్వానుసారంగా ఆయనవైపున కడుగులు వేస్తారో ఆయనా అదే విధంగా వారి అభివృద్ధికి తోడై వారికి చేయూతనిచ్చి — తోడి బాటసారిగా — వారి వారి మార్గాల్లో వారిని నడిపిస్తాడు.* ఆయన సాక్షాత్కృతి వారి వారి భావ గుణానుసారంగా వుంటుంది. అది పాక్షిక సత్యమైనా సంకీర్ణతనమైనా అది అతనికి సంబంధించింది కాదు. మన దృష్టికి — భావానికీ సంబంధించినది.

మతముల యొక్క పాక్షిక సత్యము

ఈ సత్యం మనకా పరిపూర్ణ స్వరూపం అవగతమయ్యేటంత వరకూ తెలియదు. ఇదే ప్రాథమిక మతస్వరూపం. అదంత అనాగరకంగా వుండటానికి కారణాలివే. మరణానంతరస్థితి కూడా వారి మొరటు ఆలోచనలకనుగుణంగా వుండేది. ఐనా అదీ మతమే. ఎందుకంటె ఆ అనాగరకభావాలకు అడుగున తాత్త్వక సత్యమిమిడి వున్నది కనుక. మానవ చైతన్య పరిణామంలో అదొక దశ. అదీ ఒక మెట్టే కనుక ఊర్ధ్వారోహణకదీ ఉపయోగపడింది. వానిని నిరసించటానికి కారణం. ఆ అనాగరక భావజాలంలో చిక్కుకొని నిత్యమూ అల్లాడటమంటే పరమేశ్వర సమైక్యానికి మనం దూరం కావటమే కనుక. అయినా మనిషి బాల్యావస్థలో వేసే తప్పటడుగుల్లాగా ఆ మొరటు తలపులుకూడా మతమానవుని పురోభివృద్ధికి ఆధారమైనవే.

జీవితమంతా యోగమే

మన మనుకొన్నట్లు జీవితమంతా ప్రకృతి యోగమే. ప్రకృతి అని ఎందుకన్నామంటే ఈ ప్రాకృతిక భౌతికజీవనమంతా ఆమె తన అచేతన సుషుప్తవ్యవస్థనుండి మేల్కొని — తను ఎక్కడనుండి

బయలుదేరినదో ఆ మహాచైతన్య సమన్వయం – సమత కోసం నివృత్తి మార్గంలో ప్రయాణించటమే. మతంలో మానవమనస్సు ఆమె ఏర్పాటు చేసుకొన్న సాధనం కనుక తన ప్రయాణప్రయోజనం దానికి తెలుస్తుంది కనుక దాని ద్వారా తన ధ్యేయానికి చేరుకొంటుంది. లోకంలో సాధారణ మతాలు సైతం ఒక అజ్ఞాన భక్తి యోగశాఖలే. మనం యోగమనంటున్నదానికీ దీనికీ భేదమేమంటే – దీని ఉద్దేశ్యమూ – ప్రయోజనదృష్టి తత్త్వసమతా నిష్పాదకం కానంతవరకు – అతని సమైక్యమే ధ్యేయం కానంత వరకూ – దాని ఆలోచనల్లో దార్శనికత ప్రవేశించనంతవరకూ – ఈ యోగానికీ దానికీ భేదముంటుంది. ఆ ప్రయోజనదృష్టిలో దార్శనికత ప్రవేశిస్తే యోగమౌతుంది.

*

మతముల బాహ్యారూపము, యథార్థము

మతానికి రెండు ముఖాలున్నాయి. 1. యథార్థమైన మతం 2. ఆచార – క్రతు రూపమైన మతం

మొదటిది కేవల తాత్త్వక సత్యంలోనే జీవిస్తుంది. బుద్ధికీ కళాసౌందర్యతత్త్వానికీ నీతికీ – న్యాయానికీ – అతీతమైన కేవల ఆత్మతత్త్వంలోనే ప్రవర్తించేది. ఆ ఊర్ధ్వకాంతిని శరీరంలో ప్రత్యవయవంలో ప్రసరింపచేసుకొని పాలకశక్తిగా చేసుకొనేది.

రెండవది కొన్ని బౌద్ధికాచార కాండలపై – కొన్ని రూపాలపై – వేడుకలపై – శుష్కమైన నీతిసూత్రాలపై కొన్ని మత రాజకీయాలపై – లేదా, సమాజానుగుణంగా ప్రవర్తించే మతం సమాజమతం.

*

ధార్మికజీవనము ఆధ్యాత్మికజీవనము

మనిషికి మూడు రకాల జీవితాలుండటాని కవకాశమున్నది. 1. అధ్యాత్మ జీవనం 2. ధార్మికజీవనం 3. సాధారణ జీవనం. ఇందులోనే నైతిక దృష్టి సమ్మిళితమై వుంటుంది. ఈ మూడు ప్రత్యేకమైనవి. ఎవనికేది ఇష్టమో అతడదే తెలుసు

కోవాలి తప్ప మూటినీ గజిబిజి చేయకూడదు. సాధారణజీవితం గానుగెద్దులాగా ఒక నిర్ణీతమార్గంలో పోతుంది. శరీర మనః ప్రాణాలు అజ్ఞాన వలయంలో చిక్కుకొని తన స్వస్థానమైన దివ్య సత్యంనుండి దూరమై అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతుంది. మతజీవితమూ (ధార్మికజీవనం) ఇంతే. మానవచేతన అజ్ఞానబద్ధమై ప్రవర్తిస్తూనే తన స్వస్థానమైన దివ్యసత్యం వైపునకు ప్రయాణించే సంకల్పంతో బ్రతుకుతుంది. కానీ ఆ ధ్యేయస్వరూపావగతి వుండదు. అంధవిశ్వాసాలు – ఆచారాలు – బాహ్యక్రతువిధానానుసరణంలాంటి వాటిని అనుసరించటం వీటి ద్వారానే భౌతిక చేతనా బంధవిముక్తి కోసం ఆరాటపడటముంటుంది. కనుక తాత్త్విక జీవనానికిది ప్రథమ ప్రాథమిక సోపానం. కానీ, నూటికి తొంభైపాళ్ళు క్రతువులు – ఉత్సవాలు – ఛాందసభావాలు – అంధవిశ్వాసాలు – వీటిలో సుడిపడి భ్రమించటమే తప్ప ధ్యేయోన్ముఖీనత వుండదు. దీనికి విరుద్ధంగా – ఆధ్యాత్మిక జీవనం ఎకాయెకీ పరిణత చైతన్యంతో – అంటే సాధారణ చేతనను ఉన్నతీకరించటంద్వారా, ఊర్ధ్వముఖం చేయటం ద్వారా – సత్యాసత్య విభేదాన్ని దర్శించి – పరమచైతన్యం వైపు చేసే ప్రయాణం. దీని ధ్యేయం స్వస్వరూపావగతి – స్వాత్మావలోకనం. దివ్య తత్త్వంలో లీనం కావటం. ఆత్మాన్వేషణ కలవానికి కర్తవ్యం చైతన్యంలో మార్పు కల్పించి దానిని విస్తృతం చేసుకోవటమే.

అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

మనది భూలోకం. మనం భూలోకవాసులం. అటులనే ఇతర లోకాలు – అధిమనస్సు (overmind), అతిమనస్సు (supermind) ఉంటాయి. ఆ లోకవాసులు వుంటారు.

శ్రీమాత రచనలనుండి

శ్రీమాత ప్రవచనములు

రోగాలను దరిచేర్చలేని సంకల్పాన్ని పెంచుకో. అన్నిటినీ మించి నీ శరీరం పనికిమాలినదనే భావాన్ని దగ్గరకు రానివ్వకు. అటువంటి ఆలోచనలేవి వచ్చినా అవి సిద్ధికి గొడ్డలిపెట్టు లవుతాయి. శరీరాన్ని దెబ్బతీస్తాయి. ఇక్కడ యోగసాధనచేసే వారికి చాలా మందికి అటువంటి ఆలోచనలు రావచ్చు. వాళ్లు మొదట చేయాల్సింది ఇటువంటి ఆలోచనలను తరిమికొట్టడమే. యోగసాధన చేసి సిద్ధిపొందాలనుకున్నా, లేక వేరేవిధంగా ఏదైనా మహత్తర కార్యం సాధించాలనుకున్నా కంటికి కనుపిస్తున్న దానికి అతీతులై ఉండాలి. అంతేకాక ఎటువంటి అనారోగ్యాన్నైనా ఎంత దారుణవ్యాధినైనా, పదే పదే తిరుగపెడుతున్నా దాన్ని తప్పించుకోవాలనే దృఢసంకల్పాన్ని పెంచుకోవాలి. వ్యతిరేకంగా వచ్చే సూచనలను తిప్పికొట్టాలి.

*

అన్నిరకాల వ్యాధులు దేహంయొక్క సంస్కారహీనతవల్లనూ లోపభూయిష్టతవల్లనూ వస్తాయి. అది ఉన్నతచైతన్యానికి తగినట్లు వికసించినట్లయితే, ఆ ఉన్నతచైతన్యం లోపలికి ప్రవేశించినప్పుడు రోగనిరోధకశక్తి కల్గుతుంది. ఈ లోపున శ్రీఅరవిందులు సూచించినట్లు పైనుంచి శక్తిని పిలుచుకొని కైవశం చేసుకొని అస్వస్థతను పారద్రోలాలి. అన్నిటికంటె మేలైన మార్గం అదే.

*

మానవశరీరానికొక దురలవాటు ఉంది. దాన్ని కోరి పిలిచే అనేక శక్తులకు అది స్పందిస్తూంటుంది. దాని అయోమయానికీ, జడత్వానికీ అది చెల్లించే మూల్యం శరీర అస్వస్థత. అది కేవలం దైవశక్తికి మాత్రమే స్పందించటం నేర్చుకోవాలి. అది అంత తేలిగ్గా పట్టుబడేది కాదు.

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామ శాస్త్రి

శ్రీమాత ప్రవచనములు

నవంబరు 1, 1954

(1954 నవంబరు ఒకటిన పాండిచ్చేరితోపాటు భారతదేశంలోని ఇతర ఫ్రెంచిస్థావరాలు కూడా సమగ్ర భారతదేశంలో కలిసాయి. ఆ శుభసందర్భాన శ్రీమాత, తన చిహ్నాంగల పతాకాన్ని ఆశ్రమంలో గం॥ 6.20 నిమిషాలకి ఎగురవేసి ఈ సందేశాన్ని ఇచ్చారు)

మనకి నవంబరు ఒకటవతేదీ చాలా ప్రాముఖ్యంగల రోజు. సమగ్రభారతదేశానికి ఆధ్యాత్మిక పతాకంగా శ్రీఅరవిందులు రూపొందించిన పతాకం ఇది. దాని చతురస్ర ఆకారానికీ, వర్ణానికీ, రూపంలోని ప్రతి ఒక్క వివరానికీ, అంశానికీ ఒక నిగూఢ అర్థం, సంకేతం ఉన్నాయి. ఆగస్టు 15, 1947 లో భారతదేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు దీనిని ఎగురవేశాం. తిరిగి ఈనాడు, నవంబరు 1, 1954 న ఈ ప్రాంతాలు భారతదేశంలో కలుస్తున్నప్పుడు ఎగురవేస్తున్నాం. అలాగే ఇక ముందుకూడా భారతదేశం తనదైన ఏ భాగాన్నయినా పొందినప్పుడు ఈ పతాకం ఎగురవేయబడుతుంది. సమైక్యభారతావని ఈ ప్రపంచంలో ఒక ప్రత్యేక కార్యం నిర్వహించవలసి ఉంది. ఆ లక్ష్యం కోసమే శ్రీఅరవిందులు తమ ప్రాణాన్ని అర్పించారు. మనం కూడా అలాగే చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

*

భారతదేశం అతిభీకర పోరాటంలో గెలిచి, భౌగోళిక సమగ్రత సాధించడమేకాక, దీనికంటే దారుణము, ప్రాణాంతకము అయిన నైతికపోరాటంలో కూడా విజయం సాధించి, (నైతిక పోరాటం ఇంకా భీకరమైనది ఎందుకంటే ఈ విపత్తు మన శరీరాన్ని చంపదు, ఇంకా ముఖ్యమైన మన ఆత్మ సంబంధాన్ని విచ్ఛిన్నం చేస్తుంది). ఈ ప్రపంచంలో తన సహజస్థానాన్ని తిరిగిపొంది, తన

ఉన్నత ధార్మికకార్యాన్ని పునఃప్రారంభించినప్పుడు, కేవలం వ్యక్తి గత ఆశలు, ఆశయాల కారణంగా రాజ్యపరంగా రాజకీయపరంగా ఉండే చిన్న చిన్న వివాదాలన్నీ వాటంతటవే, సహజంగానే, వివేకము అవగాహనలతో పరిష్కారమయిపోతాయి.

అనువాదం: బి. వరలక్ష్మి

ఆధ్యాత్మికమనగా ఏమి?

శ్రీఅరవిందుల ప్రవచనములు

ఆధ్యాత్మికజీవితానికి నీ తెలివితేటలెందుకు పనికిరావు. బుద్ధి కుశలత, ఆచారపరాయణత్వము, ధార్మికవర్తనము, నైతికాదర్శములు, నిరాడంబరత్వము, భక్తితత్పరతాదులన్నీ మంచివేకాని ఇవన్నీ మామూలు జీవితానికి సంబంధించిన విషయములు – ఆధ్యాత్మికములు కావు. ఈ సద్గుణాలన్నిటి సంపుటి కూడ ఆధ్యాత్మికము కానేరదు. కేవలం మనస్సుయొక్క నమ్మకము, విశ్వాసము, మతపరాయణత్వము, నైతికనియమాలంబనముల ద్వారా నీకు ఆధ్యాత్మికానుభూతులు కలుగవు. ఫలితము దక్కదు.

ఇవన్నీ మానవపరిణామము (mental evolution) లోని మొదటి దశకు చెందిన విషయములు మాత్రమేకాని ఆధ్యాత్మిక పరిణామ (spiritual evolution) ప్రక్రియలు మాత్రం కావు. వీటివలన మనస్సుకు తృప్తి కలుగవచ్చు. మామూలు జీవితానికి ప్రయోజనముండవచ్చు. శరీరమును సుశిక్షితము చేసి ప్రకృతిని పునీతముగావించి రాబోవు ఆధ్యాత్మిక పరివర్తనమునకు సిద్ధమగుటకు ఉపయోగపడవచ్చును.

మనిషిలో అతని మనోశరీర జీవితములకంటె భిన్నమైనది అతి ముఖ్యమైనది అయిన వస్తువు మరొకటున్నది. ఆధ్యాత్మికమనగా

దానిని పరిచయము చేసికొని, ప్రాప్తించుకొనుట. అది ఆత్మ, సత్యము, నీ నిజస్వరూపము. విశ్వమంతా వ్యాపించి ఉన్న, అఖండమైన సత్పదార్థము. అన్ని వస్తువులలోను, జీవరాసులలోను కూడ వ్యాపించి వున్నది. ఈ మహాభూత ప్రకృతిని పట్టుకోటమెలా? నువ్వు దానికోసం తపించాలి. దాన్ని తెలుసుకోవాలని, దాని స్పర్శను పొందాలని, దానిని నీ అనుభవంలోనికి తెచ్చుకావాలని తహ తహలాడాలి. నీ యావద్వ్యక్తిత్వమును తద్విషయోన్ముఖము చేసినప్పుడు నీ ఆకాంక్ష ఫలితముగా, తత్ స్పర్శద్వారా, తత్సంయోగమువలన, నీవొక నూతనశరీరమును పొంది, నూతనాత్మను, నూతనప్రకృతిని బడసి మరో విధమైన మానవునిగా పరిణమించెదవు.

అనువాదం: ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి

ప్రశ్నోత్తరములు

శ్రీఅరవిందుల జవాబులు

ప్రశ్న: జపము, పవిత్రగ్రంథ పఠనము, పూజలు పునస్కారాల లాంటివన్నీ ఆధ్యాత్మిక జీవితం కాదా? పరమోన్నత సత్యము నెరుగుటకు దోహదములు కావా?

అది కర్తయొక్క ఉద్దేశాన్నిబట్టి వుంటుంది. ఈ పవిత్రమైన విధులన్నిటిని చేసినా కూడా అతను అనాధ్యాత్మికంగా వుండవచ్చు. అంతేకాదు. అతనొక అసురుడుకూడ కావచ్చు.

ప్రశ్న: యాత్రలు చేసి, పుణ్యక్షేత్రాలను దర్శించి అనేకమైన దేవుళ్లను, దేవతలను ఆరాధించటంవలన ఏమైనా ప్రయోజన ముంటుందా? పరమసత్యము సిద్ధిస్తుందా?

సిద్ధించదు. అదంతా మామూలు చైతన్యానికి చెందిన వ్యాయామం మాత్రమే.

ప్రశ్న: వైష్ణవులందరూ కలసి సంకీర్తనం చేస్తూ వుంటారు కదా. దానివలన ఉపయోగమేమిటి?

అదంతా వట్టి ప్రాణికావేశము – భక్తిని పెంచుతుంది అంతే.

ప్రశ్న: కుటుంబములోని ఒక మనిషి దైవాన్ని సిద్ధించు కున్నట్లయితే మిగతా కుటుంబసభ్యులందరికి కూడా ముక్తి కలుగుతుందని విన్నాను. ఇది ఎంతవరకు నిజం?

అది నిజం కాదు. ప్రతివారికి వారి వారి విధి స్పష్టంగా వుంటుంది. ఫలానా కుటుంబంలో జన్మించటమనేది కేవలం కాకతాళీయమే గాని విధి నిర్ణేత కాదు.

ప్రశ్న: లౌకికజీవితంలో నిమగ్నమై వున్నవాళ్లు కష్టాలు వచ్చినప్పుడు మాత్రమే దేవుడ్ని తలుచుకుంటారు. అట్టి వారికి ఎంతవరకు ఆధ్యాత్మిక జీవితావకాశముంటుంది.

ప్రతిఒక్కరికి, దేవుణ్ణి ఎప్పుడూ తలవని నాస్తికునికి కూడ భవిష్యత్తులో అవకాశముంటుంది.

ప్రశ్న: దేవుడంటేనే గిట్టని నాస్తికునికి కూడ ముందు ముందు దేవుని వైపు తిరిగే అవకాశముందన్నారు కదా! మరి అటువంటప్పుడు మిగతావాళ్లు దేవుడు దేవుడంటూ ప్రాకులాడి సాధన చేయుటమెందుకు? అంత కష్టపడట మెందుకు?

వాళ్లకా అవకాశం వచ్చేందుకు పదివేల సంవత్సరాలు పట్టవచ్చు. అది కూడా యోగాభ్యాసము చేసిన తరువాతనే.

ప్రశ్న: మామూలు మనుమలు ఆపదలొచ్చినప్పుడు రక్షించు రక్షించు అని దేవుణ్ణి ప్రార్థిస్తారు. ఆ తరువాత పూర్తిగా మరచిపోతారు. ఆ మనుమల జీవితంలో దైవసంరక్షణమంటె ఇంతేనా?

అవును. మామూలు మనుషుల విషయంలో ఇంతే. దైవాన్ని అన్వేషించే భక్తుల సంగతి వేరు. వారిని దేవుడు ప్రత్యేకంగా కాపాడుతాడు. ఇతరులను విశ్వశక్తి సంరక్షిస్తూ వుంటుంది.

ప్రశ్న: దేవేచ్ఛకు, దైవకటాక్షానికి తేడా వుందా? రెండూ ఒకటే కదా?

విశ్వక్రీడ దైవేచ్ఛ ప్రకారం గడిచిపోతూ వుంటుంది. అవసరమైనప్పుడు ప్రత్యేకంగా వచ్చి రక్షిస్తుంది ఆయన కృప.

అనువాదం: ఆర్. లక్ష్మీప్రసాదమ్మ

మతోన్మాదానికి మూలకారణాలు

శ్రీఅరవిందుల ప్రవచనములు

ఉగ్రవాదం, దురభిమానం చాలా చెడ్డవి. తీవ్రవాదులు వారి కార్యాన్ని చాలా అభిమానంతో కొనసాగించవచ్చు. కాని అందులో గొప్పతనమేమి లేదు. ఇక మతోన్మాదమంటారా అది అజ్ఞానులు, తెలివితక్కువవాళ్లు చేసే పని. వాళ్లు చాలా క్రూరంగా, కర్కశంగా, ఘోరంగా ప్రవర్తిస్తారు.

*

నువ్వు ఒక వైపు సత్యమే కావాలని మాట్లాడుతూ మరో వైపు నీ ఒక్క మతమే గొప్పదని మూర్ఖంగా వాదిస్తున్నావే. ఇది సత్యానికి దూరం. దేవునికి చాలా దూరం. సత్యము ఏ ఒక్క మతానికి చెందినది కాదు. దానిని ఓ బైబిలులోనో, ఖురాన్‌లోనో, వేదాలలోనో బంధించలేవు. భగవంతునికి దేశకాల పరిమితులు లేవు. ఆయన ఒక్క ముసల్మానులకుగాని మరి ఏ ఒక్క మతమునకుగాని చెందినవాడు కాడు. కేవలం బైబిలు వారసులకు గాని, యూదులకు గాని, అరేబియన్ మతములకు గాని చెందడు. హిందువులకు, కాన్‌ఫూసియన్‌లకు (Confucians), టావ్ మతస్థులకు (Taoists)

అందరికి వారి వారి మార్గాలలో సత్యాన్ని అన్వేషించి దైవంతో సంబంధాలు పెట్టుకునేందుకు సమాన హక్కు ఉంది. ప్రతి ఒక్క మతంలోను కొంత సత్యము లేకపోలేదు. అయితే అది పూర్ణసత్యం కాదు. పాక్షిక సత్యం మాత్రమే. కాలక్రమేణా మతాలు పుడతాయి. క్షీణిస్తాయి. అంతరించిపోతాయి. మహమ్మదుకూడ ఖురానుని గురించి అదే భగవంతుని అంతిమ సందేశమని చెప్పలేదు. సత్యము, దైవము మతాల కతీతములు. అనంతకాలానికి చెందినవి. మళ్లీ మళ్లీ దేవుడు సంకల్పించినప్పుడు ఇతర రూపాలలో ఆవిర్భవిస్తాయి. దేవుణ్ణి నీ చిన్న మెదడులో బంధించలేవు. దివ్యచైతన్యము ఎప్పుడు, ఎవరి ద్వారా, ఏ విధంగా, ఏ రూపంలో ఆవిష్కార మౌతుందో నువ్వు శాసించగలవా? దేవుడు సర్వశక్తిమంతుడు. ఆయన మార్గములో నువ్వు అడ్డంకులు కల్పించలేవు. ఇప్పుడు ప్రపంచ మందెల్లడల ఈ మౌలికసత్యాన్ని గుర్తించటం జరుగు తోంది. Only the childish in mind or those who vegetate in some formula of the past deny them.

అసలు విషయమేమిటో చెప్పమని నన్ను పట్టుపట్టి అడు గుతున్నావు కాబట్టి చెబుతున్నా విను. ఈ ప్రపంచంలో కొన్ని చీకటిశక్తులు విజృంభించి దైవకార్యాన్ని పాడుచేసేందుకు ప్రయ త్నిస్తాయి. మనుషుల్ని ఆవహిస్తాయి. అటువంటి అదైవికశక్తి నీలో ప్రవేశించి నీ ద్వారా తన పనిని నెరవేర్చుకుంటోంది. It is a Power of Falsehood. తురుష్క మతానికే తలవంపులైన పిచ్చి చేష్టలు నీ చేత చేయిస్తోంది. నీచేత అబద్ధం పలికిస్తోంది. ఒక్క తురుష్క మతాన్నే కాకుండా అన్ని మతాలని నీచేత చులకన చేయిస్తోంది. ఈ భూమ్మీద జరిగే దైవకార్యాన్ని పాడుచేసేందుకే ఈ పని చేస్తోంది. నీ బుద్ధిని చెరచి, నీ తెలివిని హతమార్చి, నీచేత దుర్భాషలాడించి నిన్ను మూర్ఖునిగా తయారుచేస్తోంది. నీ స్నేహితులందరు అయ్యో పాపం అని సానుభూతి చూపించటం, నువ్వు మిగిలినవారి దృష్టిలో నవ్వులపాలు కావటం జరుగుతోంది. నీకు నీమీదగాని, దేవునిమీదగాని, ఏ మతంమీదగాని ఏమాత్ర మైనా గౌరవమున్నట్లయితే, నిజంగా నువ్వు సత్యము, జ్ఞానము

ఆశించినట్లయితే, నీకు జ్ఞానోదయమై ఆత్మోపలబ్ధిని పొందదలచు కున్నట్లయితే నువ్వు నీచంగా మాట్లాడటం, విపరీతంగా ప్రవర్తిం చటం మానేయాలి. నిన్ను పట్టుకున్న బ్రహ్మరాక్షసిని వదిలించు కోవాలి.

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

యుద్ధాలు – వినాశనము

శ్రీఅరవిందుల ప్రవచనములు

అడవిజంతువులవలె పోట్లాడుకోటం మనుషుల కలవాటే. ఈ యుద్ధకాండ ఇలా కొనసాగినంతకాలం మానవజాతికి శాంతి ఎక్కడిది?

*

మనం వాళ్లతో వాదన పెట్టుకోము. భూలోకంలో దివ్యజ్యోతి శక్తుల ఆధారంగా ఓ నూతన జీవితాన్ని ఆవిష్కరింపజేయుటయే మన లక్ష్యము. పైనుంచి సత్యమైన సృష్టిని చేయగల ఆ మహా శక్తిని ఆహ్వానించుటయే మన కర్తవ్యము.

*

ప్రపంచ పరిణామంలో కొన్ని వస్తువులు నాశనమైపోవటం అని వార్యం. అది సృష్టి ధర్మము. దీనిని మనము విచారించి మంచిది అని గాని చెడు అని గాని నిర్ణయించలేము. దివ్యజ్యోతి దిగివచ్చి నప్పుడు చీకటిని పారద్రోలి దుష్టశక్తులను హాతమారుస్తుంది. దుష్ట సంహారం మంచిదే కదా!

ఏదైనా నాశనమైపోయినప్పుడు దాని మంచిచెడులు ఆ నాశనానికి కారణమైన శక్తులనుబట్టి వుంటుంది. నువ్వు నిప్పంటే భయపడకూడదు. అలాగే ఇతర ప్రకృతి మహాశక్తులకుకూడ భయ పడకూడదు. భయమంటె నీలో ఓ బలహీనతన మాట. యోగికి భయముండరాదు. ఆత్మకు భయమనేది లేదు. అది ఎంతటి ప్రచండ శక్తుల ముందరైనా నదురు బెదురు లేకుండా నిలబడ గలదు.

*

కురుక్షేత్రంలోను, హిట్లరుతోను యుద్ధం చేసేటప్పుడు నేను దౌర్జ న్యాన్ని, హింసాకాండని సమర్థించినమాట నిజమే. The question then, from this middle point of view, about the immediate question is whether this violence is justifiable and the occasion justifiable. I back out.

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

సమాచార పత్రము

75 ఏళ్ల క్రిందట, 24 నవంబరు 1926 నాడు, శ్రీఅరవిందులు సలిపిన నిరంతర కృషి ఫలితంగా అధిమానసమూర్తి భూలోకంలోకి దిగివచ్చాడు (the descent of the Godhead of the Overmind into the physical). తత్ఫలితంగా ఇంతకంటె మహత్తరమైన అతిమానస (supermind) ఆవిర్భావమునకు భూలోకము సంసిద్ధము కాగలదు. ఇదియే మానవజాతి అందుకోగలిగిన మహోన్నతస్థాయి.

అతిమానసాన్ని ఆవిర్భవింపజేయుటకై శ్రీఅరవిందులు ఏకాంతంలోకి వెళ్లి ఘోరమైన తపస్సు మొదలుపెట్టారు. తపోదీక్షలో మునిగిపోయారు. శ్రీమాత జపానునుంచి పాండిచ్చేరికి 24 ఏప్రిల్ 1920 న తిరిగివచ్చారు. ఆశ్రమంలో శిష్యుల సంఖ్య పెరగటం మొదలుపెట్టింది. "ఆశ్రమము 1926 లో స్థాపించబడింది – తనకు తానే స్థాపించుకుంది అని అనవచ్చును". "1926 లో శ్రీమాత ఆశ్రమ బాధ్యతలను పూర్తిగా ఎప్పుడు స్వీకరించారు?" అన్న ప్రశ్నకు శ్రీఅరవిందులు ఈ విధంగా జవాబిచ్చారు. "బహుశః 15 ఆగష్టు తరువాత కొద్దిరోజులకు – నేను పూర్తిగా ఏకాంతవాసంలోకి వెళ్లిపోయినప్పుడు".

"ఈ ఆశ్రమ లక్ష్యము సాధారణంగా ఇటువంటి సంస్థల లక్ష్యముకంటె భిన్నము. ప్రపంచాన్ని త్యజించుటకు బదులు – మానవునికన్న మిన్నయైన మరో చైతన్యమును పొందుట; దివ్య

5/12/2

అఖిల

అఖిల భారత పత్రిక

డిసెంబరు 2001

విషయసూచిక

విభాగము I : నేటి ప్రపంచ పరిస్థితులు

విభాగము II : శ్రీఅరవిందుల దర్శనానుభూతులు

విభాగము III : ఓంకారము

విభాగము III : ఇతర వ్యాసాలు

యుద్ధముల విరమణ

శ్రీఅరవిందులు

ఇతర మానవుల పట్ల కేవలం సాంగత్యము సుహృద్భావ్యమే కాకుండా, ఐక్యతా భావము ఏర్పడినప్పుడు; కేవలం సోదరభావమే కాకుండా అందరు మానవులు కూడ తనలోని భాగమే అని తెలిసినప్పుడు; తన అహంకారముతోగాని జాత్యహంకారముతోగాని కాకుండా విశ్వచైతన్యములో మనగలిగినప్పుడే యుద్ధమనే ప్రసక్తి లేకుండా పోతుంది. అది మానవ చరిత్రలోంచి పూర్తిగా విరగడ అయిపోతుంది.

నేటి ప్రపంచ పరిస్థితులు

శ్రీమాత

భూలోకచరిత్రలో మనమిపుడుడొక ముఖ్యమైన మలుపు దగ్గర ఉన్నాము.

"ఇప్పుడేం జరగబోతోంది, ఇప్పుడేం జరగబోతోంది"?. అని అందరు అడగటమే. మనుషులందరు తీవ్రమైన భయాందోళనలకు గురౌతున్నారు. "ఏం జరుగుతుంది?..." దీని కొక్కటే పరిష్కారము. మనిషి తన ధోరణిని మార్చుకోవాలి. జీవితాన్ని ఆధ్యాత్మీకరణం చేయాలి.

కనీసం కొంతమంది వ్యక్తులైనా మేలిమి బంగారంగా మారాలి. పరిస్థితులను మార్చి బంగారుబాటను నిర్మించేందుకు కొద్ది మందైనా చాలు. ఇప్పుడది చాలా అర్జంటు – ఒక్క నిమిషమైనా వృధా చేసేందుకు వీల్లేదు.

నీ పౌరుషాల్ని, ధైర్యసాహసాలను ఇతరులతో యుద్ధం చేసేందుకు కాకుండా, నీలోని అంతఃశత్రువులతోను, అజ్ఞానాంధకారాలతోను పోరాడేందు కుపయోగించాలి. అంతరంగికంగా నువ్వు నీ లోపల జరిగే అగ్నిపరీక్షను నిబ్బరంగా ఎదుర్కొని, పునీతం కావాలి. లేని యెడల మళ్లి భీకరయుద్ధము – మానవజాతిని మట్టము చేయగల ఒక మహాసంగ్రామము తప్పదు.

ఇదీ నేటి విషమపరిస్థితి. దీనిని ప్రతి మనిషి ఎదుర్కోవాలి. తనవంతు పాత్రను ఏమాత్రం శక్తివంచన లేకుండా నిర్వహించాలి.

And I add: Time presses... from the human point of view.

గొప్ప పరిణామాలు

శ్రీఅరవిందులు

ప్రపంచాన్ని కుదిపివేసే సంఘటనలు తరుచుగా చాలా అల్పాల్పమైన కారణాల వలన సంభవిస్తూ వుంటాయి.

విప్లవాత్మకమైన పరిణామాలు జరుగుతున్నప్పుడు కాకతాళీయంగా, అనుకోని విధంగా పరిస్థితులు తారుమారౌతుంటాయి. ఒక దేశపు స్వరూపమే మారిపోతుంది. ప్రపంచపు భవిష్యత్తే తల్లక్రిందులౌతుంది. అటువంటి సమయాలలో ఒక చిన్న సంఘటన వలన అతిపెద్ద పరిణామము జరుగుతుంది. అప్పుడు ఈ సృష్టిలో ఏదో ఒక మహాశక్తి తప్పకుండా పనిచేస్తోందని, అది మానవ ప్రయత్నాలన్నిటిని తారుమారు చేసి ఆశ్చర్యకరమైన పరిణామాలకు దారితీయగలదని చాల స్పష్టంగా తెలుస్తుంది. ఒక్క మనిషి ద్వారా హఠాత్సంఘటనలు సంభవిస్తూ వుంటాయి. ఒక్క మనిషి ఇంద్రజాలం వలన ఒక లోకం మాయమౌతుంది. మరోలోకం సృష్టించబడుతుంది. హిందూ సాంప్రదాయం ప్రకారం కొన్ని యుగాల తరువాత ప్రళయం రావటం, పాత ప్రపంచం లయం కావటం మళ్లీ సృష్టి జరగటం నిజమే అనిపిస్తోంది. ఈ మార్పులు హఠాత్తుగా జరిగినప్పటికి, వాటికి సుదీర్ఘమైన పూర్వరంగముంటుంది. ఇప్పుడీ ప్రపంచంలో ఇటువంటి మార్పే జరగబోతోంది. అన్ని దేశాలలోను అద్భుతమైన పరిణామాలు జరుగ బోతున్నాయి. వాటి అంతిమ స్వరూపము మానవుల ఊహా కతీతమైన విషయము.

ప్రపంచం ఎలా మారుతుంది?

శ్రీఅరవిందులు

మనిషి తన జీవితాన్ని ఆధ్యాత్మీకరించుటకు ఒప్పుకున్నట్లయితే మారుతుంది. కాని అతని ప్రకృతి దీనికి ససేమిరా ఒప్పుకోదు. అతని మనోప్రాణిక భౌతికములు ఎదురు తిరుగుతాయి. మనిషి తన అజ్ఞానాన్నే పట్టుకొని వేళ్లాడుతాడు.

ఈ ప్రపంచంలోని విప్లవాలు మూడు రకాలుగా ఉంటాయి. ద్రవ్యనాగరికత వలన మిరుమిట్లు గొలిపే అద్భుతమైన ఫలితాలే కలగవచ్చు. నైతిక విప్లవము, మానవమేధతో రూపొందించిన పరిణామములు అంతకంటె బృహత్తరమైనవే కావచ్చును. కాని ఆధ్యాత్మిక విప్లవము ఇంతకంటె బ్రహ్మాండంగా వుంటుంది.

ప్రపంచంలో నేడు మనం చూసే మార్పులు మన మేధకి, నైతికానికి, భౌతికానికి సంబంధించినవి. ఆధ్యాత్మిక విప్లవము మట్టుకు తగిన ముహూర్తం కోసం వేచి వుంటుంది. ఈ లోపులో తన వీచికలను అక్కడక్కడ విసురుతూ వుంటుంది. అది జరిగేంతవరకు మిగతా మార్పుల యొక్క అంతరార్థం మనకి తెలియదు. అంతవరకు నేటి పరిణామాలని ఎవరు అర్థం చేసుకోలేరు. అయ్యో! ఎంత ఘోరం జరిగిపోతోందో, ఏం దారి అని అనుకోవటం దండగ. మానవజాతి యొక్క తదుపరి పరిణామము ఆ ఆధ్యాత్మిక విప్లవమును బట్టే వుంటుంది.

ఆధ్యాత్మికమనగా ఏమి?

శ్రీఅరవిందులు

ఆధ్యాత్మికమనగా పూజలు, పునస్కారాలు, ముక్కు మూసుకొని జపం చేసుకోవటం కాదు. అది మామూలు ఆలోచనలకంటె, ఈ జీవితంకంటె వేరైన జ్ఞానము – మరో చైతన్యము. ఇంతకంటె గొప్పదైన, నిర్మలమైన, పరిశుద్ధమైన ఆ చైతన్యం కోసం మనం ఆకాంక్షించాలి. మన సాధారణ ప్రకృతి కతీతమైన, మనోప్రాణికములను మించిన దివ్యచైతన్యము ఒకటున్నది.

ఇంద్రియాల బానిసత్వాన్ని దాటి మనలో దాగివున్న రహస్యాన్ని కనుక్కోవాలి.

*

నీ అహంకారాని కంటె గొప్పదైన మరో చైతన్యాన్ని పొంది దాని వెలుగులో నివసించి అంతకంతకు దానిచే ప్రభావితమై జీవించుటయే ఆధ్యాత్మికము. అది విశాలము, అనంతము, స్వయంప్రపత్తి కలిగినది (self-existent), అహంకార రహితము. దానినే మనం spirit (ఆత్మ, బ్రహ్మ, దైవము) అని వ్యవహారించెదము...

*

మనకు కావలసిన దివ్యజీవనము మన పై స్తరములలో వున్నది. నువ్వు దివ్యచైతన్యాన్ని అనుభవిస్తూ, కేవలం అంతరంగికంలోనే కాకుండా, బాహ్యజీవితంలో కూడ దైవ స్ఫూర్తి కలిగి వుండటమే ఆధ్యాత్మికము. అంతేగాని ఏవేవో పూజలు తతంగాలను పట్టుకొని వాటినే ఆధ్యాత్మిక జీవితంగా పరిగణించటం పొరపాటు.

పూర్వరంగం

శ్రీఅరవిందులు కలకత్తాలో 1872 ఆగష్టు 15 న జన్మించారు. 1879 లో, తన 7 వ సంవత్సరంలో, ఇద్దరు అన్నలతో సహా, చదువుకోసం ఇంగ్లండ్ పంపబడ్డారు. అక్కడ 14 సంవత్సరాలు నివసించారు. 1892 లో బరోడా మహారాజు గైక్వాడ్ లండన్‌లో ఉన్నారు. శ్రీఅరవిందులు వారిని దర్శించి బరోడాలో ఉద్యోగం సంపాదించి, 1893 జనవరిలో ఇంగ్లండ్ వదిలి భారతదేశం బయలు దేరారు.

1893 నుంచి 1906 దాకా, పదమూడు సంవత్సరాలు శ్రీఅరవిందులు బరోడా ఉద్యోగంలో ఉన్నారు. ఈ కాలం చివరి దశలో ఎక్కువభాగం, తన రాజకీయ కార్యక్రమాల కోసం, వారు శెలవులోనే ఉన్నారు. అయితే అదంతా గోప్యంగా, మిగతావారికి తెలియకుండా సాగింది.

1905 లో జరిగిన బెంగాల్ విభజన, దానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమం, వారు తమ బరోడా ఉద్యోగాన్ని వదిలివేసి, బహిరంగంగా రాజకీయాల్లోకి రావటానికి అవకాశం కల్పించింది. దానితో వారు 1905 లో బరోడా వదిలిపెట్టి, కలకత్తా వెళ్లారు. అంతవరకు భారతజాతీయకాంగ్రెసు ధోరణి అంతా, మితవాద సంస్కరణ వాదమే. కాని శ్రీఅరవిందులు ఇంకా ముందుకువెళ్లి, ప్రత్యక్ష రాజకీయాల కోసమే కలకత్తా జేరుకున్నారు.

శ్రీఅరవిందుల కృషితో, జాతీయపార్టీ ఆవిర్భవించింది. దానికి ప్రజామోదంగల జాతీయనాయకుడు లోకమాన్య తిలక్ అధ్యక్షులు. మితవాదులు సుదూరంలో ఆశించే, వలసరాజ్యంలో స్వపరిపాలన అనేదానికి భిన్నంగా, స్వరాజ్యం (స్వతంత్రం) అనే ఆదర్శాన్ని ఈ జాతీయపార్టీ ప్రజల ముందుంచింది.

శ్రీఅరవిందులు 1907 లో దేశద్రోహ నేరానికి న్యాయ స్థానంలో విచారించబడి, విడుదలయ్యారు.

తన సోదరుడు బరీంద్రుని నాయకత్వానగల విప్లవబృంద కార్యక్రమాల్లో వీరిని ఇరికించారు. అందువల్ల తిరిగి 1908 మే


లో ఆలీపూర్ కుట్రకేసులో శ్రీఅరవిందులు అరెస్టు చేయబడ్డారు. కాని వారికి వ్యతిరేకంగా నిలవగల ఏ సాక్ష్యమూ లభ్యం కాక పోవటంతో, ఈ కేసులోనూ వారు విడుదలయ్యారు. విచారణ జరుగుతున్న కాలమంతా ఆలీపుర్ కారాగారంలో గడిపి, 1909 మే లో వారు బయటికొచ్చారు.

ఈ సమయంలో జీవితం పట్ల వారి దృష్టి తీవ్రమార్పుకు లోనైంది. ఇంతవరకూ విస్తృతిలో, విశ్వజనీనతలో నిరంతరంగా పెరుగుతూ వచ్చిన, వారి అంతర్గత ఆధ్యాత్మిక జీవితం మరియూ అనుభవం మరింతగా పెరిగి, వారిని మొత్తం ఆవహించింది. వారి పనంతా కూడ అందులోని భాగమైంది. తత్ఫలితంగా అది ఒకే లక్ష్యం పట్ల నిశ్చితమైంది. ఆ లక్ష్యపరిధిలోనే, యావత్ ప్రపంచం, యావత్ మానవాళి భవిష్యత్కూడా ఇమిడి ఉంది.

అనువాదం: కాకుమాని తారానాథ్

ఉత్తరపారా ఉపన్యాసము

శ్రీఅరవిందులు మొదట దేశస్వాతంత్ర్యంకోసం పోరాటం సలిపిన దేశభక్తుడు. ఉపన్యాసాల ద్వారా, 'వందేమాతరం' అనే పత్రిక ద్వారా ప్రజలను ప్రభావితం జేసిరి. ఆయనకు అప్పుడు దేవుడంటే నమ్మకం లేదు. యోగమందు పెద్ద శ్రద్ధ కూడ లేదు. దేశస్వాతంత్ర మొక్కటే ఆయన ధ్యేయము. బ్రిటిష్వారు ఆయనను అరెస్టు చేసినప్పుడు ఎందుకిట్లా జరిగిందో అని ఆయన ఆశ్చర్యపోయారు. అప్పుడు ఆయనకు దేవుడు కనపడి "నేను నీకు ఏం చెప్పాను? ఈ పోరాటం ఆపివేసి నా కార్యమును నెరవేర్చుటకై యోగభ్యాసం మొదలు పెట్టమని చెప్పాను కదా" అని గుర్తు చేసాడు. ఆయనకికనుంచి నిరంతర భగవత్ సాన్నిధ్యమే, వాసుదేవ దర్శనమే. మరియు భగవంతుడు "ఈ కేసు నా చేతుల్లో వున్నది. అదిగో ఆ ప్రాసిక్యూటరు వంక చూడు. ఆ మేజిస్ట్రేటు వంక చూడు" అని చెప్పగా వారందరు శ్రీకృష్ణపర



Sri Aurobindo's solitary cell, Alipore Jail, Calcutta
(measuring 9 ft. by 5 ft., and without any windows)

మాత్మునిగానే ఆయనకు కనపడ్డారు. కారాగారమే ఆయన యోగాభ్యాసమున కనువైన తపోభూమిగా పరిణమించినది.

— సంపాదకుడు

[ఆలీపూర్ బాంబుకేసునుంచి విడుదలైన శ్రీఅరవిందులు ధర్మరక్షిణి సభ ఆధ్వర్యమున 30 మే, 1909 నాడు ఉత్తర పారాలో చేసిన ఉపన్యాసము.]

నా కర్తవ్యము

మీరు మీ సభయొక్క వార్షికసమావేశమున ప్రసంగిపుడని నన్ను గోరిరి. అప్పుడు ఈ నాటికి ఎన్నికచేయబడిన విషయమగు 'హిందూ మతము' పై నేను నాలుగు మాటలు చెప్పదలంచితిని. కాని ఇప్పుడు నేనా తలంపును నెరవేర్చగలనో, లేదో తెలియదు. ఏలన, నేను ఇక్కడ కూర్చొని యుండగా మీకు చెప్పవలసిన ఒక మాట నా మనస్సులోనికి వచ్చినది; ఆ మాటనే నేను భారత జాతి కంతకును భాషింపవలసి యున్నది. *దానిని ఆదిలో భగవంతుడు నాకు స్వయముగా జైలులో ప్రవచించెను; ఇక దానిని నా ప్రజలకు ప్రవచించుటకే నేను జైలు వెలుపలికి వచ్చితిని.*

మాఱిన పరిస్థితులు

నేను క్రిందటిసారి ఇక్కడకు వచ్చి సంవత్సరము దాటిపోయినది. అప్పుడు నేనిచ్చట ఒంటరిగా లేను; జాతీయతను ప్రబోధించు ఒక మహా ప్రవక్త అపుడు నా ప్రక్కన కూర్చొనెను. అపుడు ఏకాంతము నుండి వెలికి వచ్చుట ఆయన వంతయ్యెను. భగవంతుడే ఆయనను ఆ ఏకాంతమునకు బంపెను. కారణము, ఈశ్వరుడు ఆయన కొక మాట వినిపించవలసి యుండెను. కారాగారముయొక్క మౌనము నందును, ఏకాంతమునందును ఆ వాక్కును వినుట కెక్కువ అవకాశముండును గదా. అపుడు మీరు వందల సంఖ్యలో వచ్చిన దాయనకు స్వాగతము చెప్పుటకే. ఆయనిపుడు చాలా దూరముగా, కొన్ని వేల మైళ్లచేత వేఱుచేయబడియున్నాడు. ఎవరు నా ప్రక్కన పనిచేయుచుండ జూచుట కలవాటు పడితినో, అట్టి ఇతరులును

ఇప్పుడిచ్చుట లేరు. దేశమును ఊడ్చివేసిన తుఫాను వారిని దూర దూరము చెదరగొట్టివేసినది.

ఈ సారి ఏకాంతమున ఒక యేడు గడపుట నా వంత య్యెను. నేనిపుడు బైటకు వచ్చుసరికి, ఎల్లెడల మార్పునే చూచు చున్నాను. ఎవరు ఎల్లప్పుడు నా ప్రక్కనే కూర్చొనియుండునో, ఎవరు నా ఉద్యమమునందు నాకు సహచరుడో, అట్టి ఆయనిపుడు బర్మాలో కారాగారబద్ధుడు. మరియొకరు ఉత్తరప్రాంతమున నిర్బం ధమున మ్రగ్గుచున్నారు. నేను వెలికి వచ్చి చుట్టును గలయ జూచితిని. సలహాను, ఉత్తేజమును బొంద ఎవరికొఱకు జూచుట కలవడియుంటినో వారికొఱకు జూచితిని. కాని వారెవ్వరు గాన రాలేదు. అంతేగాదు. నేను జైలునకు వెళ్ళినపుడు, దేశము ఆపాద మస్తకము 'వందేమాతరం' నినాదముతో ఉప్పొంగుచుండెను, సజీవమై యుండెను. కోట్లకొలది మానవుల ఆశాకిరణముతో స్పందించుచుండెను. అది నూతనముగా తమ హీనస్థితినుండి లేచి కనువిప్పిన వారి ఆశాకిరణము. నేను కారాగారమునుండి వెలుప లికి వచ్చినపుడు, ఆ నినాదము విన చెవి సారించితిని. కాని దానికి బదులు మౌనమే తగిలెను. దేశమును ఒక నీరవత (నిశ్శ బ్దత) ఆవహించెను. అందరు దిక్కుతోచని స్థితిలో నున్నట్లు గన్పిం చిరి. ఏలన అంతదనుక భవిష్యజ్యోతిదర్శనముతో నిండి, మన ముందుండిన భగవంతుని ఉజ్వల స్వర్గ మిపుడు లేదు. దాని స్థానంబున భీకరవర్ణముతో గూడిన అమంగళాకాశమే పైన గన్పిం చుచున్నది. ఇది ఉరుములను, మెఱుపులనే వర్షించెను. ఎటు బోవలయునో ఎవరికిని తెలిసినట్టు గన్పింపదు. కావున అన్ని వైపులనుండి వినవచ్చుచున్న ప్రశ్న యిదియే – "మే మనంతర మేమి చేయవలయును? మేము చేయగలిగినదే మున్నది?"

ఎటు బోవలయునో నాకును దెలియలేదు. అనంతర మేమి చేయవలయునో నాకును తట్టలేదు. కాని ఒకటి మాత్రము నాకు దెలిసెను. ఈ నినాదమును లేపినది, ఈ పోరాటమును పురికొల్పి నది సర్వశక్తిమంతమైన ఆ భగవంతుడే; ఇప్పుడు నెలకొన్న మౌనస్థితియు ఆయన ఆదేశమే. ఇంతకు ముందర విప్లవములో ఏ

మహాశక్తి పని చేసెనో నేటి నిశ్శబ్దముకూడ ఆ మహాశక్తియొక్క విన్యాసమే. ఆయన సంకల్పమే. ఒకసారి ఆగి దృష్టిని లోపలికి మళ్లించి ఆయన ఇచ్ఛ ఏమిటో కనుగొనుటకే ఆయన అటుల జేసెను. కాబట్టి ఈ నిశ్చేష్టత నన్ను నిరుత్సాహపరచలేదు. కారాగారవాసంలో నాకిది చిరపరిచితమే; ఒక సంవత్సరం పొడుగునా అట్టి నిశ్శబ్దస్థితిలోనే నాకు జ్ఞానోదయము కలిగెను.

బిపిన్ చంద్రపాల్

బిపిన్ చంద్రపాల్ జైలునుంచి బైటికి వచ్చినపుడు, ఆయనొక సందేశముతో పాటు వచ్చెను; అది అంతఃస్ఫురిత సందేశము. ఆయన ఇచ్చుట ఇచ్చిన ఉపన్యాసము నాకు జ్ఞాపకమున్నది. అది దాని ధోరణి నందును, సంకల్పమునందును రాజకీయమనుటకంటె, మతపర మనుటయే ఎక్కువ సత్యము. ఆయన కారాగారమునందు తన సాక్షాత్కారమును గురించి భాషించెను. మన అందరి యందును గల భగవంతుని గురించి వచించెను. జాతిలోపలనున్న దైవమును గురించి పలికెను. తాను ఇచ్చిన తర్వాతి ఉపన్యాసములందు గూడ, ఈ ఉద్యమము లోపల సాధారణ శక్తిని మించిన అధికతర దేవతాశక్తి పనిచేయుచున్నదనియు, దాని దృష్టిలో సాధారణ లక్ష్యమును మించిన మహత్తర లక్ష్యము గలదనియు పేర్కొనెను.

అటులనే నేనుగూడ మిమ్ములను ఇప్పుడు గలసికొనుచున్నాను. నేనును జైలునుంచే మీ కడకు వచ్చుచున్నాను. మఱల ఉత్తరపారావాడకు చెందిన మీరే నాకు మున్ముందుగా స్వాగతము చెప్పుచున్నారు. మఱియు నీ స్వాగత వేదిక ఒక రాజకీయ సమావేశము గాక, మన మతసంరక్షణకు స్థాపితమైన ఒక సభాస్థలమగుట విశేషము. ఏ సందేశమును బిపిన్ చంద్రపాల్ బక్సార్ జైలులో స్వీకరించెనో, దానిని భగవంతుడు ఆలీపూర్ జైలులో నా కనుగ్రహించెను. *నేను కారాగారమునందున్న ద్వాదశమాసముల పొడవున దినదినము ఆ సందేశమును భగవంతుడు నాకు ప్రసాదించెను. నే నిపుడు జైలునుంచి వెలికివచ్చుట జరిగినది గనుక, ఆ సందేశమునే మీకు ప్రవచింప అతడు నన్నాదేశించెను.*

తక్షణ ప్రేరణ

నేను బైటికి వచ్చెదనని నాకు తెలియును. నిర్బంధ సంవత్సరము ఏకాంత సంవత్సరముగాను, శిక్షణా సంవత్సరముగానే ఉద్దేశించబడినది. ఈశ్వర ప్రయోజనమునకు ఆవశ్యకమగు కాలముకంటె నన్నెవడు కారాగారమున పట్టి యుంచగలడు? నేను వచింప ఒక వాక్యమును, నేను ఆచరింప ఒక కార్యమును అతడు నాకందించెను. నే నా వాక్యము వచించువఱకు ఏ మానవశక్తియు నా నోరు కట్టివేయలేదు. ఈ ఉపకరణము ఎంత దుర్బలమైనను ఎంత క్షుద్రమైనను నేనాకార్యము నాచరించుదనుక ఏ మానవశక్తియు భగవదుపకరణమునకు అడ్డురాజాలదు. నేను బైటికి వచ్చియున్నాను గనుక, ఈ కొలది నిమిషములలోనే నాకొకమాట సూచించబడినది. దీనిని భాషింప నే నభిలషించలేదు. ఏది నా మనస్సులో నుండెనో. దాని నతడు అక్కడనుండి నెట్టివేసెను. ఇక దేనిని వచింపనున్నానో, ఒక ప్రేరణకు, ఒక నిర్బంధమునకు వశుడనై అట్లు చేయుచున్నాను.

శ్రీఅరవిందుని విషాదము

నన్ను పట్టుకొని, చరచర లాల్ బజార్ స్టేషనునకు తీసికొనిపోయినపుడు, కొంత తడవు నా విశ్వాసము చలించెను; కారణము, భగవత్సంకల్పముయొక్క ఆంతర్యము లోనికి నా దృష్టి దిగలేకపోయెను. కావుననే ఒక క్షణము తొట్రుపడి, అతనికి నా హృదయములో నిట్లు మొఱపెట్టుకొంటిని – "ఇదియేమి? నాకు ఇట్టిది ఎందుకు దాపురించెను? నా దేశవాసుల కొఱకు నేను చేయవలసిన కార్యమొక్కటున్నదనియు, అది పూర్తియగువరకు నీరక్షణ అవశ్యముగా నుండుననియు నేను నమ్మితిని. అయినప్పుడు నేనిక్కడ ఎందుకున్నాను, మఱియు ఇట్టి ఆరోపణమీద నెందుకున్నాను?"

ఈ స్థితిలో ఒక దినము గడచెను, రెండవ దినము గడచెను. మూడవ దినము గడచుసరికి లోపలినుండి నాకీ వాణి వినవచ్చెను. "వేచి చూడుము" అపుడు క్రమముగా స్థిమితపడి, ప్రతీక్షింపసాగితిని. ఇట్టితఱి నన్ను లాల్‌బజార్‌నుండి ఆలీపూర్ గొని

పోయి, అచ్చట మనుష్యులకు దూరముగా, ఒంటరిగా నున్న ఒక ఇఱుకు గదిలో బడవేసిరి. అచ్చట అహోరాత్రములు నా లోపలి భగవద్వాణికై ప్రతీక్షించితిని. అతడు నాకేది చెప్పనున్నాడో తెలిసి కొనుటకు, నే నేది చేయఁదగునో నేర్చుకొనుటకు వేచియుంటిని. ఈ ఏకాంతమునందే ప్రథమ సాక్షాత్కారము, ప్రథమపాఠము, నాకు లభించెను.

మొదటి పిలుపు

ఈ ఏకాంతమును ప్రవేశించిన పిమ్మట నా కొక సంఘటన జ్ఞప్తికి వచ్చినది. నా నిర్బంధమునకు ఒక మాసము లేక అంతకన్నా పూర్వము నా కొక పిలుపు వచ్చెను. *"నీ కార్యకలాపములను కట్టిపెట్టుము, ఏకాంతమునకు బొమ్ము, అంతర్ముఖుడవుగమ్ము. అప్పుడు నీవు నాతో ఎక్కువ సన్నిహిత సంపర్కమున బ్రవేశింప గలుగుదువు"* అని ఆ పిలుపు హెచ్చరించెను. నా దుర్బలతవలన అప్పుడా పిలుపును నే నామోదించలేకపోతిని. నా కర్మ నాకతి ప్రియముగా నుండెను. నేనచట లేనిచో అది క్షీణించును, లేక భగ్నమై రూపుమాసి పోవునని తలంచితిని. నా గర్వము అంత అతిశయించి యుండెను. కావుననే దానిని విడిచివేయ నే నియ్యకొనలేదు.

(ఏకాంతమున నాకా పిలుపు జ్ఞప్తికి వచ్చిన పిమ్మట) అతడు నాతో మఱల భాషించి ఇట్లు చెప్పెననిపించెను; "ఏ బంధములను త్రెంచుకొన నీకు శక్తి లేకపోయెనో, వానిని నీ కొఱకు నేను త్రెంచి వేసితిని. కారణము నీవు ఆ కార్యములో కొనసాగవలయునని నా ఇప్పటి ఇచ్ఛయు గాదు, పూర్వమెప్పుడునుగూడ అది నా ఆలోచనయుగాదు. నీకొఱకు నుద్దేశించిన కార్యము మఱియొకటి గలదు. *దాని నిమిత్తమే నిన్నిటకు దెచ్చియున్నాను – దేనిని స్వయముగా నీవు నేర్చుకొనజాలకపోతివో, దానిని నేర్పుటకు, నాకార్యమునందు నీకు శిక్షణనిచ్చుటకు ఇట్టుచేసితిని."*

గీతాకర్మయోగము

అతడు పిమ్మట గీతను నా హస్తము లందుంచెను. అతని బలము నాలో ప్రవే

శించెను. గీతాసాధనను జేయ అది నాకు సామర్థ్య మిచ్చెను. బుద్ధితో అర్థము చేసికొను నిమిత్తము గీత నా కివ్వబడలేదు. అర్జునునినుండి శ్రీకృష్ణుడు దేని నపేక్షించెనో, అటులే తన కార్యము చేయ నడుము కట్టు వారినుండి అతడు దేని నపేక్షించునో, దానిని నేను వస్తుతః సాధించవలయును. నేను రాగద్వేషములనుండి విముక్తుడను గావలయును. ఫలాపేక్షలేకుండ అతనికొఱకు కర్మ చేయవలయును. స్వీయఇచ్ఛకు స్వస్తిచెప్పి భగవంతుని హస్తము లందు విధేయము, విశ్వాసపాత్రము నగు ఉపకరణము గావల యును. ఉచ్చనీచులపట్ల, శత్రుమిత్రులపట్ల, జయాపజయముల పట్ల సమచిత్తమును గలిగియుండవలయును. అయినప్పటికి అతని కర్మము అశ్రద్ధగా చేయరాదు. దీనిని సాధించి హిందూమతము యొక్క అర్థమును నేను సాక్షాత్కరించుకొంటిని.

జీవన మతము – విశ్వాసమతములు

హిందూమతమును గురించి, సనాతన ధర్మమును గురించి మనము తఱచుగా ప్రసంగింతుము. కాని మనలో కొద్దిమందికి మాత్రమే ఆ మతమన నేమియో వాస్తవముగా తెలి యును. ఇతర మతములు కేవలం బాహ్యతతంగము, మూఢనమ్మ కము, ఆడంబరములతో కూడినవి. కాని సనాతనధర్మము నిత్య జీవితమునకు సంబంధించిన విషయము. దాని అభివ్యక్తి మానవ జీవితపు ప్రత్యంశము తోటి పెనవేసుకొని వుంటుంది. ప్రాచీన కాలము నుండియు ఈ ద్వీపకల్పముయొక్క ఏకాంతమునందు మానవజాతి సముద్ధరణము నిమిత్తము పాలించి లాలించబడినదీ సనాతనధర్మమే. ఈ మతమును ప్రసాదించుటకే భారత భానుడు ఉదయించుచున్నాడు. ఇతరదేశములవలె ఆమె స్వార్థము నపేక్షించి విజృంభించదు, లేక శక్తిని పుంజుకొనినపుడు, ఆ శక్తితో బలహీనులను మట్టుపెట్టుటకు ఆమె విజృంభించదు. *ఆమెకు అర్పించబడిన సనాతనజ్యోతిని ప్రపంచమంతట ప్రసరింపజేయుటకే ఆమె పైకి లేచుచున్నది. ఇండియా ఎల్లపుడు మానవజాతి కొఱకే మనుగడ సాగించినది. మఱియు ఆమె ఇపుడు (తిరిగి)*

ఘనతను గాంచవలసినదియు మానవాళి నిమిత్తమేగాని, తన నిమిత్తము గాదు.

హిందూమత కేంద్రసత్యము

భారతదేశము తన (సనాతనజ్యోతిని) ప్రసరింపజేయవలసి యున్నది గావున అతడు నాకు అనంతరము చూపినది హిందూమతము యొక్క కేంద్రసత్యమును, (సామర్థ్యమునిచ్చి, అంతర్దృష్టినిచ్చి) అతడు తదుప లబ్ధిని (realisation) నాకు ప్రసాదించెను. ఎట్లన, అతడు ముందు నాపట్ల జైలు ఉద్యోగుల హృదయమును కరగించెను. కాగా వారువెళ్ళి జైలు సర్వాధికారియగు ఆంగ్లేయునితో నిట్లు విన్నవించిరి. "అతడు (శ్రీఅరవిందుడు) పాపము, ఆ ఇఱుకు కొట్టములో చివుకుచున్నాడు. ఉదయము, సాయంకాలము అతనిని ఒక అరగంట తన కొట్టము ముందు ఇంచుక పచారు చేయనిండు" అని వేడిరి. అట్లే ఏర్పాటు చేయబడెను.

ఇట్లు పచారుచేయుచున్న సమయమునందే అతని బలము మఱల నాలో ప్రవేశించెను. నన్ను ప్రపంచమునుండి వేఱుచేసిన జైలువంక జూచితిని. (నాకు గన్పించిన దేమిటి?) ఇక దాని ఎత్తైనగోడలచేత నేనెంతమాత్రము బంధింపబడి యుండలేదు; లేనేలేదు. నన్నట్లు చుట్టియున్నది వాసుదేవుడు, వాసుదేవుడే. నా గదిముందున్న చెట్టుక్రింద నడిచితినిగదా, అది వెనుకటి చెట్టు గాదు, అది వాసుదేవుడే అని తెలిసెను. అక్కడ నిలబడి నాపై గొడుగు పట్టియున్న శ్రీకృష్ణుడే అదియని గాంచితిని. నేను నా గది కటకటాలకేసి చూచితిని. అది (సామాన్యదృష్టికి) తలుపుగా పనిచేయుచున్న ఇనుపచట్రమేగాని వేఱుగాదు. మఱల అదియు నా దృష్టికి ఆ వాసుదేవుడే. అప్రమత్తముగా నాపై కాపుండిన ఆ భటుడెవరు? నారాయణుడే. లేక, ప్రక్కగా నా కివ్వబడిన ముతక కంబళ్ళ మీద పరుండి నే నేయనుభూతిని బొందితిని? శ్రీకృష్ణుని యొక్క బాహువులే నన్ను చుట్టియున్న అనుభూతిని బొందితిని. అవి నా ప్రియుని, నా మిత్రుని బాహూరాజములు.

ఉద్ధరణ హేతువు

అతడు నాకు ప్రసాదించిన గభీరతర దృష్టియొక్క ప్రథమోపయోగమిది –

జైలులోని (సాధారణ) బందీల దిశగా దృష్టి సారించితిని. చోరులు, హంతకులు, వంచకులు నగు బందీలు వారు. కాని వారిని చూచు చుండగా, నేను వాసుదేవునే చూచితిని. ఈ కలుషిత ఆత్మల యందును, దురుపయుక్త దేహములందును నేను దర్శించినదా నారాయణునే. తమ సానుభూతి చేతను, దయాళుత చేతను, మానవత చేతను నన్ను సిగ్గుతో తలవంచుకొనునట్లు చేసినవారు, ఈ చోరుల హంతకుల మధ్య ఎందరో యుండిరి. అట్టి ప్రతికూల పరిస్థితులకు లొంగక, వారి సుగుణము లెట్లు తలయెత్తుకొని యుండెనో మఱి? విశేషించి, వారిమధ్య నేను జూచిన యొకడు నాకు మునితుల్యుడుగా గన్పట్టెను. అతడు నా జాతికి చెందిన రైతు సోదరుడు. అతనికి చదువను, వ్రాయను రాదు. బందిపోటు నేరారోపణపై పదిసంవత్సరముల కఠిన కారాగారవాసమునకు గుఱియైనవాడు. పై తరగతికి చెందిన వారమను మిథ్యాభిమానముచే ఎవరిని మనము అల్పులుగా భావించి, తృణీకరింతుమో, వారిలో నొకడా సాధుహృదయుడు. మఱియొక తూఱి భాషించుచు, భగవంతుడు నన్నిట్లు హెచ్చరించెను. "నా కార్యమించుక చేయ ఎవరి మధ్యకు నిన్ను బంపియున్నానో అట్టి ప్రజలను పరికించుము. నేను ఉద్ధరించుచున్న జాతి స్వభావమిది. మఱియు నిదియే వారిని ఉద్ధరించుటకుగల కారణము."

మాజిస్ట్రేటులో నారాయణుడు

క్రింది కోర్టులో విచారణ ప్రారంభము కాగా, మమ్ములను మాజిస్ట్రేటు సమక్షమునకు గొనిపోయిరి. అప్పుడును అదే అంతర్దృష్టి నన్ననుగమించెను. అచ్చట ఆ పరమేశ్వరుడు నాకిట్లు పలికెను. *"జైలులో వేయబడినపుడు, కంగారుపడి, 'నీ రక్షణ ఎక్కడ?' అని నాకు నీవు మొరపెట్టుకోలేదా? అయితే న్యాయమూర్తివైపు ఇపుడు చూడుము. ప్రతిపక్ష న్యాయవాది (Prosecuting Counsel) వైపు ఇపుడు చూడుము."* *అట్లే చూచితిని. నేనపుడు చూచినది న్యాయమూర్తినిగాదు. వాసుదేవుని. అచ్చటున్నతాసనమున ఉపవిష్టుడై యున్నది నారాయణుడు. ఇక ప్రతిపక్షన్యాయవాదిని వీక్షించితిని. నేనచ్చుట వీక్షించినది ప్రభుత్వ*

న్యాయవాదిని గాదు. ఆ ఆసనము నలంకరించినవాడు శ్రీకృష్ణుడు, నా ప్రియుడు, నా సఖుడు. అచ్చట ఆసీనుడై చిరునగవు చిందించుచున్న నా సఖుడు.

అట్లు దర్శనిమిచ్చి, "ఇప్పటికిని భయపడుచున్నావా?" అని ప్రశ్నించెను. "నేను మానవులందరి యందును (హృదయస్థితుడనై) యున్నాను. వారి చేతలను, మాటలను త్రోసివేసి వారిని అధిశాసింతును. నా రక్షణ ఇంకను నిన్ను రక్షించుచునే యున్నది. కనుక దేనికిని భయపడకుము. నీపై ఆరోపింపబడిన ఈ అభియోగమా – దానిని నాకు వదిలివేయుము. అది నీ పనిగాదు. నిన్నిక్కడకు తెచ్చినది విచారణకొఱకు గాదు, వేఱొక ప్రయోజనము కొఱకు. ఈ కేసు స్వయముగా నా కార్యమున కొక సాధనమేగాని మఱేమియు గాదు."

తర్వాత సెషన్స్‌కోర్టులో విచారణ ఉపక్రమించినపుడు, నేను నా న్యాయవాదికి సలహాలను వ్రాసి యివ్వ నారంభించితిని. నాపై వచ్చిన సాక్ష్యమునందు ఏది అసత్యమో, ఏయే అంశములందు ఆ సాక్షులను ఎదురు ప్రశ్నించవచ్చునో, ఆయనకు సూచించుచుంటిని. అట్టి యెడ నేను ఆశించనే ఆశించని సన్నివేశమొకటి సంభవించెను. నా పక్షపు ప్రతివాదము (defence) కొఱకు చేయబడిన ఏర్పాటులన్నియు అకస్మాత్తుగా మార్చివేయబడెను. కాగా ఇతర న్యాయవాది ఒకరు అక్కడ నా రక్షణకొఱకు నడుము కట్టి నిలబడెను. అతడు అకస్మాత్తుగా ఆవిర్భవించెను. అతడు నా మిత్రుడే అయినను, ఆయన అట్లు ముందుకు వచ్చునని నాకు తెలియదు. మీరందరు ఆ మహితాత్ముని నామము వినియే యున్నారు – శ్రీయుత చిత్తరంజన్ దాస్. నాకు విమోచనమును సాధించు నిమిత్తము తన తక్కిన వ్యవహారము లన్నింటికి ఆయన స్వస్తిచెప్పెను. తన సముపార్జన కంతకు సున్న జుట్టుకొనెను. అనేకమాసాల పర్యంతము అనుదినము, రాత్రింబవళ్లు శ్రమించి, పనిచేసి తన ఆరోగ్యమును పాడుచేసికొనెను. ఆయనను చూచినపుడు సంతుష్టచిత్తుడనైతిని, ఆయనకు సలహాలనందించుట అవసరమని భావించితిని.

అప్పుడది అంతయు నానుంచి (ఆవల) నుంచబడెను. మఱియు లోనుంచి ఈ సందేశము వచ్చెను “నీ పాదములకు పెట్టబడిన ఉచ్చునుండి నిన్ను తప్పించునట్టి పురుషపుంగవుడితడు. ఆ కాగితముల నావల బెట్టుము. ఆయనకు సలహాల నివ్వవలసిన వాడవు నీవు కావు. నేనాయనకు బోధింతును.” అప్పటినుండి నాకై నేను నా న్యాయవాదికి ఒక్క మాటయు చెప్పలేదు. కేసును గుఱించి ఒక్క సూచనయు చేయలేదు. మఱియు నూటికి కోటికి నన్నడిగిన ప్రశ్నకు నేనిచ్చిన సమాధానము ఆ అభియోగమున కేమియు తోడ్పడ లేదని నేను కనుగొంటిని. ప్రతిసారి అదే జరిగినది. నే నాయనకే (కృష్ణునకే) వదిలి వేసితిని. ఆయనే దానిని పూర్తిగా తన చేతులలోనికి తీసికొనెను. ఇక నదెట్లు ఫలించెనో మీకు తెలియనే తెలియును.

చేయుచున్నది నేను,
కనుక భయపడకుము

నా కొఱకతడేమి ఉద్దేశించెనో, అది నా కాదినుంచియు తెలియును. ఏలన, నేను పునః పునః దానిని వింటిని. సర్వదా అంతర్వాణిని ఆలకించితిని “నేను నిన్ను నడుపుచుండగా నీకు భయమెందుకు? నేను ఏ కార్యము నిమిత్తము నిన్ను కారాగారమునకు గొనివచ్చితినో, దానివైపుకు నీ దృష్టిని మఱలించుము. ఇక నీవు జైలునుంచి నిర్గమించినపుడు, గుర్తుంచుకొనుము – ఎప్పుడును భయపడరాదు. ఎప్పుడును వెనుకాడరాదు. దీనిని చేయుచున్నది నేను, అన్యుడెవ్వడును గాదు – దీనిని గుర్తుపెట్టుకొనుము. కావున ఎట్టి మేఘము లావరించినను, ఎట్టి ప్రమాదక్లేశములు పైకొనినను, ఎట్టి కఠినతలు కట్టెదుట నిలిచినను, ఎట్టి అసంభవతలు ఉఱిమిచూచినను, ఏదియు అసంభవముగాదు, ఏదియు కఠినముగాదు. నేను జాతి లోపల నున్నాను, దాని ఉత్థానము (పైకి లేచుట) లోపలనున్నాను, నేను వాసుదేవుడను, నేను నారాయణుడను. నా ఇచ్ఛయే జరుగుతుంది. ఇతరుల ఇచ్ఛ జరగదు. నా సంకల్పమును మానవమాత్రులెవరు ఆపలేరు.”

ఇట్లుండగా అతడు (వాసుదేవుడు) నన్ను ఏకాంతవాసమునుండి వెలికిదెచ్చి. ఈ కేసులో నాతోపాటు నిందితులైన వారి

మధ్య నన్నుంచెను. నా స్వార్థత్యాగమును గురించి నా దేశము నకు నే జేయు సేవానిరతిని గురించియు మీరు నేడెంతో చెప్పిరి. నేను జైలునుండి వెలికివచ్చిన దగ్గరినుండియు ప్రశంసాత్మకమగు ఇట్టి మాటలు వినుచున్నాను. కాని వ్యాకులభావము (embarrassment) తోను, బాధతోను వినుచున్నాను. ఏలన నా దౌర్బల్యము నాకు విదితమే, నా దోషములకు నేను దాసుడను. పూర్వముకూడ అవి నాకు మఱుగున లేవు. ఇక నా ఏకాంతవాసమున అవి అన్నియు ఒక్కుమ్మడిగా నాపై విజృంభించినపుడు, వాని ధాటిని తీవ్రముగా ననుభవించితిని. నేనొక దౌర్బల్యరాశిననియు, దోష యుక్తము, లోపభూయిష్ఠమునగు ఒక ఉపకరణము ననియు అపుడు నాకు తెలియవచ్చెను. ఉన్నతశక్తి నాలో ప్రవేశించిన పుడే నేను బలవంతుడ ననియు అపుడు నాకు కనువిప్పు గలిగెను.

నీ కంటెను అధికులు!

అట్టియెడ నే నీ యువకుల మధ్యకు వచ్చుట సంభవించెను. వారియందు పెక్కుమంది లోపల మహాధైర్యము ఉబుకుచున్నదని కనుగొంటిని. వారి శక్తితో బోల్చినపుడు నేను ఎందుకు పనికిరాను. వారిలో ఒకరిద్దరియందు మఱింత విశేషమును గాంచితిని. వారు నా కంటెను శీలముయందు మాత్రమే అధికులుగారు – అట్టివారు అనేకులుండిరి. ఏ బుద్ధి సామర్థ్యమునందు నేను గర్వించి యుంటినో, దానియందు గూడ వారు నాకంటె అధికులు. వారి యందది అంతగా వికసించబోవుచున్నది. ఈ విషయమున భగవంతుడు నా కిట్లు చెప్పెను – "ఇది నేటి యువతరము, నా ఆదేశమునలేచి, నడుముకట్టుచున్న నూతన, బలవత్తర జాతియిది. వారు నీకంటె అధికులు. నీవు తప్పుకొనినను, నిద్రించినను, నా కార్యము జరిగియే తీరును. రేపు నిన్ను తొలగించి వేసినచో ఇక్కడీ యువవీరు లున్నారు. నీ వింతదనుక చేసినదానికంటె ఎక్కువ వీర్యముతో వారా కార్యమును నిర్వహించగలరు. నా నుండి నీవు కొంతబలమును బొందితివి. అంతే. ఆ బలముతో నీ

వి జాతికి సందేశమును ప్రవచింపుము. అది జాతిని ఉద్ధరించుటకు సాయపడును." అతడు నాకు చెప్పిన అనంతరవిషయమిది.

సర్వ సంశయ విచ్ఛిత్తి

ఇంతలో ఒక ఆకస్మిక సంఘటన ఫలితముగా నన్నొక ఒంటరి గదిలో వేసిరి. ఈ ఏకాంతకాలమున నా కేమేమి ఘటిల్లెనో చెప్ప నుత్సాహము లేదు. అయినను ఈ మాత్రము సూచింతును. దినదినము నారాయణుడు నాకు తన అద్భుతములను చూపించెను. మఱియు హిందూమతముయొక్క మహాత్మ్యమును సాక్షాత్కరించుకొనునట్లు చేసెను. పూర్వము నాకనేక సంశయములు కలుగుచుండెను. ఇంగ్లండులో పరభావముల మధ్య పూర్తిగా పరవాతావరణమునందు నా పాలనా పోషణ జరిగెను. హిందూమతములోని అనేకాంశములను గురించి, అవి కల్పనలని ఒకప్పుడు నమ్ముచుంటిని. అందులో స్వప్నసదృశమగు నదియు, భ్రమాత్మకమగు నదియు, మాయామయమగు నదియు ఎంతో గలదని సంశయించుచుంటిని. కాని ఈ సమయమున హిందూధర్మసత్యములను దినదినము మనసులో దర్శించితిని. హృదయములో దర్శించితిని. శరీరములో దర్శించితిని. ఆ సత్యములు నాకు సజీవానుభవములయ్యెను. మఱియు భౌతికశాస్త్రము వివరించలేని అనేక విషయముల ద్వారము నాకు తెలియబడెను. నేను ఆదిలో అతని (భగవంతుని) సమీపించినపుడు పూర్తిగా భక్తుని భావముతోగాని, జ్ఞానిభావముతోగాని కాదు. బహుకాలము క్రిందట స్వదేశీఉద్యమానికి కొన్ని సంవత్సరాల పూర్వము నేనతని వైపునకు మళ్లితిని. పిమ్మట ప్రజారంగములోనికి లాగబడితిని.

అజ్ఞేయవాది విచిత్రప్రార్థన

ఆ రోజులలో నేను భగవంతుని సమీపించినపుడు, నా కతనిలో సజీవవిశ్వాసము శూన్యమనియే చెప్పవలెను. అపుడు నాలో అజ్ఞేయవాదియుండెను. నాలో నాస్తిక ప్రముఖుడుండెను. నాలో సంశయాత్ముడుండెను. అసలు భగవంతుడున్నాడనియే దృఢనిశ్చయము లేకుండెను. అతని సాన్నిధ్యానుభవము నాకు లేకుండెను. అయినను వేదసత్యమునకు, గీతాసత్యమునకును, హిందూమత

సత్యమునకును ఏదియో నన్నాకర్షించినది. ఈ యోగమునందెచ్చ టనో ఒక మహాసత్యముండవలయును. వేదాంతములమీద ఆధార పడిన ఈ మతమునందెచ్చటనో ఒక మహాసత్యముండవలయును అని నాకు తట్టెను. కావున యోగమువైపునకు తిరిగి, దాని నభ్య సింప నిశ్చయించుకొని, దానిపట్ల నాకు తట్టిన అభిప్రాయము యథార్థమేమో కనుగొన దలంచినపుడు నేనీ భావముతోను, ఈ ప్రార్థనతోను అట్లు చేయుట కుపక్రమించితిని – నిజంగా నీవు ఉన్నచో, నా హృదయము నీ వెఱుంగుదువు. నేను ముక్తిని అర్థిం చుట లేదని నీకు తెలియును. ఇతరులు అర్థించు దానిని నే నర్థించుటలేదని నీకు విదితమే. ఈ ప్రజలను నేను ప్రేమించు చున్నాను. వీరికే నా జీవితము వెచ్చించ గలుగుటకు నిన్ను ప్రార్థించుచున్నాను. వీరికొఱకు జీవించి ఈ జాతిని లేవనెత్తు టకు ననుమతి నిమ్మనియే నిన్ను అర్థించుచున్నాను.

ఈ యోగప్రాప్తి నందుటకు నేను చిరకాలము శ్రమించి తిని. తుదకు కొంతవఱకందుటయు జరిగెను. కాని నేను దేని నత్యంతము అపేక్షించితినో, దానియందు (దానిని బడయుట యందు) తృప్తిగలుగలేదు. కావున కారాగారముయొక్క రహస్య స్థానమునందు, నా ఒంటరి గదియందు దానికొఱకు మఱల అర్థిం చితిని. నే నడిగినదేమన – "నాకు నీ ఆదేశము నిమ్ము. ఏ కర్మ చేయవలెనో, ఎటుల చేయవలెనో నాకు దెలియదు. నా కొక సందేశము ననుగ్రహింపుము." అని వేడితిని. అటు పిమ్మట యోగ సంయోగమునందు రెండు సందేశములు వచ్చెను.

అందు ప్రథమ సందేశ మిట్లు వచించెను: "నేను నీకొక కార్యము నప్పగించితిని, అది ఈ జాతిని ఉద్ధరించుటకు ఉపక రించు కార్యము. అచిరకాలములోనే నీవు జైలునుంచి వెలికి వెళ్ళవలసిన సమయము వచ్చును. ఏలన, ఈ సారియైనను నీకు శిక్షపడవలయునని నా యిచ్ఛ కాదు. ఇతరులవలె తమ దేశము నిమిత్తము దుఃఖమున మ్రగ్గుచు, నీవు కాలము వెళ్ళదీయవలయు ననియు నా యిచ్ఛకాదు. కార్యసాధనకై నీకు పిలుపు నిచ్చితిని, అదియే నా ఆదేశము, దానికొఱకే నీ వర్థించితివిగదా? ఇదిగో,

నీకాదేశమిచ్చుచున్నాను. ముందుకుబోయి నా కార్యమును జేయుము."

> *ధర్మము కొఱకే, ధర్మము చేతనే*

ఇక ద్వితీయ సందేశము "ఈ ఏకాంత వాస సంవత్సరమున నీకు కొంత సత్యము చూపబడెను, దీనిని గూర్చి నీకు సందేహము లుండెను. ఇదియే హిందూమత సత్యము. ప్రపంచ సమ్ముఖమున నే నుద్ధరించుచున్నదీ మతమునే. ఈ మతమునే నేను – ఋషులు, మునులు, మఱియు అవతారముల ద్వారా పరిపూర్ణమొనరించి, విస్తరింపజేసితిని. ఇక నిప్పుడీ మతమే అన్ని జాతులయందును నా కార్యమును సాధింప సాగుచున్నది. నా వాక్యమును చాటు నిమిత్తము నే నీ జాతిని లేవ నెత్తుచున్నాను. ఇది సనాతనధర్మము. శాశ్వతమతము. ఇతః పూర్వము దీనిని వాస్తవముగా నీ వెఱుగవు. దీనినే నేను నీ కిపుడు ప్రకటము గావించితిని. నీలోని అజ్ఞేయవాదికిని, సంశయాత్మునికిని తగిన సమాధానము లభించినది. ఏలన, లోపలను, వెలుపలను నీకు నిదర్శనములను జూపితిని, భౌతికములు, మానసికములునగు ప్రమాణముల నిచ్చితిని. మఱియు ఇవి నీకు తృప్తిని గూర్చినవి. నీవు రంగమున దిగి నపుడు, నీవు నిరంతరము నీ జాతికీ వాక్యమునే ప్రవచింపుము. వారు విజృంభించుచున్నది సనాతన ధర్మము కొఱకే. వారు అభ్యుదయము నందుచున్నది ప్రపంచము కొఱకే గాని, తమ కొఱకుగాదు. ప్రపంచమును సేవించు నిమిత్తమే వారికి నేను స్వాతంత్ర్యమును ప్రసాదించుచున్నాను. కావున భారతావని పైకిలేచును – అని పలికినపుడు, పైకి లేచు నది సనాతనధర్మమే. భారతము మహత్త్వముతో నొప్పారును – అని పలికినపుడు, మహత్త్వముతో నొప్పారునది సనాతనధర్మమే యని అర్థము. భరతఖండము విస్తరించి, తనను వ్యాపింపజేసి కొనును – అని పలికినపుడు, తాను విస్తరించి తనను ప్రపంచ మంతటను వ్యాపింపజేసికొనునది సనాతనధర్మమే యని అర్థము. ధర్మము కొఱకే, ధర్మముచేతనే ఈ దేశము మనుచున్నది. కావున మతమును వృద్ధి పఱచుటయన దేశమును వృద్ధిపఱచుటయే. నేను

అంతట నున్నాను. అందరి యందును ఉన్నాను. అన్నిటియందును ఉన్నాను – అని నీకు జూపితిని. నే నీ ఉద్యమమునందున్నానని చూపితిని. దేశమునిమిత్తము కృషిచేయుచున్న వారియందు నేను పనిచేయుటయే కాక, వారిని ప్రతిఘటించి, వారి మార్గమున నిలుచువారియందు గూడ నేను పనిచేయుచున్నానని నీకు జూపితిని. నేను ప్రతివానియందును పనిచేయుచున్నాను. మఱియు (కావున) మానవులు ఏమి చింతించినను, ఏమిచేసినను నా కార్యమునకు దోహదము చేయుదురేగాని, మఱేమియు జేయజాలరు. వారుకూడ నా పనినే చేయుచున్నారు. వారు నా శత్రువులుగారు, నా ఉపకరణాలు. నీ సర్వక్రియల యందును, ఎటు పోవుచున్నావో తెలియకయే, నీవు ముందునకు బోవుచున్నావు. నీవు ఒకదానిని చేయ తలపెట్టి, మఱియొక దానిని చేతువు. నీవు ఒక ఫలితమును లక్షించగా, నీ ప్రయత్నాలు దానికి భిన్నము, లేక విరుద్ధముకూడనగు ఫలితమునకే ఉపకరించును. ముందునకు వచ్చి, ప్రజలలో ప్రవేశించిన శక్తి ఆ దివ్యశక్తియే. బహుకాలమునుండియు నే నీ జాగృతికి (విప్లవానికి) సన్నాహము గావించుచున్నాను. ఇపుడు దానికి మహూర్తము వచ్చినది. దానిని నేనే సాఫల్యమునకు నడిపింతును" – అని భగవంతుడు తన సందేశమును ముగించెను.

కావున నేను మీ కిపుడు వచింపవలసిన దిదియే – మీ సంఘము పేరు "మతసంరక్షణ సభ" మతసంరక్షణము, ప్రపంచ ప్రాంగణమున హిందూమత సంరక్షణ సముత్థానములు – మన ముందున్న కార్య మిదియే.

కాని ఏది హిందూమతము? మనము సనాతనమని పిలుచు ఈ మతస్వరూపమేమి? ముందు దీనికి హిందూమతమను పేరేల గలిగెను? హిందూజాతి దానిని పాలించినది గావుననే దానికా శుభనామము. సముద్రము, హిమాలయము చుట్టియుండు ఈ ద్వీపకల్పముయొక్క (నిరుపద్రమవగు) ఏకాంతమునందు పెరిగి పెంపెసగినది గావున దానికా నామధేయము. ఈ పవిత్ర, ప్రాచీన భూమియందు ఆర్యుల హస్తములలో దానిని సమర్పింపగా, వారు

దానిని నిక్షేపము వలె యుగయుగాలుగా భద్రపఱచియుంచిరి గావున, దానికా అభిధానము. కాని అది ఒకే దేశముయొక్క ఆవరణమున గిఱీ గీయబడి యుండునది గాదు. విలక్షణముగాను, శాశ్వతముగాను అది ప్రపంచముయొక్క ఒకే పరిచ్ఛిన్న భాగము నకు జెందియుండునది గాదు.

సనాతనము గావున విశ్వజనీనము

మనము దేనిని హిందూమతమని పిలుచుచున్నామో, అది నిజానికి సనాతనమతము. ఏలన, తక్కిన మతము లన్నింటిని ఆలింగనముచేసికొని విశ్వజనీన మత మది. ఒక మతము విశ్వజనీనము గానిచో, అది సనాతనము గాజాలదు. ఒక సంకుచితమతము, ఒక శాఖీయమతము, ఒక ప్రత్యేకమతము పరిమితకాలమువఱకే, పరిమిత ప్రయోజనార్థమే మనగలదు.

ఈ మత మొక్కటియే భౌతికవాదముపై ధ్వజమెత్తగలదు. కారణము, భౌతికశాస్త్రపరిశోధనలను, తత్త్వశాస్త్రచింతనలను అది తనయందు ఇముడ్చుకొనుటయేగాక వాటి భావిగతినికూడ సూచించును.

ఈ మతమొక్కటియే మనతో భగవంతునకుగల సాన్నిహిత్యమును మానవజాతికి హత్తుకొనునట్లు వత్తిచెప్పును. మఱియు ఆ భగవంతుని మానవుడు సమీపించుటకు గల సంభవమార్గముల నన్నింటిని అది తన విశాలదృష్టిలో నాలింగనము చేసికొనును.

భగవంతు డందరియందును గలడు. అన్నింటియందును గలడు. అతనియందే మనము చరించుచున్నాము. అసలు మన ఉనికియే అతని యందు గలదు – అని అన్ని మతములు అంగీకరించును. కాని ఈ ప్రధాన సత్యమును ప్రతిక్షణము వక్కాణించి బోధించునదీ మత మొక్కటియే.

ఈ పూర్వోక్తసత్యమును అవగాహన జేసికొనుటకును, విశ్వసించుటకును మాత్రమేగాక, మన సత్తయొక్క ప్రతిభాగము తోను తదుపలబ్ధిని బొందుటకు బలమును ప్రసాదించున దీమత మొక్కటియే.

ప్రపంచము వాసుదేవుని లీల యనియు ఈ లీలయే ప్రపంచస్వరూప మనియు ప్రపంచమున కద్దముపట్టి చూపునదీ మతమొక్కటియే.

ఈ లీలయందు మనము మన పాత్రనెట్లు సర్వశ్రేష్ఠముగా నిర్వహించగలమో చూపునదీ మతమొక్కటియే – దాని సూక్ష్మతమధర్మములను, ఉదారతను నియమములను చూపునదీ మతమొక్కటియే.

అతిస్వల్పవిషయమునందుగూడ జీవితమును మతమునుండి వేఱుచేయనిదీ మతమొక్కటియే. అమృతత్వముయొక్క సారమును ఆస్వాదించినదీ మతమొక్కటియే. మఱియు మృత్యుబంధమును మననుండి తొలగించివేసినదీ మతమొక్కటియే.

ఇది నా మాటగాదు

భగవంతుడీ నాడు నా నోట నుంచి నదీ వాక్కునే. నేనిపుడు మీకు పలికినదియు ఈ వాక్కునే. అసలు నేనేది భాషింపదలంచితినో, అది నా నుంచి దూరముచేయబడెను. ఇక చెప్పుమని నాకేది ఇవ్వబడెనో, దానినిమించి చెప్ప నాకడ నేమియు లేదు. నాలోనికి భగవంతుడే వాక్యము ఊదెనో, నేను ప్రవచింప గలిగినదా వాక్యమును మాత్రమే. ఆ వాక్య మిపుడు సమాప్తమైనది.

సనాతన ధర్మమే జాతీయత

ఇట్టి శక్తితోనే మున్నొకసారి మీకు ప్రసంగించితిని. ఈ ఉద్యమము రాజకీయోద్యమము గాదని అప్పుడు చెప్పితిని. జాతీయత యన రాజకీయాలు గాదు, అది ఒక మతము, ఒక సిద్ధాంతము, ఒక విశ్వాసమునని అప్పుడు చెప్పితిని. నేడును దానినే చెప్పుచున్నాను గాని, దానిని మఱియొక రీతిలో, మీ ముందుంచుచున్నాను. జాతీయత యన ఒక సిద్ధాంతము, ఒక మతము, ఒక విశ్వాసమని ఇప్పుడిక నేను చెప్పను. సనాతనధర్మమే మనకు జాతీయత యని నేనిపుడు చెప్పుదును.

ఈ హిందూజాతి సనాతనధర్మముతోపాటుగనే పుట్టెను. దానితో పాటుగనే అది జీవించుచున్నది. దానితోపాటుగనే అది పెరుగుచున్నది. సనాతనధర్మము క్షీణించినపుడు, ఈ జాతి క్షీణిం

చును. ఇక సనాతనధర్మము నశించిపోవుట కవకాశమే యున్నచో, ఆ సనాతనధర్మముతో బాటుగనే ఈ జాతియు నశించిపోవును. సనాతనధర్మము – అదియే జాతీయత. నేను మీకు భాషింప నియుక్తుడ నైన సందేశ మిదియే.

శ్రీఅరవిందుల యోగ సిద్ధాంతమునకు మూలాధారము

శ్రీఅరవిందుల యోగ సిద్ధాంతము వారికి కలిగిన నాలుగు దివ్యానుభూతులపై ఆధారపడి యున్నది. 1910 లో పాండిచ్చేరికి రాకపూర్వమే మొదటి రెండు సిద్ధులు కలిగినవి. దేశకాలములకు అతీతమైన నిష్క్రియ బ్రహ్మసాక్షాత్కారము 1908 లో 'లేలే' మహాశయుని సాన్నిధ్యములో సలిపిన ధ్యానము యొక్క ఫలితము. సమస్తమైన సృష్టి మిథ్యగా తోచినది. పిదప ఆలీపూర్ కారాగారములో 1908-1909 ప్రాంతములో వారికి మరి యొకసారి కలిగిన దర్శనానుభూతి ఫలితముగా మిథ్యాభావము తొలగిపోయినది. సర్వభూతములు దైవముగానే గోచరించినవి.

కారాగారమే శ్రీఅరవిందులకు తపోభూమిగా పరిణమించినది. వారికి అప్పుడు అనేక స్థాయిలలో దివ్యసాక్షాత్కారము అయినది. బ్రహ్మయొక్క నిష్క్రియ, సక్రియ రూపములు అనుభూతములైనవి. ఉన్నతచేతనా లోకములలోనికి ప్రవేశము, తద్వారా అతిమానసికమునకు మార్గమేర్పడినది.

1912 సం॥ రం లో పరబ్రహ్మానుభూతి (పరమసత్యము) ఉన్నతచేతనా భూమికల పరిజ్ఞానము వారికి కలిగినవి. వాటి శక్తిని జడచైతన్యములోనికి సైతము తీసుకొనివచ్చు ప్రయత్నము నిరంతరంగా కొనసాగినది. 24 నవంబరు 1926 నాడు ఈ ప్రయత్నము ఫలించి అధిమానస దేవతలు (the highest of the planes between Mind and Supermind) భూలోకంలోకి దిగివచ్చిరి. అది అతిమానసశక్తి దిగివచ్చుటకు నాంది. యుగ

యుగాలుగా మానవజాతి కలలుకంటున్న దివ్యజీవనము ఇక సాధ్యము కాగలదు. 1926 నుంచి శ్రీఅరవిందులు ఈ అతిమాన సావిర్భావమునకై శ్రాయశక్తుల ప్రయత్నించిరి. ఈ ప్రయత్నమును ఇంకా తీవ్రపరచుటకై 1950 లో వారు ఈ భౌతికశరీరమును త్యజించి ఇతర భూమికలనుంచి ఈ పోరాటమును కొనసాగించిరి.

అనువాదం: ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి

వాక్కు సృజనశీలి


శ్రీమాత

వాక్కునకు సృజనశక్తి గలదు; భౌతికరంగములో మార్పుచేయగల శక్తిగూడ కలదు. ఋషిప్రోక్తములైన గాయత్రి మంత్రాదులు, వాటి మహిమలు మనకు తెలియనివి కావు. మంత్రానికి నిజంగా శక్తి ఉన్నదా? ఇది సత్యమేనా? ఒక వేళ సత్యమైతే దానికి హేతువు లేమిటి అనేదే ప్రశ్న. మనం విశేషస్ఫూర్తితో ఒక శబ్దమును ఉచ్చరించినప్పుడు శబ్దతరంగములే కాక భావనాతరంగములుకూడ ఉద్భవించి ప్రచలిత మౌతాయి. అంతే కాదు. అవి ఆ భావమును మోసుకొనిపోయి దానికి రూపకల్పన చేయగలవు. శబ్దము భావమునకు బాహ్యశరీరము.

– సంపాదకుడు

మనుష్యులు ఊసుబోక వాగ్వ్యవహారంతో విలువైన సమయాన్ని ఎంత వృధాచేస్తారో చెప్పలేము. ఇది అందరికి తెలిసిన విషయమే. కాని దీని నరికట్టే విధానము ఎవ్వరికి తెలియదు.

మన మొక సంగతి గుర్తించాలి. శబ్దములు శక్తినిధులు; మనోభావములకు వాహికములు; అందుకని భావనాశక్తిచే మనకు కావలసిన ప్రయోజనములను సాధించగలము.



OM is the signature of the Lord.

THE MOTHER

ఒక శబ్దమును ఉచ్చరించినపుడు దాని అర్థమును గురించి మనస్సులో విశేషస్ఫూర్తితో ధ్యానించాలి; అందులో శక్తిని నిక్షేపించాలి. అప్పుడది ఒక బాణము వలె వెళ్లి లక్ష్యమును సాధించ గలదు.

శబ్దములలోని చైతన్యానికి మూడు ప్రధానమైన మూలములు కలవు. మొదటి రెండు శబ్దములందే స్వతస్సిద్ధములై ఉన్నవి. అందలి లోతైన భావముపై మనస్సును కేంద్రీకరించుట మూడవ కారణము.

ఈ మూడు శక్తులు ఒక శబ్దములో ఒకేసారి ప్రయుక్తమైనప్పుడు అది మంత్రశక్తిని సంతరించుకోగలదు.

1) మనస్సులో ఆలోచనా తరంగములు ఎటుల జనించునో అదే విధంగా కొన్ని శబ్దములు భౌతిక పదార్థమును తరంగితము చేసి పరణమింప చేయగలవు.

ఆలోచనా తరంగములకు శాబ్దిక తరంగములకుగల సామ్యమును గమనించిన యడల, భాషలోని కొన్ని మూలధాతువులు మనకు తెలియగలవు. ఆ ధాతువులు కొన్ని మూలభావములను ప్రకటింపజేయును. అన్ని భాషలలోను అదే విధమైన అర్థమును కలిగి యుండును. (ఇది భాషల యొక్క లిఖిత రూపమునకు వర్తించదు. వాటి ఆధారములు వేరు)

2) అనాదిగా కొన్ని సందర్భములలో ప్రయుక్తమైన శబ్దములు కలవు. అవి మంత్రశక్త్యోపేతములు. ఆ శబ్దములు నిజంగా శక్తి భాండారములే (batteries of energy)

3) మరి కొన్ని శబ్దములు సజీవమైనవి. వాటిని దీక్షతో ఉచ్చరించిన వెంటనే ఫలితము కలుగును.

'ఓం' అనే సంస్కృత శబ్దము దానికి చక్కని తార్కాణము. పైన నిర్వచించిన మూడురకముల శక్తులకు నిలయము.

భారతదేశములో ఏ దేవతను పూజించినా, కొలిచినా, ధ్యానించినా ఓంకారముతోనే నిర్దేశించెదరు.

కల్లోలమైన వాతావరణమును శాంతపరచేందుకు, మనస్సును స్థిమితపరచేందుకు అనంతకాలమును నిర్దేశించేందుకు 'ఓం' కారము ఒక మహా మంత్రము.

కొన్ని శతాబ్దాలుగా మానవులు ప్రయోగించుట వలన 'ఓం' కార శబ్దము అనంతమైన మానసిక శక్తులను సంతరించుకొని యున్నది. ముఖ్యంగా హిందువులకు ప్రత్యక్షంగా దైవమును సాక్షాత్కరింపజేసి ఆయన శక్తిని ఆహ్వానింపజేయుట కిది సాటి లేని మంత్రరాజము.

ప్రాచ్యదేశీయులు స్వాభావికముగా భగవదాభినివేశము కల వారు. 'ఓం' కారము యొక్క మహిమను పూర్తిగా గుర్తించిన వారగుటచే దానిని వర్లించి ఫలితమును పొందగలరు.

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

శ్రీమాతతో ముచ్చట్లు

శ్రీమాత: ఇది జనవరి నెల కదా!

అవును తల్లీ

ఇక్కడ ఏమని వ్రాసి ఉన్నదో చూడు

(ప్రతి నెలా పుష్పాలు చిత్రించి ఉన్న పెద్ద కేలండర్ని తల్లిగారి దగ్గరకు తీసుకొని వెళ్ళేవాడిని. దానిపై ఆమె ఒక ప్రార్థన వ్రాశేవారు.)

"శ్రీఅరవిందుల శతవార్షికమైన ఈ సంవత్సరములో వారి అనుయాయులుగా ఉండే యోగ్యత పొందేందుకుగాను పాటు పడదాము"

ఆ తరువాత?

"వారి ఉపదేశాలకు విధేయులమై అనుసరించి అతిమానవుని రాకకు సన్నాహాలు చేద్దాము. ఆనందదాయక కొత్త సంవత్సర శుభాకాంక్షలు."

ఈ పువ్వు పేరేమిటి?

"అతిమానవీయత"

ఇది ఏమి పువ్వు?

దాలియా పువ్వు.

అవును కదా.

(శ్రీమాత ఫిబ్రవరి నెల కోసం ప్రార్థన వ్రాసి దాని క్రింద 'ఓం' అని లిఖించారు.)

"అమందానందకందళిత సమర్పణతో ప్రకృతి మళ్ళి మళ్ళి దైవాన్ని ఆవిష్కారం చేస్తూంటుంది."

'ఓం'

ఓంకారం ద్వారా దైవాన్ని పొందగలరు. రూపాంతరీకరణ చేయ గల సామర్థ్యం ఓంకారానికుంది. ఓంకారం దైవానికి ప్రతిరూపం.

అవును. నిజమే. ఓంకారం దైవానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఓంకారం శబ్దరూపం కదా?

నిజమే అది శబ్దమే. ప్రపంచంలోని ఆకాంక్షంతా దైవంవైపు మళ్ళుతున్నప్పుడు ఓ.... మ్ వెలువడుతుందని పెద్దలంటారు.

నిజమే తల్లీ

అందుకే ఓ.... మ్ ని ఉచ్చరిస్తారు

అమ్మా! తమరు ఓంకారం వల్లించండి. మళ్ళి మళ్లి

ఓ.... మ్. ఓ..... మ్.

మీ ఓంకారం మహత్తరంగా ఉంది. మళ్ళీ చెప్పండి.

అంతటా ఇలాగే ఉంటుంది. ఓ......మ్. ఓ......మ్.

అవును తల్లీ

నేను 60 ఏళ్ళ క్రితం ఫ్రాంసులో ఉన్నప్పుడు హిమాలయాల్లో తిరిగివచ్చిన ఒక ఫ్రెంచి వ్యక్తి చెప్పే ఉపన్యాసం విన్నాను. హిమాలయాల్లో ఉండగా ఆతను ఒక సన్యాసిని కలుసుకున్నాడట. ఆ సన్యాసితో తనకు పూర్వపరిచయమేమీ లేనప్పటికీ కలిసినప్పుడు ఇంకేమీ మాట్లాడకుండా ఓ.... మ్. అని మాత్రం చెప్పాడట. దానితో అతనిలో పూర్తిగా మార్పు వచ్చిందట. అని అతను ఓ... మ్ అనగానే నాలోకూడా అటువంటి మార్పే కలిగింది. అంటే

ఓ.... మ్ అంటూంటే ఆ భగవంతుడే దిగివస్తున్నట్లు అనిపించింది. విన్నావు కదా.... ఈ రహస్యాన్ని మరిచిపోయేవు జాగ్రత్త!

అలాగే తల్లీ

కాబట్టి ఓ....మ్. ఓ.....మ్ అనుకుంటూ దాని శక్తిని ఆవిష్కరింప జేయాలి. ఏ గొడవ వచ్చినా అది ఓంకారంతో సర్దుకుంటుంది.

(జనవరి 1972 లో మోనా సర్కారుతో జరిపిన సంభాషణ)
అనువాదం అ. ప్రభావతి. అమరవాది వెంకటరామశాస్త్రి

ఓంకారము పరబ్రహ్మ స్వరూపము

శ్రీఅరవిందులు

మన ఆధ్యాత్మిక వాఙ్మయములో 'ఓం' కారమునకు చాల విశిష్టమైన స్థానమున్నది. అల్పాక్షరములతో అధికమైన అర్థాన్ని నిర్దేశించటం సంస్కృత భాష లక్షణము. కాని 'ఓం' అనే అక్షరం మట్టుకు అన్నిటికి మించిన షార్ట్ హేండ్. అరచేతిలో బ్రహ్మాండాన్ని అందించగల మహామంత్రము. – సంపాదకుడు

బ్రహ్మజ్ఞానమును పొందుట కడు దుర్లభము. కాని దానిని ఓంకారోపసన ద్వారా సాధించవచ్చును. అది తురీయమునుండి భౌతికము వరకు గల నాలుగు బ్రహ్మ చైతన్యావస్థలకు ప్రతీక. అది ఒక మంత్రము – అంతర్ ద్వారములను తెరచి మంత్రార్థమును తెలియబరచునది. ఓంకారము సృష్టిలోను, అతిభౌతిక లోకముల లోను, కారణలోకములోను, (causal plane) తురీయములోను వ్యాపించియున్న ఏకమాత్ర చైతన్యమును సిద్ధింప జేయును. ఓంకారోపాసకుల లక్ష్యము సర్వసాధారణంగా తురీయావస్థను పొందుటయే.

*

ఓంకారము బ్రహ్మ యొక్క బహిరాంతర కారణాలవస్థలు మూడింటికి చిహ్నము. అ, ఉ, మ అనే మూడక్షరములు పృథ్వినుండి ఆకాశము వరకు వరుసగాగల మూడులోకములను సూచించును. 'ఓం' అనే సంయుక్తాక్షరము నాలుగవ తురీయావస్థను సూచించును. దేవతలను సంబోధించుటకు సర్వకర్మలను, యజ్ఞములను ఆచరించుటకు ప్రయోగించు ఆద్యక్షరము 'ఓం'. దీని అర్థమేమిటి? మన కర్మలన్నింటిని స్వార్థరహితంగా, ఓంకార స్ఫూర్తితో, దేవతల నుద్దేశించి, తద్దేవతల అభివ్యక్తిగా, బ్రహ్మచైతన్య స్రవంతిగా నిర్వర్తించవలెను.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

సర్వశబ్ద వాగ్బీజం - ఓం

శ్రీఅరవిందులు

సర్వ శబ్దములు, సర్వభావములు ఓంకార బీజము నుండి వికసించిన పుష్పములే. ఓంకారమే నామరూప జగత్తుకు మూలమైన సద్వస్తువు, ఏకమాత్ర సత్త. ఈ ఓంకారము అన్ని తాళములను తెరవగల మాస్టర్ 'కీ'; అన్ని చిక్కుముడులను విప్పుతుంది; అన్ని సమస్యలను పరిష్కరిస్తుంది; అన్ని వస్తువులను పరిణమింప చేస్తుంది; అన్ని జీవులను తరింప జేస్తుంది!

— సంపాదకుడు

ఋక్కంటే తన జ్ఞానకిరణాలతో మనస్సును దీప్తివంతం చేసే మంత్రవాక్కు; యజుస్సంటే కర్తవ్యాన్ని శాసించి, సత్కర్మ నిర్వహణ సామర్థ్యాన్ని ప్రసాదించే వాక్కు; సామమంటే పరమాత్మ దివ్యసంకల్పాన్ని ప్రశాంత మాధుర్యానుభూతిగా సిద్ధింపజేసే మంత్రవాక్కు. ఇవన్నీ కూడా పరమేశ్వరుడైన పరబ్రహ్మ స్వరూపమే. దివ్యసంకల్ప స్వరూపమైన మంత్రం తన సంకల్పానికి యథా

ర్ధత చేకూరుస్తుంది. దివ్యానంద స్వరూపమైన మంత్రం ఆధ్యా త్మికానందాన్ని జగత్తుయొక్క అస్తిత్వంగా పండిస్తుంది.

సర్వ వాక్కులూ, సమస్తభావాలూ మహత్తరమైన ఓంకార మనే పుష్పం యొక్క వికాస విలాసాలు. ప్రణవ స్వరూపమైన ఓంకారమే శాశ్వత సనాతన శబ్దం. పంచేంద్రియగోచరమైన వ్యక్త స్వరూపాలు, సృజనాత్మక చైతన్య విలాసాలైన స్వయంకల్పిత సృజనాత్మక స్వరూపాలుగా, వస్తుసంచయమూ, దేని ఆకారాలో అవన్నీ గూడా అనంతత్వం యొక్క స్వయం సమీకృత ప్రజ్ఞాన శక్తి (self-gathered superconscient power of the Infinite) వెనుక వ్యక్తమవుతాయి.

ఓంకారమే సర్వవస్తుజాలానికీ, సమస్త భావ సంచయానికీ, నామరూపాలకూ పరమోన్నత నిధానం (sovereign source) బీజం, ఉత్పత్తిస్థానం. అంతేగాక ఓంకారం స్వయం పూర్ణమైన, నిరపేక్షమైన, ఇంద్రియాతీతమైన ఆది ఏకత్వం. వ్యక్త స్వరూపా లన్నిటికీ పరమమైన, కాలాతీత రహస్యం, కేవలమైన (self-existent) దివ్య అస్తిత్వం.

*

[శ్రీమద్భగవద్గీత సప్తమాధ్యాయం 8-11 శ్లోకాల్లో శ్రీకృష్ణుని ప్రవచనం]

"సూర్యచంద్రులలోని వెలుగును 'నేను', పురుషులలోని పౌరుషాన్ని 'నేను', బుద్ధిమంతులలోని బుద్ధిని 'నేను', శక్తివంతులలోని శక్తిని 'నేను', తాపసులలోని తపశ్శక్తిని 'నేను', జీవితంయొక్క అస్తిత్వా లన్నీ 'నేను'." ఇవన్నీ నా విన్యాసములు. ఒక్కొక్కటీ మూల తత్త్వము యొక్క ఒక్కొక్క ప్రత్యేక లక్షణము. దివ్యశక్తికి సంకే తము.

మళ్లీ భగవానుడు "సర్వవేదాల్లో ప్రణవాన్ని 'నేను' అన్నాడు. ప్రణవమంటే అన్ని శబ్దాలకూ మూలమైన ఆద్యక్షరం ఓంకారమన్న మాట. ఈ ఓంకారమే వ్యక్తమైన సర్వ సృజనా త్మక శబ్ద స్వరూపాలకూ ఆధారం. శబ్దానికీ, వాక్కుకూ సంబం ధించిన విశ్వజనీన రూపకల్పనమే (universal formulation)

ఓంకారం. ఆధ్యాత్మికశక్తినీ, శబ్దాలలోనూ, వాక్కులోనూ బీజ ప్రాయంగా నిహితమై యున్న సర్వ సంభావ్యతనూ (potentiality) ఓంకారం తనలో ధరించి, సమీకరించుకుని, సమన్వయపర చుకుని విడుదల చేస్తుంది. ఆ శబ్దం నుండే వికాసం చెందిన పరిణామంగా భావింపబడే సంభాషణకు ఉపయోగపడే భాష ఏర్పడింది. ఇంద్రియ గోచరమయ్యే ప్రకృతి విలాసాలుగానీ, ప్రాణం యొక్క విన్యాసాలుగానీ, వెలుగుయొక్క విలసనాలు గానీ పరా ప్రకృతికి చెందినవి కావు. ఆధ్యాత్మశక్తిలోని ప్రధాన గుణమే స్వభావాన్ని సృష్టిస్తుంది. ఆ విధంగా వ్యక్తమైన ఆత్మశక్తీ (force of spirit) దాని యొక్క చైతన్య ప్రకాశమూ (light of its consciousness) ఆ చైతన్యశక్తి యొక్క ఉద్ధృతీ (power of its energy) ఒక శుద్ధమైన మూల లక్షణ చిహ్నంగా వ్యక్తమైనపుడు, అది దాని యొక్క స్వ స్వభావమవుతుంది. శక్తీ – ప్రకాశమూ – ఉద్ధృతీ అనీ సనాతన బీజం నుండి ప్రభవించిన అంశాలన్నీ కూడా దాని వికాసాలో, దాని నిష్పన్నాలో (derivations) వైవిధ్య రూపాలో (variables) నిరంతరం మార్పు చెందే అంశాలో (plastic circumstances) అయి వుంటాయి.

అందువలననే భగవద్గీత సర్వే సర్వత్రా వర్తించే ఒక సామాన్య సత్యాన్ని ఈ సందర్భంలో మన కందిస్తున్నది. "ఓ పార్థా 'నన్ను' సర్వభూతాల యొక్క సనాతన బీజంగా తెలుసుకో." ఈ సనాతన బీజమే ఆధ్యాత్మిక అస్తిత్వం యొక్క శక్తి (the power of spiritual being), అస్తిత్వ చైతన్యంలోని జ్ఞాతసంకల్పం (the conscious will in the being), మరో సందర్భంలో చెప్పబడినట్లు మహద్బ్రహ్మమనే అతిమానస విశాలత్వంలో దివ్యాత్మ నాటిన బీజం. దాని నుంచే సర్వ దృశ్యమాన జగత్తులూ ప్రభవించాయి. ఈ దివ్యత్వం యొక్క బీజమే సంభూతి జెందుతుంది; ఒక విలక్షణమైన రూపంగా సర్వభూతాలలోను ప్రకాశిస్తుంది; దాని స్వధర్మమౌతుంది.

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

'ఓం' సనాతన సృష్టి మంత్రం

శ్రీఅరవిందులు

మనకు స్థూలమైన శబ్దమును గురించే తెలుసు. నిశ్శబ్దమైన శబ్దమును గురించి తెలియదు. కాని యోగులకిది కొత్త కాదు. వారు లోతైన చైతన్యంలో విహరిస్తూ వుంటారు. మనకు దృశ్యము కాని దృశ్యములు, శ్రవణముకాని శబ్దములు వారికనుభూతమౌతూనే వుంటాయి. అట్టి శబ్దములకు మామూలు శబ్దము కన్న అధికమైన సృజనశక్తి ఉంటుంది. మంత్రములు ఈ కోవకు చెందినవే. మన మన్వేషించవలసినవి ప్రాపంచిక వస్తువులు కావు. ప్రాపంచిక వస్తువులకు పూర్వమైన మూలతత్త్వము.

– సంపాదకుడు

శబ్దతరంగాలకు రూపాలను సృష్టించే శక్తితో పాటు వాటిని లయం చేసే శక్తికూడా ఉందని మనకు తెలుసు. ఆధునిక విజ్ఞానంలో ఇది సర్వసాధారణమే.

మంత్రము అగాధాలలోనుంచి పొంగివస్తుంది

నిజానికి – వాక్కు సృజనాత్మకమైనది. ఇది మనో వికారాల్ని, మానసిక స్వరూపాల్ని, క్రియాప్రేరణలను సృష్టిస్తుంది. వాక్కుకిగల ఈ సృజనాత్మక చర్యను మంత్రోపాసన ద్వారా సనాతనవైదిక సిద్ధాంతమూ, ఆచరణా కలిసి విస్తృతం చేశాయి.

మంత్రం అంటే మరేమీ కాదు. మన అంతరాంతరాల్లో అట్టడుగు పొరల్లో ప్రగాఢ సృజనాత్మక చైతన్యంతో పాటమరించి శక్తిని (బ్రహ్మతత్త్వాన్ని) సంతరించుకున్న పదమే మంత్రం. ఇదే మంత్ర సిద్ధాంతం. *ఈ మంత్రం మానసికమైనది కాదు. హృదయంలో గూడు కట్టుకున్న స్పందన వల్లనే తప్ప మేధవల్ల రూపుదిద్దుకోదు.* హృదయస్పందనతో ఆవిర్భవించిన భావంనే నిరంతరంగా ధ్యానించబడుట వలన మరింత ప్రదీప్తమై, విస్పష్టమై, వినిపించే శబ్దంగానో వినిపించని ప్రణవంగానో బయటకు

నెట్టివేయబడుతుంది. వినిపించే శబ్దం కంటె వినిపించని ప్రణవా నికే ఎక్కువ శక్తి ఉంటుంది. సృజనాత్మక చర్యలో ఇది కచ్చిత మైన ఫలితాన్ని ఇస్తుంది.

మంత్రము మన స్వభావమునే మార్చివేయగలదు

మంత్రం – మనలో నూతన మానసిక సామ ర్థ్యములను సృష్టించడమే కాదు – గతంలో మనకులేని విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని బహి ర్గతం చేస్తుంది. మంత్రం ఉపాసకునిలోనే గాక, ఇతరుల మన స్సుల్లో కూడా అటువంటి ఫలితాన్నే ఇస్తుంది. అంతేకాదు పరి సర మానసిక, ప్రాణిక వాతావరణంలో ప్రకంపనలను సృష్టి స్తుంది. ఫలితంగా భౌతికతలంలో వారి సాధనలోను, క్రియ ల్లోను, ఆఖరికి వస్తురూపాలను మలచడంలోను కూడా ప్రభావం చూపుతుంది.

శుద్ధ సత్యము యొక్క స్పందనము వాక్కు

ఈ దివ్యమంత్రం – వాక్కునకే వాక్కు. అనంతమూ సర్వశక్తిమం తమూ అయిన పవిత్ర చైతన్యస్థితి యొక్క నాదమే మంత్రం. స్వచ్ఛమైన ఈ చైతన్యస్థితి దార్శనిక తను, స్వతసిద్ధ శక్తి లక్షణాన్ని సంతరించుకుని ఉంటుంది. ఇది మనస్సుచేత, మనస్సులో వస్తువుల పరమ సత్యవాక్కుగా మల చబడుతుంది. ఏ పదార్థమైనా, ఏ తలం మీద అయినా రూపం గాని, వ్యక్తీకరణగాని దాని సృష్టి సమర్థత నుండే ఆవిర్భవిస్తుంది. The Supermind using the Word is the creative logos.

సనాతన వేదమంత్రం ఓంకార ప్రణవంలోని అ,ఉ,మ మాదిరిగాను, తాంత్రిక మంత్రంలో మాదిరిగాను ప్రతీ మంత్రానికి బీజాక్షరాలు ఉంటాయి. ఆ బీజాక్షర సంపుటిలో వస్తువుల లక్ష ణాలు ఉంటాయి. ఆ లక్షణాల రూపాలు స్ఫూర్తిదాయకమైన వాక్కులో నిక్షిప్తమై ఉంటాయి. వాక్కులో ఒదిగి ఉన్న రూపా లను దివ్య నైపుణ్యాలు విశ్వంలో ఆవిష్కరిస్తాయి. అటువంటి దివ్యనైపుణ్యాలను మానవులకు కలిగించేవి బీజాక్షరాలే.

ఈ బీజాక్షర సంపుటి (మంత్రం) సృష్టించే శబ్దతరంగం అస్తవ్యస్తమైనది ఏం కాదు. ప్రతీ దానికి ప్రత్యేకమైన ఓ లయ ఉంటుంది. ఆ శబ్దతరంగం ఓ విశ్వప్రణాళిక ననుసరించి విహరిస్తుంది. లయకు సంబంధించిన సిద్ధాంతమూ, అమరిక, శ్రావ్యత ప్రకారమే ప్రపంచనిర్మాణ ప్రక్రియ జరుగుతుంది. కాబట్టి ప్రపంచ సృష్టికి ప్రణవనాదమే కారణమన్న మాట. స్రష్ట (బ్రహ్మ) కు ఓం కారం శబ్దప్రతీక. ఇంతెందుకు... పరమ పురుషుని లయ విన్యాసమే జీవితం.

సరే! బాగానే ఉంది. అయితే ప్రపంచంలో ప్రణవం సృష్టించే చైతన్యానికి పూర్వం వ్యక్తమయ్యేది ఏది? బ్రహ్మ అందామా? అలా అనడానికి వీల్లేదు. ఎందుకంటే ఆయన్ని వాక్కుతో వ్యక్తం చేయలేము. ఆయన ఆయన్ని వ్యక్తీకరించుకోవడానికి మంత్రం ఉపయోగించడు. అయితే ఆయన్ని గురించి ఆయనకే తెలుసు. బ్రహ్మాండంలోని ఆకృతుల వెనుక ఉండే తన పరమసత్యాలను గురించి సైతం ఆయనకు తెలుసు. అవి ఆయన దివ్యదృష్టికి సదా స్వయంవ్యక్తం అవుతూనే ఉంటాయి. కాబట్టి – ప్రణవానికి పూర్వం వ్యక్తమయ్యేది బ్రహ్మ ప్రతీకలు. బ్రహ్మ తత్వాలు అంటే సరిపోతుంది.

(బ్రహ్మకు సమగ్రమైన శబ్దప్రతీక ఓం కారమే కదా!)

వాక్కు సృజిస్తుంది, వ్యక్తీకరిస్తుంది – అనడం కంటే వాక్కే సృష్టి, వాక్కే వ్యక్తీకరణ అనడం బాగుంటుంది. వాక్కు చేత బ్రహ్మ వ్యక్తీకరింపబడడు కాని వాక్కుమాత్రం బ్రహ్మచేత వ్యక్తీకరింపబడినదే!

కాబట్టి మన పరమాశయంగా అనుసరించవలసింది, అంగీకరించవలసింది – ఈ ప్రపంచంలోని సంఘటనలూ కాదు. దృశ్యాలూ కాదు. మన సంకల్ప సిద్ధి కోసం, మానసికపరిశీలన కోసం వివిధరూపాలు వెదజల్లి ప్రణవం (మంత్రం) దేన్ని ఆవిష్కరించదలచుకున్నదో – అదే – అదే మన ఆశయం. మరోలా చెప్పాలంటే – సకల సృష్టికి ఆదిమూలమైన సర్వోత్కృష్టుని సన్నిధానమే.

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు

ఛాందోగ్యోపనిషత్తు – మొదటి వాక్యం

శ్రీఅరవిందులు

మన ఉపనిషత్తులు జ్ఞాన భాండారములు. బ్రహ్మజ్ఞానానికి రాచబాటలు. ప్రతి ఉపనిషత్తుకి దాని మొదటి చరణంలోనే మూలభావము చాల నేర్పుగా సంక్షిప్తము చేయబడి వున్నది. ఓం కారము ద్వారా జాగ్రత్, స్వప్న, సుషుప్త లోకముల జ్ఞానమును పొందుటకు, ఆ లోకములపై ఆధిపత్యము పొందు ప్రక్రియలు ఛాందోగ్యోపనిషత్తుకు విషయములు. – సంపాదకుడు

'ఓమ్' అనేది నాశరహితమైన అక్షరం. ఓమ్ అనే ఉద్గీథాన్ని ఉపాసించాలి. ఇలా 'ఓమ్' అనే ఉద్గీథాన్ని పైకి గానం చేసిన వాడు ఊర్ధ్వగతిని పొందుతాడు. దానికి ఇది ఓ వ్యాఖ్యానం.

బ్రహ్మజ్ఞానమునకు సాధనం

ఉపనిషత్తు యొక్క మొట్ట మొదటి వాక్యం, ఇలా దీనికిగల ద్వంద్వార్థాలలో యథాక్షరంగా అనువదింపబడినప్పుడు తనకుగల రెండు అర్థాలను, అంటే, భౌతికంగా ప్రతీకంగా ఉండే బాహ్యమైన అర్థాన్ని, ఆంతరమై మార్మికమైన ప్రతీకాత్మకంగా కల్పితమైన సత్యాన్ని ఆవిష్కరిస్తుంది. వేదాన్తానికి చెందిన ఈ ఆరంభ పంక్తులు లేదా వాక్యసముదాయాలు ఎప్పుడూ గొప్ప ప్రాధాన్యం కలిగి ఉంటాయి. ఈ వాక్యాలు, ఎప్పుడూ ముందు ముందు రాబోయే విషయాలనన్నింటినీ కాకపోయినా, చాలావరకు సారభూతమై విస్తృతమైన ఉపనిషదభిప్రాయాన్ని అభివ్యక్తపరచేలా లేదా, సంగ్రహించేలా కూర్చబడి ఉంటాయి. వాజసనేయ శాఖకు చెందిన ఈశావాస్యోపనిషత్తులోని 'ఈశావాస్యం' అనే వాక్యం, తలవకారోపనిషత్తులోని 'కేనేషితం.... మనః' అనే వాక్యం, బృహదారణ్యకంలోని, అశ్వమేధాశ్వాన్ని గురించిన వాక్యాలు, ఐతరేయంలోని కేవలాత్మను దానియొక్క భవిష్యత్ప్రపంచానికి చెందిన స్పందనలనూ తెలియజేసే వాక్యాలు ఇవన్నీ ఇలాంటి కోవకు చెందినవే.

మొదటి వాక్యము సంక్షిప్త సూచిక

ఛాందోగ్యంలోని ఆరంభోపోద్ఘాత వాక్యాల్ని బట్టి, అది, ఆత్మను పరమాత్మకు ఋజువుగాను, నిర్దుష్టంగాను సమర్థించుకోవడాన్ని చెప్పే గ్రంథం అని మనం చూస్తాం. దీని కొరకు కావలసిన మన కివ్వబడే ఆత్మశక్తి, విధానాలు, ప్రక్రియలు కూడా ఇక్కడ ఉన్నాయి. ఈ ఉపనిషత్తు యొక్క విషయం పరబ్రహ్మమే. అయితే ఆ పరబ్రహ్మం వైదిక పవిత్ర వర్ణమైన ఓంకారంలో ప్రతీకాత్మకంగా నిర్దేశింపబడి ఉన్నాడు. కనుక, దీన్ని బట్టి కేవలం సర్వసాధారణమైన విశ్వజనీన స్థితి దశమాత్రమే కాదు, దాని సర్వావయవ సంబద్ధమైన విశేషస్థితులు (అంటే) జాగ్రత్స్వప్న సుషుప్తావస్థలు లేక స్థూల, సూక్ష్మ నిగూఢములు – భూలోకం, భువర్లోకం సువర్లోకం వీటిని జయించడానికి కావలసిన సాధనాలు, వీటిని భోగించడం, వీటన్నిటిని అతిక్రమించడం లేదా వీటికి అతీతుడు కావడం అనేదే ఛాందోగ్య విషయమైన అంశం. 'ఓమ్' అనేది ప్రతీకము, ప్రతీకాత్మకమూను. ఈ ప్రతకమే 'అక్షరము'.

అనువాదము: ఎస్.వి. రంగరామానుజాచార్యులు

ప్రశ్న – కఠోపనిషత్తుల్లో ఓంకారం

శ్రీఅరవిందులు

నేటికాలం వేరు వేదకాలం వేరు. ఆ కాలంలో ఋషులు సృష్టి రహస్యాలను గురించి మేధాశక్తితో కాకుండా తపోదీక్షతో అన్వేషించి దర్శించేవారు. వారు దర్శించిన సత్యములే వేదములు, ఉపనిషత్తులు. వాటి భాష సాంకేతికంగా వుంటుంది. తార్కిక బుద్ధికి మాత్రమే అలవాటుపడిన ఆధునిక మానవునికి ఈ రహస్య సంకేతములను ఛేదించి మూలసత్యములను ఆవిష్కరింపజేసే శక్తి లేదు. ప్రశ్నోపనిషత్తులో (శిష్యులడిగిన ప్రశ్నలు)

'ఓం' యొక్క మహత్తుని గురించి చెప్పబడినది. ఓం కారమును ధ్యానించిన వాడు పాము కుబుసమును త్యజించినట్లు దోషములను విసర్జించి బ్రహ్మలోకమును దర్శించును. మానవుని బాహ్యమనస్సు వెనుక అంతకంటె గంభీరమైన ఒక లోతైన శక్తి (subliminal) ఉన్నదనియు, మనస్సు దాని యొక్క ఉపరితల రూపమే అనియు తెలియగలదు. ఆధ్యాత్మిక చేతనోన్నతిలో మనిషి యొక్క అసలు రహస్యమేమిటో బైటపడుతుంది.

– సంపాదకుడు

ఉపనిషత్తుల సాంకేతిక భాష

ఉపనిషత్తుల్లోని కల్పనా చిత్రం అనేది, చాలా వరకు వేదంలోని కల్పనా రీతినుండే వికాసాన్ని పొందింది. అయితే చాలా సాధారణంగా కల్పనా చిత్రం అనేది ఉజ్జ్వలమైన కల్పనాకృతి యొక్క ముసుగులేని (అనావృత) స్పష్టతను ఆవిష్కరించడానికే ఇష్టపడుతుంది.

వేదరహస్యాల ఆవిష్కరణము

చాలా తరచుగా ఈ చిత్ర కల్పన ప్రాచీన వైదిక ప్రతీక విధానానికే చెందిన 'ప్రతీకల' నే ఉపయోగిస్తూ ఉన్నా, అసలు మౌళికాన్తఃసారానికి బాగా దగ్గరగా సాంకేతికము (పారిభాషికము) అయిన అంశం అంతగా లేని విధంగానే ప్రతీకలను స్వీకరిస్తుంది. ఈ విధమైన ప్రతికల్పనా విధానం మన ఆలోచనా ధోరణులచేత ప్రక్కకు లాగుకొని పోరానిదిగానే ఉంది. అయితే ఈ ఆలోచనాధోరణి పాశ్చాత్యులైన విద్వాంసులను గందరగోళంలో పడవేసింది. పాశ్చాత్య విద్వాంసులు, ఆఖరికి, ఈ ఉనిషత్తులన్నీ, సర్వోత్తమమైన తాత్త్వికభావనా కల్పనలను, మానవత్వపు అప్రగల్భ (పసితనపు) మనస్సుకు చెందిన అసుందరాలు, అస్పష్టాలు అయిన భావాలతో కలగాపులగం చేశాయని ఆక్రోశించారు. అయితే, వాస్తవానికి, ఉపనిషత్తులనేవి వైదికభావననుండి గాని, దాని స్వాభావికత్వం, మౌళిక సిద్ధాంతాలనుండి గాని విప్లవాత్మకంగా దూరమైనవి కావు. పైగా వైదిక భావనల కొనసాగింపు

సమగ్ర వికాసమే. చాలావరకు ప్రతీక గర్భిత వైదిక వాక్కులో నిగూఢంగా కప్పబడి ఉన్న మర్మాన్ని, రహస్యాన్ని విస్పష్టంగా ప్రకటంగా అభివ్యక్తపరచే విధంగా ఏర్పడిన విస్తృతమైన రూపాంతర పరిణామమే. ఉపనిషత్తు, వేదంలోను బ్రాహ్మణాల్లోను ఉన్న కల్పనాచిత్రాన్ని వైదికకర్మకలాపంలోని ప్రతీకల్ని స్వీకరించే ప్రారంభమైంది. అయితే, తాను సర్వోన్నతంగా వికసింపజేసిన, పూర్ణ విశుద్ధమైన ఆధ్యాత్మిక తత్త్వ సిద్ధాంతం కోసం, దీనికి ఒక రకమైన మనోవిచారారంభ బిందువుగా ఉపయోగపడే విధంగా, ఆంతరమార్మికాభిప్రాయాన్ని వెలికిదీసేలా, వాటిని (వైదికకల్పనా చిత్రాల్నీ, క్రియకలాపప్రతీకల్నీ) మలచింది. విశేషించి గద్యమయాలైన ఉపనిషత్తుల్లో పూర్తిగా ఇదే కోవకు చెందిన వాక్య కదంబాలు ఎన్నో ఉన్నాయి.

ఆధ్యాత్మిక జ్ఞానము మేధ కతీతము

ఈ వైదికము. ఉపనిషత్సిద్ధము అయిన కల్పనా చిత్రం, మన, నేటి మనస్తత్త్వానికి ఎంతమాత్రం అందనిదే. మన మనస్తత్త్వం ఇలాంటి ప్రతీకల్లోని సజీవంగా జాగృతమై ఉన్నా సత్యాన్ని, నమ్మదు. ఎందువల్లనంటే, ఇక్కడ ఆవిర్భవిస్తున్న భావన, ప్రజ్ఞచే భయపెట్టబడి, సత్యాన్ని అంగీకరించగల దిటవును కోల్పోయింది. అంతేకాదు ఈ వైదికకల్పనా చిత్రాన్ని, ఉదారంగా మానసికం ఆధ్యాత్మికం అయిన తత్త్వదర్శనంగా ఆవిర్భవించడానికి కూడా (మన మనస్తత్త్వానికి) ధైర్యం చాలదు. అయితే వాస్తవంగా ఈ వైదిక కల్పనా చిత్రం, తెలివిమాలినది — లేదా, అతిప్రాథమికం — ఆటవికం — అయిన తాంత్రికం కంటే చాలా దూరమైంది.

ఈ విశదము, జాగరూకము, దేదీప్యమానంగా కవితా లక్షణంగల రంజకమైన భాష, సర్వోన్నతంగా వికసింపజేయబడిన ఆధ్యాత్మిక సంస్కృతికి స్వాభావికమైన అభివ్యక్తియే.

సత్యము ధగధగాయమానము

ఉపనిషత్తుల్లోని రంజకమైన భావన, ఈ నిర్దుష్టమైన కల్పనాచిత్రంతోను ప్రతీకలతోను ప్రారంభమౌతుంది. మొట్ట

మొదట, వైదిక ఋషుల నుద్దేశించి తత్త్వరహస్య దర్శకాలైన శబ్దాలు, తత్త్వద్రష్టయొక్క మనస్సుకు పూర్తిగా వ్యక్తమయ్యేలా ఉంటాయి. కాని, సాధారణ పరిజ్ఞానానికి తమ నిగూఢ భావాన్ని కప్పిపుచ్చుతాయి. ఈ రెంటినీ తక్కువ, అన్యాపదేశ – అభివ్యక్తి గల భాషతో కలిపి, వీటికంటే (తత్త్వద్రష్ట యొక్క మనస్సు, సామాన్య జనపరిజ్ఞానం ఈ రెంటికంటే) ఆవల మహోదాత్తంగా వికసించిన ఘనమైన కల్పనాచిత్రం, మరియు వాగ్విన్యాసం, వైపుకు తీసికొని వెళ్లి, చివరికి ఒక్కసారిగా ఆధ్యాత్మిక సత్యాన్ని పరిపూర్ణశోభతో వైభవంగా ఆవిష్కరిస్తుంది ఉపనిషత్తుల్లోని భావన. గద్యరచనలో ఉన్న ఉపనిషత్తులు ప్రాచీనభారతావనికి చెందిన మనస్సు యొక్క క్రమపరిణతి పనిచేస్తున్న తీరును ప్రతీకను ఉపయోగించడం ద్వారా మనకు చూపుతాయి. ఆ తరువాత దాన్ని అతిక్రమించి ఆధ్యాత్మిక విశిష్టతకల విశదాభివ్యక్తికి తీసికొని వెళ్తాయి.

ప్రశ్నోపనిషత్తులోని ఒక వాక్య కదంబం, 'ఓమ్' అనే రహస్యాక్షరం యొక్క శక్తిని, విశిష్టతను తెలియపరుస్తూ, ఈ క్రమ పరిణతికి చెందిన ప్రాథమిక దశను సోదాహరణంగా మన ముందుంచుతుంది.

"ఓ[1] సత్యకామా! ఈ 'ఓమ్' అనే అక్షరమే పరబ్రహ్మం, అపరబ్రహ్మం. కనుక, విద్వాంసుడు (తత్త్వవేత్త) ఈ ఆయతనం (ఆశ్రయం) ద్వారానే పరం, అపరం ఈ రెండింటిలో, ఏదో ఒక దాన్ని పొందగలుగుతాడు. ఎవడైతే ఈ ఒక్క అక్షరాన్ని ధ్యానిస్తాడో వాడు, ఆ అక్షరం వల్లనే వెంటనే జగత్తులో విజ్ఞుడౌతాడు."

"ఆతనిని[2] ఋక్కులు మనుష్యలోకానికి తీసికొని వెళ్తాయి. అక్కడ ఆతడు తపస్సుతోను బ్రహ్మచర్యంతోను శ్రద్ధతోను కూడినవాడై గొప్పతనాన్ని అనుభవిస్తాడు." "ఇక, ఒకవేళ, రెండు మాత్రలుకల ఓం కారంచేత ఏకాగ్రచిత్తుడైతే, అతడు అంతరిక్షా

---

[1] ఏతద్వై సత్యకామ।... (ప్రశ్నో. 5 ప్ర. 2 మంత్రం)
[2] ప్రశ్నో. 5 ప్ర. మం 3, 4, 5, 6

నికి చేరి, యజస్సులచే సోమలోకానికి తీసికొని వెళ్లబడతాడు. అతడు సోమలోకంలో ఆత్మవైభవాన్ని అనుభవించి తిరిగి వస్తాడు.

"ఎవ్వడైతే మూడు మాత్రలుకల ఓమ్ అనే అక్షరం చేత పరమపురుషుణ్ణి ధ్యానిస్తాడో వాడు సూర్యతేజస్సులో చేరుతాడు. ఎలాగైతే, పాము కుబుసంచేత విడువబడుతుందో, అలాగే, ఆతడు పాపంచేత వినిర్ముక్తుడై, 'సాను' ల చేత బ్రహ్మలోకానికి తీసికొని వెళ్లబడతాడు. ఈతడు ఈ క్రిక్కిరిసిన జీవకోటినుండి, జీవాన్తర్యామి పరాత్పరుడు అయిన పురుషని దర్శిస్తాడు."

"ఓమ్ అనే మూడక్షరాలను (అ+ఉ+మ్) విడివిడిగా ప్రయోగించినప్పుడు అవి మృత్యువుతో కూడినవి. ఒకదాని నుండి ఒకటి వేరు చేయక, పరస్పర సంయుక్తాలుగా ఆత్మయొక్క బాహ్యాక్రియల్లోను, ఆంతరక్రియల్లోను, బాహ్యా ఆభ్యంతర క్రియల్లోను (మధ్యమ క్రియల్లోను) సమగ్రంగా నిర్దుష్టంగా ప్రయోగింపబడినప్పుడు విజ్ఞుడైన ప్రయోక్త కంపింపడు."

ఈ లోకానికి ఋక్కులచేత, అంతరిక్షలోకానికి యజుస్సులచేత, సామలచే, తత్త్వద్రష్టలు మనకు దేనిని ఎరుకపరచారో ఆ లోకానికి ఉపాసకుడు తీసికొని వెళ్లబడతాడు. ఆ ఓంకార రూపమైన (ఆయతనం) ఆశ్రయం చేతనే శాంతము, అజరామరము, భయరహిత స్థానము అయిన పరబ్రహ్మానికి చేరుతాడు."

సంకేతములు జ్ఞానదీపికలు

ఇక్కడ ఉన్న ప్రతీకలు ఇంకా మన మేధకు అందక మరుగున పడి (ప్రచ్ఛన్నంగానే) ఉన్నాయి. అయినా విభిన్నాధ్యాత్మిక సాక్షాత్కారాలకు చెందిన దశలకు చేర్చే మానసికానుభవాలకు ఇవి ప్రతినిధులని నిస్సందిగ్ధంగా దర్శించడానికే ఇక్కడ సూచనలు అందించబడ్డాయి. ఇవి (ఈ ప్రతీకలు) మూడు బాహ్యం, మానసికం, అతిమానసం అయినవని, చిట్టచివరి సర్వోచ్ఛపరిశుద్ధికి ఫలితంగా పరిపూర్ణం సమగ్రము అయిన సర్వమానవ సమగ్ర ప్రధాన ప్రవృత్తి, జరామరణరహితమైన ఆత్మయొక్క నిత్యప్రశాంతస్థితికి చేరడం జరుగుతుందని కూడా ఈ ప్రతీకలవల్ల అవగతం అవుతుంది. ఇక, అనంతరం మాండూక్యోపనిషత్తులో ఇతర

ప్రతీకలు ప్రక్కన పెట్టబడి, మనం, ఒక అనావృత (ముసుగు లేని) విలక్షణస్థితికి తీసికొని వెళ్లబడతాం. అప్పుడు అక్కడ ఒక

ఆధునిక విజ్ఞానం వెనుక ఆధ్యాత్మిక చైతన్యం

వివేకం ఆవిర్భవిస్తుంది. ఆధునిక జ్ఞానం తన యొక్క అతి విలక్షణం, భౌద్ధికం, హేతుబద్ధం, వైజ్ఞానికం అయిన విధానం ద్వారా, ఆ వివేకస్థితికే తీసికొని రాబడుతున్నది. మన యొక్క బాహ్య వివేకప్రవృత్తులన్నీ ఏ విజ్ఞానం వెనుక పనిచేస్తున్నాయో, దేనికి మన, మేల్కొంటున్న మనస్సనేది ఉపరితల వృత్తి అయి ఉందో, జ్ఞానమే అయినా ఏది వేరుకాదో, ఏది మహత్తరమై ఉచ్చకోటికి చేరి ఉందో అదే ఒక ఆధ్యాత్మిక వివేకం, దానిలోనే మన ఆత్మసత్త యొక్క పూర్ణ రహస్యాన్ని సర్వోచ్చదశను మనం దర్శించవచ్చు.

ప్రశ్నోపనిషత్తులోని వాక్యసముదాయాన్ని మనం చూస్తే ఈ సర్వోచ్చ వివేకం ఇదివరకే అక్కడ ఉందని గమనించవచ్చు. మనం దీన్ని బట్టి, చాలా హేతుబద్ధంగా ఈ వాక్యాలు, ఇలాంటివే అయిన ప్రాచీన ఋషుల మరికొన్ని ఉట్టంకనాలు, వాటి స్వరూపాలు హేతువాదబద్ధమైన ఆలోచనకు (మనస్సుకు) ఎంతగా చిక్కుగా ఉన్నప్పటికీ, కేవలం అప్రగల్భమార్మికవాదంగా కొట్టి పారవేయటం సాధ్యం కాదని నిర్ణయింపవచ్చు. ఇవి కల్పనాచిత్రితమైన భావాభివ్యక్తియే. ఇది ఆకాలంనాటి మానసిక స్థితికి (ఆలోచనకు) సహజమైనదే. ఇప్పుడు, హేతుబద్ధమైన ఆలోచనయే తనదైన క్రమవిధానాన్ని బట్టి, ఇదంతా వాస్తవమని, గంభీరము అగాధము అయిన సత్యమని, విజ్ఞానపు విశ్వసనీయ సత్యమని మనకు చూపిస్తున్నది.

సర్వాంతర్యామి అనంతుడు

ఛందోబద్ధాలైన ఉపనిషత్తులు, అతిప్రభావవంతమైన ప్రతీక విధానాన్ని కొనసాగిస్తూ, తమ శ్లోకసమూహాల్లో చాలా తేలికగా ఈ ప్రతీక విధానాన్ని తీసికొని వెళ్తాయి. ఇటువంటి కల్పనా చిత్రాన్ని అతిక్రమించి బహిరంగమైన భావాభివ్యక్తిలోనికి చేరుతాయి.

ఆత్మ, శక్తి, మానవులలోను, ఇతరప్రాణులలోను, ప్రపంచ మంతటా, ఇతరలోకాల్లోను సమస్త విశ్వాలకు అతీతంగాను ఉన్న, అమరం, అద్వితీయం, అనన్తం అయిన దైవతత్త్వం, ఎట్టి ముసుగు లేకుండా మంత్రబద్ధం చేయబడటమే కాక, ఈ దైవతత్త్వం దేదీప్యమానంగా శాశ్వతము సర్వోచ్చము అయిన అతిశయంతోను బహుముఖమైన ఆవిష్కారంతోను ఉపనిషత్తుల్లో చెప్పబడింది.

కఠోపనిషత్తులో ప్రథమాధ్యాయంలోని రెండవవల్లిలోను, రెండవ అధ్యాయంలోని మొదటివల్లిలోను నచికేతనునికి, ధర్మానికి అధిపతి అయిన యముడు చేసిన బోధనల్లోని కొన్ని వాక్య కదంబాలు, వాటి (ఉపనిషత్తుల) స్వభావాన్ని ఎంతో కొంత సోదాహరణంగా విశదపరచడానికి సరిపోతాయి.

పరమాత్మ అజుడు నిత్యుడు శాశ్వతుడు

"ఈ[1] ఓంకారరూపమైన అక్షరమే పరబ్రహ్మం. ఈ అక్షరమే పరమైనది. ఈ నాశరహితాక్షరాన్నే తెలిసికొన్నవాడు తానేది కావాలని కోరితే అది అతనిదే. ఆ పరబ్రహ్మం పుట్ట లేదు. మృతిచెందదు. అది ఎక్కడనుంచీ ఆత్మసత్తను పొందలేదు. పుట్టనిది, నిర్వికారం, శాశ్వతం, సనాతనం అయిన ఆ పరబ్రహ్మం శరీరం నశించినా నశించేది కాదు.

"ఆ పరమాత్మ (పరబ్రహ్మం) ఒక చోటనే కూర్చొని ఉన్నా చాలా దూరం ప్రయాణిస్తాడు. శయనించి ఉండే అన్నివైపులకూ వెళ్లగలడు. నాకంటే వేరుగా ఎవ్వడు ఆనందమయుడైన ఆ పరమాత్మను తెలిసికోగలడు?

ఆత్మజ్ఞానం పుస్తక పఠనము వలన కలగదు

వివేకసంపన్నుడైనవాడు, శరీర రహితుడై అస్థిరశరీరాల్లో స్థిరంగా ఉన్నవాడిని, సర్వవ్యాపకుడు, గొప్పవాడు అయిన ఆ పరమాత్మను తెలిసికొని శోకాన్ని పొందడు. ఆ ఆత్మ, ఉపదేశం చేతగాని, బుద్ధిశక్తిచేతగాని, పొంది

[1] కఠో. అధ్యా 1 – వల్లి 2 – మం – 16, 17, 18, 21, 22, 23, 24, 25.

త్యంచేతగాని సాధింపబడడు. ఎవ్వడినేతే ఆ ఆత్మ వరిస్తుందో, వానికే, అతడు (ఆత్మ) తన శరీరాన్ని ఆవిష్కరిస్తాడు."

ఎవ్వడైతే పాపాచరణంనుండి విరమించడో, ఎవడైతే ఏకాగ్రచిత్తుడు ప్రశాన్తుడు కాడో, ఎవని చిత్తం ఉపశాన్తం కాదో, ఆతడు తన బుద్ధి వైభవం చేత ఆ పరమాత్మను పొందజాలడు.

ఎవ్వనికి తత్త్వజ్ఞులు, యోద్ధలుకూడా ఆహారమౌతున్నారో, 'మృత్యువు' ఆహారంలో నంజుకొనే పదార్థం అవుతున్నదో, ఆ పరమాత్మ తత్త్వం ఎక్కడ ఉంటుందో ఎవ్వడు గ్రహించగలడు?"

అంతర్ముఖులకే ఆత్మదర్శనం

"[2] ఆ పరమాత్మ ఈ శరీరానికి చెందిన ద్వారాలను (ఇంద్రియాలను) వెలుపలి వైపునకు తెరచి ఉంచాడు. కనుక, వెలుపల వైపునకే మానవుడు చూస్తాడు తప్ప, లోపలి ఆత్మను చూడడు. కేవలం వివేకసంపన్నుడైన ఎవ్వడో ఒక్కడు మాత్రమే తన చూపును అంతర్ముఖం చేస్తాడు. అతడే అమృతత్వాన్ని కాంక్షించి తన చూపును మరల్చి ఆత్మను సాక్షాత్తుగా ఎదురుగా దర్శిస్తాడు.

"బాలబుద్ధులైనవారు బాహ్య కామాలను అనుసరించి విస్తారంగా పరచబడిన మృత్యువు వలలో పడతారు. ఇక ధీరులైనవారు అమృతత్వాన్ని తెలిసికొని అస్థిరాలైన ఈ ప్రాపంచిక విషయాల్లో స్థిరాత్మ తత్త్వాన్ని పొందగోరరు. ఎవ్వడు ఆత్మద్వారానే రూపం, రసం, గంధం, శబ్ద స్పర్శ అనే విషయాలవల్ల కలిగే లౌకిక సుఖాలను తెలిసికోగలడో ఇక, ఇక్కడ వానికి మిగిలింది ఏముంది?"

ఆత్మజ్ఞాని దుఃఖానికి అతీతుడు

"ఏ వివేకి అయినవాడు మహత్త్వము విభుత్వముకల పరమాత్మను దర్శించి ఆ పరమాత్మ తత్త్వం ద్వారానే స్వప్నాన్తాన్ని (కల కనేదంతా అందులోనే ఉందని) జాగరితా

---

[2] కఠో. అధ్యా 2 వల్లి. – మం 1

న్నాన్ని (మేల్కొనేదంతా అందులోనే ఉందని) రెంటినీ చూడ గలుగుతాడో అట్టి ధీరుడు శోకింపడు.

"ఎవ్వడు మధుభోక్త అయిన (తీపితనాన్ని రుచిచూచే) పర మాత్మను జీవకోటికి లోపల అంతర్యామిగా ఉన్నవానిని, భూత భవిష్యత్తుల కధిపతి అయిన వానిని, సన్నిహితంగా దర్శిస్తాడో వాడు దేనిని గురించీ జుగుప్సపడడు."

"ఎవ్వడు తపస్సువల్ల పూర్వమే ఆవిర్భవించి ఉన్నాడో, ఎవ్వడు పూర్వమే జలాలనుండి ఆవిర్భవించి ఉన్నాడో, ఎవ్వడు ప్రాణుల హృదయ గుహలో ప్రవేశించి ప్రాణులతో కలసి ఉన్నాడో వానిని దర్శించినవాడే ధీరుడు."

"అనంతమై సర్వదేవతలనూ తనలోనే కలిగి ఉన్న 'మాత' ప్రాణశక్తివల్ల ఆవిర్భవించింది అయిన, ప్రాణుల హృదయ గుహలో ప్రవేశించి సర్వప్రాణులతో కలసి ఉంటున్న "అదితి"ని ఎరిగిన వాడే ధీరుడు."

"మాతృగర్భంలో ఒద్దికగా ధరింపబడిన బిడ్డలా,అరణి (యాగాగ్ని మథించే కఱ్ఱ) లో నిగూఢంగా ఉంచబడిన ఏ అగ్ని, సర్వ విజ్ఞాననిధి, అనుదినం జాగరూకులై హవిర్ద్రవ్యాలు సమ ర్పించే మానవులచే స్తుతింపబడుతున్నాడో ఆతడు పరమాత్మయే."

"ఎవ్వనినుండి సూర్యుడు ఉదయిస్తున్నాడో, ఎవ్వనిలో అస్తమిస్తున్నాడో, సర్వదేవతలు ఎవ్వనియందు దర్శింపబడ్డారో ఆ పరమాత్మను ఎవ్వడూ అతిక్రమింప లేడు."

"ఇక్కడ ఏదైతే ఉన్నదో అదే పైలోకాల్లోనూ ఉంది. ఏది పై లోకాల్లో ఉన్నదో అదే ఇక్కడా ఉన్నది. ఎవ్వడైతే ఇక్కడ భేదాన్ని దర్శిస్తాడో (అజ్ఞానరూపమైన) మృత్యువు నుండి (సంసారరూపమైన) మృత్యువును పొందుతాడు."

అంగుష్ఠమాత్ర పురుషుడు

"బొటన వ్రేలికంటే మించని (అంగుష్ఠమాత్రుడైన) పురుషుడు ఎవ్వడైతే జీవాత్మకు మధ్యభాగంలో కుదురుకొని ఉన్నాడో, ఎవ్వడు భూత భవిష్యత్తులకు నియామకుడు కాడో, వానిని దర్శించిన వాడు దేనిని ఏవగించుకోడు (జుగుప్సపడడు)"

"అంగుష్ఠమాత్రుడైన ఏ పురుషుడు ధూమరహితమైన జ్యోతిస్సులో ఉంటూ భూతభవిష్యత్తులకు స్వామియై, ఈనాడు, రేపు కూడా ఉంటాడో (ఆతడే పరమాత్మ)"

అనువాదం: ఎస్.వి. రంగరామానుజార్యులు

ప్రశ్న – కఠోపనిషత్తుల్లో ఓంకారం

శ్రీఅరవిందులు

వేదసూక్తాలు సూక్ష్మమైన భావాలతో, అలతి అలతి వాక్యాలతో గుహ్యంగా, గోప్యంతో తోస్తాయి. పైకి తోచేది సామాన్యమగు అర్థము. తరచి చూచినగాని విశేషార్థము తెలియదు.

ఉపనిషత్తులు వేదాలకు సరళీకృతరూపాలు. గాఢంగా, నిగూఢంగా, సంజ్ఞాపరంగా, సంకేతపరంగా సాగే వైదికభావనలు సామాన్య మేధస్సుకు కూడా అందేలాచేయటానికి ఆది ఋషులు గావించిన ప్రయత్నాలవి.

నిగూఢమైన ఈ తాత్త్వికభావనలు కొందరు పాశ్చాత్యపండితులకు మ్రింగుడు పడలేదు. అర్థము కానివన్నీ వ్యర్థములన్నట్లు వేదసూక్తాలన్నీ మానవుడు అపరిపక్వదశలో చేసిన అరుపులు, కలవరింతలు, పలవరింతలని కొట్టి పారవేశారు!

ఉపనిషత్తులు వేదాల మూలతత్త్వాన్ని విభేదించలేదు. నిజానికి వేదసారాన్ని మరింత సులువుగా జీర్ణించుకొనేలా వీలుకలిగించిన ప్రయత్నాలవి. వేదాలు, బ్రాహ్మణాలలోని విధివిధానాలు, పూజాక్రమాలు, ఆరాధనా ధోరణులను ఆధారముగా చేసుకొని, మహోన్నతము, మహాపవిత్రము నైన ఆధ్యాత్మిక తత్త్వమును మానవుని ఆచరణలోనికి తెచ్చుటే ఉపనిషత్తుల పరమలక్ష్యం.

ఉనిషద్వచనాలలో ఇటువంటి ఉదాహరణలు ఎన్నో కనిపిస్తాయి. ఆధునిక మానవుడు బుద్ధిజీవి. సర్వము తన శక్తిసామర్థ్యాల వల్లనే, తెలివితేటల వల్లనే సాగునని భావించే, భ్రమించే భౌతికవాది. హేతువాది. కొంతవరకు నాస్తికవాది కూడా! మానవ

శక్తి వెనుక ఒక మహత్తర దివ్యశక్తి పనిచేయుచున్నదను భావన అతని మేధస్సుకు అందుటలేదు. అందినా అంగీకరించుటకు మనసొప్పుట లేదు!

తన ప్రమేయము లేకనే కొన్ని కొన్ని సందర్భములు కలుగుచున్నవని, తాను వ్యర్థములని అనుకొన్నవి, తనకర్థము కానివి అర్థవంతములు కావచ్చునేమో! తాను పొరబడుచున్నాడేమో అను అవగాహనకు అతడు చేరువ కాలేకపోవుచున్నాడు!

తాత్త్వికమైన, సంకేతపరమైన వేద వేదాంత భావనలు అతనికి అన్యములనిపించుచున్నవి. శాశ్వత వేద సత్యాలను అంగీకరించి, ఆకళింపు చేసుకొని, తాదాత్మ్యము చెందుటకు అతనికి ఆత్మాభిమానము, అహంకారము అడ్డు వచ్చుచున్నవి. ప్రతివిషయము తన అనుభూతికి రావలెను. తనకర్థము కావలెను. అప్పుడే నమ్ముతాను, నమ్మగలను. ఎవరేమి చెప్పినా గ్రుడ్డిగా నమ్ముటకు తాను సామాన్యుడు కాడు. మేధావి, విజ్ఞాని అనునది అతని నిశ్చితాభిప్రాయము.

వేదభాష అభివృద్ధి చెందని భాషయని భావించుట భ్రమ. అది అత్యంత ఉన్నతము, ఉజ్వలము, పరిపూర్ణమునైన సజీవ భాష! మహోన్నతమగు ఆధ్యాత్మిక సంస్కృతీ వికాసాన్ని సహజ రీతిలో, సానుకూల విధానములో ఆది ఋషులు అందించారు వేద వేదాంగాలలో.

ఉపనిషత్తులలోని వైదికభావనలు తొట్టతొలి సంకేతమయంగా, ఆదిఋషులకు అందించబడినవి. అవి వారి మనోఫలకములపై భాసించినవి. అవి పరబ్రహ్మ వారి కందించిన తొలి విజ్ఞానము. అందువలననే వేదములు ఆదిగ్రంథములని భావించుటయు జరుగుచున్నది. అట్లందుకొన్న తొలివిజ్ఞానమును వారు తరువాతి తరములకు సులభగ్రాహ్యముగా అందించిరి. ఈ విధంగా వేదధర్మాలు తరతరాలుగా అనుభవైక వేద్యాలగుచున్నవి.

వచనోపనిషత్తులు వేదాలలోని సంకేతాలు, వాని వెనుక దాగిన సందేశాలు, శాశ్వతసత్యాలు అందరికి అందుబాటులోనికి

తెచ్చుటకై ప్రాచీన భారత ఋషిపుంగవులు గావించిన కృషిని విశదీకరిస్తాయి.

ప్రశ్నోపనిషత్తులో ఓమ్ – ఓంకారమంత్రము యొక్క ప్రభావము, ప్రాముఖ్యము వివరించుటలో ఈ విధానమే అవలంబించబడినది.

సత్యకామా! ఓంకారము ఆదిమంత్రము. అక్షరమగుమంత్రము. అక్షయమగుమంత్రము. సర్వోత్తమ మంత్రము. అది అపర బ్రహ్మము. ఓంకారసాధనద్వారా జ్ఞాని పరలోకములకు చేరుట జరుగును.

ఓంకారము అ+ఉ+మ అను అక్షర త్రయ సమ్మేళనము. ఓంకార మంత్రము నుచ్చరించిన (అ) తొలిఅక్షర ప్రభావముచే పరమజ్ఞానము సిద్ధించును. ఋక్కులు సాధకుని తపోనిష్ఠ, బ్రహ్మచర్య సాధన, ఆత్మార్పణలతో పరిపూర్ణత సిద్ధించిన మహానుభావుల లోకమునకు గొనిపోవును. అచట నాతడు ఆత్మానుభూతి పొందును. (ఉ) మలి అక్షర ప్రభావముచే యజువుల ద్వారా సోమలోకము (చంద్రలోకము) చేరును. అచటనాతడు ఆత్మోన్నతిని, అనుభూతిని పొందును. (మ) మూడవఅక్షర ప్రభావముచే పరమపురుషుని ప్రభాకరతేజము సిద్ధింపజేసికొనును. అదియే సూర్యలోకము. అక్షరత్రయసమ్మిళితమైన ఓంకార మంత్రోచ్చారణము, గానము, సాధనము జీవిని జ్ఞానిగా జేయును. ఉన్నస్థితి నుండి ఉన్నతస్థితికి చేర్చును.

పాము కుబుసము విడిచి నూతన జవసత్వములు పొందినట్లు, సాధకుడు పాపములను, లోపములను అధిగమించి, పరిశుద్ధుడై సామములమూలమున బ్రహ్మలోకము చేరుకొనును. జీవారణ్యము, జనారణ్యమును వీడిన యాతడు బ్రహ్మలోకమున మహోన్నత భవనరాజమున శేషసాయియగు తేజోమూర్తి దివ్య దర్శనము పొందును.

ఓంకార మంత్రమును అంతర్ బాహిర మాద్యమిక ఉద్వేగములను సమన్వయపరచి సాధనజేసిన ఆత్మానందము సిద్ధించును. స్థిరత్వము కలుగును. చాంచల్యమునకు లోనుగాకుండుట

జరుగును. ఈ ఋగ్యజుస్సామ లోకముల దివ్యానుభూతి మహ ర్షులు మనకందించిన మహాప్రసాదము.

మధురము, మహోత్తరము నైన ఓంకార సాధనద్వారా జ్ఞాని సుస్థిరము, సుప్రశాంతము, భయరహితము, భాగ్యవంతము నైన ఆ పరమాత్ముని సన్నిధానమునకు చేరగలడు.

వేదాలలో ఒసగిన సంకేతాలు, సందేశాలు ఇప్పటికిని ఆధు నిక మేధస్సుకు అంతుబట్టనివిగానే ఉన్నవి. అయితే ఈ సంకే తాలు జీవి తనసాధనద్వారా, తరువాత దశలో పొందబోవు భౌతి కానుభవాలకు సూచికలని గ్రహించాలి. ఆ భౌతికానుభవాలు తరువాత తరువాత అనుభూతికివచ్చు భౌతిక – మానసిక – అధిమానసిక దివ్యానుభవాలకు చోపుదారులు. ఈ దివ్యానుభ వాలు జీవి పరిపూర్ణ వికాసమునొంది అనంతము, సుప్రశాంతము నగు పరాత్పరుని దివ్యసన్నిధానమున జరుపు తురీయ సాధన వలన సిద్ధించును.

మాండూక్యోపనిషత్తులో ఈ సంకేతాల ప్రసక్తి అంతగా లేదు. విషయమును విస్పష్టంగా వివరించుట జరిగినది. ఇచట నందించిన విజ్ఞానము ఆధునిక జగతి పరమ లక్ష్యముగ పెట్టు కొన్న నవీన విజ్ఞానమనిపించును. ఈ నూతన విజ్ఞాన సాధనకై మేధావులు అనేకరీతుల భౌతికయత్నము గావించుచున్నారు.

స్వాభావిక ప్రజ్ఞలో సాగెడి ఈ నూతన సాధనల వెనుక ఒక దివ్యప్రజ్ఞ పనిచేయుచున్నది. ఆ దివ్యప్రజ్ఞయే జీవికి తురీయ స్థాయి, పరమార్థము, పరమసత్యముకూడ. ఆ దివ్యప్రజ్ఞ గావించు దివ్యచర్యల శుభపరిణామమే మన మానసిక వికాసము, వివేకో దయమూను.

ప్రశ్నోపనిషత్తును పరిశీలించినచో, ఈనాడు మనము నూత నముగ భావించు విజ్ఞానము ఇతః పూర్వమే అనుభవమునకు వచ్చినదని అర్థమగును. ఈ అంశముల నన్నింటిని సమాలోచిం చినచో ప్రాచీన ఋషివర్యులు గావించిన సంబోధనలు, ఆలాప నలు, ఉచ్చారణలు అపరిపక్వ దశలో గావించిన అసంబద్ధ, అర్థ రహిత ప్రేలాపనలుగావని, ఆదేశపూర్వకమగు, సందేశాత్మక

మగు భావప్రకటనలని నిర్ధారించి చెప్పవచ్చు. కాలానుగతంగా మానవుని మానసిక స్థాయి కనుగుణముగా అందించబడిన సత్య జ్ఞానమది! జ్ఞానసత్యమది!

శ్లోకాలలో సాగిన ఛందోపనిషత్తులలో ఈ సంకేతత్వము అనుసరించుట జరిగినది. కాని, అది లలితముగ సాగి, విష యము సుబోధకము గావింపబడినది. దేహిగ, ఆత్మగ, సర్వజీవు లలో, సకలప్రకృతిలో, సర్వలోకములలో, అండపిండ బ్రహ్మాం డములలో నిండియున్న ఆ పరమాత్ముని దివ్యలీలా విలాసాలు మహోన్నతముగా, మధుర మధురముగా కీర్తింపబడినవి.

యమధర్మరాజు నచికేతునికొసగు సందేశమును పరికించి నచో ఈ విధానము స్పష్టముగ గోచరించును.

ఓంకారము (ఓమ్) ప్రథమవాణి, ఆదిమంత్రము. అక్షరమగు మంత్రము. స్థిరమగు మంత్రము. శాశ్వతమగు మంత్రము. సర్వ శక్తి సమన్వితమగు మంత్రము. సర్వశ్రేష్ఠమగు మంత్రము. అది అపరబ్రహ్మము. ఓంకారము సాధనజేసి, తదనుగ్రహపాత్రుడైన జీవికి లేనిది లేదు. కోరుకొన్నది కరతలామలకమై అనుభూతికి వస్తుంది. ఓంకార సాధనవలన లభించు శక్తిసామర్థ్యములు శాశ్వ తములు, సమున్నతములు. ఓంకార సాధన వల్ల పరిపూర్ణులైన జీవులు బ్రహ్మలోకమున శాశ్వత సుఖానుభూతి పొందగలరు.

పరమేశ్వరుడు సర్వాంతర్యామి. తనలో సకలము నింపు కొన్నవాడు. తానే సకలమున నిండినవాడు. జనన మరణముల కతీతుడగు శాశ్వతుడు. రాకడయు పోకడయు లేని కాలమ యుడు, కాలస్వరూపుడు, కాలాతీతుడు, సనాతనుడు.

అతడు సింహాసనాసీనుడైయు సుదూరము పయనము గావించువాడు. శయనించియు సకలదిశలకు పయనించువాడు. ఇంతకన్న యెరుగవలసిన ఆనందమయు డింకనెవ్వడు? ఆతని ననుభూతికి తెచ్చుకొనుటకే మహర్షులు జపతపము లొనరిం చునది!

జ్ఞానులు — స్వయంవ్యక్తుడు, ఆదిమధ్యాంత రహితుడు, నిరాకారుడు నిరంజనుడు నైన యీ పరాత్పరుని — సశరీరులు,

నిర్వికారులు, నిర్విచారులు, నిరంతరానందమగ్నులై తమచుట్టు వెలయు జీవులలో దర్శింతురు, అనుసరింతురు, ఆరాధింతురు.

ఐహికమగు అహమును, దైహికమగు తమస్సును కేవల ము మేధాసంపత్తితో పాండితీ ప్రకర్షతో అధిగమింపజాలము. అట్లధిగమించుట ఆ పరమాత్ముని దివ్యానుగ్రహమునకు పాత్రు లైన ఆచరణశీలురకు, సత్యవ్రతులకు మాత్రమే సాధ్యము. మాట లకు, మాయలకు అందనిది ఆ సాధన!

అట్టి దివ్యనిష్ఠాపరులకు పరమాత్ముడు తనకు తాను సమ్య గ్దర్శనము నొసగును. అర్థమై, యథార్థమైన అనుభూతి నిచ్చును. దుష్కృత్యములకు దాసులై, సుస్థిరత్వము, శాంతిపరత్వమునకు దూరులై మానసిక దౌర్బల్యమునకు లోనైన వారికి – బౌద్ధిక పరిజ్ఞానముతో, పాండితీప్రకర్షతో పరుగులిడువారికి ఆ ఆనంద మయునందుకొనుట ఆకాశమునకు నిచ్చెన వేయుటే యగును!

మృత్యుభీకరములగు రణరంగములు, శాంతినిలయముల యిన తపోవనములు ఆ పరాత్పరుని కార్యస్థానములు. రణధీరులు, పరమయోగులు ఆయనకు ఆహారప్రాయులు. వారిద్వారా తన మహాసంకల్పము నేరవేర్చుకొనును! లయకారమగు మరణమే ఆయన భోగములో ప్రధానభాగము. అది ఆయనకొక లీల!

అట్టి మహానుభావుడు – అద్వైతుడు ఎచట నున్నాడో ఎరుగుట ఎవరి తరము? అతడు నటులకెల్ల నటుడు! మహానటుడు! జగన్నాటక సూత్రధారి! అంతేకాదు పాత్రధారియు ఆతడే!

స్వయం వ్యక్తుడైన ఆ పరబ్రహ్మ తన మందిర ద్వారాలు అంతర్ముఖంగా కాక బహిర్ముఖంగా అమర్చాడు. అందువలన మానవుడాయనను అంతర్ముఖముగా దర్శించలేక పోవుచున్నాడు. కనిపించు దానికన్న కనిపించనిదెంతో ఉన్నదని గ్రహించలేక పోవుచున్నాడు. పై పై మెరుగులకు భ్రమపడుచున్నాడు. పరి మిత దృష్టితో పరిపరివిధముల బాధలకు గురియగుచున్నాడు!

అంతర్ముఖులైన జ్ఞానులు మాత్రమే ఆ విరాడ్రూపుని అందు కొనగలరు. అంతర్దృష్టి గలిగి, అమరత్వము నాశ్రయించు తాప సులు మాత్రమే ఆ దివ్యాత్ముని అనుభూతికి తెచ్చుకొనగలరు.

భౌతికచాపల్యముగల సామాన్యులు మాయామోహితులై పై మెరుగులకు భ్రమపడి, అశాశ్వతములు, అప్రియములు, హానికరములగు విషయములపై మోజుపడి, మంటల కెరయౌ మిడుతలవలె మృత్యువాతబడి నశింతురు.

దేహము నీటిబుడగ వంటిది. అస్థిరమైనది. అశాశ్వతమైనది. ఏ క్షణము ఏమౌనో ఎరుగరానిది! మృత్యువు జీవిని నిత్యము నీడవలె వెంటాడుచుండును. అది అన్నిట, అంతట వ్యాపించియుండును. ప్రకృతిపరమైనమాయ జీవి కనులకు పొరలు కప్పుచుండును, కప్పించుచుండును. స్థిరములగువానిని అస్థిరములుగను, మేలొనగూర్చువానిని హానికరములుగను కనిపింపజేయుచు దారితప్పుటకు అవకాశము కల్పించుచుండును.

అంతర్మథనము, ఆంతరంగిక దృష్టి గలిగి, యుక్తాయుక్త పరిజ్ఞానులగు జ్ఞానులు, శాశ్వతములు, శాంతిప్రదములగు అంశములపై మనసు లగ్నము చేసి – జీవితము బరువుగా కాక, బాధ్యతగా, సాధనగా, మహత్తర అవకాశముగా సాగింతురు. కష్టము కష్టముగా కనిపించదు వారికి. స్థితిమార్పుగ కనిపించును. లభించినదానిని ప్రాప్తముగ భావించి, సహనముతో, సమదృష్టితో జీవింతురు వారు.

జ్ఞానశక్తి మయుడైన ఆ పరబ్రహ్మము నుండియే ప్రభాకరుడు ఉదయించుట, అస్తమించుట జరుగుచున్నది! వెలుగు చీకటులకు, రాత్రింబవళ్లకు, సుఖ దుఃఖములకు, జనన మరణములకు అధిపతి అతడు!

అతడు సర్వదేవతామూర్తి. సకల దేవతలు అతని శరీర భాగములు. అణువునుండి బ్రహ్మాండమువరకు అంతయు అతని కనుసన్నలలో మెలగవలసినదే. అతడు ప్రాణపతి. పరమేశ్వరుడు.

అనంతుడయ్యును అతడు అంగుష్ఠమాత్రుడై అందరి ఆత్మల యందును వెలుగొందుచుండును. అతడు ఇంతకు ముందు ఉండినవాడు. ఇపుడును ఉన్నవాడు. ఇకముందును ఉండెడివాడు! భూత భవిష్యద్వర్తమానముల కతీతుడు! ధూమము సోకని జ్యోతి. కరుణాసింధువు. కర్మస్వరూపుడు. కాలస్వరూపుడు.

ఆ ప్రేమస్వరూపుని అంతటను దర్శించి, స్మరించి, సేవించి తరింతముగాక.

స్వేచ్ఛానువాదము: దయానిధి

మాండూక్యోపనిషత్

శ్రీఅరవిందులు

1) అవతారిక: 1, 2 మంత్రములలో ఓంకార తత్త్వము నిరూపింపబడుచున్నది.
అనువాదము: అవిచ్ఛిన్నమైన ఓంకారము సృష్టి స్వరూప మని గ్రహించనగును. సర్వకాలములు, అనగా భూత భవిష్య ద్వర్తమాన కాలములు, కాలాతీతమైన సర్వమంతయు ఓం కార స్వరూపమే.
వివరణ: ఓంకారము నిత్యము, శాశ్వతమని గ్రాహ్యాము.

2) అను: ఈ సకల సృష్టి యంతయు నిత్యమైన బ్రహ్మము యొక్క స్వరూపము. ఆత్మ నిత్యము. నిత్యమైన ఆత్మకు నాల్గు పాదాలు.

3) అవ: 3 వ మంత్రము నుండి 7 వ మంత్రము వరకు జాగ్రత్, స్వప్న, సుషుప్తి, తురీయావస్థలను గురించి ఉపనిషత్తు వివ రిస్తున్నది. 3 వ మంత్రములో ఆత్మ ప్రథమపాదమైన జాగ్ర దావస్థ గురించి తెలుపుచున్నది.
అను: ప్రప్రథముడు వైశ్వానరుడు. విశ్వుడని నామాంత రము. జాగ్రదావస్థ స్థితుడు, బహిర్ముఖుడైన ఈతడు సప్తాం గుడు, పందొమ్మిది ద్వారములుగలవాడు. స్థూల విషయ భోక్త.
వివ: 1) సప్తాంగములే సప్తధాతువులు.
2) 19 ద్వారములు: కర్మేంద్రియ పంచకము, జ్ఞానేంద్రియ పంచకము, ప్రాణ పంచకము, మనోబుద్ధ్యహంకార చిత్తములు.
3) సప్తాంగములు, 19 ద్వారములు స్థూలశరీర సూచకము. ఈతనికి స్థూలశరీరము భోగస్థానము.

4) అవ: 4 వ మంత్రము ద్వితీయావస్థయైన స్వప్నావస్థను వివరిస్తున్నది.

అను ద్వితీయుడైన స్వప్నావస్థా స్థితుడు తైజస నామాంకితుడు. ఈతడు అంతర్ముఖుడు, పందొమ్మిది ద్వారములు గలవాడు. సూక్ష్మశరీరాభిమాని.

వివ· ఈ మంత్రములో సప్తాంగము, 19 ద్వారములు అంతఃకరణమునకు సూచకము. దీనికి అష్టపురియని మరొక పేరు.

5) అవ· 5 వ మంత్రము సుషుప్త్యవస్థను వివరిస్తున్నది.

అను. స్వప్నదృశ్య, వాంఛారహిత నిద్రాస్థితి గాఢ సుఖస్థితి. కేవల గాఢ సుఖ నిద్రాస్థితుడై ఏకత్వమును పొందిన జ్ఞానానంద స్వరూపుడు. స్వచ్ఛమైన ఆనందస్థితిభోక్త చైతన్యోన్ముఖుడు. స్వచ్ఛానంద స్వరూపమైన తృతీయుడు. ప్రాజ్ఞుడు.

వివ· 1) సుఖ నిద్రాస్థితి తమోగుణ రూపమగుటచే అజ్ఞాన స్థితి. ఈ స్థితిలో ఆనందము జాగ్రదావస్థస్థితి యందు మాత్రమే తెలియబడుచున్నది. అందువల్ల సుఖనిద్రేతర స్థితులకు ముఖద్వారమని చెప్పబడుచున్నది.

2) గుణరహితమైన ఆత్మజ్ఞానమే ఆనందస్థితి. అజ్ఞానముచే ఆవరింపబడుట వలన నిద్రాస్థితి యందు పొందు ఆనందము, ఆత్మానంద స్థితి కాదని గ్రాహ్యము.

6) ఈ మంత్రములో ఆత్మ లక్షణము వివరింపబడుచున్నది.

అను: ఈ ఆత్మస్వరూపము, సర్వేశ్వర సర్వజ్ఞ లక్షణములు గలది. అంతర్యామి. సృష్టికి మూలమైనది. సర్వభూతముల యొక్క ఉదయాస్తమములు ఆత్మయందే పరిణమించును.

వివ: ఆత్మస్వరూపము సాక్షి లక్షణము గలది.

7) అవ 7 వ మంత్రములో తురీయతత్త్వ నిర్గుణతత్త్వము ద్వంద్వాతీతముగా వివరింపబడుతున్నది.

అను: ఈతడు అంతర్ముఖుడు కాదు, బహిర్ముఖుడు కాదు. జ్ఞానియుగాదు, అజ్ఞానియుగాదు, జ్ఞానశూన్యుడునూ కాదు. దృష్టికి గోచరము కాడు. అమంతవ్యుడు, అనిర్వచనీయుడు, అగ్రాహ్యుడు. నామ, రూప రహితుడు. ఈతడు నిక్కముగా

ఏకత్వస్పృహ యందున్న ఆత్మ స్వరూపము. ప్రశాంతమైన, శుభమైన అద్వితీయమైన ఆత్మస్వరూపమునందు ఈ సర్వ స్వము లయమగుచున్నది.

వివ: ఈ ఆత్మజ్ఞాన స్థితి అనిర్వచనీయము. సాధన వల్లనే జ్ఞానానంద ప్రాప్తి.

"నా అయమాత్మా ప్రవచనేన లభ్యో
న మేధయా, నబహూనా శృతేన" యని కఠోపనిద్వచనం.

అనగా ఈ ఆత్మ జ్ఞానము, శుష్క, తర్క యుక్తులచేగాని మరే విధముగాగాని లభింపదు. సాధకుడు గురువు నాశ్రయించి శ్రద్ధతో సాధన చేయాలి.

8) అవ: 8 వ మంత్రము ఓంకారము ఆత్మలకు సమన్వయము తెలుపుతున్నది.

అను ఈ ఆత్మ అవిచ్ఛిన్నమైన ఓంకార స్వరూపము. ఓం కారములోని అక్షరములు అ, ఉ, మ. ఆత్మ స్వరూప పాదాలే ఈ అక్షరాలు. ఈ అక్షరాలే ఆత్మ స్వరూప పాదాలు.

వివ ఉపనిషత్తు ప్రథమార్థంలో ఆత్మ, ఓంకారములను గురించి అభేదము తెలుసుకొన్నాము. అదే విషయమిక్కడ పునరుద్ఘాటించబడి, – అవస్థాత్రయ, అక్షరత్ర భేదము వివ రింపబడినది.

9) అవ: 9 వ మంత్రం ప్రథమపాదమైన వైశ్వానరునికి ఓం కారంలోని ప్రథమాక్షరమైన అకారానికి సమన్వయం చెబు తున్నది.

అను జాగ్రదావస్థ స్థితుడు, వైశ్వానరుడైన విశ్వుడు ప్రథ మాక్షరమైన అకార స్వరూపుడు, ఆద్యుడు, విశ్వవ్యాపి. ఈ విధముగా సర్వవ్యాపిగా గ్రహించినవాడు సకల వాంఛాప్రాప్తి పొందగలడు.

వివ: అకారము ఇచ్ఛా శక్త్యాత్మకమగుటచే సర్వార్థ ప్రాప్తి సర్వాక్షరములందు అకారము ఇమిడి యుండుట చేత, ఈ అక్షర స్వరూపుడు వైశ్వానరుడు.

10) అవ: 10 వ మంత్రము ద్వితీయ పాదమైన తైజసునికి, ఓం కారములోని ద్వితీయ పాదమైన ఉకారమునకు, సమన్వయము చెబుతున్నది.

అను: స్వాప్నికుడైన తైజసుడు, భామతి, ద్వితీయాక్షరమైన ఉకార స్వరూపుడు. మధ్యస్థుడై, ఈతడు పురోగామి. ఈతనికి ఇట్లు గ్రహించినవాడు భేద భావాన్నధిగమించి, జ్ఞాన పరిధుల నందుకోగలడు. అంతేకాదు. ఇతడు నిత్యస్వరూప బీజ సంజాతుడు.

వివ: ఉ కారము జ్ఞాన శక్త్యాత్మకం. ఈ శక్తి జీవేశ్వరుల ఐక్యం కలుగచేస్తుంది. ఈ విధంగా తైజసుడు ఆత్మసాక్షాత్కారానికి బీజమవుతున్నాడు.

11) అవ: 11 వ మంత్రంలో సుప్తావస్థా గతుడైన ప్రాజ్ఞునికి మ కారముతో సమన్వయం చెప్పబడుచున్నది.

అను: సుప్తుడైన ప్రాజ్ఞుడు జ్ఞాని. తృతీయాక్షరమైన మ కార స్వరూపము. ప్రమాణబద్ధుడు కనుక మితి. అంత్యావస్థాస్థితత్వము కారణము. ఈ విశ్వమును తన యందు పరిమితము చేయగల ఈతడు నిత్యదిశుడు.

వివ: 1) మకారము క్రియాశక్త్యాత్మకం. పైన చెప్పినదంతా క్రియాశక్తి లక్షణం.

2) 9 నుండి 11 మంత్రముల అంతరార్థము తెలుసుకోవటం అవసరం. ముందుగా వేదాంత పరిభాష పదములైన వ్యష్టి, సమిష్టి పదముల అర్థమును తెలుసుకోవాలి.

వ్యష్టి అనగా జీవాత్మ (individual consciousness). సమిష్టి అనగా పరమాత్మ (universal consciousness).

వైశ్వానర తైజస ప్రాజ్ఞులకు, బ్రహ్మాదులకు అభేద స్థితి వలన వైశ్వానర, తైజస, ప్రాజ్ఞులు క్రమేణా అకార, ఉకార, మకార స్వరూపలని గ్రాహ్యము.

12) అవ: చివరిదైన 12 వ మంత్రం ఆత్మ స్వరూపమునకు ఓం కారమునకు అభేదము తెలియచేస్తున్నది.

అను: నాల్గవ స్థితికి అక్షరసామ్యము లేదు. ఈ స్థితి అనిర్వచనీయమైనది. మిక్కిలి శుభమైనది. అద్వితీయమైనది. ఈ స్థితి స్వరూపమే ఓంకారము. ఓంకార స్వరూపమే ఆత్మ స్వరూపమని గ్రహించి తదనుభూతి పొందినవాడు జ్ఞాని. నిక్కముగా జ్ఞాని.

వివ: తురీయావస్థ స్థితియే ఆత్మజ్ఞానస్థితి, సచ్చిదానంద స్థితి, అనంతస్థితి. ఈ స్థితిలో అక్షరసామ్యము సాధ్యము గాదు. ఓంకారమే ఆత్మ స్వరూపమని నిర్ద్వంద్వంగా వక్కాణిస్తూ ఈ సత్యదార్శనికుడే ధన్యుడని ఉపనిషత్తు ముగిస్తున్నది.


అనువాదము: శ్రీ శరణ్

సావిత్రి కావ్యంలో 'ఓం'

శ్రీఅరవిందులు

నీవెచటి నుంచో యిచటికి వచ్చావొక పని మీద.
కానీ, ఎందుకిలా నిర్లక్ష్యం చిత్తగిస్తున్నావ్?
పలాయనం వల్ల వరించదు విజయం, కరుణించదు మకుటం.
ఏ పని ఆగినా, ఆగదు మరి విశ్వం.
కారణం, ఇంకా సగమేగా అయింది విశ్వకార్యం!
నిన్నావహించింది, తిరస్కారమనే ఉన్మత్త సమాధానం.
అది నీ కళ్లలో ప్రవేశించగానే, లొంగిపోయింది నీ హృదయం.
ఏమైపోయిందో మరి తేటతెల్లనైన అంగీకారం?
సృష్టికర్త జ్వాలా కిరణకాంతిని జపించే మంత్రం
ఊర్ధ్వగతికి ప్రతీక, వర్ణత్రయ ఓంకారం.
భోగానికీ, శాంతికీ వారధి యీ మంత్రం
నవ వధువులోని ఆకర్షణకూ, అందానికీ పునాది యీ మంత్రం.
శత్రువులైనా, సమాలింగనం చేసే లోగిలి, యీ మంత్రం.
స్వర్ణ శిఖరాలను పదిలపరచే పోసం, యీ మంత్రం
జీవ రహస్య స్రోత గీతమౌ సత్యం, యీ మంత్రం.

భావానువాదం: పుటపర్తి నాగపద్మిని



ఓం నమో భగవతే

పరిస్థితులు చాలా ఘోరంగా తయారయినై. అందుకని మనం 'చాలా' ప్రశాంతంగా, 'చాలా ప్రశాంతంగా, 'చాలా' ప్రశాంతంగా ఉండాలి. నా పాత మంత్రం గూర్చి చెబుతా విను. అది బాహ్యచేతనను ప్రశాంతపరిచే మంత్రం:

ఓం నమో భగవతే

ఈ మాటలు మూడు. వాటి అర్థం
ఓం – పరమోన్నత జగత్ప్రభువును వేడుకొంటున్నాను.
నమో – ఆయనకు నా ప్రణామాలు
భగవతే – నన్ను దైవంగా మార్చు
సమస్తాన్ని ప్రశాంతపరచే శక్తి ఆ మంత్రానికున్నది.

14 మార్చి 1973 శ్రీమాత

జపము చేయుట ఎలా?

శ్రీఅరవిందులు

మనిషి మనస్సు చంచలము స్థిరముగా ఒకదాని మీద ధ్యానము నిలవదు. జపమనగా ఒక దేవుని పేరుగాని, మంత్రమునుగాని వల్లించుట. ప్రతి మంత్రమునకు అదిష్ఠాన దేవతలుంటారు (అది ఋషిప్రోక్తమైనదైతే అందులో ఋషి నిక్షేపించిన శక్తుంటుంది). ఆ మంత్రమును వల్లించినపుడు ఆ దేవత ప్రత్యక్షమవుతుంది. తన శక్తిని మన కనుగ్రహిస్తుంది. అయితే మంత్రాన్ని మనం యాంత్రి కంగా జపించకూడదు. ఒక దేవతను మనము ఆహ్వానిస్తున్నట్లుగా భక్తి ఆరాధనలతో ఉచ్చరించాలి అప్పుడు ఆ దేవతయొక్క శక్తి, మహిమ, సౌందర్యము, ఆకర్షణ మన చైతన్యంలోకి ప్రవేశించి, మన హృదయమందిరమును ఉద్దీపనము చేసి, మనను ఒక ఉచ్చ స్థితికి గొనిపోవును ఇందుకు మన మనో ప్రాణికాల సహకారము చాలా అవసరము. అప్పుడే ఆ మంత్రశక్తి మన శరీరములోకి చొచ్చుకొనిపోయి దానిని ప్రేరేపింప జేయును. మనో ప్రాణికములు సహకరించని యెడల జపము ఫలించుటకు కొంతకాలం పట్టవచ్చును. కాని చివరికి ఆ మంత్రములోని శక్తి నీలో ప్రవేశించి తీరుతుంది నీ అంతరంగికము ఉద్దీప్తమై సాక్షాత్కారము కలుగుతుంది కాని వెంటనే ఫలితము కలగలేదని కలవరపడకూడదు. తొందరపడిన యెడల నీవా శక్తిని గ్రహించలేవు. అందుకనే నువ్వు నీ మనస్సును స్థిమితము చేసుకొని, ఎక్కువ ఆరాటపడకుండా నిదానంగా వేచివున్నప్పుడు (కవులు, కళాకారులు ఆవేశం కోసం ఎదురు చూసినట్లు) చైత్యపురుషుడు అగాధములలో నుండి బహిర్గతమై నీ మనస్సుని స్పృశిస్తాడు. అప్పుడా శక్తిని నీవు గ్రహించ గలిగెదవు. నీ గ్రహణశక్తి పెరగటం వల్ల నీకు దివ్యావేశము కలుగుతుంది.

అయితే 24 గంటలు అదే పనిగా కళ్లు మూసుకొని జపం చేయటం అంత మంచిదికాదు. సాధన పరిపక్వమైన దశకు జేరుకున్నప్పుడుగాని అంత దివ్యశక్తిని ఎవరూ గ్రహించలేరు.

భావానువాదం డా॥ ఆర్.ఎల్.ఎన్ శాస్త్రి

పూర్ణయోగము – మంత్రసాధన

శ్రీఅరవిందులు

అన్ని యోగములలోను, చిత్తైకాగ్రతకై అనేక ఉపాసనలు చెప్ప బడినవి. ఉదా॥ సగుణోపాసన, మంత్రోపాసన, నామస్మరణ మొ॥ ఇవన్నియు కేవలం ఆలంబనం కొఱకేనని గ్రహించాలి. అందు వలన సాధకుడు క్రమేణా ఈ ఉపాసనలన్నిటినీ అధిగమంచాలి. ఉపనిషత్తులన్ని, ఓంకారమును మించిన ఆలంబనం మరొకటి లేదని ఉద్ఘోషించాయి.

*

ఈ పూర్ణయోగంలో ఒకానొక మంత్రమన్నదేదీ లేదు. సాధకులు తమకు అవసరమని భావించినంత వరకు మంత్రోపాసన సాగిం చవచ్చు. సాధకునికి మనోదారుఢ్యము, హృదయనిష్ఠ, సంకల్ప బలము తప్పనిసరి. వీటిని అన్ని జోడించి, త్రికరణశుద్ధిగా, సాధ కుడు సత్యదర్శనముకై అణువణువునా తపించిపోవాలి. ఇందుకు మంత్రోపాసన దోహదం చేస్తే శుభం. అయితే మంత్రోపాసన లన్నిటిలోను ఓంకారోపాసన మిక్కిలి విశిష్టమైనది. యధావిధిగా చేసే ఓంకారోపాసన, ఊర్ధ్వలోకాలంతటా ఆవరించి యున్న విశ్వచేతనను అందుకోవటానికి ఒకానొక బాట, ఒకానొక సోపా నము. అంతే గాదు. పైనున్న ఈ విశ్వచేతన సాధకుని శరీరం లోనికి చొచ్చుకొనిపోయి, వానిని తరింప చేస్తుంది.

*

ఈ మంత్రయోగంలో ఉపాసించబడే ఒకే ఒక మంత్రం 'శ్రీమాత', కాకపోతే మా ఉభయుల నామాలు మాత్రమే. సాధకుడు హృదయం పైనగాని, శిర్షోపరిభాగంపైగాని చిత్తాన్ని ఏకాగ్రం చేయాలి. ఈ రెండు ఉపాసనలు భిన్నమైనవి. ఫలితాలు కూడ భిన్నమే. మొద టిది చైత్యపురుష వికాసాన్ని కల్గించి భక్తి, ప్రేమల నావిష్కరించి తల్లి సాయుజ్యాన్ని కల్గిస్తు నిత్యమూ హృదయకమలంలో ఆమె ఉనికిని స్థాపిస్తుంది. అంతేకాక ప్రకృతిలో ఆమె శక్తిమంతమైన కర్మానుష్ఠానాన్ని అనుభవింప చేయగలదు. రెండవది సాధకుని

ఆత్మసాక్షాత్కారమునకు మార్గము సుగమం చేస్తూ అతడు ఒక్కొక్క మెట్టు ఎక్కి ఊర్ధ్వచేతనా భూమికలను ఆరోహింప చేస్తుంది. ఈ విధంగా సాధకుని చైతన్యావరోహణ కల్పించి మహా చైతన్యాన్ని తనలోనికి అవతరింప చేస్తుంది. ఈ చైతన్యారోహణ – అవరోహణ ఈ రెండవ మార్పు ప్రత్యేకత.

అనువాదం: శ్రీశరణ్

కొన్ని మంత్రాలు

ది సుప్రీమ్ మదర్

ఓం ఆనందమయి చైతన్యమయి సత్యమయి పరమే

*

ఓం తత్సత్ జ్యోతిరరవింద

ఓం సత్యం జ్ఞానం జ్యోతిరరవింద

*

OM Sri Aurobindo Mira

Open my mind, my heart, my life to your Light, your Love, your Power. In all things may I see the Divine.

16 - 7 - 1938 Sri Aurobindo

శ్రీమాతారవిందుల ఇద్దరి పేర్లు ఉన్న మంత్రాన్ని తన కనుగ్రహించమని ఒక సాధకుడు శ్రీఅరవిందులను కోరగా వారు దీనిని ఇచ్చారు.

"నువ్వు కోరినట్లు మా నామధేయములతో కూడిన ఒక మంత్రమును ఇస్తున్నాను. దీని సహాయంతో నువ్వు నీ కష్టముల నధిగమించి అంతరంగికంగా గట్టి పునాదిని వేయగలవని ఆశి స్తున్నాను".

కాని సాధకునికి ఒక సంశయము వచ్చింది.

"మీ నామధేయములే కాకుండా మిగతా మాటలు కూడా ఉన్న ఆ వాక్యమంతా ఒకే మంత్రమా?"
శ్రీఅరవిందుల జవాబు: "అవును"

శరీరవ్యాయామమును గురించి శ్రీమాత

శరీర వ్యాయామమును గురించి ఎవరికీ సరియైన అవగాహన లేదు. దానిలో క్రొత్త ఏమున్నది అని మీరు అడగవచ్చు. ఈ భౌతికశరీరం జడమే అయినప్పటికి దాని చైతన్యం దాని కుంటుంది. క్రమశిక్షణ ద్వారా దానిని ఉద్దీపింప జేయవచ్చు. అప్పుడు శరీరావయవములు ఒక నూతన తేజముతో భాసిస్తాయి. వాటి కదలికలు కూడ నృత్యవిన్యాసములను స్ఫురింప జేస్తాయి. శరీరకణములు కూడ దివ్యచేతనతో వెలిగిపోతూ వుంటాయి. కొంతమంది చిత్రకారుల చేతులు వాటంతటవే కదులుతూ చిత్రపటమును గీయవూ! వారి చేతులకు చైతన్యముంటుంది. అదే విధంగా మొత్తం శరీరం కూడా చైతన్యంతో ఉద్దీపనమై సర్వాంగ సౌష్ఠవంగా భాసిస్తుంది. ఇది నిజమేనా అంటారేమో. ప్రయత్నించి చూడండి. — సంపాదకుడు

ఆత్మ మాటిమాటికీ భూమ్మీదికి వచ్చి శరీరమును దాలుస్తుంది. అభివృద్ధి చెందుటకై నూతనానుభూతులను పొందుతుంది. మొదట బీజరూపంలో నున్న చైత్యపురుషుడు జన్మపరంపరల ద్వారా ప్రవర్ధమానమై సంపూర్ణ చైతన్యమును సాధిస్తాడు. అప్పుడు స్వతంత్రుడై తనకు ఏ విధమైన జీవితము అవసరమో ఆ విధ మైన జన్మ నెత్తుతాడు. తదనుగుణమైన దేశకాల పరిసరాదులను ఎంచుకుంటాడు.

> *శరీరము ద్వారా చైత్యపురుషాభివద్ధి*

ఆత్మ భూలోకంలోకి దిగివచ్చినప్పుడు అజ్ఞానాంధకారములలో నిమజ్జనమైపో తుంది. అందుకని చాలాకాలము ఈ

మొద్దు శరీరములోకి కొంచెం చైతన్యాన్ని ఉద్దీపింపచేయటం తోటే సరిపోతుంది. మనము శరీరమును సంస్కరింప జేయుటకు ముఖ్యమైన కారణమిదియే. క్రమశిక్షణతో శరీరాభివృద్ధి ఒక్కటే కాకుండా ఆశ్చర్యకరంగా దానితోపాటే ప్రదీప్తమై పురోగమిస్తుంది.

శరీరకణముల ఉద్దీపనము

శరీరశిక్షణ ద్వారా శరీరకణములు వికసించి చైతన్యవంతములవుతాయి. ఈ విషయము ఎవరికీ తెలియకపోవచ్చు. కాని అది నిజము. మన దృష్టిని కండరముల మీద కేంద్రీకరించి వాటిని ఉపయోగించినప్పుడు, అవయవములకు శిక్షణ ఇచ్చినప్పుడు, వాటి కదలికలను, శక్తిని, మెరుగుదనాన్ని, నమ్యతను అభివృద్ధిపరచ దలచినప్పుడు ఒక అద్భుతం జరుగుతుంది. శరీరకణముల చేతనా ప్రమాణము, వాటి యొక్క గ్రహణశీలత ఇంతకు ముందరలేని రీతిగా పెరుగుతాయి. ఈ విధంగా శరీరము యొక్క చైతన్యము అభివృద్ధి చెందుతుంది. శరీర వ్యాయామము యొక్క ముఖ్యోద్దేశమిదియే. శరీర చైతన్యమును పెంచుటకు ఇతర మార్గములు కూడ కలవు. కాని సర్వాంగంగా తీర్చిదిద్దుటకిదొక్కటే మార్గము. నేను మీకు ఒక విషయాన్ని ఇదివరకే చెప్పాను. మేధావులు ఏ విధంగా మెదడును పదును పెట్టుకుంటారో అదే విధంగా కళాకారులు వారి హస్తములకు కూడ చేతనాస్ఫూర్తిని కలుగజేయగలరు. అయితే దీని వలన ఒక్కొక్క అవయవము విడివిడిగా మెరుగు కావచ్చు కాని మొత్తము శరీరము కాదు. ఈ విధమైన శిక్షణ యొక్క అద్భుత పరిణామాలను నీవు గమనించినట్లయితే శరీరము యొక్క సామర్థ్యాన్ని చూసి నువ్వే ఆశ్చర్యపోతావు. శరీరధారియైన చైత్యపురుషునకు ఇదెంతో ప్రయోజనకారి. సర్వాంగసౌష్టవము, సమరసము అయిన శరీరము చైత్యపురుమనకు చాలా అద్భుతమైన ఉపకరణము. దాని కార్యమునకు మిక్కిలి సహాయకారి.

శరీర వ్యాయామము నభ్యసించు వారందరికీ యీ విధమైన ఉద్దేశము లేకపోవచ్చు. వాళ్ళకీ విషయాన్ని గురించి లేశమాత్రమైనా తెలియకపోవచ్చు. వాళ్ళకి తెలిసినా తెలియకపోయినా ఫలితమిదియే. మీకు సూక్ష్మదృష్టి కనుక ఉన్నట్లైతే క్రమపద్ధ

తిలో వ్యాయామ విన్యాసములు జరిపినవాడు నడుస్తుంటే ఒక విధమైన వెలుగు, చైతన్యము, జీవము అతనిలో ఉట్టిపడుతూ వుంటాయి. ఇతరులలో వుండవు.

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహ శాస్త్రి

వందేమాతరం

శ్రీఅరవిందులు

కేవలం బౌద్ధికమైన మాతృదేశభావన అనేది ఒక చోదకశక్తి కాదు. దేశఅవసరాలు, మిగతా అవసరాలు మధ్య కోరుకోవలసివస్తే, మనలో చాలామంది ఆచరణలో దేశావసరాలను కోరం. ఇతర మైన అనేక విషయాలను కోరుకుంటాం. అవి ఏమాత్రం దెబ్బ తినడానికి కూడా మనం అంగీకరించం.

ఎప్పుడైతే మన మాతృభూమి మన మానసికనేత్రం ముందు కేవల భూభాగంగా లేదా కేవల జనసమూహంగా కాక ఇంకా ఎక్కువైనదిగా సాక్షాత్కరిస్తుందో –

ఎప్పుడైతే మన మాతృమూర్తి, సౌందర్యంతో ఒక మహత్తర దైవిక మరియు మాతృమూర్తిగా రూపొంది, మనస్సును ప్రభావితం చేసి, హృదయాన్ని స్వాధీనం చేసుకుంటుందో – అప్పుడే ఆ మాతృదేవతపట్ల, ఆమె సేవపట్ల మనకు అన్నింటినీ ఇముడ్చికోగల తపన మొదలవుతుంది. ఆ తపనలో మనకున్న చిట్టిపొట్టి భయాలు, చిట్టిపొట్టి ఆశలు అన్నీ అదృశ్యమవుతాయి. అప్పుడే అణగారిపోతున్న జాతిని రక్షించి, అద్భుతాలను సాధించగల దేశ భక్తి జన్మిస్తుంది.

కేవలం కొంతమందికి మాత్రమే, ఈ మహత్తర దృశ్యాన్ని చూసి, ఇతరులకు వివరించే బాధ్యత ఈయబడింది.

32 సంవత్సరాల క్రితం* బంకించంద్రుడీ గీతాన్ని రచించాడు. అప్పుడు అతికొద్దిమంది మాత్రమే దానిని విన్నారు.

కాని వంగప్రజ తను చిరకాలభ్రాంతి నుంచి మేల్కాంచిన క్షణంలో, సత్యం కోసం దిక్కులు చూస్తున్న సమయంలో, విధాత నిర్ణయించిన (fated) ఆ క్షణంలో, ఎవరో 'వందేమాతరం' గీతాన్ని ఆలాపించారు.

అలా మంత్రోపదేశం జరిగింది — అంతే. మాతృమూర్తి తనను తాను ఆవిష్కరించుకుంది. ఆ ఒక్కరోజులోనే యావత్ప్రజా, స్వాతంత్ర్యోద్యమంలోకి దూకారు. ఒక్కసారి ఆ దృశ్యం ప్రజల ముందు సాక్షాత్కరిస్తే ఇక వారికి విశ్రాంతి, శాంతి ఎక్కడివి? దేవాలయాన్ని బాగుచేసి, అందులో విగ్రహాన్ని నెలకొల్పి, త్యాగ ఫలితాలను ఆమె కర్పించేదాకా, వారికిక నిద్రే ఉండదు.

ఆ దృశ్యాన్ని వీక్షించిన ఏ మహత్తరజాతి, ఇక తన శిరస్సునెప్పుడూ ఏ శత్రువు ముందు అవనతభావంతో వంచనే వంచదు.

అనువాదం: కాకుమాని తారానాథ్

శ్రీమాత ఇచ్చిన సందేశాన్ని మనము నిత్యజీవితంలో
పాటించెదము గాక

మరుక్షణం ఏం జరుగబోతోందో మనకు తెలియదు. నిజానికి ప్రతిక్షణము మనకి తెలియనిది, ఊహాకైన అందని ఒక ఇంద్రజాల మహేంద్రజాలమే మన కళ్ల ముందర ఆవిష్కారమవుతూ వుంటుంది. What happens to us depends mostly on the intensity and purity of our faith.

---

* శ్రీఅరవిందులీ విషయంలో ప్రస్తావించింది 1907 లో. ఋషి బంకించంద్ర చటర్జీ ఆనందమఠ్, దేవి చౌదురాణి, కృష్ణచరితం, ధర్మతత్వం, కపాలకుండల, విషవృక్షం ఇంకా అనేక రచనలు చేశారు.

.ఆనందమఠం లోని ఈ గీతం 1882 లో రచించబడింది.